



జ్ఞాన యోగం


విచారణ

మలయాళ సద్గురు గ్రంధావళి-9-ఈశ్వర కృప








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి,అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in),ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2990100061821

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in




అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళి

తొమ్మిదవ సంపుటము

ఈశ్వరకృప

ప్రకాశకులు :
శ్రీవ్యాసాశ్రమ వజ్రోత్సవ సంఘము
శ్రీవ్యాసాశ్రమము
చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
2001



నివేదన

శ్రీవ్యాసాశ్రమం ప్రచురిస్తున్న ఆధ్యాత్మిక గ్రంధాలు పాఠకలోకానికి సుపరిచితాలే ఈ గ్రంధాలను భక్తులు మిక్కిలి శ్రద్ధతో పఠిస్తున్నారు ఆధ్యాత్మిక సారస్వత ప్రచారం ద్వారా సాటి లేని సేవ చేసే సంస్థగా ఆశ్రమం ప్రసిద్ధి వహించింది

మహర్షి - సద్గురు శ్రీ మలయాళస్వాములవారు స్వయంగా రచించిన గ్రంధాలు ఆశ్రమప్రచురణలలో అత్యంత విశిష్టమైనవి అవి పలు సార్లు ముద్రణ పొంది అనన్య సామాన్యమైన ప్రచారం పొందాయి జిజ్ఞాసు జనానీకంలో జడత్వాన్ని తొలగించి చైతన్యం కల్గించడంలో విజయం సాధించాయి

శ్రీవారి రచనలు ప్రస్తుతం వివిధ పరిమాణాలలో నానాగ్రంధాలుగా ముద్రింపబడివున్నాయి వీటినన్నింటిని ఒకే పరిమాణం కల గ్రంధ రాశిగా ''శ్రీమలయాళ సద్గురు గ్రంధావళి'' అన్న పేరుతో ముద్రించడం మంచిదని అభిజ్ఞులు సూచించారు ఈ సూచనను పూజ్యశ్రీ విద్యానందగిరి స్వాములవారు ఆమోదించారు

శ్రీవారు గోగర్భములో తపస్సు చేసే సమయం 1919లో రచించిన శుష్కవేదాంత తమోభాస్కరం ఇందులో మొదటి సంపుటమవుతుంది ఇంచుమించు ఆగ్రంధాన్ని పోలిన పరిమాణంలోనే తక్కిన సంపుటా

లుంటాయి ఇలా ప్రచురిస్తే ఒక్కొక్కటీ సుమారు నాలుగువందల పుటలు గల సంపుటాలు ఇరువదికి పైగా సిద్ధమవుతాయి

2001వ సంవత్సరంలో జరుగనున్న శ్రీవ్యాసాశ్రమవజ్రోత్సవ శుభసందర్భంలో పై సంపుటాలను విడుదల చేయాలని శ్రీస్వాములవారి సమ్మతితో వజ్రోత్సవ నిర్వాహక సంఘం వారు నిర్ణయించారు ఈ సంపుటాల క్రోడీకరణ, ముద్రణ **శ్రీ సముద్రాల లక్ష్మణయ్య** గారి సంపాదకత్వం క్రింద జరుగుతున్నది

భగవదనుగ్రహంతో, శ్రీసద్గురుదేవుల ఆశీర్వాదంతో, భక్తుల ప్రోత్సాహంతో ఈ గ్రంధ ప్రచురణ ప్రణాళిక విజయవంతం కాగలదని ఆశిస్తున్నాము

శ్రీ వ్యాసాశ్రమం

ప్రకాశకులు

తొలిపలుకు

శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళిలో ఇది తొమ్మిదవ సంపుటం 'ఈశ్వరకృప' అన్న పేరుతో పూర్వం ముద్రింపబడిన గ్రంధమే ఈ సంపుటంగా రూపొందింది

1938 నుండి 1946 వరకు 'యథార్థభారతి' మాసపత్రికలో వెలువడిన శ్రీ సద్గురు దేవుల వ్యాసాలు 1946లో 'ఈశ్వరకృప' అన్న పేరుతో గ్రంధరూపం పొందాయి తరువాత 1979లోనూ, 1996లోనూ ద్వితీయ, తృతీయ ముద్రణలందుకొన్న ఈ గ్రంధం ప్రస్తుతం ఈ గ్రంథావళి ప్రచురణ ప్రణాళికలో తొమ్మిదవ సంపుట మయింది

'ఈశ్వరకృప'లో చివరి వ్యాసంగా పూర్వం ముద్రించబడిన 'శ్రీభగవద్గీతాధ్యాయ స్వరూపము' అన్న అంశం 'గీతార్థప్రకాశిక' అన్న శ్రీవారి వ్యాఖ్యతో వెలువడిన 'శ్రీమద్భగవద్గీత' చివర ప్రచురింపబడి వున్నది శ్రీవారి గీత ఈ గ్రంధావళిలో ఆరవ సంపుటంగా ప్రకటింపబడింది అందుచేత ఈ సంపుటము నుండి ఆ వ్యాసాన్ని తొలగించడమైనది తక్కిన వ్యాసాలన్నింటిని యధాతధంగా ఇందులో ప్రకటించడం జరిగింది

ఈ సంపుటంలోని 'ఇంద్రియములను ప్రార్థించుట', 'పురోవృద్ధి గోరువారు పూర్వ వృత్తాంతమును మరువరాదు' ఇత్యాది విషయాలు పాఠకులకు ఆత్మోత్తేజం కలిగించేవిగా వున్నాయి 'దృఢవ్రతము' అన్న సుదీర్ఘ వ్యాసములో భారత భాగవతాది గ్రంధాలనుండి అవసరమైన కధాంశాలను ఉదాహరిస్తూ, దృఢవ్రత సంపన్నులై విజయం సాధించిన భీష్ముడు, హరిశ్చంద్రుడు మున్నగు మహామహుల చరిత్రలను నిరూపిస్తూ ఆధ్యాత్మిక మార్గములో పయనించేవారు చేపట్టదగిన నియమాలు ఎంత దృఢంగా వుండాలో శ్రీసద్గురు స్వాములవారు విపులంగా వివరించారు

శ్రీ వ్యాసాశ్రమ వజ్రోత్సవ శుభ సందర్భంలో శ్రీ మలయాళ సద్గురు స్వాములవారి రచనలను ఇలా ఇరువది బృహత్సంపుటాలుగా ప్రచురించే సదవకాశం కలగడం శుభావహం ఆత్మోన్నతిని ప్రసాదించే ఈ గ్రంథావళిని భక్తులు భక్తిశ్రద్ధలతో పఠించి కృతకృత్యులై శ్రీ గురుదేవుల అనుగ్రహానికి పాత్రులగుదురు గాక!

26-9-2000 సముద్రాల లక్ష్మణయ్య

విషయసూచిక

౧	నివేదన	౧
౨	తొలిపలుకు	౩
౩	విషయసూచిక	౪
౪	పీఠిక	౫

1	బోధ	1
2	ఆత్మబోధత్రయము	7
3	ఇంద్రియములను ప్రార్థించుట	15
4	అంతరింద్రయములను ప్రార్థించుట	26
5	యతో ధర్మస్తతో జయః	48
6	దృఢవ్రతము	57
7	శ్రీ గీతాశాస్త్రమును గుఱించి	166
8	ఋష్యాది న్యాసక్రమః	171
9	పురోఽభివృద్ధిని గోరువారు పూర్వ వృత్తాంతమును మఱువగూడదు	181
10	బ్రహ్మజ్ఞానము మనుజులను సోమరులనుగా జేయుచున్నదా? లేక సోఽహంపరులుగా జేయుచున్నదా?	205
11	మనస్తత్త్వము	231
12	నియతి	303
13	ధర్మసూక్ష్మము	329
14	ధర్మరహస్యము	333
15	జన్మసాఫల్యము	334
16	షోడశ కళాప్రపూర్ణము	336
17	భావశుద్ధియే జ్ఞానసిద్ధి	338
18	భావాతీతము	353
19	జ్ఞేయము	401

ఓమ్

పీఠిక

ఈశ్వర కృపవల్లనే ఈ గ్రంథములను రచించడమైనది అంతేగాక ఈ యుపాధివల్ల ఏ యే కార్యములు - లోకమున కుపయోగార్థముగా గలిగి యుండినను - అవియున్ను ఈశ్వర కృపవల్లనే కలిగినవి ఇకను ఏద్దైన కలు గనుండిన, అదిన్ని ఈశ్వరానుగ్రహమువల్లనే కలుగ నున్నదని నిశ్చయ బోధము కలిగి యుండుటవల్లనే ఈలాగున వ్రాయడమైనది ఇపుడు కలుగుచున్నది కూడ ఈ సర్వేశ్వరుని కరుణవల్లనే అని దృఢమైన నమ్మకము కలదు

ఇక నొకమెట్టు పై భాగమున కెక్కి చూచిన, ఈశ్వరుడే ఈ యుపాధియం దుండి లోకమున కీలాంటి యుపయోగకర కార్యములు చేయుచున్నాడని కూడ నమ్మకము కలుగవచ్చును పై చెప్పినదానికన్న ఈ రెండవది మరింత ఎక్కువ స్థితిలో నిలుకడ కలిగియుండును ఈ రెండును బ్రహ్మవేత్తలు చెప్పు చున్న పరభక్తియున్ను, అపర భక్తియున్ను కలిగియుండునని గ్రహించుకొనవలయును ఇట్లు వ్రాయుటచే అందరు చేయు కార్యములున్ను ఈశ్వరుడే చేయుచున్నాడని చెప్పకూడదా? యని సందేహము కలుగ నక్కర లేదు ఎవరి కట్టి భావము కలుగునో వారికి మాత్రమే ఆ వాక్యము సఫలమగును ఈ రెండు వాక్యములున్ను చాల హెచ్చు మార్గములోనే కలవు ఈ స్థితిలో బంధము కలుగుటగాని, అహంకారము జనించుటగాని యుండదు అట్లు కానివారం దరును ఈశ్వరానుగ్రహమువల్లనే మనకు భవబంధ విముక్తి కలుగవలయునని తలంచుటయే బాగుండును అట్లు తలంచుటవల్ల ఈశ్వర నియమమగు ధర్మమును అనుష్ఠించ వలయునేగాని విడువరాదను బుద్ధియే అతనికి కలుగును ఇదే అహంకారము నశించుటకున్ను, ఈశ్వర రాజ్యమును పాలించుటకున్ను, నిశ్శ్రేయస్సు గలుగుటకున్ను మంచి కారణమగును ఇక ఈ విషయమై చెప్ప నక్కరలేదు ఈశ్వరానుగ్రహమువల్లనే జీవులకు భవబంధ విముక్తి గలుగవలసి యుండునని

పరమఋషులున్ను, శాస్త్రములున్ను చెప్పెడు సంగతులను కొంచె మిచ్చట భక్తులకొఱకు తెలిపెద ఇది ఆస్తికులందరికి సమ్మ తమగును శ్రీవ్యాసాది ఋషులందరున్ను, భాగవతాది గ్రంధములున్ను శ్రీగీతలో శ్రీకృష్ణ భగవానులున్ను ఇదే ఉపదేశించియున్నారు కేవల బ్రహ్మాత్మైక్య బోధము కలవారున్ను, త్రిమూర్త్యాత్మకావతారులునగు శ్రీదత్తాత్రేయులు గూడ తాను రచించిన అవధూతగీతలో ప్రప్రధమమున దీనినే యుపదేశించి యున్నారు అదేమనగా?

ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా।
మహాభయపరిత్రాణా ద్విత్రాణా ముపజాయతే॥

అద్వైత జ్ఞానముయొక్క తలంపు, ఈశ్వరకృపవల్లనే జీవులకు కలుగుచుండును జనన మరణమను మహాభయము నుండి రక్షకులు లేని జీవులను రక్షించునది ఈశ్వరానుగ్రహ మొకటియే యగును శ్రీశంకర భగవత్పాదులుకూడ ప్రశ్నోత్తరమణిరత్నమాల యందును ఇట్లే యుపదేశించి యున్నారు

అపార సంసార సముద్రమధ్యే సమ్మజ్జతో మే శరణం కిమస్తి।
గురో కృపాళో కృపయా వదైతద్విశ్వేశ పాదాంబుజ దీర్ఘ నౌకా॥

పారములేని సంసారమను దుఃఖసాగరములో మునుగుచుండు వానికి తరణోపాయమెద్దియని శిష్యుడడుగగా, సర్వేశ్వరుని చరణారవిందధ్యాన మనెడు దీర్ఘముగాను, దృఢముగానుండు ఓడయే ముఖ్యసాధనమని సెలవిచ్చిరి అద్వైతజ్ఞానసాగరులగు శ్రీదత్తాత్రేయులున్ను, శ్రీశంకర భగవత్పాదులున్ను ఇట్లు చెప్పుటవల్ల భగవత్కృపవల్లనే అట్టి అఖండైక జ్ఞానము కలుగునని చెప్పుటకు కారణమైనది

నిజముగా విచారించిన నిర్మలమగు భక్తియనెడు తైలమే జ్ఞానమనెడు జ్యోతియై ప్రకాశించుచుండును దీనిని చక్కగా విచారించిన చమురు వేరు, వెలుతురు వేరు గాదని గోచరము కాగలుగును తైలముయొక్క పరిణామమే జ్యోతియును జ్ఞానము కలుగును. ఆలాగున పుష్పమునుండియే ఫలమేర్పడును పుష్పము వినా ఫలము కలుగదు అదేరీతిగా భక్తివల్ల

హృదయము వికసించిన పుడు దానియందు నిగూఢమై సాక్షియై వెలుగుచుండెడు ఆత్మజ్ఞానమనెడు ఫలము కలుగుచుండును మరియు ప్రపంచములోగల ఏబీజమైనను జలముయొక్క సహాయముచేతనే వృక్షమగునట్లు, బీజరూపముగా నుండు జీవుడు దైవభక్తియను జలమువల్ల క్రమముగా వికాసము నొంది పూర్ణజ్ఞానమును పొందుచుండును

యథా సమస్తలోకానాం జీవనం సలిలం స్మృతమ్ ।

తథా సమస్త సిద్ధీనాం జీవనం భక్తి రిష్యతే ॥

ఏలాగున సమస్తజీవకోట్లకు జలమే జీవనాధారముగా నుండునో ఆలాగున జీవునకు కలుగవలసిన ఆధ్యాత్మిక జ్ఞానము మొదలగు సిద్ధులకున్ను భక్తియే ప్రాణమువంటిదగును

యతః పాపార్ణవం త్రాతుం భక్తిర్నౌరివ నిర్మితా ।

ఏలాగున క్షారోదకముగల సముద్రమును దాటుటకు నావ ఏర్పడి యున్నదో, ఆలాగున సంసారమనెడి పాపార్ణవమును దాటుటకు భక్తియనెడు నావను సర్వేశ్వరుడు నిర్మించెను

జ్ఞానలభ్యం పరం మోక్షం ప్రాహు స్తత్త్వార్థచింతకాః ।

తద్జ్ఞానం భక్తిమూలం చ భక్తిః కర్మవతాం తథా ॥

ఆత్మతత్త్వార్థచింతకులగు ఋషులు పరమమైన మోక్షము జ్ఞానము వల్లనే లభించునని చెప్పిరి అయితే అట్టి జ్ఞానమునకు భక్తియే మూలమని యుపదేశించిరి అట్టి దైవభక్తి సత్కర్మ పరులకే గలుగునని వచించియున్నారు

కలికాలోరగాద్దంశాత్కిల్బిషాత్కాలకూటతః ।

హరిభక్తిసుధాం పీత్వా ఉల్లఙ్ఘ్యో భవతి ద్విజః ॥

కలికాలమనెడు నల్లత్రాచుకాటువల్ల కలిగెడు కాలకూటమనెడు పాపము గలవారు, భగవద్భక్తియను అమృతమును పానముచేసి తరించవలసి యుందురు

జ్ఞానతోఽజ్ఞానతో వాఽపి వాసుదేవస్య కీర్తనమ్ ।

తత్సర్వం విలయం యాతి తోయస్థం లవణం యథా ॥

జ్ఞానముతో అయినను లేక జ్ఞానములేక అయినను చేయు భగవత్సంకీర్తన

ఎటువంటిదనగా, జలములో నుంచిన లవణమేలాగున జలమయమ్మై పోవునో, ఆలాగుననే జీవులుకూడ భక్తియనెడు జలములో మునిగిన భగవన్మయులు గాగలరు అనగా తెలిసిగాని తెలియకగాని భగవద్ధ్యానము గలవారు భగవంతు నందైక్యము నొందగలరు. లవణము తన్ను జలమయముగా చేయుమని జల మును ప్రార్థింప నక్కర లేదుకదా! జలములో లవణముంచిన జలమయమ్మై పోవును దానికి సంబంధించిన జ్ఞానము లవణమున కక్కరలేదు ఆలాగున, జీవేశ్వరుల ఐక్యస్వరూపము తెలిసినను తెలయకపోయినను దానియొక్క ఫలితము కలుగును.

సత్యం వచ్మి హితం వచ్మి సారం వచ్మి పునః పునః ।
అసార దగ్ధ సంసార సారం తత్ర శివార్చనమ్॥

నేను సత్యము చెప్పుచున్నాను లోకహితమును చెప్పుచున్నాను మఱల మఱల సారమును చెప్పుచున్నాను అదేమన? సారము లేనిదైన సంసార తాపత్రయముచే తపించెడు ఈ సంసారమునందు ఈశ్వరార్పిత హృదయ ముగల భక్తి యొకటియే సారమైనది

అతో మద్భక్తియుక్తస్య జ్ఞానం విజ్ఞానమేవ చ ।
వైరాగ్యం చ భవేచ్ఛీఘ్రం తతో ముక్తి మవాప్నుయాత్ ॥

భగవద్భక్తి యుక్తుడైన మనస్సుగలవానికి శీఘ్రముగా విషయములలో విరక్తి గలుగును. అందువల్ల అమానిత్వాది జ్ఞానమున్ను లేక పరోక్ష జ్ఞానమున్ను కలుగును తరువాత అనుభవ సాక్షాత్కార జ్ఞానమున్ను లేక అపరోక్షజ్ఞాన మున్ను సిద్ధించును దానివల్ల ముక్తియున్ను పొందగలుగును

తావద్భ్రమంతి సంసారే దారుణే దుఃఖసంకులే ।
యావన్నోచ్చారయంతీమం మంత్రం దేహభృతః సకృత్॥

దేహధారులగు జీవులు ఎంతవఱకు భగవన్నామోచ్చారణము ఒక సారి యైనను చేయలేదో, అంతవఱకే దారుణమై దుఃఖసంకులమైన ఈ సంసా రమందు జనన మరణములను పొందుచుందురు

వక్తుం శ్రమో న చాల్పోఽపి శ్రోతు మత్యంతసుందరమ్ ।
తథాఽపి రామరామేతి న వదంతి దురాశయాః॥

భగవత్స్మరణ మన్నది చెప్పుటకు కొంచమైనను ప్రయాసము లేనిది. వినుటకో మహాసుందరమైనది అట్లుండియు, 'రామరామ' యని ఈ జనులు ఉచ్చరించుట లేదే! ఓ హో! వీరి దురదృష్టమేమని చెప్పవచ్చును

హరేర్నామైక మప్యత్ర కలౌ వదతి యో నరః।
కలి ర్న బాధతే తం చ సత్యం సత్యం న సంశయః॥

ఏ మనుజుడైతే ఈ కలియుగమునందు ఒకసారియైనను భగవత్స్మరణ చేయునో, అట్టివాని దగ్గఱకు కలి చేరదు ఇది సత్యము ముమ్మాటికి సత్య ము దీనియందు సంశయము లేదు

సర్వ పాపేషు నష్టేషు బుద్ధి ర్భవతి నిర్మలా ।
సైవ బుద్ధి స్సమాఖ్యాతా జ్ఞానశబ్దేన సూరిభిః॥

ఎపుడు భగవద్భక్తివల్ల పాపకర్మలన్నియు నశించునో అపుడు బుద్ధి నిర్మలమగును అట్టి దోషరహితమై శుద్ధమైన బుద్ధి ఏది గలదో, అట్టి బుద్ధియే జ్ఞానోపలబ్ధిని కలుగచేయునని మహనీయులు చెప్పిరి

సంప్రాప్య భారతే జన్మ సత్కర్మను పరాఙ్ముఖః ।
పీయూష కలశం త్యక్త్వా విషభాండ ముపాశ్రితః ॥

పుణ్యభూమియగు ఈ భారతమున జన్మించి ఎవడు సత్కర్మ పరుడై భగవద్భక్తి చేయడో, అట్టివాడు అమృతకలశమును త్యజించి విషకుంభమును ఆశ్రయించినవా డగుచున్నాడు

శుభం కర్మ సముత్సృజ్య దుష్కర్మాణి కరోతి యః ।
కామధేనుం పరిత్యజ్య అర్కక్షీరం సమశ్నుతే ॥

ఈ పుణ్యభూమియగు భరతఖండమున జన్మించిన ఏమనుజుడు సుకృత కర్మమును చేయక దుష్కర్మలు చేయుచుండునో, అట్టివాడు అమృతము వంటి కామధేనువు క్షీరమును త్యజించి బాధాకరమగు జిల్లేడు పాలను పానము చేయుచున్నాడు

అభక్త్వా యత్తప స్తప్తం కేవలం కాయశోషణమ్ ।
అభక్త్వా యద్ధుతం హవ్యం భస్మని న్యస్తహవ్యవత్ ॥

భక్తిలేని యేతపస్సు గలదో, అది కాయశోషణము మాత్రమే

కలుగజేయును భక్తిలేని ఏ హోమము కలదో, అట్టి హోమము చేసెడు హవిస్సు బూడిదయందు వ్రేల్చిన హవిస్సువలె వ్యర్థమైపోవును

శ్రద్ధావాౕ లభతే ధర్మం శ్రద్ధావా నర్థమాప్నుయాత్ ।

శ్రద్ధగలవాడు ధర్మార్థకామ, మోక్షములనెడు పురుషార్థ చతుష్టయము నిచటనే పొందగలుగును

కలౌ కృతయుగం తస్య కలి స్తస్య కృతే యుగే ।
యస్య చేతసి గోవిందో హృదయే యస్య నాచ్యుతః ॥

ఎవని హృదయమందు భగవచ్చింతన గలదో, వాడు కలియుగ మందున్నప్పటికిని కృతయుగము నందున్నవాడే కృతయుగమునందున్న వాడైనను ఎవని హృదయమందు దైవచింతన లేదో వాడు కలియుగమునందున్న వాడే యగును. ఇదే యుగభేదములయొక్క రహస్యము

ఈ గ్రంథమునందు భాషాదోషములేవైన నుండిన రాజహంస మేలాగున నీరమును విడచి క్షీరమును గ్రోలునో భాషాకోవిదు లాలాగున గ్రహింతురుగాక! అట్లు కలుగుట కేదైన కారణములున్నచో ఈ యుపాధి యొక్క నామధేయమువల్లనే, ఆంధ్రదేశమున్ను భాషయున్ను కాదని తలంచి మన్నింతురుగాక! అట్టి దోషమేదైన ఉండినచో తెలుపువారికి కృతజ్ఞుడను. మరల ముద్రించునపుడు అట్టి దోషము లేవియు లేకుండుటకు యత్నించెద. ఈశ్వరుని కృపవలననే ఈ గ్రంథమును వ్రాయడమైనది

లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

తమ చరాచర సుఖాభిలాషి
శ్రీమలయాళస్వామి

★★★★★★

ఈశ్వరకృప

శ్రీమద్భగవద్గీతాపారాయణకాలమున
శ్రీ సద్గురు మలయాళస్వాములవారు చెప్పిన బోధ

భక్తులారా!

శాంతవముగా చదువవలెను జ్ఞేయభావములోనికి ప్రవేశించిన మాత్రమే శాంతి గలుగును. పండితులయొక్క పారాయణమునకును, భక్తులయొక్క పారాయణమునకును భేదము గలదు పండితులు భాషలోను, శబ్దార్థములోనే యుందురు సాధువులు, భక్తులు, భగవద్భావములోనే ఉందురు ఇది అనాదినుండియు గలదు అట్టి ధ్యానానుష్ఠానపరులు భావము లోనికి పోయినచో శబ్దమున్ను, శబ్దములోనికి పోయినచో భావమున్నూ వదలిపోవును ఆ సమయమున ఉచ్చారణయు దైవభావమున్నూ కలిగియుండ వలెను

ఇది జన్మ పరంపరలయొక్క అభ్యాస యోగబలమువలన గలుగును గీత॥ 17-3 శ్లో సత్త్వగుణము గల శాంతుడు ఆహార నియమము, సత్య సంభాషణయు, భగవద్ధ్యానము మొదలగునవి గలిగియుండును ఆయా

ప్రవర్తన వలనను వారిని గనుగొనవచ్చును కనుక ధ్యానము నిత్యము చేయు నియమముగల వారయినచో, క్రమక్రమేణ రజస్తమో గుణసంబంధమగు స్వభావము తగ్గి, సాత్త్వికశ్రద్ధగల వారగుదురు నిత్యము ఒక వేయియో, రెండు వేలో, మూడు వేలో జపముచేయవలెను

ఒక స్తంభమునకు ఆవును కట్టినచో అదెట్లు తప్పించుకొని యెచ్చటికిన్నీ పోజాలదో, అదే రీతిగ, జ్ఞేయమను స్తంభమునందు మనస్సను పశువును కట్టివేసినచో ప్రశాంతత గలుగును పడవ నడుపుటకు చుక్కానిని చేతబట్టి యుంచవలెను దానిని ఎటుల త్రిప్పితే పడవ అటులనే తిరుగును ఆచుక్కాని చేతిలో లేనిచో తెరచాపగడలు, తెడ్లు, మొదలగు ఎన్ని సామగ్రులున్నను సరిగా పోజాలదు అట్లే జ్ఞేయమను చుక్కాని సరిగా నుండినచో మాత్రమే ధ్యానపారాయణ జపయోగములు మొదలగు నన్నింటిచేతను, సంసారసాగరమును దాటి ఆత్మశాంతియను తీరమును చేరగలుగును, గాన ఇదేరీతిగ శాస్త్రజ్ఞులకు, భక్తులకు, సాధువులకు ఇట్టి తారతమ్యము లుండును

బహిర్ముఖము అంతర్ముఖము–ఈ రెండును సరిగా నున్నయెడల లోకములో ఒకధర్మమును నిలుపగలము దైవభావములో నుండిన శబ్దమును వినలేము శాస్త్ర భావములో నుండిన దైవభావ ముండదుగాన ఈ రెంటిని చక్కగా గ్రహించి ప్రవర్తించవలెను కనుక శాస్త్రము కంఠతః రాబట్టియు, దానిని చదువుచున్నను దైవభావము కలిగియుండినచో మాత్రమే ప్రయోజనము గలుగును ప్రథమవాక్యము పరమాత్మను శరణుపొందుము, ప్రకృతిసంబంధమగు ప్రపంచ విషయాదులలో కాలము గడపకుము ధ్యేయమును శరణు పొందుము ధ్యానములోనే కాలము గడుపకుము కొందరు ధ్యానములో కాలము గడుపుచుందు మనియెదరు ఈ విషయము ఇదివరలో చెప్పియుంటిమి

ఇప్పుడు ధ్యాతయొక్క ధ్యానాకారమే ధ్యేయము స దేవ సౌమ్యేద మగ్ర ఆసీత్ – ఆచార్యుని సన్నిధిని అంతేవాసియై, బ్రహ్మవిద్యను అభ్యసించుకాలమున ప్రసన్నభావము, సమానభావము, శమదమాదులు గలిగి

యుండువాడే మోక్షాధికారి, ఓ సౌమ్యుడా సృష్టికి పూర్వము ఒకవస్తువే గలదు ఆ సద్వ స్తువు ఒకటియే తదుపరి సృష్టి లయ మగునపుడున్నూ గలది అది సర్వదా ఒకటిగానే యున్నది ఆత్మనుండియే అవ్యక్తము, మహదాది పంచభూత ములున్నూ, ఓషధులున్నూ, దానినుండి అన్నము మొదలగునవన్నీ సృష్టి అయినవని చెప్పుచుందురు మరల క్రమముగ సర్వము దానియందే లయమగును ఇది ప్రకృతి లక్షణము

తన అనుష్ఠానములో సర్వ దేహేంద్రియాది వాసనలు తోచని ఉనికి యేదో అదియే మోక్షము ధ్యానము చేయుచు రాగా రాగా, తద్వారా క్రమ క్రమేణ వాసనలు నశించి ధ్యేయాకారమున నిలకడ గలుగును అల్పాక్షర మనంతార్థం - మహామతులగువారు చెప్పు వాక్యములు అల్పాక్షరములు గలవైనను అనంతార్థము గలిగియుండును మీరు ధ్యానము నుండి వచ్చినవెంటనే ఒక సంజ్ఞ చేసినచో దానియందు నెంతో అర్థ ముండును ధ్యాత, ధ్యానము, ధ్యేయము ఇదియే త్రిపుటి ఈ త్రిపుటి రహితముకొరకు ప్రయత్నము చేయవలెను సర్వనదులు సముద్రములో చేరినమాత్రమున ఏకమగును ఆలాగున ధ్యాత, ధ్యానము, ధ్యేయము క్రమ క్రమముగా ధ్యానానుష్ఠానము వలన ధ్యేయాకార మగును కనుకనే గీత13 వ అధ్యా॥ ప్రకారము అమానిత్వాది జ్ఞానగుణములు 20 లక్షణములు గలిగి యుండవలెను కనుక ధ్యాతయగు జీవుడు, ధ్యానముద్వారా ధ్యేయమగు పరమాత్మను శరణు బొందవలసి యుండును

సర్వమతములలోగల చైతన్యమే దైవమని చెప్పబడెను అట్లుగాక దయ్యమగు ప్రపంచ వాసనయందు పడిపోవలదు ధ్యేయమునకు పర్యాయపదములు పద హారు విధములు గలవు అవి ఓంకార గ్రంథములో చెప్పబడియున్నవి ఎవరెవరికి ఏధ్యానము చెప్పిరో తద్వారా ధ్యేయము కొరకు ప్రయత్నించవలెను మనస్సు స్వాధీనములో నుండుటయే అమనస్కము ఆత్మ వీటి కతీతు డగుటవలన వాటికి లోబడడు మనస్సునకు విలక్షణ మైనదొకటి గలదు అందువలననే నామనస్సు నాబుద్ధియని అనుచున్నాడు కనుక మనస్సునకు విలక్షణమైనది ఒకటి ఉన్నదని స్పష్టపడుచున్నది ఉప్పు నీటిలో

వేసిన నీరే యగును ఇది సత్యార్థముగాన ప్రథమమున విషయాదులయందు శాంతి గలుగవలెను

అశాంతిలో జీవింపకుము శాంతిద్వారా, ప్రకృతిరహితమగు ఆత్మ శాంతిని బొందుము అట్టి లక్షణములు గ్రహించి విలక్షణమగు అంతర్ముఖ ములో తురీయదృష్టిలో, అపుడపుడు తోచు శుద్ధ సంకల్పమను ప్రకృతికి విలక్షణుడ వగుము సాధనానుష్ఠానము గలవాడవై శాస్త్రరీత్యా, క్రమ క్రమేణ అనుష్ఠించి ధ్యేయమును బొందుము కొందరు అమనస్కము చెప్పెదమందురు చెట్టులేకనే పండు నిచ్చెదమందురు ఫలస్య కారణం పుష్పం - ఫలము కావలె ననిన చెట్టునుపెట్టి పోషించిన ఫలము సిద్ధించును, కొందరు అనాసపండును రంగు డబ్బాలపై చిత్రించి యుందురు ఆరీతిని ధ్యానములేని వేదాంత ముండును ఇది అనుష్ఠానము లేని వేదాంతము గనుక తప్పక పతనమై పోవును

కావున ఎవరియందును కఠినత్వము పొందకుము, సర్వజీవుల యందు దయగలవాడవగుము గీత 13 అ 'జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం' - మొదట జ్ఞానముకొరకు ప్రయత్నింపవలెను అటుల ప్రయత్నించిన తద్వారా జ్ఞేయాకారము పొందెదవు ప్రథమమున పాఠము చదివి పరీక్ష కావలయును ఉద్యోగము కొరకు ట్రైనింగు అయిన తదుపరిగదా ఉద్యోగము వచ్చి సుఖింప గలవు! ఆ రీతిగ వేదాంతశాస్త్రమను విజ్ఞానశాస్త్రము చదివి, పెద్దల వలన ధ్యానానుష్ఠాము తెలుసుకొని అట్టి ధ్యానాదులను చిరకాల మభ్యసించినచో జ్ఞేయమును పొందగలవు గమ్యమును చేరుము గమనములోనే కాలము గడుపకుము ప్రకృతి వస్తువులు తనకు తోచని అవస్థ గలుగువరకు పునః పునః మననము చేయుచు అవి సంపూర్తి అయ్యే వరకు అతిశ్రద్ధతో అనుష్ఠించవలెను కొందరు శ్రవణముతోనే సమాప్తము చేయుచున్నారు కొందరు మననము వరకు వెళ్లుచున్నారు శ్రుతేశ్శతగుణం విద్యాత్ మననం - శ్రవణముకంటె మననము నూరురెట్లధిక ఫలమును, నిదిధ్యాసము అనంతమైన ఫలమును ఇచ్చును. కనుక గమ్యస్థానమును చేరుము

కాశిలో అందరు యాత్రికులు ప్రాతఃకాలమున స్నానములు, తర్పణలు, స్వామిదర్శనము, క్షేత్రములు మొదలగునవి చేసి చూచి,

సాయంత్రము రుద్రాక్షలు మొదలగునవి బజారు అంగళ్ళలో కొనెదరు వారిని సంధ్యా కాల ములో కబీరుదాసుగారు చూచి యిట్లనిరి ‘ఓ జనులారా! ఒకడు అడవిలో వెళ్ళుచున్నాడు ఎవరును తోడులేరు ప్రొద్దులేదు, చీకటికాలము ఆ అడవి యందు, మృగములు అనగా సింహములు, గ్రహములు గలవు అది తెలిసి కొన క, ఆచెట్లు, తీగెలు, పువ్వులు మొదలగునవి చూచుచు కాలము గడుపుచున్నారే!’

ఆహా ఈ సంసారమను అరణ్యములో జీవితమను సూర్యుడు అస్తమించ బోవుచున్నాడు ఆశాపాశములు, కామాదులను మృగములు ఆటంకపరచ నున్నవి దుఃఖములను గలుగజేయు ద్వేషాదులను పులులు గలవు కావున విరాగులై యుండుడు అఖండమును చేరుడు, ఖండములో పడియుండకుడు బుద్ధిని దాటువరకు విషయాదులే ఉండును గనుక, దానిని దాటిన అఖండమగు దైవభావములో చేరగలరు విద్యుచ్ఛక్తి యొకటియే, దానికి తీగలు, బలుబులు అనేకములు, నీరుటాంకి ఒకటియే వంపులు గొట్టములు అనేకములు ఆ గొట్టములు పెద్దవైన జలము విశేషముగ వచ్చును చిన్నవైన జలము కొలదిగ వచ్చును ఆరీతి, మనస్సు గొప్పదైన సర్వశక్తి గలిగి, ప్రబోధనా స్వరూప దైవస్థితి గలుగును సంకుచితమైన పూర్ణత్వము గలుగదు యదా నద్యః స్యందమానాః సముద్రం – సర్వనదులకు హెచ్చుతగ్గులు గలవు సముద్రమునకు తరుగుదల పెరుగుదల లేదు నదులలో చిన్నఅలలు, సముద్రములో పెద్ద అలలుండును మీరు ఈశ్వరత్వమును బొందినయెడల పెద్దపని గలవారగుదురు

సముద్రమునందు ఫేనతరంగము లుండును అంతర్ముఖ దృష్టిలో చాలాలోతుకు వెళ్ళిన విషయాది తరంగము లుండవు నిస్తరంగ సముద్రస్థితి జ్ఞేయాకారము పొందినవారికి మాత్రముండును సముద్రమునకు పైననే తరంగము లుండును, చాలాలోపలకు ప్రవేశించిన తరంగము లుండవు అనేక జన్మాదులనుండి ధ్యానాదుల నభ్యసించుచు వచ్చినవారలే ఇట్టి జ్ఞేయాకారస్థితిని పొందియుందురు సుహృదయులయొక్క వ్యాపారము సమదృష్టిలోనే యుండును శ్రీమహాత్మాగాంధీజీకి ఉన్న పని మనకు ఉన్నదా? కొన్ని

మరవములు మాత్రమే మనకు గలవు వారికి భారతదేశమంతట, ఇతరదేశములలోను పని యుండియు భారముగా నుండలేదు కనుక మనము మంత్రార్థమును పొంద వలెను మంత్రములోనే కాలము గడుపవలదు ఆయామంత్రము దేనిని గురించి చెప్పినదో ఆ అధిష్ఠాన దైవమును చేరుము ఒక బీజముంచిన అది వృక్ష ముగా మారినట్లు మంత్రమును ధ్యానము చేయుచున్నకొలది ధ్యేయాకా రమైపోవును ఆధ్మాత్మిక విషయములో ఒకరికొకరు సహాయము చేయజాలరు వానియందు ఎవరికి వారే అనుస్ఠానము చిరకాలము చేయగా చేయగా జీవత్వ మను బీజమును వదలి కేవలత్వమను ధ్యేయమును పొందుదురు సర్వనదులు పరుగిడి పరుగిడి తుదకు సముద్రములోనే చేరును కనుక అమనస్కమును మనము పొందవలసినచో, ధ్యానానుష్ఠాము గలవారమై యుండి అనుష్ఠించుచు వచ్చిననేగదా అట్టి బ్రహ్మానందరసమును గ్రోలగలము! (దత్త గురుదత్త) దత్తాత్రేయులకే గురుశబ్దము గలదు అది అవధూత గీతయందు గలదు

త్వద్యాత్రయా వ్యాపకతా హతా తే
ధ్యానేన చేతః పరతా హతా తే ।
స్తుత్యుక్తిభి ర్వాక్పరతా హతా తే
క్షమస్వ నిత్యం త్రివిధాపరాధాన్ ॥

నేను మూడపరాధములు చేసితిని, ఏ క్షేత్రమునందో నీవున్నావని నీకొఱకై తీర్థయాత్ర చేయుటచే నీసర్వగతత్వమును పాడుచేసితిని చిత్తము నందు నిలిపి నిన్ను ధ్యానించుటచే మనస్సున కందని నీ స్థితిని పాడుచేసితిని పరిమితార్థములైన స్తోత్రవాక్యములచే నిన్ను కొనియాడుటచే మాటలకందని నీ స్థితిని పాడుచేసితిని కావున స్వామీ! నా యీ మూడపరాధములను మన్నింపుము

ఈశావాస్య మిదం సర్వం,
యతోవాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ ।

అను వేదవచనముల సారమీశ్లోకమున నిరూపింపబడినది ఇట్టిస్థితి యెప్పుడు కల్గునో అప్పుడే ప్రతివారును అమనస్కభావమును పొందగలరు

ఆత్మబోధత్రయము

ఆత్మవిముక్తి విషయమై మూడుమార్గములు గలవు అవి సామాన్య బోధ యనియు, విశేషబోధ యనియు, అతీతబోధ యనియు పేర్లుగలవి వీటికి ఉత్తమబోధ యనియు, ఉత్తమోత్తమబోధ యనియు, అఖండబోధయనియు నామాంతరములు గలవు మఱియు వీటిని తారక మనియు, సాంఖ్య మనియు అమనస్క మనియు జెప్పుదురు జ్ఞాన బోధయనియు, విజ్ఞానబోధ యనియు, సాక్షాద్బోధ యనియు సంజ్ఞలు కలవు ఇవి ప్రపంచములోగల సమస్తమతములలోను గనదగును యోగము, దైవోపాసన, తపస్సు, వేదాంతవిచారణ మొదలగునవి యన్నియు వీటిలో నంతర్భూతములు, పై జెప్పిన సామాన్యబోధ, విశేషబోధ, అతీతబోధ ముఖ్యములని గ్రహించిన చాలును

1 రోగముగలవాడు దివ్యౌషధసేవయు, పథ్యమును గలిగియుండిన రోగమేలాగున క్షయించునో ఆలాగున భగవద్ధ్యానముచేగాని, తపస్సుచేగాని, యోగముచేగాని భవరోగమంత మొందునని చెప్పుటయు, దానికి గావలసిన నియమములు భక్తి, జ్ఞానము, వైరాగ్యము, శ్రద్ధ మొదలైన వన్నియు గలిగి యుండవలయునని చెప్పుటయు సామాన్యబోధ యగును ఆలాగున మలిన వస్త్రమును చౌడు, మట్టి, సబ్బు మొదలైన వానిచే శుద్ధిచేయునట్టు జనుల యాత్మలోగల ప్రకృతి దోషమును నశింపజేయ వలయునియు చెప్పుదురు మానవులందరిలోను సామాన్యస్థితిలో నుండువారే యధికమగుటచే ఇట్టి బోధలే లోకములో ఎక్కువగా నుండవలయును

2 విశేషబోధ-దీనిలో బుద్ధియొక్క విచారణ యెక్కువగా నుండును కాన అంతఃకరణ శుద్ధియును, చిత్తైకాగ్రతయు గలుగవలయును అట్లైన మాత్రమే దీనియందు ప్రవేశము గలుగును ఇది నావచే సముద్రమును దాటునట్లు, ఈశ్వర విచారముచేగాని, తత్త్వ విచారముచేగాని, ప్రకృతినుండి విడుదల గలుగ జేసికొనవలయు ననుటయే ఇంకను దీనిలో నీలాగునకూడా చెప్పబడును చీకటిలోగల వస్తువును తీసికొనుటకు దీపము కావలయును

ఆలాగున అజ్ఞానమను చీకటిలోనుండు ఆత్మను జ్ఞానదీపముచే తీసికొనవలసియుండును మఱియు బీజమును సుక్షేత్రములో బెట్టి పోషించి వృక్షముగా జేసికొని ఫలమును భుజించవలసి యున్నట్లు బ్రహ్మనిష్ఠను వృద్ధి పరచుకొని జీవత్వమును బాసి శివత్వము నొందవలసి యుండుననిగూడ చెప్పబడుచుండును మఱియు పాలనుండి నెయ్యిని, నువ్వులనుండి నూనెను, చెరకు నుండి పంచదారను, పుష్పమునుంచి సుగంధతైలమును తీయునట్లు తపస్సుచేతను, వైరాగ్యముచేతను, బ్రహ్మవిచారణచేతను ప్రకృతినుండి యాత్మను వేరుపరచు కొనవలయుననియు ఉపదేశింతురు

మరికొందరు చీకటినూతిలో బడిన వానిని మరియొక డుద్ధరించ వలసియున్నట్లును, కాలుచేతులుగట్టి యడవిలో బడవైచినవానిని ఆ బంధనము నుండి నివృత్తిచేయుట కింకొకడు కావలసియున్నట్లును, పిచ్చిపట్టినవానికా భ్రమ నివృత్తికొఱకు శ్రేష్ఠుడైన వైద్యుడు గావలసి యున్నట్టును, దారి తెలియక త్రోవదప్పి పోవువానికి మార్గమును జూపుటకు మఱియొక డుండవలసినట్లును, గ్రుడ్డివానికి దారిజూపుటకు నేత్రముగల వాడొకండుండి తీరవలసినట్లును భవబంధవిముక్తి గలుగుటకు బంధముక్తి గలిగిన గురువును, మంచి యను ష్ఠానమును గలిగియుండ వలయునని బోధించుటయు విశేషబోధలతో సంబం ధించినవే మరియు కృష్ణ, రక్త, పీతవర్ణముల సాన్నిధ్యముచే క్రమముగా స్ఫటిక మణి నల్లగాను, ఎఱ్ఱగాను, పచ్చగాను కానుపించినను యథార్థముగా నామణి యందట్టి దోషము లేలాగున లేవో, ఐనను విచారణ చేయకపోవుటచే మణి యందు కృష్ణ, రక్త, పీతవర్ణము లుండునట్లు ఎట్లు గోచరించుచున్నవో, ఆలాగున ఆత్మవిచారణ చేయనందుచే పరిశుద్ధాత్మయందు ప్రకృతిదోషము లున్న ట్లు కనుపించునేగాని వాస్తవముగా విచారించిన నేలాంటి దోషములును ఆత్మ యందు లేవని తెలిసికొనుటయు విశేషబోధతో సంబంధించినదే అయితే వీరికిని బుద్ధి శుద్ధమై నిశ్చలమై యుండవలయునని వచింతురు

పొగచే నగ్ని మరుగుపడి యున్నట్లు, లేక బూడిదచే నిప్పు కన బడనట్లు, మేఘముచేగాని, గ్రహణకాల రాహు కేతువులచేగాని సూర్యచంద్రా

దులు కనబడనట్లు అజ్ఞానముచే జ్ఞాన మావరింపబడినది దానిని తొలగించిన అగ్ని సూర్య చంద్రాదులు గనుపించునట్లు దైవసాక్షాత్కారము (జ్ఞానసాక్షాత్కారము) గలుగునని చెప్పుటయు విశేషబోధలోనిదే గాని యితరము గాదు

3. ఇక అతీతబోధలోనికి ప్రవేశింతము అత్తరి పైజెప్పినవన్నియు దూరీకరించబడును ఆత్మయందు మరియేవస్తువును చేరనందుచే సామాన్య బోధలో జెప్పన రోగాది దృష్టాంతములు సరిగావు ఆత్మ నిత్యశుద్ధ, స్వయం ప్రకాశమైనది అది జ్ఞానస్వరూప మగుటచే అజ్ఞానము దానియందు నిలుప జాలదు ఆలాగున విశేషబోధలో జెప్పినది గూడ సత్యము గాదు ఏలన నది దాటి యావలనుండు వస్తువునుగాని, స్థలమునుగాని పొందవలసియుం డినచో, లేక యిచ్చుటలేని దచ్చుట నుండిన మాత్రమే యొక స్థలమునుండి మఱియొక ప్రదేశమునకు పోవలసియుండును ఆత్మ అచ్చుటను, ఇచ్చుటను, ఒకేవిధముగా సర్వకాలముల నుండుటవలన పైజెప్పిన యుక్తులెవ్వియు సరిగా నుండజాలవు ఆలాగున ప్రకాశమును చీకటి మరుగుపరచ జాలనట్లు జ్ఞానమును అజ్ఞానము మరుగు పరచజాలదు ఆత్మ యన్నిటికి దృక్కై యుండుటచే తాను దృశ్యమును ప్రకాశింప చేయున దగుటచేతను, దీపమును పొగయు, అగ్నిని బూడిదయు, సూర్యచంద్రాదులను మేఘగ్రహణములును మరుగుపరచునట్లు చెప్పిన యుక్తులన్నియు సరియైనవిగావు

అయితే ఈలాటి బోధలన్నియు శాస్త్రములో గనుపించుటకు కారణమేమని సంశయింప నక్కర లేదు సామాన్య విశేష బోధలలో జెప్పిన యనుష్ఠానమువల్లనే యతీతబోధ కలుగును పైజెప్పిన రెండు బోధలను దాటి యతీతబోధలోనికి రావలయునేగాని వేరు మార్గము లేదు ఈవిషయమై చెప్పు నప్పుడు జీవునియొక్క సంసారసంబంధమైన సంస్కార మనేక జన్మలలోగలిగి ఘనీభూతమై యుండుటచే అది నివృత్తిగానిచో స్వబోధము లోనికి రాజాలడు మఱియు జీవునియొక్క సంస్కార మేరూపముగ నుండునో దానికి తగిన యోగ్యతయు బోధయు కలుగుననియే యోగులు వచింతురు అతీతబోధలో నీవు (ఆత్మ)స్వయంప్రకాశకుడవై యెల్లప్పుడు ఒకే విధ మగు జ్ఞానజ్యోతివై

వెలుగుచుందువని మాత్రమే యాత్మజ్ఞులగు జ్ఞానులు వచింతురు

అయితే ఆలాగున స్వయం ప్రకాశమై యుండిన ఏల యందరును ఆ దివ్యజ్ఞాన స్వరూపమును దెలిసికొనుట లేదని యడిగినచో దానికొరకు నీవు సరియైన ప్రయత్నము చేయలేదని మాత్రమే శాస్త్రము సమాధానమిచ్చును, అంతియేకాని మాయ యనిగాని, కర్మ యనిగాని, ప్రారబ్ధమనిగాని, అజ్ఞానమని గాని వేదాంతసారమగు ఉత్కృష్టశాస్త్రము సమాధానము చెప్పదు ఈ యతీత మార్గమునే భావాతీత మనియు, ఇంద్రియాతీత మనియు, అవాజ్మానస గోచర మనియు శాస్త్రము తెలుపుచుండును ఎందుకనగా మనస్సు, వాక్కు మొదలైనవి జడములు ఇవియన్నియు నాత్మవలననే చైతన్య వంతములై యున్నవి కావున నివి యన్నియు ఆత్మను ప్రకాశింప చేయజాలవు దీపముచే వస్తువులు ప్రకాశించునే గాని వస్తువులచే దీపము ప్రకాశింప జేయబడదు కదా!

అది ప్రకాశించుటకు అనగా ఆత్మ బోధపడుటకు అట్టి యాత్మజ్ఞాన బోధగల మహనీయుల యుద్బోధము తప్ప వేరు మార్గము లేదు అట్టి బోధను గ్రహించుటకు తగిన శిష్యులయొక్క నిర్మలప్రజ్ఞ మాత్రమే కారణమగు చున్నది తంతివార్త నిచ్చువారును, దానిని తీసికొనువారును, దానిలో గలుగుచుండు ధ్వనియొక్క యర్థమును గ్రహింపగలిగిన మాత్రమే యది బోధపడును ఉభయులలో నొకరికి తెలిసి మఱియొకనికి తెలియనిచో విషయము స్పష్టముగా తెలియజాలదు ఈ తత్త్వమును ఆలాటిదే అచట సామాన్యముగా బోధపడుటకు రజ్జు సర్పన్యాయమును, శుక్తిరజతయుక్తిని, ఆకాశము నీలముగా నుండు ఉదాహరణమును విజ్ఞులు దెలుపుచుందురు ఇదియును శుద్ధప్రజ్ఞ గలుగని వారికి బోధనార్థమై చెప్పవలసి వచ్చినదేగాని మఱియొకటి గాదు మఱియు అట్టి స్వయంప్రకాశాత్మ యేల అందరకు బోధ కాలేదని అడిగినచో దానికి అజ్ఞానమనియు, అవిద్యయనియు, నొకకారణమును గల్పించిరేగాని మఱియేమియు గాదు రెండవ వస్తువు మఱియొకటుండిన గదా! ఆత్మను మరుగుపరచుటకు కారణమగును ఒకటియగు ఆత్మ, బ్రహ్మము, దైవము మాత్రమే యుండగా రెండవ దెచ్చటనుండి వచ్చును? అది దివ్యము, స్వయంప్రకాశము సత్యమొక్కటి

యేగాని రెండుగా నుండగూడదు గదా! ఒక రాష్ట్రమునకు సార్వభౌము డొకడుగా నుండునే గాని యిద్దరుగా నుండిన సార్వభౌముడను పేరు నిరర్థకమగును గదా!

విశేష బోధలో చెప్పినట్లు ధూమ, భస్మ, మేఘ, రాహు కేతువులవలన దీప, అగ్ని, సూర్య, చంద్రాదులు ప్రత్యక్షముగా గనబడకబోవుట గనుపించు చుండగా, ఆత్మను అవిద్య, అజ్ఞానము, కర్మ, మలినమనస్సు మొదలైనవి యేల మరుగుపరచ గూడదని సందేహము గలుగునేమో? దానిరహస్యమును జెప్పెద ఇదే యతీంద్రియ జ్ఞానములోనికి, దేహేంద్రియ మనోబుద్ధ్యాదుల విలక్షణ స్థితిలోనికి దీసికొని పోయెడు దివ్యవిమానమని గ్రహించవలయును ఈ యొక్క సత్యసారములో నిలకడగలిగిన ఒక క్షణముగూడ అక్కర లేదు కనురెప్పపాటు సమయముగూడ యధికకాల మని తోచును ఇదే తమస్సునుండి ప్రకాశములోనికిని, మృత్యువునుండి యమృతత్వములోనికి త్రిప్పివేసెడు గురుకీలకమని తెలిసికొనవలయును దీనికే విహంగన్యాయమని పేరు తక్కినవన్నియు పిపీలికాన్యాయములో చేరినవి

ఇది విమానమార్గ గమనము, ఇచటమాత్రము భూమిపైగల పల్లము, మెఱక, కాలువలు, నదులు, అడవులు, మార్గములు చూడనక్కరలేదు అయితే బండ్లలోగాని, రైళ్ళలోగాని, మోటారులలోగాని లేక పాదచారిగాగాని ప్రయాణము చేసేవారందరును భూమిపైని మార్గముల నిమ్నోన్నతములను, కంటకములను, ఆటంకములను అన్నిటిని చూచుకొనియే నడువవలయును ఇదే సామాన్య మార్గమునకును, విశేష మార్గమునకును కల భేదమని గ్రహించవలయును

పైజెప్పిన గురుకీలక మేమన నిప్పునకు, సూర్యచంద్రాదులకు గలిగిన బూడిద, గ్రహణము ఈ యడ్డుల కీవల నుండువారల కాటంకములేగాని వాటి కావల నున్నవారి కడ్డులు గావు ఆత్మ మనోబుద్ధ్యాదులకు, ప్రారబ్ధాది కర్మముల కీవల నుండునని చెప్పినచో ముందుదాహరించిన దృష్టాంతములు సరిపోవునేగాని ఆత్మ బుద్ధ్యాదీంద్రియములకు విలక్షణమై, సాక్షియై, స్వయం ప్రకాశమై, అమృతమై, శివమై, బ్రహ్మమై వెలుగుచుండుటవలన పై జెప్పిన

యుక్తులు సరిగావని తెలుపవలసి వచ్చినది ఏలన సూర్యచంద్రాదుల కెన్నియో యోజనముల దూరములో గ్రహణము గలుగుచుండును ఆగ్రహణ మేఘాదులనుగూడ సూర్యచంద్రులే ప్రకాశింపజేయుచున్నారు అట్టిభావమే యిచ్చట చేసికొనవలయును

అట్లుగాక బుద్ధ్యాదులకు, ప్రారబ్ధ కర్మాదుల కీవల ఆత్మ యుండునని జెప్పినచో అట్టి యాత్మ జడమునకన్న జడమయ్యే యుండును ఏలన కర్మలును, బుద్ధ్యాదులును జడములే గదా? బ్రహ్మము, దైవము, ఈశ్వరుడు అని చెప్పు శబ్దము లన్నియు నొకే వస్తువును గురించియే గాని యనేకమును గుఱించి గాదు అయితే బ్రహ్మము తప్ప రెండవ వస్తువు లేదని చెప్పినచో ఈ కానుపించునవన్నియు నేమిటివని యడిగిన నేత్రదోషముచే దృశ్యము చిత్ర విచిత్రముగా గనబడునట్లు నీ కాలాగున గోచరించుచున్నది అని సమాధానము నేత్ర రోగికి వలె, నేత్రరోగము లేనివాని కట్టి దోషము గలదని మనమెట్లు చెప్పగలము? ఇదియు గ్రాహ్యార్థము జెప్పుటకొక యుక్తియేగాని అట్టి యాత్మవిషయములో ఈయుక్తు లన్నియు పనికిమాలినవే ఏలన అప్పుడు రోగమొకటి యాత్మకు భిన్నముగా గలదని యంగీకరించ వలసి వచ్చును అది వేదమాత కిష్టములేదు అనగా శ్రుతి యంగీకరింపదు బోధ నార్థ మెన్నియో యుక్తులను గలుగజేసికొనవచ్చును అది తప్పు గాదు, లేనిచో అట్టి దివ్యపదవిలోనికి సామాన్యజనులకు ప్రవేశము గలుగదు

అట్టి శాశ్వత సత్యమునకు, స్వయంప్రకాశమునకు, దైవమనియు, చైతన్యమనియు, దివ్యలోక ప్రాప్తియనియు, మోక్షమనియు, కైవల్యమనియు, పరమపదమనియు, అమృతమనియు, చైతన్యసారమనియు, అమృత ప్రవాహ మనియు నికనెన్నియో పేర్లు గలవు పరిపూర్ణమనియు, అచల మనియు, నూతనముగా గల్పించిన నామములుగూడ దానివే ఇవి నవీనముగా గనిపెట్టిన పేర్లని కొందరు తలంపవచ్చునుగాని యవి యనాదిగా నుండినవే ఏలన నూతనముగా నొక వస్తువు గలిగినచో కొంతకాలమున కది ప్రాతదైపోవును పురాతనమైనది జీర్ణించి కొంతకాలమునకు నశించిపోవును అది ప్రకృతి యొక్క యలంఘనీయ స్వభావధర్మము నవీనముగా కనుగొనబడినదని

జెప్పిన కొందరు హర్షించవచ్చును కాని యావల వచ్చు కష్టనష్టములను వారు జూచుటలేదు ఏలన ఉండే వస్తు వొకటియే దానికేపేరైన పెట్టవచ్చును పేరులన్నియు అనాదియైనవని గాని, అంతము లేని వనిగాని, యెల్లప్పుడు నొకేరీతిగా నుండిన వనిగాని, స్వయంజ్ఞాన మయ మైనవనిగాని, స్వప్రకాశ ములని గాని, ఆనందఘనీ భూతము లైనవని గాని చెప్పజాలము ఎవరేపేరును పెట్టినను ఆభాషలో పై జెప్పిన యర్థమును నిరూపించి యుండిన చాలును అట్లయిన నది శివము అది సనాతనము ఓమ్

ఈ యతీతబోధ శాస్త్రములలో రహస్యముగా నుంచదగినదని చెప్పబడియున్నది కనుకనే బహ్మజ్ఞానము, రహస్యముగా నుంచదగినదని చెప్పబడియున్నది కనుకనే బ్రహ్మజ్ఞానము రహస్యమనియు, గూఢమనియు, గోప్యమనియు చెప్పుట అయితే అట్టి శాస్త్రములోనే తగిన యోగ్యతగల సర్వజనులకును పిలిచి పిలిచి చెప్పవలయుననిగూడ చెప్పక పోలేదు పిలిచి చెప్పవలయునని చెప్పుటయేగాక అట్టి పరిపక్వ జీవులకు గావలసిన యన్నవస్త్రములను, స్థలముల నిచ్చి యుపదేశించ వలసినదని గూడ శాస్త్రములో జెప్పబడియున్నది దానికంటే పుణ్యము మూడు లోకముల లోను మఱియొకటి లేదని గూడ వర్ణించియున్నారు దాని నాలాగున రహస్యముగానే యుంచవలయును, అనర్హుల కధికారముగాని, ధనముకాని దొరికిన పాడు చేయుదురు గదా! యోగ్యులకు దొరకిన లోకమున కెంతయో మేలు గలుగును మఱియు చిన్నపిల్లవారలకు రత్నములు దొరికిన యప్పచ్చులకొఱకు వాని నిచ్చివేయుదురు లేక పండ్లకొఱకైన వానిని ఖర్చుపెట్టుదురు కావున రహస్యముగా నుంచవలసిదని చెప్పిరేగాని తాననుభవింపకయు, ఇతరుల ననుభవింపనీయకయు, భూతమునకు దొరికిన ధనమువలె పాడై పోవలెనను అర్థము మాత్రము గాదని తెలిసికొనవలయును

సూర్యభగవానుని యొక్క దివ్యప్రకాశము నందరు అనుభవించు లాగున పరమేశ్వరుడు భాస్కరుని నెట్లు సృష్టించెనో, ఆలాగున సర్వేశ్వరుని జ్ఞానమయమగు నాదివ్యజ్యోతి నందరును దర్శించి కృతార్థులు గావలయు ననియే భగవదాశయమై యున్నది నేత్రరోగములేని వారందరు ఆదిత్యునెట్లు

చూడగలరో ఆలాగున అంతఃకరణములో గల జ్ఞానదృష్టి కాటంకమైన తిమిర రోగమును రహిత మొనర్చుకొనువారందరు ఆ పరమపురుషుని, ప్రేమ స్వరూపుని దర్శింపగలరు నేత్రరోగము గలవా రేదేశీయులైనను, ఏ వర్ణస్థులైనను ఏయాశ్రమమును స్వీకరించిన వారైనను, ఆడువారైనను, మగవారైనను, బాలురైనను సూర్యు నెట్లుచూడజాలరో, అట్టితత్త్వమునే ప్రస్తుతము ప్రపంచములో బోధింపవలయును దీనిని గూర్చి యోగ్యతా యోగ్యతలు చెప్ప బడినవే గాని మఱియొక యవస్థనుగుఱించి కాదని యందరు తెలిసికొనవలయును

మఱియు సామాన్య బోధచేత పరిపక్వస్థితికి వచ్చినవారికి మాత్రమే ఈ యతీతబోధ యుపయోగపడును రైల్వే ప్రయాణికులలో మూడవతరగతి జనులధికముగా నున్నట్లు సామాన్యబోధకు తగినజీవులే ప్రపంచములో నెక్కువమంది యున్నారు కావున వారికి తగిన యనుష్ఠానమునే బోధించవలయును ఇది యెక్కువ యుపయోగకరమైనది లేనిచో ఆకాశములోగల చంద్రుని తెచ్చి యిమ్మను చిన్నపిల్లవారి గతియే వీరికి గలుగును కావున ఉత్కృష్టాచార్యుల కరుణగలవారికి, సర్వేశ్వరుని కృప లభించినవారికి, సత్యధర్మములలో నిష్ఠ గలవారికి, ఈ జన్మములోనే ముక్తిగలుగవలయు నని తీవ్ర ప్రయత్నముగల వారికి, ఉత్కృష్టమగు ఆచారము గలవారికిని అన్ని మార్గములును కాలానుగుణముగా గలుగుచుండును ఓంకారసారమగు పరమ పవిత్రమగు, ఈశ్వరమయమగు, శాశ్వతానందమగునట్టి దివ్యసుఖమును, జీవన్ముక్తిని, ఆత్మసాక్షాత్కారమును జీవకోట్లందరును బొంది కృతకృత్యు లగుదురు గాక!

★★★★

ఇంద్రియములను ప్రార్థించుట

ఇంద్రియములారా! మీరు చాల సుకృతమును జేసిన వారలే ఇది యాత్మస్తుతియనిగాని, అతిశయోక్తి యనిగాని తలంపరాదు. అట్లు గానిచో తపస్సుచే పునీతము గాదగిన ఈ దేహములో జేరియుండరు ఇదియు అహంకారమగు వాక్యమని తలంపకుడు సత్య మాలాగుననే యున్నది అయితే మీరందరు పద్మసరోవరములోగల కప్పలవలె నున్నారు ఏలన కమలములలోగల మాధుర్యమును ఎచ్చటనో యుండు తుమ్మెదలు గ్రోలుచుండును ఇది మీయొక్క దోషమని పూర్తిగా జెప్పతగదు ఏలయన ఎట్టి వివేకముగల జ్ఞానులకుగూడ మాయతో గూడిన శరీరబుద్ధి యుండువరకు ప్రమాదము గల్గుచుండవచ్చును అయితే వారు వివేకబుద్ధిగలవా రగుటచే స్వయముగా లోపమును దెలిసికొనిగాని, మఱియొకరు చెప్పిన దానిని గ్రహించుకొని గాని వెంటనే తమ యొక్క స్వభావమును మార్చుకొందురు ఆలాగున మీకును దేహమను అవయవిలో నమరియుండుటచే మైకము కలుగవచ్చును కాని తప్పుదారిలో బోయెడువారు, ఆప్తవాక్యములను వినిగాని, లేక స్వబుద్ధితో తెలిసికొనిగాని యెటుల వెంటనే మరలుచుందురో, ఆలాగున నేను చెప్పెడు వాక్యములను విని, మీయొక్క స్వభావమును మార్చుకొన గోరుచున్నాను మీరెంతో పుణ్యవిశేషముచే ఈ శరీరములో జేరి యున్నారని యింతకు మందే జెప్పబడినదిగదా!

1 కర్ణేంద్రియమా! నీవాకాశాంశమవు ఆకసమెంత నిర్మలముగా నున్నదో, నీవును ఆలాగున నుండవలసినవాడవు గదా! కారణమునుండి గలుగు కార్యము లన్నియు కారణవ్యతిరేకములు గావు కనుక గగనమువలె స్వచ్ఛముగా నుండుము నీవేల బాహ్యవిషయముల వినగోరుచున్నావు? శబ్దానందమునం దాసక్తిగలిగిన లేడి యేలాగున బోయవారి వలలో చిక్కుకొని చనిపోవుచున్నదో ఆలాగున చెడకుము! ఒకవేళ సంపూర్ణనిగ్రహము గలుగుటకు నీకు ప్రయాసమని తోచిన, దైవ వాక్యములను, ధర్మవాక్యములను వినుము లేక అంతర్ముఖుడవై ప్రణవనాదమును వినుచుండుము అట్లు

గానిచో స్వరూప స్వరముల నాలకించుచు స్వరూపానందములో నుండుము అట్లైన చాల మేలు గలుగును అప్పుడు నీకు గలిగెడు సుఖమింతంత గాదుసుమా!

2 స్పర్శేంద్రియమా! నీయొక్క పూర్వవృత్తాంతమును మరచి పోయితివి నీవు వాయువునుండి పుట్టినవాడవు వాయు వేలాగున నిర్మల ముగా నున్నదో నీవును ఆలాగున నుండవలసిన వాడవే గదా! అయినను మాయయొక్క మహిమచే నిన్ను నీవు మరచియున్నావు ఇప్పుడు మంచిమాట లను చెప్పుచున్నాను స్పర్శసుఖమునకు వశపడిన యేనుగు గర్తములో ద్రోయ బడి దుఃఖమును బొందుచుండును బాహ్య స్పర్శ సుఖములకు వశపడితివా నీయొక్క గతియును ఆయేనుగు గతివంటిదే యగును గొప్ప సుకృతవశ మున ఈ కాయములో వచ్చిచేరినావు. కావున దుర్గతి నొందక సద్గతి నొందుము అట్లు పూర్తినిరోధము గలుగుట ప్రయాసమని తోచినచో భగవత్ప్రసాద ములగు చందన,విభూతులను ధరించుకొనుము అట్లుగానిచో ప్రకృతిచే నిర్మింపబడిన శుద్ధములగు ఎండ గాలులచే సుఖింపుము దీనిచే తృప్తి గలుగనిచో ప్రకృతియొక్క స్పర్శము గలుగని దైవములో నిలకడ గలిగి యుండుము అంతేగాని దుస్స్పర్శములకు లోబడి గజముచందమున చావకుము

3 ఓ నేత్రేంద్రియమా! ఎంతయో పుణ్యవిశేషముచే ఈకాయము నాధారముగా గలిగియున్నావు కాని నీయొక్క నైజస్వభావము అగ్నితత్త్వము అగ్ని యేలాగున అన్నిటిని దహింపజేయునో, ఆలాగున పాపములను జూచునపుడు వానిలోగల దోషములను దహింపజేయుము తనలోనికి ప్రవేశించిన సుగంధ వస్తువు లన్నిటిని గాల్చి అగ్ని తన యొక్క నైజ స్వభావమగు అగ్నిగా నేలాగున మార్చివేయునో, ఆలాగున కన్నులార జూచెడు అన్ని వస్తువుల యొక్క ప్రకృతిబుద్ధుల నశింపజేసి, చిన్మయ జ్ఞానస్వరూపముగ జేసికొనేలాగున చూడుము ఆలాగున చేయక పురుషులైనచో స్త్రీలను, స్త్రీలైనచో పురుషుల జూచి మోహము నొంది, దానిలోబడి పోయినచో, అగ్నిని జూచి మంచిపదార్థమని భ్రమించి దానిలో బడిపోయిన మిడుతవలె

దహించిపోదువు పూర్ణనిగ్రహము చేయ శక్తిలేనిచో పుణ్యాత్ములను, పుణ్యాశ్రమములను, పుణ్యస్థలములను జూచి సంతోషము నొందుము అట్లుగానిచో సర్వేశ్వరునియొక్క ప్రకృతి నిర్మాణమును జూచి యానందించుము అట్లు గాకపోయిన అంతర్దృష్టి గలిగి లోపల జరుగుచున్న దివ్యోత్సవము నవలోకించి సంతోషము గలిగియుం డుము దీనివలన తృప్తి నొందక పోయిన నిన్ను మొదలుకొని సమస్తమును ప్రకాశింపజేసెడు దివ్యుడగు దైవమును జూచి యానందించి యానందపర వశుడవై కట్టకడ కానంద మయుడవై యుండుము అంతేగాని, అగ్నిలో బడిపోవు మిడుతవలె దృశ్యములగు చిత్రవిచిత్రములగు విషయములలో బడిపోయి వ్యర్థముగా చావకుము

4 ఓ రసనేంద్రియమా! బహుకాల తపోమహిమవలన ఈదేహము లోనికి వచ్చి చేరినావు

నీకు మంచి మంచి రుచులుగల వస్తువులను భుజింపవలయునని గదా కోరిక గలిగియున్నది! అది చాలా మంచిదేగాని, మోహము నొంది యేల విషసదృశములగు దృశ్యవిషయ రసములను గోరుచున్నావు? వానివలన గలిగెడు విపత్తులు నీకు తెలియక యుండవచ్చును చెప్పెద సావధానముగా ఆకర్ణింపుము నీయొక్క మూలము జలము ఆజల మేలాగున అన్ని మాలిన్య ములను తనలో నడుగు భాగమున నణచి వేయుచున్నదో, ఆలాగున ఏరసము వచ్చినను దానికి వశపడక యణచివేయుము గాలమున గల మాంసము నాశించిన చేప లేలాగున ఘోరతమమగు మరణము నొందుచున్నావో, ఆలాగున బాహ్యవిషయములగు మాంసాది రుచులను, విషయ సుఖములను, దృశ్యరసములను, గోరుచుండిన నీకును అట్టి యవస్థయే గలుగును కావున ఒకేసారి యన్ని రసములను త్యజింప ప్రయాసమని తోచిన భగవన్నివేది తములగు ప్రసాదముల బుచ్చుకొనుము వానివలనను తృప్తి నొందక పోతివేని బ్రహ్మనిష్ఠ కనుకూలమగు శుద్ధవస్తువుల గ్రహించుము దానిపై భగవద్భక్తి రసామృతమును పానము చేయుము అదేరీతిగా భగవద్జ్ఞానామృతమును, కారుణ్య పీయూషమును, శాంతిరసమును, ప్రేమ సుధను, పానముజేసి

సౌఖ్యము గలిగియుండుము మఱియు ఖేచరీముద్రవలన గలిగెడు యోగామృతమును భుజింపుము ఇది చాలా మంచిది భవరోగమును రహితమొనర్చును. కాని దీనివలన కృతార్థుడ నైతినని మాత్రము తలంచకుము రసనేంద్రియమున కందని బ్రహ్మానంద రసమయుడవై బ్రహ్మమయుడవై యుండుము ఇదియే యంతిమస్థితి యని తెలిసికొనుము అంతేగాని మత్స్యమువలె దృశ్యవిషయములో మునిగి చెడిపోకుము

5 ఘ్రాణేంద్రియమా! ఇక నీయొక్క సంగతి కొంత చెప్పవలసియున్నది ఎంతో సుకృత విశేషమువలన ఈశరీరములో జేరితివి నీకు మూలము పృధివి అది యేలాగున ఎన్ని మాలిన్యములు వచ్చినను వానిని తనలో ఐక్యపరచి యేలాటి మాలిన్యము లేకుండ చేయుచున్నదో, యాలాగున ఎట్టి దృశ్యవిషయములు వచ్చినను నీలో మలిన రహితమొనర్చి శుద్ధము చేయుము అంతేగాని బాహ్య సుగంధములకు వశపడి పోయితివా, నీగతి దుర్గతియే సుమా! ఏలన వాసనకు వశపడి తుమ్మెద యేలాగున చంపక పుష్పసుగంధము నాశించి దానిలోబడి నశించిపోవునో, ఆలాగున బాహ్యవిషయములకు లోనైనచో, ఆ తెలివిలేని తుమ్మెదవలె నశింపగలవు కాని యేకకాలమున నిగ్రహశక్తి గలుగజేసికొనుటకు ప్రయాసమని తోచిన భగవదర్పిత పుష్పచందనాదులచే తృప్తి నొందుము ఆపైన యోగధారణచే గలిగెడు అంతర్ముఖ దివ్యసుగంధము నాఘ్రాణించుచుండుము దీనితో పూర్తియైనదని తలంచక ఘ్రాణేంద్రియమునకు విలక్షణమై, అట్టి గంధ విషయమునకు సాక్షియైయుండు నిజాత్మలో నుండుము దానివలన జన్మ రాహిత్యము గలిగెనని సంతసించుము అంతేగాని విషయానందమునకు లోబడి చంపక కుసుమమునకు వశపడిన భ్రమరమువలె వ్యర్థముగా చావకుము జ్ఞానేంద్రియములారా! ఇప్పుడు మీకు చెప్పవలసిన ధర్మము యొక్క మూలమును చెప్పితిని. ఇది సంగ్రహమైనను ధర్మముయొక్క సారము గలది దీనియొక్క రహస్యమును దెలిసికొనిన జీవన్ముక్తులు గాగలరు భవరోగ దుఃఖములో బడిపోరు

కురంగాళిపతంగేభమీనాస్త్వేకైకశో హతాః ।

సర్వైర్యుక్తైరన ర్థైస్తు వ్యాప్తస్యాజ్ఞః కుత స్సుఖమ్ ॥

శబ్దముచేత లేడియు, గంధముచేత భ్రమరము, రూపము చేత మిడుత, స్పర్శముచే గజము, రసముచే మీనము–ఇవి ఒక్కొక్క యింద్రియ విషయముచేతనే నశించుచున్నవి ఇట్లుండగా నీ యైదింద్రియముల విషయములతోను, గూడిన యజ్ఞుడైన మనుష్యునియొక్క స్థితిని గూర్చి యేమని చెప్పవచ్చును!

వేదాస్త్యాగశ్చ యజ్ఞాశ్చ నియమాశ్చ తపాంసి చ ।

నైవాజితేంద్రియస్యేహ సిద్ధిం గచ్ఛంతి కర్హిచిత్ ॥

వేదములు కడవఱకు చదివినను, విరాగియై సమస్తమును విడిచినను, అశ్వమేధాది యజ్ఞము లన్నిటిని విధిప్రకారము చేసినను, నియమముల నన్నిటి నాచరించినను, కృచ్ఛ్ర చాంద్రాయణాది తపస్సు లనేకములు చేసినను, ఎవనికి ఇంద్రియ నిగ్రహ మీ లోకమునం దున్నపుడే గలుగదో, అట్టివానికి పై జెప్పిన క్రియలెవ్వియు, ఎప్పుడును సిద్ధిని గలుగజేయవు

1 కర్మేంద్రియములారా! మీరును పై జెప్పిన జ్ఞానేంద్రియములవలె చాలా సుకృతవిశేషమువల్లనే ఈ తనువులో వచ్చి చేరియున్నారు కాని దానివలన గలుగవలసిన సౌఖ్యమును పొందక యున్నారు మీలో వాగింద్రియము మొదటివాడు ఓ వాగింద్రియమా! నీవును శ్రేయస్సునే కోరుచున్నావు కాని మాయాభ్రమచే దానికి భిన్నమైన కార్యములనే చేయుచున్నావు ఇంత మంచి నివాసము దొరకియు ఏల చెడుమాటలు, క్రూర వచనములు, అనృతములు, దూషణములు, వ్యర్థవాక్యములు చెప్పుచు దుఃఖమును పొందుచున్నావు?

కావున నాయనా! నీకు మంచి మార్గమును జెప్పెద, సత్యముగాను, శాంతముగాను, ప్రేమాన్వితముగాను మాట్లాడుము ఇది యమృతమును గలుగజేయును నాయొక్క వాక్యముల నాలకించి మంచిమార్గ మునకు రమ్ము, దైవవాక్యములను, ఉపనిషద్వాక్యములను ఉచ్చరించుకొని యమృతత్వము నొందుము అట్లైన నీకు ఈ కాయములో నమరినందుకు తగిన ఫలము గలుగును అసత్యవాక్యముల నాడి నందుచే గదా బ్రహ్మదేవుని శిరస్సునుగూడ

ఈశ్వరుడు త్రుంచి పారవేయవలసి వచ్చినది! సత్యవాక్పరిపాలనముచేగదా హరిశ్చంద్రుడు సద్గతిని బొందెను! కనుక నీరెండు సంగతులను జ్ఞాపకము చేసికొని మంచిమార్గమున నడుపుము బ్రహ్మనిష్ఠు లుండు స్థలమున నెమ్మదిగా మాట్లాడుము వారి ధ్యానకాలములో నిశ్శబ్దముగా నుండుము అట్టివారుండెడు స్థలములయందేగాక ఆలాటి పుణ్యప్రదేశముల యందెచ్చటనైనను ఎంగిలి నూయకుము అది అట్టి పుణ్యపురుషుల కాళ్ళయందు దగులవచ్చును! కావున ఎల్లప్పుడు మెలకువ గల్గియుండుము అట్లైన నీ కెచ్చట నైనను శ్రేయస్సే గలుగును

2 పాణీంద్రియమా! నీవును విశేషభాగ్యమువలననే యీ కళేబర ములో వచ్చి చేరియున్నావు అయితే దానివలన పొందవలసిన పూర్ణ ఫలమును పొందకపోవుచున్నావు ఈ కరములచే సుకృతకార్యముల జేయుము, భగవత్ప్రీతికరములగు పనులు, సాధుసేవయు, దీనజన సంరక్షణయు, పరోపకారము నాచరించుచుండుము అప్పుడే నీవు కృతార్థత నొందగలవు అట్లుగాక దీనివలన హింస, పరప్రాణులకు బాధ గలుగజేయుట, ఏదైన తాకుటకు తగనిదానిని పట్టుకొనుట మొదలగు దుష్కృత్యముల నొనర్చితివా? మఱల దానివలన దుఃఖములే గలుగును పుణ్యవతియగు ద్రౌపదిని పట్టుకొనుటవలన దుశ్శాసనుడు పొందిన దుర్గతిని జ్ఞాపక ముంచుకొనుము కరముచే నీశ్వరు నర్చించిన మార్కండేయాది మహర్షులెంత యుత్తమమగు శివలోకమును బొందిరో ఆ సంగతులను యోచించుకొని సన్మార్గుడవు గమ్ము కృతకృత్యుడవైన తప్ప కృతార్థత గలుగదు. అసత్యమగు చేవ్రాలు చేయకుము ఒకరికి నొప్పి గలిగేలాగున ఉత్తరములుగాని, గ్రంథములుగాని వ్రాయకుము

3 పాదేంద్రియమా! నీ వీదేహమునంతయు ధరించుచున్నావు కాని కృతార్థత చెందవలసిన కార్యమును మరచి పోవుచున్నావు. జన్మాంతర పుణ్యఫలమువలన నీకును ఈ దేహములో స్థానము దొరకినది ఆ పుణ్య విశేషమును వ్యర్థపరచకుము మదించి కన్ను దెలియక నడవకుము అందువలన అనేక ప్రాణికోట్లకు బాధ గలుగవచ్చును మఱియు పాపస్థలము లోనికి వెళ్ళకుము పుణ్యప్రదేశములోనికి సదా వెళ్ళుచుండుము పుణ్యపురు

షులుండు స్థానములకును, దీనజనుల సంరక్షించుటకు తగిన ప్రదేశమునకు మాత్రమే వెళ్ళుదునని యొక వ్రతమును సంకల్పించుకొనుము నీవు ఆలాగున సంకల్పించిన తక్కిన యింద్రియము లేమియు చేయజాలవు నిన్నాశ్రయించియే యెవరైనను ఎచ్చోటికైనను పోగలరు కావున సన్మార్గములో వెళ్ళుట కొరకు నిన్ను బ్రతిమాలుకొనుచున్నాను శ్రీబుద్ధదేవుడు తన దివ్యపాదములచే మొదట అనేక పుణ్యాశ్రమముల, పుణ్యక్షేత్రముల సంచరించియే విజ్ఞానము నార్జించి ప్రపంచమంతటను జ్ఞానమును వెదజల్ల గలిగెను చూడుము, ఇంద్రుడు గౌతమాశ్రమమున చెడుకార్యము కొరకు సంచరించినందుచే శాపగ్రస్తుడై పాపము నొడిగట్టుకొనెను

4 ఉపస్థేంద్రియమా! రహస్యేంద్రియమా! జననమరణముల యొక్క రహస్యమంతయు నీలోనే యున్నది నీవు తెరువబడినచో నరక ద్వారము తెరచినట్టే యని తలంచుము నీవు మూయబడిన నరకద్వార నిరోధము గలుగునదేగాక, ముక్తి ద్వారము తెరువబడినదనియే నమ్ముము సృష్టియొక్క బీగము(తాళపు చెవి) నీ కరస్థమై యున్నది నీవు సృష్టికి హేతువైన మార్గమును తెరచితివా, సంసార దుఃఖము తప్పదు నీవు దానిని సదా తాళము వేసి యుండిన ముక్తియును కరస్థము, సందేహము లేదు నా తండ్రీ! ఎవరు ఏ సమయమున ఏ విధమైన ప్రోత్సాహము జేసినను తెరవకుము సనక సనందనాది యోగులును తెరువక జాగరూకులై భద్రముగా చూచుటవల్లనే వారికి బ్రహ్మరంధ్ర పర్యంతముగల మోక్షద్వారము లన్నియు ప్రయాసములేక సులభ ముగా తెరవబడెను నీవు తెరచియుండు కాలపర్యంతము మనుజులకేగాక, దేవతలకేగాక, త్రిమూర్తులకు సహితము సంసారదుఃఖము గలుగుచునే యుం డును ఈ తత్త్వము నెఱింగియే ఋషులును, యోగులును, సృష్టిద్వారమును చక్కగ నిరోధించి యుండిరి కనుకనే వారు అతీంద్రియ జ్ఞానమును, ఈశ్వర సాక్షాత్కారమును కష్టము లేక పొందిరి

అయితే ఇది చాలప్రయాసమైన సంగతియని తెలియక పోలేదు అంతఃకరణములో గల జన్మాంతర దృశ్య సంస్కారము లుండువఱకు ఇది మూయుట కష్టతరము ఈశ్వరకృపయు, గురుకరుణయు విశేషపుణ్య

సంస్కారమును గలిగినప్పుడే దీనిని మూయుటకు శక్తి గలుగును ఈ విషయములో అనేకయోగులును, ఋషులు సయితము అనేక పర్యాయము లపజయమును బొందియున్నారు అయినను వారనివార్య ప్రయత్నముచే కొంతకాలములోనే విజయము గలిగినవారలైరి కనుకనే గృహస్థాశ్రమము నొకదానిని ఋషు లేర్పరచిరి దానికి అనేకకాలనియమము లేర్పాటుచేసిరి దానియొక్క పరీక్షలో నెగ్గినవారికి వానప్రస్థ యత్యాశ్రమముల కర్హత గలదు బ్రహ్మచర్యములో నుండిగాని, గృహస్థాశ్రమములో నుండిగాని, వానప్రస్థా శ్రమములో నుండిగాని ఈ సృష్టిద్వారము బాగుగా మూయబడెనని తోచిన అచ్చటనుండి యే తురీయాశ్రమమును స్వీకరింపవచ్చునని ఋషులు తెలిపియున్నారు దీనియందు జయము గలిగినచో ప్రకృతి యంతయు జయింప బడినట్లే యని తెలిసికొనవచ్చును

ఇది తెరచిన గల విషయము విషమమే, విషమయమే, మూసినచో గలుగునది నిర్విషయము, అమృతమయము విషామృతముల సంధి యిచ్చట నుండియే మారుచుండును ఇవే యీ జీవునికి ఊర్ధ్వాధో మార్గములు అనగా నిరోధించిన నూర్ధ్వగతియు, నిరోధము లేక పోయిన అధోగతియు నీ జీవునికి గల్గుచుండును ఈ విషయములో స్త్రీపురుష లుభయులును సమానులే సృష్టికి హేతువైనందుచేతనే దీనియొక్క యధిదేవత ప్రజాపతియని శాస్త్రము చెప్పుచున్నది అనగా సృష్టికర్తయని యర్థము దీనియొక్క సంయమము గల్గినవారు సృష్టి, స్థితి, లయములకు హేతువగు భవసాగరమున పడరు జయించినవారు సృష్టికర్తనుగూడ జయించిన పరమశూరులనియు, ధీరులనియు గ్రహించుకొనవలయును అంతేగాదు చరాచరమగు జగత్తు నంతయు కాలచక్రము పైనిడి త్రిప్పుచుండు ప్రకృతినిగూడ జయించిన వారగుదురు

5 ఇంతవరకు వాగాదులగు నాలుగింద్రియముల గురించి సంక్షిప్త ముగా జెప్పడమైనది ఇప్పుడు పాయ్వింద్రియమును గుఱించి చెప్పవలసి యున్నది అయితే యిది రహస్యేంద్రియము వంటి దారుణకృత్యములను జేయదుగాని వివేకము తక్కువగుటవలన బంధనమునకు హేతుభూతములగు

చిన్న చిన్న కృత్యములను చేయుచుండును చిన్నదని తలంచి యూరకుండ రాదు అనేకములగు చిన్నచిన్న వస్తువులు చేరునప్పు డవియన్నియు కలిసి యొకగొప్ప వస్తువగును జలరేణు సముదాయము చేరి మేఘమైనప్పుడు అంతప్రకాశమైన సూర్యుడుగూడ మరుగుపడుచున్నాడు కనుకనే మహాత్ములు ఒక చిన్న పనినైనను చెడుదానిని చేయరు విషము కొంచెమైనను అది గొప్ప విపత్తును గలుగ జేయును అగ్ని యొక్క మిణుగురైనను ప్రజ్వలింప దొడగిన ప్రపంచము నంతయు గాల్చివేయును

పాయ్వింద్రియమా! నీయొక్క జన్మసాఫల్యము వలననే యీ దేహములో వచ్చి చేరియున్నావు కావున నీవుగూడ మంచికార్యముల జేసి తరింప జూడుము నీవు చేయు చెడుకార్యములు నీకు తెలియకనే చేయుచున్నావు అవి యెవ్వియనగా మార్గముయొక్క ప్రక్కనే మలవిసర్జనము చేయుట దీనిని అనేక మహాత్ములు, పుణ్యపురుషులు చూచి యసహ్యపడుదురు అది యొక శాపమువలె నీకు తగులును అంతేగాక పేడపురుగులు మలమును ఉండలుండలుగా జేసికొని దారిలోనికి తీసికొనివచ్చును అది కొందఱి కాళ్ళలో తగులును వారు దానివలన హేయపడుదురు ఏనీచాత్ము డీలాగున చేసెను? లేక యేమృగప్రాయు డీలాటిపని జేసియుండును? అని తలంతురు అదియు నొకవిధమగు శాపమువంటిదే! కనుక దారిప్రక్కన ఎచ్చటను ఆలాటిపని జేయరాదు

దారికి దూరమైనను జాగ్రత్త పడనిచో మఱికొన్ని కష్టములు గలుగును ఎవ్వియనగా చాలా మందికి ఏదో ఒక విధమగు వ్యాధిగల్గి యుండవచ్చును మలములో నీగలు ప్రవేశించి జలము మొదలగు అనేక వస్తువులలో ఆవ్యాధిని ప్రవేశింపజేయును అది మనుష్యలకు గూడ వ్యాపించును మఱియు గాలిలోగూడ ఆ సాంక్రమికక్రిములు వ్యాపించి జనులకు అపాయమును గలుగజేయును ఇంకొక రహస్యమును జెప్పద మలములో వ్రాలిన ఈగలు పుష్పములలోను, వీధులలో నమ్ముచుండు మిఠాయి మొదలగు పదార్థములలోను వ్రాలును కావున నవియు వ్యాధిని గలుగజేయును కనుకనే వీధిలో నమ్ముచుండు పిండివంటలు మొదలైనవి

తినగూడదని పరిశుద్ధాత్ములు చెప్పెడు రహస్యము భూమిపై మలవిసర్జనము జేసిన కొన్ని రోజులవఱ కాప్రదేశమున వాయుమండల మంతయు చెడువాసన గల్గియుండును అట్టి మాలిన్యముగల ఈగలు వ్రాలిన పుష్పములను గదా భక్తులు భగవంతునికి పూజ చేయుచున్నారు! కాబట్టి యీలాటి దోషము లన్నిటిని దలంపక నీవు ప్రవర్తించుచున్నాడవు

అట్లైనచో సాధారణ గ్రామములలోనుండు జనులు పురీష విసర్జనమును జేయక యెట్లు జీవింతురని తలంపనక్కరలేదు పరమేశ్వరుడు దానికి తగినయేర్పాటు చేసియున్నాడు అది చిన్నమృగమైన మార్జాలము మనకు నిత్యమును ఉపదేశించుచున్నది పిల్లి మలవిసర్జనము జేసిన వెంటనే మట్టితో మూసివేయును అందువలన రెండుమూడు రోజులలో మట్టిలో కలిసిపోవును ఆలాగున మనుజుడును మట్టితో మలమును మూసివేసిన ఏలాటి దోషమును గలుగదు మట్టియందొక విధమగు సూక్ష్మక్రిములు గలవు అవి యెటువంటి దుర్వాసనగల వస్తువు నైనను మట్టిలో రహితమొనర్చును ఈక్రిములే యెరువును జీర్ణపరచి ఓషధుల కాహారమునుగా మార్చుచున్నవి ఓహో! దీనిని జూచిన కరుణామూర్తియగు పరమేశ్వరుని యొక్క సృష్టి మహిమను, మనుష్యులయందు గల దయయును ఎంతయని వర్ణించగలము? ఈసూక్ష్మక్రిమియొక్క పనిని ప్రస్తుతము వ్యవసాయ శాస్త్రజ్ఞులు కనిపెట్టినను తెలిసియో, తెలియకయో, పూర్వమునుండియు జనులు వృక్షములకు ఎరువును పెట్టునపుడు మట్టితో కలిపి పెట్టవలయుననెడు రహస్యమై యున్నది కావున గుదేంద్రియమా! నీవీలాటి తెలివిలేని పనిచేయక జాగ్రత్తగలిగి జీవింపుము అట్లైన నీకు మృత్యువువలన బాధ గలుగదు నీయొక్క యధిదేవతయు మృత్యువుగదా!

ఈ పైజెప్పిన విషయములన్నియు వినునప్పుడు సామాన్యజనులు ఏమైన తలంచవచ్చును కాని దానివలన కలుగు మేలుకీడులను యోచించిన నెంతయో యుపయోగకరముగా నుండును, దీనియొక్క రహస్యము విజ్ఞులకు బాగుగా తెలియును ఓపాయ్వింద్రియమా! నీవు పై జెప్పిన పాపకార్యములను జేసినచో మృత్యువునకు లోబడి సంసార సంకటములోబడి విపత్తు

బొందగలవు అట్లు చేయక దీనియొక్క నిగ్రహము గలిగి వర్తింపుము ఇదియే నీవు చేయవలసిన యుపకారము దీనినే పాయ్వింద్రియ నిగ్రహమని మహనీయులు చెప్పుదురు ఇంతవఱకు తెలియక యెంతమంది మహాత్ములకు అనిష్టమును గలుగజేసితివో దానిని తెలిసికొని పశ్చాత్తాపమును బొందుము ప్రాయశ్చిత్తమునుగూడ జేసికొనిన మంచిది పశ్చాత్తాపముచే పాపము నశించును ప్రాయశ్చిత్తముచే పుణ్యము వృద్ధియగును పుణ్యాభివృద్ధివలన సత్త్వగుణము గల్గును సత్త్వగుణమువలన అంతఃకరణ శుద్ధి గలుగును అంతః కరణ శుద్ధి యగునప్పుడు వైరాగ్య మంకురించును దానివలన ప్రకృతినుండి విముక్తి గలుగవలెనని దృఢసంకల్పము గల్గును అందువలన నీశ్వరధ్యానము లభించును ఈశ్వరభక్తివలన ప్రకృతిదోషము శమించును ప్రకృతి దోషము క్షయము నొందగా పరమాత్మ సాక్షాత్కారమును జేసికొన వలెనను సంక ల్పము ఉదయించును అట్టి సంకల్పము తీవ్రమైనపుడు బ్రహ్మవేత్తలగు గురువు లను వెదుకవలెనని విచారము గలుగును అప్పుడు వారివలన బ్రహ్మతత్త్వ జ్ఞానో పదేశమును బొంది యేకాంత ప్రదేశములోనుండి గురువాక్య శ్రవణము దృఢమగుటకొరకు మనన నిదిధ్యాసముల జేయవలయుననెడు సంకల్పము గల్గును ఏకాంతమున నిదిధ్యాసనము రూఢిగా గల్గునప్పుడు సంకల్పము లన్నియు నశించి శుద్ధమైన సాక్షాత్కారము జీవులకు గలుగును

★★★★

అంతరింద్రియములను ప్రార్థించుట

ఇక చెప్పవలసినది అంతరింద్రియములను గురించినది ఈయంత రింద్రియములు ఒకే బ్రహ్మదేవునికి చతుర్ముఖములవలె మనస్సనియు, బుద్ధి యనియు, చిత్తమనియు, అహంకారమనియు నాలుగు విధములుగా నున్నవి వీరు నల్వురును గొప్ప ప్రభువుదగ్గర నల్వురు మంత్రులవలె నున్నారు వీరిలో బుద్ధి ప్రధానమంత్రిగా నుండినను మనస్సే సకలకార్యములను జేయుటలో ముఖ్యుడై యున్నాడు

ఓమానసేంద్రియమా? నీవును అత్యధిక పుణ్యవిశేషముచేతనే ఈ హృదయములో చేరియున్నావు కఠినులై క్రూరకృత్యములను జేయువారి హృదయములలో నున్నచో నీకు గలిగెడు సంకట మింతింత గాదుగదా! ఎన్నియో కష్టములకు లోబడి యనేకులు సంతాపమును బొందుట చూచుట లేదా? అట్లుగాక యిట్టిహృదయములో చేరియుండియు నీవేల దుఃఖ కార్యముల గూర్చి చింతించుచున్నావు ప్రపంచములోగల ప్రాణులన్నియు సుఖమునే కోరుచుండును, నీవేల దుఃఖమును కోరుచున్నావు? నీకు మంచి మార్గమును జెప్పెద, నామాట వినుము, మిక్కిలి సౌఖ్యము గల్గును

పక్షులను బట్టువారు, ఎలుకలను చంపువారు విషము గలిపిన యన్నాదివస్తువులను తిననిచ్చి జంతువులను వధింతురు తెలివిలేని యాప్రా ణులు పదార్థములలోగల విషమును తెలిసికొనజాలక తిని చని పోవుచుండును ఆలాగున నీవును విషయమును విషముతో గూడిన దృశ్యవస్తువులను గోరుచుండినచో తెలివిగల నీకును, తెలివిలేని యా క్షుద్రజంతువులకును ఏమి భేదము గలదు? నీవు మంచివాడవైనచో నీవు చేరిన యతని జన్మ మంచిది యగును నీవు చెడ్డవాడవైనచో యతని జన్మ చెడ్డదే యగును నీవు మంచివాడవైనచో విషమును అమృతముగా జేయగలవు నీవు మంచివాడవైన శత్రువులందరును మిత్రులే నీవు చెడ్డవాడవైన ప్రాణమిత్రులుగూడ

పరమశత్రువులే

కావున ఓతండ్రీ! నీకు సుఖము గదా కావలసినది! బ్రహ్మాండములోగల సమస్తసుఖముల కాధార మాత్మ అనగా బ్రహ్మము అది నీవుండు హృదయములోనే గలదు నీయొక్క దృష్టిని పైకి మరలించిన దానిని కనుగొనగలవు నీవు దృష్టిని క్రిందికి ద్రిప్పినందుచే దుఃఖములతోకూడిన యీప్రకృతి గనుపించుచున్నది చేతిలోగల యద్దమును లోభాగమునకును, బయటికిని త్రిప్పిన తనను జగత్తును, నొక క్షణకాలములోనే యెట్లు కనుగొన గలుగుదురో, ఆలాగున ఆత్మముఖముగా తిరిగిన బ్రహ్మమును, జగన్ముఖ ముగా తిరిగిన ప్రకృతికృత దుఃఖప్రపంచమును గనుగొనగలవు కనుక యంతర్ముఖుడవు గమ్ము! అప్పుడనంతానందము గలుగును ఈ ప్రపంచా నందము గలిగినను అతిత్వరలోనే నశించును అది యటువంటిది గాదు అనంతకాల మనుభవించినను కొంచెమైనను తరుగదు కావున నేను చెప్పు వాక్యముల నాలకించి శాంతము గలిగి నిరంతరము ఆత్మలో గలిగెడు దివ్యసు ఖమును అనంతకాలమువఱకు అనుభవించుచుండుము

నీవు శాంతముగా నుండిన ఈలోకమంతయు పరమశాంతి మయమే అట్లుగాక యశాంతిని గలుగజేసితివేని లోకమంతయు దుఃఖమయము నీకు కరుణ గలిగిన ప్రపంచ మంతటను కరుణారస ప్రవాహము వెల్లువయై పొంగి ప్రవహించుచుండును నీవు కారిన్యమును వహించిన స్వర్గలోకము గూడ నరకతుల్య మగును నిజముగా విచారించిన స్వర్గలోకములను, నరక లోకములను నీవే సృష్టించుచున్నావు వెయ్యేల? బంధమును, మోక్షమును కల్పించువాడవు నీవుతప్ప మఱియొక డేలోకములోను నెవడును లేడు ముక్తిద్వారముయొక్క బీగము నీచేతియందున్నది మంత్రియొక్క చేతిలో లోకముయొక్క కీలక మేలాగున నమరియుండునో, ఆలాగున నీయొక్క యరచేతిలో లోకములయొక్క సుఖదుఃఖము లమరియున్నవి నీయొక్క యధిదేవత చంద్రుడు అతడేలాగున చల్లదనము గలిగియుండునో, తండ్రీ! నీవును అట్టి శాంతస్వభావము గ్లిగియుండుము నీవును బాగుపడగలవు నేనును నిత్యసుఖమగు దైవసుఖము నొందగలుగుదును నీవుదయించిన

మూడులోకము లావిర్భవించును నీవు లయ మొందినచో లోకత్రయమును లయించును కావున నోమానసమా! పుణ్య పురుషు లేలాగున పరమశాంతులై, కరుణారసభరితులై, వైరాగ్యనిధులై యున్నారో ఆలాగున నుండుము అట్లయిన చాలసౌఖ్యము గలదు

ఓమనసా! నీవు చేయుపని సాధారణమైనది గాదు నీకిష్టమైన దేవతలను రాక్షసులనుగాను, రాక్షసులను దేవతలనుగాను జేయగలిగినంత శక్తి యున్నది ఆలాగున నీకిష్టమైన, దేవతాస్త్రీలనుగూడ పిశాచములుగా మార్చగలవు పిశాచములను దేవతాస్త్రీ శ్రేష్ఠలనుగాను ఒక క్షణకాలములో జేయగలవు మలిన వస్తువును నిర్మల వస్తువుగాను, వికారమైనదానిని మిక్కిలి సుందరముగాను సృష్టింపగలవు ఒక క్షణములో భూర్భువాదులైన యేడులోకములను తిరిగి రాగలవు మఱియొక క్షణములోనే అతల, వితల, పాతాళాది లోకములను సంచరించి వత్తువు నీకిష్టమైన దినములు, వారములు, సంవత్సరముల వఱకును ఒకేస్థలములో కదలక మెదలక యుండ గలవు సంవత్సరములేమి, యుగములు, కల్పముల పర్యంతము నీవు నిశ్చలముగా నుండదలంచిన నిన్ను చలింపజేయు వారెవ్వరును లేరు నీయొక్క మహిమ యట్టిది ఇట్టి నిన్ను సృష్టించిన బ్రహ్మదేవునియొక్క మహిమ నేమని వర్ణింపవచ్చును? వెయ్యేల నీవు తలంచినచో అసాధ్యమగు పని మఱియొకటి లేదుసుమా? నిన్ను వర్ణింప నెవరి తరము? కావున ఈ దేహములో చేరినందుకు ఓ పుణ్యాత్ముడా! శాంతిగల్గియుండుము

నిన్ను స్వాధీనము నందుంచుకొఱకే సనకాదిమహర్షులు యోగశాస్త్ర ముల రచించిరి నిన్ను బాగుపరచుటకొఱకే నారదాది మహర్షులు భక్తి మార్గము నేర్పరచిరి నిన్ను శుద్ధముగా జేయుటకొఱకే వ్యాసాది ఋషులు జ్ఞానమార్గమును సృష్టించిరి, నిన్ను ఋజుమార్గమున ప్రవేశ పెట్టుటకొఱకే శ్రీకృష్ణ భగవానుడు నిష్కామ కర్మయోగమును నిర్మించెను నీవు ఎవరిదగ్గఱ శాంతము గలిగియున్నావో వారిజన్మము ధన్యము వారు దైవసుఖమును బొందగలరు ఎందరో భక్తులు నీవలన శాంతినొందక సంకటపడుచున్నారు ఎందరో యోగులు నీయొక్క దుష్కృత్యమువలన మనశ్శాంతి నొందక

పరితపించుచున్నారు ఎందరో ధర్మాత్ములు నీయొక్క దుశ్చేష్టవలన పదచ్యుతులై పరితాపము నొందుచున్నారు దీనివలన నీకు పాపము లేదా, పుణ్యాత్ములను నొప్పించుట మంచిదా. కావున ఇకమీద నట్టి దుష్కృత్యముల నెప్పటికి చేయకుము, సజ్జనులకు హితమును గలుగజేయుచుండుము, నీ జన్మము ధన్యమగును ఓమ్

2 బుద్ధీంద్రియము – ఓ నాయనా! మనస్సు చేయుచున్న కృత్యముల నింతవఱకు చెప్పినవాటిని నీవును వినియున్నావుగదా? నీవు మంచివాడవైతే మనస్సు ఏమియు జేయజాలదు ఏలన మంత్రివర్గములో ప్రధానమంత్రి యనుమతి లేక తక్కిన మంత్రులేమియు చేయజాలరు అదేరీతిగా జీవుని యొక్క ప్రభుత్వములో నీవు ముఖ్యమంత్రిగా నున్నావు మనస్సు ఔనా? కాదా? అను సంశయమే స్వరూపముగా గలవాడు ఆయన నిశ్చల స్వభావము గలవాడు గాడు ఎప్పుడును చంచల స్వభావముతో గూడియుండును నీ వట్టివాడవు గావు నిశ్చయాత్మస్వరూపము గల్గియున్నావు మనస్సు ఔనా? కాదా? యని నీ దగ్గఱకువచ్చి యడుగుచుండును కావున అతనిచేత లన్నియు నీ స్వాధీనములుగా నున్నవి నీవు విచారణ కార్యములలో సమర్థుడవు మనస్సు నొక పోలీసు ఇన్‌స్పెక్టరుగా వర్ణించుకొనవచ్చును అతని యొక్క విజృంభణ మంతయు సూపరింటెండెంటు దగ్గఱకువచ్చి చేరునంతవఱకు మాత్రమే అట్టి పైయధికారి సమీపమున ఆయిన్‌స్పెక్టరువంటి మనస్సు ఏమియు చేయజాలదు సూపర్నెంటు ఇచ్ఛానుసారముగా ఇన్‌స్పెక్ట రణగిపోవునట్లు ఈ మనస్సుగూడ నీకు స్వాధీనపడిపోవును కావున నీవు మంచి వాడవై యుండుము

నీవును ఎంతో పుణ్యము చేసినందుచేతనే యీ దేహములో వచ్చి యున్నావు లేనిచో శ్రేష్ఠమైన యీ మానవకాయములో నీకు స్థానము దొరకియుండదు నీయొక్క యధిదేవత బృహస్పతి ఆయన దేవతల కందరి కిని గురువు అట్టి యున్నతస్థితిలో నుండియు నీవు నిన్ను మరచిపోవుచున్నావు మతాంతరమున బుద్ధియొక్క యధిదేవత బ్రహ్మయనిగూడ చెప్పబడి యున్నది అట్లయిన మిక్కలి మంచిదిగదా? అట్టి శ్రేష్ఠమైన వంశములోనుండు

నీవు ఏల దుర్మార్గుడగు నీమనస్సుయొక్క మాటలను విని చెడెదవు మనస్సును లొంగదీయుటకు మఱియొక రహస్యమును జెప్పెద మనస్సుకు అధిదేవత చంద్రుడు అతడు బృహస్పతి శాపముచే కృష్ణపక్షమున క్షయించు చున్నాడు కనుక నీయొక్క యధిదేవత బృహస్పతియగుటచే నీవీసంగతిని తెలిసికొనియున్నావు అని మనస్సు ఎరింగె నేని నీదగ్గఱ చాల వినయము గలిగియుండును ఎట్లన ఒకడు తప్పు కార్యము చేసియుండిననే వాడు ఆ సంగతి నెరింగియుండు వానిదగ్గఱ వినమ్రుడై యుండునట్లు ఈ మనస్సు గూడ ఉండగలదు అప్పుడు నీ యాజ్ఞ ప్రకారము నిలువక తప్పదు యోగ్యుడుగాని సూపర్నెంటైన దుష్టుడైన యినస్పెక్టరు చెప్పెడు వాక్యములను విని చెడిపోవునట్లు నీవును ఒక్కొక్కప్పుడు ఈ మనస్సు చెప్పెడి మాటలను విని చెడుచున్నావు ఇకమీద అట్లు చేయకుము నీవును సౌఖ్యమును గదా సదా కోరుచున్నావు! నీవు శుద్ధుడు గానిచో సుఖమెట్లు గలుగును?

ఒకవేళ మనస్సు విషయములచే బలము గలిగినదిగా నుండవచ్చును. అది నాయొక్క యాజ్ఞలో నిలుచునా? అనిగూడ సందేహపడకుము దేహబల మెంత యుండినను అధికారబలము లేనిచో ఏమిచేయ గలుగును? నీ వధికారబలము గల్గియున్నావు ఇన్‌స్పెక్టరు కాయబలము గల్గియుండినను బుద్ధిబలమును, అధికారబలమును గల సూపర్నెంటు దగ్గర అతనియొక్క బలమేమి చేయగల్గును? ఆలాగున అంతరింద్రియముల కన్నిటికిని నీ వధికారివై యున్నావు ఇన్‌స్పెక్టరే నీయొక్క యధీనములో నుండగా తక్కిన సార్జంటులను, జవానులను గుఱించి మఱల చెప్పవలయునా? ఆలాగున బుద్ధి కధీనములై చిత్తాది అంతరింద్రియములును, జ్ఞానేంద్రియములును, కర్మేంద్రి యములును అణగియున్నవి కావున నీవొకడవు శుద్ధుడవైతివేని తక్కిన యంతర్బాహ్యేంద్రియము లన్నియు ఋజుమార్గమున నడువగలవు ఒకవేళ నీకు బలము చాలదని తలంచెదవేమో! ఆ విషయమై సంశయింప నక్కర లేదు

భక్తులగు కొందఱు జనులు తమకు గొప్పబుద్ధిబలము లేదని తలంచి బ్రహ్మవిషయమును తెలిసికొన సామర్థ్యము లేదని తలంచుచుందురు అట్లు తలంపనక్కరలేదు బుద్ధి యెంత బలము గలదియైనను ఇంద్రియముల

నిగ్రహించుటకు మాత్రమే సమర్థత గల్గియుండును ఆత్మను కనుగొనుట కుపయోగపడదు ఏలన బుద్ధివలన ఆత్మ ప్రకాశింపదు ఆత్మవల్లనే బుద్ధి మొదలగు ఇంద్రియము లన్నియు ప్రకాశించుచున్నవి ఉపయోగము లేని వస్తువెంత బలమైనదైనను లేక బలహీనమైనదైనను ఏమి ప్రయోజనము? బుద్ధి శుద్ధముగా నుండిన చాలును అట్టిది శాస్త్ర విషయములోగాని, బాహ్య కార్యనిర్వహణ విషయములో గాని, ధారణావిషయములోగాని గొప్పది కానప్పటికిని విరోధము లేదు మలిన జలము ఎంత ఎక్కువగా నుండినను లేక తక్కువగా నుండినను, సూర్యుడు దానియందు ప్రకాశించునా? లేక యట్టి మలిన జలము బంగారు పాత్రలో నుండినను ఏమి లాభము? సూర్య ప్రతి బింబము గలుగదు గదా? అదేరీతి మనస్సు చిన్నదైనను శుద్ధముగానుండిన చాలును అట్టివా రేకులములో జన్మించినను విరోధము లేదు జ్ఞానమును పొందగలరు శుద్ధజలము మట్టిపాత్రలో నుండినను సూర్యప్రతిబింబము గనుపింపక పోవునా?

కావున నీ యాత్మ విషయములో శ్రేష్ఠమైన కులమని గాని, లేక శ్రేష్ఠమైన యాశ్రమమని గాని తలంప నక్కరలేదు శ్రేష్ఠమగు గుణము మాత్రము గల్గియుండిన చాలును కల్మషముతోగూడిన యద్దము ఎంత పెద్దదైననేమి, ఆదిత్యుడు దానియందు కనుపించునా? నిష్కల్మష దర్పణమెంత చిన్నదైనను దానియందు భాస్కరుని ప్రతిబింబ మేలాగున స్పష్టముగా గోచరము గాగలదో బుద్ధియొక్క స్థితియు ఆలాగున నుండును కనుకనే కొందఱు అనేక శాస్త్రములను, అనేక ప్రపంచకార్యములను, అనేక సూక్ష్మయంత్ర నిర్మాణములను గ్రహింప శక్తిగలవారైయుండియు, అనేక కర్మరహస్యములను గనిపెట్టే శక్తిగలవారై యుండియు, బుద్ధి నిర్విషయ స్థితిగలిగి శుద్ధము గానందుచే నశ్వరవిషయములో అంధప్రాయులై యున్నారు ఈ విషయము నింతటితో నిలిపి యే విషయమును ప్రారంభించితిమో దానిలో ప్రవేశింతము

ఓ బుద్ధీ! ప్రపంచకార్యములలో గొప్పకార్యముల జేయు శక్తి లేదని తలంప నక్కరలేదు శుద్ధముగా నుండిన చాలును సన్మార్గనిష్ఠులైన

మంత్రులయొక్క విధియేమి? ప్రభుత్వమును చక్కగా సంరక్షించుటగదా! ప్రభువునకు సుఖమును గలుగజేయుటగాదా! ఆలాగున ఓ బుద్ధీంద్రియమా నీవును సన్మార్గవంతుడవై యుండుము మఱియు శుద్ధత గలిగియుండిన చాలును అట్లైన నీవు నాకు చేయవలసిన కార్యములన్నియు చేసినవాడవే యగుదువు ఇదే గొప్పకృతజ్ఞత గలిగిన దానికి గురుతు అట్లు గానిచో ననేక ద్రోహముల జేసినట్లే యగును అంతేగాదు అది గొప్ప కృతఘ్నత యనియే తలంచవలసి యున్నది సూపర్నెంటు కృతజ్ఞత గలవాడైనచో తక్కిన యిఁస్పెక్టర్లను గురించిగాని, జవానుల గుఱించిగాని యేలాటి విచారమును జేయ నవసరము లేదు ఆలాగున ఓ బుద్ధీ! నీ వొక్కడవు శుద్ధముగా నుండిన మనస్సును గుఱించిగాని, ఇంద్రియ సమూహమును గుఱించిగాని విచారపడనక్కరలేదు అన్నియు సాధువులే. సన్మార్గవంతములే, సందేహము లేదు

బుద్ధీంద్రియమా! జనులందరును దైవమునుగుఱించిగాని, జ్ఞానమును గురించిగాని నీవనెడి కొలత పాత్రచేతనే కొలుచుచున్నారు జనులన నేల మహాపురుషులు, బోధకులు, ప్రవక్తలుగూడ నీచేతనే సమస్తమును కొలుచుచున్నారు గంగానదిజలము పొంగి ప్రవహించుచుండినను వారువారు తీసికొని వెళ్ళిన పాత్రము లెట్టివో, యంతే జలమును తీసికొనివచ్చునట్లు నీయొక్క వికాస సంకోచముల ననుసరించి యేకార్యమునైన చేయుచుందురు వీరియొక్క యాత్మవిషయకమైన జ్ఞానమును అట్టిదియే ఒక పెద్దపాత్రలోగల నీటియందు సూర్యప్రతిబింబము గొప్పదిగా ప్రతిఫలించును చిన్నపాత్రయైన చిన్నదిగా ప్రతిబింబించును ఆలాగున నీయొక్క గొప్పతనము, చిన్నతనము ననుసరించి జ్ఞేయమగు బ్రహ్మముగూడ గోచరము గాగలదు మఱియు మతములయొక్కయు, దైవముయొక్కయు విభేదములకు నీవే కారణము

నీవేలాగున నుందువో మతమును, దైవమును జనుల కాలాగున గోచరించును శుక్ల, కృష్ణ, రక్త, పీతములగు అద్దములద్వారా ప్రతిఫలించెడు సూర్యకిరణము లేలాగున అనేక రంగులుగా గనుపించునో, ఆలాగున, నీవేలా

గున నుందువో, జ్ఞేయమగు బ్రహ్మముగూడ ఆలాగుననే బోధము గాగలుగును సూర్యుడు తేజోమయుడైనను, దర్పణములయొక్క రంగుల వలె నైనట్లే, జ్ఞేయమగు బ్రహ్మము జ్ఞానమయమై యుండినను ప్రవక్తల యొక్క బుద్ధిననుసరించి యనేక ఆకారములును, గుణములును గలది యాయెను అందువలననే మతవిషయమై యిట్టి వైషమ్యములు, కలహములు గలుగు చున్నవి కనుకనే యుపనిషత్తు లీలాగున చెప్పుచున్నవి – బుద్ధిని, మూల ప్రకృతిని దాటిన మాత్రమే యాత్మయొక్క సత్యమును తెలిసికొన సాధ్యమ గును కావున నీవు నిర్మలముగా నుండుము అంతమాత్రమైన యుపకార మును నాకొఱకు చేయుము నీకు వందనములు ఆత్మ నిశ్చలముగా నుండినను నీవు చలించిన తాను గూడ చలించినట్లే గోచరించును చంద్రు డాకాశము నందు నిశ్చలముగా నుండినను నీటియొక్క కదలికచే కదలుచున్నట్లుండును గదా! తెల్లనినీరు, ఎఱ్ఱనినీరు, నల్లనినీరు, పచ్చనినీరు ఉండిన దానియందు ప్రతిఫలించు సూర్యుడుగూడ ఆయా రంగుల స్వభావముగా గనిపించునట్లు ఓబుద్ధీ! నీవేరూపము గల్గియుండిన బ్రహ్మము గూడ అదేరూపముగా నున్నట్లు గోచరించును ఓహో! నీయొక్క మహిమ నేమని చెప్పవచ్చును? నీ వెవరి యందు శుద్ధముగా నుందువో వారి జన్మ ధన్యము అట్లుగాక మలినముగా నుండిన అట్టివారి జన్మము నరకము కావున పుణ్యాత్ముడా! నిర్మలత్వమును, నిశ్చలత్వమును, ప్రసన్నత్వమును గల్గియుండుము అట్లయిన నేను నిత్యసుఖమును బొందగలుగుదును

3 చిత్తమును గుఱించిగూడ కొన్ని ధర్మసందేహములు తెలుప వలసియున్నవి ఓ చిత్తమా! నీకుగూడ జన్మాంతరములో జేసిన సుకృత విశేషమువల్లనే యీ శరీరములో వచ్చియుండెడు భాగ్యము గల్గినది మంచి పుణ్యశాలివయ్యు, పుణ్యమువలన గలిగెడు మానవ శరీరములో జేరియు సౌఖ్యమును గోరుట సకల జీవుల స్వభావమై యుండియు నీవేల మంచి చింతనమును జేయక చెడు చింతనమును జేయుచున్నావు? నీకు నిశ్చింత గలిగిన లభించెడు సౌఖ్య మపారము నీ వెల్లప్పుడు దృశ్యచింతనలోనికి ఏల పరుగెత్తి పోవుచున్నావు? దానివలన దుఃఖఫలితమేగాని సౌఖ్యము గలుగదు

గదా! నిశ్చింతగా నుండుటకు నీకు సాధ్యము గానిచో సద్విషయముల గుఱించియైన చింతింపరాదా? చెడువిత్తనముచే చెడ్డఫలములు గలుగునటుల, మంచి విత్తనమునకు మంచిఫలములే గలుగుచుండును ఈ సంగతిని తెలిసి కొనియైన మంచి చింతన గలవాడవగుము

అయితే నిశ్చింతువై యుండుటకు ముందు చెప్పినను, దానియందొక రహస్యము గలదు చిత్తము నరికట్టి ప్రాణాయామముచే చలింపనీయక చేసినచో కొన్ని నిమిషములుగాని, గంటలుగాని, దినములుగాని, ఆలాగున వారములు, పక్షములు, మాసములు, ఋతువులు, అయనములు, సంవత్సరముల పర్యంతము నిశ్చింతుడవై యుండినను తెలిసికొనవలసిన యాత్మవస్తువును, జ్ఞేయవస్తువును దైవవస్తువును తెలిసికొనకపోయిన, దైవములో నిలకడ గలుగక పోయినచో జ్ఞేయములో నైక్యము జెందకపోయినచో నేలాటి సౌఖ్యము గాని, పుణ్యము గాని కలుగదని మాత్రము నీవు జ్ఞప్తియందుంచు కొనవలయును సంవత్సరములేల, యుగములు కల్పముల పర్యంతము నిశ్చింతుడవై నిశ్చేష్టుడవై యోగబలముచే నుండగలిగినను పరంజ్యోతియై, పరమజ్ఞానమై వెలుగుచుండు ఈశ్వరునిలో నైక్యము గలుగనిచో భవరోగము తొలగదు

అట్టిదిగాని నీయొక్క నిర్వికల్ప సమాధి మూర్ఛవంటిదనియు, గాఢనిద్రవం టిదనియు బాగుగా జ్ఞాపకము గలిగియుండుము చిన్మయమై మహాజ్యో తియగు భావము గలిగిన మరల నెల్లప్పుడు ఆలాగున నిర్వికల్ప సమాధిలో నుండినను, లేక యాభావము గలిగినపిమ్మట దేహేంద్రియముల నాశ్రయించి లోకహిత కార్యములను జేయుచుండినను, ఏలాటి కష్టముమ గలుగదు ఏ కార్యమును జేయక సదా దానియందుండినను సుఖమెక్కువ గలుగుట గాని, యింద్రియములతో ధర్మకార్యముల నాచరించినందుచే దుఃఖము గలుగుటగాని, బంధనములో చిక్కుకొనుటగాని గలుగదు ఏలన ఉడికిన విత్తనములు మరల నెప్పటికిని ఎచ్చోట నుండినను అంకురింపవుగదా! దహించిన పాశము కట్టుటకు తగదుకదా! స్ఫుటము వేయబడి సువర్ణమైన తామ్రము, మఱల రాగి గాదుగదా!

కావున నో చిత్తమా! నీవట్టి దైవస్థితిలో నుండుట కష్టమని తలంచుచున్నావా! మొదట కొంత ప్రయాసముగా దోచినను అనుష్ఠానబల ముచే నట్టి స్థితి నీకు త్వరలోనే గలుగును అట్టిస్థితిలో నిరంతరము నిలకడ గలుగుట ప్రయాసమని తోచిన నెంతకాలమువఱకు ఉండగలవో యంతవ ఱకుండి తక్కిన కాలము నంతయు మంచికార్యములనే చేయుచుండుము అంతేగాని యాత్మజ్ఞానము గలుగని నిశ్చింతయోగములో మాత్రముండ కుము, నీయొక్క మూలమును తెలిసికొనక పోవుటవలననే దుఃఖమునకు కారణమగు లోకచింతనలను, పాపచింతనలను జేసికొని సంకట పడుచున్నావు నీయొక్క యధిదేవత వరుణుడు ఏలన, చిత్తము జలతత్త్వమగుట చేతనే నెమ్మదిగా జలము ప్రవహించునట్లు చింతన కలుగుటకు కారణమగుచున్నది

మతాంతరములో చిత్తమున కధిదేవత వాసుదేవుడనియు, జీవుడనియు చెప్పుట గలదు ఇచ్చట వరుణుడని గ్రహించడమైనది ఆయన యెంత గొప్పవాడో యోచించుకొనుము జలమున కధిదేవత వరుణుడగుటచే నీవును సముద్రమువంటి విశాలస్వభావము కలిగియుండ వలసినవాడవే ఎంత మలినమైన జలమైనను సముద్రలోనికి వచ్చిన యేలాగున మలినము నడుగంటజేసి గంభీరముగాను, శుద్ధముగాను ఉండునది చూచుటలేదా? ఆలాగున నీలోనికి ఏలాటి బాహ్యచింతనలు వచ్చినను వానివలన కల్మషము నొందక నీయొక్క గంభీరత్వమును, స్వచ్ఛత్వమును విడువక యుండుము మఱియు సముద్రము తనలోనికి ఏయే వస్తువులు వచ్చినను, ఎట్లు వెంటనే యలలచేగొట్టి తీరములోనికి చేర్చివేయుచుండునో ఆలాగున నీలోనికి ఏప్రపంచ సంకల్పములు వచ్చినను తత్క్షణమే వివేకకరములచే హృదయములోనుండి బయటికి నెట్టివేయుము మరియు నిప్పుడు నీయొక్క వృత్తాంతమును తెలిపితిని దీనిని తెలిసికొని శుద్ధుడవు గమ్ము చాల సౌఖ్యము గలుగును వాసుదేవుడే చిత్తమున కధిదేవతయని చెప్పిన పక్షమున భగవంతుడు శయనించుచుండు క్షీరసాగరమెట్లు శుద్ధమై యుండునో, యాలాగున నో చిత్తమా! నీవును స్వచ్ఛమై నీలోపల భగవంతుడు

పయనించులాగున చేసికొనుము అప్పుడు నీవు ధన్యుడవు గాగలవు కారణమునకు భిన్నముగా కార్య ముండగూడదుగదా!

చిత్తమా! నీవు చింతనాశీలుడవు సమస్తమైన వృత్తులను నీవు చిత్రగుప్తునివలె లిఖించి మనస్సను ద్వితీయ మంత్రి కిచ్చుచున్నావు ఆయన తీర్మానింప శక్తిలేని విషయముల లన్నిటిని ముఖ్యుడగు బుద్ధికి సమర్పణ జేయుచుండును కావున నీవు తృతీయమంత్రివంటి వాడవే యగుదువు నీవు జలతత్త్వ మగుటవలననే నిదానముగ నొకొక్క దానిని చింతనజేయు స్వభావము గ్గ్లియున్నావు మనస్సైతే వాయ్వంశమువలన బుట్టినందుచే చంచల స్వభావము గలిగియున్నది బుద్ధియో అగ్నికణము గలిగి యుండి నందువలన దీపమన్నిటిని ప్రకాశింపజేయునట్లు కార్యాకార్యములను, ధర్మాధర్మములను నిశ్చయించుకొనుచుండును అయితే నీవు మంచి విషయమునే చింతనలోనికి తీసికొనినయెడల మనస్సును, బుద్ధియును, దాని కనుకూలముగానే ప్రవర్తించుండును కావున నాత్మమిత్రమా! చెడుచింతన లెవ్వియు నీలోనికి రాకుండ జూడుము అట్లైన చాల యుపకారమును జేసినవాడవే యగుదువు భూమిలోగల మట్టి మొదలైన యన్నివస్తువులను జలము పట్టుకొని వచ్చి యడుగున జేర్చుకొనునట్లు సమస్తవిషయములను నీయందే నిలువ జేయుచున్నావు నీ వెవరియందు మంచి స్వభావము గలిగియుందువో, వారు దైవచింతనయం దుండగలరు కావున నో నాయనా! నీ వీ హృదయములో మంచివాడవై యుండుము అట్లైన నీ దేహమునొంది నందుకు తగిన ఫలము నొందగలవు

ఓ చిత్తమా! నీయొక్క దృశ్యచింతనలే సంసార వృక్షములకు విత్తనములవంటివి యగును బీజములు నశించిన వృక్షము లేలాగున రహితముల గునో, అలాగున నీయొక్క బాహ్యచింతలన్నియు నశించిన సంసారదుఃఖము మఱల గలుగదు ఒక న్యాయస్థానములో విచారణ చేయవలసిన రికార్డు లెంతకాలమువఱకుండునో, అంతవఱకు న్యాయాధిపతికి పనియుండే లాగున నీ హృదయమను కోర్టులో అనేక చింతలను రికార్డును నిర్మించు చున్నావు అందువలన నాత్మకు శాంతి గలుగక పోవుచున్నది నీవు చేసిన యీ లాటి

చింతనలే సంసార వృక్షమునకు వేరులగు చున్నవి వేరులుండువఱకు వృక్షము క్షయము నొందదు వేరు లన్నియు తెగిపోయిన వృక్షమేలాగున ఎండిపోవునో, అట్లే నీ యొక్క కల్పిత వేరులు క్షయించిన, ప్రకృతియను తరువుగూడ ఎండిపోయినట్లే తలంచవలెను నీవు చేయు ప్రకృతి సంబంధమైన విచారము లన్నిటిని చిత్తమను దారములో గ్రుచ్చి సంసార దుఃఖమును వృద్ధినొందించుచున్నావు సూత్రము తెగిన మణులన్నియు నేలాగున ఛిన్నాభిన్నములైపోవునో అలాగున చిత్తమా! నీయొక్క యనాత్మచింతనలను మానినచో, యవిద్యా సంబంధ సమస్తదుఃఖములును పటాపంచలై పోవును కావున నీవు అనాత్మచింతల నన్నిటిని విడిచి దైవచింతనమాత్రము గలవాడవై యుండుము నీకును, నాకును సౌఖ్యమును గలుగజేసినవాడవే యగుదువు

అట్లు దైవచింతనలో నిలకడ గలుగుట ప్రయాసమని తోచిన, దుశ్చింతనల నన్నిటిని మాని సచ్చింతనా ప్రవృత్తి గలిగియుండుము దానితోగూడ సత్పురుషుల సంసర్గము చేయుచుండుము సద్వృత్తి రూఢిపడినపిమ్మట నిర్వృత్తిలోనికి ప్రవేశింపుము అచ్చట నీయొక్క స్వరూపము లేకపోవును అగ్నిలో వెలిగించిన కర్పూర మేలాగున రూపములేనిదై యగ్నిమయమైపోవునో, అలాగున దైవభావములో నైక్యమునొందిన కల్పితుడవగు నీవుగూడ లేనివాడవై దైవ మొకటిమాత్రమే మిగిలియుండును అదియే యాఖరు స్థితియని మరువకుము అదియే పరాకాష్ఠ, అదే వేదముయొక్క యంత్యావస్థ, దానికే కైవల్యమనియు, ముక్తియనియు, మోక్షమనియు, పరమపద ప్రాప్తియనియు పేర్లు జెప్పుదురు అది శివము, అమృతము, ఆనందము, అద్వైతము ఓమ్

4 ఇక అహంకారమును గుఱించి చెప్పవలసిన భాగము మిగిలియున్నది ఈ యహంకారముగూడ ఆత్మయను ప్రభువుయొక్క యంతఃకరణ చతుష్టయ మంత్రి వర్గమున చేరినవాడే. కావున నితడును మంత్రియే అయితే యితడు పై జెప్పిన ముప్వురకంటే చాలా వివేకము తక్కువ గలవాడే కనుకనే కడపటివాడైనాడు

ఐనను పావనత్వమునకు హేతువైన యీ మానవజన్మలోను,

ప్రత్యేకించి నాలోను ఉండినవాడవైనందుచే, ఓ యహంకారమా! నీవును సుకృత విశేషముగల వాడవనియే గ్రహించుకొనవలయును కొంత తెలివి తక్కువ వాడవైనను జ్ఞానముగల తల్లిదండ్రుల యుపదేశమువలన కుమారు డేలాగున మంచివాడగునో, ఆలాగున నీకు నేను మంచిమార్గము చెప్పుచున్నాను నామాట లాలకించి మంచివాడవగుము నీకు చాల మేలు గలుగును నీవు దుష్టకార్యములను జేయుటచే నీకును నాకును కష్టమే గలుగుచుండును అట్లు చేయకుము పాపము నొడి గట్టకుము అంతేగాదు, ఈ దేహములో నుండి కృతఘ్నుడవు గాకుము ఓ యహంకారమా! నీయొక్క ప్రవర్తనలన్నియు ఉన్మత్తుని చేష్టలవలెనే యున్నవి అట్లుగానిచో నీవీ మలమూత్రములతో గూడిన దేహమును గూర్చి యహంకరింతువా? నేను నీక్షు తెలియ జెప్పుచున్నాను సావధానముగా వినుము

అహంకారము మూడు విధములతోగూడినది (1) దేహాహంకారము (2) జీవాహంకారము, (3) ఆత్మాహంకారము, అనగా స్వరూపాహం కారము దేహాహంకారము చాల నీచమైనది ఇది బంధనమును గలుగ జేయును జీవాహంకారము చాలాకాలమునకు ముక్తికి హేతువగును ఇది కొంత యంతఃకరణ శుద్ధిగలిగిన విద్వాంసులకే గలిగియుండును స్వరూపా హంకారము అనగా దైవాహంకారము బ్రహ్మజ్ఞానులకు మాత్రమే యుండును ఇదియొకటి మాత్రమే యమృతత్వమును గలుగజేయునది అనగా మోక్షము నిచ్చునది నీయొక్కమూల మట్టిదై యుండియు, ఆ పరమ పావనపదమును మరచి యీ మాలిన్య పూరితమైన దేహమును నీవని తలంచుట పిచ్చివాని చేష్టవంటిదేగాని మరేమని చెప్పవలయును

మత్తు వస్తువులను తప్పత్రాగి మది మరచిన పామరునివలె నట్టి మహత్తైన దైవపదమును గోల్పోయి ఈ నశ్వరశరీరమును నీవని తలంచుట యెంత వెఱ్ఱితనము? ఉన్మత్తుడు చేయు కృత్యముల నతడు గొప్పవని తలంచినను బుద్ధిమంతు లేమితలంతురు? ఆలా గున నీయొక్క యీ దేహమును గుఱించి యహంకరించుట గూడ నట్లుండు ననియే వివేకులు తలంతురు పిచ్చి గలుగుజేయు వస్తువులను భుజించి దుమ్ములో పొరలుచు

గంతులు వేయుచుండిన అతని కది మహానందముగా దోచినను విచారజ్ఞానము గలవారు ఏమని చెప్పుదురు? నీయొక్క దేహమును గుఱించియు, కులమును గుఱించియు రూపమును గుఱించియు, విద్యను గుఱించియు, గలుగు భావమును గూర్చి లోక మాలాగున తలంచును

ఓ యహంకారమా! నీయొక్క గొప్పతనము నేమని వర్ణించెదను? నీవు నిత్యశుద్ధ ముక్తస్వరూపుడవై యుండియు అనిత్య, అశుద్ధ, బంధస్వరూపమగు దేహమును నీవని తలంచుచున్నావుగదా? ఓహో నీయొక్క ప్రజ్ఞనేమని కొనియాడవచ్చును? నీవు శుద్ధబాహ్య జ్ఞానమయుడవై యుండియు, అశుద్ధ మాయామయుడవై యుండువాడనని యేల తలంచు చున్నావు? దీనికంటె మూఢత్వము గలదా? నీవు దేహేంద్రియాదులకు సాక్షిగానుండియు మల మూత్ర క్రిమిజాల సంకలుషితమైన దేహమే యని తలంచుట యెంత పొరబాటు! ఇది యుత్తమవంశములో బుట్టినవాడు నీచగ్రహావేశముచే తన్ను నీచుడని తలంచునట్టిదే గదా నీయొక్క చేష్టయును? మతిభ్రష్టు డమృతకలశమును పారవైచి యమేధ్య పదార్థమును తీసికొని నట్లుగదా, ఆత్మభావమును విడిచి దేహభావమును బొందుట! నీవు స్వయంజ్యోతి స్వరూపుడవై యుండియు నేమియు తెలియని యజ్ఞానివలె బ్రవర్తించుచున్నావే? ఇదియా నీయొక్క ప్రతాపము? ఛీ సిగ్గులేదా? నీవు నీచభావమును బొంది నిన్ను నీచుడవనియు పాపివనియు దలంచుచున్నావు ఇది మలిన జలములో ప్రతిబింబించు సూర్యుని చూచి తనను మాలిన్యము గలవానివలె తలంచి నట్లే యుండును

నీవు స్త్రీయును గావు, పురుషుడవు గావు, నపుంసకుడవును గావు ఈ మూడును దేహధర్మములే గాని నీయొక్క యాత్మధర్మములు గావు నీవు దేహత్రయ విలక్షణుడవు, చిన్మయ స్వరూ పుడవు, పరంజ్యోతియగు పరబ్రహ్మవై యున్నావు సార్వభౌముడైన వాడు మతిభ్రమగలిగి భిక్షకారులతో చేరి వీధిలో భిక్షమెత్తుట జూచిన అతని యొక్క బంధువులెంత ఖిన్నులై యుందురో, నీవు నీయొక్క దైవత్వమును మరచి దయ్యపు స్వభావమగు విషయములతో గూడియుండుటయు నాలాగుననే యుండును

కావున చిత్తభ్రమ నివృత్తికొఱకు తగిన వైద్యు నాశ్రయించి జనులు బాగుచేయించు కొనునట్లు బ్రహ్మవేత్తలగు భవరోగ వైద్యులను వెంటనే కనుగొని యీదుఃఖమును నివృత్తి జేసికొనుము దుష్టగ్రహావేశము గలవాడు మాంత్రికునిచే భూతమును పారద్రోలించునటుల నీకు గలిగియుండు ఈదుష్ట భావమును ఆత్మజ్ఞానులగు మహనీయులచే రహిత మొనర్చుకొనుము అప్పుడే సౌఖ్యము కలుగును పరమశాంతియు సిద్ధించును శాశ్వతమైన దైవపదము లభించును అప్పుడు ఈ దేహమను రాజ్యములో రాజ్య మేలుచుండు ఆత్మయను ప్రభువునకు మంచిమంత్రులు హితమొనర్చి కృతజ్ఞతను తెలియ జేసి కొనినట్లు నీవును కృతజ్ఞుడవు గాగలవు

ఓ మనోబుద్ధి చిత్తాహంకారములారా! మీనల్వురకును చెప్పవలసిన ధర్మవాక్యముల జెప్పితిని మంచిది చేసినచో మేలు కలుగును చెడుకార్యముల జేసిన కీడును సంభవించును ఇక మీలో మీరే యోచించుకొని యేలాగున వర్తించవలయునో, ఆలాగున చేయుడు ఈ దినమున మీయందరికిని ఆలోచించుకొనుట కవధి యివ్వడమైనది రేపటి దినమున నాయొక్క నిజావస్థను మీకు తెలిపెద

అహంకారమా! నీవు కఠినుడవని యందరు నందురు కారణ మేమన నీవు పృధ్వీతత్త్వముచే నుత్పత్తి యైనవాడవు. పృధివీతత్త్వమగు రాయి యినుము మొదలగువానిని జూచుటే యీలాగున జెప్పుటకు కారణము ఇది నీయొక్క దుష్టగుణమును జూచి చెప్పెదరేగాని నిజముగా యోచించిన నీకంటె మంచివారు లేరు నీవు పృధివివలె సహనము గలిగియుండవలసిన వాడవు పృధివి యేలాగున అనేక సుస్వాదు ఫలమూలములను, దివ్యాన్నములను, శ్రేష్ఠమైన యోషధులను గలుగజేసి, ప్రజలను, జంతుకోట్లను, రక్షించుచున్నదో అట్లే నాయనా! నీవును మంచివాడవైన లోకమునకు అంత మేలు కలుగును మఱియు నీయొక్క యధిదేవత రుద్రుడు ఇది నీయొక్క రౌద్రాకార మునుజూచి లోకము నీకీలాటి పేరును బెట్టినది నిజముగా విచారించిన రుద్రుడీశ్వరుడే నీయొక్క దోషము రహితమైన నీవే శివుడవు గాగలుగుదువు! తండ్రీ! 'రుద్ర' అను శబ్దమునకు అమరకోశ నిఘంటువుయొక్క వ్యాఖ్యానకర్త

వివరించిన యర్థమును జూడుము 'స్థాణూ రుద్ర ఉమాపతిః' ప్ర కాం స్వర్గవర్గము ద్రు-గతౌ అను ధాతువునుండి పుట్టిన శబ్దమగుటచే 'రుదం ద్రావయతీతి రుద్రః' అనగా దుఃఖమును బోగొట్టువాడు ఇదే నీయొక్క యధిదేవతా శబ్దమున కర్థము కారణమునుండి పుట్టిన కార్యము కారణముకంటె భిన్నముగాగూడదు కదా, కావున నీవును దుఃఖరహితుడవై యితరులకు దుఃఖమును కలుగజేయక పోవుటయే గాక దుఃఖముగలవారి శోకమును రహితము జేయగలవాడవై యున్నావు

రెండవది ఓయంతఃకరణ చతుష్టయుమగు మంత్రివర్గమా! మీరందరును నిన్నటిదినమున చెప్పిన ధర్మముల నన్నింటి తెలిసికొంటిరా? ఈ దినము నాయొక్క నిజస్వరూపమును గుఱించి తెలుపుచున్నాను మీరందరును ఎట్టివారలనగా సూత్రధారి సూత్రముల నాడించినపుడు చమత్కారముగా నాడెడు తోలుబొమ్మల వంటివారు బొమ్మలయొక్క యాటలను జూచినపుడు జనులాశ్చర్యమును బొందుదురు అయితే యా రహస్యమంతయు సూత్రధారునిది యని తెలిసికొనజాలరు ఆలాగున మీరు జడస్వరూపులైయుండి యాత్మయొక్క సాన్నిధ్యబలముచే నిట్టి మహిమ గలిగినదని తెలిసికొనకపోవుచున్నారు ఆత్మయైన నేను మీయొక్క యోగ్య తను కనుగొనుటకొఱకు ఇంతకాల మూరకుండడమైనది, ఇప్పుడు నా యొక్క నిజస్వరూపమును మీకు దెలుపుచున్నాను ఇది యహంకారము గాదు సోఽహంకారము ఇట్టి తత్త్వమువల్లనే కైవల్యప్రాప్తి యందరికి గలుగును

వాస్తవముగా మీరుచేయు కృత్యములన్నియు యాత్మ చైతన్యము వలననే జరుగుచున్నవి ఒక రాజాస్థానములోనుండు మంత్రులు చేయుపని యంతయు స్థానబలముచే గలిగినదని తెలిసికొనక మదోన్మత్తులై ప్రవర్తించునది జూచిన ధర్మాత్ముడగు రాజు వారికి బుద్ధి గలిగేలాగున జ్ఞానమును జెప్పియు వారాచరింపక పోయిన, వారిని పనినుండి తొలగించిన, మరురోజు వారు ఏలాగున సామాన్య మనుజునివలె నుందురో మీయొక్క స్థితి యటువంటిదే యగును ఒక విద్యుచ్ఛక్తి యంత్రాలయములో అనేక చిత్రవిచిత్రములైన పనుల

జేయు నాయంత్రముల జూచిన నాశ్చర్యముగా తోచినను నీమహిమ మంతయు విద్యుచ్ఛక్తివలననే జరుగుచున్నదని గ్రహింపజాలని వారివలె మీరును ప్రవర్తించుచున్నారు జ్ఞానైక స్వరూపమగు నాత్మవల్లనే మీరు మహిమ గలవారలైతిరి విద్యుచ్ఛక్తిని నిలుపుదల చేసిన యంత్రములన్నియు నిశ్చేష్టిత ములై పోవునట్లు మీయొక్కగతియు నుండును

మీయం దభిమాన ముంచినందున మీయిష్టానుసారముగా ప్రవర్తించు చున్నారు ఇప్పుడు మీయందుగల మమత్వమును విడిచి నాయొక్క నిజస్వ రూపమున నుండబోవుచున్నాను అప్పుడు నన్ను కదిలించు వారెవరు గలరు! ఈ కీలకము తెలియని వారివద్దనే మీయాట లన్నియు సాగుచుండును

మీయొక్క స్థితినిగూర్చి యింకను వినుడు ఒకటి సంఖ్యవేసి దాని వెనుక యొకపూజ్యమును అనగా పూర్ణానుస్వారమును బెట్టిన నాపూజ్యము పదియవ స్థానమును బొందుచుండును మఱల మొదటిదగు నేకసంఖ్యను తుడిచివైచిన నప్పు డాపూర్ణానుస్వారము పూజ్యమైపోవును 1-10-0 మీయొక్క పూజ్యతయు నాలాగున నుండును సుమా? ఈ రహస్యము తెలియనివారి సాన్నిధ్యమున మాత్రమే మీయొక్క చేష్టలన్నియు జరుగుచుం డును ఆలాగున విచారముచే మనస్సనియు, బుద్ధియనియు, చిత్తమనియు, అహంకారమనియు చెప్పుదురేగాని విచారణజ్ఞానము గలిగిన నవియన్నియు మిధ్యయే సంశయము లేదు స్వశక్తిలేని, యేమియు చేతగాని రాజుల దగ్గర నుండు ధర్మహీనులైన దుష్టమంత్రులవలె మీరు నాదగ్గఱనుండి యీలాటి దుశ్చేష్టల జేయుచున్నారా! వంచకులారా! మిమ్ముల నందరిని త్యజించవ మైనది

బుద్ధియొక్క నిశ్చయాత్మకత్వము, మనస్సుయొక్క సంకల్పమును, చిత్తము యొక్క చింతనము, అహంకారముయొక్క యహంకృతియు లేనిస్థితిలో నాయొక్క దైవభావములోనే నేనుండిపోవుచున్నాను. తనకును తనయొక్క ఛాయకును ఎట్టి సంబంధము గలదో, ఆలాగున ఆత్మకును మాయకును తారతమ్యము గలదు చిన్నపిల్లవారు రాత్రులలో దీపప్రకాశమున తమయొక్క నీడనుజూచి బేతాళమని తలంచి భయపడుదురు కాని బుద్ధిగల

మనుజులెవ్వరైన నాలాగున భీతినొంద గల్గుదురా! ఆత్మ యొక్కయు, ప్రకృతి యొక్కయు రహస్య మీలాగున నుండును ప్రకృతియొక్క వికృతులే యీ మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములను నల్వురు సంతానములు వీరి యందభిమాన ముంచుటవలననే వీరిట్టి బలవంతులైరి ప్రకృతి వంధ్యాస్త్రీవలె నుండగా దానియొక్క బిడ్డలగు మనస్సు మొదలగు మీనల్వురును లేనివారే య గుదురు కనుక నేను స్వయం ప్రకాశుడనై సమస్తమును ప్రకాశింపజేయు జ్ఞాన స్వరూపడనని బోధమును గలిగియున్నాను కావున మీరందరు మిథ్యా స్వరూపులు సూర్య,చంద్ర, నేత్ర, విద్యుత్, అగ్ని మొదలగు సమస్తమును ప్రకాశింప జేసెడు ఏదివ్య ప్రకాశముగలదో అదే యాత్మయై యీశ్వరమయమై పరబ్రహ్మమైయుండును అట్టిదైవమే నాయొక్క ఆత్మమయమై వెలుగుచున్నదను తత్త్వమును తెలిసికొన్నాను ఇక మీయొక్క కుతంత్రము లెవ్వియు సాగవు

ప్రభువైనవాడు బాల్యావస్థలో నుండగ దుష్టమంత్రులైనచో అట్టి తరుణమున మోసముల జరుపవచ్చును యౌవనావస్థకువచ్చి పట్టాభిషిక్తుడైన తరువాత మంత్రులయొక్క మోసపుకృత్యములు జరుగునా? ఆలాగున నవిద్యలో చిక్కుకొని నిజస్వరూపమును తెలిసికొనక యుండు నంతవఱకు గదా మీయొక్క తంత్రములు జరుగును? ఇప్పుడు దైవకృపచేతను, గురు కరుణచేతను, వేదాంతశాస్త్రముయొక్క యనుగ్రహముచేతను నాయొక్క నిజస్వరూపమును తెలిసికొనడమైనది ఇట్టి విచారణ జ్ఞానము లేనివారును, విషయమోహమునకు లోబడియుండి తమ్ము దాదెలియనివారును, నింద్రియ పరవశులై యుండి విషయభోగముచే దానియందు మగ్నులైయుండువారు నునగు ఏప్రభువులు గలరో మీరచ్చటికి వెళ్ళి వారి నాశ్రయించుడు మీకు తర్పణము చేయడమైనది మిమ్ముల నుపేక్షించడమైనది విషమును తిని మైకము గలిగియుండు వారివలె విషయము ననుభవించి యందువలన నాత్మ జ్ఞానమును మరిచియుండు వారును,సుషుప్తియం దుండునపుడు తనయొక్క స్వరూప జ్ఞానము లేనివారువలె మాయమైన మోహములో, అజ్ఞానమనెడు గాఢసుషుప్తి యందుండు వారలునగు ప్రభువు లెవరుగలరో-వారి నాశ్రయించి మీరు బ్రతుకుడు మిమ్ముల నేను త్యజించడమైనది భోగవరవశులై

యోగులమని చెప్పువారును, సాధనరహితులై యాత్మను సాధింపక సాధకులమని చెప్పు వారెవరు గలరో వారి నాలంబనముగా జేసికొని మీరు సుఖముగా నుండుడు నేనుమాత్రము మిమ్ముల నుపేక్షించడమైనది బుభుక్షువులై ముముక్షువుల మని చెప్పువారును, పరిశ్రమజేసి యాత్మయొక్క విశ్రాంతిని బొందకయుండు నాశ్రమవాసుల నాశ్రయించి విశ్రమించుడు

నే నేమాత్రము ఇక మిమ్ముల నాశ్రయించను సంసారములో గల సారమును తెలిసికొనక నిస్సారమై విషయసౌఖ్యమును సారమని మదిలో దలంచి యట్టిదానిలో పడియుండువారును, సారాసార విచారమును చేయనివారును నగు సంసార్లులను నిరంతరము రంజింపజేసికొని మీరు నిరంతరము విశ్రాంతిని బొందియుండుడు నేను మిమ్ముల విసర్జించడమైనది భుక్తిపరులై భక్తులమనిగాని, ముక్తులమనిగాని చెప్పువారును, అవిద్యలో మునిగి విద్వాంసులవలె నటించువారు నెవరెవరు గలరో, వారందరిని ననుసరించుకొని కష్టములను వహించి నిష్ఠచేయక యుండువారును, శ్రేష్ఠుల యాచారమును విడచి నికృష్టకృత్యములను చేయువారు నెవరుగలరో వారిననుసరించి మీరు సుఖింపుడు నేనిక నేమాత్రము మిమ్ములను ననుసరించ తలంపను అబలులమని చెప్పి చలనస్వభావముగలిగి యుండువారును, అతీతులమని చెప్పి మతిశుద్ధములేని వారెవరెవరు గలరో వారి నవలంబించి చిరకాల ముండుడు ఏ మాత్రము మీరు నాగ్గఱ నుండదగరు

ఉత్తమయోగులమని చెప్పి మత్తువస్తువుల నుపయోగించి చిత్తవిశ్రాంతినే గానని వారును, ఎత్తైన యోగసిద్ధిని పొందనివారును ప్రపంచములో నెవ్వరైన నెచ్చటనైన నుండినచో వారిపొత్తున మెత్తగా నుండుడు నావద్ద నిక నేమాత్రమైన నుండుట కవకాశ ముండునని తలంపకుడు నిర్వృతినొంది నిర్వాణము నొందక వృత్తులకు వశులై జంతుశవముల తినువారెవ రుందురో వారి నాశ్రయించి చిరకాల ముండుడు పగలుమాత్రము ధ్యానము చేయువారివలెనుండి రాత్రిలో ధ్యానము చేయని వారెవరుందురో వారి నాశ్రయించుడు కొంగలను, హంసలను చూచునపుడు చాలవఱకు ఒకే విధముగా నుండును కొంగలు బురదనీరు, చిన్నచేపలు, కప్పలు నుండు

స్థలములో నుండును హంసలు స్వచ్ఛమైన నీరును, తామర పువ్వులును నుండు మానససరోవరాదులలో నుండును ఆలాగున దుర్బుద్ధి గల మీరందరును మలినహృదయులై భోగపరులైన వారి దగ్గఱకు వెళ్ళుడు శుద్ధాత్ములై జ్ఞానామృతముచే నిండిన హృదయ సరోవరముగల వారివద్ద మీరుండుట కర్హులు గారు

దొరకినదానితో సంతుష్టిలేక బ్రహ్మనిష్ఠ చేయక సత్తువైన పదార్థములు దొరకవలెనని కోరిక గలిగియుండువారును, దానివలన ఎక్కువ బ్రహ్మనిష్ఠ చేయవచ్చునని తలంచు వారెవరు గలరో వారిదగ్గఱకు వెళ్ళుడు విశుద్ధబ్రహ్మ సాక్షాత్కారము గలుగక యుండువారును, జ్ఞానులకు శుచి యాచారము లవసరములు గావని చెప్పు వారలగు మూర్ఖతాపను లెవరుగలరో వారి దగ్గఱకు వెళ్లుడు అక్కడ మీకు సౌఖ్యము గలుగును బ్రహ్మవిద్యాజ్ఞానము గలిగి యాత్మప్రకాశమును బొందకయుండువారును, విద్యాభ్యాసమును నిందించువారలెవరు గలరో అట్టి మూఢస్వభావముగల యోగుల దగ్గఱకు వెళ్ళియుండుడు అక్కడ మీ కనుకూలము గలుగును నిర్వృతి గలిగి నిర్వాణస్థితి గలుగని వారు వ్రతానుష్ఠానము లవసరము లేదనియు, పవిత్రములైన వ్రతానుష్ఠానముల నిందించువారునగు మూఢస్వభావముగల యోగులెవరు గలరో, అట్టి వారి నాశ్రయించి మీరు సుఖింపవచ్చును

అంతఃకరణశుద్ధి గలిగి విరక్తి ధామము నధిరోహింప శక్తిలేనివారును, సంసారములో నుండిన మోక్షము గలుగ దాయని చెప్పుచు విషయములకు వశులైయుండు వారును, ఏకాంతమగు పుణ్యప్రదేశము నాశ్రయించి బ్రహ్మనిష్ఠ చేయుటకు నొల్లనివా రెవరు గలరో వారి యవలంబనయే మీకు తగును మంచి పరిశ్రమజేసి జీవితమును ఋజుమార్గములో గడిపి బ్రహ్మనిష్ఠ చేయుట కొల్లనివారును, సాధువుల కనుష్ఠానమేమి? వారికి పనియేమి? అని చెప్పుచు తిరుగుచుండు మూర్ఖ స్వభావముగల వారెవరు గలరో అట్టివారి సేవయే మీకు తగును అంతేగాని సత్యనిష్ఠగలవారును, ధర్మ మార్గములో నడచువారును, నిత్యమైన బ్రహ్మమునందు నిలకడగల వారునగు పుణ్యాత్ముల దగ్గఱనుండుటకు మీకర్హత గలదా? పొండు! మీకొఱకు పైజెప్పినవారిని

నిర్ణయించుకొనడ మైనది ఇకను ఒక మెట్టు పైకెక్కిచూచిన మీరందరును కల్పితులే ఎండమావుల నీటి వలెను, ఆకాశనీలమువలెను లేనివారలే సువర్ణమున కన్యముగా నాభరణములును, సముద్రమున కన్యముగా కల్లోలములును, మృత్తున కన్యముగా ఘటములును ఎట్లు లేవో, ఆలాగుననే ఆత్మదృష్టిలో మీరందరును కల్పితులే వాస్తవముగా లేనివారలే మీరును, దేహమును, జగత్తును, బంధమును సత్యముగా కల్పితములే ఏకమై, అద్వితీయమై, శివమై, ఆనందమై వ్యాపకమై, నిత్యమై యుండు నే సద్వస్తువు గలదో అదియొకటి మాత్రమే నిత్యముగా బ్రహ్మముగా వెలుగుచుండును అన్యముగా నేమియు గలిగియుండలేదు

ఓం తత్ సత్ ఓమ్

మనో బుద్ధ్యహంకార చిత్తాని నాహం
న శ్రోత్రం న జిహ్వా న చ ఘ్రాణనేత్రే ।
న చ వ్యోమ భూమిర్న తేజో న వాయు
శ్చిదానంద రూపశ్శివోఽహం శివోఽహమ్ ॥ 1
అహం నిర్వికల్పో నిరాకారరూపో
విభుత్వాచ్చ సర్వత్ర సర్వేంద్రియాణామ్ ।
నచాఽసంగతం నైవ ముక్తిర్నమేయ
శ్చిదానంద రూపశ్శివోఽహం శివోఽహమ్ ॥ 2
అఖండాకాశ రూపోఽస్మి హ్యఖండాకార మస్మ్యహమ్ ।
ప్రపంచముక్త చిత్తోఽస్మి ప్రపంచరహితోఽస్మ్యహమ్ । 3
సర్వప్రకాశ రూపోఽస్మి చిన్మాత్ర జ్యోతిరస్మ్యహమ్ ।
కాలత్రయ విముక్తోఽస్మి కామాది రహితోఽస్మ్యహమ్ । 4
కాయికాది విముక్తోఽస్మి నిర్గుణః కేవలోఽస్మ్యహమ్ ।
ముక్తిహీనోఽస్మి ముక్తోఽస్మి మోక్షహీనోఽస్మ్యహం సదా ॥ 5
అవబోధైకరసోఽహం మోక్షానందైక సింధురేవాహమ్ ।
సూక్ష్మోఽహమక్షరోఽహం విగళితగుణజాలకేవలాత్మాఽహమ్ ॥ 6
నిరవధినిజబోధోఽహం శుభతరభావోఽహమప్రభేద్యోఽహమ్ ।

విభురహమనవద్యోఽహం నిరవధినిస్సీమసత్యమాత్రోఽహమ్ ॥ 7
శుద్ధోఽహమాంతరోఽహం శాశ్వతవిజ్ఞాన సమరసాత్మాఽహమ్ ।
శోధితపరతత్త్వోఽహం బోధానందైకమూర్తి రేవాహమ్॥ 8

ఓం తత్ సత్ ఓమ్

★★★★

యతో ధర్మస్తతో జయః

ధర్మరహస్యము – ధర్మముచే నూర్ధ్వగతియు, అధర్మముచే అధోగతియు గలుగుననియే ధర్మజ్ఞుల మతము ఇప్పుడు చెప్పబూనిన ధర్మరహస్యము వర్ణాశ్రమముల గుఱించిన ధర్మమునకు సంబంధించినది గాదు ధర్మస్థాపనముల గుఱించినదియు ధర్మప్రవర్తకులను గుఱించినదియు మాత్రమే యగును ఈ విషయములో నతిజాగ్రత్త నొందనిచో తమయొక్క ధర్మస్థాపనము లన్నియు, ధర్మప్రచారము లన్నియు, ధర్మకార్యము లన్నియు ధ్వంసము లగును ఈ తత్త్వమును లెస్సగా విచారించక పోవుటే యనేక ధర్మకార్యము లడుగంటి పోవుటకును, ధర్మప్రచారకులపై జనులకు విశ్వాసము లేక పోవుటకును గారణమగుచున్నది ఈ ధర్మ తత్త్వము బాగుగా నిర్మలబుద్ధి గలిగియుండు వారికి మాత్రమే గోచర మగును

జలములో కొంచెమైనను కల్మషముండినచో దానిలోగల వస్తువు లేలాగున కనబడవో, ఆలాగున హృదయములో కొంచెమైన మాలిన్యము గల్గియుండిన ధర్మతత్త్వ మెద్దియు దెలియదరము గాదు ఇదియే దీనిలో గల రహస్యము

ధర్మకార్యములు జరుగుచుండు కొన్ని స్థలములలోనికిని, ధర్మాత్ములని పేరుగాంచిన సాధువులుండు మఠములలోనికిని, బ్రహ్మ నిష్ఠులుండు ఆశ్రమములలోనికిని, ధర్మసత్రములలోనికిని, ధర్మదేవాలయ ములలోనికిని అనేకు లనేకవిధములగు ధర్మోపయోగ వస్తువుల నంపుదురు అక్కడ ధర్మకార్యముల కొఱకు ధర్మాత్ములు ధనము, ధాన్యము, వస్త్రములను, నితరజనుల కుపయోగములగు పప్పు, ఉప్పు, నెయ్యి, పాలు, పెరుగు, ఫలములు మొదలగు ననేక సాధనముల బంపుచుందురు రాజులన నేమి? రాజాధి రాజులు గూడ నీ విషయములో సహాయ మొనర్చుచుందురు

అట్లు సహాయము చేయుటకు కారణమేమన పై కార్యముల నిర్వహించెడు వారి కిచ్చిన, వారు ధర్మబుద్ధితో సద్వినియోగము జేయుదురనియు, అట్టి సత్కర్మల వలన తమకు (దాతలకు) పుణ్యము లభించుననియు, అట్టి యువస్థవలన నీశ్వరకృప సిద్ధించుననియు, దానివలన జన్మసాఫల్యము గలుగుననియు భావముతోనే చేయుచుందురు

అయితే అట్టి ధర్మకార్యముల దమకు తామే జేయకూడదా? మరియొకరిపై నేల యాధారపడ వలయును? అని తలంచెదరేమో! అట్లు తలంచ బనిలేదు ఏలన సంసారములోనుండు వారికి తీరిక గలుగుటయును, సమయము లభించుటయును ప్రయాసము అంతేగాక యేదైన దాన ధర్మాదులు జేయుటకును నెవరెవరి కెట్లెట్లు చేయవలయునో, ఎవరెవ రెట్లెట్లుందురో యెచటనుందురో యీలాటి కార్య ములన్నియు గృహస్థులు దెలిసికొనుటకు సాధ్యము గాదు సమయమును చాలదు మఱియు పైజెప్పిన ధర్మకార్యములలో గొన్ని యొకరొకరిచేత నిర్వహింపబడుటకును శక్యము గాదు వాని కనేకుల సహాయము గలిగి యుండవలెను లేనిచో ఒకవేళ ధనము మాత్రము గలిగియుండి, జన సహాయము గలిగియుండినను నిర్వహించుటకు సాధ్యము గాదు కనుకనే భక్తులకును, భాగవతులకును, సన్న్యాసులకును, ధర్మకైంకర్య నిర్వాహకులకును, ధర్మా త్ములకును ఇచ్చుట జరుగుచున్నది అంతియేగాని వారు చేతగానివా రగుటచేగాని, బుద్ధియోగ్యత లేనందుచేగాని, అమాయకు లగుటచేగాని అట్లు చేయుట గాదు ఇక దీనిలో గల మర్మము దెలిసికొన దగినది

అదేమన, కొందఱు దైవభక్తులై యుండు నపుడును, తపస్సు జేయు నపుడును, యోగనిష్ఠ గలిగియున్నపుడును ఇక నేదైన దైవ విషయములో బ్రవర్తించునపుడును వారిపై జనులకు విశ్వాసము కలుగును వారికిని కొంత జ్ఞాన మావిర్భవించును దైవభక్తి కలుగును జీవకారుణ్య ముద్భవించును వైరాగ్య ముదయించును పాపభీతి గలిగియుండును పుణ్య కార్యములలో ప్రీతి వృద్ధి నొందుచుండును అట్టి దైవస్వభావమును జూచియే ఇతరులకు వీరియందు భక్తివిశ్వాసములు గలుగుటకును, ధర్మకార్యములలో సహాయము

జేయుటకును గారణమగుచున్నది వీరిలో గొందఱికి ఇతః పూర్వము జెప్పిన దైవగుణములు కొంత తగ్గిపోవుటకు కొన్ని కారణములు గలవు

అదేమన నీలాటి ధర్మకార్యములలో బ్రవేశించుటకు ముందుగా వారికి నిరంతరము దైవనిష్ఠ యుండును అపుడు వారి మనస్సు నిప్పులో నుండునట్టి యినుమువలె జ్ఞానముచేతను, భక్తిచేతను, ఈశ్వర విచారము చేతను, వైరాగ్యముచేతను జ్ఞానమయజ్యోతియై వెలుగుచుండును ధర్మ కార్యములో, లోకసేవలో బ్రవేశించినపుడు ధ్యాననిష్ఠలు తగ్గిపోయినందుచే నిప్పునుండి బయటికి దీసిన యినుమేలాగున చల్లారి పోవునో యాలాగున వీరిలోగల దైవశక్తి తగ్గిపోవును ధర్మజ్యోతి యొక్క వెలుగు శాంతము నొందును అందువలననే యిట్టి హీనస్థితి గలుగుచున్నది కావున నెట్టి ధర్మముల జేయుచుండినను, లోకోపకారములలో బ్రవర్తించుచుండినను ధ్యానము మాత్రము ప్రతిదినము తగ్గకుండునటుల జూడవలెను అట్లయిన సదా నిప్పులో నుండెడి యినుమువలె వారి యాత్మజ్ఞానము సదా జ్వలించు చుండును ఇదియే దీనిలో గల రహస్యము

ఇక ధర్మకార్యములలో గల రహస్యమును జెప్పబోవుచున్నాను కరువుకాలములో అనగా కాటకములు గలుగునపుడు కొందఱు ధర్మాత్ములు దీనజనులయొక్కయు, బీదజనుల యొక్కయు, రోగులయొక్కయు, అనాధులయొక్కయు సంరక్షణకొఱకు ప్రయత్నింతురు, సంఘము ఏర్పాటు చేయుదురు వీరియొక్క ధర్మబుద్ధిని జూచి ధర్మాత్ము లనేకులు వీరికి సహాయముగా నుండి ధన, ధాన్య, వస్త్రాదులనేకముల నిచ్చుచుందురు గవర్నమెంటువారును తగినంత సహాయము జేయుచుందురు ఈ వస్తువులన్నిటిని వీరు సరిగా వినియోగపరచుచున్నారా? యని యితరులు జాగ్రత్తతో జూచుచుందురు ధర్మార్థముగా వచ్చియుండు నాయావస్తువుల నెవరెవరి కెంతెంత యివ్వవలయునో ఆలాగున పక్షపాతము లేక యిచ్చు చుండిన, అందరును వీరిపై విశ్వాసముగలిగి యింకను అనేక ధర్మకార్యములకు సహాయము జేయుచుందురు

ఆ ధర్మస్థులు దమవారికి హెచ్చుగా నిచ్చినను, తామెక్కువగా

భుజించినను, భేదబుద్ధితో కొందఱి కెక్కువ గాను, కొందఱికి తక్కువగాను ఇచ్చినను నదియు నధర్మమే యగును అంతియేగాక తాము స్వయముగా కార్యములను జూచుటకు ప్రయాసమని తలంచి కొందఱు నౌకరుల నేర్పాటు జేసిన వారుగూడ నాయా వస్తువుల సరిగా జూడక యేదైన చెడిపోయినను పాతకమే యగును వ్యర్థముగా ఖర్చు బెట్టినను దోషమే కలుగునను సరిగా బంచి పెట్టక రహస్యముగా నుంచినను నధర్మమే యగును ఇట్టి దుష్ట సంకల్పములు జనులకు దెలిసిన మఱల నేమియు నెవ్వరును నివ్వజాలరు అంతియేగాక గవర్నమెంటువారికి దెలిసిన గొప్ప శిక్షగూడ వేయుదురు, ఉద్యోగము లుండువారైనచో ధర్మద్రోహము జేసినందుచే జీతమును తగ్గింతురు లేక పనిలోనుండి తొలగింతురు లేక జులమానా వేయదురు ద్వీపాంతరమునకైన పంపుదురు యావత్కాల శిక్షనైన వేయుదురు చూచితిరా, ధర్మములోగల రహస్యమును!

ఆలాగున మంచివారనియు, ధర్మకార్యముల లెస్సగా జేసిరనియు గొర్మెంటువారికి దెలిసిన ఉద్యోగిగా నుండినచో జీత మెక్కింతురు ఇకను గొప్ప గొప్ప ధర్మకార్యములలో బ్రవేశపెట్టుదురు ఉన్నతోద్యోగముల నిత్తురు ధర్మముయొక్క రహస్యమును గ్రహించితిరా? ఇప్పు డీవిషయము నిచట చెప్పుటకు కారణమేమన కొన్ని మఠములకును, ఆశ్రమములకును, బ్రహ్మనిష్ఠులకును, భాగవతులకును అనేక భక్తులు, ధర్మాత్ములు, రాజులు మొదలైన వారందరును ధర్మముకొఱకనేక వస్తువుల నంపుదురు ఇవియన్నియు ముముక్షువుల కొఱకును, భక్తుల కొఱకును, బ్రహ్మనిష్ఠుల కొఱకును, బీదలకొఱకును, పరమకారుణికుడగు పరమేశ్వరుండు పై జెప్పిన వారి ద్వారా బంపుచున్నాడని తలంచవలయును అనగా వారి యంతరాత్మను బ్రేరేపించి వారివలన జేయించుచున్నాడని విశ్వాసము గలిగియుండవలెను

అంతేగాని, తనయొక్క తపోమహిమవలనగాని, భక్తి ప్రపత్తుల ప్రభావముచేగాని, యోగమహిమచేగాని లభించినదని తలంచి గర్వించరాదు అవి యన్నియు భగవత్ప్రసాదము లని తలంచి యెవరెవరికి నేయే వస్తువుల, నెంతమాత్ర మియ్యవలయునో ఆలాగున నిచ్చుచు, ఏవస్తువును చెడిపోనీయక

జాగ్రత్తపరచి భగవద్భక్తులకు బ్రహ్మనిష్ఠులకును నుపయోగపరచవలయును తనవారని తలంచిగాని, స్నేహితులని తలంచిగాని, ఏ వస్తువునుగాని నియమము నతిక్రమించి యివ్వరాదు ఇవి యన్నియు తన నిమిత్తము జనులిచ్చిరని యెంచి తానును మితిమీరి తినరాదు

మితిమీరిన ఖర్చు చేయరాదు అట్లయినమాత్రమే ధర్మము శాశ్వతముగా నిలువగలదు అట్టివారికి జ్ఞాన మభివృద్ధి నొందుచుండును ఉన్నతోన్నత స్థితిగూడ గలుగును అటులగాక కొందరికి శిష్యులు గూడ నేర్పడిన, ఏ వస్తువును సరిగా జూడక, సరిగా భక్తులకివ్వక చెడగొట్టిన పాపమే గలుగును అట్టి యధర్మకార్యముల జేయువారికి కొంతకాలము బోయిన మరల నేమియు లభించదు ఎవరును నేమియు నివ్వరు వారికి జ్ఞానము గూడ కృష్ణపక్ష చంద్రునివలె క్షయించుచుండును విషయములో బడిపోదురు పవిత్రబుద్ధియు వైరాగ్యమును తిరోహితమగును, అజ్ఞానాభివృద్ధి గలుగును దైవకృపకు దూరు లగుదురు, వెయ్యేల? దైవనిష్ఠు లెవ్వరును వారిని దగ్గఱకు జేర్చరు జను లసహ్యపడుదురు పాపము చుట్టుకొనును ఆఖరున జీవితము గడుపుటగూడ కష్టమగును అందఱికి విరోధులగుదురు ఎంతయడిగినను నెవరును దేనిని ఇవ్వరు ఆహా? వారి జీవితము దుఃఖముతో గడుపవలసియుండును ధర్మసొత్తును భుజించిన కొందఱికి మనోనిశ్చలత తప్పిపోవును, రోగముగూడ గలుగవచ్చును

కావున నీ సంగతు లన్నిటిని గ్రహించి ధర్మమార్గమున వర్తించువారికి నిత్యసుఖము గలుగును వారిని దైవ మనుగ్రహించును ఎల్లప్పుడును దైవము వారికి తోడై రక్షణ జేయుచుండును? ''ధర్మస్య ప్రభురచ్యుతః'' అయితే పైజెప్పిన యుదాహరణమువలన మందబుద్ధులు ఒక సంగతిని దెలిసికొనగలరు ధర్మకార్యములలో తాము జేయు కృత్రిమ మెవరికైన తెలిసినగదా! జనులకు దెలుపుటగాని, గవర్నమెంటువారి కెరుక జేయుట గాని గలుగును! మనము జేయునదెవరికిని దెలియదుగదా! ఎవరును జూడలేదుగదా! యని తలంతురు అట్లు తలంచుటయే మాయయొక్క మహా మోహముచే గలిగెడు అపాయము

సర్వేశ్వరుండు సర్వకాల సర్వావస్థల యందును, జాగ్రత్స్వప్న సుషుప్తులనెడి భేదములేక పరమాణువునుండి పరమేశ్వరునివఱకు సర్వప్రాణికోట్ల హృదయాంతరాళము నుండి సమస్త సంకల్పములగూడ నెఱుంగుచున్నాడు ఆ మహాత్ముడు కన్ను లేకయే సర్వ జంతువులయొక్క యంతరాళములోగల భావమును జూచుచున్నాడు ఆ పరమపిత చెవిలేకనే పరమాణువుల సంకల్పములను స్పష్టముగా వినుచున్నాడు కాళ్లులేకయే యొక క్షణములో ననంతకోటి బ్రహ్మాండములన్నిటి యందును సంచరించుచున్నాడు ఆ మహామహిమ గల సర్వేశ్వరుడు చేతులులేకయే యనంతకోటి ప్రాణికోట్ల కేకకాలమున వాటివాటి కర్మానుగుణమగు ఫలమును గలుగజేయుచున్నాడు అతని దృష్టినుండి యొక పరమాణువు సహితము తప్పించుకొని పోజాలదు అట్టి సర్వేశ్వర దృష్టిని మూసిపెట్ట జూచుచున్నారా? అట్లయిన నది మార్జాలపయః పానన్యాయము ననుసరించి యుండును అనగా పిల్లిపాలను దొంగిలించి త్రాగునపుడు కన్నుమూసికొని యుండును దాని భావమేమన నిపుడెవరును కనుగొన జాలరనియే అట్టి బిడాలజీవితము గలవారే పరమాత్మ దృష్టినుండి తప్పించుకొనుటకు జూచుచుందురు ఈవిషయమై యుపనిషత్తు జెప్పినదానిని జూడుడు

అపాణిపాదో జవనో గృహీతా
పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః ।
స వేత్తి వేద్యం న చ తస్యాస్తి వేత్తా
తమాహురగ్ర్యం పురుషం మహాన్తమ్ ॥

దీనియర్థము పైనజెప్పబడినదే, అదే విధముగా శ్రీకృష్ణభగవానుడు గీతలో నుపదేశించిన దానిని జూడుడు-

సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షి శిరోముఖమ్ ।
సర్వతః శ్రుతి మల్లోకే సర్వమావృత్య తిష్ఠతి॥ (13-14)

బ్రహ్మమంతట నిండిన చేతులు గలవాడును, పాదములు గలవాడును నేత్రములు గలవాడును, ముఖము గలవాడును, చెవిగలవాడునునై యుండి సమస్తమును నెఱుంగుచుండును

ఓహో? అతని మహిమ నెవరు వర్ణింపగలుగుదురు దీనికంటె ప్రబల ప్రమాణము గావలయునా? అయ్యో జనులయొక్క యజ్ఞాన మేమని చెప్పవచ్చును? ఈతత్త్వమును దెలిసికొనజాలకనే అనేకులు హృదయములో కలంకము నుంచి పైకి నిష్కలంకులవలె వర్తించుచున్నారు గీతను జూడుడు ''నాహంప్రకాశ స్సర్వస్య యోగమాయా సమావృతః'' సర్వేశ్వరుండు స్వకల్పితమగు విష్ణుమాయా శక్తిచే నావృతుడై యుండినందుచే మూఢాత్ములు తెలిసికొనజాలక పోవుచున్నారు పరదాలోపల నుండు అంతఃపురస్త్రీ తాను పరదా రంధ్రములద్వారా యితరులను జూచుచుండును గాని యితరులా మెను జూడజాలరు ఈశ్వరుని యొక్కయు జీవునియొక్కయు స్థితి యీ లాగున నుండును

జనులారా! మీరు భూమిలో నొకవిధమగు విత్తనమును బెట్టి, జనులతో మఱియొకరకమగు విత్తనమని చెప్పినను మీరు బెట్టిన విత్తనముదప్ప మరియొకటి ఫలించునా? ఆలాగున మీ అంతఃకరణములో గల సంకల్ప మేలాగున నుండునో, దాని కనుగుణమగు ఫలము గలుగునేగాని వేరొకటి ఫలించదు కావున కర్మలో దృష్టినుంచి జీవించవలయును అప్పుడే జీవితము పవిత్రమగును

అధర్మప్రభవం చైవ దుఃఖయోగం శరీరిణామ్ ।

ప్రాణికోట్లకు నధర్మపు వృత్తివలన సదా దుఃఖమే గలుగుచుండును ఆలాగున ధర్మప్రవర్తకులకు నక్షయమగు సుఖము గలుగును

ఫలం కతకవృక్షస్య యద్యప్యంబు ప్రసాదకమ్।
న నామగ్రహణాదేవ తస్య వారి ప్రసీదతి॥

చిల్లగింజ మట్టినీటిని శుద్ధపరచునదైనను నీటిలో నరగ దీయక పేరుమాత్రము చెప్పిన జలమేలాగున శుద్ధము గాజాలదో, ఆలాగున ననుష్ఠానమును సరిగా జేయక ధర్మవాక్యముల నుచ్చరించినందుచే ఫల మిసుమంతయును గలుగజాలదు

ధర్మచర్యయా జఘన్యో వర్ణః
పూర్వం పూర్వం వర్ణమాపద్యతే జాతిపరివృత్తౌ ।

అధర్మచర్యయా పూర్వో వర్ణో
జఘన్యం జఘన్యం వర్ణమాపద్యతే జాతిపరివృత్తౌ ॥

ధర్మప్రవృత్తివలన క్రిందస్థితిలో నుండువారుగూడ నున్నతోన్నత స్థితిని బొందుచుందురు అత్యున్నతస్థితిని బొందినవారైనను అధర్మప్రవృత్తి యందు ప్రవేశించిన క్రమముగా నీచస్థితిలోనికి వచ్చి చేరుదురు ఇట్టి పరమ సత్యమును జ్ఞప్తియందుంచి జీవించువారు పరమాత్మని గనుగొన గలుగుదురు

అనఘ కులంబు బలంబును
ధనము వయోరూపములును తపమును రాజ్యం
బును విద్య యిన్ని గూడి య
గును నష్టమదంబులవియు గూఢాత్ములకున్॥

అష్టమదముల వివరణము ఇవి తనలో లేశమైన గలుగకుండు నటుల జాడవలెను 1 శ్రేష్ఠకులమను భావము 2 జన, అధికారములచే గలిగెడి బలము 3 ధనము 4 యౌవనము 5 రూపము 6 తపస్సు అనగా తాను తపోబలము, యోగబలము, సదాచారము, జీవకారుణ్యము, వైరాగ్యము, సాత్త్వికాహారము, శుచిత్వము గలవాడనని తలంచుట 7 రాజ్యము 8 విద్య (తాను విద్వాంసుడననియు, సమస్తము దెలిసిన వాడననియు దలంచి యితరులను తూలనాడుట) ఇవియన్నియు దేహము అంతఃకరణము మొదలగు వాటి ధర్మములేగాని ఆత్మ ధర్మములు గావు కావున విడువదగినవి అష్టపాశములు

దయయు జుగుప్సయు మోహము
భయమును సంశయము కులము బలశీలము ల
న్నియు గూడ నష్టపాశము
లయి వెలయును వానినాత్మ డంటకయుండున్ ॥

(భారతము – అనుశాసనము)

1 దయ (తనదేహ సంబంధుల మాత్రము ప్రేమించుట) 2 అసహ్యపడు స్వభావము 3 మోహము 4 భయము, 5 సంశయము,

6 కులము 7 బలము, 8 శీలము అనగా తాను శుచి యాచారము గలవాడనను నహంకారము ఇవి యాత్మలో గలుగకుండు నటుల జూడవలయును

★★★★★★

దృఢ వ్రతము

సర్వదా శర్వ! సర్వేశ! సర్వోత్తమ! మహేశ్వర!
తవ నామామృతం దివ్యం జిహ్వాగ్రే మమ తిష్ఠతు॥
ఏకో వశీ సర్వభూతాంతరాత్మా
ఏకం రూపం బహుధా యః కరోతి ।
తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరా
స్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్ ॥

టీక॥ ఏకః = తనకంటె (అల్పుడును అధికుడును తనతో సమానుడుగును అగువాడు) మఱొక్కడు లేనివాడును, వశీ=సర్వజగత్తు స్వాధీనముగా గలవాడును, సర్వభూతాంతరాత్మా =సర్వభూతములకు అంతరాత్మస్వరూపుడును అగు, యః=ఏయాత్మ (పరబ్రహ్మము) ఏకం రూపం=శుద్ధవిజ్ఞానఘన రూపుని, బహుధా = అనేకవిధములుగా జేయువానినిగ, కరోతి=చేయుచున్నాడో, యే ధీరాః = ఏబ్రహ్మనిష్ఠులు, ఆత్మస్థం=స్వశరీర హృదయాకాశాంతర్గతమగు బుద్ధిగుహయందున్న, తం = ఆ పరమాత్మను, అనుపశ్యంతి =లెస్సగా దర్శించుచున్నారో, తేషాం = అట్టివారెవరైనను వారికే, శాశ్వతం సుఖం = నాశములేని సుఖము లభించును, ఇతరేషాం = అట్టి ఆత్మావలోకనము గలుగనివారికి, న = అట్టి అక్షయమైన దైవసుఖము గలుగదు

మానవుడు ఉన్నతస్థితికి రావలసియుండిన దృఢవ్రతము గలవాడు గావలయును ఈదృఢత్వము లేనిచో ఎన్ని వ్రతము లాచరించినను ఊర్ధ్వగతి గలుగజాలదు వ్రతమనగా నెట్టివిపత్తు గలిగినను తనయొక్క నియమము నుండి చలింపక యుండునదని గ్రహించవలయును ప్రపంచములో శాశ్వత ములగు సమస్తకార్యములును ఇట్టినియమము ననుసరించియే జరుగుచున్నవి

నది దాటుటకు వంతెన ఎట్టిదో మనుజు డున్నత స్థితిని గలుగజేసికొనుటకు దృఢవ్రతమును అట్టిది వంతెన దృఢముగా లేనిదైనచో నేలాగున విరిగి పడిపోవునో యాలాగున దృఢవ్రతములేని మనుష్యుడు తనయొక్క గమ్యస్థానమునుండి జారిపడుట నిశ్చయము వంతెననుండి పడిపోయిన వాడేలాగున ఏటిలో కొట్టుకొనిపోయి సముద్రములోబడి చనిపోవునో ఆలాగున తన వ్రతము నుల్లంఘించిన వాడు గూడ జననమరణ ప్రవాహమగు ఏటిలోబడి సంసారసాగరములోబడి దుఃఖములను బొందుట నిక్కము ఇక చెప్పబోవు ప్రతి వ్రతశబ్దమునకు అచంచల మైన నియమ మర్థమని గ్రహించవలయును

చెరువుకట్ట దృఢముగా లేనిచో ఏలాగున తెగి జలము వెళ్ళిపోవునో, యాలాగున తనయొక్క పవిత్రత యంతయు దృఢవ్రతము లేనిచో నశించి పోవును ప్రపంచములోగల జనులు యావత్తు వ్రతముల ననుష్ఠింపక, తమకు సాధ్యమైనదియు, ప్రీతిగలదియు, శుభమును గలుగజేయునదియు నగు ఒక్కవ్రతమునైనను ననుష్ఠించవలెను ఏకాదశి, ప్రదోషము, చాంద్రాయణము, ఆత్మసంయమము మొదలగు నోములలో నేదైన ఒక్క దానినెట్లు నోచుచుందురో, ఆలాగున తమకు సాధ్యమైనదియు, ఆత్మను పరిశుద్ధము చేయునదియునగు ఒకవ్రతము నాచరణలో నుంచవలెను ఇచ్చట చెప్పబడినది యేకాదశ్యాది వ్రతమని మాత్రము తలంపరాదు తనయొక్క జీవితోన్నతికి తగిన నియమమని గ్రహించుకొనవలెను పై జెప్పిన వ్రతములలోగూడ ఒక్కటియైన నుండుట మంచిది దానిలో నేలాటి లోపమును గలుగక యాచరణ గలిగియుండవలెను అప్పుడు దృఢమగు వంతెనపై నేలాగున సుఖముగ నదిని దాటిపోవచ్చునో యాలాగున సంసారసాగరమును సులభముగా దాటిపోవచ్చును చెరువుకట్ట స్థిరముగా నుండ నీటికి ఏలాటి కొఱతయు గలుగక పైరు ఏలాగున పండించవచ్చునో, ఆలాగున మానవజీవితము యొక్క పరమలక్ష్యమును సుదృఢ వ్రతమును చెరచరాదు ఒకవేళ ప్రాణహాని కలిగినను అది నిత్యమంగళమగు ముక్తిని గలుగజేయును. ఇక బహుకాలమునుండి సంపాదించవలసిన దైవకృపగాని, ఆత్మజ్ఞానము గాని, యోగసిద్ధిగాని సంపాదించిన పొందవలసిన మోక్షమప్పుడే యతనికి లభించును

ఒకవేళ పైజెప్పిన భక్తి, యోగ జ్ఞానాదు లీజన్మములో అనుష్ఠించిన పూర్తియగునని చెప్పజాలము వ్రతసంరక్షణవల్ల మరణము ప్రాప్తించినను ముక్తి గలుగుట నిక్కము ఇందుకు శ్రీగీతావాక్యమే ప్రమాణము ''స్వధర్మే నిధనం శ్రేయః'' దీనియర్థము పైనజెప్పినదే రోగముగలవానికి ఆయుర్వేదములో జెప్పబడిన యౌషధము లన్నియు నేలాగున అవసరములు గావో, యాలాగున ధర్మశాస్త్రములో చెప్పబడియుండు ప్రయత్నము లన్నియు నొక్కరి కవసరము లేదు రోగమునకు తగిన పథ్యమును లేనిచో వ్యాధి యేలాగున కుదరదో, యాలాగున ఒక్క నియమము చక్కగ లేని మానవుడు భవరోగమునుండి విముక్తుడు గాజాలడు లోకములో పండిన ధాన్యము లన్నియు ఒక్కరి యాకలి శమనమున కేలాగున పని లేదో ఆలాగున శాస్త్రములో విధించిన వ్రతము లన్నియు ఒకరికుండ వలసినది లేదు ఏదైన ఒక అన్నము లేనిచో ఆకలిబాధ యెట్లు శమింపదో ఆలాగున ఒక్క వ్రతములో మంచి నిష్ఠ లేనిచో మనుజుని తాపత్రయమున్ను శమించదు ఇట్టి నిశ్చయము ముందుగానే చేసికొనవలయును

నియమము లేని మనుజుడును పశువును సమానముగా నుందురు పశువులకు నియమము లేదు ఆలాగున నియమ ములేని మనుజుడు పశువులతో సమానుడని లోకము చెప్పెడు రహస్యము ఒక రసాయన శాస్త్రజ్ఞుడు తాను చేయు రసాయనమునకు ఏయే పదార్థములు ఎంతెంత భాగములుండిన నది చక్కగ పనిచేయునని తెలిసియుండునో, వాటిలో నేదైన వస్తువులు కొరతగలిగిన అది చెప్పినట్లు ఎలా పనిచేయుజాలదో, మానవునియొక్క వ్రతనియమములును అలాటివని గ్రహించుకొనవలెను రసాయన శాస్త్రజ్ఞుని యాశయమెట్టిదో యౌషధముయొక్క యేర్పాటును అట్టిదే ఏయేమందులు ఎంతెంత చేర్చి యెట్లు పక్వము చేయవలయునో, యాలాగున పాకముచేసిన మాత్రమేగదా రోగమును హరింపజేయును వెయ్యేల ఒక పదార్థమును పచనము చేయునప్పుడు ఏయే వస్తువులు ఎంతెంత చేర్చవలయునను నియమము గలదో ఆలాగున చేర్చినగదా భుజించుటకు యోగ్యముగాను, ఆరోగ్యముగాను ఉండును తనయొక్క వ్రతనియమము

లును అలాటివే యని మరువకూడదు

పూర్వికులకట్టి నియమముండుటచేతనే వారు పవిత్రులగుటకును, అమోఘ కార్యములను సాధించుటకును సమర్థులైరి. ఈవిషయమై గీతాచార్యులు నాల్గవ యధ్యాయమున వ్రతమును గురించి ఉపదేశించినది చూడుడు ఇవియన్నియు వ్రతములే దీనియందు మీకు ఏ యజ్ఞము (వ్రతము) అనుష్ఠించుటకు సాధ్యమగునో వానిలో ఒక్కటియైన తప్పక యుండవలెను అట్లు గానిచో మానవకోటి తరింపజాలదు. ఇట్టి వ్రతము మానవుని వెన్నెముక వంటిదని దృఢనిశ్చయము గలిగి యుండవలెను ఇది స్త్రీల కైనచో సుమంగళియగు స్త్రీకి మంగళసూత్రము వంటిదని నిశ్చయము గలిగి యుండిన మాత్రమే తరించగలుగుదురు లేనిచో మాయ మీకు త్రోవజూపదు ఆమాయ యెల్లప్పుడును నీటిపైగల నాచువంటిది చేతులతో తొలగించిన వెంటనే సందిచ్చినను హస్తము తీసిన అది తత్‌క్షణమే వచ్చి యెట్లుమూసికొనునో, అలాగున మీవ్రతము దృఢము గలిగియుండువఱకు మాయ మీయాత్మను ఆవరింపజాలదు వ్రతభంగము గలిగిన అపుడే ఆవరించుకొనును

అయితే మూర్ఖపుపట్టుదలగాని, నిషిద్ధకార్యములలో హఠముగాని, అధర్మవిషయములలో పిడివాదముగాని యుండరాదు ఆది వివేకులకు తగదు దానికి వితండము అనిగాని, మర్కటముష్టి అనిగాని పేరు గలదు అది ఒక విధమగు క్రూరస్వభావము దానివల్ల మీకార్యము సాధించినను గలిగెడు ఫలము దుఃఖమే యగును ఇది పాపస్వభావము అట్లుగాక పైజెప్పిన వ్రతనియమములన్నియు ధర్మయుక్తముగాను, దైవ ప్రీతికరముగాను, సజ్జన సమ్మతముగాను, ఆత్మాభివృద్ధికి హేతువుగాను, శాస్త్రనుసారముగ నుండునవిగా నుండవలయును ఈవిషయము ఇదమిత్థమని నిశ్చయించుటకు చాల వివేకజ్ఞానమును, విశాలభావమును గల్గి ధర్మశాస్త్రసార మెరింగియు నుండవలెను లేనిచో ఇట్టి విషయములలో ధర్మసంకటముగాని, ధర్మసందేహముగాని గలిగినచో జ్ఞానసంపన్నులును ధర్మశాస్త్ర మెరింగినవారును మీ యొక్క క్షేమమును కోరువారును, సత్యవ్రతము గలవారునగు వారి సలహాలను

ఆవశ్యముగ తీసికొనవలెను లేనిచో మౌర్ఖ్యముతో గూడిన పట్టుదలకు హానియే గలుగును అట్లు గలుగనీయక బహుజాగరూకతతో యోచించుకొనవలెను

దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।

బ్రహ్మాగ్నావపరేయజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ॥ (గీత–4–25)

టీ॥ 1 అపరే =మరికొందఱు, యోగినః =యోగులు, దైవం= దేవతాసంబంధమైన, యజ్ఞమేవ=యజ్ఞమునే, పర్యుపాసతే=చేయుచున్నారు 2 అపరే =మరికొందరు (జ్ఞానులు) యజ్ఞేనైవ = ఆత్మకు సంబంధించిన యజ్ఞ సాధనములచేతనే, యజ్ఞం=ఆత్మను, బ్రహ్మాగ్నౌ=బ్రహ్మమను అగ్నియందు, ఉపజుహ్వతి – హోమముజేయుచున్నారు

ఈశ్లోకమునుండి జనులు చేయు వ్రతములను (యజ్ఞములను) శ్రీభగవాను లుపదేశించియున్నారు కొందఱు ఫలాపేక్షలతో దేవతల నుద్దేశించి కర్మ కలాపముతో యజ్ఞమును చేయుచున్నారు చిత్త శుద్ధిగలిగిన కొందఱు ఆత్మ సంబంధమైన మనస్సు, ఇంద్రియములు మొదలగు వానివల్ల ఆత్మలోనే హోమ (యజ్ఞ) మును చేయుచున్నారు, ఈ ఆత్మయజ్ఞవిషయమై ప్రారంభించినపుడే మలినబుద్ధిగలవాడు బాహ్యాగ్ని యందును, ఆత్మశుద్ధి గలవారు ఆత్మజ్ఞానాగ్ని యందును హోమము చేయుచున్నారని తెలుపడమైనది

శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి।

శబ్దాదీన్విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి॥ (4–26)

టీ॥ 3 అన్యే = మరికొందఱు, శ్రోత్రాదీని = కర్ణేంద్రియములు మొదలైన, ఇంద్రియాణి=ఇంద్రియములను, సంయమాగ్నిషు=నిగ్రహము లనెడు యగ్నులయందు, జుహ్వతి=హోమము జేయుచున్నారు 4 అన్యే = మరికొందరు శబ్దాదీన్ = శబ్దము మొదలగు, విషయాన్ = విషయములను ఇంద్రియాగ్నిషు = ఇంద్రియములనెడు అగ్నులయందు, జుహ్వతి= హోమము జేయుచున్నారు

కొందఱు సంయమశీలురు కర్ణము, త్వక్కు, చక్షువు, జిహ్వ, ఘ్రాణము మొదలగు ఇంద్రియములను లెస్సగా నియమించుకొని తత్త

ద్విషయముల లోనికి పోనీయకున్నారు ఇదియునొక యజ్ఞమే మరికొందరు శబ్ద, స్పర్శ,రూప, రస, గంధములనెడు అయిదు విషయములను తత్తత్కారణములగు ఇంద్రియములలో లయమొందించుచున్నారు ఇదియునొక యజ్ఞమే యగును

సర్వాణీంద్రియ కర్మాణి ప్రాణకర్మాణి చాపరే।
ఆత్మ సంయమ యోగాగ్నౌ జుహ్వాతి జ్ఞానదీపితే॥ (4-27)

టీ॥ 5 అపరే=మఱికొందఱు, సర్వాణి=సమస్తములయిన, ఇంద్రియ కర్మాణి = జ్ఞానేంద్రియములయొక్కయు, కర్మేంద్రియముల యొక్కయు, వ్యాపారములను, జ్ఞానదీపితే = ఆత్మజ్ఞానముచే ప్రకాశింపజేయబడిన, ఆత్మసంయమ యోగాగ్నౌ=ఆత్మయందు మనస్సును నిరోధించుటయే స్వరూపముగాగల యోగమనియెడు (స్వస్వరూపానుసంధాన మనియెడు) అగ్నియందు, జుహ్వాతి= హోమముజేయుచున్నారు

మరికొందరు ఇంద్రియములను, ఇంద్రియవిషయములను పంచ ప్రాణములను వాటి వ్యాపారములను మొత్తము ఆత్మయందు వ్రేల్చుచున్నారు ఇదియునొక యజ్ఞమే పైజెప్పిన శ్లోకములో నిరూపించిన వారి కన్న వీరి కధికనిష్ఠ గలిగియుండును

ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాఽపరే।
సాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయస్సంశితవ్రతాః॥ (4-28)

టీ॥ 6 అపరే = మఱికొందఱు ద్రవ్యయజ్ఞాః =ద్రవ్య దానమను యజ్ఞమును చేయుదురు అనగా కొందఱు భోజనము చేయుటకుమందు తమ శక్తికొలది కొద్దిమందికి గాని అన్న, ధన, ధాన్య, వస్తువులలో నేదైన నొకటి ఈశ్వరార్పణబుద్ధితో దానము చేయుదురు. వీరును యజ్ఞమును చేయువారే పై జెప్పిన యోగాద్యనుష్ఠానములు చేయు శక్తిలేనివారు ఇట్టి ద్రవ్యయజ్ఞమును చేసిన చాలును

7 కొందఱు – తపోయజ్ఞాః =తపస్సు అను యజ్ఞము చేయుదురు అనగా పరమేశ్వరునిగుఱించి హృదయము తపించేలాగున ధ్యానము చేయుదురు ద్రవ్యయజ్ఞమునకు శక్తిలేనివారు ఇట్టి తపస్సనెడి యజ్ఞమును

చేసిన చాలును

8 కొందఱు – యోగ యజ్ఞాః=ప్రాణాయామ ప్రత్యాహారాదులే స్వరూపముగా గల లేక చిత్తవృత్తినిరోధమే స్వరూపముగాగల యోగమనెడు యజ్ఞమును చేయుదురు

9 కొందఱు – స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞాః = నియమపూర్వకముగ ఋగ్వేదాదులలో కొన్ని భాగములనుగాని, యుపనిషత్తులలో కొన్నిభాగ ములను గాని శ్రీభగవగ్గీతాదులలో కొన్నిభాగములుగాని, సహస్ర నామాష్టోత్తరాద్య ర్చనలలో కొన్ని భాగములుగాని స్మరణ, కీర్తనల, భజనాదులలో కొన్నిటి నిగాని ప్రణవ, గాయత్రీ, శివ, నారాయణాది మంత్రములలో కొన్నిటినిగాని జపము చేసెడు యజ్ఞమును చేయుదురు లేక పై జెప్పిన వేదోపనిషత్తు లయొక్కయు, ప్రణవాది మంత్రముల యొక్కయు అర్థమును, అధిష్ఠాన దైవతములను, నిదిధ్యానము గలిగి యుందురు, వీరును యజ్ఞనిష్ఠాపరులే

10 అపరే = మరికొందఱు, యతయః = మోక్షమునుగుఱించి ప్రయత్నముచేయు సన్న్యాసులు, లేక జయింపబడిన యింద్రియములు గల వారు, సంశితవ్రతాః = తీక్ష్ణములైన వ్రతములే యజ్ఞముగా గలవారై యుం దురు, యతయః, యత్నశీలాః, యతులనగా సదా ప్రయత్న పరులనియే యర్థము గలదు ఇట్టి యతులుండిన కాలమునందు గదా మనలోకము స్వర్గలోకముగ నుండినది స్వర్గలోకమని చెప్పనేల? దైవలోకముగ నుండెన నియే చెప్పవలెను ఏలన! స్వర్గలోకము విషయభోగములతో గూడినది దైవలో కమో, జ్ఞానానందముతో కూడినది

ఈ శ్లోకమునందు శ్రీకృష్ణభగవానులే 'యతయః సంశితవ్రతాః' అని సెలవిచ్చినారు యతులనగా, సుతీక్ష్ణమైన వ్రతనిష్ఠ గలవారని యుపదేశించినారు ఇప్పుడుండు వారిలో ఇట్టి తీక్ష్ణమైన వ్రతము లేకపోవుటచేతనే పదునులేని కత్తిచే నరుకబడిన చెట్లు తెగకయుండునట్లు వీరియొక్క అంతః కరణములోగల దృశ్యవృత్తులనెడు తరువులు ఛేదింప బడకున్నవి సునిశ్చిత వ్రతము గలవారైనచో నుక్కుతో చేయబడి

మంచిసానబెట్టబడిన గొడ్డలివలె నుందురు దానివల్ల యావత్తు వృక్షలతాదులను ఛేదింప శక్తి గలిగిన ట్లుండును ఇప్పుడుండు వారికేలాటి వ్రతనియమములు లేనందుచేతనే వీరి యొక్క ఆత్మ శక్తి తగ్గిపోయినది సమిధలు నశించినచో అగ్నిహోత్రుడు ఏలాగున చల్లారునో వ్రతనియమ నిష్ఠలు లేనివారి ఆత్మశక్తిగూడ అట్లే క్షీణించిపోవును అగ్ని హోత్రునియందు కట్టెలును, నేయియును వేయువా రెవరైనను నేలాగుననది 'ప్రజ్వరిల్లునో, ఆలాగున మనుష్యమాత్రులలో నెవరైనను అత్మసంయమమును హోమముచేసిన, జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లును, సంశయము లేదు సుతీక్ష్ణమగు వ్రతనిష్ఠలు గలిగియుండువఱకు సంన్యాసులకు అపారమగు మహిమయు, పూజ్యతయు గలుగుచుండెను ఎప్పుడట్టి నిష్ఠ తగ్గెనో అపుడే అత్మశక్తియు, పూజ్యతయు అస్తమించినవి.

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాపరే ।
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః ॥ (4-29)

టీక॥ 11 అపరే = మరికొందఱు, ప్రాణాయామ పరాయణాః = ప్రాణాయామమునందాసక్తి గలవారై, ప్రాణాపానగతీః = ప్రాణాపాన వాయువులయొక్క గతులను, రుద్ధ్వా = అడ్డుపరచి, (కుంభకమును జేసి) అపానే = అపానవాయువు వ్యాపారమునందు ప్రాణం = ప్రాణవాయువు వ్యాపారమును (పూరకమును) తథా = ఆవిధముగానే, ప్రాణే = ప్రాణ వాయు వ్యాపారమునందు, అపానం = అపానవాయు వ్యాపారమును, (రేచకమును) జుహ్వతి = హోమమును చేయుచున్నారు

వీనియందు ఒకటి బాహ్యకుంభకముగాను, ఒకటి అంతర కుంభకము గాను, ఒకటి మామూలు కుంభకముగాను నుండును

అపరే నియతాహారాః ప్రాణాన్ప్రాణేషు జుహ్వతి ।
సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః ॥ (4-30)

టీ॥ 12 అపరే = మరికొందఱు, నియతాహారాః = నియమితమగు శుద్ధాహారము నియమప్రకారము నియమితకాలములో భుజించు వారునగుచు, ప్రాణాన్= ప్రాణవాయువులను, ప్రాణేషు =

ప్రాణవాయువులయందు, జుహ్వతి = హోమమును జేయుచున్నారు, ఏతే = ఈ చెప్పబడిన, సర్వేఽపి = అందఱును, యజ్ఞవిదః = యజ్ఞములను చేయ నెరిగినవారే యగుదురు యజ్ఞక్షపిత కల్మషాః = యజ్ఞములచే పోగొట్టబడిన కల్మషము గలవారగుదురు

అదేమన! ఇట్టి నిష్ఠలచే సమస్తపాపములు నశించి ఆత్మశుద్ధి గలుగును పైశ్లోకములో మూడు విధములగు ప్రాణాయామములు చెప్పబడెను అట్లయిన మొత్తము పదునాలుగు విధములగు యజ్ఞములను చేసిన వారైయుందురు, ఈశ్లోకములో కేవలకుంభకమును గుఱించి తెలుపడమైనది దీనియందు 'నియతాహారాః' అనగా ఆహారనియమము గలవాడుగూడ యజ్ఞమును చేసిన వాడేయగును ఏలన! ఆహార నియమము గలవాడు ధర్మమునకు వశపడియుండును

యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ।
నాయం లోకోస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ॥ (4–31)

టీక॥ యజ్ఞశిష్టామృతభుజః = పైజెప్పిన ఆత్మీయములగు దైవ కార్యములు అనగా అనుష్ఠానములు అయిన తరువాత భుజించెడి అన్నము అమృతము వంటిదియగును దానికి అంత పావనత్వము గలదు దానిని భుజించువారు, సనాతనం=శాశ్వతమగు, బ్రహ్మ = బ్రహ్మమును, యాంతి=పొందుచున్నారు పైజెప్పిన నిష్ఠలచే ఆత్మ పరిశుద్ధ మగుటవల్ల అట్టివారు పరబ్రహ్మ సాక్షాత్కారము పొందుచున్నారు అయజ్ఞస్య = పైజెప్పిన వ్రతాలలో నొకటియైన చేయనివానికి, అయం = ఈ, లోకః=లోకమైన, నాస్తి= లేదు ఇట్టి పుణ్యము చేయనివానికి ఇహలోకమందైన సుఖము గలుగదు, హే కురుసత్తమ!=కురువంశపు రాజులలో నుత్తముడవైన ఓ అర్జునా! అన్యః= (ఈలోకముకంటె) వేరయిన, లోకః = పుణ్య లోకము, కుతః = యెక్కడిది? ఈలోకములో సత్కర్మానుష్ఠానము చేయని వానికి పరలోకగతి గూడా లేదుగదా! పైరు పెట్టుకాలములో వ్యవసాయము చేయనిచో కోత కాలమున పనియుండదుగదా! ఈమానవ లోకమే ఏకర్మనైన చేయుటకు తగినది తక్కిన లోకము లన్నియు కర్మఫల మనుభవించుట కేర్పడినవి

ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే।
కర్మజాన్విద్ధి తాన్సర్వానేవం జ్ఞాత్వా విమోక్ష్యసే॥ (4-32)

ఏవం=ఈవిధముగా, బహువిధాః = అనేక విధములైన, యజ్ఞాః = యజ్ఞములు, బ్రహ్మణః=వేదముయొక్క, ముఖే = ద్వారమునందు వితతాః=విస్తారముగా నేర్పడినవి అనగా వేదముఖముద్వారా ప్రకాశితములై యున్నవి లేక బ్రహ్మముఖమునుండి యేర్పడినవి సర్వాన్=సర్వములైన, తాౕ=ఆ యజ్ఞములను, కర్మజాన్=మనుజాల మనోవాక్కాయ కర్మలచే చేయ దగిన వాటినిగా, విద్ధి=తెలియుము, ఏవం = ఈవిధముగా, జ్ఞాత్వా = తెలిసి కొని, విమోక్ష్యసే=సంసారబంధము నుండి విడువబడగలవు

'ఏవం బహువిధా యజ్ఞాః'అని ఉపదేశించుటచే నింతవఱకు చెప్పినవేగాక ఇంకను అనేకవిధములగు ధర్మనిష్ఠలు గలవని తెలిసికొని వానిలో నేదైన నొక అనుష్ఠానము గలిగియుండిన తప్పక పరమేశ్వరుని పొందవచ్చును ప్రపంచములోగల ఏదైన నొక నది నాశ్రయించి కడవఱకు వెళ్ళిన అది సముద్రములోనికి చేర్చునుగదా! 28వ శ్లోకములో 'స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ' అనుదానికి అధ్యయనమును గుఱించి రుద్రగీతయందు ఇట్లు చెప్పబడియున్నది

వేదాంతశతరుద్రీయప్రణవాదిజపం బుధాః।
సత్త్వశుద్ధికరం పుంసాం స్వాధ్యాయం పరిచక్షతే॥

ఉపనిషత్తులుగాని, వేదములలో కొన్ని భాగములుగాని, ప్రణవము, గాయత్రి, శ్రీరామ, శివ నారాయణాది మంత్రజపములు గాని, గీతాపరన ములుగాని, ఇవన్నియు అధ్యయనమునకు సంబంధించిన వనియు, వీనిలో నేదైన ఒకదాని యనుస్ఠానమువలన మానవుల పాపము నశించి ఆత్మశుద్ధి గలుగుననియు బ్రహ్మవేత్తలు వచించిరి

స్తుతిస్మరణపూజాభి ర్వాఙ్మనఃకాయకర్మభిః ।
సునిశ్చలా భవేద్భక్తి రేతదీశ్వరపూజనమ్॥

కీర్తనము, స్మరణ, పూజాదులను మనోవాక్కాయకర్మలచే జేయుట యజ్ఞములో జేరినవే వాటివల్ల పాపములు నశించి అచంచలమైన దైవభక్తి

గలుగును పైజెప్పిన వన్నియు సర్వేశ్వరునియొక్క పూజయని తెలిసికొన వలయును అట్టివ్రతము సంకుచితభావము గలదిగా నుండరాదు అతివిశాలమైనదిగాను, విశుద్ధమైనదిగా నుండవలయును అనగా కొందరు భక్తులు తాముపాసించెడు దేవతల పేరుమాత్ర ముచ్చరించెదరేగాని మఱియొక దేవునిపేర్ల నుచ్చరించరు ఆలాగున ఇతర దేవతా స్థలములకును వెళ్ళరు అట్లే యితరదైవభక్తులతో గలవరు ఇట్టి క్షుద్రహృదయభావము గలిగి యుండ రాదు ఇదియు నొక విధమగు వ్రతమైనను శ్రేష్ఠమైన బుద్ధితో గూడినదిగాదు ఒకవేళ నితరుల అనుష్ఠానములను తాను చేయకపోయినను, విరోధము లేదుగాని, వారికి అనిష్టము గల్గించరాదు కాని కొందరు అనిష్టము గలిగించెదరు అది మాత్రము కూడదు ''పతివ్రతయైన నారీమణి పర పురుషుని చేరునా! అట్లు చేరుట వ్యభిచారగుణము గల స్త్రీయొక్క స్వభావముగదా!'' అని వారడుగుదురు ఇది సరియైన వాదము గాదు ఇట్టి దుష్టోపదేశముల చేతనే, సోదరప్రేమయు, సంఘబలమును క్షయించుచున్నది పతివ్రతయైన స్త్రీకి అతిథి సేవయు, వృద్ధుల శుశ్రూషయు, బ్రహ్మనిష్ఠుల పరిచర్యయు, దీనుల, రోగుల – ఇట్టివారిని ఆదరించుటయు కూడదని చెప్పువారు గలరా!

ఇది పాతివ్రత్యమునకు తప్పు అని తలంచువారుందురా! అయితే దీని యందుగల రహస్యమేమన వీరియొక్క క్షుద్రములును, నీచములును నగు గూఢవిషయములేవైన నుండినచో ఇతరులు తెలిసికొనెదరన్న విచారము మాత్రమేగాని మఱియొక్క మర్మముగాని, కర్మముగాని, ధర్మముగాని దీనియందు లేదు అంతేగాక వీరిలోగల క్షుద్రభావమున కన్న పరిశుద్ధ భావము ఇతరులయందు కనుగొనిన తనయందు భక్తి తగ్గిపోవునో యేమో యని తలంచి ఇట్టి పన్నాగములు పన్నిరేగాని మఱియొక గూఢతత్త్వము దీనియందు ఎంత వెదకినను గనుపడదు ఇది స్వార్థముచే గలిగిన దోషదూషితమైన హృద యస్వభావమేగాని మఱియొకటి గాదు ఇది మనుష్యులయొక్క అభివృద్ధిని అరికట్టునేగాని క్షేమమును గలుగనీయదు ఇట్టిదానివల్ల ఉన్నతస్థితికి వెళ్ళుటకు అడ్డు గలుగుచుండును

సత్యమును వెదకుటకును, అనుష్ఠించుటకును, బోధించుటకును సర్వజనులకు స్వాతంత్ర్య ముండవలయును అయితే ఈ విషయములో నిండు జాగరూకత గలవారే ప్రవేశించవలయును లేనిచో నొక్కొక్క చోట పతనము గూడ గలుగుట కవకాశము గలుగును శాస్త్రములకు తాను వశపడక శాస్త్రములను తాను వశపరచుకొనవలెను అనగా తనకు ఇంతవరకుండిన దానికన్న ఉన్నతాశయము లుండిన మాత్రమే దానిలో ప్రవేశించవలయును దీనిని విమర్శించుటకు చాలబుద్ధి సూక్ష్మతయు, అనుభవజ్ఞానమును గలిగిన మాత్రమే సాధ్యమగును శాస్త్రము లనేక విధములు గురువులును అనేక రకరకములు గలవారలు కావున జాగ్రత్త గలిగి వర్తించవలెను

మఱియు నేదైన నొకవ్రతమును ఆచరణలో పెట్టునపుడు విఘ్నములు కూడ కలుగుటకు అవకాశము గలదు, ఇది యొక విధమగు పరీక్షయని తలంచి సంతసించ వలసినదేగాని క్లేశము నొందరాదు ఏలన! పరీక్ష యొకటి లేనిచో చదివినదానికిని జదువని దానికిని గుర్తు తెలియదుగదా! కనుకనే ప్రతివిద్యకును పరీక్ష ఏర్పాటైనది ఒకవేళ నీవు పరీక్షలో ఒక సారిగాని, రెండుసారులుగాని, మూడుసారులుగాని, తప్పిపోయినను క్లేశముగాని, భయముగాని, ఉత్సాహరాహిత్యముగాని పొందరాదు అదే దీని యందుగల పరమ రహస్యము, నిగూఢమర్మము ఆలాటి పతనములు గలుగునపుడెల్ల ఇంకను తనకు జాగ్రత్త గలుగలేదనియు, శ్రద్ధ యుద్భవింప లేదనియు తలంచి పరిశ్రమను వృద్ధిపరచి తనయొక్క ప్రయత్నములో మఱింత తీవ్రముగ, తీవ్రతరముగ, తీవ్రతమముగ యత్నము ప్రారంభింపవలసినదేగాని ఆగిపోగూడదు ఇదే నీవు ముఖ్యముగ గమనించవలసిన విషయము

అనేకులు మూడు నాల్గుసారులు పరీక్షలో తప్పిపోయినను మరల ప్రయత్నమును విడువక పరిశ్రమ జేసి యుత్తీర్ణులైనవారలు గలరుగదా! ఆలాగున యుద్ధములోగూడ అనేకసారులు అపజయమును పొందినవారు గూడ మరల జయమునొందిన వారు లేకపోలేదుగదా! మఱియు క్రొత్త క్రొత్త తత్త్వజ్ఞానములనుగాని, రసాయన విద్యలనుగాని, యంత్ర నిర్మాణము లనుగాని కనిపెట్టువారికి నెన్నియో పతనములు గలిగినను, చేసిన ప్రయత్నము

గలుగును పైజెప్పిన వన్నియు సర్వేశ్వరునియొక్క పూజయని తెలిసికొన వలయునను అట్టివ్రతము సంకుచితభావము గలదిగా నుండరాదు అతివిశాలమైనదిగాను, విశుద్ధమైనదిగా నుండవలయును అనగా కొందరు భక్తులు తాముపాసించెడు దేవతల పేరుమాత్ర ముచ్చరించెదరేగాని మఱియొక దేవునిపేర్ల నుచ్చరించరు ఆలాగున ఇతర దేవతా స్థలములకును వెళ్ళరు అట్లే యితరదైవభక్తులతో గలవరు ఇట్టి క్షుద్రహృదయభావము గలిగి యుండ రాదు ఇదియు నొక విధమగు వ్రతమైనను శ్రేష్ఠమైన బుద్ధితో గూడినదిగాదు ఒకవేళ నితరుల అనుష్ఠానములను తాను చేయకపోయినను, విరోధము లేదుగాని, వారికి అనిష్టము గల్గించరాదు కాని కొందరు అనిష్టము గలిగించెదరు అది మాత్రము కూడదు ''పతివ్రతయైన నారీమణి పర పురుషుని చేరునా! అట్లు చేరుట వ్యభిచారగుణము గల స్త్రీయొక్క స్వభావముగదా!'' అని వారడుగుదురు ఇది సరియైన వాదము గాదు ఇట్టి దుష్టోపదేశముల చేతనే, సోదరప్రేమయు, సంఘబలమును క్షయించుచున్నది పతివ్రతయైన స్త్రీకి అతిథి సేవయు, వృద్ధుల శుశ్రూషయు, బ్రహ్మనిష్ఠుల పరిచర్యయు, దీనుల, రోగుల – ఇట్టివారిని ఆదరించుటయు కూడదని చెప్పువారు గలరా!

ఇది పాతివ్రత్యమునకు తప్పు అని తలంచువారుందురా! అయితే దీని యందుగల రహస్యమేమన వీరియొక్క క్షుద్రములును, నీచములును నగు గూఢవిషయములేవైన నుండినచో ఇతరులు తెలిసికొనెదరన్న విచారము మాత్రమేగాని మఱియొక్క మర్మముగాని, కర్మముగాని, ధర్మముగాని దీనియందు లేదు అంతేగాక వీరిలోగల క్షుద్రభావమున కన్న పరిశుద్ధ భావము ఇతరులయందు కనుగొనిన తనయందు భక్తి తగ్గిపోవునో యేమో యని తలంచి ఇట్టి పన్నాగములు పన్నిరేగాని మఱియొక గూఢతత్త్వము దీనియందు ఎంత వెదకినను గనుపడదు ఇది స్వార్థముచే గలిగిన దోషదూషితమైన హృద యస్వభావమేగాని మఱియొకటి గాదు ఇది మనుష్యులయొక్క అభివృద్ధిని అరికట్టునేగాని క్షేమమును గలుగనీయదు ఇట్టిదానివల్ల ఉన్నతస్థితికి వెళ్ళుటకు అడ్డు గలుగుచుండును

కొన్నిసార్లు ఈలాగున భంగములు గలిగియు ప్రయత్నము మరల చేయుచు పతనముగలిగి నిలిచిపోవువాడు మధ్యముడు ఈలాగున నుండరాదు

విఘ్నములు గలిగినను మరల ప్రయత్నింపనివాడు శ్రేష్ఠుడు కాడు సంస్కారము మంచిది లేనివాడనియే తలంచవలెను అట్లుండరాదు విఘ్నములు గలుగుటకు కారణము ఇంకను తనయొక్క సంస్కారము మంచిస్థితికి రాలేదనియు, కర్మశేషము నిశ్శేషముగా నశింపలేదనియు, పుణ్యబలము చాలదనియు, ఈశ్వరకృప పూర్తిగా లేదనియు, ఆత్మశుద్ధి నొందలేదనియు తలంచి మరల మరల ప్రయత్నించుచునే యుండవలయును పుణ్యకర్మలు వృద్ధినొంది రాగా రాగా శుక్లపక్ష చంద్రుడు వృద్ధినొందుచుండగా చీకటి నశించునట్లు పాపములు క్షయించుచు వచ్చుచుండును పుణ్యకర్మల తోసహ ఈశ్వరోపాసనయు, విషయ వైరాగ్యముగూడ సంపాదించు కొనవలయును అపుడు మంచి దివ్యరసాయనముచే దారుణమైన, వ్యాధి యైనను శమనము నొందునట్లు నీయొక్క అజ్ఞానమును, కర్మయు, పాపమును, విఘ్నములును శమనము నొందుచుండును

యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।
తే ద్వంద్వ మోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః ॥ (7-28)

టీక॥ పుణ్యకర్మణాం = పాపక్షయమునకు, ఆత్మశుద్ధికిని తగిన పుణ్యకర్మలను జేసెడు, యేషాం = ఏ, జనానాం = జనుల యొక్క, పాపం=పాపము, అంతగతం – నాశము నొందినదో, తే = అట్టివారు, ద్వంద్వ మోహనిర్ముక్తాః = రాగద్వేషముల వలన గలిగిన మోహమను అజ్ఞానమునుండి విడువబడినవారై, దృఢవ్రతాః= అచంచలమైన వ్రతనిష్ఠగలవారై, మాం=నన్ను భజన్తే=ధ్యానించుచున్నారు

ఈ యుపదేశ శ్లోకముచే పాపము గలిగినందుచేతనే తాను ప్రారంభించిన అనుష్ఠానము లన్నిటికిని విఘ్నములు గలుగుచున్నవనియు, అట్టి పాపము నిష్కామబుద్ధితో నాచరించెడు పుణ్యకర్మలచే మాత్రమే నశించు ననియు, పాపము నశించిన మాత్రమే యేలాటి విఘ్నములు గలుగక నిరాటంకముగ బ్రహ్మనిష్ఠ, జప, ధ్యాన, తపోయోగాదులు జరుగగలవనియు

శ్రీభగవాను లుపదేశించిరి అట్టి పుణ్యవిశేషము లేనిచో రోగముచేతగాని, దారిద్ర్యముచేతగాని ఇతర విఘ్నములచేత గాని బ్రహ్మనిష్ఠకు పతనము గలుగును మఱియు నీ విషయమై శ్రీజగద్గురు శంకర భగవత్పాదులు ఆత్మ బోధయం దుపదేశించిన దానిని చూడుడు

ఏవం నిరంతరకృతా బ్రహ్మైవాస్మీతి వాసనా।

హరత్యవిద్యావిక్షేపాన్ రోగానివ రసాయనమ్ ॥

టీక॥ ఏవం = ఈ ప్రకారముగాను, అహం = నేను, బ్రహ్మైన = సర్వ పరిపూర్ణవస్తువే, అస్మీతి = అయితినని, నిరంతరకృతా, నిరంతర = ఎల్లపుడును, కృతా = చేయబడిన, వాసనా = సంస్కారము, (అనగా = వినినదానివల్లను, చూచినదానివల్లను కలిగినదై స్మృతిని పుట్టించడమునకు మన స్సునందుండు ధర్మము) రసాయనం = మంచి యౌషధము, రోగానివ = వ్యాధులను పోగొట్టు క్రమముననే, అవిద్యావిక్షేపాన్, అవిద్యా = అవిద్య, మాయ వలన గలిగిన, విక్షేపాన్ = ఆవరణవిక్షేపశక్తులను, (అనగా తనను చూచుచున్నప్పటికిని దానిని తెలియకుండజేసి భేదమును తనయందు తాను లయపరచుకొని తిరిగి భేద మునకు గారణముగా నుండినది ఆవరణశక్తి, ఇందుకు దృష్టాంతము నిద్రయే, విక్షేపశక్తి యనగా - జాగ్రత్స్వ ప్నములయందు భేదబుద్ధిని గలుగజేసెడి శక్తి) హరతి=నశింపజేయుచున్నది అనగా నిరంతరము బ్రహ్మాత్మైక్య సంధానపరుడై నిష్ఠ సలిపెనేని అజ్ఞానము నశించి విజ్ఞానము ఉదయమగును

ఇచ్చట ఒకరహస్యము భక్తులు గ్రహించవలెను, అదేమన! ఎంత శ్రేష్ఠమైన మందైనను, పథ్యము సరిగ లేనిచో రోగము శమింపనట్లుగా గొప్ప బ్రహ్మోపదేశము పొందినను ఆచరణ సరిగ లేనిచో అజ్ఞానము నశించి, విజ్ఞానము ఉదయము గాదని తెలిసికొనవలెను ఇతరగ్రంథములు గూడ ఈవిషయమునే చెప్పుచున్నవి

యథా న క్రియతే జ్యోత్స్నా మలప్రక్షాళనాన్మణేః।

దోషప్రహాణాన్నజ్ఞాన మాత్మనః క్రియతే తథా॥

మణియందలి పైముఱికి కడుగగానే దాని స్వతేజస్సుతో నది

ప్రకాశించుచున్నది అటులే దోషము పోగొట్టినంత మాత్రముననే తనయొక్క నిజమైన యాత్మజ్ఞానజ్యోతి స్పష్టముగ వెలుగుచుండును అయితే ఇది నూతనముగా గలిగినదికాదు అనాదిగ నుండినదే, మరియు నెక్కువ ప్రకాశముతో వెలుగుచుండు ఎలక్ట్రిక్ దీపముగాని, గ్యాస్‌లైటుగాని యుండినను ఆచిమ్నిపై పలుచని తెల్లవస్త్రము, దానిపైదుప్పటి, దానిపై నల్లకంబళి, దానిపై తారుపట్ట మొదలైనవి ఒక్కొక్కటి చుట్టకట్టినచో నేలాగున వెలుతురు గనపడదో, ఆలాగున ఆత్మ స్వప్రకాశజ్ఞానస్వరూపమై యుండినను సత్త్వ, రజ, స్తమోగుణాదులచే అంతఃకరణ మావరణమై యుండినచో నిజ స్వరూపము ప్రకాశింపదు తమోగుణ రజోగుణములు నల్లనికంబళి, తారుపట్ట, దుప్పటి, లేక యెఱ్ఱనిశాలున వంటివనియు గ్రహించవలెను ఇవి రెండును నుండువఱకు నాత్మయొక్క స్వరూపము కొంచెమైనను తెలియదు సత్త్వగుణము, నిర్మలత్వము, ప్రసన్నత్వము గలదగుటచే సూక్ష్మమైన తెల్లని మల్లువస్త్రము, లేక తెల్లని, సన్నని దుకూలమువం టిదగును, ఇట్టివారి హృదయములో నాత్మప్రకాశము, నిర్మలమైన దైవసుఖము గలుగుచుండును అయితే యిదియు నొక యుపాధి యగుటచే పుణ్యలోక ప్రాప్తిని మాత్రమే గలుగజేయును ఇంతవఱకు వచ్చిన జీవులు చాల ఉత్కృష్టులే, అయితే సత్త్వగుణముగూడ వదలిపోవునప్పుడు మాత్రమే కేవలదైవ సాక్షాత్కార ప్రాప్తి యగును

యత్కర్మ సుకృతం ప్రోక్తం మనో వాక్కాయ సంభవమ్ ।
తత్తు కర్మాంతరం హన్తి మనోవాక్కాయ సంభవమ్ ॥

మనోవాక్కాయములచే జీవుడు ఎట్టి దుష్కర్మమును చేసి యుండినను, అట్టి దురితము మనోవాక్కాయ కర్మములచే జేసెడు సుకృతకర్మలవలన నశించును ఇది ప్రకాశము చీకటిని లయ మొందించునట్లు జీవునియొక్క పాపమును రహితమును చేయును

తపసా దగ్ధపాపస్య పక్వచిత్తస్య యోగినః ।
చతుర్థ ఆశ్రమః కాలే స్వయమేవ భవిష్యతి ॥

తపస్సుచేత దహింపబడిన పాపముగలవాడును, పరిపక్వమైన

హృదయముగలవాడు నగు యోగనిష్ఠునకు తురీయ సాక్షాత్కారజ్ఞానము పరిపక్వస్థితి గలుగునప్పుడు స్వయముగ గలుగును

ద్వాభ్యామేవ హి పక్షాభ్యాం యథా వై పక్షిణాం గతిః ।
తథైవ జ్ఞానకర్మభ్యాం ప్రాప్యతే బ్రహ్మ శాశ్వతమ్ ॥

ఏలాగున పక్షులకు ఆకాశములో సంచరించుటకు రెండు రెక్కలు అవసరములో, ఆలాగున నీ జీవుడు చిదాకాశములో బ్రవేశించి శాశ్వతమైన బ్రహ్మప్రాప్తిని పొందవలసియుండిన, ఆత్మచింతనయు, నిష్కామబుద్ధితో పుణ్యకర్మానుష్ఠాన మవశ్యముండే తీరవలయును

తపో విద్యా చ విప్రస్య నిశ్శ్రే యసకరం పరమ్।
తపసా కిల్బిషం హన్తి విద్యయాఽమృత మశ్నుతే॥

బ్రహ్మనిష్ఠని కుత్కృష్టమైన కైవల్యపదవిని గలుగజేయునవి 1 తపస్సనియు, 2 బ్రహ్మవిద్యయనియు తెలియువలయును తపస్సువల్ల మాలిన్యము లన్నియు నశించును బ్రహ్మవిద్యచే మోక్షము గలుగును మఱియు ఈవిషయమైన శ్రీకృష్ణ భగవానులు గీత 4వ అధ్యాయము నందుపదేశించిన దానిని చూడుడు

అపి చేదసి పాపేభ్య స్సర్వేభ్యః పాపకృత్తమః ।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥

టీక॥ సర్వేభ్యః=సమస్తమైన, పాపేభ్యః=పాపమును చేసిన వారల కంటె, పాపకృత్తమః = అధికపాపాత్ముడవు, అపిచేదసి=అయియున్న వాడవైనను, త్వం=నీవు, జ్ఞానప్లవేనైవ=జ్ఞానమనియెడు తెప్పచేతనే, సర్వం=సమస్తమైన, వృజినం=పాపసముద్రమును, సంతరిష్యసి=లెస్సగ దాటగలవు, దీనియందు 'తరిష్యసి' అని ప్రయోగింపక 'సంతరిష్యసి' అని యుపదేశించుటచే పరమాత్మయొుక్క కరుణను వెల్లివిరిసినట్లు చూపు చున్నారు ఏలన 'ఎన్నియో పాపములు చేసితిని ఈపరమాత్మ ధ్యాననిష్ఠచే దాటగలుగుదునా' యని సందేహపడునేమో యని తలంచి నిస్సంశయముగ దాటగలవని దృఢపరచుచున్నారు

యథైధాంసి సమిద్ధోఽగ్నిర్భస్మసాత్కురుతేఽర్జున।
జ్ఞానాగ్నిస్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా॥

టీ॥ హేఅర్జున= ఓఅర్జున, సమిద్ధః=లెస్సగ ప్రజ్వలించుచున్న, అగ్నిః= అగ్ని హోత్రుడు, ఏధాంసి=కట్టెలను, యథా=యేప్రకారముగ, భస్మసాత్= భస్మమునుగా, కురుతే = చేయునో, తథా = ఆప్రకారముగ, జ్ఞానాగ్నిః= జ్ఞానమనియెడునగ్ని, సర్వకర్మాణి=సమస్తకర్మములను భస్మసాత్కురుతే= భస్మమునుగ జేయుచున్నది మండుచుండు నగ్ని యేలాగున కట్టెలను భస్మము చేయునో ఆలాగున జ్ఞానమనెడు అగ్ని పాపకర్మల నన్నిటిని కాల్చివేయును

న హి జ్ఞానేవ సదృశం పవిత్రమిహ విద్యతే ।
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి ॥

టీక॥ ఇహ = ఈలోకమునందు, జ్ఞానేన = జ్ఞానముతో, సదృశం = సమానముగా, పవిత్రం = పావనమైనది, న విద్యతే హి = లేదుగదా! తత్ = ఆ జ్ఞానమును, యోగసంసిద్ధః = యోగధ్యానముల పరిపక్వత పొందినవాడు, కాలేన = కాలము పరిపక్వమగు నపుడు, ఆత్మని = తనయందు స్వయం=స్వయముగానే, విందతి=పొందుచున్నాడు

బ్రహ్మనిష్ఠ చేసికొని కాల పరిపక్వావస్థ గలుగునప్పుడు దైవ సాక్షాత్కార జ్ఞానమును తన హృదయములోనే స్వయముగ పొందుచుండును కావున అట్టి జ్ఞానము గలుగువఅకు బ్రహ్మనిష్ఠ చేయుచుండవలయును, కాలము వచ్చునప్పుడు వృక్షము లేలాగున పుష్పించునో, ఫలములను గలుగచేయునో, ఆలాగున ననుష్ఠానము పరిపక్వస్థితికి వచ్చునప్పుడు భగవద్ధ్యానము గూడ స్వయముగానే గలుగును

పరేషాముపదేశాయ క్షేమాయ చ మనీషిణః ।
పక్వాశ్చ కర్మ కుర్వన్తి భయాన్నా దేశశాస్త్రతః ॥

పుణ్య కర్మానుష్ఠానములు, తపోధ్యానాదులు చేయనిచో సామాన్య జనులకు పాపము నశించి అంతఃకరణశుద్ధి గలుగదని తలంచియే జీవన్ముక్తులగు మహాత్ములుగూడ తమ కవసరము లేనప్పటికిని నితరుల కుప

దేశప్రాయముగ, పుణ్యకర్మానుష్ఠానములు, దైవకార్యములు, తపోధ్యానాదులు, స్నాన పానాహారాది నియమములును గలవారై యుందురు అట్లుండుట యాత్మజ్ఞానము గలుగక పోవుటచేగాని, లేక కలిగిన జ్ఞానము నశించుననుభీతిచేగాని, లేక శాస్త్రరీతిగ నడువక పోయిన ప్రత్యవాయముగాని, పతనముగాని గలుగునని భయముచే గాని కాదు గీతాచార్యులు మూడవ అధ్యాయమున ఈలాగున నుపదేశించి యున్నారు

సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత! ।
కుర్యాద్విద్వాం స్తథాఽసక్తశ్చికీర్షుర్లోక సంగ్రహమ్ ॥

టీక॥ హేభారత= ఓయర్జున! అవిద్వాంసః= పామరులు, కర్మణి = కర్మమునందు సక్తాః = ఆసక్తిగలవారై, (అనగా కర్మఫలము కావలయునని యెడు తలంపు గలవారై) యథా = ఏప్రకారము, కుర్వన్తి = (కర్మములను) చేయుచున్నారో, విద్వాన్ = ఆత్మజ్ఞానముకలవాడు, తథా = ఆప్రకారము, అసక్తస్సన్ = ఫలాభిలాష లేనివాడగుచు, లోకసంగ్రహం = లోకక్షేమమును, చికీర్షుః = చేయనిశ్చయించినవాడై, కుర్యాత్ = (కర్మములను) చేయవలయును

ఏలన జనులలో స్వభావముగ ఏమియుచేయక ఊరక యుండు గుణము చాలమంది గలిగియుందురు అట్టివారికి ప్రబోధము గలిగించవలెను జ్ఞాని చేయనిచో వారసలే చేయరు అయితే యీశ్వరాంశలో జన్మించిన పరిశుద్ధ జీవులుమాత్రమే యిట్టి వర్తన గలిగియుందురు ఏలన ధర్మ సంస్థాపనము కొరకుగదా భగవదవతారములు గలుగుచుండును! కనుక అట్టి అంశములో, భగవదాజ్ఞచే జన్మించెడు మహాత్ములుగూడ నాలాగే యుందురు

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసంగినామ్ ।
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్యుక్తస్సమాచరన్ ॥

టీక॥ విద్వాన్ = ఆత్మజ్ఞానము గలవాడు, కర్మసంగినాం = కర్మఫలమందాసక్తి గల, అజ్ఞానాం = ప్రాకృతజనులకు, బుద్ధిభేదం = బుద్ధిలో చలనమును, న జనయేత్ = పుట్టింపగూడదు, (కింతు = ఇక నేమనిన) యుక్తః = సమాహితచిత్తుడై, (స్వయం = తాను) సమాచరన్ = చక్కగ ఆచరిం

చుచు, సర్వకర్మాణి = అన్నికర్మములను, జోషయేత్ = చేయించవలయును

ఈశ్లోకమునందు 'ఆచరన్' అని కాక 'సమాచరన్' అని యుపదేశించుటచే లెస్సగ తాను చేయుచు పరిపక్వస్థితి గలుగుటకు నితరుల చేతను చేయించవలెను ఓహో! యెంత యమోఘమైన యుపదేశము ఇక విస్తారముగ గనందగువారు ఈ మూడవ యధ్యాయమున చూడవచ్చును అట్లుగానిచో లోకమేలాగున తరించును? విఘ్నములుగాని, పతనములుగాని, కష్టములుగాని కలిగిన మనము ఎప్పుడో చేసిన కర్మఫల మీలాగున పరిణమించిన దనియు,ఇవియన్నియు మనము దాటిపోవలసిన వారల మనియు తలంచవలెను పర్వతదుర్గములలో ప్రయాణము చేయువారు ఒక్కొక కొండను లోయను దాటు నప్పుడు, ఏలాగున కఠిన మార్గములు దాటి పోవుచున్నా మనియు, తాము చేరవలసిన గమ్యస్థానము సమీపమునకు వచ్చుచున్నదనియు సంతోషించుచుందురో, మనస్సున హాయి గలుగజేసి కొందురో,ఆలాగున ఒక్కొక్క కష్టమును, పతనమును గలుగునపుడు మనము పాపకర్మ కాననములను దాటి పోవుచున్నామని గ్రహించుకొన వలసినదేగాని క్లేశము నొందగూడదు

మనము ఉత్తరాభి ముఖముగ కాశీక్షేత్రమునకు ప్రయాణమై పోవుచుండిన నెన్ని యడుగులు ముందుకు సాగుచున్నామో అన్నియడుగులు పుణ్యక్షేత్రమగు వారణాసిని సమీపించుచున్నామనియు, దక్షిణమునకు దూరులమగు చున్నామనియు జ్ఞాపకములో నుంచవలసి యున్నట్లు, ప్రతిబంధములు వచ్చి పోవునప్పుడును దైవమును సమీపించుచు నున్నామని యెంచవలయును అంతఃకరణములో గల యనేక జన్మములలో నుండి యుండు ప్రాకృతసంస్కారములు నశించువఱకు విఘ్నములును, పతనములును గలుగుచునే యుండును అంతవఱకు కేవలాత్మ యందు నిరంతరము నిలకడగలిగి యుండదు మనశ్శాంతియు, నిత్య తృప్తియు, నిర్విషయమున్నూ సిద్ధింపదని సాధకుడు మనస్సులోనుంచి దృఢప్రయత్నము గలవాడై యుండవలెను లేనిచో ఒక్కొక్క ప్రతిబంధము వచ్చునపుడు మనోవ్యాకులతయు, చంచలతయు, పట్టరాని దుఃఖములుగూడ

గలుగుచుండును శరీరములో వ్యాధి యుండువఱకు దానియొక్క స్వభావము కనపరచునుగదా! అప్పుడు మనము ఏమి చేయవలయును? మఱింత శ్రద్ధతో మంచిమందును పుచ్చుకొని స్థిరమూన పథ్యము గలిగియుండ వలసినదే అట్లు చేయక మందు తినకయు, పథ్యముండకయు నుండిన రోగమేలాగున సౌఖ్యమును గలుగజేయును? మీయొక్క యాధ్యాత్మిక మార్గముగూడ నాలాటి దని జ్ఞాపకముంచుకొనుడు అంతవఱకు భగవంతునిపై భారముంచి నీవు చేయవలసిన యనుష్ఠానములు తప్పక చేయుచుండుము నీకు జయము గలుగును

అయితే నీయొక్కమార్గము సవ్యముగ నున్నదా! లేదా! యని గూడ నీవు విచారణలో పెట్టుకొని చూచుచుండవలెను అట్లు చేయక యుండుట గూడ నొకవిధమగు లోపమని గ్రహించుకొనుము ఆలాటి కార్యములలో సందేహము గలిగిన యీవిషయములో మంచి జ్ఞానము గలవారి నడిగి తెలిసికొనవలసియుండును అయితే యెవరిని యడుగదలంచితివో అతడనుభవము గలవాడుగను, మంచి నిష్ఠగలవాడుగను, ధర్మాత్ముడగ నుండవలయును లేనిచో నీకు మఱింత చిక్కులు గలుగును స్వార్థబుద్ధియు, అధర్మ స్వభావము గలవాడైనచో తన కుటిలపువలలోనికి నిన్ను చిక్కించుకొనును సుమా! ఇదియును మఱింత జాగ్రత్తతో యోచించుకొన వలసినదిగా నుండును రోగమును ఔషధమును చక్కగ తెలియని వైద్యులు కొందఱు మందుల కొఱకెంతో డబ్బును ఖర్చు పెట్టించుచున్నారు దయ్యము పట్టిన వారును నాలాగున దుష్టమాంత్రికులచే నెన్నిటినో చేయింతురు ఆలాగున గురువులలో కొందఱుగూడ క్రొత్తగ నెచ్చట నుండియో సందేహము గలిగి వచ్చిన భక్తులచే నెన్నియో ఖర్చులు చేయింతురు తమ కనుభవములేని కఠినమైన సాధనలను చేయించెదరు ఇదియు నీవు జ్ఞాపక ముంచుకొనుము అయితే నీవు పుణ్య సంస్కారమును, సర్వేశ్వర కృపయును, సజ్జనుల యనుగ్రహమును గలిగియుండిన ఆలాటి తప్పుమార్గములో పోనీయక నిన్ను మంచి మార్గములోనే యాసుకృత విశేషము తీసికొనివెళ్ళును ఉత్కృష్టమైన ధర్మనిష్ఠయు, జ్ఞానమును గలవారివద్దకే యాసుకృత విశేషము నిన్ను లాగుకొని పోవును ఇదే

సుకృతము యొక్కయు. నీశ్వరానుగ్రహముయొక్కయు ఫలితమని తెలిసికొనుము

బలి చక్రవర్తి

1 ఇపుడు దృఢవ్రతులై యశఃకాయులైన పుణ్యచరిత్రుల దివ్యమూర్తుల కొందరిని పేర్కొనెద అట్టి యుదారచరితులలో పరమ పావన మూర్తులలో బలిచక్రవర్తి యొకడు ఇతనియొక్క వ్రతనిష్ఠ యమోఘమైనది ఇతడు చెప్పునటుల చేయువాడు చెప్పినమాటలు తప్పి బ్రతుకుటకన్న నిప్పులో కాలుట సౌఖ్యముగ సత్యనిష్ఠులు తలంతురు ఆడినమాటల నిర్వహించుటలో గలుగు కష్టమును తలచి విడిచిపెట్టినచో యతిశీతలమగు చందనము పన్నీరు పుష్పములతో అలంకరింపబడినవాడై సర్వసౌఖ్యముల ననుభవించుస్థితి సత్యాత్ములకు, ధర్మనిష్ఠులగు దృఢవ్రతులకు నిప్పులో క్రాగుటకన్న తీవ్రమైగు మనోవేదన గలిగించును

శ్రీ వామనమూర్తికి మూడడుగుల భూమి నిచ్చెదనని చెప్పిన తరువాత తన కులగురుడగు శుక్రాచార్యుడు నివారింపజూచినను గురువాక్యమును గూడ నతిక్రమించి బలిచక్రవర్తి తన దృఢవ్రతమును నిలబెట్టినాడు దీనివల్ల నేమి తేలుచున్న దనగా సత్యవ్రతుడు, ధర్మనిరతుడు అచంచలమగు నియమముగల శిష్యుడు నియమమునకు, సత్యమునకు, ధర్మమునకు దూరుడైన గురువుయొక్క వాక్యమును తిరస్కరించుటలో పాపము లేదు దానివల్ల దోషమును గలుగదు చారిత్రశుద్ధి గలవారికి నాత్మయొకటి శాశ్వతమని, నిత్యసుఖమని తలంపు గలిగియుండుటచే నద్దానిని ప్రాప్తించుటలో ప్రతిబంధమును గలుగజేసెడి దేహధనాదులు గొప్పవని తలంపు గలుగదు ఎందుకనగా నవి యన్నియు నశాశ్వతములని యతని మనస్సులో నిశ్చలమగు నిశ్చయము గలిగియున్నది అంతేగాక యవియన్నియు నిలబెట్టిచూచినను కాలక్రమముగ వీటినుండి విడుదల గలుగును అట్లుగాక అవియన్నియు తన్ను వీడిపోవుట గూడ తట స్థించవచ్చును అపుడు తాను ఎంత ప్రయత్నించినను నిలకడ చేసికొనుటకు

శక్తుడు గాడు మఱియు నొకవేళ దేహాంతమువఱకు సర్వసౌఖ్యముల ననుభవించుచుండినను అపయశస్సు గలిగి జీవించుట విషమునకన్న దారుణముగ సత్యాత్ములకు బాధ గలిగించును విజ్ఞులైనవారు మనస్సుఖము ననుభవించెడివారు అసత్య ప్రవర్తకులగు జడమతులు బాహ్యవస్తువులలో సుఖముగలదని భ్రమ నొందినవారలుగా నుందురు ఇది భ్రాంతిమాత్రమే గాని నిజము గాదు ఇదే ధర్మముయొక్క రహస్యము

శ్రీమద్భాగవతము సప్తమస్కంధమునందు శుక్రచార్యుండిట్లనియె :-

దనుజేంద్ర! యీతడు ధరణీసురుడు గాడు
దేవకార్యంబు సాధించుకొఱకు
హరి విష్ణు డవ్యయుం డదితి గర్భంబున
గశ్యపసూనుడై కలిగె నకట
యెఱుగ కీతనికోర్కి నిచ్చెద నంటివి
దైత్యసంతతి కుపద్రవము వచ్చు
నీలక్ష్మి తేజంబు నెలవు నైశ్వర్యంబు
వంచించి యిచ్చు దా వాసవునకు
మొనసి జగములెల్ల మూడుపాదంబుల
నఖిలకాయుడగుచు నాక్రమించు
సర్వధనము విష్ణుసంసర్జనము సేసి
బడుగు వగిది నెట్లు బ్రదికెదీవు.

అర్థమునకు ధర్మయశముల కాశ్రిత
బృందములకు సమత బెట్టునట్టి
పురుషు డిందు నందు బూర్ణుడై మోదించు
దన్ను మానిచేత దగవు గాదు.

ఈలాటి యర్థములను దెలుపు వాక్యము లనేకములు శుక్రాచార్యుడు శిష్యవాత్సల్యముతో బలిచక్రవర్తి కుపదేశించెను అయినను బలిచక్రవర్తి మనస్సు సత్యములో తగుల్కొని యుండుటచే సత్యము యొక్క యపార మగు

మహిమాతిశయమును ఎఱింగిన వాడగుటచేతను అసత్యము నంగీకరింపలేదు అసత్యముచే గలిగెడు భాగ్యభోగ్యములన్నియు విషము కలిసిన మధురాన్నము వంటివని యతనికి తెలియును మఱియు శుక్రాచార్యులీ క్రిందివాక్యము నువదేశించిరి

వారిజాక్షులందు వైవాహికములందు
బ్రాణవిత్తమాన భంగమందు
జకితగోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము బొంద డధిప!

ఈపద్యమును సాధారణముగ సామాన్యజనులు ఎల్లప్పుడును చెప్పుచుందురు ఇది సిద్ధాంతవాక్యము గాదు ఇది పూర్వపక్షము సిద్ధాంతము గ్రాహ్యముగాను, పూర్వపక్షము అగ్రాహ్యముగను ఎన్నుకొనుట శాస్త్ర నియమముగ నున్నది బలిచక్రవర్తి చెప్పినది సిద్ధాంత వాక్యము ఇదియే యంగీకార్యము మఱియు శుక్రాచార్యుడు చెప్పినది యసురధర్మము ఏలన, ఆయన యసురుడు అసురధర్మము దైవధర్మము గలవానికి అగ్రాహ్యము గీతయందు దైవాసుర సంపద్విభాగయోగమను షోడశాధ్యాయమున ఈ విషయము శ్రీకృష్ణభగవానులు విస్తారముగ తెలిపియున్నారు

దైవీసంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా ॥

అనగా దైవగుణము గలవారే దైవ ప్రాప్తికర్హులనియు, అసురగుణము గలవారు నరకగాములై బద్ధులగు చున్నారనియు తాత్పర్యము

మఱియు శిష్యుడగు బలిచక్రవర్తియొక్క మనస్సును పరీక్షించుట కొరకు ఈలాగున చెప్పినట్టును కొందఱు పండితులు తలచుచున్నారు "న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే" అని గూడ గీతాచార్యుడగు భగవంతుడే యీ యధ్యాయమున నుపదేశించెను బాహ్యాభ్యంతరశుద్ధియు సదాచార ప్రవృత్తియు, సత్యబుద్ధియు లేనిది అసుర స్వభావమని తాత్పర్యము కనుక పైజెప్పిన "వారిజాక్షులందు" అను పద్యము సజ్జనులకు, భగవద్భక్తులకు, దైవకృప నభిలషించువారికి దగినది కాదు అసత్యపురుషులకు అధర్మ ప్రవర్తకులకు, అసుర స్వభావము గలవారికి సంబంధించినదని

గ్రహించవలయును

సిద్ధాంత వాక్యమెద్ధియన ఈక్రింద వ్రాసెడు బలిచక్రవర్తి యొక్క వచనములని విజ్ఞులు గ్రహించుకొనవలయును బలిచక్రవర్తి యీధర్మ సందిగ్ధ సమయములో చాలసేపు అత్మలో నగాధమగు ద్వీర్ఘచింతన చేసికొనిన తరువాత సత్యమే నిత్యమగు సౌఖ్యమని తలంచియే ధర్మకార్యము లోనికి దిగెను గురువులవారి వాక్యమును త్రోసివేయుటకు తటస్థించుట , ఆడిన వాక్యము లేదని చెప్పుటకు తటస్థించుటలో రాజ్యములు బంధువులు సర్వమును వీడిపోవునని గురువు చెప్పుటయేగాక దేహముగూడ అపహరింప బడునను వాక్యము వినునప్పుడు ఎట్టివారి మనస్సైనను తకతక లాడక యుండునా? ఇట్టి విషమస్థితిలో ధర్మమును నిర్ధారణ మొనర్చి ప్రవర్తించిన బలిచక్రవర్తియొక్క పవిత్రతనేమని కొనియాడవచ్చును

పైవిధముగా హితంబు బలుకుచున్న కులాచార్యునకు క్షణమాత్ర నిమీలిత లోచనుడై బలి యిట్లనియె--

నిజమాన తిచ్చితి నీవు మహాత్మక!
మహిని గృహస్థ ధర్మంబు నిదియ
యర్ధంబు గామంబు యశమును వృత్తియు
నెయ్యది ప్రార్థింప నిత్తుననియు
నర్థలోభంబున నర్థి బొమ్మనుటెట్లు
పలికి లేదనుకంటె బాపమెద్ధి !
ఎట్టిదుష్కర్మని నే భరించెదగాని
సత్యహీనుని మోయజాలననుచు
బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ
సమరముననుండి తిరుగక చచ్చు కంటె
బలికి బొంకక నిజమున బరుగుకంటె
మానధనులకు భద్రంబు మఱియు గలదె?

దాత్రిని హాలికునకును ను
క్షేత్రము బీజములు నొకట జేకురుభంగిం
జిత్రముగ దాత కీవియు
బాత్రము సమకూరు నట్టి భాగ్యము గలదే?

కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వారేరీ సిరి మూటగట్టుకొని పోవంజాలిరే భూమిపై
బేరైనంగలదే! శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కెలు వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవా!

నిరయంబైన నిబంధమైన ధరణీనిర్మూలనంబైన దు
ర్మరణంబైన గులాంతమైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో
హరుడైనన్ హరియైన నీరజభవుం డభ్యాగతుండైన నౌ
దిరుగన్ నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య వేయేటికిన్?

మేరువు దలక్రిందైనను, బారావాంబు లింకబాతిన లోలో
ధారుణి రజమైపోయిన, దారాఢ్యము బద్ధలైన దప్పక యిత్తున్ ॥

అని యిట్లు సత్యపదవీ ప్రమాణతత్పరుండును, వితరణ కుతూహల సత్యసంధుండును, నర్థిజన కమలబంధుండును నైన బలింజూచి శుక్రుండు కోపించి మదీయశాసనం బతిక్రమించితివి గావున శీఘ్రకాలంబున బదభ్రష్టుండవు గమ్మని శాపంబిచ్చె బలియును గురుశాప తప్తుండయ్యు నన్నృతమార్గంబున కభిముఖుండు గాకుండె నప్పుడు

బ్రదుకవచ్చుగాక బహుబంధనములైన
వచ్చుగాక లేమి వచ్చుగాక,
జీవధనములైన జెడుగాక బడుగాక
మాట దిరుగలేరు మానధనులు.

ఇట్టి బలిచక్రవర్తి చెప్పిన వాక్యములే పుణ్యజీవు లంగీకరింతురు గాని మాయా మోహభ్రమలో చిక్కుకొని యీప్రపంచమే సత్యమని తలంచెడి యజ్ఞుల వాక్యముల నంగీకరింపరు దృఢవ్రతము సలుప నిశ్చయించెడివారు

ఈక్రింది నియమములను ఆత్మలో సదా జ్ఞాపక ముంచుకొనవలయును అట్లైన మాత్రమే నిర్విఘ్నముగ వ్రతము నెరవేరగలదు
(1) వినరాని వాక్యములనుండి కర్ణేంద్రియమును మరల్చి వాటిని విననీయకూడదు (2)స్పర్శింపరాని వానిని స్పర్శింపరాదు (3) చూడరాని వస్తువుల చూడరాదు (4) భుజింపరాని వస్తువులను భుజింపరాదు (5)వాసన చూడరాని వస్తువులను వాసన చూడరాదు ఇవి అయిదున్నూ జ్ఞానేంద్రియము లనబడును వీటియొక్క నిగ్రహమే జ్ఞానేంద్రియ నిగ్రహ మనబడును ఆలాగున (6) చెప్పరాని వాక్యములను వచింపరాదు (7) తాకరాని వస్తువులను తాకరాదు (8)పోరాని స్థలములోనికి పోరాదు ఈకర్మేంద్రి యములలో పాయూపస్థలను రెండింద్రియములుగూడ గలవు వాటియొక్క నిగ్రహము గూడ గలిగిన కర్మేంద్రియ నిగ్రహము సిద్ధించినటుల తలంచవ లెను (9) తలంపరాని తలపుల తలపరాదు (10) చింతింపరాని విషయము లను చింతింపరాదు ఇవి రెండును నంతరింద్రియములు వీటిలో నహంకార మును బుద్ధియు నంతర్భూతములై యున్నవి వీటియొక్క నియమనము గలిగిన యంతరింద్రియనిగ్రహయు దమమనియు విజ్ఞులు దలంతురు ఇవి రెండును నిగ్రహంపబడినచో మరల నతనికి మోక్ష మార్గమునకు అడ్డులు ఏమియు గలుగవు

ఈపుణ్యజీవికి నూర్ధ్వగమనము సులభము, మంచి గుఱ్ఱములను, బుద్ధిమంతుడగు సారధియు గలిగిన రధికుని ప్రయాణ మేలాగున ననుకూలముగాను సౌఖ్యముగానుండునో అదియు నట్టిదే అయితే యిప్పుడు చెప్పిన బాహ్యాభ్యంతర నియమములు గలిగినను దానితో తృప్తి నొందరాదు పరమార్ధ విషయములో నివియన్నియు నంత గొప్పవి గావు అన్నిటికన్న గొప్పదేమన సర్వేశ్వరుని మరచి కొంచెము కాలమైనను జీవింపరాదు ఇది యొక్కటియే అన్నిటిలోను ప్రాణము గలిగి యుండునది

అది యొకటి లేనిచో తక్కిన వన్నియు గలిగియుండినను మీజీవితము ప్రాణములేని దేహము నలంకరించిన నెట్లుండునో అట్లుండునని మరువకుడు ఈనియమములన్నియు మీరు నాచరణలో పెట్టినమాత్రమే జీవితము

పవిత్రమగును అట్టి యాత్మశుద్ధి గలిగిన మాత్రమే మీరు ఈశ్వరదర్శనమున కర్హులు గాగలరు దానివల్లనే మీరు తరించవలసియుందురు ఒకవేళ యనివార్యకార్యములు గలిగికాని, ప్రమాదవశమునగాని, పై పేర్కొన్నవానిలో దేనియందైన తప్పిదము గలిగిన వెంటనే ప్రాయశ్చిత్తము జేసికొని శుద్ధాత్ములు గావలెను అట్లుగానిచో మీజన్మము వ్యర్థమగును ఈలాగున నాచరించెడు వారినే యార్యులని మనశాస్త్రము చెప్పుచున్నది

కొందఱు ఈలాగున చెప్పుదురు. అది యేమన పైనుదాహరించిన భేదముల హృదయములో స్ఫురింపనీయక యంతయు నేకమై అద్వయమై, అభేదమైయుండు బ్రహ్మముగా జూచుటయే గొప్పదగు దృఢవ్రతమని తలంచవలెననియే అదియొక విధముగ సత్యమైనను నట్టి యనుభవముగల మహనీయులు ప్రస్తుతము లోకములో గాన్పించుట దుస్తరము అలాటి స్థితిలో నుండిన,దత్తాత్రేయ, శుకాది మహనీయులే పైజెప్పేలాగున నుండి వ్రతనిష్ఠ సలుపవలెనని సెలవిచ్చియున్నారు లేనిచో నట్టిస్థితికి రాజాలరని బాగుగా తెలియును సమాధి స్థితికిని, గాఢ సుషుప్తికిని శాస్త్రములో సామ్యము చెప్పబడియుండినను నీయుభయములకు నెంత తారతమ్యము గలదో- ఆలా గున నిప్పుడభేదము చెప్పువారికిని, నిజమైన బ్రహ్మజ్ఞానముచే గలిగెడు యభేదమునకును అంత తారతమ్యము గలదు కావున ముందు జెప్పిన దృఢవ్రతమే యాచరణీయముగాని ప్రమాదముచే గలిగెడు నభేదస్థితి మంచిది కాదు ఈవిషయమై శాస్త్రము చెప్పిన దానిని చూడుడు,

అకర్తవ్యం నైవ కర్తవ్యం ప్రాణైః కంఠగతైరపి ।
కర్తవ్యమేవ కర్తవ్యం ఏష ధర్మస్సనాతనః ॥

ప్రాణము కంఠగతముగ గలిగెడు ప్రమాదము గలిగినను చేయరాని కార్యములు చేయుటగాని, చెప్పరాని వాక్యములు చెప్పుట గాని, తలంప రాని విషయమును తలంచుటగాని చేయరాదు పైజెప్పిన మనోవాక్కాయ కర్మలచే కర్తవ్యమును మాత్రమే యాచరింపవలయును ఇదే సనాతనమగు ఈశ్వరధర్మము ఈలాగున నాచరించువాడే సనాతనుడని చెప్పదగినవాడు మఱియు నీవిషయమై జ్ఞానవాసిష్ఠమున వసిష్ఠభగవాను లుపదేశించిన దానిని

చూడుడు ఆర్య లక్షణము

కర్తవ్యమాచరన్ కామ మకర్తవ్య మనాచరన్ ।
తిష్ఠతి ప్రకృతాచారో యస్స ఆర్య ఇతి స్మృతః ॥

ఎవడు చేయదగు దానినిచేయుచు చేయదగని దానిని జేయక ఆవశ్యకానుష్ఠానపరుడై యుండునో వాడార్యుండని చెప్పబడుచున్నాడు

యథాచారం యథాచిత్తం యథాశాస్త్రం యథాస్థితమ్ ।
వ్యవహారముపాదత్తే యః స ఆర్య ఇతి స్మృతః ॥

ఎవండు, ఆచారమును, శాస్త్రమును, తాననుష్ఠించవలసిన స్థితిని అనుసరించి లోకమున వ్యవహరించు చుండునోవాడు ఆర్యుండని చెప్పబడును

ప్రహ్లాదుడు

వచించిన వాక్యమును నిర్వహించుటయందు దృఢవ్రతముగల బలిచక్రవర్తి యొక్క చరిత్రము సంక్షిప్తముగ వినడ మైనది

(2) ఇప్పుడాలాగున దైవవిషయములో దృఢవ్రతము గలిగి యనుష్ఠించిన వారిలో నొకరగు ప్రహ్లాదుని జీవితసారాంశము నందఱు గ్రహించులాగున తెలుపుట కుపక్రమించుచున్నాను ఈయన భగవ ద్విషయములో నిరంతరము జీవితము గడిపి యట్టి భగవద్విషయమును జనులందఱికి బోధించుటలో శ్రద్ధ గలవాడు ఇట్టి దైవవిషయమున కడ్డు గలుగ జేసినందుచే తండ్రి యొక్క మాటనుగూడ నతిక్రమించ వలసివచ్చెను సామాన్య దృష్టితో చూచిన పితృవాక్య పరిపాలనము ధర్మముగ గాన్పించును అయితే ఇది ధర్మయుక్త మైన దై వాజ్ఞకు లోబడి యుండు పితృవాక్యములకు మాత్రమే సంబంధించును

ధర్మవిరుద్ధమై యీశ్వరాజ్ఞకు భిన్నమైన పితృశాసనమైనచో నాచరింప నవసరములేదని యీచరిత్రము తెలియజేయుచున్నది ఏలన ఈశ్వరాజ్ఞకును, ధర్మమునకును భిన్నమైన కార్యము చేసినచో దానివలన పితరులు దైవకృపకు దూరులై నరకములో బడవలసి యుండుటచే ప్రహ్లాదుడు దీర్ఘవిచారము గలవాడగుటచేతను, తండ్రికి గలుగబోవు విపత్తును దెలిసికొన్న వాడగుట

చేతను తాను జేసినది యొకవిధమగు పితృభక్తి యనియే చెప్పవలసియున్నది

ఏలన , సత్యధర్మములతో రాజ్యపరిపాలనము చేసెడు రాజాజ్ఞను నతిక్రమింప ప్రేరణజేయు వానికిని, శాసన మతిక్రమించిన వానికిని దండన గలుగును ప్రహ్లాదు డిట్టి ధర్మరహస్య మెఱింగిన వాడగుటచేతనే యాలాగున చేయుడ మైనది మఱియు దైవదృష్టినుండి చలింపక యుండవలెనని తలంపుగలిగి దృఢవ్రతము ననుష్ఠించిన ప్రహ్లాదు డెన్ని బాధలకు లోబడినను భగవచ్చిం తనకు దూరుడు గాకయు, ధర్మబోధన విడువకయు నెట్లువర్తించెనో ఆలాగున దృఢవ్రతము గలిగినమాత్రమే ప్రకృతి శృంఖలనుండి జీవుడు తప్పించుకొని పోగలుగును

పరీక్ష యొకటి లేనిచో జదివినవానిని, చదువనివానిని తెలిసికొనుట కవకాశము లేనట్లు సత్యధర్మములలోను, ఈశ్వర విషయములోను, ఆలాటి పరీక్ష లేనిచో వీరియొక్క యాత్మ సంస్కారము, దైవవిశ్వాసము, ధర్మనిష్ఠ యేలాగున తెలిసికొన సాధ్యమగును? మఱియు నెన్ని విధములుగ ప్రహ్లాదుని బాధించినను మనస్సులో క్లేశముగాని, సంకటము గాని, గలుగక మామూలుగ ప్రసన్నచిత్తుడై, ద్వేషము గలుగక భగవచ్చింతన ధ్యానాదుల నేలాగున చేయుచుండెనో, యుత్తమ సంస్కారమును, ధర్మములో దృఢమైన విశ్వాసమును గలవా డాలాగున నుండును

మఱియు దీనియందొక రహస్యము దెలిసికొనదగినది యున్నది అదేమన? ధర్మబోధకులు, సత్యనిష్ఠులు, దృఢవ్రతులు ఎల్లప్పుడు నొకేవిధమైన బుద్ధి గలిగియుందురు ఎల్లపుడు నొకేవిధమగు వాక్యములనే వచించుచుందురు దైవ మునకు, ధర్మమునకు, భిన్నమైన కార్యములలో ప్రాణవినాశము గలుగజేసెడు సమయము గలిగినను మార్పుజెందరు ప్రహ్లాదుడు సామాన్యముగ జనులందఱికిని నెట్టిధర్మమును బోధించుచుండెనో అట్టి వాక్యములనే దండనాధికారి వద్దను, మరణశిక్షను విధించెడు హిరణ్యకశిపుని సన్నిధిలోను చెప్పుచుండెను ఇదే దృఢవ్రతము గలవారి లక్షణము అట్లు గాక జనుల హితము జూచి తనలాభము కనుగొని ఒక్కొక్కరితో నొక్కొక్క విషయము నాయా సమయానుకూలముగా

మాట్లాడుటయు, కార్యముల జేయుటయు సత్యధర్మనిష్ఠ గలవారి స్వభావము గాదు వ్రతపరిపాలనము గలవారికి తమయొక్క వ్రతమును చెడనీయక చూచుటలో లక్ష్యము నిలిచియుండునే కాని ప్రాణ, ధన, మానావమానములలో మనస్సు ప్రాణధనములందు నిలుకడ గలిగియుండదు కనుకనే శాస్త్రజ్ఞు లీలాగున చెప్పుచున్నారు

ప్రాణానపి పరిత్యజ్య మానమేవాభిరక్షయేత్ ।
పాణా స్తరంగచపలా మానమాచంద్రతారకమ్ ॥

దృఢవ్రతులు ప్రాణమును త్యజించియైనను తనయొక్క ధర్మమునే రక్షింతురు ఏలన, ప్రాణములు నీటిలో అలలవంటివి లేక బుద్బుదముల వంటివి, అతిచంచలములైనవి ఈనిమిషమునగాని మరు నిమిషమునగాని నశించును అధర్మమునకు లోబడి ప్రపంచభోగముల కధీనుడై యుండ జూచినను ప్రాణము శాశ్వతమైనది గాదు అది నశించుట నిక్కము ధర్మమైనచో;సూర్య చంద్ర నక్షత్రాలుండు వఱకు ప్రపంచములో నిలుచునదే గాక, పరలోకమున నెల్లప్పుడు వెలుగుచుండును ఇపుడు ప్రహ్లాదుడు బడినపాట్లను గుఱించి కొంచెము శ్రీమద్భాగవతమును తెలిపెద సప్తమస్కంధము హిరణ్యకశిపుని వాక్యములు

పంబాబ్దంబులవాడు తండ్రినగు నాపక్షంబు నిందించి య
త్కించిద్భీతియు లేక విష్ణునహితుం గీర్తించుచున్నాడు వ
ద్దించుంజెప్పినమాన డంగమున బుత్రాకారతన్ వ్యాధి జ
న్మించెన్ వీని వధించి రండు దనుజుల్ మీమీపటుత్వంబులన్.

అంగవ్రాతములో జికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగ శ్రేణికి రక్షసేయు క్రియ నీయజ్ఞుం గులద్రోహి దు
స్సంగుం గేశవపక్ష పాతి నధముం జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతి జరించెదం గులము నిర్దోషంబు గావించెదన్.

పలువురు దానవుల్ పొడువ బాలుని దేహము లేశమాత్రము
న్నొలియదు, లోపలన్ రుధిరముబ్బదు, కందదు శల్యసంఘమున్,

నలియదు దృష్టివైభవము, నష్టము గాదు ముఖేందుకాంతియున్
బొలియదు నూతనశ్రమము పుట్టదు, పట్టదు దీనభావమున్.

తన్ను నిశాచరుల్ పొడువ దై త్యకుమారుడు మాటిమాటి కో
పన్నగశాయి! యోదనుజభంజన! యోజగదీశ! యోమహా
పన్నశరణ్య! యోనిఖిలపావన!యంచు నుతించుగాని తా
గన్నుల నీరు దేడు, భయకంపసమేతుడు గాడు భూవరా!

పాఱడు లేచి దిక్కులకు, బాహువు లొడ్డడు, బంధురాజిలో
దూఱడు, ఘోరకృత్యమని దూఱడు తండ్రిని, మిత్రవర్గముం
జీరడు, మాతృసంఘము వసించు సువర్ణ గృహంబులోనికిం
దాఱడు, కావరే యనడు, తాపము నొందడు కంటగింపడున్.

శూలముల న్నిశాచరులు స్రుక్కక దేహము నిగ్రహింపగా
బాలుడు నేలపై బడడు, పాఱడు, చావడు తండ్రినైన నా
పాలికి వచ్చి చక్రధరు పక్షము మానితి నంచు బాదముల్
ఫాలము సోక మ్రొక్క డనపాయత నొందుట కేమి హేతువో?

ఒకమాటు దిక్కుంభి యూధంబు దెప్పించి
కెరలి డింభకుని ద్రొక్కింప బంపు
నొకమాటు విషభీకరోరగశ్రేణుల
గడువడి నర్భకు గరవ బంపు
నొకమాటు హేతి సంఘోగ్రానలములోన
విసరి కుమారుని వ్రేయ బంపు
నొకమాటు కూలంకషోల్లోలజలధిలో
మొత్తించి శాబకు ముంప బంపు
విషము బెట్ట బంపు విదళింపగాబంపు,
దొడ్డకొండచరుల ద్రోయ బంపు,

బట్టికట్ట బంపు బాధింపగా బంపు
బాలు గినిసి దనుజపాలు డధిప;

ఒకవేళ నభిచార హోమంబు సేయించు,
నొకవేళ నెండల నుండ బంచు,
నొకవేళ వానల నుపహతి నొందించు
నొకవేళ రంధ్రంబు లుక్కబట్టు,
నొకవేళ దనమాయ నొదవించి బెగడించు
నొకవేళమంచున నొంటి నిలువు,
నొకవేళ బెనుగాలి కున్ముఖు గావించు,
నొక వేళ బాతించు నుర్వియందు,
నీరు నన్నంబు నిడనీక నిగ్రహించు,
గశల నడిపించు, ఉవ్వించు గండశిలల,
గదల వ్రేయించు, వేయించు ఘనశరముల,
గొడుకు నొకవేళ నమరారి క్రోధియగుచు.
మనంబున---
ముంచితి వార్ధులన్, గదల మొత్తితి, శైల తటంబులందు ద్రొ
బ్బించితి, శస్త్రరాజి బొడిపించితి, మీద నిభేంద్రపంక్తి తొ
ప్పించితి, ధిక్కరించితి, శపించితి, ఘోరదవాగ్నులందు ద్రో
యించితి, బెక్కుపాట్ల నలయించితి, జావడిదేమిచితమో!

ఎఱుగడు జీవనౌషధము, లెవ్వరు భర్తలు లేరు, బాధలం
దరలడు, నైజతేజమున దధ్యము జాడ్యము లేదు, మిక్కిలిన్
మెరయుచు నున్నవా డొకనిమేషము దైన్యమునొందడింక నే
తెఱగున ద్రుంతు వేసరితి దివ్యము వీని ప్రభావమెట్టిదో!
(ప్రహ్లాద వచనము) ;-
మందారమకరంద మాధుర్యమున దేలు
మధుపంబువోవునే మదనములకు!

నిర్మలమందాకినీ వీచికలదూగు రా
యంచ సనునె తరంగిణులకు
లలితరసాల పల్లవఖాదియై చొక్కు
కోయిల సేరునే కుటజములకు
బూర్ణేందుచంద్రికా స్ఫురిత చకోరకం
బరుగునే సాంద్రనీహారములకు
నంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృత పానవిశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు?
వినుతగుణశీల! మాటలు వేయునేల?

కంజాక్షునకుగాని కాయంబు కాయమే
పవనగుంభిత చర్మభస్త్రి గాక
వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే
తరుశాఖనిర్మిత దర్విగాక
కమలేశు జూడని కన్నులు కన్నులే
తనుకుడ్యజాల రంధ్రములు గాక,
చక్రిచింత లేని జన్మంబు జన్మమే
తరళసలిలబుద్బుదంబుగాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుడే
పాదయుగముతోడి పశువుగాక!

సంసారజీమూత సంఘంబు విచ్చునే
చక్రిదాస్య ప్రభంజనము లేక
తాపత్రయాభీల దావాగ్ని లాఱునే
విష్ణు సేవామృత వృష్టి లేక!

సర్వంకషాఘౌఘజలరాసు లింకునే
హరిమనీషా జడబాగ్ని లేక!
ఘనవిపద్గాఢాంధ కారంబు లడగునే
పద్మాక్షనుతి రవిప్రభలు లేక!
నిరుపమాపునరావృత్తి నిష్కళంక
ముక్తినిధి గానవచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గకోదండ చింతనాంజనము లేక
తామరస గర్భునకునైన దానవేంద్ర!

ప్రహ్లాదుని సుగుణములు

ఆకారజన్మ విద్యార్థవరిష్ఠుడై
గర్వసం స్తంభ సంగతుడు గాడు
వివిధమహానేక విషయసంపన్నుడై
పంచేంద్రియములచే బట్టువడడు
భవ్యవయోబల ప్రాభవోపేతుడై
కామరోషాదుల గ్రందుకొనడు
కామినీప్రముఖ భోగములెన్ని గలిగిన
వ్యసనసంసక్తి నావంకబోడు
విశ్వమందు గన్న విన్న యర్థములందు
వస్తుదృష్టిచేసి వాంఛయిడడు
ధరణినాథ! దైత్య తనయుండు హరిపర
తంత్రుడై హతాన్యతంత్రుడగుచు,

పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మ యుగళీచింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారి సుతు డేతద్విశ్వమున్ భూవరా!

వైకుంఠచింతా వివర్జితచేష్టుడై
యొక్కడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరి భావనారూఢచిత్తుడై
యుద్ధతుడై పాడు నొక్కచోట
విష్ణు డింతియ కాని వేఱొండు లేదని
యొత్తిలి నగుచుండు నొక్కచోట
నలినాక్షుడను నిధానము గంటి నేనని
యుబ్బిగంతులు వైచు నొక్కచోట
బలుకు నొక్కచోట బరమేశు గేశవు
బ్రణయహర్ష జనిత బాష్పసలిల
మిళితపులకుడై నిమీలితనేత్రుడై
యొక్కచోట నిలచి యూరకుండు.

ఓహో! యీ మహనీయునియొక్క చరిత్రమెంత పుణ్యమైనది? ఎటువంటి దృఢవ్రతము! ఎంత అనన్యభక్తి! ఇంద్రియ నిగ్రహము నేమని చెప్పవచ్చును! శాంతము నెంత కొనియాడినను చాలక పోవుచున్నది ఎంత సాధుమూర్తి! ఎటువంటి పరమభక్తుడు! అట్టి మహనీయునికి గూడ నిట్టి బాధలు గలిగినపుడు సామాన్యజనుల గుఱించి మరల నేమి చెప్పవలయును?

ప్రహ్లాదునికి గలిగినట్టి నిరంతర అనన్యభక్తియను ద్రావకములో హృదయమును గడిగిన మాత్రమే ఆత్మలో చిరకాలమునుండి గలిగియుండు మాయాకల్మషము నశించి శుద్ధచిన్మాత్ర దైవసాక్షాత్కార జ్ఞానము గలుగునని వాసిష్ఠములో శ్రీరామచంద్రునికొఱకు వసిష్ఠమునీంద్రులచే నుపదేశింప బడెను

తండులస్య యధా చర్మ యధా తామ్రస్యకాలిమా ।
నశ్యతి క్రియయా పుత్ర పురుషస్య తధా మలమ్ ॥

స్వాభావికంబగు మలము పురుష ప్రయత్నముచేత నెటుల బోవు నంటివేని వినుము తండులము (బియ్యము) యొక్క పైనున్న పొట్టు' తవుడు దంపడము మొదలగు దానిచే నెట్లు పోవుచున్నదో, పులుపు మొదలగు

రసములచే రాగియొక్క సామాన్య చిలుమున్ను, స్ఫుటముచే విశేష చిలుమున్నూ ఎట్లు పోవుచున్నదో, అట్లు శ్రవణము, మననము మొదలగు బ్రహ్మ నిష్ఠాది క్రియలచే పురుషునియొక్క అజ్ఞాన రూపంబగు మలమును బోవుచున్నది

జీవస్య తండులస్యేవ మలం సహజమప్యలమ్ ।
నశ్యత్యేవ న సందేహః తస్మాదుద్యమవాన్ భవ ॥

పుత్రా! జీవునియొక్క మలము (అజ్ఞానము) సహజ సిద్ధంబైనను, తండులముయొక్క మలమువలె ప్రయత్నముచే నశించుచున్నది ఇందుకు సందేహము లేదు కావున ప్రయత్నవంతుడ వగుము

ఆత్మా క్షేత్రజ్ఞసంజ్ఞోఽయం సంయుక్తః ప్రాకృతైర్గుణైః।
తైరేవ విగతశ్శుద్ధః పరమాత్మా నిగద్యతే॥

ఈజీవాత్మ పాకృతములగు గుణములతో గూడియుండు వఱకు జీవుడనియు, క్షేత్ర జ్ఞుడనియు పేరు గలిగియుండును అట్టి ప్రకృతి గుణములైన త్రిగుణములనుండి విముక్తి గలుగునప్పుడు శుద్ధాత్ముడై పరమాత్మయని పిలువంబడును లేక పరమాత్మనొందుట కర్హత గలుగును

అగ్నిసంగా ద్యథాలోహ మగ్నిత్వ మధిగచ్ఛతి।
ఆత్మసంగా త్తథాగచ్ఛత్యాత్మతా మింద్రియాదికమ్॥

అగ్ని సాన్నిధ్యమువలన ఇనుము మొదలగు లోహము లేలాగున అగ్నిమయముగా మారుచుండునో, యాలాగున ధ్యానబలముచే నాత్మ సాన్నిధ్యము గలుగునపుడు బుద్ధ్యాదీంద్రియము లన్నియు నాత్మమయము లగును ధ్యానమునందు చిత్తము లగ్నముగా గలిగిన జ్ఞానికి నింద్రియము లన్నియు దివ్యజ్ఞాన మయములై యుండును

మన స్యేవేంద్రియాణ్యత్ర మనస్స్వాత్మని యోజయేత్
సర్వభావవినిర్ముక్తం క్షేత్రజ్ఞం బ్రహ్మణి న్యసేత్ ।
బహిర్ముఖానీంద్రియాణి కృత్వాచాభిముఖాని వై
ఏతద్ధ్యానం తథా జ్ఞానం శేషస్తు గ్రంథవిస్తరః ॥ అని దక్షస్మృతి

బహిర్ముఖములుగ నుండు ఇంద్రియము లన్నిటిని నంతర్ముఖ

ములుగ జేసికొని యట్టి బాహ్యాభ్యాంతరిక ఇంద్రియములను మనస్సులో నైక్యపరచి, యట్టి మనస్సును బుద్ధాత్మను క్షేత్రజ్ఞుడగు ప్రత్యగాత్మలోనికి నైక్యపరచి యట్టి ప్రత్యగాత్మను పరబ్రహ్మమునందు లయ మొందింపవల యును ఇదే నిజమైన ధ్యాన యోగమనియు, సరియైన జ్ఞానయోగ మనియు దెలియవలయును విస్తారములగు ఇతర గ్రంథములన్నియు నీయొక్క విష యమునే చెప్పుచున్నవి అనగా సమస్త వేదాన్త శాస్త్రముల యొక్కయు, యోగ శాస్త్రములయొక్కయు సార మిదియే ధ్యానకాలములో ముముక్షువైన యభ్యాసి యిట్టి యభ్యాసము ననుభవములోనికి దెచ్చుకొన వలయును ఇది యింద్రియముల కేకాగ్రత గలిగి స్వరూపానుసంధాననిష్ఠ గలవారికి స్పష్ట ముగ గోచరము గాగలుగును

అయామాత్మా స్వయంజ్యోతి ర్మహానందమయ శ్శివః।
అయోగినః పరోక్షస్స్యాదపరోక్షస్తు యోగినః॥

ఈ యాత్మ స్వయముగ జ్యోతిర్మయమైనది మహానంద మైనది అట్టి శివము (మాలిన్యరహితము మంగళ స్వరూపము) యాత్మ స్వరూపము యోగులు గానివారికిని, కుయోగులకును, అప్రత్యక్షముగ నుండును యోగు లైన వారికిని, జ్ఞానయోగులకును ప్రత్యక్షముగ నుండును అని జ్ఞాన తంత్రము

బ్రాహ్మణో క్షత్రియో వైశ్య శూద్రశ్చండాల ఏవ చ ।
దృఢాభ్యాసపరో నిత్యం పునర్జన్మ న విందతి ॥

ఇట్టి యాత్మలాభ విషయములో దృఢవ్రతులై యనుష్ఠానము చేయువారు బ్రాహ్మణులైనను, క్షత్రియులైనను, వైశ్యు లైనను, శూద్రులైనను, స్త్రీలైనను, చండాలురైనను, నిస్సంశయముగ పునర్జన్మరహితమగు మోక్షము నొందగలరు. ఔషధసేవ పథ్యముగా చేయువారెవరైనను రోగమునుండి విముక్తు లగుదురు గదా!

శ్రద్ధావినయసంయుక్తః శాంతి దాంత్యాదిసంయుతః ।
యావద్జ్ఞా నోదయస్తావద్వేదాన్తార్థం నిరూపయేత్ ॥

ఎంతవఱకు నాత్మజ్ఞానోదయము గాలేదో, అంతవఱకు శమ

దమాదులతో గూడినవాడై శ్రద్ధావినయ సంపన్నుడై వేదాన్తార్థమగు పరబ్రహ్మమును ధ్యానముచేతను, జ్ఞానముచేతను అనుష్ఠింపవలయును అనగా స్వరూపమును నిరూపణము జేసికొనవలయును రోగవిమోచనము గలుగువఅకు సరియగు నౌషధము, తగినపథ్యమును అనుకూలమగు స్థలమును గలిగియుండ వలయును గదా!

సర్వధర్మసమోపేతాశ్శివభక్తి పరాయణాః ।

ప్రసాదాదేవ రుద్రస్య జానంతి జ్ఞానవైభవమ్ ॥

సత్య, జ్ఞాన, ధర్మ ,దయా, శాంత, విరక్త్యాదులతో గూడి ఈశ్వర భక్తి యందు నిరంతరము కాలము గడిపెడు భక్తులకు పరమేశ్వరుని కరుణ వలన జ్ఞానమాహాత్మ్యము గోచరము గాగలుగును ఈశ్వరభక్తి లేనిచో ప్రకృతి దోషములు నశించవు పకృతి దోషములు నశించనిచో మోక్షమార్గము లెస్సగ గోచరము గాదు

త్యజ శోకమమంగల్యం మంగళాని విచింతయ ।

చిదానందఘనం స్వచ్ఛమాత్మానం చ విభావయ ॥

నీవు అమంగళమగు శోకమును విడిచి పెట్టి శుభవిషయముల చింతించుచున్నవాడవై చిదానంద ఘనంబును, శుద్ధంబును నగు ఆత్మను భావింపుము అట్టిజ్ఞానము గలుగుటకు నీక్రింది విధిని అనుష్ఠించవలయును

దేవద్విజగురుశ్రద్ధాభరబంధుర చేతసామ్ ।

సదాగమప్రమాణానాం మహేశానుగ్రహో భవేత్ ॥

దేవతలయందును, విప్రులయందును, గురువులయందును ఆసక్తి గల చిత్తముగల వారికిని, ఎపుడును శాస్త్రప్రామాణ్యము ననుసరించి యాచరించు వారికిని పరమేశ్వరానుగ్రహము గలుగుచున్నది యని జ్ఞానవాసిష్ఠమున నిర్వాణ ప్రకరణము

బీష్ముడు

3 ఓం ఇపుడు వీరుడును, శూరుడునునగు శ్రీభీష్ములగూర్చి చెప్పెద ఈయన క్షత్రియవంశములో జన్మించినవాడైనను తనయొక్క

యాచరణానుష్ఠానములవలన నాచార్యపదవి నలంకరించెను కనుకనే భీష్మాచార్యులని పేరువచ్చినది ఇప్పు డేలాగున వ్యాకరణ, న్యాయ, సాహిత్య, వేదాన్త, ఆచార్య పరీక్షలు గలవో యాలాగున నప్పుడుగూడ నుండెను ఈయన గొప్ప కర్మయోగియు, బృహ్మనిష్ఠుడును, అస్ఖలిత బ్రహ్మచారియుగా నుండెను భారతీయు లందఱును ఈ మహాపురుషుని దివ్యజీవితమును స్మరించి యిప్పుడు తరించవలసి యున్నారు ఇట్టి శ్రేష్ఠపురుషుడుగూడ మనభారతదేశములో జన్మించినవాడే

ఈయన బ్రహ్మచర్యవ్రతమును నిలబెట్టుటలో చూపిన దృఢవ్రతము ప్రతి బ్రహ్మచారియు ముముక్షువును స్మరణలో నుంచుకొనదగినది ఆపరమపురుషునికి గలిగిన దివ్యశక్తు లన్నియు, మహాధీరత్వమున్నూ బ్రహ్మచర్యవ్రతము వలననే సిద్ధించినవి ఇట్టి పరమపవిత్రమగు వ్రతము ననుష్ఠించుటలో తనయొక్క గురుడగు శ్రీపరశురామునిగూడ తిరస్కరించవలసి వచ్చెను అంతియే గాక తల్లి మాటను గూడ కడకు త్రోసివైచి తాను పట్టిన దివ్యవ్రతమును చెడనీయక చూచుకొనెను ఇట్టిదానికే దృఢవ్రత మని పేరు

ధర్మ యుక్తమై యధ్యాత్మ జ్ఞాన సంరక్షణార్థమై లోకోద్ధారక విషయమై ఈశ్వరానుగ్రహము గలుగ జేసికొను విషయమై యడ్డు గలిగినచో తల్లి, తండ్రి, గురువు – వీరల వాక్యముల నైనను అతిక్రమింప వచ్చును అయితే యిది యతీత విషయములందు మాత్రమే చెల్లును అట్లుకాని విషయము లన్నిటియందును, మాతా, పితృ, గురువుల వాక్యములను శిరసావహింపవలెను ఈభీష్మాచార్యుల చరిత్రము భారతమున విస్తారముగ గనందగును ఇచ్చట సంక్షిప్తముగ జెప్పెదను ఆదిపర్వము చతుర్థాశ్వాసము

వ॥ అత్యంత శోకార్ణవమున మునిగిన తల్లిని, మరదంద్రను, నాశ్వాసించి, యరాజకంబైన రాజ్యం బకలంకంబుగా బరిపాలించుచున్న కొడుకు నఖిల ధర్మవిదు గాంగేయుంజూచి సత్యవతి యిట్లనియె

శంతనుసంతానంబున

సంతతకీర్తియును బిండసంస్కృతియును న

త్యంతమహీభారమును బ
రంతప నీయంద చిరతరంబై నిలిచెన్.

జననుత సర్వధర్మవులు సర్వజగత్పరివర్తనక్రమం
బును మఱి సర్వవంశములు బుట్టిన మార్గము నీవ నిక్కువం,
బనఘ! యెఱుంగుదున్నత గుణాఢ్యుడవున్ భరతాన్వయావలం
బనుడవు నీవ నిన్నొక్కడు పంచెద జేయుము మత్ప్రియంబుగాన్.

ఇక్కురు వంశంబున నీ
వొక్కరుడవ యున్నవాడ, వుర్వీరాజ్యం
బెక్కటి సేకొని తేజము
దిక్కుల వెలిగింపు సంతతియు బడయు మొగిన్.

నిరతంబు బ్రహ్మ మొదలుగ
వరుపన యెడతెగక యిట్లు వచ్చిన వంశం
బురుభుజ నీవుండగ నీ
తరమున విచ్ఛిన్నమగుట ధర్మవె యనినన్.

విని భీష్మ డనియె మీ కి
ట్లని యానతి యీగదగునె యమ్మయి నా ప
ల్కిన పల్కులు గుఱి నాతా
ల్చిన వ్రతమును జెఱుప నంత చిఱుతనె చెపుడా.

హిమకరుడు శైత్యమును, న
ర్యముడు మహాతేజమును, హుతాశను డుష్ణ
త్వము విడిచిరేని గుర్వ
ర్థము నాచేకొనిన సద్వ్రతంబు విడుతునే?

పృథివ్యాది మహాభూతంబులు గంధాది గుణంబుల నెట్లు విడువ వట్ల యేనును గురుకార్యంబున మీశులాక్కర్థంబుగా సర్వజన సమక్షంబున నా చేసిన సమయస్థితి విడువను

అని దృఢవిషయమై భీష్ముడు జెప్పిన గంభీరవాక్యాక్షరములను భారతదేశమున బుట్టిన ప్రతి స్త్రీ పురుషుడును ననుష్ఠింపదగినవారుగదా! చంద్రుడు చల్లదనమును విడిచియు, సూర్యుడు ప్రకాశమును, అగ్ని యుష్ణమును విడిచియు నేలాగున నుండజాలరో, యాలాగున వ్రతనిష్ఠుడు తన నియమమును విడిచి జీవింపజాలడని భీష్ముండు, తల్లితో జెప్పె మఱియు గంధమును విడిచి పృథివి యెటులుండదో, రసమునుపేక్షించి జలమేలాగున నిలువదో, ఉష్ణము నుపేక్షించి యగ్ని యేలాగున నుండదో, స్పర్శ నుపేక్షించి వాయువు ఏలాగున నిలువదో, శబ్దమును త్యజించి యాకాశమేలాగున నుండదో, యాలాగున దృఢవ్రతుడు నిశ్చయాత్మకమగు తనవ్రతమును పరిత్యజించి జీవింపజాలడు ఓహో యెటువంటి ప్రతిజ్ఞ! ఆమహాత్ముని హృదయ నిశ్చయ మెంత పావన మైనది!

ఇక ఈ విషయమై యుద్యోగపర్వమున చతుర్థాశ్వాసమున గనందగిన విషయము గలదు కాశీరాజు కుమార్తెలలో పెద్దదియగు అంబయను పేరుగలది బీష్ముని వివాహము జేసికొను విషయమై యెన్నియో ప్రయత్నముల జేసియు, విఫల మైనందుచే అందరును భీష్మాచార్యుల గురువగు శ్రీపరశు రాముని వద్దకు బంపి యాయన చెప్పినచో శిష్యుడగు భీష్మాచార్యుడు తప్పక వివాహ మంగీకరించునని చెప్పినందుచే నాలాగున నాకన్యక యత్యధిక భక్తివినయభావములతో శ్రీపరశురాము నాశ్రయించినందుచే శ్రీపరశురా ముడు రాచకుమార్తెనుకూడ తెచ్చి భీష్మునితో జెప్పిన విషయ మిచట నను సంధేయము గ్రహించవలెనని తాత్పర్యము

అనిపలికి పరశురాముడు
సనుదెంచెను మునిజనంబు సమ్మదమున దో
జను దేర గురుక్షేత్రం,
బున కుద్ధతి గాశిరాజపుత్రిం గొనుచున్.

వచ్చి సరస్వతీ తీరంబున విడిసి తనరాక నాకెరింగించి నేను బుత్విక్పురోహిత ప్రభృతి విశిష్ట బ్రాహ్మణ సమేతంబుగా, బూజా ద్రవ్యం బులగొని తత్ప్రదేశంబున కరిగిన నమ్మహాత్ముండును మదీయ భక్తి వినయ

సంభ్రమంబులు సంప్రీతి నభినందించి యర్చనలు గైకొని కాశిరాజ కన్యకం జూపి నాతో నిట్లనియె

బలిమి మున్నేల తెచ్చితిప్పుడతి మగుడ
ద్రోచి పుచ్చంగ దగునయ్య నీచవృత్తి!
వచ్చె దీని దమ్మునికి వివాహమింక
నైన జేయుము, చెఱుచుట యనుచితంబు.

అనుటయు ననఘా తెలియన్
వినుమిది నాతోడ సాళ్వ విభునకు నేగూ
ర్చిన చాననతని పాలికి
ననుపుము నన్ననిన గాదె యనిచితి మగుడన్.

ఇంక నాతమ్మునికి దీని నెట్లు పెండ్లి
సేయనేరుతు ననుడు నా చెప్పినట్లు,
సేయవై తేని నిన్ను నీచెలుల జొట్ట
ములను జంపుదు ననియె నమ్మునివరుండు

ఏను వినయంబు వదలక వినతుండనగుచు వివిధవాక్యంబులం దెలుప నంతకంతకు నతనికి గోపంబగ్గలంబైన వెండియు,

గురుడవైసమగ్ర కోదండవిద్యామహత్త్వమిచ్చినాడ వలుగదగునె?
కారణంబు లేక యీారసమెత్తి యిట్లనిన బరశురాముడాగ్రహమున.
గురుడని నన్నెరుంగు దనఘుండవు నావచనంబునం దనా
దరణ సేసి తెన్నియొ విధంబులని బల్కెదు భక్తితోడ నీ
వెరవులు దక్కుమీయబల వేగమ పెండిలి సేయుమంతతో
మరలు మదీయకోపశిఖి మానదు వేరొక వేయు జేసినన్.

అనిన విని ధర్మాచరణంబున కింతవట్టి పెనంగనగునె పరానురక్త చిత్త యగు మగువ నిల్లాలిం జేయువారుం గలరె, యిట్టి యకృత్యం బాచరించు కంటె నీచేత నెట్లైనను లెస్స తొల్లి పెద్దలు సెప్పిన చొప్పు నవధరింపుమని యిట్లంటి

గర్వియై కార్య మిట్టి ద కార్యమిట్టి
దని యెఱుంగక లోకంబు చనుపథమున
దిరుగకున్మద వృత్తి వర్తించునట్టి
వాని గురువైన దండింప వలయు నంద్రు.

అనుమాటకు గాలానల
మునుబోలెను మండి కయ్యమున కాయితమై
మొనలేర్చి వేగయిచటికి
జనుదెమ్మని భార్గవుండు సంరంభమునన్.

శ్రీపరశురాముడు వివాహము చేసికొనెదవా లేక యుద్ధమునకు సిద్ధముగ నున్నావా యని భీష్మని కోపముతోనడుగ యుద్ధములో ప్రాణమును గోల్పోయినను తాబట్టిన వ్రతమును విడువతలంచుట లేదని సమాధానము చెప్పెను ఓహో యెటువంటి పరిశుద్ధహృదయము! ధర్మములో గల దృఢ విశ్వాస మేమని చెప్పవచ్చును అయితే పరశురాముల వారి కోపోజ్జ్వలితవాక్యముల వినునపుడు భీష్మని మనస్సుగూడ కొంచెము అశాంతి గల్గినట్లు ఈపద్యముచే గోచరమగుచున్నది లేనిచో'' గర్వియై కార్యమిట్టి దకార్యమిట్టి'' దని చెప్పి యుండడు

అయినను భీష్మడత్తరి రాజ్యపరిపాలనమునుగూడ చేయుచుండువాడగుటచే ధర్మముల నతిక్రమించి స్వేచ్ఛా ప్రవర్తకులైయుండు వారిని తల్లి, తండ్రి, గురువను అభిమాన ముంచక ధర్మబద్ధముగ సర్వజనులకు ఏదండన ధర్మశాస్త్రమున విధింపబడియున్నదో యా లాగున చేయుటయే సత్యధర్మ నిష్ఠగల రాజుయొక్క విధియని ధర్మశాస్త్రములో గలదు కాన అట్లు చెప్పి యుండును అయినను మనుస్మృతియందు ఈవిషయమై మనువు విధించినది చూడందగును

ఆచార్యం చ ప్రవక్తారం పితరం మాతరం గురుమ్ ।
న హింస్యాద్బ్రాహ్మణాన్ గాశ్చ సర్వాంశ్చైవ తపస్వినః ॥

వేదాధ్యాపనము చేయు నాచార్యుని, వేదభాష్యము మున్నగువాని

యర్థమును బోధించెడు ప్రవక్తను, తండ్రిని, తల్లిని, ఆత్మజ్ఞానము నుపదేశించెడు గురువును, బ్రహ్మనిష్ఠులగు బ్రాహ్మణులను, గోవులను, తాపసులను బాధింపరాదు ఒకవేళ ప్రమాదముచే కొంచెమైన తప్పిదము పైవారిలో గలిగిన హితమగు నీతిని చెప్పవలసినదేగాని దండింపరాదు భీష్మాచార్యులకు గలిగిన శక్తి బ్రహ్మచర్యవ్రతముచేతను బరిశుద్ధమగు వ్రతనిష్ఠచేతను సిద్ధించినది

ధర్మ్యం యశస్య మాయుష్యం లోకద్వయరసాయనమ్।
అనుమోదామహే బ్రహ్మచర్య మేకాంతనిర్మలమ్॥

బ్రహ్మచర్యమహిమ చెప్పబడుచున్నది ధర్మము లన్నిటికిని ఆధారమైనట్టియు, యశస్సుకు మూలమైనటువంటియు, దీర్ఘాయుస్సునకు హేతువైనట్టియు, పవిత్రతను గలుగచేయునదియు, ఇహలోకముననను పరలోకముననను దివ్యరసాయనము వంటిదియు అనగా దేహశుద్ధికి ఆత్మశుద్ధికి కారణమగు బ్రహ్మచర్యము బ్రహ్మసాక్షాత్కార జ్ఞానమున కాధారమైనదని గ్రహించవలయును

బ్రహ్మచర్యమున కిట్టి మహిమ గలదని మనువుపదేశించెను,-

మహనీయులు ఎంత మహిమగల వారైనను తమ నీతి నతిక్రమించి యే కార్యమును చేయరు ఎట్లన సముద్రము అతి మహిమగలదైనను తన హద్దులోపల నిలచునేగాని కట్టదాటి భూమిని ముంచుట లేదు ఆలాగున సూర్య,చంద్ర,బృహస్పతులు మొదలగు గ్రహములు కూడ మహాప్రభావము గలవైనను తమయొక్క జ్యోతిశ్చక్రరేఖనుండి తొలగుటలేదు ఈలాగున మహాయోగశక్తిగాని, తపశ్శక్తిగాని గలిగిన మహాత్ములైనను తమ ధర్మము నతిక్రమించి యే కార్యమును చేయరు

వ్రతయజ్ఞతపోదాన హోమస్వాధ్యాయవర్జితమ్ ।
సత్యశౌచపరిభ్రష్టం సంన్యాసం నైవ కారయేత్ ॥

వ్రతము, దైవయజ్ఞము, తపస్సు, శక్తికొలది దానము, హోమము, వేదము, ఉపనిషత్తు, భగవద్గీత మొదలైనవాటి య[illegible] బాహ్యాభ్యంతరశుద్ధి మొదలగు నాత్మశుద్ధికి హేతువులైన యుత్కృష్టానుష్ఠానములు లేనివారికి బ్రహ్మనిష్ఠ సిద్ధింపనందున అట్టివారికి సంన్యాసమును

కలుగ జేయరాదు అనగా పై జెప్పిన యనుష్ఠానము లేనివారికి అంతఃకరణా దీంద్రియములు శుద్ధములు గానిచో బ్రహ్మనిష్ఠయందు నిలకడ కుదరదు అయితే వ్రత, స్వాధ్యాయ, తపస్సులు మితముగ నుండవలసినవేగాని, శరీరమును మిక్కిలి శుష్కింపజేయు లాగున నుండరాదు ఏలన కొన్ని దారుణములగు నౌషధములు రోగములను రహితముజేయు శక్తిగలవైనను, శరీరబలమును నిర్వహింప శక్తిలేని (మించిన) ఔషధమైనచో నది రోగమును రహిత మొనర్చుటకు ముందుగా శరీరమును రహితము చేయును ఆలాటి మూర్ఖత్వము, అవివేక స్వభావమున్నూ ఉండరాదు కనుకనే యా విషయమై శాస్త్ర మీలాగున నుపదేశించుచున్నది

భయం క్రోధమధాలస్య మతిస్వప్నాతి జాగరమ్।
అత్యాహార మనాహారం నిత్యం యోగీ వివర్జయేత్ ॥

భయము, కోపము, సోమరితనము, ఎక్కువ నిద్ర, అతి జాగరణము, మితిమీరిన భోజనము, నిరాహారము మొదలగునవి ధ్యాననిష్ఠులచే విసర్జింప దగినవి

ఉదయతి యది భానుః పశ్చిమే దిగ్విభాగే
ప్రచలతి యది మేరుః శీతతాం యాతి వహ్నిః ।
వికసతి యది పద్మం పర్వతాగ్రే శిలాయాం
న భవతి పునరు క్తం భాషితం సజ్జనానామ్॥

సూర్యుడు పశ్చిమదిగ్భాగమున నుదయించినను, మహా మేరువు స్వస్థానమునుండి చలించినను, అగ్ని శీతలత్వము నొందినను, పర్వతాగ్రమున కఠినశిలలపై తామరపువ్వులు పూచినను, సజ్జనులైన దృఢవ్రతులు తాము జెప్పిన వాక్యము నతిక్రమించరు

విషయేంద్రియయోర్యోగే భవతి సుఖం యన్నిమేషసమయేన ।
విషయే నష్టే దుఃఖం యావజ్జీవం చ త త్తయోర్మధ్యే ॥

వ్రతనిష్ఠకు భంగము గలిగి యల్పసుఖమగు ప్రపంచ సుఖములో బడిపోయినచో గలిగెడు కష్టములు ఈశ్లోకముచే తెలిసికొనందగినవి ఇంద్రియ ములకు విషయములతో సంబంధము గలుగునపుడు ఒక్క నిమిష

సమయములో గలిగెడు సుఖములకు వశపడినచో ఆవిషయములనుండి విడుదలనొందిన యుత్తరక్షణములోనే దుఃఖము గలుగుచున్నది. అట్టి దుఃఖమో జీవితాంతము వఱకు నీయాత్మను పీడించుచుండును అనగా విషయములచే నొక నిమిషము సుఖము గలిగినను ఘోరమై గలిగెడు దుఃఖము ప్రాణాంతమువఱకు బాధించుచుండును

ఉదారస్య తృణం విత్తం శూరస్య మరణం తృణమ్ ।
విరక్తస్య తృణం భార్యా నిస్స్పృహస్య తృణం జగత్ ॥

ఉదార స్వభావము గలవారు ధర్మకార్యము తటస్థించునప్పుడు ధనమును తృణముగ తలంచి వ్యయపరచుదురు శూరుడైన క్షత్రియునకు యుద్ధములో మరణము తృణముగా నుండును వైరాగ్య శీలుడగు ముముక్షువునకు భార్యతో గల విషయభోగము తృణముగ నుండును నిస్సంగుడైన వానికి నీజగత్తంతయు తృణప్రాయముగ నుండును

క్రోధ ఏవ మహాన్ శత్రు స్తృష్ణా వైతరణీ నదీ।
సంతోషో నందనవనం శాంతి రేవ హి కామధుక్ ॥

శత్రువులందఱికంటే కోపమే తనయాత్మకు గొప్పశత్రువు పాప భూయిష్ఠమై నరకాగ్నిగ ప్రజ్వలించుచుండు వైతరణీ నదికన్న తృష్ణ (విషయేచ్ఛ) అతి దారుణమైనది సంతోషమునకన్న మించిన స్వర్గము లేదు కోరికల నెల్ల నిచ్చు కామధేనువుకన్న శాంతము ఉత్కృష్టమైనది

ఆచారాద్విచ్యుతో విప్రో న వేద ఫలమశ్ను తే।
ఆచారేణ తు సంయుక్తః సంపూర్ణఫలభాగ్భవేత్ ॥

వేదములను కడవఱకు చదివి, వేదార్థములను చక్కగ గ్రహించిన వాడైనను, ఆచరణలేనిచో కొంచెమైనను ఫలము గలుగదు మంచి యాచరణతో గూడి యనుష్ఠానముగల వాడైనచో ననుష్ఠానము లన్నిటి యొక్క పూర్ణఫలము ననుభవింపగలుగును

పరాన్నేన తు భు క్తేన మైథునం యోఽధిగచ్ఛతి।
యస్యాన్నం తస్య తే పుత్రా అన్నాచ్ఛుక్రం ప్రవర్తతే॥

అన్నా త్తేజో మనః ప్రాణశ్చక్షుశ్శ్రోత్రం యశో బలమ్
ధృతిశ్స్మృతి స్తథా శుక్రం పరాన్నం వర్జయేద్బుధః ॥

పరాన్నముచే గలిగెడు దోషము ఈరెండు శ్లోకములచే చెప్పబడు చున్నది. అదియు నపవిత్ర మార్గముతో వచ్చెడు పవిత్రాన్నమైనను పాపాన్న ముచే గలిగెడు దోషమే గలుగును. మఱియు నీచాహారమైన నది మఱింత యాత్మను చెఱచును. ఏలన? మనుజుడు ఏయన్నమును భుజించునో యదియే రక్తమై, శరీరమై, ఇంద్రియములై మనస్సుగా మారుచుండును. పరాన్నము భుజించెడు స్త్రీపురుషులకు ఆయన్నమువల్లనే శుక్రశోణితము లేర్పడుచున్నవి. దానివలన గలిగెడు సంతానములు గూడ నట్టి స్వభావము గలవియై యుండును. కావున తల్లిదండ్రులు ఉత్కృష్ట సంతానమును గని వంశపావనముచేయు తలంచిన నాహారమును జాగ్రత్తగ సంపాదించు కొనవలయును. అన్నము చేతనే తేజస్సు, మనస్సు, ప్రాణము, చక్షువు, శ్రోత్రాదీంద్రియములు, యశస్సు, బలము, ధారణాశక్తి, (గ్రహణ) మహిమ, అస్థి, మజ్జ, శుక్లము మొదలగు నవన్నియు నేర్పడుచున్నవి. కావున బుద్ధి మంతుడు పరాన్నమును, పాపాన్నమును, దుష్టాన్నమును విడువవలయును. లేనిచో మనశ్శాంతియు, సత్యబుద్ధియు, ఇంద్రియ నిగ్రహమును గలుగవు.

సావిత్రి

4. ఇప్పుడు భారతదేశమునకు గౌరవము, నశియింపని యశస్సున్నూ, ప్రత్యేకముగ నారీమణులకు అచంచలకీర్తియు తెచ్చిన వీరవ నితలలో నొకతె యగు శ్రీసావిత్రీచరితను చెప్పెద. ఈనారీమణియు దృఢవ్రత నిష్ఠ గలవారి చరిత్రలో పేరెన్నికకు వచ్చినది. రాచకుమార్తె యయ్యు బాల్యకాల ములోనే వనములో తపంబొనర్చుచుండు పతిసాన్నిధ్యముజేరి భర్తృశుశ్రూ షయు, దైవభక్తియు, తపశ్చర్యయు, వ్రతనిష్ఠయు గలిగిన పుణ్యవతి. భారత మున అరణ్యపర్వములో శ్రీమార్కండేయ మహర్షి ధర్మరాజునకు నీపావన చరిత్రమును తెలిపెను. అచ్చోట నీ చరిత్ర విస్తారముగ గనందగును. ఇచ్చట సంక్షిప్తముగా తెలిపెద.

ఇట్టి పుణ్యవతులెందరో జన్మించిన మన భారతదేశ మిప్పటి కిట్టి దీనావస్థకు వచ్చుట చూచిన నెవరి మనస్సు నీరుగాకుండును? దైవచింతనము, తపస్సు, బ్రహ్మచర్యాది వ్రతనిష్ఠలు క్షయించి పోయినందుననే యిట్టి దీనావస్థకు లోకము జారిపోయినది మరల లోకోద్ధరణము గావలసియుండిన బ్రహ్మచర్యాద్యాశ్రమములును, వానప్రస్థుల తపోవనములును, సన్న్యాసుల ధర్మబోధలును ఏర్పడవలయును ఈ చరిత్రలో సామాన్యజనులకు గలిగియుండు ఒక కుశంక నివృత్తి గాగలదు అదేమన స్త్రీలు చేయుచుండు దైవకార్యములచే గలిగెడు ఫలితము భర్తలకు చెందదనియు, అది భార్యలకు మాత్రమే ఫలమిచ్చుననియు జెప్పుచుందురు ఇందువలన గాబోలు స్త్రీలు బ్రహ్మనిష్ఠాది దైవకార్యము లాచరించుటకు పురుషులు సహింపకున్నారు పురుషులు జేసిన పుణ్యములో నొకభాగము భార్యలకు లభించుననియు, అందువలన భర్తలు చేయు దైవకార్యములో భార్యలు పాల్గొన్న చాలు ననియు నిర్బంధింతురు ఓహో, యెంత యంధవిశ్వాసము చేయువారికిని, చేయించెడి వారికిని, ప్రేరేపించెడి వారికిని, చూచి సంతోషించు వారికిని కర్మఫలము సమానముగ గలుగునని చెప్పెడు శాస్త్రవాక్యమును వినుట లేదే ఇట్టి సందేహము ఈసావిత్రీ చరిత్రముచే తొలగిపోవును సావిత్రి యనియు, గాయత్రి యనియు, సరస్వతి యనియు చెప్పెడు ఈమూడు పేర్లును నొకటియే

మార్కండేయుడు ధర్మరాజునకు సావిత్రి ఉపాఖ్యానంబు సెప్పుట.

కలడు మద్రేశుండు ఘను డశ్వపతి యను
ధరణీశు డతడు సంతానకాంక్ష
నెంతయు ధృతి బదునెనిమిది యేడులు
సావిత్రి గొల్చె నజ్జనవిభునకు
నద్దేవి ప్రత్యక్షమై వరమడుగుము
నావుడు నతడు వినమ్రు డగుచు
నాత్మజా గోరెద ననవుడు గన్నియ
పుట్టు నీకనియె నాభువనమాత

యనుడు దేవి ! భవత్కృప నస్మదీయ
వాంఛితము నఫలంబు గావలదె యని నృ
పోత్తముడు విన్నవింప, నయ్యోగమూర్తి
గాఢకారుణ్యవికచ హృత్కమల యగుచు.

ఏను నీమనోరథంబు తెరంగు మున్ను చతుర్ముఖున కెఱింగించిన నతండు గన్నియగ నిర్దేశించె, అద్దేవుని యానతి యమోఘంబు వినుమక్కన్నియ కారణంబున నొక్కవిధంబునం బిదప బుత్రశత లాభంబునగు సంతసిల్లుమని యను గ్రహించి యద్దేవి యంతర్ధానంబు నొందె నయ్యశ్వపతియును సావిత్రీ ప్రసా దంబున నిజధర్మపత్ని యయిన మాళవియందు సావిత్రియను కూతుంగని యక్కన్నియ నతి గారవంబునం బెనిచెనంత,

ఆవనజాక్షి పరిస్ఫుట
యౌవనయై సిద్ధసాధ్యయక్షామర క
న్యావలి దనసౌందర్య
శ్రీవిలసనరేఖ నవహసించుచు నొప్పెన్.

కోరి జనపతి దన కూర్మికూతు జూచి
గుణవయోరూపముల కనుకూలుడైన
భర్త నెమ్మెయి దీనికి బడయువాడ
నొక్కొ యని, యెడ్డదడవుచు నుండె నెలమి.

అదియును సాళ్వపతియైన ద్యుమత్సేను కొడుకు సత్యవంతుండు రూపవంతుండనియు, గుణవంతుండనియును విని వానియందు జిత్తంబు దగిలియున్నను సిగ్గు పెంపున నెవ్వరికి నెఱింగింపకుండె నంత నొక్కనా డమ్మద్రపతికడకు నారదుం డరుగుదెంచిన నతండమ్మహాముని నుచిత సపర్యాపరితోషితుం జేసి సద్గోష్ఠి విశేషంబు సలుపుచున్నయెడ నత్తరి దాసీజనులతో సావిత్రి వచ్చి తండ్రికి నమస్కరించి భయభక్తి గలిగియుండ, నారదుం డమ్ముద్దియంజూచి యశ్వపతితోడ నిక్కన్నియం దగినవరున కొసంగక యిట్లేల యునిచినాడ వనిన, నతండు గూతున కిట్లనియె

తల్లి! నీగుణరూప వృత్తముల కెందు
దగిన వరు గాంచనైతిని దడవి కాన
నీమనస్సున కెక్కిన నృపకుమారు
గోరి వరియింపు మిదియ నాకును బ్రియంబు

అనిన నదియు గొండొక లజ్జించి కోర్కి పెంపున సిగ్గు దొలగంద్రోచి ప్రకట కౌతూహల తరళితాంతరంగ యగుచు దండ్రికి నల్లన నిట్లనియె

చిరకీర్తి సాళ్వభూవరు
వరతనయుండయిన సత్యవంతుడు నాకున్
వరుడుగ గోరుదు మదిలో
నరవర యాతనికి నిమ్ము నను బ్రీతిమెయిన్

సాళ్వపతి యిప్పుడ దైవ యోగంబునంజేసి విగతచక్షుండయి తన రాజ్యంబు వైరులచేతం గోల్పడి పుత్రదార సహితంబు వనంబున నున్నవా డెట్లయినను సత్యవంతునే వరియింతు ననిన, మద్రేశ్వరుండు నారదుం జూచి మునీంద్రా! మీ యెరుంగని వారు లేరు సావిత్రిచేత వరియింపబడిన కుమారుండెట్టివాడు? వాని గుణరూప శీలంబు లెఱింగింపుడనిన నారదుం డిట్లనియె--

సత్యంబు పలుకుట సత్యవంతుండన
నతడొప్పు మఱియు జిత్రాశ్వుడనగ
నామాంతరంబు నన్నర నాధసుతునకు
గలదు తేజంబున గమలమిత్రు
బుద్ధి నింద్రాచార్యు బురుడించు శూరత
వాసవు దాలిమి వసుధబోలు
గాంతి జంద్రునకెన గాదగు రూపున
నాశ్వినేయుల సరియన దలిర్చు
దపము శమము దమము దానంబు బ్రాహ్మణ
భక్తియును మహాప్రభావతయును
నతనియంద కాని యన్యులయందు లే

దింత నిక్కువము మహీతలేశ!

వానియందును గీడు నొక్కటియు గలదు నేడు మొదలుగా నొక్క సంవత్సరంబునకు మృతింబొందు నిది నీకు జెప్పవలయుటం జేసి చెప్పితి ననిన నతండు గూతు మొగంబు సూచి తల్లీ! యిమ్మహాత్ముండు దేవరహ స్యంబు లెఱుంగు నీతనివచనం బమోఘంబు, నీకు నట్టి వరుండేల? యొండొ క్కవరుని వెదకికొమ్మనిన నక్కన్నియు దండ్రి కిట్లనియె

వినుము మనోవాక్కాయము
లన మూడు దెఱంగులందు నంతఃకరణం
బనఘ ప్రధానము గావున
మనమున గైకొన్న భర్త మానందగునే?

సత్యవంతుండెట్టివాడైన నగుంగాని యేనింకనొరుల వరియింప నొల్లననిన, నశ్వపతి నారదుదెస చూచుటయు నతండిట్లనియె

గొనముల ప్రోక నీయనుగు గూతురు, దీని తలంపు మాన్పగా
మనకు నశక్యమింక ననుమానము లేల నరేంద్ర యింతి జ
య్యన నృపసూతి కిమ్ము కమలానన చేసిన పుణ్యగౌరవం
బున నయినం బ్రియుండు పరిపూర్ణచిరాయురుపేతు డయ్యెడున్.

అనిన నమ్మహీపతి యమ్మునిపతికిమొక్కి నీవు మాకుం బరమ గురుండవు నీయానతిచ్చి నట్ల చేసెద ననిన నారదుండు వారిని దీవించి దివంబున కుం జనియె నంత,

అమర బుణ్యదినంబునందు బాంధవమంత్రి
వృద్ధపురోహితవితతితోడ
సావిత్రి దోడ్కొని జననాయకుండు వై
వాహికమహనీయ వస్తుకోటి
గొనుచు బుణ్యారణ్యగోచరుండై తప
స్విరుడైన యాద్యుమత్సేనుకడకు
జనిన నారాజును సంభ్రమంబున నశ్వ
పతికి నర్ఘ్యాది సంభావనంబు

లాచరించి సముచితాభిమతాలాప
పూర్వకముగ సుజనపూజ్యు డతని
యాగమన నిమిత్త మడిగిన మద్రేశు
డెలమి సాళ్వపతికి నిట్టులనియె.

ఈకన్నియ నాకూతురు
మాకులమునకెల్ల దేవమనుజోత్తమ! నీ
వీకన్నియ గోడలుగా
గైకొనుము మదీయవచనగౌరవబుద్ధిన్.

అని పలికి సావిత్రి నతనికి నభివందనంబు సేయించి మఱియు నతండు,

నీకొడుకు సత్యవంతున
కీ కన్నియ దగు, నరేంద్ర యీకన్నియకున్
నీకొడుకు దగు, ననన్యగు
ణాకరు లియ్యిరువురును సమంచితమూర్తుల్.

అనిన నతనికి ద్యుమత్సేనుండిట్లనియె

విగతరాజ్యులమై ఘోరవిపినములకు
వచ్చి యిమ్మెయి దపమున్న వారమేము
బాలసుకుమారి యిది జనపాల! యడవి
నుండి మాతోడి యిడుమకు నోర్చునయ్య?

అనిన నశ్వపతి యతని కిట్లనియె

కలిమియు లేమియున్ సతముగా వవి సెందినచో జెలంగుచుం
గలగుచునుండ్రె ధీరుల ప్రకారమె లెస్సగ నింతపట్టునే
దెలియుదు జెప్పెదన్ వసుమతీవర పిన్నయనంగనేల నే
కొలదియు గాదు ధీరమతి గూతురు పేర్కొన జాల బెంపునన్.

నీతోడ వియ్యమందం
జేతోగతి నాసజేసి చెచ్చెర ని ట్లే

నేతెంచితి మత్ప్రార్థన
బ్రాతిగ జేకొనకయునికి పాడియె నీకున్?

సావిత్రి సత్యవంతుని వివాహంబగుట

అనుటయు నయ్యంధ నృపతి తత్సంబంధమునకు సంతసిల్లి నిజాశ్రమ వాసులైన మునులం గూర్చికొని శుభలగ్నంబున సత్యవంతునకు సావిత్రిం బరిణయంబుసేసె నయ్యశ్వపతియునుం గూతునకు నల్లునకు వివిధాంబరాభరణాది వస్తువిశేషంబు లొసంగి నిజపురంబున కరిగె బదంపడి

పడతి రమణీయ భూషణాంబరనిలాస
ముజ్జగించి వనాంతరయోగ్యలీల
వల్కలాజినవసనయై వదలకధిక
భక్తి భర్తృశుశ్రూషణపరత నుండె.

ఆమెలతి సేయు సవినయ
సామకథల మృదుగభీరసంభావనలన్
మామయు న త్తయు సంతో
షామృతమున దేలిరంతరంగముల దగన్.

సావిత్రియు దనమగని యాయుఃప్రమాణంబు నారదమౌని చెప్పిన దినంబు మొదలుగా ననుదినంబును లెక్క యిడుకొనుచుండె నిట్లు వర్తిల్లు చుండ నాలుగు దినంబులు గొరంతగా నొక్క సంవత్సరంబు గడచిన

నాలవదినంబు పతిమృతి
కాలంబని మదినెరింగి కడునిష్ఠమెయిం
జాలభరంబుగ బూనెను
బాల త్రిరాత్రోపవాన పరమవ్రతమున్.

దానికి విస్మయంబంది ద్యుమత్సేనుండు గోడలిం బిలిచి తల్లీ! యిట్లేల దుస్తరంబగు వ్రతంబు దొడంగితి వనిన నమ్మద్రరాజ తనయ వినయంబుతో నిట్లనియె

మీరు మదీయంబగు వ్రత
భారమునకు వగవవలదు పరమశుభంబుల్
గోరి యొనరింప బూనితి
గారణమును మీకెఱుంగగా నగు మీదన్

అనిన నతండట్లేని మేలగుంగాక యనియె,నంత జతుర్థదివసంబున

కడురేపకడయ మేల్కని నిజభర్తకు
మరణదినంబని మానసమున
దద్దయు శోకసంతాపంబు గదురంగ
దిన ముఖోచితవిధుల్ దీర్చి భక్తి
బతికి సమంచిత పావనపరిచర్య
యప్పుడు కడు వేడ్క నాచరించి
యత్తకు మామకు నచటి విప్రులకును
వేర్వేర ప్రణవిల్లి వేడ్కవారు
దనకు సౌభాగ్య భాగ్యవర్ధనముగాగ
నిచ్చు దీవన మదిలో గ్రహించి యున్న
ప్రొద్దు జా మెక్కుటయు బూవుబోడి బిలిచి
మామ యిట్లని పలికె సమ్మాన మెసగ.

కడునుగ్రంబగు వ్రతమిది
దొడగితి దివసత్రయంబుతో నది సెల్లెం
బడతీ! యెంతయు డస్సితి
దడయక పారణ యొనర్పదగదే యింకన్.

అనిన సావిత్రి యతని కిట్లనియె

అధిప ప్రొద్దుగ్రుంకునంతకు నేడును
గుడువదగదు నాకు గోరియిట్లు
గాగ వ్రతము బూనుకాలంబు నే మున్ను
నిశ్చయించుకొనిన నియమ మదియు.

అనియె నప్పుడు సత్యవంతుడు సమిత్కుశ ఫలాహరణార్థంబు వనమునకుం గదలినం జూచి సావిత్రి యతని జేరంజని వనంబున కేనును నీతోడ జనుదెంతు దోడ్కొని పోవలయు ననిన నతండు నీవు· త్రిరాత్రోప వాసంబునంజేసి యెంతయు డస్సిన దానవు, రానోప వనిన నది వానికిట్లనియె

ఉపవాసశ్రమ మిప్పుడించుకయు నాయుల్లంబునం దోప దీ
విపినం బుజ్జ్వలపుష్పపల్లవ ఫలావిర్భూతి నానాలతా
ప్రపరీతంబన విందు జూడగ మదిం గౌతూహలంబయ్యె న
న్నపరోధింపకు మింతవట్టు చనవీయుక్తుండ వెబ్బంగులన్.

అనిన నతండట్లకాక చనుదెమ్మనుటయు సావిత్రి చయ్యనంజని భార్యాసహితుండయి యున్న తన మామకుం బ్రణమిల్లి, మీ కొడుకు వనంబునకు నగ్ని హోత్రార్థంబై సమిధలుదేర నరిగెడు నాకును నతని తోడన చని వనంబుసూడ వేడ్కయైనది మీరు నాకివ్వరంబు గృపసేయ వలయుననిన నాతండిమ్మగువ యెన్నండును నెయ్యదియును, నడుగ ది త్తెఱంగు దీనికిం బ్రియమైయున్నది నాకు నివారింపనేల యని తలంచి యనుమతించిన నయ్యిరువుర యడుగులంబడి వీడ్కొని, ఇట్లాదంపతులు మందగమనంబున పరిసరారణ్యంబు దటియం జొచ్చిరి తదనంతరంబ యారాజర్షి నందనుండు మధురంబులగు ఫలంబులు గోయుచు గరిడియ నిండించి యొక్క యెడ బరశు పాతంబునంజేసి కాష్ఠదళనంబు సేయదొడంగి శ్రమంపడి యొల్లంబోయి గొడ్డలి పుడమి పై వైచి నిరంతర నిశ్శ్వాసవేగ వివర్ణవదనుం డగుచు సావిత్రి గనుంగొని

ఒడలు వశంబుగాదు భ్రమనొందినయట్లు మనంబు దూలెడిం
గడగి శిరంబు శూలవిశిఖ ప్రకరంబున నొంచినట్టి ద
య్యెడు నిలువంగనోర్వ నొకయించుకసేపు శ్రమంబుదీఱ నీ
యెడ శయనింతు నావుడు సితేక్షణ మెత్తని సంభ్రమంబుతోన్.

తనయంకతలమ ప్రియుశిర
మున కుపధానముగ జేయ భూపతనయు డా

య్యన వ్రాలి సోలి నిశ్చే
తనుడైనట్లుండె గొంత తడవున కెదురన్.

కనియెం గోమల నీలమేఘవిలసత్కాలాంజనాకారు, ఘో
రనిశాతోత్కట దంష్ట్రనుజ్జ్వల చలద్రక్తాక్షు, బ్రత్యగ్రకాం
చనవర్ణాంబరు, నంత్యకాల దహనజ్వాలా ప్రచండున్, జగ
జ్జన సంత్రాసను నొక్కదివ్య బటుపాశప్రౌఢ హస్తోద్ధతున్.

అప్పురుషుండును నధికసంరంభంబున సత్యవంతుం గదిసిన, నయ్యింతి యెంతయు భయంబునం బ్రియుని శిరం బొయ్యన దిగువంజేర్చి నిల్చి, కృతాంజలియై యయ్యా! మీరెవ్వరియ్యెడకు నెయ్యది సేయం దలంచి విజయం చేసితి! రనిన నతండిట్లనియె

కాలుండజువ్వె యే గమలాక్షి! నను నీవు
మహితపాతివ్రత్య మహిమజేసి
కానంగజాలితి కాన రాదన్యుల
కిదె నీదు భర్తకు నిపుడు కాల
మగుటయు వీడు మహాపుణ్య నిధిగాన
యితరుల బనుపక యేన వీని
గ్రచ్చర గొనిపోవగా జనుదెంచితి
నని యుగ్రభంగి నయ్యంతకుండు
ధరణినాథతనయు తనువున బ్రాదేశ
పరిమితాత్ముడగుచు బ్రజ్వరిల్లు
జీవు వెడల దిగిచి చెచ్చెర నతిదీర్ఘ
భయదపాశ నికరబద్ధు జేసి.

కొని వేగంబున దక్షిణాభిముఖుడై ఘోరంపు మార్గంబునం
జనగాజొచ్చె ననంతరంబ మదిలో సావిత్రి శోకంబు పై
కొన ప్రాణేశ్వరు దేహ మొక్క యెడ సంగు ప్తంబు గావించి యా
తనివజ్జందగ దానునేగె బదపద్మంబుల్ వడిందొట్రిలన్.

దానిజూచి కరుణ ధర్ముండు నీవేల
వచ్చెదవు లతాంగి! వలదు నిలువు
మింతి నీకగమ్య మిటమీది తెరువెల్ల
ననిన నతని కిట్టు లనియె బొలతి.

పతులెందు జనిన నచటికి
సతులకు జనవలదె! నీప్రసాదమునను మ
త్పతిభక్తి కతనమునను సం
స్తుత గుణ! నాకరుగ రాని చోటులు గలవే

సకల మార్గంబులందును ధర్మమార్గంబు బ్రధానంబట్టి ధర్మంబునకు నాధారంబు సజ్జనుల యని వినంబడు నట్టి సజ్జనసందర్శనం బెప్పుడు వృధగాదు గావున సజ్జనశేఖరుండ వనంజను నీదైన సందర్శనంబునం బరమ శుభంబులం బొందక యేను రిత్తజనంబుల తెఱంగున నూరక యెట్లు మగుడు దు! ననిన దాని ప్రగల్భవచనంబులకు నద్భుతంబంది ధర్ముం డిట్లనియె

తనులతాంగి భవదుదార వాగ్భంగికి
మెచ్చువచ్చె నాత్మ నిచ్చువాడ
వేడు మొక్కవరము విభుని జీవిత మొక్క
టియును దప్ప నేది యయిన నొండు.

సావిత్రి యమునివలన నభీష్టవరంబులు వడయుట

అనపుడు మద్రరాజసుత ప్రాంజలియై సమవర్తితోడ ని
ట్లను రిపుకోటిచే నవజయంబును బొంది వనాంతరంబునం
దనవరత వ్రతాభిరతుడైన మహాత్ముడు సాళ్వభూవిభుం
డనఘుడు లబ్ధచక్షు డగునట్టులుగా గరుణింపవే దయన్.

నావుడు నట్టుల యయ్యెడు
నీవిట రావలదు మగుడు నెమ్మి నని వెసం

బోవదొడంగెను బిత్రుపతి
యావెలదియు నంత నిలువకరిగె బిఱుందన్.

ఇట్లు సనిచని మఱియు నిట్టనియె

ఎడపక వాఙ్మనః క్రియల నేరికి నెగ్గొనరింబూన రె
య్యెడలను దీనులం గరుణ యేర్పడ బ్రోవన చూతు రిచ్చుచో
గడమవడంగనీ కెదిరికాంక్షితముల్ దుదిముట్ట దీర్తు రె
క్కుడు మదికూర్తు రాశ్రితులకున్ వినుమిన్నియు నార్యధర్మముల్.

నీవెరుగనియది యెయ్యది
దేవోత్తమధర్మగతుల తెలిగెల్ల భవ
ద్భావాధీనమగుట గా
దే! వెలసితివీవు ధర్మదేవత యనగాన్

సమబుద్ధితోడ దత్త
త్సముచిత కర్మఫల మఖిల జంతుతతులకున్
సమకూర్చుట నీకయ్యెను
సమవర్తి యనంగ బేరు జగదభినుతమై.

యముడంద్రు నిన్ను నార్యులు
యమింతు భూతముల నెల్లనట్లగుట దగున్
శమనుండవైతి కల్మష
శమనంబునజేసి నీవు జలజా ప్తసుతా!

అనినం బ్రేతపతి యాపుణ్యసతి కిట్లనియె

తృషితుడగు వాని బరిలఘు
తుషారతోయములు మోదితుని జేయుగతిన్,
హృషితాంగు జేసె నను గ
ల్మషహరణములైన నీసమంజస ఫణితుల్.

కావున సత్యవంతు ప్రాణంబులు దక్కం దక్కిన కోర్కి యెయ్యది యైనం జెప్పుము సఫలంబు సేసెద ననిన సావిత్రి దేవా! వైరులచేత నపహృతం

బైన రాజ్యం బెప్పటియట్ల ద్యుమత్సేనుండు ప్రాపించునట్లుగా ననుగ్రహింపవే! యని వేడుటయు వైవస్వతుండట్ల యగునని పలికి యిట్లనియె

వలదు నిలువు మింక వదలక నీభక్తి
మగని కెక్కె దుర్గమంపు ద్రోవ
యిది కృతంబులయ్యె నెల్లయు నీవిట
వచ్చు సెలవు లేదు వనజనయన!

అనిన నమ్మహాభాగ యతని కిట్లనియె

ధర్మాత్ములు దమసలిపెడు
ధర్మక్రియ దప్పరెట్టి దశలందును మో
హోర్మియ దాపము బుట్టవు
ధార్మికహృదయముల బ్రథమధర్మాధ్యక్షా.

కావున బతియనుగమనం
బేవిధమున విడువదగునె యెట్లయినను మో
హావేశము బొందక ధ
ర్మావస్థితి సలువవలదె యవహిత బుద్ధిన్.

అనిన నంతకు డిట్లను నతివ నీవు
ప్రకటధర్మవిశేష తత్పరవు గాన
యింక నొక వరమిత్తు బ్రాణేశుబ్రదుకు
వలదుగాని యొండడుగుము వలయుదాని.

అనుటయు నక్కాంత కృతాంజలియై మాతండ్రి మద్రేశ్వరుం డపుత్ర కుండతనికి బుత్రశతలాభం బగునట్లుగా బ్రసాదింపుమని యభ్యర్థించ నట్ల కా నిచ్చితినని పల్కి ధర్మరాజు నేడు నీవు గడుదూరంబు వచ్చి డస్సితింక మగుడుట లెస్సయని పలికిన నప్పతివ్రత యిట్లనియె

నాకు డప్పి యెక్కడిది! మనంబు భర్తృ
చరణపంకజాసక్తమై కరము భక్తి

నలరుచున్నది సతులకు నన్య మెట్టి
దియును ధర్మమె భర్తృసంశ్రయమ కాక

మఱియు నొక్కవిన్నపంబు సేసెద

ఆత్మధర్మ నిరతులైన పుణ్యాత్ములు
దుర్లభులు సమస్తదురితములును
శాంతిబొందు వారి సంసర్గమున దీర్ఘ
పూతమతులు వారు భూతలమున.

వారల పేర్మిగాదె శశివారిజ మిత్రులు నిర్వికార సం
చారత నుల్లసిల్లెదరు సర్వపయోనిధులున్ నిరాకులా
కారత గ్రాలెడుం గులనగంబులు నిశ్చలరూఢిజాల నొ
ప్పారెడు భూతధాత్రి నిఖిలైక ధురీణత బేర్మి బొందెడున్.

అని పలికి మరియు నిట్లనియె మిత్రమనోరథం బవశ్యకర్తవ్యంబుగా జిత్తగింపు మనిన నమ్మహానుభావుం డబ్బామిని దెసం గనుంగొని నీకుంబ్రసన్నుండ నైతి నభీష్టంబైన వరంబొక్కటి యిచ్చెద వేడు మనిన నమ్మానినియు నిట్లయె

మది సత్యవంతుజీవిత
మది యిమ్ముగ దొలగబెట్టి యన్యంబుల ని
చ్చెద నని పలుకుదు మును నీ
వది యిప్పుడు లేద యింక నడిగెద బ్రీతిన్

పతిరహితంబు దుస్పృహము భర్తృవినాకృతియైన కాంత దూ
షిత యగు సర్వమంగళ విశేషములందునుగాన మత్ప్రియుం
డతులితకీర్తిశాలి సుగుణాఢ్యుడు సాళ్వసుతుండు లబ్ధజీ
వితుడుగ నిమ్ము ధర్మపదవీ పరిరక్షణ! పుణ్యవీక్షణా!

అనిన నట్లచేయుదునని యాక్షణంబ కృతాంతుడు సత్యవంతు నపగత పాశుంజేసి యాసుందరి కిట్లనియె

కొను మిదె నీమనఃప్రియుడు గోమలి! వీడు చతుశ్శతాబ్దముల్
మను నటమీద బుత్రుల గ్రమంబున నూర్వుర గాంచు కీర్తి వ

ర్తనుడగు సంతతాధ్వరవిధానములం బరితుష్టి సేయు న
య్యనిమిష కోటికెల్లను నిజాన్వయమౌళివిభూషణుం డగున్;

అని యాదేశించి యాతండంతర్హితుండయ్యె నక్కాంతయు గ్రమ్మఱి చని యెప్పటియట్ల జీవితేశ్వరు దనతొడులపై నిడికొని కూర్చున్న యెడం, గొండొకవడికి లబ్ధచేతనుండై సత్యవంతుడు దెలిసి నిజవల్లభం జూచి యిట్లనియె

కడు దడవు నిద్రవోయితి
బడతీ! నను దెలుపవలదు బలియు డొకరు డె
క్కుడు జవమున బట్టి బలం
బెడలగ నను దిగిచె నాత డెవ్వడు సెపుమా!

అది కలగాదు నిక్కువమ యైనటులున్నది నాకు నెంతయున్
మది వెఱపుట్టె నావుడును మానిని యిట్లను నీకు నంతయున్
ముదమున రేపు సెప్పెద దమోమయమై యిదె శర్వరీముఖం
బొదవె విలంబనం బిచట నొప్పదు లెమ్ము నరేంద్రనందనా!

తపశ్శక్తివల్లనే సావిత్రికి యమధర్మరాజును జూచుభాగ్యము గలిగినది దీనికే దివ్యదృష్టియని పేరు బాలిక తపస్సు చేత భర్తృప్రాణములను సంరక్షించుటయేగాక మామకు నేత్రములు గలుగుటయు, కోల్పోయిన రాజ్యము లభించుటయు, తండ్రికి సంతానప్రాప్తియు వీటినన్నిటిని సిద్ధింప జేసినది కనుకనే సాధ్వీమణు లుభయవంశముల నుద్ధరించెదరని పెద్దలు చెప్పెడు రహస్యము ఈసాధ్వీమణియగు సావిత్రీచరిత్రను చదివి స్త్రీలకు పతిసేవతప్ప వ్రతములు, జపములు, తపస్సులు, ధ్యానములు, యోగములు వేదాన్త విచారణలు, ఏటికని చెప్పెడు మనపురుషులు కొంతవఱకైన జ్ఞానము తెచ్చుకొనగలరు ఎప్పుడు నారీమణులకు వ్రతములు, దైవచింతనలు లేక పోయినవో, అప్పటినుండియే వారి గర్భములో జన్మించెడు బిడ్డలు గూడ జ్ఞాన హీనులై పోవుట ప్రారంభించినది కుంతీదేవి తపస్సంపన్నుడగు దుర్వాసమహర్షి సేవచేతనే గదా, లోకోద్ధారకులగు ధర్మరాజ భీమార్జున నకులసహదేవాది

పుత్రులను గనగలిగినది ఈలాటి చరిత్రము లెన్నియో గలవు మనుస్మృతి యందు ఆర్యుల కాలములో స్త్రీలు ఎంతపూజ్యత గలవారై యుండిరో చెప్పబడినది చూడుడు

యత్ర నార్యస్తు పూజ్య న్తే రమ న్తే తత్ర దేవతాః ।
యత్రైతాస్తు న పూజ్య న్తే సర్వా స్తత్రాఫలాః క్రియాః ॥

ఏకుటుంబమునందు నారీమణుల జూచి దేవతలు సంతుష్టిగలవారై పూజింపబడుచుందురో, యా కుటుంబమును జూచి దేవతలు సంతుష్టిగలవారై యుందురు ఏ యింటిలో స్త్రీలు దుఃఖితలై తపింతురో, యాగృహస్థు చేసెడు సమస్తక్రియలు నిష్ఫలము లగును

ఈలాగున చూచిన దైవభక్తి గలిగి సత్త్వగుణముతో ప్రసన్నచిత్తలగు స్త్రీలు చాల యరుదుగ నున్నారు గదా! కనుకనే సంసారము దుఃఖసాగర మైనది సత్త్వగుణము గలిగి దైవభక్తిగల స్త్రీలలో నీక్రింద నిరూపించేలాగున సంతానము గలుగును

రూపసత్త్వగుణోపేతా ధనవంతో యశస్వినః ।
పర్యాప్తభోగా ధర్మిష్ఠా జీవంతి చ శతం సమాః ॥

మంచిరూపము, మంచిబలము, సంపూర్ణ గుణసంపద–వీనితో గూడిన వారలై, ధనవంతులై, పేరెన్నిక గలిగి నిండుభోగంబులు గలిగినవారైన పుత్రులు పుట్టుదురు మఱియు వారు నూరేండ్ల ఆయుస్సు గలవారై యుందురు అట్లుగానిచో కుయుక్తులు గలవారు, కురూపులు, అల్పాయుస్సు గలవారు, దైవద్వేషులు, మాతాపితృ ద్రోహులు, దుష్టులు, దుర్గుణ భూయిష్ఠులు, సాధునిందకులు, ధర్మఘాతకులు మొదలగు వారు గలుగుదురు నారీమణుల యొక్క పవిత్రతను గుఱించి శ్రీకృష్ణభగవానులు విభూతి యోగమున నుపదేశించిన దాని చూడుడు

కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా ।

స్త్రీలలోగల కీర్తియు, లక్ష్మియు, మంచి వాక్కును, జ్ఞాపక శక్తియు, పరిశుద్ధబుద్ధియు, ధర్మకార్యములందు ధీరతయు, ఓర్మియు నేనై యున్నాను ఈ గుణము లన్నియు నేస్త్రీలలో గాన్పించునో యట్టి నారీమణులు లక్ష్మీదేవితో

సమానలగుదురు అవి యన్నియు భగవదంశములని భగవాను డుపదేశించెను

సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ ।
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువమ్॥

ఏ కులంబున భార్యచే భర్త, భర్తచే భార్యయు సంతసము గలిగియుండురో, ఆకుటుంబమున శుభము ఎల్లప్పుడు తాండవ మాడుచుండును

స్వాధ్యాయేనార్చయేతర్షీన్ హోమైర్దేవాన్ యథావిధి ।
పితౄన్ శ్రాద్ధైశ్చనౄనన్నై ర్భూతాని బలికర్మణా ॥

వేదాధ్యయనములచేత (ఉపనిషత్తు భగవద్గీత ప్రణవాది మంత్రజపములచే) ఋషులను, హోమములచే వేల్పులను, శ్రాద్ధముల చేత బితృదేవతలను, అన్నముచేత నతిథులను, అన్నము మొదలగు వానిచే భూతకోట్లను శాస్త్ర ప్రకారము యథాశక్తి పూజింపవలయును

అఘం స కేవలం భుఙ్క్తే యః పచత్యాత్మకారణాత్ ।
యజ్ఞశిష్టాశనం హ్యేతత్సతామన్నం విధీయతే ॥

ఎవరు తననిమిత్తము మాత్రము అన్నము వండి భుజించి, అతిథి యభ్యాగతులకు బెట్టరో, అట్టి యన్నము పాపహేతువుగాన నతడు పాపమునే భుజించుచున్నాడు కాన గృహస్థు శక్తికొలది బ్రహ్మయజ్ఞ, ఋషియజ్ఞ, అతిథి యజ్ఞేత్యాది కార్యములు చేసిన తరువాత భుజించవలయును అట్టియన్నము పవిత్రమైనది పాపరహితమైనది పుణ్యమును వృద్ధిపరచునదిగా నుండును ఈయర్థమునే గీత 3,4 అధ్యాయములలో శ్రీకృష్ణభగవాను లుపదేశించినారు

స్త్రీధనాని తు యే మోహా దుపజీవన్తి బాంధవాః ।
నారీయానాని వస్త్రం వా తే పాపా యాంత్యధోగతిమ్ ॥

వారసులెవరైను, స్త్రీలకు ఏర్పడియుండు ధన, గృహ, పశు భూమ్యాదులను వారనుభవించుటకు నుపయోగపరచక యపహరించుకొన్నచో నట్టివారు పాపము లొనర్చినవారై యధోగతి పాలగుదురు అని మనుస్మృతి

ఇది ఇప్పుడు లోకములో వితంతువులగు నారీమణులు అనుభవించెడు కష్టములను జూచిన గోచరమగుచుండును

తటాకం ధననిక్షేపం బ్రహ్మస్థాప్యం సురాలయమ్।

ఆరామకృతికూపాని సప్త సంతానసంజ్ఞకాః ॥

కొందఱు పుత్రసంతతిలేని స్త్రీలు తమకున్నతలోక ప్రాప్తి గలుగదని బహువిధముల దుఃఖితు లగుచున్నారు సంతానమునకు పుత్రు లొకటేయని యర్థము గాదు సంతానము ఏడువిధములైనది దానిలో నొకటి గలిగి యుండినను చాలును దానివలన సంతానముచే గలిగెడు ప్రాప్తి గలుగును వీనికే సప్తసంతానము లని పేరు అవియేవి యనగా (1)చెరువు త్రవ్వించుట, (2) శాశ్వతధర్మముకొఱకు ధనము నేర్పరచుట (3)బ్రహ్మనిష్ఠులకు మఠాశ్రమాదులను నిర్మించుట,(4) దేవాలయముల నేర్పరచుట, (5)ధర్మార్థము వనము వేయించుట,(6) ఉత్తమగ్రంథముల నచ్చొత్తించుట, (7)జనుల యుపయోగార్థము బావుల త్రవ్వించుట మొదలగునవియని గ్రహించవలయును

వీటి యన్నిటకన్న దైవజ్ఞానము గలిగియుండుట మిక్కిలి శ్రేష్ఠమైనది ఏలన తక్కినవాటిచే నన్నిటిచేతను పుణ్యలోక ప్రాప్తిగలుగునేగాని జన్మరాహిత్యమగు మోక్షము, దైవజ్ఞానముచే నొకదానిచే మాత్రమే గలుగును. ఇది పుత్రులచేగాని, మిత్రులచేగాని, భర్తలచేగాని, ధనముచేగాని, విద్యచే గాని గలుగునది కాదు జ్ఞానమొకదానిచే మాత్రమే గలుగును

మృతే భర్తరి సాధ్వీ స్త్రీ బ్రహ్మచర్యే వ్యవస్థితా ।

స్వర్గం గచ్ఛత్యపుత్రాఽపి యధా తే బ్రహ్మచారిణః॥

నారీమణులు సంతానము లేనివారై భర్తలు గతించిన వారైనను బ్రహ్మచర్యము నవలంబించి యీశ్వర విషయములో కాలము గడిపిరేని వారుగూడ మోక్షమున కర్హులగుదురు

అధర్మప్రభవం చైవ దుఃఖయోగం శరీరిణామ్।

ధర్మార్థప్రభవంచైవ సుఖసంయోగమక్షయమ్ ॥

జీవాత్ములకు నధర్మమువలన జన్మించు దుఃఖమును, ధర్మ ప్రవర్తన వలన గలుగు సుఖమును, చక్కగ నాలోచించుకొని యధర్మకార్యములో ప్రవర్తింపక సదా ధర్మకార్యములనే చేయుచుండవలెను

ఉచ్చావచేషు భూతేషు దుర్జ్ఞేయమకృతాత్మభిః।
ధ్యానయోగేన సంపశ్యేద్గతి మస్యాంతరాత్మనః॥

ఉత్కృష్టములైన దేవయోనులందును, నీచములైన పశ్వాదియోనులందును, నీజీవుడెవ్విధంబున బ్రవేశించునదియు మూఢు లెరుగజాలరు అట్టిజీవుని ప్రవేశమును ధ్యానయోగముచే జక్కగా యతి యెరుగవలయును అనగా దేవజన్మము, మనుష్యజన్మము, పశు జన్మము మొదలగునవన్నియు, పుణ్యపాపకర్మల తారతమ్యముచే గలుగును కావున సదా సత్కర్మపరులై యుండవలయును

అహింసయేంద్రియాసంగైర్వైదికై శ్చైవ కర్మభిః।
తపసశ్చరణై శ్శోగ్రై స్సాధయంతీహ తత్పదమ్॥

మనోవాక్కాయకర్మలచే హింస గలుగచేయ కుండుటచేతను, ఇంద్రియములను విషయములందు చేరనీయకుండుటచేతను, వేద విధి ప్రకారము అనుష్ఠానముల జక్కగ జేయుటచేతను, శ్రేష్ఠములగు తపస్సుల నాచరించుటచేతను, ఈలోకంబున ఈదేహముతో గూడి యున్నపుడే బ్రహ్మప్రాప్తి యను పదవిని బ్రహ్మనిష్ఠులు పొందుదురు

ప్రియేషు స్వేషు సుకృత మప్రియేషు చ దుష్కృతమ్।
విసృజ్య ధ్యానయోగేన బ్రహ్మాభ్యేతి సనాతనమ్॥

బ్రహ్మవేత్త యగువాడు తన ప్రియులందు దనపుణ్యమును, అప్రియులందు బాపమును వీడి, ధ్యాననిష్ఠగలవాడై బ్రహ్మముతో నైక్య మొందుచున్నాడు అనగా దూషించువారు పాపమును, ప్రేమించువారు పుణ్యమును పంచుకొనుచున్నారు

యదా భావేన భవతి సర్వభావేషు నిస్పృహః।
తదా సుఖమవాప్నోతి ప్రేత్య చేహ చ శాశ్వతమ్॥
అనేన విధినా సర్వాం స్త్యక్త్వా సంగాన్ శ నై శ్శనైః।
సర్వద్వంద్వవినిర్ముక్తో బ్రహ్మణ్యేవావతిష్ఠతే॥

ఎప్పుడు మనస్సున సకలవస్తువులం దభిలాష లేనివాడగునో యపు డీలోకమున దృప్తి, సుఖజన్మంబును, బరలోకంబున నశ్వరముగాని మోక్ష రూప

సుఖంబు నొందును ఇత్తెరంగున బుత్రకళత్ర క్షేత్రాదులందు దన యనునట్టి సకలసంగములను వీడి మానావమానాదు లగు ద్వంద్వముల నుండి తొలగి మున్ను చెప్పిన జ్ఞానకర్మముల యనుష్ఠానమువలన బునరావృత్తి రహిత మయిన మోక్షము నొందుచున్నాడు

ధృతిః క్షమాదమోఽ స్తేయం శౌచ మింద్రియనిగ్రహః ।
ధీర్విద్యాసత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్ ॥

1 నిర్మలహృదయము, 2 ఆపత్తులయందుగూడ తన ధర్మమును వీడని యోర్మియు, 3 వికారములకు హేతువున్నను వికారము గలుగని బాహ్యేంద్రియ నిగ్రహమును, 4 పరులవస్తువు నపహరింపకుండుట 5 బాహ్యాంభ్యంతర శుద్ధి గలిగియుండుట, 6 విషయముల నుండి యింద్రియముల మరల్చుట, 7 శాస్త్రవాక్యములను, గురువాక్యములను మరువక యుండుటయు, 8 ఆత్మజ్ఞానపరమగు విద్యయు, 9 సత్యమును బలుకుట, 10 కోపములేమి యను నీపదియు ధర్మమునకు గుర్తులు ఇదే ధర్మనిష్ఠుని యొక్క చిహ్నము

చతుర్భిరపిచైవైతైర్నిత్యమాశ్రమిభిర్ద్విజైః।
దశలక్షణకో ధర్మః సేవితవ్యః ప్రయత్నతః ॥

నాలుగు ఆశ్రమస్థులును పైజెప్పబడిన పదితెఱంగులగు ధర్మములను ప్రయత్నపూర్వకముగా ఆచరణలో నుంచవలెను అటు లైన మాత్రమే యక్షయమైన మోక్షము గలుగును

కర్ణుడు

5 ఇప్పుడు దృఢవ్రతమును ధరించినవారిలో నొకడగు కర్ణుని చరిత్రము చెప్పెద ఈశూరపురుషుడు బ్రహ్మనిష్ఠుడు కాకపోయినను ధర్మనిష్ఠుడగుటచే నీచారిత్రమున్నూ పరమపవిత్రమైనదే ఏలన ధర్మ మన్నిటికన్న ఉత్కృష్ట మైనది ధర్మహీనుడు బ్రహ్మనిష్ఠ సలిపినను, తపస్సుచేసినను, యోగ మవలంబించినను శ్రేష్ఠగతి నొందజాలడు ఈపుణ్యపురుషుని జీవితమునుండి కృతజ్ఞతయొక్క స్వరూపము, ఆత్మ విశ్వాసము యొక్క నిజస్థితియు మనము

గ్రహించుకొనవచ్చును ధర్మము యొక్క స్వరూపము అతి సూక్ష్మతమ మగుటచే నెట్టివారికైన తెలిసికొనుటకు దుస్తరముగ నుండును అయినను ధర్మవేత్తల యాశయము లోతుకు దిగి చూచినచో తా నేకార్యములో నియుక్తు డై యున్నాడో, దాని కనుగుణమగు అనుష్ఠానములో లోపము గలుగ నీయక యాచరించుటయే ధర్మ మనదగును అట్లుగానిచో నీసమస్యను పరిష్కరించుట కడుంగడు ప్రయాసము అంతేగాక యది యొకటి తక్క తక్కినవన్నియు ననేకముఖములుగ గన్పట్టుచుండును అది యొకటి మాత్రము ఏకముఖముగ గోచరమగును శ్రీకృష్ణభగవానుడు కర్ణునికి పరమాదరముతో నతనియొక్క జన్మవృత్తాంతమును తెలిపెను పాండవులలో చేరుట కుపదేశించెను (ఉద్యోగపర్వము చతుర్థాశ్వాసము)

తనతోడన గదలివచ్చిన ధృతరాష్ట్రాదుల నిలువంబనిచి రథారోహ ణంబు సేసి గోవిందుడు కర్ణుదెసం గనుంగొని నన్నునిచి వత్తుగాని రమ్మని కరంబు సాచి చేయిపట్టి తనయరదం బెక్కించుకొని సాత్యకి వేసరినెక్కి కెలనం జనుదేరం గదలి చని యనుపవచ్చిన కృతవర్మ నుచిత ప్రకారంబున సస్నేహంబుగా నిలిపి యరుగు నవసరంబునం బౌరలోకంబు

అక్కట వాసుదేవు పనుపాదరణంబున జేయరైరి వీ
రెక్కడి బుద్ధిమంతులని నిందును నందును లోకమెల్ల బే
రుక్కున ద్రుగ్గుటం దలవ నొల్లకపాయము సేసిరట్టె యీ
యుక్కివు లెందునుం గలరె యెవ్వరువో ధృతరాష్ట్రనందనుల్ .

అని మరియు ననేకానేక ప్రకారంబుల బలుకుచు నిరుగెలంకులం జూచుచుండ బుండరీకాక్షుండు పురంబు నిర్గమించె నిట ధృతరాష్ట్రుండును మగిడి కొలువుకూటంబునకు వచ్చి యెప్పటివారలు పరివేష్టింప నుండి కృష్ణుని వలన మాటలాడుచున్న సమయంబున సుయోధనుతో భీష్మ ద్రోణు లిట్లనిరి

పలుకునె యిట్లు గొంతి విని బమ్మెరవోయితి మింత బెట్టిదం
బులగునె మాట లయ్యుమయు బుణ్యుడు గృష్ణుడు కార్యవాదముల్
పలికెడు వారలిట్లు దెగ బాటిరి ధర్మజవారిరాశికిం
జెలియలి కట్ట వాసె మనచేనగు కర్జముచంద మెట్టిదో!

అనిపలికి వెండియు

మాకుం జూడగబోలు కార్యమిది ధర్మప్రీతి నీవేగి సు
శ్లోకుండైన యుధిష్ఠిరుం గని జనస్తుత్యంబుగా శాంతిమై
నీకౌరవ్యుల నెల్లగాచికొనవే యేపొప్పదెందుందుదిన్
శోకంబొందక వేగమై గదలి కృష్ణుంగూడ బోవే నృపా!

అనిన విని దుర్యోధనుండు మొగంబు రాజుచుండ నూరకుండె గాంగేయుండు దిగ్గనలేచి యతని నవలోకించి,

కురునృప! విను సంసారము
దరిద్రొక్కినవార మింక దలకెదమే! సం
గరమునకు నేము నీకై
పొరలితి మెట్లయిన నగును బోయెద మనుచున్.

అరిగిరి రాజాను నభ్యం
తరమునకుం జనియె రాజతనయుండు బహిః
పరివారము బొమ్మని మిత
పరిజనుడై యేగె నాత్మ భవనంబునకున్.

అంత నక్కడ నచ్యుతు డరిగి యరిగి
యధికసంప్రీతి దలకొన నర్కతనయు
నాననంబు వీక్షించి యిట్లనియె నెమ్మి
నన్యులెవ్వరు వినకుండ నతనితోడ.

నీవు వృద్ధజనోపసేవివి ధర్మసం
వేదివి తెలియంగ వినుము సిద్ధ
మంత్రబలంబున మార్తాండువరమున
గన్నియతటి గొంతిగన్నవాడ
వగుడు బాండునృపాలు నగ్రసుతుండువు
ధర్మమార్గంబిది ధర్మతనయు

డాదిగాగల తమ్ములందఱు నాచేత
నెఱిగి నీయడుగుల కెఱగి సకల
పుత్రమిత్రబంధుభూరి సేనాసమ
న్వితము గాగ గొలిచి నిన్ను రాజ్య
భారవహనమునకు బట్టంబు గట్ట ను
జ్జ్వలుడ వగుదు రమ్ము వారికడకు॥

ఏను నిన్ను సామ్రాజ్యంబునకు నభిషిక్తుంజేయుదు నీవు దొలుత వెడలు నప్పటి మహోత్సవంబునకు యువరాజై యుధిష్ఠిరుండు నీ రథంబుననుండి నీకు ధవళచామరంబులు వీచు, వాయుపుత్రుండు సితచ్ఛత్రంబు పట్టు, సవ్యసాచి సారథ్యంబు సేయు, మఱియు బాంచాల యాదవ పాండ్య మాత్స్యులు లోనుగాగల రాజలోకంబుతోడ గవలు నభిమన్యు ప్రభృతి కుమారులు బెరయ నేమెల్లంబలసి పరివేష్టించి వత్తు మిట్టి మహేంద్ర విభవంబున మహనీయుండవగుచు చక్రం బేలుమని మఱియును

పాంచాల రాజపుత్రియు
నంచితముగ నిన్ను బొందు నార్వురవరుసన్
సంచితపుణ్యుడ వీవొక
యించుకయును వేఱు సేయ కేతెమ్మెలమిన్

ఇట్లయిన గుంతికి సమ స్తబంధుమిత్రులకు బ్రియంబగు ననిన విని రహస్యంబుగా రాధేయుండు మాధవున కిట్లనియె.

కర్ణుడు శ్రీకృష్ణునకు దగిన యు త్తరంబు లిచ్చుట

వెడవెడ యేను దొల్లి యిది వింటి ననుంగని కుంతి యెంతయుం
జెడ నదిపైచిపోయె గృప జేకొని సూతుడు దెచ్చి తాను మున్
కొడుకుల గానకున్కి బ్రియకుం దగనిచ్చిన జేపె జన్నుల
వ్పడతియు నప్పుడాదిగ శుభస్థితి బెంచె బ్రయత్న శీలయై.

మూత్ర పురీషాదులు దమ
గాత్రములందింక వారు గారవ మెసగం
బుత్రుండని సంవర్ధిత
గాత్రునిగా జేసి రింతకాలము గూర్మిన్.

నేడింక నెఱిగి యొరువుల
వాడగదా యనుచు నేను వారి దొరగినం
బోడిమి సెడదే మది గడు
వాడి గలదె నీకు నకట వారిజనాభా!

వృద్ధోపజీవనంబును, ధర్మసంవేదనంబునుంగల వాడవని నన్ను నీవ చెప్పితివి రాధయు నతిరధుండును నాకు జాతకర్మాది సమస్త సంస్కారంబులు నిజకులోచితంబుగ నాచరించిరట్టి తల్లిదండ్రులకు బుత్ర కృత్యంబులు నిర్వర్తింపక వారలంబాసి యేను వచ్చుట ధర్మంబగునే యని వెండియు,

సోదరులు బ్రియులు ననుజాలు
నాదెస బెక్కండ్రు వారినందఱ విడువం
గాదని యూహింపక దా
మోదర నన్నిట్లు పిలుచుటుచితమె చెపుమా!

అదియునుంగాక

సూతసుతుండు వీడనక సూనుల తమ్ములకంటె నాకు సం
ప్రీతి యొనర్చి తేజమును బెంపును నాటికి నాటికగ్గలం
బై తనరార నన్నుదన యంతటిమానిసి చేసియుండ నే
నేతగవూది యాకురుకులేశ్వరు బాయుదు ముట్టవచ్చినన్?

నను నయ్యర్జుననకు నెదు
రని పెద్దయు నమ్మియుండు నక్కట దుర్యో
ధను డానమ్మిక వమ్ముగ
జనునే పాండవుల గలయ జన నాకనఘా!

ఏను నర్జునుండు నెక్కటెక్కటి దల
వడకయున్న నగరె పుడమిజనము
లందు వాదువచ్చు టతనికి నపకీర్తి
యనిన నీవు వేఱె యడుగ నేల?

హిత ముపదేశించితి నీ
వతినిర్మలబుద్ధివగుట నైనను నిది నా
మతి సొరదు రహస్యము ర
క్షితముగ బాటింపుమయ్య చిత్తములోన్ ॥

అది యేమిటి కంటేవి

ధర్మతనయుండు దాను నా తమ్ముడగుట
యెరిగెనేనియు సామ్రాజ్య మేలపూను?
నట్టిధార్మికు డాధిపత్యంబు జేయ
వలవదే శాశ్వతంబుగ వసుధ కెల్ల.

(కుంతీదేవి కర్ణునియొక్క జన్మవృత్తాంతమును దెలుపుటకొఱకు నేకాంతస్థలమునకు వెళ్ళి రహస్యముగ నుపదేశించుట అట్టి కుంతీదేవి వాక్యము సత్యమని సూర్యబింబమునుండి దివ్యవాక్యము గలిగినను కర్ణుడు తనయొక్క కృతజ్ఞతను విడువజాలనని కుంతీదేవితో తెలిపినపుడు కుంతి యుద్ధములో తనబిడ్డలగు ధర్మరాజాదులను వధింపరాదని యభయమును గోరుకొనుట, తల్లితో నతడాలాగున బ్రతిజ్ఞ జేయుటయు జరిగెను కనుకనే యనేక సార్లు యుద్ధములో ధర్మరాజ, భీమ, నకుల, సహదేవాదు లాయుధము లన్నియు నశించిన వారలై రథతురగాదులు క్షయించినవారలై యేమియు జేయజాలక స్తబ్ధులై యుండునపుడు కర్ణుడు ఏమియు జేయక వారిని శిబిరమునకు బంపివేసెను)

అని యిత్తెరంగున బెక్కులు చింతించి తలంచుకొని కర్ణునకుం బుట్టువు దెలిపి సహూదర స్నేహంబావహించెద, నట్లయిన నాహవంబువలని కడంక యుడుగకుండునేయని విచారించి యతని పాలికింబోవ నిశ్చయించి

యుచిత ప్రకారంబున వెడలి యతం డనుష్ఠానార్థంబు భాగీరథికిం జనుట విని తత్ప్రదేశంబున కరిగి యతనికి జపకాలంబయిన నునికింజూచి వెనుక వలన గూర్చుండ గొండొకసేపునకు జపంబుదీరి గలయం గనుంగొని యమ్మహాదే విం గాంచి కానీనుండు సంభ్రమ వినయంబులతోడం జేరి సూత్ర గోత్రంబును రాధేయనామంబునుం జెప్పి యభివాదనంబు సేసి మీరు విజయం చేసిన కార్యంబేమి నాకుం జేయంగల పని యెయ్యది యానతిమ్మనిన గుంతి యేకాం తంబుగ నిట్లనియె

కుంతీదేవి గర్ణునకు నతండు తనపుత్రుండగుట దెలుపుట

వినుము సూతాన్వయంబున నీవు పుట్టుట
బొంకేను మాకుంతి భోజునింట
గన్నియనాడు భాస్కరుని రావించితి
వరమంత్రబలమున వచ్చి యతడు
సంప్రీతి నొనగంగ జన్మించినాడవు
నాకు గావున బాండు నందనుండ
వగుదు ధర్మస్థితి నట్టి నీవితరుల
గొలువనేటికి గురుకులవరేణ్య!
ధర్మతనయాదు లైన నీతమ్ములకును
ధార్తరాష్ట్రులకును నీవ తగు విభుండ
వేలు మీలోక మెల్ల నీకేల రాధ
కొడు కితండను తక్కువ కొడుకు గుట్టి!

అనిపలికిన యవసరమున
వినబింబములోననుండి యిది నిజ మిబ్బం
గిన నెగడ వన్న మేలగు
నను వాక్యము వెడలె గర్ణుడాకర్ణింపన్.

దాని వినియును నపుడు రాధాసుతుండు
దిరుగబడని మనంబుతో ధీరవృత్తి

దల్లికిట్లను నీమాట తధ్యమగున
యైన నొక్కటి సెప్పెద నవధరింపు

క్షత్రియ సంస్కారమునకు
బాత్రముగా నీవు నన్ను బాటింపవిహ
ముత్రఫలములకు నీకే
బుత్రుడ నని వచ్చుటింక బొసగునె చెపుమా?

సూర్యానుగ్రహంబునజేసి నింద్యంబుగాక తక్కనేనియు నాజన్మంబు పరమరహస్యంబునై యున్నయది దీని ప్రకాశంబుసేయుట మనకెంత మేలట్లుంగాక

విజయువిక్రమంబు విఖ్యాతమై యుండ
నేను గుంతికొడుక భానుజుండ
ననుచు నతనిజేర నరిగిన నతనికి
వెఱచిపోయె ననరె వేయునేల?

కడిది పగఱ నేదెప్పగ
గడవంగా నీదదలచు కౌరవనాధుం
జెడుగాక యనుచు నిత్తఱి
విడువదగునె! యతనివలన వెలసినవాడన్!

కౌరవులజేత గుడిచిన
వారికి నిది సమయమెట్టి వారును సంగ్రా
మారంభమ్మున బాయుదు
రే రాజులు మనల దిట్టరే యట్టయినన్.

ఏనవశ్యంబును దుర్యోధనునకై నీకొడుకులతోడం బెనంగుదు

నీపలు కెంత వోలినను నిర్ణయమిట్టిద కాని యొండు లే
దీవనిమీది భారమున నీవిట వచ్చితిగాన పాండవుల్
సేవడిరేని జంప నఱ సేయక చెప్పెద సవ్యసాచిపై
గోపము పెద్ద వాడు నమకూరిన బిట్టఱ జంపుదుం జామీ.

సవ్యసాచిచేత జచ్చుటయును కీర్తి
కరమ యతడులోను గాగ నేపు
రేను లోనుగాగ నేపురు గాని నీ
కొడుకు లార్వురనుట విడువు మింక.

అనుటయు నప్డు గొంతి హృదయంబున శోకము నివ్వటిల్ల ని
ట్లను నిది దైవ సంఘటన మక్కట యెట్లును దప్ప నేర్చునే
యనుపమసత్య! విస్ఫురణ నాడినమాట మరాకుమన్న నీ
యనుజాల నల్వురంగడవు మర్జునుచేతకు సమ్మతించితిన్.

అనుచు గౌగలింప నర్కజాండట్లుగా
కని ప్రియంబు మెఱయ వినతుడైన
నరిగె సదనమునకు నద్దేవి యతడును
జనియె నిజనివాసమునకు బ్రీతి॥

ఓహో! యెంతయాత్మ విశ్వాసము దుర్యోధనుని పైగల కృతజ్ఞత యేమని చెప్పవచ్చును, భీష్మాచార్యులు శరతల్పము నందున్నపుడు కర్ణుడు ప్రత్యేకముగ నేకాంతమున వెళ్ళి మాట్లాడునపుడు భీష్ములుగూడ కర్ణుని జన్మరహస్యమును దెలిపి పాండవులతో గూడి యుండునటు లుపదేశించిరి తనయొక్క కృతజ్ఞతాధర్మమును విడువజాలననియు, నమ్మక ద్రోహము చేయననియు కర్ణుడు దెలిపెను శ్రీకృష్ణభగవానులు కర్ణుని సార్వభౌమునిగ చేసెదననియు, ధర్మరాజాదులను సేవకులనుగా జేసి పాంచాలికి నారవ భర్తగా ఏర్పరచెదనియు తెలుపగా, కర్ణుడు వాటినన్నిటిని తిరస్కరించుటజూచి యాఖరుయుద్ధములో జయము గలుగదనియు, మృతుడవగుదువనియు చెప్పినను కర్ణుడు ధర్మములను విడువజాలడయ్యెను శూరులును, పరిశు ద్ధులును నగువారి కీ ప్రపంచము తృణప్రాయముగ నుండును ధర్మమును విడచి ప్రపంచసుఖము ననుభవించుచుండినను, నధర్మముచే గలిగెడు దారు ణమగు నపయశస్సనెడి యగ్నిజ్వాలలో దహింపబడజాలరు వారు దేహమును తుచ్ఛముగ దలంచి ధర్మమార్గమున ప్రాణముపోయినను శాశ్వతమగు

స్వర్గసుఖమును, లేక దైవసుఖము ననుభవింతురేగాని మఱియొక కార్యము చేయ నొల్లరు

భీష్ముని వచనము

నీయుదయము దై వికగ
ర్భాయత్తము నీకు మర్త్యులసదృక్షులు గౌం
తేయుడవుగాని విను రా
ధేయుండవుగావు నీవు ధీరవిచారా!

ఇది కృష్ణద్వైపాయనుండు నాకు నేకాంతంబున నెఱింగించె నేనును భవదీయతేజో విశేషంబువలనను గనుంగొని యుండుదు బాండు తనయుండ వగుటంజేసి నీయెడ వాత్సల్యంబకాని మాత్సర్యంబులే దొక్కటి సెప్పెద వినుమేను గురుపాండవుల వైరంబుడిపి పుచ్చితి నప్పాండవేయు లజయ్యుల ప్రమేయుండగు కృష్ణుండు వారికి విధేయుండు గావున వారలతోడి విరోధంబొప్పదు నీవును నొండుదలపు దక్కి యక్కౌంతేయులం గలసి యుండు మనిన గర్ణుండతనికిట్లనియె

కౌంతేయుండ నగుదు నిది
యంతయు దొల్లియును వింటి నార్యులచే ని
ట్లింతయు నెఱిగిన గుంతీ
సంతానముతోడి పొత్తు సనునే నాకున్!

వారు మహాబలుల్, హరియు వారికి బ్రాపుగలండు, వారలం
బోర జయింపరామియును బుద్ధి నెఱుంగుదు నైన గౌరవ
క్ష్మారమణుండు సేయు తగు మన్నన లెల్ల దలంచి చూచినన్
భూరివివేక! యే విడిచి పోవుట ధర్మమె వీరకర్మమే?

అదియునుంగాక

మాటలు పెక్కులాడి యనుమానము లేక సభం గడంగి వ
ల్మాటు బరాభవించితి, జలంబున బాండవకోటి కెప్పుడుం

జేటుదలంచియే బలువు సేసితి, వైరము నాకు నింక నీ
వీటికి వారివీటికిని వెక్కసమయ్యెడు కయ్యమొప్పగున్.

దైవాధీనము సర్వమున్ మనమతిం దప్పింపగా వచ్చునే
నీవింకన్ ననునొండు వల్కక పరానీకంబుపై బంపు, మ
త్సేవాధర్మము నిర్వహించెద బలోత్సేకంబు లోకంబు సం
భావింపన్ విహరించెదన్, మురరిపుం బార్థుం దలంకించెదన్.

అని కర్ణుండు జెప్పెను--మఱియు వ్రతనిష్ఠులు, శూరులును నగువారి లక్షణము నీలాగున నుండునని శ్రీభర్తృహరి తెలిపెను

నిందంతు నీతినిపుణా యది వా స్తువంతు
లక్ష్మీస్సమావిశతు గచ్ఛతు వా యథేష్టమ్ ।
అద్యైవ వా మరణమస్తు యుగాన్తరే వా
న్యాయ్యాత్పథం ప్రవిచలన్తి పదం న ధీరాః॥

నీతిశాస్త్రమునందు నేర్పుకలవారు నిందను చేయుదురుగాక! ఇట్లుగా దేని స్తోత్రమును చేయుదురుగాత! సంపద ప్రవేశించు గాక! ఇష్టానుసారముగా నైనను పోవుగాత! ఇప్పుడైనను వేరొక యుగమునందైనను మరణమగుగాక! ధీరపురుషులు న్యాయమార్గము నుండి అడుగైనను చలింపరు

ప్రారభ్యతే న ఖలు విఘ్న భయేన నీచై ః
ప్రారభ్య విఘ్న నిహతా విరమన్తి మధ్యాః ।
విఘ్నైర్ముహుర్ముహురపి ప్రతిహన్యమానాః
పారబ్ధ ముత్తమగుణా న పరిత్యజన్తి ॥

నీచులగువారు విఘ్నములు వచ్చుననియెడు భయముచేతనే కార్యమును ప్రారంభింపరు మధ్యములైనవారు కార్యములను ప్రారంభించి విఘ్నములు వచ్చినపుడు భయమును పొంది కార్యములను చాలించెదరు, ఉత్తమగుణములు గలవారు విఘ్నములచేత మాటిమాటికి కొట్టబడినవా రైనప్పటికిని ప్రారంభించిన మంచి కార్యములను వదలక తుదముట్టజేయు చుందురు

కదర్థితస్యాపిహి ధైర్యవృత్తే ర్న శక్యతే ధైర్యగుణః ప్రమార్ష్టుమ్ ।
అధోముఖస్యాపి కృతస్య వహ్నేర్నాధశ్శిఖా యాంతి కదాచిదేవ ॥

నానావిధములగు సంకటములచేత బీడింప బడినవాడై నప్పటికిని ధైర్యవ్యాపారము గలవాడు తన ధైర్యగుణమును విడిచి పెట్టడు అగ్ని హోత్రు డధోముఖముగా పెట్టబడిన వాడై నప్పటికిని ఆయగ్ని యొక్క జ్వాలలు క్రిందుగా ప్రసరింపవు గదా ఇటులనే ధైర్యవంతుడుగూడ తన ధైర్యగుణము వదలి యధోముఖుడై యుండడు

వేదాస్త్యాగశ్చ యజ్ఞాశ్చ నియమాశ్చ తపాంసిచ ।
న విప్రదుష్టభావస్య సిద్ధిం గచ్ఛన్తి కర్హిచిత్ ॥

వేదాధ్యయనము, దానము, యజ్ఞము, యమనియ మాద్యష్టాంగ యోగములు, తపస్సులు ఇవియన్నియు చెడు మనస్సుగల వాని కెట్టి సంసిద్ధిని నెచ్చుటను గలిగింపజాలవు అని మనుస్మృతి

ఇంద్రియాణాం విచరతాం విషయేష్వపహారిషు।
సంయమే యత్న మాతిష్ఠేద్విద్వాన్ యంతేవ వాజినామ్॥

బుద్ధిమంతుడు సకల గుణాపహారులగుచు విషయములంజొచ్చు నింద్రియములను, సారధి గుఱ్ఱములనుబోలె గట్టి పట్టుటకు బ్రయత్నింపవల యును సారధి దోవతప్పి వెళ్ళుటకు ప్రయత్నించెడి గుఱ్ఱముల కళ్ళెముపట్టి లాగి సరియగు మార్గములో నడుపునట్లు, బుద్ధిమంతులు సన్మార్గము నుండి చలించెడు ఇంద్రియము లనెడు గుఱ్ఱములను, బుద్ధిబలముచే స్వాధీనపరచు కొనవలెను

ఇంద్రియాణాం తు సర్వేషాం యద్యేకం క్షరతీంద్రియమ్ ।
తేనాస్య క్షరతి ప్రజ్ఞా దృతేః పాత్రాదివోదకమ్ ॥

ఇంద్రియములన్నిటి లోపల నొకయింద్రియమైనను విషయాసక్తమైన యెడల నట్టివాని జ్ఞానము బెజ్జముపడిన పాత్రములోని యుదకము కారిపోవు నట్లు నశించిపోవును ఒక రంధ్రము పడిన నీరు క్రమముగ నశించునపుడు అనేక రంధ్రములు పడిప పాత్రలో గల జలము విషయమై మరల చెప్పవలెనా? ఒక ఇంద్రియము వశము గానిచో నంత యుపాయము గలుగుచుండ

ననేకేంద్రియములు విషయములలో ప్రవర్తించువాని జ్ఞాన విషయమై మరల నేమి చెప్పవలయును?

సీతాదేవి

6 ఇపుడు సీతాదేవియొక్క దృఢవ్రతమున్నూ తెలిసికొనదగినది తనయొక్క పాతివ్రత్య మహిమచేగదా ఆమెను రావణుడేమియు చేయజాలడా యెను పాతివ్రత్యమునకును మహామహిమ గలదు జానకీదేవి దృఢ వ్రతమును గుఱించి శ్రీమద్రామాయణ యుద్ధకాండమున గనందగును ఇచట నీ విషయము సంక్షిప్తముగ మాత్రము వ్రాయబడుచున్నది ఈలాటి ధర్మ రహస్యములు గ్రహించినమాత్రమే స్త్రీపురుషులు తమయొక్క ధర్మమును చక్కగ నిర్వహింప గలుగుదురు దానివలన వారి యాత్మ శుద్ధమగునదియే గాక ప్రపంచములోగల జనులుగూడ ధర్మనిరతు లగుదురు అదియునుగాక అత్మశుద్ధి గలుగునపుడు నిత్యసుఖమగు దైవప్రీతి గలుగుట కవకాశము సిద్ధించును, అది పునరావృత్తి రహితమగు మోక్షమని గ్రహించుకొనవలయును మానవుని శ్రేయస్సు(మోక్షము) గూడ దృఢతరవ్రతనిష్ఠలపై నిలకడ గలిగియుండును అట్టి దృఢవ్రతము లేనిచో నతని యనుష్ఠానము లన్నియు శక్తిరహితము లైనవని తప్పక గ్రహించ వలయును శ్రీజానకీదేవియేగాక యెం దరో నారీమణులు పాతివ్రత్య మహిమచే అనేకములగు అమోఘమహిమగల కార్యముల జేసినట్లు మన శాస్త్రములలో వినుచున్నాముగదా! ఇట్టి పుణ్యచారిత్రము మన భారత దేశములో తప్ప, ఇంతటి మహిమలు మఱియొక రాజ్యములోగూడ వినుటలేదు కావున మన నారీమణులకు గల ప్రాణ ములన్నియు తమయొక్క పతివ్రతా ధర్మముపై నాధారపడి యున్నవని మరు వకుందురుగాక!

అయితే యిట్టి పతివ్రతా ధర్మము నాచరించుటలో సద్విద్యకుగాని, దైవజ్ఞానమునకుగాని, బ్రహ్మనిష్ఠకుగాని, పవిత్రవ్రతానుష్ఠానమునకుగాని అది యడ్డు గలుగజేయునదిగా నుండరాదు పతివ్రతా ధర్మమునకు దైవభక్తియు, పుణ్యవ్రత నియమములును, ఆత్మజ్ఞానమున్నూ, బంగారము స్ఫుటమువేసిన

నేలాగున మరింత ప్రకాశము గలదగునో, అలాగున మిక్కిలి ప్రకాశము గలుగజేయును ఈవిషయమై సత్యభామ కొఱకు ద్రౌపది చెప్పిన వాక్యములను వినుడు ఆరణ్యపర్వము, పంచమాశ్వాసము

అత్తకు భక్తిగల్గి మది నాయమ సెప్పిన మాడ్కి జీవికా
వృత్తము లావహింతు గురు విప్రజనాతిధి పూజనంబు ల
త్యుత్తమభక్తి నేన తగ నోపి యొనర్తు బ్రియంబు దాల్మియున్
మెత్తదనంబునన్మతియు మేలుగ దాల్తు సమస్తభంగులన్.

విను ప్రద్యుమ్నాది భవ
త్తనయుల యెడనైన నేకతంబున నేకా
సనమున నుండుట దూష్యం
బని యెరుగుము సతుల చరిత లతిదుష్కరముల్.

కులవతులును సతులును ని
ర్మలమతులును నయినయట్టి మగువలతోడం
జెలిమి యొనరించునది దు
ర్విలసితవనితాభియు క్తి విడువుము తరుణీ.

ఈ విషయమై భారతమున విస్తారముగ గనందగును

వ్యాసు లనుష్టానముయొక్క మహిమను ధర్మరాజాన కుపదేశించుట

క్షమయు నహింసయు సత్యము
సమతయు నింద్రియజయంబు శమము బరిత్యా
గమును దపోలక్షణములు
గ్రమమున నిన్నియును నూర్ధ్వగతి కారణముల్.

ఇందుజేసిన బుణ్యంబ యందు గుడుచు
మీది జన్మంబునకు నది మేలు జేయు
గాన తనశక్తితో గూడ దాన ధర్మ
చిరపరోపకారంబులు సేయవలయు.

ద్రౌపదిని బట్టుకొనుటకువచ్చిన సైంధవునితో నామె పాతివ్రత్య ధర్మమును చెప్పుట--

నను బెఱ వనితల చందం
బున నవమానింప నీకు బోలదు మత్పా
వనపాతివ్రత్య మహిమ
ననిశము నేకీడు నెందు నందదు నన్నున్

ఎవరైనను వ్రతనిష్ఠ గలిగియుండినచో వారిని ఎవరును ఏమియు చేయజాలరు ఈవిషయమై కుమారస్వామి మార్కండేయ సంవాదము జూడందగును--

నియతిగలిగి యింద్రియముల
జయించి శుచులైన కాంతిసంపన్నులకున్
భయ మొనరింపగ లే వ
వ్యయపుణ్య గ్రహము లేయవస్థలయందున్.

పురుషుల ప్రయత్నము అవశ్యమునుండిన మాత్రమే పరమపురుషుని యనుగ్రహము గలుగునని కృపాచార్యుడు నశ్వత్థామకు నుపదేశించెను తాను చేయవలసిన కృత్యము ఈశ్వరాజ్ఞయని తలచి యాచరించువారికి మాత్రమే ఈశ్వరకృప గలుగును అనేక ఋషులు యోగులు నిష్ఠాపరులై తపోధ్యాన యోగాదుల నాచరించునపుడు గదా ఈశ్వరానుగ్రహము గలిగి సాక్షాత్కారము నొందిరి సౌప్తికపర్వము,-

ప్రారంభములకెల్ల బౌరుషమ్మును దైవ
　　　　మును సాధనమ్ములు వినుము వాని
లోన నొక్కటిచేత గానేర దనఘ! త
　　　　త్పులసిద్ధులెట్లన్న దరచు వాన
కారు పొలంబున గల్గనేనియు గొల్చు
　　　　గావింపనేర్చునే యేవిధమున
వలనేర్పడగ దున్న బొలములో నైన వ
　　　　ర్షంబు లేకున్న ధాన్యంబు లగునె?

కావు లావు వెరవు గల్గి కర్షణము సే
యంగ వృష్టి దగిన యట్లుగలుగ
ఫలము గల్గునట్లు పౌరుషంబునకు దై
వంబు తోడుపాటు వలయు నెందు.

అదియునుం గాక,

తగువని కుద్యోగించుచు
దగవెఱిగెడు హితుల కనుమతంబుగ జేయన్
జగతీసుర! వరకార్యము
లగువారికి గలుగు విధిసహాయత్వంబున్

ఇప్పుడు శ్రీ సీతాదేవి తనయొక్క పాతివ్రత్య దృఢబుద్ధిచే నగ్ని ప్రవేశము చేయుచున్నది అపుడు చెప్పిన దివ్యవాక్యములే మహామంత్రములు, ఇవే దృఢవ్రతముయొక్క గుర్తులు శ్రీమద్భాస్కర రామాయణమున యుద్ధకాండమున విస్తారముగ గనందగును ఇచ్చట క్లుప్తముగ తెలుపబడును

విభీషణుడు సీతనుదెచ్చి రామునకు సమర్పించుట

దేవరపంపునన్ వరసతీ తిలకంబగు సీత దెచ్చితిం,
గావున నీదుదర్శనము కాంతకు నీదగు వేడ్క నావుడున్
భూవరు డంతదైన్యమును మోదము గోపము నొంది జాత చిం
తావిలమానసుండయి రయంబున జానకి బిల్వబంచినన్.

శ్రీరామ వాక్యము

ఇంతి వినుము బురుషుడెట్టివా డయినను
బరుని యింట నున్న బడతి మగుడ
బాకృతుండపోలె జేకొన నేర్చునే
యింతకంటె నింద యెద్ది గలదు.

మానంబరయగ బ్రాణవ
మానము మానంబు సఖుడు మానమె ధనమున్

మానము విడుచుటకంటెను
మానుగ బ్రాణములు విడువ మంచిది తలపన్

శ్రీ సీతాదేవి వచనము

పురుషులు నమ్మరేని దయ పొల్తుల చేష్టితచిత్తవర్తనం
బరయుట దప్పుగాదు మనుజాధిప యుక్తమ కాన నీవొగిం
బరుసని పల్కుపల్కువిన బాలయితిన్ సభలోన నక్కటా
శరములబోలు వాక్యములు సైతురటే సతు లింతకోర్తురే?

నరవర నీవుచిత్తమున నమ్మినవాడవ యేని మున్ను న
న్నరయగ మారుతాత్మభవు నంపిన యప్పుడ నీతలంపు చొ
ప్పరుదుగ నాకు నేర్పడగ నాతనిచే నెఱిగింతు వేని నే
నెరియుచు బ్రాణముల్ విడుతు నిప్పుడు నన్నిటు లాడగూడునే?

పరవృత్తచేష్టిత భావేంగితంబులు
 సూచి తెలియుదీవు శుద్ధచరిత
యౌదార్యగంభీర తౌన్నత్యధైర్యాది
 గుణముల నెంతయు గొమరుమిగిలి
యాగమలౌకిక వ్యవహారములయందు
 నరయనీ వెఱుగని యదియు గలదె
నను నీవు దగ జిన్ననాటినుండియు జూచు
 చుండుదు విటయెగ్గు లున్నవయ్య

యొగి మహీపతి యప్పటినుండి పలుకు
ననుచితంబులు మాన్పంగ నసువు లేదె,
పరుషదుశ్శ్రవభీషణ భాషణములు
నీవు దయమాలి యననెట్లు నేర్చితయ్య॥

మీరింత నమ్మకున్నను,
గారవమేపార నన్ను గరుణించి మహో

దారంబగు సొద బెట్టుడు,
ధీరమతింజొత్తునందు దిరమగు కడకన్.

సీత యగ్ని ప్రవేశము చేయుట.

కలగక జాతవేదసు ముఖంబున నెంతయు శుద్ధురాలనై
నలువయు శూలియున్ హరియు నన్ను వెసంగొనియాడునట్లుగా
జొలవక మీరు మెచ్చుగతి జొచ్చెద జిచ్చు మదీయభర్త క
న్నెలవగునంతమీద శుభశీలత ధారుణి నాశ్రయించెదన్.

అనినం దల్లడమంది లక్ష్మణుడు దైన్యాయత్తచేతస్కుడై
తనలోనం దలపోసిఖేద మొదవన్ ధాత్రీపతింజూచి య
జ్జనపాలాగ్రణి సన్న చేసిన నుదంచద్వేగ మేపార నే
చినమంటల్ మొగిమిన్నుముట్ట సొదపేర్చెన్ సీత మోదింపగాన్.

పరమ పావనయగు సీత పరగనేడు
చెలగినాయందు జొచ్చుట జేసిమిగుల
ననఘశీలుండ నయ్యెద నని ముదంబు
బొందుకైవడి మిన్నంది పొదలె నగ్ని,

తదనంతరంబ,

తలవాల్చి యున్న భాస్కర
కులపతికి ప్రదక్షిణించి గురుతరకీలా
కులమగు సొద చేరంగా
సలలితగతి నేగుదెంచి జానకి యంతన్.

వినయముతోడ మ్రొక్కి యరవిందనిభానన వేడ్క వీతిహో
త్రునకు బ్రదక్షిణంబు సనుదెంచి కృతాంజలియై త్రిలోకపా
వనగతసర్వభావన! నివారితకల్మష సర్వనిర్జరా
ననసకలక్రియాధికరణ ప్రవణాభినివేశపావకా!

స్థిరమతులారా! యోసకల దిక్పతులార సురేంద్రులార కి
న్నరవరులార సర్పకుల నాయకులార మునీంద్రులార ఖే
చరవరులారా! యక్షగణచారణగుహ్యక సాధ్యులార వి
స్ఫురదినచంద్రులారా! వరభూతములారా! యెఱింగియుండుడా!

మీరిందఱు దగుగుఱిగా
గోరుచు నేనున్న దాన గురుహితమతి నా
చారిత్రంబేచందం
బేరూపము దానిమీర లెఱుగుదు రరయన్

కావున వాఙ్మనః కాయకర్మ బుద్ధీంద్రియ తదర్థంబులంజేసిని మేషకాష్ఠాకళాక్షణ ముహూర్తయామ సంధ్యాఽహోరాత్ర పక్షమాసర్త్వయన వత్సర పరిగణితంబులగు కాలంబులు సాక్షిగ స్వప్నాద్యవస్థలయందును జ్ఞానాజ్ఞానంబులయందును మద్వల్లభుండగు రఘునాధునకుం దప్పుట లేదు

ఛాయగతి నాదుచిత్తము
పాయక రఘునాధనంద పరగునయేనిన్,
న్యాయము దప్పక దహనుడు
ధీయుక్తిన్ నన్ను గాచు ధృతి యొడగూడన్.

దుష్టకల్మషబుద్ధినై దోషమునను
జనకులాధీశునకు దప్పి సచ్చరిత్ర
మెడలినడుచుట గలిగిన నీక్షణంబ
చెలగి నను నగ్ని భస్మంబు సేయుగాత!

అనుచున్ నిశ్చలచిత్తయై రఘుకులేంద్రాయత్తచింతావశం
బున దాత్పర్యము గల్గి నిర్మల లసద్బుద్ధిప్రసాదంబు పెం
పున నభ్రంకషకీలుడై కనలుచున్ భూరిప్రభుండైన య
య్యనలుండుప్పతిలంగ జొచ్చె నిరపాయ స్నేహరాగంబునన్

అనఘమంత్రపూతమైన యాజ్యాహుతి
పగిది ధరణిపుత్రి పడియె నంత
దేజమెసగ నగ్ని దేవుండు మిన్నంది
మహితశిఖలు గలిగి మండఁజొచ్చె.

లోలవిలాస ఖేలనవిలోచన మీనములాననాబ్జమున్
లాలితబాహువల్లరి మృణాలములున్ బృథుకేశభార శై
వాలము నొప్ప సీత యనవద్య పవిత్రచరిత్ర విస్ఫుర
చ్ఛీల కృశాను నందు సరసీగతి జూడగ నొప్పె నెంతయున్.

పవడపురాశిలోని నవభర్మశలాకయుబోలె జారు ప
ల్లవముల కుప్పలో నిడిన లాలిత చంపకదామమట్లు ర
క్తవనజరాజిహంసియనగా నరుణాభ్రములోన నున్న యా
నవశశిరేఖబోలె దహనస్థిత యయ్యె విదేహకన్య దాన్.

అప్పుడు పతివ్రతాశిరోమణియగు సీత దహన శిఖావృతయై యున్నం గనుంగొని దానవాంగనలు శోకింప, నిశాచరులు దుఃఖింప, గపులు సమాక్రందనములుసేయ, సుగ్రీవుండు బెగ్గిల, విభీషణుండు పారవశ్యంబు నొంద, నంగదుండు విన్నదనంబుసెంద, హనుమంతుడు ఖేదింప, లక్ష్మణుండు వగలం బొగుల, రాఘవుం డవాఙ్మానసముఖుండై నిర్వేదింప, సుర లనుచితంబన సాధ్యు లన్యాయంబన, యక్షు లనపేక్షణీయంబన, గంధర్వు లద్భుతంబన మహోరగం బులు తగదన, జరాచరంబులు దృశ్యాదృశ్యంబునగు భూతం బులు దల్లడిల్ల, మహాభూతము లాక్రోశింప, నక్కోలాహలంబు లొక్క పెట్టనొదవిన

ప్రమథులు సనుదేర బాలేందుధరుడైన
మూడుగన్నుల వేల్పు మున్నుగాగ
జగముల సృజియింప జాలి యాద్యుండైన
చతురాస్యుడగు పద్మసంభవుండు

గమనీయ వికసిత కమలపత్రములన
వేయిగన్నులుగల వేల్పుతేడు
వహ్నికాలాసుర వరుణానిలశ్రీద
శూలహస్తులుగూడి సురుచిరముగ
గరుడసిద్ధసాధ్యగంధర్వఖేచర
యక్షపక్షినాగయాతుధాను
లాదిగాగ పుష్పకారూఢులయి రాము
ధీరు జూడ నేగుదెంచి రెలమి

ఇంద్రాది దేవతలు రాముని స్తుతించుట

పాతివ్రత్యగుణంబు సుస్థిరమతిం బాటించి కల్యాణ స
చ్చేతో వృత్తి దనర్చి లక్షణములం జెల్వొంది శుద్ధక్రియో
పేతప్రక్రియ యైన జానకి భవత్ప్రేమానురూపంబుగా
బ్రీతింబుట్టిన యాదిలక్ష్మి దలపం బృథ్వీతలాధీశ్వరా!

అకట యుపేక్ష సేయదగునయ్య రఘూద్వహ! మండుచున్న! పా
వకమున దత్పతీత్వగుణ వైభవమొప్పగ నుండునట్టి జా
నకినిటు చూచుచునుండదగునా పిలిపింపగదయ్య సాధ్వినా
రక చెడనాడనేల యనురాగదయామృత దృష్టిజూడవే.

వనజేక్షణ నారాయణ
నిను నీవిట మఱవదగునె నిర్దయమతివై
జనకసుత నుపేక్షింతురె
మనుజేశ్వర మమ్ము నెలమి మన్నింపగదే.

అను నయ్యవసరంబున విశ్వమయుండును, విశ్వైక సాక్షియు, విశ్వపావనుండునునగు వైశ్వానరుండు సముత్తాలాభీల జ్వాలావలీ దహ్యమానంబులగు నింధనంబులు పాయద్రోచి యస్వేదబిందుజాలాంచితయు, నమ్లాన వదనపంకజయు, నక్లిష్ట తనువల్లికయు నతాంతలతాంత మాలికయు,

ననవసన్నాంగ రాగయు, ననాహతదుకూలయు, ననిర్ధూతకేశకలాపయు, నకంపనమూర్తియు, నవిచ్ఛిన్నహారాద్యలంకారయు, నవిపాయయా ననూయయా దత్త పుణ్యాంగరాగ గంధబంధురమూర్తియునై తొంటి క్రియనున్నం గనుగొని కపులు, నసురులును, సబాష్పనయనులై నృపతి కిప్పురంధ్రీరత్నంబు నిన్ని యెగ్గులాడం దగదన వసుమతీ దుహితయగు సీతను, రఘునాధు సన్నికర్షంబునకు నెత్తికొని తెచ్చి ముందఱ నిల్పి యిట్లనియె

అగ్ని దేవుడు సీత మహత్త్వము చెప్పి రాముని కొప్పించుట

రఘుకులదుగ్ధవారినిధిరాజ! భవత్సతి దూషితక్రియా
లఘుచరితానుశక్తి మెయి లౌల్యము దాల్చి చరింపనేర్చునే
యఘములు జానకిం దలచినంతనె నాశమునొందు నీకు ని
ట్లఘనతరాగ్రహంబున గడుం జెడ నాడుట జూడయు క్తమే.

వసచెడవు మేని మెఱుగులు,
గసుగందవు క్రొవ్విరులును, గనుగవ ధూమ
ప్రసరమున నెఱ్ఱబారదు,
వెస దలచీరయునునట్ల వెలయుట గంటే.

దైవము ప్రాణమిత్రుడును దాత సఖుండును జీవితార్థముల్
నీవుగ వాఙ్మనఃకరణనిశ్చయబుద్ధి శరీర దృష్టి సం
భావితవృత్తి నేమఱక వన్నుగ నిన్నె తలంచు నన్యదు
ర్భావన లేదు భూమిసుత భవ్యచరిత్ర పవిత్ర భూవరా!

శుచినై జగములకు బరమ
శుచిత్వ మొనరింతునే వసుమతీతనయా
రచిత ప్రవేశమున గడు
శుచినైతి, గృతార్థ భావసుభగుడ నైతిన్.
మందారభూజంబు మరగిన భృంగికి
బిచుమందశాఖిపై బ్రేమ గలదె

లలి మానసంబున మెలగెడు హంసికి
వెలయ బల్వలము పైవేడ్క గలదె
మలయద్రుమంబున మలయు భుజంగికి
బర్బూరతరువు పై వలపుగలదె
భాస్కరోదయమున భాసిల్లు పద్మిని
కిందుకరస్పష్టి కెలమి గలదె
రాజితానేక సద్గుణారామరామ
కర్మపాలన పరమ నీధర్మపత్ని
యైన సాధ్వికి సీతకు నన్యునందు
గూర్మి యేచందమున నమకూడునయ్య.

కావున నీవు నాపలుకు గై కొన గాదగు గాదు నాక సం
భావనతోడ సచ్చరితభాసురయైన మహీసుతన్ దిగీ
శావలి సంతసిల్లగ బ్రియం బొదవంగ బరిగ్రహింపు రా
జీవహితాన్వయాభరణ! సింధుగభీరగుణైకభూషణా!

ఏకలవ్యుడు

7 దృఢవ్రతులలో జేరిన మఱియొకడగు ఏకలవ్యుని పావనచరితముగూడ వినదగినది ఇతడు కిరాతకులమున జన్మించిన వాడైనను, తన దృఢవ్రతముచేతను, గాఢవిశ్వాసముచేతను, అచంచలభక్తిచేతను ధనుర్విద్య యందు గురుసహాయము లేకయే యద్వితీయమగు నైపుణ్యమును సంపాదించెను ఇతడు ధనుర్విద్యా పిపాసగలవాడై ద్రోణాచార్యుని నడుగ నతడు క్షత్రియులకును బ్రాహ్మణులకును తప్ప నితరులకు జెప్పుట లేదని నిరాకరించిన నంత నేకలవ్యుడు గురుభక్తియందు మఱింత మనస్సును దృఢపరచి యేక్రాగబుద్ధిగలవాడై యేకాంతమున ద్రోణాచార్యుల విగ్రహమును మట్టితో జేసికొని, తదేకభావముతో నా విగ్రహమునే ద్రోణాచార్యులుగ నెంచి యస్త్రవిద్య నభ్యసించుకొనుచుండెను, అతని భక్తికిమెచ్చి ఈశ్వరుం డతనికి

ధనుర్విద్యకు గావలసిన జ్ఞానమునంతయు ననుగ్రహించుచుండెను

దీనివలన మనము తెలిసికొన వలసినదేమన సరియైన గురుభక్తిగలిగి యుండిన జ్ఞానసిద్ధి గలుగు ననియే, అట్టి సరియగు గురువు లభింపనిచో ననన్యభక్తి గలిగి ఈశ్వర ధ్యానము చేయుచుండిన నీశ్వరానుగ్రహముగలిగి జ్ఞానము సిద్ధించుటకు సందేహము లేదు అట్లుగానిచో సరియైన గురువు లభించేలాగున సర్వేశ్వరుం డనుగ్రహమునైన చేయును మానవుండు ఏకార్యమునైనను సాధించుటకు, మనస్సు ఎంత కెంత కట్టి కార్యముపై నేకాగ్రతపడుచుండునో, అంతకంతకు నాకార్యము వానికి సమీపించి వచ్చుచుండును అంతేగాక దానియందుగల రహస్యము లన్నియు హృదయములో గోచరమగుచుండును విజ్ఞాన శాస్త్రజ్ఞుడు కనుగొనిన తత్త్వములన్నియు నీరహస్యముపై నాధారపడి యున్నవి ఆలాగున నీశ్వరకార్యములో గూడ మానవుని మనస్సు ఎంతకంతకు మగ్నమగునో, అంతకంతకు దైవతత్త్వము గూడ నతనికి బోధపడగలదు. ఈవిషయమై గీతా వాక్యము--

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే॥

ఎల్లపుడును నాయందు ఆసక్తి గలిగి తదేకధ్యానముతో నుండెడు బ్రహ్మనిష్ఠులకు (భగవద్భక్తులకు) నాలో నైక్యమునకు గారణమైన జ్ఞానయోగమును నేనిచ్చెదను

తేషామేవానుకంపార్థ మహమజ్ఞానజం తమః।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥

అట్టి తదేకనిష్ఠగలిగి ధ్యానము చేసెడు భక్తులపై అనుగ్రహము గలవాడనై అంతర్యామియైన నేను వారిహృదయములలో ప్రకాశించి యనేక జన్మములనుండి వచ్చెడు నజ్ఞానావరణమనెడి చీకటిని నశింపజేసి, యే నిర్మలజ్ఞానముచే భగవత్సాక్షాత్కార జ్ఞానము గలుగునో అట్టి దానిని ప్రకాశింపజేయుచున్నాను అనగా నాయనుగ్రహముచే వారి యజ్ఞానము తొలగి నిజమైన ఈశ్వర సాక్షాత్కార జ్ఞానము గలవారగుదురు

ఈలాంటి తత్త్వముల దెలసికొనియే విగ్రహారాధన యేర్పరచిరి

అనన్యభక్తిగలిగి యారాధించువారి కేకలవ్యునికి గలిగిన జ్ఞానమువంటి దైవ జ్ఞానము గలుగును మార్కండేయ ప్రభృతులకును ఈలాగుననే ఈశ్వరసాక్షాత్కారము గలిగినది గురుభక్తియు నాలాగుననే యుండును అయితే యట్టి యున్నతగుణములు గురువులయం దుండవలయును లేనిచో శిష్యులకు గాని, భక్తులకుగాని యున్నత భావము గలుగుట దుస్తరము ఇదే దీని యందుగల రహ్యాసము ఇపుడు భారతము ఆదిపర్వము, పంచమాశ్వాసమున నేకలవ్యుని చరిత్రము చెప్పబడినది, చూడదగును

ఏకలవ్యు డనువాడు ద్రోణు నారాధించి విలువిద్యగఱచుట

మఱియు గదాకార్ముక ప్రాసాసితోమర కుంతశక్త్యాది వివిధాయుధం బులయందును గుమారుల నందర జితశ్రములం జేయుచున్న ద్రోణాచార్యుల మహాప్రసిద్ధి విని హిరణ్యధన్వుండను నెఱకురాజుకొడు కేకలవ్యుండనువాడు ధనుర్విద్యా గ్రహణార్థియయి వచ్చిన వాని నిషాద పుత్రుండని శిష్యుంగా జేకొనకున్న వాడును ద్రోణు ననుజ్ఞవడసి చని వనంబులోన--

వినయమున ద్రోణురూపు మన్నున నమర్చి
దాని కతిభక్తితోడ ప్రదక్షిణంబు
జేసి మ్రొక్కుచు సంతతాభ్యాసశక్తి
నస్త్రవిద్యారహస్యంబు లర్థిబడసె.

ఇట పాండవ కౌరవు లొ
క్కొటనందరు గురుననుజ్ఞ గొని మృగయాలం
పటులై వనమున కరిగిరి
పటుతరజవసారమేయ భటనివహముతోన్.

మఱియు నందొక్క భటుని కుక్క తోడుదప్పి పఱచి యొక్కెడ నేకతంబ యేయుచున్న నేకలవ్యు సమీపంబున మొఱింగిన నయ్యేలుంగు విని దాని ముఖం బునం దేడుబాణంబు లొక్కట దొడిగి యక్కజంబుగా నతి లాఘవంబున వాడే సిన నది శరపూరిత ముఖంబై కురుకుమారుల యొద్దకుం బాఱిన దానింజూచి విస్మయం బంది వాడెవ్వడో యని రోయుచు వచ్చుచువారు

ముందఱ

తేజితబాణహస్తు దృఢ దీర్ఘమలీమస కృష్ణదేహు గృ
ష్టాజినవస్త్రు నస్త్రు విషయాప్తవిషాదు నిషాదు జూచి యా
రాజకుమారు లందఱు బరస్పరవక్త్ర విలోకనక్రియా
వ్యాజమునం దదీక్షణ నివారితులై రతిమత్సరంబునన్.

అక్కుమారులు వాని శరలాఘవంబునకు మెచ్చి నీవెవ్వండ వెవ్వరిచేత విలువిద్యగఱచితని యడిగిన వారికి నయ్యెఱు కిట్లనియె

విను డే హిరణ్యధన్వుం
డను వనచరనాథు కొడుక, నాచార్యుడు ద్రో
ణునకున్ శిష్యుడ నెందును
ననవద్యుడ నేకలవ్యు డనువాడ మహిన్.

అనిన విని కురుకుమారులందరు మగుడివచ్చి ద్రోణున కంతయు జెప్పిరంత నర్జునుండేకతంబ యొక్కనాడాచార్యున కిట్లనియె

విలువిద్య నొరులు నీక
గ్గలముగ లేకుండ నిన్ను గఱపుదు నని మున్
బలికితిరి నాకకాదీ
త్రిలోకముల కధికు జూచితిమి యొకయెఱుకున్

నాకంటెను మీకంటెను
లోకములో నధికు డతిబలుండు ధనుర్వి
ద్యాకౌశలమున నాతడు
మీకుం బ్రియశిష్యుడటె యమిధ్యావచనా!

అనిన విని ద్రోణుం డదరిపడి వానింజూతము రమ్మని యర్జునుం దోడ్కొని యనవరత శరాసనాభ్యాస నిరతుండైయున్న యేకలవ్యుకడకేగిన నెఱిగి వాడు నెదురుపఱతెంచి ద్రోణునకు మ్రొక్కి తనశరీరంబు సర్వస్వంబును నివేదించి యేను మీ శిష్యుండ, మిమ్మారాధించి యివ్విలు విద్య గఱచితినని కరంబులు మొగిచి యున్నంజూచి ద్రోణు డట్లేని మాకు గురు దక్షిణ యిమ్మనిన సంతసిల్లి

వాడిట్లనియె

ఇదె దేహంబిబె యర్థం
బిదె నాపరిజన సమూహ మిన్నిటిలో నె
య్యది మీకిష్టము దానిన
ముదమొదవగ నిత్తు గొను డమోఘంబనినన్.

నెమ్మని నీదక్షిణ హ
స్తమ్మున పెనువ్రేలు దునిమి దక్షిణ యిమ్మి
ష్టమ్మిది నాకనవుడు విన
యమ్మునవా డిచ్చెదాని నాచార్యునకున్.

దక్షిణాంగుష్ఠ మిచ్చినదాన జేసి
బాణసంధాన లాఘవభంగమయిన
నెఱుకు విలువిద్య కలిమికి హీనుడయ్యె
బార్థునకు మనోరుజయును బాసెనంత.

విలువిద్య నొరులు నీక
గ్గలముగ లేకుండ నిన్ను గఱపుదునని మున్
బలరిపు సుతునకు బలికిన
పలుకప్పుడు గురుడు సేసె బరమార్థముగన్.

భూపనందను లివ్విధంబున భూరిశస్త్రమహాస్త్ర వి
ద్యోపదేశపరిగ్రహస్థితి నున్న నందఱియందు వి
ద్యోపదేశము దుల్యమైనను నుత్తమోత్తము డయ్యె వి
ద్యాపరిశ్రమ కౌశలంబున దండితారి నరుండిలన్.

అనిలాత్మజు బలమును న
ర్జును కార్ముకకౌశలంబు శూరగుణంబుల్
మనమున సహింపనోపక
వనరుచు ధృతరాష్ట్రసుతులు వందిరి తమలోన్.

హరిశ్చంద్రుడు

8 ఇపుడు మన మతిపవిత్రమైన సత్యమును గుఱించిన ఒక యితిహాసమును వినబోవుచున్నాము ఇది పాపరహిత మొనర్చునదే గాక పుణ్యమును గూడ వృద్ధిపరచును దృఢవ్రతులలో నగ్రేసరుడగు హరిశ్చంద్రుని చరిత్రమిది నేటికిగూడ సత్య హరిశ్చంద్రుడని యే పుణ్యచరిత్రుని కథ వినుచున్నామో అట్టి శుద్ధాత్ముని గుఱించియే తెలిసికొనబోవుచున్నాము ఆయన రాజాధిరాజై యుండియు, చక్రవర్తియై యుండియు సత్యమునే వ్రతముగాను, దానినే ముఖ్యముగాను, జీవితోద్దేశ్యమును కైవల్యమునుగా నెంచి వ్రతము సలుపువాడు ఈమహాపురుషుని గుఱించి యెంతవ్రాసినను చాలకనే పోవుచున్నది ఇపుడీయనను గుఱించి క్రొత్తగా నెవరును చెప్పనక్కరలేదు పూర్వ ఋషులును, కవులును, పండితులును ఈమహానుభావునెంతో కొనియాడియున్నారు డ్రామాలను, సినిమాలను ఈ పుణ్యపురుషుని చరిత్రము పావనముల నొనర్చుచున్నది అంతేగాక భాగవతోత్తములు సయితము ఈమహాత్ముని సత్యమును గుఱించి హరికథా రూపముగా చెప్పచు జనులను పావనుల నొనర్చుచున్నారు దీనివలన నేటికిని ఎందరో రాజులు, రాజాధిరాజులు, భాగవతులు, గృహస్థులు, పండితులు గూడ పవిత్రు లగుచున్నారు పైజెప్పినవారలే గాక పామరులు సయితము ఈపుణ్యచరితుని దృఢవ్రతమునుగూర్చి విని విస్మయుము నొందుచు పరిశుద్ధాత్ము లగుచున్నారు

అయితే సత్యమును గుఱించి వ్రతము సలుపువారికింత శ్రమయేల గలుగవచ్చునని జనులకు సంశయము గలుగవచ్చును ఈలాగున కష్టములను వహించి మనము అట్టిసత్యవ్రతమును నిర్వహింపగలమా? యని సందేహపడ నక్కరలేదు కష్టసుఖములు బాహ్యములో జరుగుచుండు కృత్యములచే గలుగునని సామాన్యజనులు తలంచినను నిజముగా విచారించిన సుఖదుఃఖములకు మనస్సే కారణము గాని బాహ్యవిషయములు కారణములు గావు

ఏలన? సుఖదుఃఖముల కాధారము మనస్సే కనుకనే యొకరికి నీరసమైన విషయము మఱియొకరికి రసవంత మగుచున్నది ఒకరికి హేయమైనది మఱియొకరికి పరమాదేయమగుట గనుపించుచున్నది ఒకరికి శత్రువైన వాడు, ఇంకొకరికి మిత్రు డగుచున్నాడు ఒకరి కరుచియైనది వేరొకరికి ఎక్కువ రుచికరముగా గనుపించుచున్నది ఒకరికి దేవుడైన వానిని వేరొకడు దయ్యమునుగా దలంచుచున్నాడు ఒకరికి పుణ్యమని తలంపు గలిగినది, యింకొకరికి పాపమని విచారము గల్గుచున్నది ఒకదానికి ప్రకాశముగా నుండునది వేరొకదానికి జీకటిగా గనపడును ఒకదానికి చీకటిగా నుండునది వేరొకదానికి వెలుతురుగా నుండును ఆలాగున నెన్నియో విషయములు ప్రపంచములో వారివారి మనస్సు ననుసరించి కనబడుచున్నవి వీటికన్నిటికి కారణము మనస్సే కావున నెవరి మనస్సు స్వచ్ఛముగా నుండునో వారి కంతయు సుఖమునే గలుగజేయును, ఎవరి మనస్సు శాంతినొందియుండునో అతనికి యావత్తును పరమశాంతి మయముగానే గోచరించును కావుననే యోగులు, సిద్ధులు,ఋషులు మనశ్శుద్ధి గలుగజేసికొనవలయునని తెలిపిరి

అయితే యావిషయమై యిప్పుడు జెప్పబూనలేదు మనము ప్రారంభించినది దృఢవ్రతమును గుఱించిన విషయము దానికి ఈ చక్రవర్తియు, నుదారశీలుడును, పరమభక్తుడును, సత్యవ్రతనిష్ఠ గలవాడును నగు శ్రీహరిశ్చంద్రుడు ప్రకాశమును గలుగజేయువాడు అతడు ఎన్ని కష్టములు గలిగినను తనయొక్క వ్రతమునకు భంగమును గలుగనీయక సంరక్షించు కొన్నాడుగదా? యని మాత్రము దీనివలన మనము గ్రహించుకొనవలయును అట్టికష్టములు పడనిచో అతనిచరిత్రము ఇంత పవిత్రముగా ఆచంద్రార్క ముండజాలదుగదా!

పాఠశాలలో జదువుచుండు విద్యార్థులకు పరీక్ష యొక్కటి లేనిచో జదివినవానిని గుఱించియు జదువనివానిని గుఱించియు నెట్లు తెలిసికొ నగలము? తానభ్యసించెడు విద్య యెంత గొప్పదో దాని కేర్పడియుండు పరీక్ష యు నంత పెద్దదిగానే యుండును రత్నమైనను సానబట్టనిచో నాభరణమున కుపయోగపడదు గదా? స్ఫుటము వేయనిచో బంగారమైనను నపరంజి

కాజాలదు గదా? అలాగున నిట్టివ్రతనిష్ఠలచేతనే జీవుండు మాలిన్యరహితుడు కావలసియుండును ఇది ఈశ్వరనియమము సుఖదుఃఖములకు మనస్సే కారణమగుటచేతనే గదా హరిశ్చంద్రచక్రవర్తి యెన్నియో విపత్తులు వచ్చియుండినను సంతోషముతో వాటినన్నిటిని సహింప శక్తిగల్గియుండెను సహించుట యేమి,కొంచెమైనను దుఃఖమును పొందకపోవుటకును కారణమదియే దుఃఖమును పొందకపోవుట మాత్రమేగాదు, ఎల్లప్పుడు తనయొక్క వ్రతమును నిర్విఘ్నముగా నిర్వహింప గలిగినందుకు గలిగిన పరమానందములో గూడ సదా మునుగుచుండెను

మఱియు మనుజులకుగల విషయము లన్నిటిలోను నేది ముఖ్యముగా నుండునో దానికొఱకు తక్కినవాటి నన్నిటిని ఒక్కొక్క దానినిగా క్రమముగా విడువగలరు ఇది ప్రతివారియొక్క యనుభవము ఈవిషయమై చెప్పబూనుట లేదు అదియొక గ్రంథము గాగలదు కావున నోజనులారా! మీకు దేనియందు మిక్కిలి విశ్వాసము గలదో దానిని సంరక్షించుకొనుడు, అది యెల్లప్పుడు నశింపనిదిగాను, సదా సౌఖ్యమును గలుగ జేయునదిగాను, లోకపావనము నొనర్చునదిగాను ఉండవలయును బ్రహ్మనిష్ఠులను గనుగొనవలయును వారు తప్ప మరెవరును దానిని తెలుపజాలరు, తెలిసికొనజాలరు

ఈషణత్రయముచే నీజీవుండు సంసారమున బద్ధుడై యుండును ఈ బంధమును భేదించుటకొరకు శ్రీవిశ్వామిత్రు డిట్టి పన్నాగమును బన్నెను రాజ్యము పోవుటచే ధనేషణయు, ధర్మపత్ని పోవుటచే దారేషణయు, కుమారుడు పోవుటచే బుత్రేషణయు నివృత్తి నొందును ఇట్టి యవస్థ హరిశ్చంద్రునకు గలిగినదా? లేదా? యని విశ్వామిత్రమహర్షి చక్కగ పరీక్ష చేసెను. మఱియు మనుజునికేది ముఖ్యమని తోచునో దానిని సాధించుటకు ప్రతిబంధకములైన ఇతరములను విడచుట స్వభావమై యున్నది కావున హరిశ్చంద్రుడు సత్యస్వరూపమగు పరబ్రహ్మము ముఖ్యమని దృఢమైన నమ్మకము గలిగినవాడా? లేక యముఖ్యములగు రాజ్యము, ధనము, భార్య, పుత్రులు ముఖ్యములని నిశ్చయము గలవాడా? యని పరీక్షించుటకొఱకు నిట్టికార్యమును జేసియుండును,''బ్రహ్మ సత్యం జగన్మిథ్యా'' అని దృఢా

పరోక్షజ్ఞానము గల్గిన మాత్రమే కైవల్యప్రాప్తి గల్గునని, శ్రుతి చెప్పియుండుటచే హరిశ్చంద్రుడట్టి దివ్యలోకప్రాప్తి గలుగుటకు పరిపక్వము గలవాడాయెనా, లేదాయని తెలిసికొనుటకొఱకు ఋషిసత్తముడగు విశ్వామిత్రు డీలాగున జేసెను అట్లుగాక అల్పులవలె ధనముకొఱకు, రాజ్యము కొఱకు, భార్యకొఱకు, పుత్రులను విడనాడి, ధర్మము నుపేక్షించి కేవలము నీచులవలె నున్నాడా? లేదా యని తెలిసికొనుట కొఱకిట్టి తీక్ష్ణతరమగు పరీక్ష చేసెను ఇక నాచరిత్రము సంక్షిప్తముగ వ్రాయబడును పుణ్యపురుషు లెవరును, నిజానిజముల నెరిగిన వారెవరును, ధర్మవేత్తలగు వారెవరును నశ్వరమైన దృశ్యసౌఖ్యముల కొఱకు శాశ్వత సౌఖ్యమును గలుగజేయు సత్యమును, ధర్మమును, జ్ఞానమును విడువనొల్లరు

పూర్వము హరిశ్చంద్రుడను మహారాజుండెను అతని తండ్రి పేరు త్రిశంకుమహారాజు భార్య చంద్రమతి యను సతీమణి, లోహితాస్యు డాతని పుత్రరత్నము అతడు నిత్యసత్యవ్రతుడు అతనికి కలయందైనను కల్ల యనునది లేకుండెను దానదయాదుల కాటపట్టయి యుండెను ఈత డయోధ్యానగరమును ప్రధానపట్టణమునుగా జేసికొని కోసలదేశముల బాలించుచుండెను జనుల పుత్రసమానముగా బోషించుచుండెను

ఇట్లుండ నొకనా డింద్రసభయందు 'పాకశాసను డీలోకత్రయంబున నిత్యసత్యవ్రతు డెందేని గలడా?' యని ప్రశ్నించెను మును లందఱు తెల్లబోయి యొకరి మొగ మొకరు చూడసాగిరి ఇంతలో సకలగుణ గరిష్ఠుడగు వసిష్ఠుడు నిలువబడి " ఓ దేవేంద్రా! కలడు కలడు భూలోకమున హరిశ్చం ద్రుడను నరేంద్రుడు అతడెన్నడును అసత్యమును జెప్పని వాడు," అని పలికిన కోపించి వసిష్ఠబద్ధవైరుండగు విశ్వామిత్రుడు " ఓహో! రాజులెందైన సత్యవ్రతులై యుందురా? ఇవేటి మాటలు? వసిష్ఠా పందెమేమి? నేనారాజు నసత్యమా డించెదను " అనిపలికిన విని వసిష్ఠుడు "నీ వారాజేంద్రు నసత్య మాడించితివేని నేను శిరమును గొరిగించికొని, తపశ్శీలములను మాని, మనుజ కపాలంబుతో మద్యమును గ్రోలుచు నుత్తరాభిముఖుండ నయ్యెదను" అని ప్రతిజ్ఞచేసెను విశ్వామిత్రుడును నేనా హరిశ్చంద్రుని బొంకింపజాలనేని

హిమవత్పర్వతమున నీశ్వరునిగూర్చి సలిపిన తపఃఫలంబున నర్ధంబతనికి ధారవోసి యనేక మహాయుగంబు లీయింద్రసింహాసనాసీనుని గావింతునని ప్రతిన బట్టెను అంతనాసభ ముగిసెను

విశ్వామిత్రు డాక్షణమే యయోధ్యాపురి కరిగి హరిశ్చంద్రునిగూర్చి రాజేంద్రా! నేనొక యాగంబొనర్ప దలంచితిని తగిన ధనసహాయం బొనరింపుము అనిన నారాజశేఖరు డాముని నర్ఘ్యపాద్యాదులచే బూజించి దండప్రణామంబు లాచరించి 'మహాత్మా తాము కోరిన యట్లొసంగెదను అనుగ్రహింపుడు' అని విన్నవించెను అంత విశ్వామిత్రుడు యుఏకుం డేనుగనెక్కి రత్నమును మీటిన నదెంత దవ్వేగగలదో అంత ధనమొసంగు మని యడిగెను హరిశ్చంద్రుడు 'చిత్తము మహాత్మా యట్లే యొనర్చెద' నని పలుక నింతలో "రాజకులాగ్రణీ! యిప్పు డీ ధనమును నేనెచ్చోట దాచుకొందును ప్రస్తుత మిచటనే యుంచుము అవసర సమయమున గొని పోయెదను" అని విశ్వామిత్రుడు వచింప చిత్తమట్లే యొనర్చెదనని హరిశ్చంద్రు డంగీకరించెను

తరువాత విశ్వామిత్రుడు నిజాశ్రమమునకు జని పలువిధంబులగు క్రూర మృగంబుల సృజింప నవియు, నయోధ్యా పట్టణమునందలి సస్యభరితంబులగు పొలంబుల నుగ్గునూచము గావించుచుండెను పౌరులును నష్టముల కోర్వజాలక రాజునకు విన్నవించుకొనిరి మరునా డుదయమున హరిశ్చంద్రుడు సైన్యసమేతుడై యడవికి జని యాపలువిధంబులగు మృగంబుల హతంబొనర్చి మధ్యాహ్న మగుటచే నొక చెట్టుక్రింద విశ్రమించియుండెను ఇంతలో విశ్వామిత్రుడు గానకళాకౌశలంబుగల ఇద్దరు మాతంగ కన్యకల సృష్టించి "బాలికలారా! అదిగో యాచెట్టు క్రింద విశ్రమించియున్న రాజు దగ్గఱకు వెళ్ళి పాడి యాడి మమ్ము పెండ్లి జేసికొను" మని కోరుడు అని జెప్పి వారిని పంపెను వారట్లే యొనర్చి తమ్ము వివాహమాడు మనిరి హరిశ్చంద్రు డందులకు గోపించి వెళ్ళనందువలన బెత్తముచే విసరెను అప్పుడు వారేడ్చుచు వెళ్ళి విశ్వామిత్రునికి జెప్పుకొనిరి

అప్పు డాతపోనిధి కోపావేశమున వచ్చి హరిశ్చంద్రుని కిరీటంబు నెగురదన్నిన నతడోర్చి యుపచరింప దొడంగెను కాని విశ్వామిత్రుడు

విదల్చివైచి ''నిర్దయుడవై యేల నాకూతుల గొట్టితివి? వారిని పెండ్లి యాడితివా సరే లేదేని తప్పక దండింపబడుదువని'' పలికెను అంత హరి శ్చంద్రుడు ''నారాజ్యమైన నిచ్చెదనుగాని నేనేక పత్నీ వ్రతమును వీడి నీకూతుల బెండ్లి యాడ'' ననెను అట్లయిన రాజ్యము నిమ్మని కౌశికు డడిగెను ఇచ్చితినని చెప్పి యాసత్యవాది పురంబున కరిగి విశ్వామిత్రుని పట్టాభిషిక్తుని గావించి భార్యాపుత్రులతో తానరణ్యమున కేగుట కుద్యుక్తుం డగుచుండ నింతలో విశ్వామిత్రుడు'నిలు నిలు హరిశ్చంద్రా! పూర్వము యజ్ఞార్థ మిచ్చెదనని చెప్పిన పైకము నిచ్చి కదలుము' అనిన త్రిశంకునందను డేమియు దోచని వాడై తుదకు నెలదినములు గడువిమ్మని కోరెను ''అట్లయిన నీవెచ్చటికి వెళ్ళె దవో, పైకమిచ్చెదవని నాకేమి నమ్మకము ఇదిగో నాప్రియ శిష్యుడగు నక్షత్రకుని బంపుచున్నాను గడువునకు సరిగా పైకమునిచ్చి పంపుము''అని చెప్పెను చిత్త మట్లే యొనర్చెదనని చెప్పి హరిశ్చంద్రు డందటిని వెంటనిడుకొని యరణ్యమున కరిగెను

అచ్చట నక్షత్రకు డతనిని కన్నయిడుముల పాలొనరించి తుదకు కాశికి చేరు నప్పటికి గడువు సమీపించినందున ధన మిమ్మని హరిశ్చంద్రుని నిర్బం ధించెను అప్పుడు హరిశ్చంద్రుడు తెల్లబోయి చూచుచుండ, పతివ్రతా శిరోమణియగు చంద్రమతి భర్తను జూచి ''నాథా యేల విచారించుచున్నారు నన్ను తెగనమ్మి యా పైకము నీమునిపుత్రున కిచ్చి మీసత్యవ్రతమును రక్షించు కొను''డనిన నత డాసాధ్వి పలుకులకు మిక్కిలి సంతసించి యాదేవి నొక కాలకౌశికుడను బ్రాహ్మణునకమ్మి యాధనమిచ్చిన, గైకొని నక్షత్రకుడు 'ఇది యిన్ని దినములనుండి నేను నీతోడ దిరిగినందుకు తగిన కూలికి సరిపో యినది ఇక మా గురువుగారి కివ్వవలసిన దానిని'మ్మని పల్కెను అంత హరి శ్చంద్రుడు చేయునది లేక తానొక మాలవాడయిన వీరబాహున కమ్ముడు బోయి యివ్వవలసిన యా ధనమునంతయు నిచ్చెను అంత నక్షత్రకుడు సంతసించి,

ఇనకులాధీశ! నీవు మాకియ్యకొనిన
విత్తమంతయు నేడు ప్రవేశమయ్యె,

శంకరుడు విశ్వనాధుండు సాక్షిగాగ
నిలుపుకొంటివి సత్యంబు నిత్యముగను.

(హరిశ్చంద్రోపాఖ్యానము)

అని పల్కి ధనమును గైకొని గురుసన్నిధి కరిగెను. హరిశ్చంద్రుండును వీరబాహుని యాజ్ఞప్రకారము కాటికాపరియై యుండెను ఇట్లుండ చంద్రమతియు దర్భలకొఱ కరిగి విశ్వామిత్రునిచే నాజ్ఞాపితుడైన తక్షకునిచే గరవబడి చచ్చిన లోహితాస్యుని దీసికొని కాటికేగి దుఃఖించుచు కాల్ప నుంకించుచుండ నింతలో హరిశ్చంద్రు డేతెంచి 'మాడనివ్వక నిచ్చట గాల్ప వీలుపడదనిన "స్వామీ! నేనొకరింటి దాసిని దరిద్రురాలను, మాడ నెక్కడ దెత్తునని చంద్రమతి పలుక "అదిగో నీమెడలో మంగళసూత్రమున్నది, దానినమ్మి మాడను దెమ్ము" అని యాపురుషుడు పలికిన చంద్రమతియు పూర్వము 'వసిష్ఠుడు అమ్మా! నీమంగళసూత్రము నీభర్తకు దప్ప మరెవరికి గనబడ'దని వరమిచ్చి యుండుటను దలంచి, యతనిని తన భర్తనుగా నిశ్చయించి యేడ్వసాగెను హరిశ్చంద్రుడును ఆపతివ్రతను దనసతీమణిని గాను, బాలుని తనపుత్రరత్నమునుగాను నెఱింగి కొంతవడి దుఃఖించి "ప్రారబ్ధం భోగతో నశ్యేత్" అను సూక్తిని స్మరించి శోకము నణచుకొని,--

ఆకాంతతోడ నిట్లనియె నోరాకేందు
ముఖి! స్వామి కార్యంబు ముఖ్యమరయ
నేలికమనమున కెడసి సత్యము దప్పి
యిప్పని కొడ బడ నెట్లువచ్చు
నికనొండుమాని విన్నేలినయట్టి ధా
త్రీదేవునడిగి యేరీతినైన
మాడయొక్కటి దెమ్ము మనలక వేగంబ
తగవునౌచిత్యంబు దలవుమనిన
పాణ్రవల్లభు సత్యప్రభావమునకు
మిగుల నచ్చెరు వంది యమ్మీననయన

యాత్మజాని భర్తకడ నిడి యప్పగించి
యధికభక్తి ప్రణామంబు లాచరించి

(హరిశ్చంద్రోపాఖ్యానము)

తరువాత మాడ దెచ్చుటకొఱకు కౌశికు గృహంబున కరుగుచుండ నింతలో విశ్వామిత్ర మాయాకల్పితుడగు నొకచోరుడు కాశీరాజు పుత్రుని యొక్క యాభరణ సహితమైన శిరస్సును దెచ్చి యా చంద్రమతి యొడిలో బడవైచెను ఇంతలో రాజభటు లేతెంచి యా యమాయకురాలిని బెత్తముచే బాది నిందించుచు రాజుద్గఱ కీడ్చుకొనిపోయిరి రాజును కోపానలుండై 'యీ నాతిని గొనిపోయి శిరశ్ఛేదంబొనర్ప నాయాజ్ఞయని వీరబాహునకు దెల్పుము' అని యొక సేవకున కామహాదేవి నొప్పగించెను అతడును చిత్తము ప్రభో! అట్లే యొనర్చెద నని తెలిపి యా చంద్రమతిని వీరబాహున కప్పగించెను

వీరబాహుడును తన దాసుడగు హరిశ్చంద్రున కాజ్ఞాపించెను అతడు అన్యాయమును గూర్చి చింతించుచు నిర్దోషిణియగు భార్యను జంప చేతులు రాక దుఃఖించుచుండెను అప్పుడు చంద్రమతి "నాథా ఏల విచారించు చున్నారు? నాశిరంబును త్రెంచి మీ సత్యవ్రతమును సంరక్షించుకొనుడు ఇదిగో కడసారి వందనమును గైకొనుడు దైవమా కరుణింపుము నాకు ప్రతిజన్మమునందును నీ హరిశ్చంద్రుడే పతియగు నట్లనుగ్రహించుము" అని పలుక హరిశ్చంద్రుడును ధైర్యమును దెచ్చుకొని కరవాలంబు జళిపించి చంద్రమతియొక్క కంఠమును గురిజూచుచుండ నింతలో విశ్వామిత్రుడు "నిలు నిలు హరిశ్చంద్రా స్త్రీహత్య యొనరింపకుము, ఇప్పటికైనను నా ముద్దుకూతుల పెండ్లియాడుము నీ రాజ్యము నీకిచ్చెద" నని పల్కెను

అంత హరిశ్చంద్రుడు "మునీంద్రా! యిది నీ బోధనాకర్ణింప సమయము గాదు తొలగిపోవ ప్రార్థన" యని పలికి చంద్రమతి కంఠము నందు ఖడ్గమును విసరెను అది పుష్పమాలయై యా మహాదేవి గళము నలంకరించెను అప్పుడత డాశ్చర్యపడి"యేమి నాకు బలము తగ్గిపోయెనా! లేక సత్యమార్గచ్యుతుడ నైతినా? దైవమా! నేను సత్యవ్రతుండనైతినేని, సత్యము కొఱకు నా వంశమంతరించినను ప్రమోదమే యని తలంచుచుండుట

నిక్కమే యగునేని యీ వ్రేటున కీ సాధ్వీమణి కంఠము తెగిపోవుగాక'' అని పల్కి గుఱిచూచుచుండ నింతలో నిలు నిలు హరిశ్చంద్రుడా!' యని పల్కుచు శ్రీకాశీవిశ్వనాధుడు పార్వతీదేవి సహితం బుగా ప్రత్యక్షమై హరిశ్చంద్రుని చేతి ఖడ్గము బట్టుకొనెను

అంత హరిశ్చంద్రుడు, చంద్రమతియు వారికి నమస్కరించిరి అనంతరము పార్వతీదేవి లోహితాస్యుని, కాశీరాజ పుత్రుని బ్రతికించెను తరువాత విశ్వామిత్రుడు ''హరిశ్చంద్రా! నీ సత్యవ్రతమును బరీక్షింప నేనిన్ని కష్టములను గల్గించితిని ఎన్నియెా పన్నాగముల బన్నితిని గాని యవి యన్నియు నీ సత్యానలమున కింధనము లయ్యెను ఇది కాడు కాదు, యజ్ఞవాటిక ఇతడు వీరబాహుడు గాడు, యమధర్మరాజు అతడు కాలకౌశికుడు గాడు శనైశ్చరుడు 'మాలవానికి సేవయొ నర్చితినిగాన నేనపవిత్రుడనైతిని నా భార్యయు నీచమగు దాసీకృత్య మొనర్చిన' దని తలంచకుము నేనే యోడితిని నీ గురువే గెల్చెను, ఇక నీ రాజ్యమును నీవు గైకొనుము మఱియు

మిగుల బ్రయాసము నొందితి
వగణితసూనృత వచస్సమంచిత నీ ధై
ర్యగుణప్రాగల్భ్యంబులు
జగదాశ్చర్యంబు లార్యసంస్తుత్యంబుల్.

నిత్యమై యొప్పు భవదీయ సత్యమహిమ
దెలియగోరి మనంబున దలకకేను
వితతకపటక్రియావృత్తి సతిని నిన్ను
బాధ నొందించి కడు నవరాధినైతి.

క్షమియింపుము నాయపరా
ధము లన్నియు దయదలిర్ప దావకసామ్రా
జ్యమ్ముగై కొని యేలుము పూ
జ్యముగా నిక బ్రోవు భూప్రజల సిరిదొలకన్.

అని పలుక 'మహర్షిసత్తమా! నాకేల రాజ్యము, పూర్వమే మీకు సమ

ర్పించితిగదా!' యని హరిశ్చంద్రుడు నుడువ నతనికి పరమేశ్వరుం డిట్లనియె

భూపకులాగ్రగణ్య! నినుబోలు నృపాలురు లేరు చూడగా
నీపదునాల్గు లోకముల నెంతయు మేలు నితాంతసూనృతా
లావవి శేషధైర్యగుణలక్షణ! సాహస వైభవక్రియా
దీపితమయ్యె నీనడత దివ్యమునీశ్వర వర్ణనీయమై.

మఱియు సత్యనిధీ! విశ్వామిత్రుడు నీ సత్యవ్రతమును బరీక్షించుటకే యట్లొనర్చెనుగాని రాజ్యమేలవలయునను బుద్ధిచే గాదు కావున నీ రాజ్యమును నీవు గైకొనుము దోషమేమియు లేదు చిరకాలము రాజ్యమును పాలించుము అనంతరము నీకు కైవల్యప్రాప్తి కలుగును'' అని వచించి హరిశ్చంద్ర, చంద్రమతీ, లోహితాస్యుల దీవించి పార్వతీ సహితముగా నాదేవదేవుం డదృశ్యుడయ్యెను హరిశ్చంద్రుడును భార్యాపుత్రులతోడ నయోధ్యకరిగి యధాపూర్వముగా రాజ్యమేలుచు నంత్యమున కైవల్యమును బొందెను ఓమ్

జనులారా! హరిశ్చంద్రుని దృఢవ్రతమును దెలిసికొంటిరా? తొలుత పతివ్రతా శిరోమణియగు చంద్రమతీ గళముపై ఖడ్గమును విసరినను అది పూలమాల యయ్యెను అప్పుడు సత్యవ్రతమగు దివ్య మంత్రము నుచ్చరించి అనగా 'నేను సత్యవ్రతుడనైనచో ధర్మమునకు లోపము గలుగక ప్రజలను పాలించియుండినచో ఈ వ్రేటునకు చంద్రమతి కంఠము తెగిపోవును గాక' యని ఖడ్గము నెత్తగా సాక్షాత్పరమేశ్వరుడగు శంకరు డావిర్భవించి హరిశ్చంద్రుని కరమును బట్టుకొనెను ఓహో దృఢవ్రతముయొక్క మహిమ త్రిమూర్తులను గూడ మించినదిగదా!

శిబి చక్రవర్తి

(శ్రీమదాంధ్ర మహాభారతము - అరణ్యపర్వము - తృతీయాశ్వాసము)

ఇక్ష్వాకులనం జై త్రమాసంబునందు మహామునుల చేతం బూజితుండై యుమాసహితుం డీశ్వరుండు వారికిం బ్రత్యక్షంబగుటయు నరుంధతీ సహితుండై వసిష్ఠుండిందుల వసియించె నిది భృగుతుంగంబను పర్వతం

బిందును శ్రీనరపతి శిబియనువాడు దొల్లి యజ్ఞంబు చేయుచుండగా నింద్రాగ్నులు వాని మహాగుణంబు లెఱుగ వేడి యింద్రుండు శ్యేనంబైన నగ్ని కపోతంబై శ్యేనభయంబున బఱతెంచి శిబిమఱువు సొచ్చిన దాని నెగిచికొని వచ్చిన శ్యేనంబు శిబి కిట్లనియె

నిన్ను సత్యధర్మ నిర్మలుగా విందు
నట్టి నీకు బాడి యయ్యె యిప్పు
డతిబుభుక్షితుండనై యున్న నాకు నా
హారవిఘ్న మిట్టు లాచరింప?

సర్వభూతంబులు నాహారంబున జీవించి వర్ధిల్లు నిది నాకు భక్ష్యంబు గానినాడు బుభుక్షా వేదనంజేసి ప్రాణవియోగంబగు నట్లయిన నాపుత్రులు భార్యయు జీవింపనేరకొక్క కపోతంబు రక్షించి పెక్కు జీవంబులకు హింసజేయుట ధర్మవిరోధంబు

ధర్మజ్ఞులైన పురుషులు
ధర్మువునకు బాధసేయు ధర్మువునైనన్.
ధర్మముగా మదిదలవరు
ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్

కావున దీని నాహారంబుగా నిమ్మనిన దానికి శిబి యిట్లనియె

పాణ్రభయమున వచ్చి యిప్పక్షి నన్ను
నాశ్రయించె నాశ్రితుడెట్టి యధముడయిన
విడువడనినను నే నెట్లువిడుతు దీని?
నాశ్రితత్యాగ మిది ధర్మువగునె చెపుమ.

నీవు పక్షివయ్యును ధర్మమెఱింగినట్లు పలికితి, శరణాగత పరిత్యాగంబు సేయుటకంటె మిక్కిలి యధర్మంబొండెద్ది ? నీ యాకలి దీనన కాని యొంట నుపశమింపదే!, నీయత్నంబాహారార్థంబేని యిప్పుడివ్వనంబున మృగమహిష వరాహ ఖగమాంసంబులు దీనికంటె మిక్కిలిగా బెట్టెద, నిక్కపోతంబువలన నాగ్రహంబుడుగుము దీని నేనెట్లును విడువ ననిన శ్యేనంబిట్లనియె

నాకు విహిత భక్షణం బిది, యిప్పక్షి
బూని కావ నీకు బుద్ధియేని
యవనినాథ దీనియంత నీమాంసంబు
దూచినాకు బెట్టుతొలగకిపుడు.

అనిన ననుగ్రహించితి మహావిహగో త్తమ! యంచు సంతనం
బున శిబి తత్క్షణంబ యసిపుత్రిక నాత్మశరీర కర్తనం
బనఘుడు సేసిచేసి తనయంగములంగల మాంసమెల్ల బె
ట్టినను గపోతభాగమ కడిందిగ డిందుచు నుండె నత్తులన్.

దానికి నచ్చెరువడి ధర
ణీ నాథుడు తనువునందు నెత్తురుదొరుగం
దాన తుల యెక్కె నంతన్
వాని గుణోన్నతికి మెచ్చి వానవదహనుల్

శ్యేన కపోతరూపంబులు విడిచి తమ నిజరూపంబుల జూపి నీధైర్యశౌర్యాది గుణంబు లనన్య సాధారణంబులు గావున నీకీర్తి నిత్యంబై శబ్దబ్రహ్మంబు గలయంతకాలంబును వర్ధిల్లుచు నుండెడుమని శిబికి వరంబిచ్చి యింద్రాగ్నులు చనిరి

ఎంతమాంసము కోసిపెట్టినను కపోతపక్షియంత భారము లేకపోవుటచే ఖిన్నుడై శిబి తన దేహమునుండి కారుచుండు రక్తమంతయు తక్కలో నుంచి తూచెను అప్పు డామహాధీరునియొక్క సాహసమునకు సంతసంచి దేవేంద్రుడును, అగ్నిదేవుడును దివ్యములగు శరీరములతో ప్రత్యక్షమై నీయొక్క శరణాగత త్రాణపరీక్షా నిమిత్తముగా ఈపక్షి రూపములతో వచ్చితిమని తెలిపి చాల సంతసించి కావలసిన వరములను కోరుమని యడిగి రాజు శరీరమును యథాప్రకారముగా నుండేలాగున జేసిరి ఈశ్వరకృప గలిగి తనయొక్క జీవితాంతము వఱకు శరణాగత త్రాణవ్రతము నిర్విఘ్నముగా జరిగిన చాలునని చెప్పగా, ఆలాగే యని వరమునిచ్చి యాశీర్వదించి దేవేంద్రుండును, అగ్నిదేవుడును అంతర్ధానులైరి

కావున ముముక్షువులారా! వ్రతము గలిగియుండిన దానికి పరీక్ష గలుగునని తలంచి యెల్లప్పుడు జాగరూకత గలిగి వర్తించవలెను శిబిచక్రవర్తి యెచ్చట? క్షుద్రమగు పావుర మెచ్చట? ఇట్టి చిన్న కార్యములలో గూడ తనయొక్క ధర్మమును సంరక్షించుటలో చూపిన త్యాగమెట్టిదో యదే మనము తెలిసికొనవలసినది శిబి యెంతసాహస కృత్యమొనర్చెనో చూడుడు దీనివలన తేలిన సారమేమన నెంత చిన్నకార్యముకొఱకైనను ఎట్టి విషమస్థితిలోనైనను తనయొక్క ధర్మమును విడువరాదు అట్టి ధర్మమే వానిని రక్షించును అగ్నియును, ప్రకాశమును వేఱుకానట్లు ధర్మమును దాని కాధార భూతుడగు ఈశ్వరుడును వేరుకాదు పంచదారయు, మధురము రెండు కానట్లు సత్యమును దైవమును వేఱువేఱు కాదు ఎచ్చట ధర్మము గలదో అచ్చట నుద్ధారకము గల్గును ఎచ్చట సత్యము గలదో అచ్చట నిత్యమైన సౌఖ్యమున్ను కలుగును ఎచ్చట భక్తి గలిగియుండునో అచ్చట ముక్తియు స్వయముగా వచ్చిచేరును ఎచ్చట కరుణ కలిగి యుండునో అచ్చటికి కరుణామూర్తియగు సర్వేశ్వరుడును వెదకి కొనివచ్చి చేరును

శ్రీ బుద్ధదేవుడు

10 మహాత్ముడును కరుణాస్వరూపుడునగు శ్రీబుద్ధదేవుడు ఈదృఢవ్రత ములో నిశ్చయబుద్ధి గలిగినవాడు ఈపుణ్యావతారుని గూర్చి యింతకు ముందు భావశుద్ధియందు సంగ్రహముగా వ్రాయబడియుండుటచే మరల నిచట తెలుపబూనలేదు రాజాధిరాజగు శుద్ధోదన మహారాజునకు ఏకపుత్రుండై యుండు ఈపరమోదార చరితుని, లోకగురుని, యవతార పురుషుని గురించి యెరుగనివారు లేరు దృఢవ్రతమును గుఱించి యీ యుగ్రతపస్వి నిర్వాణసిద్ధి గలుగుటకొఱకు ఆరుసంవత్సరము లనేక పర్వతపంక్తులలోను, గిరిగహ్వరములలోను, నిర్జనప్రదేశములలోను, పుణ్యతీర్థములలోను, పుణ్యాశ్రమములలోను, అనేక విధములగు అనేకాగాధ ధ్యానముల, అష్టాంగ యోగముల, తపస్సుల, సమాధినిష్ఠల నభ్యసించు కొనుచు నిర్వాణము(=నిర్వికల్పసమాధి-బంధవిముక్తి - ఈశ్వర

సాక్షాత్కారము -ఆత్మలాభము) గలుగక మనసులో ననేకవిధములగు పరితాపముల నొందుచు ఆత్మశాంతి గలుగక నాఖరున నీలాగున సంకల్పించుకొనిరి దీని వలననే యా మహాపురుషుని యొక్క దృఢ సంకల్పము గోచరము గాగలదు

కావున ప్రతి వారికి నొకానొక కాలమున పరిపక్వదశ గలుగునపుడు ఇట్టి దృఢసంకల్పము గలుగవలసి యుండును లేనిచో ప్రకృతినుండి విమోచనము కల్పాంతము వఱకెవరికిని గలుగదు ఇది సత్యము ఇంతవఱకు లోకములో నుండిన మహనీయు లందఱు ఆత్మశాంతి గలుగు నిమిత్తము బంధవిచ్ఛేద నిమిత్తము ఆఖరుననిట్టి దృఢవ్రతముచేతనే ప్రకృతినుండి విమోచనము నొందిరి ప్రకృతి కతీతమగు నట్టి మహోన్నత స్థితిలోనికి ప్రవేశించినపుడు సామాన్య ధర్మములును, సామాన్యపుణ్యములును, సామాన్య శాస్త్రములును, సామాన్య లోకమర్యాదలును, సామాన్య వంశ స్వభావ మును, తండ్రి తాత ముత్తాతలనుండి వచ్చుచుండు ధర్మముల - నతిక్రమించి పోవలసియుండును పోవలసియుండునని చెప్పనేల? పోయియే తీరవలయును

శ్రీ బుద్ధదేవులు నిర్వాణసిద్ధ్యర్థము నిర్జన ప్రదేశమున నాసనమును వేసి కూర్చుండుటకు నిశ్చయించినపు డీశ్లోకమును సంకల్పించి ధ్యానా రూఢత్వమున బ్రవేశించిరి

ఇహాసనే శుష్యతు మే శరీరం
త్వగస్థిమాంసం ప్రళయం చ యాతు ।
అప్రాప్య బోధిం బహుకల్పదుర్లభాం
నైవాసనాత్కాయమతశ్చలిష్యతే ॥

ఈయాసనమునందు నాశరీరము ఎండి భస్మమైపోవుగాక! త్వక్, అస్థి, మాంసము మొదలగునవన్నియు శిధిలములై పోవుగాక! అనేక కల్పములకును బొందుటకు శక్యముగాని బోధితత్త్వమును అనగా నిర్వాణమును బొందక ఈ యాసనమునుండి యీదేహమును గదలింపను అనగా లేవను అని దృఢసం కల్పముజేసి ధ్యానసమాధిలో బ్రవేశించిరి ఓహో? యెంత గంభీరభావము!

ఎంత దృఢవ్రతము! ఎంత యమోఘమగు దృఢ సంకల్పము! ఇట్టి తీక్ష్ణమగు, దృఢతరమగు బుద్ధియనెడు ఖడ్గముచేత మాత్రమే యనాదిగా వచ్చుచుండు విషయములను సంసార పాశములను భేదింప గలుగుదురు కనుకనే గీత యందు 'అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్వా' అని 15వ యధ్యాయములో శ్రీకృష్ణ భగవాను లుపదేశించిరి

ఉదయతి యది భానుః పశ్చిమే దిగ్విభాగే
ప్రచలతి యది మేరుః శీతతాం యాతి వహ్నిః।
వికసతి యది పద్మం పర్వతాగ్రే శిలాయాం
న భవతి పునరుక్తం భాషితం సజ్జనానామ్॥

సూర్యభగవానుడు పశ్చిమమున నుదయించిన నుదయించుగాక! మహామే రుపర్వతము స్వస్థానమునుండి చలించిన చలించుగాక! ఉష్ణస్వభావముగల యగ్ని తనస్వభావమును విడిచి శీతలత్వము నొందినను నొందునుగాక । నీటిలో వికసించెడు పద్మము పర్వతాగ్రమందు రాతిపై వికసించినను వికసించుగాక! సజ్జనులగువారు తమ సంకల్పము నెపుడును మార్చుకొన జాలరు ఇచట సజ్జనులని చెప్పినందుచే వారి సంకల్పము లుత్కృష్టములుగాను, పుణ్యవంతములుగాను, దైవభావము గలవిగాను నుండునని భావము ధర్మవైరుద్ధ్యము, పాపసంకల్పము, దుర్జనులకే గలుగును వారుమాత్రము దుష్ట సంకల్పములను మార్చుకొనవలయునని భావము

శ్రీబుద్ధదేవుని గుఱించి యింత మాత్రమే యిచ్చట చెప్పబడినది

ఎప్పుడైనను, ఎవరైనను ప్రకృతినుండి విముక్తిగలుగు కాలము గలుగునపుడు ఇట్టి దృఢవ్రతము నవలంబించియే తీరవలయును, అట్లు గానిచో నెన్ని జన్మ ములకైనను ప్రకృతినుండి విముక్తి గలుగదు ఎంత కెంతకు తన వ్రతమునందు దార్ఢ్యము గలుగుచుండునో అంతకంతకు ప్రకృతినుండి విముక్తి గల్గి యీశ్వర సమీపమునకు చేరుచున్నట్లు గ్రహించుకొనవలయును అట్టి దృఢవ్రతములో నెంత మాంద్యము గలుగుచుండునో అంత దైవమునకు దూరముగాను, ప్రకృతికి దగ్గఱగాను తనయొక్క స్థితి యున్నట్లు తెలిసికొనవలయును ఇదే దీనియొక్క పరమార్థరహస్యము పర్వతోపరి భాగమునకు జేరదలంచువారు

సోపానముల నిర్మించునట్లు మానవులయొక్క తురీయ స్వరూపమగు నీశ్వర సాక్షాత్కారమునకు నిట్టి దృఢవ్రతము సోపాన మని తెలిసికొనవలయును ఇంతకు ముందెవ్వరైన ప్రకృతినుండి విముక్తిగలవారై యుండినచో, నిప్పుడుండి యుండినచో, నికపై నుండబోవుచో నాఖరున నిట్టి దృఢ నిష్ఠగల్గినవారలైన, కలుగవలసిన వారలై యుందురు

దృఢవ్రతము సంపూర్ణము

ఓం త త్స త్

శ్రీగీతాశాస్త్రమును గురించి

శ్రీభగవద్గీతా కల్పవృక్షము దినదినమునకు నవీన కోమలపల్లవ శాఖలచే ప్రపంచమంతటను వృద్ధినొందుట ముదావహము అనేకులు ఉచితముగాను, తక్కువ వెలకుగాను గీతను ప్రచారములోనికి తీసికొని వచ్చుట భారతదేశ ఔన్నత్యమునకు చాల సహాయ భూతమగుచున్నదని తలంపవలెను ఈగీతాశాస్త్రములోని ప్రతివచనమును తేనెవంటిమాధుర్యము గల్గియున్నది

అయితే నాగరికత అభివృద్ధినొంది సత్యసూర్యుడు ప్రకాశమునకు వచ్చుచున్న ఈకాలములో ఈపావన గ్రంథమునకు ఒకప్రక్క మూల శ్లోకమును, ఒకప్రక్క తెనుగు వచనమును ఉండిన ప్రస్తుతము లోకమున కెంతో ఉపయోగకరముగ నుండెడిది భాష యెంత మధురముగా నున్నను మూలశ్లోకము లేనిచో తృప్తినొందెడు కాలము దాటి పోయినది కొందరు శ్రీభగవద్గీతకు తెనుగు వచనమును, తెనుగు పద్యములను వ్రాయుచు సంస్కృతము తెలియనిస్త్రీ బాలురకు ఉపయోగార్థముగా తామట్లు చేసినట్లు ప్రస్తావింతురు మరికొందరు మూల శ్లోకము చదువుట క్షర్హతలేని శూద్రా దులకు పుణ్యము కలుగుటకొరకు తామట్లనుగ్రహించినట్లు ప్రకటింతురు అయితే అట్టి మూఢాంధ విశ్వాసము కాలగర్భములో కలసిపోయినందుచే ఇపుడు దానిని గూర్చి యేమియు చెప్పదలంచలేదు

మా ఆశయ మేమన, మూలశ్లోకము చదివి అర్థము గ్రహించుటకు శక్తిలేనివారు భాషలో వ్రాసిన వచనముగాని, పద్యములుగాని, చదువుకొని సారము గ్రహించిన బాగుండు ననియే ఇదే ఉత్తమపక్షముగా నుండును సంస్కృతమూల శ్లోకము చదువక భాషమాత్రము చదువుకొనిన గలిగెడు విషయమ్మై బ్రహ్మాండ పురాణము, మాత్స్యపురాణములో శ్రీఅగస్త్య సంహితయందు అగస్త్య మునీంద్రులచే చెప్పబడిన వాక్యములను వినుడు

అయితే ఇది శ్రీమద్వాల్మీకిప్రణీత రామాయణమును గూర్చిన దైనను మొత్తము సంస్కృత శ్లోకము లన్నింటికిని సంబంధించినదే యగును గాన నిచ్చట తెలుపబడినది

సంస్కృతం రామచరితం పరిత్యజ్య నరాధమః।
పరన్ భాషాంతర కృతం మృగతృష్ణాజలం పిబేత్॥

అనగా, సంస్కృత భాషావిరచితంబైన గ్రంధమును విడచి పెట్టి భాషాంతరీకరణంబులను జదివెడు నొకమనుష్యాధముడు జలము లేని యెండమావులందు జలము గలదని గ్రోలబోవు వానివలె తల్లాడుచున్నాడు మఱియు

యస్తు సాంస్కృతికం త్యక్త్వాఽన్యత్కర్తు మిహేచ్ఛతి ।
సురూపాం స్వస్త్రియం త్యక్త్వా కుష్ఠిమిచ్ఛ త్యరూపిణీమ్ ॥
స రాజ్య సంపదం త్యక్త్వా నరకం గంతు మిచ్ఛతి।
స యాగీయం పశుం త్యక్త్వా పితరం హంతుమిచ్ఛతి ॥
యస్తు రామాయణం త్యక్త్వా భాషాంతరం మిహేచ్ఛతి ।
స గోక్షీరం విహాయాశు గార్దభీక్షీర మిచ్ఛతి।
అమృతస్య సరస్త్యక్త్వా విషం పాతు మిహేచ్ఛతి ।
స దేవత్వం పరిత్యజ్య పిశాచత్వ మభీచ్ఛతి ॥

అనగా సంస్కృత భాషయందలి గ్రంధములను విడిచి కేవల భాషాంతరీ కరణంబగు నితర గ్రంధములను కోరెడువాడు సౌందర్యవతియగు తన భార్యను బోనాడి కురూపిణియగు కుష్ఠగాత్రిని వరించిన వానివలెను, రాజ్యప్రాభవంబులు వదలి నరకంబునకు బోవనిచ్ఛగించు వానివలెను, యాగ పశువును విడిచి తన తండ్రినే చంపబూనెడువానివలెను, ఆవుపాలను బోనాడి గాడిదపాలను త్రాగ నపేక్షించువానివలెను అమృతపు సరస్సును దృజించి విషము గ్రోలనుంకించువానివలెను, దేవత్వమును వదలిపెట్టి పిశాచత్వమును గోరు వానివలె నగుచున్నాడు–ఇత్యాదిగా పార్వతీదేవికి, పరమేశ్వరు డెఱింగించినట్లుగ ఉమాసంహితయందు గలదు మఱియు నిట్టి ప్రమాణంబులను గూర్చి అగస్త్యసంహితాదులును బాహాటంబుగ బ్రతిపాదించుచున్నవి

మేఘజలమెంత శుద్ధమైనను భూమిపై బడుటచే ఆయాస్థలము ననుసరించి తత్స్వభావము కొంతవఱకైన ఏలాగున గల్గునో ఆలాగున భగవత్ప్రోక్తమగు వాక్యములు మానవాంతః కరణము ద్వారా భాషాంతరీ కరణ మొనర్పబడినప్పుడు తత్తద్హృదయ స్వభావముకూడ వానియందు కొంత కలియుచుండును మఱియు వ్రాయువారి యూహ ననుసరించి లేనిదానిని కల్పించుటయు, ఉన్నదానిని విడుచుటయు సంభవించుచుండును

పాశ్చాత్యులగు అమెరికా, జర్మనీ మొదలగు దేశీయులు శ్రీభగవద్గీ తను ముఖ్యగ్రంథముగా పఠించెడు నిక్కాలమున గీతాకామధేనువును, మాతృభూమియందలి భారతీయు లందఱును స్త్రీ పురుషులును నీపుణ్య గ్రంథమును పారాయణము చేసి పునీతులు కాకపోవుట కడుంగడు శోచ నీయము అకటా! ఇట్టి దురవస్థ యీ లోకమునుండి యెపుడు తొలగి సర్వజీవులును ఈశ్వర సంతానమను జ్ఞానము గలిగి ఎపుడు సుఖింతురో తెలియకున్నది గీతను భగవద్భక్తిగలవారి కుపదేశించిన కలిగెడు ఫలమును గుఱించి శ్రీకృష్ణభగవానులు గీత 18వ అధ్యాయమందు 68,69 శ్లోకములందు చెప్పినది చూడుడు

య ఇదం పరమం గుహ్యం మద్భ క్తేష్వభిధాస్యతి ।
భక్తిం మయి పరాం కృత్వామా మేవైష్యత్యసంశయః ॥

అతిరహస్యమగు ఈగీతాశాస్త్రమును నాభక్తుల కెవండుపదేశించునో అతడు నాయందు శ్రేష్ఠమైన భక్తిగలవాడై సమస్తసందేహములను నివర్తిచేసికొని నన్నే పొందగలడు ఇందు సందేహము లేదు

న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।
భవితా న చ మే తస్మా దన్యః ప్రియతరో భువి ॥

మనుష్యులలో నాభక్తులకు గీతార్థము జెప్పువానికంటె నితరుడు నాకు మిక్కిలి ప్రియుడు కలుగబోడు భూత భవిష్యద్వర్తమాన కాల ములలోను ఈభగవద్గీతను జనుల కుపదేశించు వానికన్న శ్రేష్ఠుడు నాకు మరొకడు ఉండియుండ లేదు! ఉండుటలేదు ఉండబోడు

స్త్రీ శూద్రులకు ఈగ్రంథాధ్యయనమున క్షర్హత గలదా లేదా యని

కొంచెము యోచించెదము

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।

స్త్రియో వైశ్యాస్తథా శూద్రా స్తేఽ పి యాన్తి పరాంగతిమ్ ॥

ఓ పార్థా! నన్ను ఆశ్రయించి పాపజన్మము గలవారెవ్వరైన నుండిన వారున్ను, ఇక స్త్రీలున్ను, వైశ్యులున్ను, శూద్రులున్ను పాపవిముక్తులై ఉత్తమగతియగు మోక్షమును పొందుచున్నారు అట్లుండ తక్కిన బ్రాహ్మణ క్షత్రియులగూర్చి వేరు చెప్పవలెనా! అని భగవంతు డుపదేశించి యున్నాడు

మఱియు నరనారాయణాంశ సంభూతులగు శ్రీకృష్ణార్జునుల సంవాదములో ఈజ్ఞానోపదేశమును మొట్టమొదట భూలోకములో ధృతరాష్ట్రుని కొఱకు సంజయుం డుపదేశించెను సంజయుండు సూత వంశోద్భవుడని మహాభారతమం దనేక స్థలములలో చెప్పబడినది సూతవంశీయులు శూద్ర జాతికి జెందినవారని లోక ప్రసిద్ధము దీనినిబట్టి చూచిన శూద్రులు చదువ వచ్చునా, చదివింపవచ్చునా యను సందేహము తొలగిపోవును

ఇక స్త్రీల విషయముగూర్చి విచారింతము ప్రారబ్ధకర్మ ననుభవించి సంసార దుఃఖమున తపించెడు జీవకోట్లకు భగవంతుని యెడ అనన్యభక్తి యెట్లు కలుగును? పాపవిమోచన మెట్లగును? మోక్ష మెట్లుసిద్ధించునని శ్రీవిష్ణుభగవానుని భూదేవి యడిగెను అట్లడిగిన భూదేవికొఱకు, ప్రారబ్ధ మనుభవించుచు పాపపంకములో మునిగిన జీవులకు గీతాపారాయణమే పాప విమోచనము కొఱకును, ముక్తికిని ముఖ్యసాధనమని విష్ణుభగవాను డుపదేశించెను ఇవ్విధ ముగ విచారించినను, గీత సోదరీమణులగు నారీమణుల సొమ్మని స్పష్టముగ తెలియుచున్నది ఇట్లుండ వారికి దానియందు హక్కు లేదని తిరస్కరించుట యెంత అపచారమో యూహించుకొనవచ్చును గీతా మాహాత్మ్యము చూడుడు

ధరోవాచ;–

భగవన్ పరమేశాన! భక్తిరవ్యభిచారిణీ ।

ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హేప్రభో! ॥

విష్ణురువాచ :–

ప్రారబ్ధం భుజ్యమానోఽపి గీతాభ్యాసరతస్సదా ।
స ముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే ॥

ఓం తత్ సత్ ఓమ్

ఋష్యాది న్యాసక్రమః

ఋషిచ్ఛందో௨ధిదైవం చ ధ్యాయే న్మంత్రస్య సత్తమే ।
యస్తు గార్గి జపేన్మంత్రం తదేవ హి ఫలప్రదమ్ ॥ 1
భవేద్వీర్యవతీ విద్యా గురువక్త్ర సముద్భవా ।
అన్యథా ఫలహీనా స్యాన్నిర్వీర్యా௨ప్యతి దుఃఖదా ॥ 2

ఓ గార్గీ! మంత్రధ్యానమునకు ముందుగా ఋషి, ఛందస్సు, దేవతలను, ధ్యానముచేసి యెవడు ధ్యానించునో, (జపించునో) ఆమంత్రము మాత్రమే త్వరలో ఫలసిద్ధిని గలుగజేయను అనగా మంత్రమునకు ఋషి, ఛందస్సు, దేవత, బీజము, శక్తి, కీలకము అను షడంగములు గలవు ఇంకను అంగన్యాసము, కరన్యాసము మొదలగునవియు గలవు ఇవన్నియు అంత అత్యావశ్యకములు కావుగాని ఋషి, ఛందస్సు, దేవత మాత్రము తప్పక యుండవలెను కొన్ని మంత్రములకు ఇవి మూడు మాత్రమే యుండును అధిక మంత్రములకును పైజెప్పిన ఆరు అంగము లుండును ఈఋష్యాది న్యాసములు ఏదైన ఒక దేవత నుద్దేశించి యేర్పడు మంత్రములకు మాత్రమే యుండును కొన్ని బీజాక్షరములను మాత్రమే జపము చేయువారలకు ఇట్టి ఋష్యాదిన్యాసము లుండవు అబీజాక్షరములు ఒక్కొక్కటిన్ని ప్రత్యేక ప్రత్యేక ఫలములను గలుగజేయునవిగాను కొన్ని పై జెప్పిన దేవతా మంత్రములతో కలిపి జపించునవిగాను నుండును. ఈఋష్యాది న్యాసములు ముఖ్యములు అంగన్యాస కరన్యాసములు అంత అత్యవసరములు కావు ప్రత్యేక ఉపాసనా క్రియల ననుసరించువారికే అవి యుండవలసియుండును

కేవలము భక్తితో ధ్యానము చేయువారలకు పై జెప్పిన ఋష్యాది న్యాసములుకూడ అవసరము లేదు ఏలన పవిత్రమైన భక్తి, శుద్ధమైన జ్ఞానమున్ను అమృతము వంటిది అమృత సేచనముచే ఎటువంటి కాలకూట విషమైనను శమించునట్లు పవిత్రమైన భక్తి చేతను, నిర్మల జ్ఞానముచేతను ఎటువంటి దోషములైనను నశించును వారికేలాటి విఘ్నములును గలుగవు

ఏలన, వారు సర్వభూతములలోగల ఆత్మను ప్రేమించువారగుటచే అన్ని ప్రాణికోట్లను వీరలను ప్రేమించును అయితే శాస్త్రరీత్యా అభ్యాసికి అవి యుండుటయే మేలు, ఏలన కొన్ని విఘ్నములును, ఆపత్తులును, దుష్ట సంకల్పములును గలుగనీయక యీ మంత్రతేజస్సు అనగా మంత్రశక్తి సాధకుని సంరక్షించుననియే శాస్త్రకర్తలగు ఋషుల మతము కొన్నిటికి కవచము, అస్త్రము మొదలైనవిగూడ గలవు ఇవి హృదయాది న్యాసములలో కలిసి వచ్చుచుండును మంచి ఆచరణ, నిష్ఠ, కరుణ గలవారలై తాముపదేశించెడు మంత్రము, తాము జపించి సిద్ధిగలిగినదిగా నుండవలెను అది యెక్కువ ఫలమును గలుగజేయును అట్లు కాని మంత్రములు ఫలహీనముగాను, ప్రాణశక్తి లేనివిగాను నుండును కామ్యకర్మపరునికి పై చెప్పినవన్నియు సరిగా లేనిచో దానివలన కొన్ని ఆపత్తులుకూడ కలుగ వచ్చును ఫలాపేక్షలేక జ్ఞానప్రాప్తి నిమిత్తము దైవభక్తితో చేయు మంత్రమునకు ఇట్టి నియమము లేవియును లేవు ఇట్లు యాజ్ఞవల్క్య మహర్షి శివసంహితయందు గార్గికొఱకు ఉపదేశించిరి

మనశ్శుద్ధి గలుగువఱకు, పాపములు నశించువఱకు, జ్ఞేయమగు ఈశ్వరునియందు నిలకడ కలుగువఱకు, నియమములను పాటించుటయే మేలు సాధకుని భంగవఱచువారు భూతప్రేత పిశాచములేగాక విఘ్న దేవతలున్ను గలరు ఎక్కువ ఉన్నతస్థితిని పొంది జీవన్ముక్తి పదమునకు వెళ్ళెడు యోగులను తపస్వులనుగూడ దేవతలు భంగవఱుప జూతురు ఇటువంటి విపత్తులనుండి ఋష్యాది న్యాసములు కవచములు, దిగ్బంధములు రక్షించుననియే పరమఋషుల యభిప్రాయము, వేదాంత శాస్త్రములో గురుశిష్యుల లక్షణము చెప్పేలాగున దివ్యమంత్రముల నుపదేశించెడు గురువుయొక్కయు, ఉపదేశము పొందెడు శిష్యునియొక్కయు లక్షణములు గూడ 'మంత్రరత్నమంజూష' యను గ్రంథములో చెప్పబడినవి చూడుడు మంత్రము ప్రాణమువంటి దనియు, ఋషి, ఛందస్సు, దేవతాదులు నేత్ర ఘ్రాణకర్ణ జిహ్వాకర చరణాద్యంగముల వంటివనియు నభిప్రాయము కనుకనే షడంగములు గల్గియుండుట మిక్కిలి మేలని చెప్పడమైనది

గురులక్షణము ,-

శాన్తో దాన్తః కులీనశ్చ వినీతః శుద్ధవేషవాన్।
శుద్ధాచారః సుప్రసిద్ధః శుచిర్దక్షః సుబుద్ధిమాన్ ॥
ఆశ్రమీ ధ్యాననిష్ఠశ్చ మన్త్రతన్త్రవిచక్షణః।
నిగ్రహానుగ్రహే శక్తో గురురిత్యభిధీయతే ॥

1 గురువు శాంతుడును, దాంతుడును అనగా శమదమములు గలవాడును, (బాహ్యేంద్రియ నిగ్రహము దమయనియు, అంతరింద్రియ నిగ్రహము శమమనియు గ్రహించవలెను అనగా బాగుగా ఇంద్రియ నిగ్రహము గలవాడని తాత్పర్యము) శ్రేష్ఠులవంశములో పుట్టినవాడును, మిక్కిలి వినయము గలవాడును శుద్ధములగు వస్త్రాదులు ధరించువాడును, శుద్ధమగు ఆచారములు గలవాడును ప్రసిద్ధికెక్కినవాడును, బాహ్యాభ్యంతర శుద్ధిగలవాడును, కార్యనిర్వహణ సమర్ధత గలవాడును, అనగా, అనుష్ఠానము నందు సమర్థుడును, మిగుల నిర్మలమైన బుద్ధిగలవాడునునై యుండవలెను

2 వారువారు ఆచరించెడు ఆశ్రమములో గల నియమముల నన్నింటిని చక్కగ పాలించువారును, ధ్యానమందు సర్వదా నిష్ఠగలవారును, మంత్రతంత్రము లెఱింగినవారును, నిగ్రహానుగ్రహ శక్తిగలవారును నగువారే గురు స్థానమున కర్హులగుదురు

శిష్యలక్షణము ;-

శాన్తో వినీతః శుద్ధాత్మా శ్రద్ధావాన్ధారణక్షమః ।
సమర్థశ్చ కులీనశ్చ ప్రాజ్ఞః సచ్చరితో ధనీ ॥ 1
ఏవమాదిగుణైర్యుక్తః శిష్యో భవతి నాన్యథా ।
గురుతా శిష్యతా వాఽపి తయోర్వత్సరవాసతః ॥ 2

1 శాంతచిత్తుడును, వినమ్రుడును, పరిశుద్ధమైన మనస్సుగల వాడును, అన్ని కార్యములలో మంచి శ్రద్ధగలవాడును, ధ్యానధారణాదులు గలవాడును, మిక్కిలి క్షమగలవాడును, కార్యదీక్ష గలవాడును, మంచి వంశములో పుట్టినవాడును, మంచి ప్రజ్ఞగలవాడును, శ్రేష్ఠమైన ఆచరణ గలవాడును, విజ్ఞానధనము గలవాడును నగువాడే శిష్యత్వమున కర్హుడగును

ఇట్టివానినే శిష్యునిగ గ్రహింపవలెనని అర్థము

2 ''గురుతా శిష్యతా వాఽపి తయోర్వత్సరవాసతః'' సంవత్సరావధి గురువు శిష్యుని, శిష్యుడు గురువును చక్కగ పరిశీలించుకొని మాత్రమే గురువు శిష్యుని అంగీకరించుటయు, శిష్యుడు గురువును గ్రహించుటయు తగును అనగా ఒక సంవత్సర మొకే స్థలముననుండి యోగ్యతాయోగ్యతలను తెలిసికొనవలసి యుండునని యర్థము

శ్రీభగవద్గీతలోగల ఋషిచ్ఛందాదుల గుఱించి మాత్రము దీనియందు వ్రాయడమైనది అనేకులు ఋషి అనగా నేమి! ఛందస్సననేమి? దేవతయన నేమి? బీజ మనగా నేమి? శక్తియన నేమి? కీలక మననేమి- ఈ మున్నగు విషయము లడుగుచుందురు సామాన్య గ్రంథములలో నిది విశదముగా వ్రాయబడనందునను తెలియ నభిలాషగల వారలనేకు లుండుట చేతను ఇపుడది వ్రాయదలంచితిమి

'' ఓం అస్యశ్రీ భగవద్గీతా శాస్త్రమహా మంత్రస్య'' - కొన్నిటిలో మాలామంత్రస్య అనియును కలదు ఇది తప్పిదము కాదు గ్రంథాంతరములలోను దేశాంతరములలోను ఆలాగున నుండును రెండును ఒకే యర్థము సూచించును

1 'శ్రీవేదవ్యాసో భగవాన్ ఋషిః' అనగా ఈగీతాశాస్త్రమునకు శ్రీవేదవ్యాస భగవానులు ఋషి ఎవరిద్వారా భూలోకమునకు ఆయా మంత్రములుగాని, ఆయా శాస్త్రములుగాని ప్రప్రథమమున ఆవిర్భవించినవో వారే దానికి ఋషి యనంబడుదురు వేద ఋక్కులను కనిపెట్టినవారే ఋషులు ఇంద్రియముల కతీతమగు ఆత్మను దర్శించినవారు ఋషులు ఉపాసనాదేవుని దర్శించినవారు ఋషులు ఈ మూడును ఋషిశబ్దమునకు ముఖ్యార్థములు అయితే గీతాశాస్త్రమును శ్రీకృష్ణభగవానులు ఉపదేశించియుండ శ్రీకృష్ణద్వైపాయనులు ఎట్లు దానికి ఋషి కాగల్గునని సందేహింప నక్కరలేదు శ్రీకృష్ణార్జున సంవాదమగు సూత్రవాక్యములను వ్యాసభగవానులే గ్రంథరూపముగ నిర్మించినారు కనుకనే దానికి వేదవ్యాసులు ఋషి కాగలిగిరి

ఋషియను శబ్దము పూర్వకాలపు ఋషులకు మాత్రమే గలదని తలంపరాదు అతీంద్రియజ్ఞానము గలవారలకు అది ఒక బిరుదముగ నున్నది అనగా ఉన్నతమైన పరీక్షలలో ఉత్తీర్ణులగు నప్పుడు జడ్జి, వకీలు, డాక్టరు, ఇంజనీరు, మహోపాధ్యాయ ఇత్యాది బిరుదములు లభించువిధముననే ఋషియను బిరుదమును గూర్చియు నెఱుంగవలెను అతీంద్రియజ్ఞానము గలిగి దైవసాక్షాత్కారము గలవారల కిపుడు కూడ ఋషిశబ్దము వర్తించును ఇపుడుకూడ ప్రసిద్ధమైన జ్ఞానముగల వారిని ఋషులని పిలుచుచున్నారు పైజెప్పిన డిగ్రీలు ఏలాగున విద్యాభ్యాసాదులచే సంపాదించుచున్నారో, బ్రహ్మనిష్ఠ, తపస్సు మొదలైన వానిచే ఋషిత్వముకూడ సంపాదించుకొనవచ్చును ఇట్టి లక్షణములు గల్గినపుడే ఋషి యనంబడుదురు

ఊర్ధ్వరేతా తమస్యుగ్రో నియతాశీ చ సంయమీ ।
శాపానుగ్రహయోశ్శక్తః సత్యసన్ధో భవేదృషిః ।

ఊర్ధ్వరేతస్సు గలవాడు, ఉగ్రమైన తపస్సు గలవాడు, నియమిత మగు ఆహారము నియమిత సమయమున భుజించువాడు, ఆత్మసంయమము గలవాడు, శాపానుగ్రహములందు శక్తిగలవాడు, సత్యసన్ధుడు - ఇట్టి గుణములు గలవాడే ఋషి యనబడును పూర్వకాలములో కూడ పుట్టినవపుడందరును ఋషిత్వమును పొందియుండలేదు

2 అనుష్టుప్ ఛందః(క్వచిన్నానా ఛన్దాంసి) సామాన్యముగ గీతాశాస్త్రమంతయు అనుష్టుప్ ఛందస్సుతో గూడినది అచ్చటచ్చట కొన్ని శ్లోకములు మాత్రము ఇతర ఛందస్సుతో కూడినవియు గలవు అనుష్టుప్ ఛందస్సునకు నాల్గుపాదములున్ను, ఒక్కొక్కపాదమునకు ఎనిమిది అక్షరముల చొప్పున మొత్తము 32అక్షరములున్ను కల్గియుండవలెను కావున 8,8 అక్షరములయిన పిదప పదములను నిలిపి చదివిన, సామాన్యముగా సంస్కృతము తెలియని వారలకుకూడ గీతను చదువుట కలవాటు గల్గును ఛందస్సు గూడ దైవికమగు శక్తి గల్గియుండును

3 శ్రీకృష్ణపరమాత్మా దేవతా - మంత్రముయొక్క అధిష్ఠాన దైవమును దేవతయందురు శ్రీకృష్ణభగవానులు సాక్షాత్ దైవస్వరూపులగుటచే గీతా

శాస్త్రమునకు వారు దేవతగా నున్నారు అనగా గీతయొక్క ప్రతిశ్లోకము పఠించునపుడు దైవస్వరూపులగు శ్రీకృష్ణభగవానుని ధ్యానమునందుంచుకొన వలయును. ఇట్లే ఒక్కొక్క మంత్రమునకును ప్రత్యేక ప్రత్యేక దేవతలు కలరు,

4 'అశోచ్యానన్వశోచస్త్వమితి బీజం' గొప్పదగు మఱ్ఱిచెట్టు సన్నని విత్తనములో ఎట్లిమిడియుండునో, ఆలాగున మంత్రార్థము యొక్కయు, లేక శాస్త్రార్థ ము యొక్కయు సారమంతయు బీజమం దిమిడియుండును మొదట బీజ మతిసూక్ష్మముగ నున్నను వృక్షముగా పరిణమించునపు డెంతయో మహత్తరముగ నుండునట్లు మంత్రమున్ను ఆలాగున పరిపక్వమై ఫలమునకు వచ్చునపుడు అంత మహిమాతిశయము గల్గియుండును 'అశోచ్యానన్వ శోచస్త్వమితి బీజం' అని కొన్నిటియందు ఒక్కపాదముగాను, కొన్నిటిలో రెండు పాదములుగాను కొన్నిటిలో శ్లోకము పూర్తిగ నుండును ఇదియు తప్పిదమని తలంపరాదు పాఠాంతరమనియే తలంపవలెను 'అశోచ్యానన్వ శోచస్త్వమితి' అనునదే ఈ గీతాశాస్త్రమునకు బీజము ఈశాస్త్రసార మంతయు ఈ ఒకే శ్లోకములో నిమిడియున్నది అంతేగాక, ఈ శ్లోకారంభము నుండియే గీతా శాస్త్రమును శ్రీకృష్ణభగవానులు ఉపదేశింప ప్రారంభించి యున్నారు ఈ శ్లోకమును అ2, శ్లో॥11లో గనందగును ఇది ప్రారంభ మగుట బీజమను పేరు గల్గియున్నది దీనికిముందున్న శ్లోకములన్నియు కురు క్షేత్రములో జరిగిన విషయమును గుఱించి చెప్పబడినవేగాని గీతార్థమును గూర్చి కాదు

5 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజేతి శక్తిః' దేని యందు ఏ తేజస్సు, ఏప్రభావము, ఏమహిమ, యేచైతన్య ముండునో అది దానియొక్కటి చేతనే శక్తి యనంబడును పైజెప్పిన యీ నాల్గుశక్తులున్ను ఈశ్లోకములో నుండుటయే దీనిని శక్తియని జెప్పుటకు కారణమైనది గీతయొక్క దివ్యశక్తి యంతయు దీనియందిమిడి యున్నది ఇది అ18-66వ శ్లోకమున గలదు

6 'అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ' 'ఇతికీలకం' ఇది పైశ్లోకములోని రెండవ పాదమై యున్నది (అ 18 శ్లో॥

66,) ఈ శ్లోకములోనే శక్తిన్ని కీలకమున్ను అమరియున్నవి. కీలకమనగా రహస్యమని యర్థము సాధారణ జనులెవరికిని తెలియక గూఢముగా నుండునదగుటచే దీనికి కీలకమనిపేరు వచ్చినది ఇది అనుభవజ్ఞులగు మహనీయుల కరుణవలననే తెలియదగును ఎట్లన మనకేదైన యంత్రము దొరికిన దానిని ఉపయోగపఱచెడి పద్ధతియు, దానివలన నేమేమి కార్యములు చేయవచ్చునను సంగతియు, ఎచ్చటెచ్చట మరత్రిప్పిన ఏమేమి పని చేయునో అదియు అనుభవజ్ఞుల వలన నెట్లు తెలిసికొనవలసి యుండునో మఱియు, అది యేలాగున అతి రహస్యముగ నుండునో ఆలాగున గీతాశాస్త్రముయొక్క రహస్యమంతయు, పరమనిగూఢ తత్త్వమంతయు ఈశ్లోకమున గలదు

కనుకనే శ్రీరామానుజాచార్యులు మొదలగు మహనీయు లందఱును ఈశ్లోకమును చరమశ్లోకమని యుపదేశించిరి ఈ ఒక్క శ్లోకమునకు శ్రీభాష్యకారులు విస్తారముగా అర్థమును వ్రాసియున్నారు వైష్ణవ సంప్రదాయములో శ్రీఅష్టాక్షరీమంత్ర మెటు వంటిదో యీ చరమశ్లోకము గూడ అటువంటిదే వారిద్దానిని అంతపవిత్రముగ బావించి పఠింతురు నిజముగ ఇది పరమరహస్యముగాను, పరిపక్వజీవులు గ్రహింపతనదిగాను, దైవసాక్షాత్కారము పొందిన గురువుల వలననే గ్రహించదగినదిగను నున్నది కీలకపదమునకు ఎవనికి తెలియని నిగూఢమర్మ మనియు అర్థము గలదు శ్రీకృష్ణపరమాత్ముని అంతరంగరహస్య మంతయు దీని యందు గలదు దీనికి కీలకమనిపేరు కలుగుటకు కారణమిదియే

ఋషి అనుమంత్ర ముచ్చరించునప్పుడు శిరస్సుపైనను, ఛందస్సు అని యుచ్చరించునపుడు ముఖముపైనను, దేవతయని చెప్పునప్పుడు హృదయ ముపైనను, బీజమని చెప్పునపుడు వక్షః స్థలముయొక్క దక్షిణ భాగముననను, శక్తియని చెప్పునపుడు వామభాగముననను, కీలకమని యుచ్చరించునపుడు నాభి(బొడ్డు) యందును హస్తమునుంచుట శిష్టాచారమై యున్నది వీనికి షడంగములని పేరు ఈ విషయమును గూర్చి పైన వ్రాయబడియున్నది సామాన్యమంత్రము లన్నిటికిని ఈషడంగములే

7 'మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసీ' తి కవచం

కవచమనగా ఆత్మరక్షణయని అర్థము యుద్ధమునకు వెళ్ళునపుడు కవచమును ధరించుటగలదు దానికే వజ్రకవచమను పేరున్ను గలదు దీనిని మిక్కిలి కఠినమైన లోహముచే నిర్మింతురు శత్రువులు ప్రయోగించెడు శస్త్రము లేవియు దేహమందు తగులనీయక చేయునది కవచ మనబడును ఈమంత్ర ముచ్చరించునపుడు వజ్రాయుధమునకైన భేదింపనలవికాని యొక తేజోమయమగు కవచమును తానుధరించినట్లు భావించవలెను అరణ్య ప్రదేశములలోను, పర్వతగుహలలోను, ఏకాంత ప్రదేశములలోను యోగ ధ్యాన సమాధి తపస్సుల జేయువారు మంత్ర పూతమగునిట్టి కవచమును భావనారూపముగ ధరింతురు అట్లైన భూతప్రేతపిశాచాదులుగాని, దుష్ట గ్రహముగాని బాధింపవనియు, మనస్సును మాలిన్యపఱచెడు సంకల్పము లుదయించవనియు, అంతేగాక దుష్టమృగములవలన బాధయు గలుగదనియు మంత్రవేత్తలగువారి విశ్వాసమై యున్నది ఇదిన్ని ఒక విధమైన భావనావిశేషమే కాని ఆ మంత్రము నుచ్చరించనిచో ఆ సమయములో అట్టి భావనచేయుట దుర్లభ మగునని తలంచి యిట్టి ఏర్పాటు చేయబడినది 18అ 58 శ్లోకమున గలదు

8 'కిరీటినం గదినం చక్రహస్త మిత్యస్త్రం'– అస్త్రమనగా శర పంజరమని అర్థము అనగా శరములతో చేయబడిన ఒక గూడు వంటిదని భావము, తపస్సు, యజ్ఞము, యోగము మొదలగువానిని భంగపఱచెడు దుష్ట క్రియలు గాని, మారణములుగాని, విఘ్నములుగాని యొనర్చే మాంత్రిక ప్రయోగము కూడనుండును అట్టి దోషము లన్నింటిని ఈ అస్త్రమను యంత్రము ఖండించి వేయును నాగాస్త్రమును, గారుడాస్త్రమును, ఆగ్నేయాస్త్రమును, వారుణాస్త్రమున్ను ఎట్లు శమింపచేయునో ఆలాగున వైరులయొక్క ప్రయోగము లన్నియు దీనిచే ఖండింపబడును ఇది అ 11–17వశ్లోకమున గలదు

9 'అనాదిమధ్యాన్త మనన్తవీర్య మితిధ్యానం'– ధ్యాత అనగా ధ్యానించవాడు సాక్షాత్ కృష్ణపరమాత్మయొక్క స్వరూపము నేలాగు ధ్యానించ వలెనో అది దీనిలో చెప్పబడినది ఈశ్లోకములో చెప్పేలాగున ధ్యానకాలమున

తప్పక హృదయములో ధ్యానించవలెను ఇది పరమాత్మ యొక్క అనంతశక్తి గల అనంత స్వరూపముయొక్క ధ్యానమని గ్రహించవలెను

ఇక అంగన్యాసములో దిగ్బంధ మొకటి గలదు పైజెప్పినవానిలో ఈ భావమిమిడి యున్నందుచేతను, అంగన్యాసములో నిది యుండుట చేతను ప్రత్యేకముగ నిట దీనిని చెప్పలేదు దిగ్బంధమనగా అష్టదిక్కులనేగాక ఆకాశ పాతాళములు రెండునుజేరి దశదిక్కులను బంధించుట యగును అనగా శత్రువులను నిరోధించుటయని భావము రాజులు కోట గట్టి శత్రువులను నిరోధించుటకొఱకు భటులను ఏర్పఱచేలాగున ఏకాంత ప్రదేశములో ఎక్కువకాలము మంత్రపునశ్చరణ చేసి దేవతా సిద్ధిని పొందతలంపు గల వారున్ను, తపసువలన గొప్ప సిద్ధిని బడయ గోరువారున్ను మంత్రభావముతో నిట్టి దిగ్బంధముల జేయుదురు ఇదిన్ని పైజెప్పే లాగున దుష్టగ్రహాదుల బాధలేకుండుటకొఱకు ఏర్పడినది ఇవన్నియు చాలవఱకున్ను కర్మ కాండములతోను, భేదభావములతోను కూడినవనియే చెప్పవచ్చును అయితే దీని రహస్యము పైన చెప్పబడియే యుండెను

సర్వజీవరాసులయెడ కరుణగల్గి సమస్తచరాచర ప్రాణికోట్ల యందు వెలుగుచుండు పరమాత్మను తన ఆత్మలో ధ్యానించువారి ధ్యానము ఒక్క ప్రాణికికూడ కీడు గలింపదు కీడు గలుగజేయకుండుటయేగాక బహువిధముల మేలును గూడ గలుగజేయును అట్టివానికి తనయొక్క పరిశుద్ధ భావనయే బ్రహ్మాండకవచమును, దశదిక్కుల బంధనముగాను నగుచుండును కనుక పరిశుద్ధమైన హృదయముకంటెను, జీవరాసులయెడ కరుణ కంటెను, అనన్యమగు నీశ్వరభక్తికంటెను మించిన దీమూడు లోకములందును ఉండియుండలేదు, ఉండుటలేదు, ఉండబోదు సత్యముయొక్క శక్తి అపారమైనది దానియొక్క మాధుర్యమును, మహిమయు, ప్రత్యక్షఫలమున్ను అనుభవజ్ఞులే యెఱుంగగలరు సత్యముయొక్క మహిమనుగూర్చి యిట్లు వర్ణింపబడినది–

సత్యం ధర్మస్తపో యోగః సత్యం బ్రహ్మ సనాతనమ్ ।
సత్యం యజ్ఞః పరః ప్రోక్తం సర్వం సత్యేప్రతిష్ఠితమ్ ॥

ఇప్పుడు ఋష్యాది న్యాసములలోగల బీజము మొదలుకొని అన్ని శ్లోకములును పూర్తిగ ఈక్రింద వ్రాయబడుచున్నవి-

అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే॥
గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః॥ (2–11–బీజము)

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।–శక్తి
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥

(18–66–కీలకము)

మచ్చిత్తస్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి।
అథచేత్త్వమహంకారా న్న శ్రోష్యసి వినంక్ష్యసి॥

(18–58–కవచము)

కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తాత్
దీప్తానలార్కద్యుతి మప్రమేయమ్॥

(11– 17. అస్త్రము)

త్వమక్షరం పరమం వేదితవ్యం
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్।
త్వమవ్యయ శ్శాశ్వత ధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషో మతో మే॥

(11– 18– ధ్యానము)

★★★★★★

పురోఽభివృద్ధిని గోరువారు పూర్వ వృత్తాంతమును మఱువగూడదు

ఈ విషయమును గుఱించి మనము గ్రహించుకొనవలసిన సంగతులు నాలుగు కలవు అనగా దీనికి నాలుగువిధములగు అర్థములు గలవు ఈ వాక్యము చాల తత్త్వబోధతో కూడినది ఇది ధర్మమును తెలిపెడు వేదవాక్యము వంటిది దీనియందు శ్రద్ధనుంచకపోయిన మనుజుని యితర ప్రయత్నములన్నియు మూలముచెడిన వృక్షమువలె నష్టములై పోవును అంతేగాక, అతడు ఎన్ని ఎన్ని కార్యములు చేసినను అనేక అంతస్తులతో గట్టినసౌధము పునాది భిన్నమైనచో ఒకదానిపై మఱియొకటి కూలి పోవులాగున, చేసిన కార్యములన్నియు నష్టములై పోవును, సామాన్యదృష్టితో జూచిన నిది కృతజ్ఞతను జూపెడు చిహ్నము గలదిగా నుండును అనగా సదా కృతజ్ఞత కలవాడై యుండవలెను కృతజ్ఞతయే ధర్మమునకు మూలము, కృతజ్ఞత గలవాడే ధర్మాత్ముడు దీనిలో సామాన్యజనులకు తన యిహసంబంధ అర్థముకూడ గలదు విశేషబుద్ధిగల వారికి, పరమునకు సంబంధించిన అర్థముతో గూడియుండును

1 మొదటిది మామూలుగా చెప్పెడియర్థము అనగా ఒక్కడు సామాన్య స్థితిలో నుండునపుడు ఎవరెవరు తనకు సహాయపరులై యుండిరో, విశేషస్థితి గలుగునప్పుడు అట్టి సంగతి మఱచి ప్రవర్తించుట యగును ఇది కృతఘ్నుల స్వభావము కృతజ్ఞత కలవాడు తనకెంత ఉన్నతస్థితి కలిగినను తన పూర్వ స్థితిని మఱచి ప్రవర్తింపడు ఇది ధర్మస్వభావము గలవారలయొక్క ముఖ్య గుణమైయుండును ఇట్టివారిని సజ్జనులన దగును తక్కినవారలు దుర్జనులతో సమానులు కొందరు కడుబీదలై యుండునప్పుడు ఎవరెవరి సహాయము గలిగియుండిరో, విశేషస్థితి గలుగునప్పుడు ఆ సహాయపడిన

వారిని మఱచిపోవుటయు, వారిని అశ్రద్ధతో జూచుటయు సంభవించు చుండును

అట్లు కూడదని యీ వాక్యము మన కుపదేశించుచున్నది మామూలుగ అందరున్ను అట్టివారిని చూచిన ఏమిపూర్వ వృత్తాంతమును మఱచి పోయితిరా? అని అడుగుట కూడగలదు ఈ వాక్యమును లోకములో చెప్పనీయక చూచుకొనవలెను మఱియు కొందరు పేదరికముతో నుండు వారుకూడ మహాత్ముల దగ్గరజేరి వారి కార్యములలో ప్రవర్తించి, అచ్చటవారితో కలసియుండునపుడు, తమ యొక్క పూర్వసంగతిని బొత్తిగా మఱచిపోయి ప్రవర్తింతురు ఇదిన్ని చాల తక్కువ స్వభావమని మఱువకూడదు, ఆలాగున బీదరికముతో నుండి కొందఱు ధనవంతులయిన తరువాత పూర్వముండిన తమ సొంతజనులను కూడ చాల తక్కువ బుద్ధితో చూచువారు కూడ గలరు మఱికొందరు చాల తక్కువ స్థితియందుండి దైవకృపచే గొప్ప ఉద్యోగస్థితి గల్గినను, పైజెప్పిన వారిగుణములు గల్గియుందురు ఇది కృతజ్ఞతా స్వభావ ములేని వారిగుణములు పదవులేవియు శాశ్వతముగ నిలువజాలవు ఏలన, ధర్మస్వభావము గలవారిని మాత్రమే ఈశ్వరుడు సంరక్షించును పైజెప్పిన స్వభావముగల వారందరును స్వల్పబుద్ధిగలవారు, అల్పబుద్ధితో కూడియున్న వారు ఇట్టివారు ఎక్కువ ఆడంబరముతో కూడియుందురు. అది వారి ఆత్మను మరుగుపరుచు చున్నదను సంగతిని వారు తెలిసికొన జాలకున్నారు ఇట్టి దోషము గలుగనీయక చాలజాగ్రత్తతో బుద్ధిమంతులు చూచుచుండవలెను అట్టి బుద్ధిమంతులకు పతనము గలుగదు ధర్మదేవత వీరిని సదా సంరక్షిం చుచుండును

ఈ యర్థమందు మరియొక విషయముగూడ గలదు అదేమన, ఒకడు ఉన్నతస్థితిలోనికి వచ్చినప్పుడు, తన యొక్క నిమ్నస్థితిలోనుండు స్వభా వములను మఱచి, ఉన్నతస్థితిలోని స్వభావము గలిగియుండవలెను, ధనము గల్గిన దానికి తన ఉన్నతగుణమున్ను, ఉద్యోగము వచ్చినదానికి తన ఉదార స్వభావమును, భక్తిగాని, జ్ఞానముగాని, యోగసిద్ధిగాని గల్గినవానికి సంబం ధించిన శాంత శమదమాదులున్ను, జీవరాసులలో కరుణయున్ను,

విశాలబుద్ధి యున్ను,అగాధబోధమున్ను గల్గియుండవలెను వీరందరున్ను, తమలో ఏదైన చిన్నగుణముగాని, దృశ్యవృత్తులుకాని, యింతవరకు గలియుండిన వాటినన్ని టిని మఱచిపోవలెను ఇప్పుడు తానవలంబించిన వృత్తికి తనయోగ్యత గల్గిగి యుండవలెను ఇది యొక యర్థము ఇచట పూర్వవృత్తాంతమును మఱచిపో వలెను ఈ రెండర్థములున్ను ఒక్క దానినే తెలుపుచుండును కనుక యిదిన్ని మొదటి అర్థముతో చేరియున్నది ఈభావములో పురోవృద్ధిని గోరువారు పూర్వ వృత్తులన్నిటిని మఱచిపోవలెను నూతన జన్మ మేర్పడవలెను చెట్టు నుండి ముదిరిన ఆకులు రాలిపోయి, ఎట్లు క్రొత్తచిగురులు పుట్టుచుండునో ఆలాగున జీవితమంతయు దివ్యమై శోభాయమానమై మారవలెను

2 ఇపుడు రెండవ అర్థమును గూర్చి విచారించెదము ఇది మనకు సదా పురోభివృద్ధికి మార్గమును చూపుచుండును గమ్యస్థానము చేరు వరకున్ను విశ్రాంతిని పొందగూడదని యెల్లప్పుడు మనలను ప్రేరణ చేయు చుండును అదేమన మొట్టమొదట మనము ఏ ఉద్దేశముతో బ్రహ్మనిష్ఠా మార్గము నవలంబించితిమో, ఏ ఉద్యమముతో విరక్తి నాశించితిమో, ఏకారణముచే గురువునా శ్రయించి సాధనలజేసితిమో, ఏహేతువువల్ల ధ్యాననిష్ఠలో దిగితిమో, ఏకారణ మువలన గురువుచే మంత్రోప దేశమునుపొంది త్రాపత్రయాగ్నిని చల్లార్చుట కొరకు ఆత్మవిచారములోనికి ప్రవేశించితిమో, ఏహేతువువల్ల సాధువృత్తి నవలం బించితిమో, దేనివలన తపోభూమిలోనికి నరిగితిమో, ఏపరిశుద్ధ విచారముచే సమస్తము త్యాగమొనరించితిమో, ఏ ఈశ్వరకరుణగల్గి జన్మసాఫల్యమొంద దలచి యిల్లువిడిచితిమో, ఏ ఆత్మ సాక్షాత్కారము గల్గి ప్రపంచములో తాపత్ర యాగ్నిచే తపించెడు జీవకోట్ల తాపము చల్లార్పనెంచితిమో, ఏ ఆత్మజ్ఞానామృ తమందు మగ్నులమై మనఆత్మను నిత్యానందపదవిలోనికి జేర్పతలంచితిమో – ఈలాంటికార్యములన్నిటిని మఱుపుగలుగనీయక, సదా వానియందు ప్రయ త్నము గల్గియుండుటయే రెండవ మార్గమగును

మధ్య, మనము సంసర్గదోషము వల్ల, లేక శరీరసంబంధ జాడ్యము

వల్లనో అట్టి పరిశుద్ధమగు సంకల్పమునుండి జారిపోయితిమా! పూర్వ ముండిన నిర్మలభావము మనకు సదా గలిగియుంటున్నదా? లేక యిక నేదైన మార్గములోనికి మనస్సు దిగి పోయినదా యని చూచుకొనుచు పూర్వ కార్యములన్నిటిని సదా జ్ఞప్తిలోనుంచి జాగ్రత్తగల్గి వర్తింపవలెను ప్రపంచ వ్యామోహము వలనగాని, దృశ్యవిష యములచేగాని, బాహ్యసౌఖ్యములచేగాని మనస్సు బహిర్ముఖమాలిన్యము నందినదా? పూర్వముండినంత వైరాగ్యము ఉన్నదా? పూర్వముండిన తీవ్ర ధ్యాననిష్ఠ యున్నదా లేక మందగించినదా? శాంతికి భంగము గల్గినదా? సత్యము నుండి మనస్సు దూరముగ పోవు చున్నదా? కారుణ్య స్వభావము సన్నగిల్లినదా? రుచికరములగు భోజనాది వస్తువులు గావలెనని మనస్సు కోరుచున్నదా? శయనము, భవనము, సుందరములుగా నుండవలెనని మనసు ఏదైన ఆలోచన చేయుచున్నదా? అని ఈ మొదలగు కార్యములన్నియు జ్ఞాపకములో నుంచుకొని పూర్వాధిక ధ్యాననిష్ఠ గలిగియుండేలాగున చూచుకొనవలెను

అట్లు ఏదైన మనస్సు మాలిన్యము గలిగియున్నదని తోచినచో ప్రాయశ్చిత్తము చేసికొని పశ్చాత్తాపపడి, దైవప్రార్థనగాని, గురుధ్యానముగాని చేసికొని నిష్ఠ ప్రారంభించుకొనవలెను మనస్సు మాలిన్యము గలుగుటకు నివాసస్థల దోషమని తలచిన, అట్టిస్థలమును వెంటనే మార్చుకొనవలెను సంసర్గలోప మువలన గలిగెనని తలంపున్నచో అదిన్ని మార్పు చేసికొనవలెను ఏవిధమైనను, ఈశ్వరసాక్షాత్కారము గలుగువరకు, నిలుపే కలుగనీయక, ధ్యాననిష్ఠ చేయుచుండవలెను ఆహారదోషము కంటె నివాసదోషము మిక్కిలి అపాయము కలుగజేయును ఏవిధమైన విషయము స్ఫురించే స్థలములో నుండరాదు ఇదేదానిలో ముఖ్యకారణము నాకు తెలిసిన వారిలో ఆహార దోషముచే చెడినవారు తక్కువగాను, నివాసస్థల దోషముచే పతితులైనవారు పెక్కండ్రును గలరు నిష్ఠయందు తైలధారవలె అవిచ్ఛిన్నముగ, ధ్యానము జరిగేలాగున చూచుకొనవలెను, ఇదే ఉత్తమాధికారియొక్క గురుతుగా నుండును

మనోగతి తప్పినదని తోచినవెంటనే కాలువలు తెగి జలము

కుమార్గములో పోవుచుండిన ఏలాగున వెంటనే కట్టలు బాగుగా గట్టి సన్మార్గములో నీటిని పోయేలాగున చేయుదురో, ఆలాగున సాధకుడు సదా చూచుకొనుచుండ వలెను లేక సోమరితనము వృద్ధినొందినదని తోచిన అది ఆహారదోషముచేతనే గల్గియుండునని తలంచి ఆహారముయొక్క నిశ్చలనియమము చేసికొనవలెను ఉపవాసములు కొన్ని చేయవలెను అనుకూలముండిన ప్రాణాయామమున్ను కొంత శీలించవలెను దీనివలన సోమరితనము పారిపోవును నిశ్చిత సమ యమున నియమిత ఆహారము తప్ప ఇతర వస్తువులుగాని యితర కాలము లోగాని ఏమియు తీసికొనరాదు అదే దీనిలోగల రహస్యము

మనస్సు ఏదైన విషయముచే మాలిన్యము పొందినదని తోచిన, మలిన వస్త్రమును చవుడుమట్టిలో ఉడుకపెట్టి ఎండలోనుంచి నీటితో తడిపి యేలాగున చాకలివారు శుద్ధముగ చేయుదురో, ఆలాగున తపస్సుచేతను, మంచివ్రతముచేతను, ధ్యానము మొదలగువానిచేతను ఆత్మను శుద్ధిపరచు కొనవలెను ఈ కార్యములో ఏలాటి అభిమానముగాని, అహంకారముగాని గలుగనీయక చూడవలెను అట్లైన చుక్కాని గల పడవ, ఏలాగున గమ్యస్థానము తప్పక పోయిచేరునో, ఆలాగున మీయొక్క ఉద్దేశ్యము కూడ నెరవేరగలదు లేనిచో చుక్కాని చేతినుండి జారిపోయిన పడవ యేలాగున గమ్యస్థానము చేరుకోలేక గాలివలనగాని, ప్రవాహవేగము వలనగాని, అచ్చటికి, ఇచ్చటికి కొట్టుకొనిపోయి శిథిలమైపోవునో, ఆలాగున జీవితముకూడ గమ్యస్థానమునుండి పతనము గల్గి వ్యర్థమైపోవును వ్యర్థమై పోయినను పోనీ అంతమాత్రముకాదు ఆనర్థము కూడ గల్గును

పుణ్యపురుషులు పరిశుద్ధాత్ములును, దైవకృపయు, గురుకరుణయు గలవారలు, తమ యొక్క నైజగుణమును ఎట్టి విపత్తులలో గూడ విడనాడరు వారికి ప్రాణహాని గలుగునా యని యేలాటి విచారము గలుగదు గాని, తమ యొక్క వ్రతభంగము గలుగునాయని మాత్రము సదా భయము గలిగియుందురు వ్రతనియమము గలిగియుండిన ప్రాణభయము గలుగదు ఏలన, వారి వారి ధర్మము వారివారిని సదా సంరక్షించుచుండును అట్టి

ధర్మదేవత ఎల్లప్పుడున్ను వారిని కనిపెట్టి రక్షించుచుండును అగ్ని ఏలాగున తన యొక్క ప్రకాశము విడిచియుండుట లేదో, జలమేలాగున తనయొక్క ద్రవత్వమును విడుచుటలేదో, వాయు వేలాగున తనయొక్క చలనత్వము ద్యజించి యుండుటలేదో, ఆకాశమేలాగున తనయొక్క స్వచ్ఛత్వము నుపేక్షించి యుండుటలేదో – ఆలాగున పుణ్యపురుషులు తమయొక్క ధర్మమును విడిచియుండరు సూర్యుడేలాగున తనప్రకాశము వీడియుండుట లేదో, చంద్రు డేలాగున తనశీతలత్వమును విసర్జించి యుండుటలేదో, చక్కెర యేలాగున తనయొక్క మాధుర్యమును వదలి యుండుటలేదో, ఆలాగున నిర్మల జీవులు తమ యొక్క పావనత్వమును త్యజించియుండరు ఇదే దీనికి గురుతు తీవ్ర ముముక్షత్వమున్న వారందరును ఈలాటి స్వభావము గలవారైయే యుందురు

ఈజన్మములోనే, ఈశ్వ రసాక్షాత్కారజ్ఞానము గలుగవలయును, మనశ్శాంతి పొందవలయును, అజ్ఞానమును నశింపచేయువలెను తాప త్రయాన్ని శాంతి నొందించవలెను జన్మసా ఫల్యమును చేసికొనవలెను, జన్మము సార్థకము కావలెను, వంశమును పావన మొనర్పవలెను, కన్నందులకు తల్లిదండ్రులనుకూడ పావనుల నొనర్పవలెను, లేనిచో మరణించుటయే మేలను స్వభావము గల్గియుండవలెను ఏమి, భూలోకములో జనులకు కొరత లేదు, ఎన్నియో కోట్ల జనమున్నారు వీరందరును చనిపోయెదరు, మనమున్ను ఆలాగున పోవలసినవారమే ఇట్టి యవస్థ సార్థకజీవులకున్ను, నిరర్థక జీవులకున్ను, అనర్థజీవులకున్ను సమానధర్మమై యున్నది అట్లుండగా ఏల నిరర్థకముగా చావవలెను మరణమును లక్ష్యము పెట్టకయుండిన మాత్రమే అమృతమును గ్రోలగలము

అయితే మూఢబుద్ధితో ఆత్మను నశింప చేయరాదు అది ఆత్మ హత్యలో చేరిపోవును అది పాతకము ధర్మనిర్వహణములో ఈశ్వర ధ్యానములో, బ్రహ్మనిష్ఠలో మాత్రమే ఈపుణ్యవాక్యము సమన్వయించును శ్రద్ధ గలిగి వర్తింపనందుచే మనము దుఃఖమునకు పశులగుచున్నాము ప్రతివారున్ను గురూపదేశము పొందుటకు ప్రారంభించునపుడును. తపస్సు

నుద్దేశించి ఇంటినుండి బయలుదేరుటకు ముందుగాను, బ్రహ్మవిచారము నారంభించుటకు పూర్వమును, సోమరితనమను పెనుభూతమునకు తర్పణ మొనర్చియే బయలుదేరవలెను అట్లైన అన్నియు నిర్విఘ్నముగ సాధింప గలము, కాయకష్టమును సహించుకొన వలెనని నిశ్చయించుకొనవలెను ఇంద్రియచాపల్యము నరికట్టవలెనని తీర్మానించుకొనవలెను జిహ్వాయొక్క రుచికోరెడు గుణమును కట్టివేయ వలెను అట్లైన మాత్రమే మీరు సుఖముగ, ప్రసన్నముగ, ప్రశాంతముగ గమ్యస్థానము చేరగలరు

న సౌఖ్యాల్లభతే పుణ్యం కాయక్లేశాదవాప్యతే ।
మధనేన యధా క్షీరా న్నవనీతం ప్రజాయతే ॥
మర్దనాదిక్షుదండానాం రసో యద్వత్ప్రజాయతే ।
తద్వచ్ఛరీరదండేన మహాధర్మః ప్రజాయతే ॥

శరీరసౌఖ్యమునకు లోబడినవారికి (సోమరితనముగల వారికి) పుణ్యప్రాప్తి గలుగదు శరీరక్లేశమును సహించి పరిశ్రమచేయు స్వభావము గలవారికి లభించును ఏలన, పాలను తఱచకపోయిన వెన్న బయలుదేరునా? మధించుటచేతనే లభించును చెఱకును గానుగలో వేపి నలపక పోయినచో రసముత్పన్న మగునా? ఆలాగున శరీరములో వ్యాపించియుండు, ఈశ్వర స్వరూపము లభించుటకూడ ప్రయత్నము వలననే సిద్ధించును. మహాధనమగు జ్ఞానము హృదయమును మధించుట వలననే పుట్టును సాగరమును మధించ నిచో అమృత ముత్పన్న మగునా? శుద్ధసత్త్వమగు హృదయమను ఈసాగర మందు నిశ్చల బుద్ధియగు మంధరపర్వతము నుంచి ఈశ్వరానుసంధానమను వాసుకిని కట్టి ధ్యానమను మధనము చేయవలెను అప్పుడే దైవామృతము లభించును దానివలన జననమరణ రూపమగు దుఃఖ ముపశమించును

సత్యేన లభ్యస్తపసా హ్యేష ఆత్మా
సమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యమ్!
అంతశ్శరీరే జ్యోతిర్మయో హి శుభ్రో,
యం పశ్యంతి యతయః క్షీణదోషాః!!

అనగా ''నశించిన పాపములు గలవారలును, సన్న్యాసులు

(పరమాత్మ స్వరూపానుసంధానమునకు ప్రయత్నించుచున్న వారలు) ఏ ఆత్మ స్వరూపమును చూచుచున్నారో, ఆ తేజోరూపమును, పరిశుద్ధమును అగు ఆత్మస్వ రూపము-ఎల్లప్పుడున్నూ సత్యముచేతను, తపస్సు చేతను, బ్రహ్మస్వరూప సాక్షాత్కార జ్ఞానముచేతను, బ్రహ్మచర్యము చేతను హృదయ పుండరీకమందు పొందదగినది '' మొదట కొంతకాలము, పైగుణములు గల్గియుండి తరువాత అవసరము లేదని శుష్కవేదాంతులు కొందరు చెప్పెడి వాక్యము సరికాదని నిరూపించుట కొరకు ఇచ్చట నిత్యశబ్దము ప్రయోగించియున్నారు కాన, పైజెప్పిన గుణములన్నియు దేహపతనము వరకు గల్గియుండవలెను

తిలమధ్యే యధా తైలం క్షీర మధ్యే యధా ఘృతమ్ ।
పుష్పమధ్యే యధాగంధః ఫలమధ్యే యధా రసః ।
కాష్ఠాగ్నివత్ప్రకాశేత ఆకాశే వాయువచ్చరేత్ ॥

నువ్వులందు నూనెవలెను, పాలయందు నేయివలెను, పువ్వుల యందు పరిమళమువలెను, ఫలములయందు రసమువలెను, కట్టెయందు అగ్ని వలెను ఆకాశమందు వాయువువలెను ఈ ఆత్మ దేహమందు ప్రకాశించు చున్నది కావున పుష్పము నుండి సుగంధమును, నువ్వుల నుండి నూనెను, పాలనుండి వెన్నను, ఫలమునుండి రసమును, అరణినుండి అగ్నిని ఏలాగున తగిన యుపాయములచే వెలుపరచుకొనవలెనో, అలాగున ఈదేహములో గల దేహిని అనగా ఆత్మజ్ఞానమును పైజెప్పిన తపస్సు, బ్రహ్మచర్యము, సమ్యక్ జ్ఞానము మొదలైనవానిచే ప్రత్యక్షము చేసికొనవలెను

పరిశ్రమను గుఱించి ఒక సంగతి చెప్పెద ఒక ఇంటిలో పదిమంది యుండిన ఒకరుగాని లేక ఇద్దరుగాని మాత్రము సంపాదించు దానిని అందరును భోజనము చేయుచు, తక్కినవారెవరును ఏమియును చేయక యుండిన అట్టి సంసార మేలాగున వృద్ధి నందగల్గును? పదిమందిన్ని పని చేయువారై యుండిన ఏలాగున అట్టి కుటుంబము వృద్ధి నొందగల్గునో ఆలాగున ఈ దేహములో అన్నియింద్రియములున్న పనిచేయునవిగా నుండిన, ఎంతో జ్ఞానధనమును సంపాదించుకొనవచ్చును, విజ్ఞానశాస్త్ర

పరిశోధకులు మెదడును పరిశోధించి ఒక కోటి పదిలక్షల జవసత్త్వఅణువులు అందు గలవనియు, వాటిలో మంచి పరిశ్రమ చేయగలవారిలో మాత్రము ఏదో ఒక వందగాని రెండువందలుగాని మెలకువ గలిగి పనిచేయుచున్నవనియు తక్కినవన్నియు నిద్రపోవుచున్నవనియు తెలుపుచున్నారు. ఇది శ్లోకములు చెప్పుటగాని శాస్త్రములలో గలదని అట్టహాసము చేయుటగాని కాదు ప్రత్యక్షముగ సైన్సు అనగా విజ్ఞానశాస్త్రము ఋజావు చేయుచున్నది చూడ దలంచువారు అట్టి పరిశోధకుల నవలంబించి చూచుకొనవచ్చును కనుకనే యోగవాసిష్ఠమున సోమరితనమును గూర్చి యీలాగున చెప్పబడినది

సీమానం సర్వదుఃఖానామాపదాం కోశముత్తమమ్ ।
బీజం సంసారవృక్షాణాం ప్రజ్ఞామాంద్యం వివర్జయేత్ ॥

సమస్త దుఃఖములకు పొలిమేరయు, ఆపదలన్నింటికి నిలయమును, సంసారవృక్షము లన్నింటికిని ఆకరమునునగు ఈ ప్రజ్ఞామాంద్యమును అనగా సోమరితనమును ప్రయత్నముచేత విడిచిపెట్టవలెను

ఇట్టి నిద్రపోవుచున్న జీవాణువులను మేలుకొలుపుటకు మన పూర్వీకులు యోగశాస్త్రమును కనిపెట్టిరి కనుకనే యోగముచే దివ్యశక్తి గలుగుననియు, గూఢతత్త్వము బయలుపడుననియు చెప్పెడు రహస్యము దీనిలో ప్రాణాయా మము చాలాముఖ్యమైనది అయితే మంచి అనుభవజ్ఞుల దగ్గర నుండి అభ్యసిం చుకొనవలెను. తపస్సున్ను అట్టి అణువులను నిద్రావస్థ నుండి జాగ్రదవస్థ లోనికి తెచ్చునదే నిర్మలమైన అనన్యభక్తియున్ను దీనిలో నిరంతర దైవచింతన అటువంటిదే యగును

అయితే అన్నిటికిన్ని ఆహారనియమమున్ను, అనుష్ఠాన నియమమున్ను తప్పక యుండవలెను ఇదే దీనిలోగల పరమరహస్యము ఎవ్వరైనను ఒక మూడు నెలలకాలము ప్రాణాయామము చేసి చూడుడు ఎంత నిర్మలత్వము ఎంత చురుకుదనము, ఎంత ఉత్సాహము గలుగుచుండునో మీరే గ్రహించు కొనవచ్చును కాని స్థలమున్ను ఆహారమున్ను సరిగా నుండవలయును అయితే ఈయానందములో, ఈ సుగుణసంపత్తిలో, ఈ యుల్లాసములో మునిగిపోయి ఆత్మను తెలిసికొనకపోయిన జన్మసాఫల్యము గలుగదు ఈశ్వర

కరుణ సంపాదింపకపోయిన నా సంతోష మంతయు నష్టమగును ఇదే యోగములో గల కీలకము, కావున దైవజ్ఞానములో దృష్టినుంచి యోగ మభ్య సింపవలెను లేనిచో భర్తృవియోగముగల స్త్రీకివలె నీకున్న దైవము నుండి ఆత్మనుండి వియోగము గలిగి దుఃఖించెడికాల మొకప్పుడు కలుగును ఇది జ్ఞాపకములో నుంచికొని యోగములో దిగవలెను

అట్లుకాని యోగికాని, యోగిని కాని అయినను చక్రవాక పక్షులలో భార్యావియోగము గలిగిన మగ పక్షియు, భర్తృవియోగము గలిగిన ఆడపక్షియు ఏలాగున దుఃఖముతో కూడి కాలము గడుపవలసియుండునో, దైవసాక్షాత్కారము గలుగని యోగుల గతియు నటువంటిదే యని జ్ఞాపకములో నుంచుకొనవలయును అట్టి సాక్షాత్కారము దైవభక్తిచేతను, జ్ఞానముచేతను, తపస్సుచేతను, ధ్యానము చేతను మాత్రమే గల్గును దానికి యోగము చాలా సహాయపడును యోగము బుద్ధ్యాది ఇంద్రియములను శుద్ధ పఱచి ఆనంద మయ కోశము వరకు వెళ్లును అవి ప్రకృతి యొక్క శుద్ధ భాగములు కాన వానికి శాశ్వతత్వము గలుగదు ఈ రెండవ వానిలో మీ యొక్క గురువు జీవితమున్ను, మీ పూర్వీక ఋషులజీవితమున్ను జ్ఞాపకము లోనికి తీసికొనిరావలెను వారియొక్క పరిశుద్ధ ఇంద్రియనిగ్రహము, శాంతము, కరుణ, నిరంతర పరిశ్రమ, తపస్సు, సాధుభావము, పుణ్యబుద్ధి మొదలగు అమూల్యమైన గుణములను మఱచిపోక హృదయములో నుంచు కొనవలెను ఇదిన్ని మీ పురోఽభివృద్ధికి చాలా ఉపయోగము గల్గజేయును

కుచేలమహామునికి మహదైశ్వర్యము గల్గినను తనయొక్క పూర్వ వృత్తాంతము మఱువక బీదరిక జీవితమున తపశ్చర్యయును నిరంతర శ్రీమన్నారాయణచరణారవింద అనన్యభక్తియున్ను మఱుపు కలుగనీయక వర్తించినందుచే, ప్రకృతి అమ్మహాత్ముని ఆత్మను ఆవరించకయుండుటచే నాతడు జీవన్ముక్తిపదవి నందెను నహుషుడను రాజు స్వర్గలోకమున ఇంద్రుని స్థానము గల్గినప్పుడు తన పూర్వపు ధర్మబుద్ధియు, సౌశీల్యమున్ను మఱచి ప్రవర్తించినందుకే ఋషుల శాపమువలన స్వర్గలోకము నుండి భూలోకము లోనికి అజగరమై పడిపోయెను ఈ కథలను జ్ఞాపకము చేసికొనిన ఎవరికి

ఎప్పుడున్ను పతనము గల్గదు ఇప్పుడున్న తక్కువ బుద్ధిగల కొందరు ఉన్నత ఉద్యోగము వచ్చినను, లేక ఉన్నతమైన మఠాధిపతుల పీఠము లభించినను తమ పూర్వసంగతిని మఱచి ప్రవర్తించుటచేత పతన మొందుచున్నారు

ఇట్టి దురవస్థలు కొన్నిటిని ప్రత్యక్షముగ చూచుచున్నాము ఆత్మ విషయములో నీవు శూరుడవై, ధీరుడవై, శుద్ధుడవై యుండిన మాత్రమే నిన్ను మోక్షలక్ష్మియు, వైరాగ్యలక్ష్మియు, జ్ఞానలక్ష్మియు, యోగలక్ష్మియు, ముక్తి కాంతయు వరించును అట్లైన మాత్రము నీవు మోక్షసామ్రాజ్య పట్టాభిషిక్తుడవై ప్రకాశింపగలవు ఈచెప్పినవారికే పంచకన్యకలని పేరు పట్టాభిషిక్తుడు కావలసి యున్న రాజ్యలక్ష్మి వరించవలెను అట్లు కానివారికి పట్టాభిషేకము గలుగదు. కావున పైజెప్పిన పంచకన్యకలుగాని లేకవారిలో యొకతెగాని నిన్ను వరించ వలసియుండిన నీవు ధీరోదార విరాగగుణములు గలిగియుండవలెను ఆ కన్యలు సామాన్యలుకారు సుమీ! మహాధీరశూర గుణోపేతుడగు చక్రవర్తి కొమార్తెలు పిరికిపందను వరింతురా? మహోదార శూరధీర గుణములుగల రాచకొమరుని మాత్రమే వరింతురను సంగతి నీవు జ్ఞాపకములో నుంచు కొనవలెను లేనిచో ముక్తికాంత నిన్ను వరింపజాలదు ఆ దివ్యకన్యక వరించనిచో నీకు మోక్షపట్టాభిషేము జరుగదు కాన దానికి తగిన ధీరోదార విరాగము లన్నిటిని గలుగ చేసికొనుము తీవ్ర వైర్యాగమున్ను , నిరంతర ఈశ్వర నిష్ఠయున్ను గలిగియుండేలాగున చూచుకొనుము.అది స్వయం వరణము, మీ సుగుణములన్నియు, తపస్సులన్నియు, వైరాగ్యము లన్నియు, ఆకాశవీధిలో శరచ్చంద్రికవలె ప్రకాశింపవలెను మీ యొక్క శాంతము, కరుణ, ప్రసన్నత, వనములో వసంతకాలమువలె శోభించుచు, సుగంధ పుష్ప వాసన లవలె ప్రపంచమంతటను వ్యాపించుచుండవలెను మీ యొక్క నిర్మల జీవిత మును గురించి రాజగృహములలోను, అంతఃపురములలోను, పల్లెలందును, పట్టణములందును, బీదలు వసించు స్థానములందును వసంత కాలములో కోయిల కూయుచున్నట్లు లోకము గానముచేయవలెను

ఈ విషయమై నీవేమియు చేయనక్కరలేదు నీయొక్క దైవభావము మఱువక శమదమాది గుణములను విడనాడక గురుభక్తియు దైవభక్తియు

సదా గలిగియుండిన చాలును ఇట్టి స్థితి నీవు గోరనక్కరలేదు అప్పుడు పుష్పములో గల సుగంధవా యువు దశదిశలు వ్యాపించునట్లు అవ్యక్తమగు ఆ ప్రకృతి మాతయే అంతయు వ్యాపకము చేయును అప్పుడు మోక్షరాజ గృహాంత రాళమున నుండు ముక్తికాంతల కర్ణపుటములలో నీయొక్క శాంత శమదమాది గుణములును జ్ఞానమున్ను వినవచ్చును అచ్చట నుండి ముక్తి కాంత, జ్ఞానలక్ష్మి మీ స్వయం వరమునకై మీయొక్క తపోవనములోనికి రావలసి యుండును సుమీ!

3 ఇంత వరకు చెప్పినవిషయము లన్నియును పురోఽభివృద్ధియొక్క బహిరంగములు. అయితే బహిరంగములని తలంచి అవి నిస్సారములని యుపేక్షించరాదు దేహమునకు ఆరోగ్యము లేనిచో దేహి యేలాగున సౌఖ్యము నొందజాలదో, అలాగున సమస్త విషయములలోను బహిరంగములు కూడ మనకు ముఖ్యములని తలంచవలెను ఇప్పుడు పురోఽభివృద్ధిని గోరువారు గ్రహించవలసిన సంగతిలో మూడవస్థితిలోనికి ప్రవేశింతము ఇది అనాదియగు జీవునిగురించిన విషయము ఇదే పురోవృద్ధిని గోరుజీవులు గ్రహించుకొన వలసిన సంగతులలో ముఖ్యమైనది దీనిని మఱచినందుచేతనే జీవకోట్లు అజ్ఞాన మోహసముద్రములో మునుగుచున్నారు ఈజీవచైతన్యము ఆనంద స్వరూపము, శివము, ప్రకాశము, జ్ఞానము

అట్లుండియు అజ్ఞానము ఆవరించినందుచే ఏలాగున నాచుచే ఆవరింపబడిన సరోవరము యొక్క స్వచ్ఛజలము కనుపించక పోవుచున్నదో, ఈ ఆత్మయొక్క స్థితియు అటు వంటిదే అగుచున్నది నాచును తీసివైచిన నిర్మలోదక మేలాగున కనుపించునో, అలాగున ఆత్మను ఆచ్ఛాదించుచుండు ఆవరణమును తొలగించిన శివమై జ్ఞానమైయుండు స్వరూపమును జూడగలము శ్రుతి స్మృతులన్నియు ఆత్మ దేహేంద్రియ మనస్సులకు విలక్షణమై, స్వయం ప్రకాశమై ఉండుననియే చెప్పుచున్నవి అట్టి స్వరూపము తెలిసికొనునప్పుడు గలుగు ఆనందమున్ను, ధైర్యమున్ను అపారమైనదే

'తదేతత్సత్యం యథా సుదీప్తాత్పావకా

ద్విస్ఫులింగా స్సహస్రశః ప్రభవంతే సరూపాః ।

తథా౽క్ష రాద్వివిధా సోమ్యభావాః
ప్రజాయన్తే తత్ర చైవాపి యన్తి ॥

అనగా ఈ చెప్పబోవు అక్షరవిషయము సత్యమయినది ''బాగుగా మండుచున్న అగ్ని నుండి వేలకొలది సమానరూపములు గల అగ్నికణములు ఎట్లు పుట్టుచున్నవోఅట్లే సౌమ్యుడా! నాశరహితమగు పరబ్రహ్మమునుండి నానా విధములైన జీవులు పుట్టుచున్నారు మరల నాయక్షరమగు పరబ్రహ్మము నందే లీనమగుచున్నారు అని ముండకశ్రుతి చెప్పుచున్నది దీనియందు మనము తెలిసికొనదగిన విషయమొకటి కలదు అదేమన అగ్నిగుండము నుండి వెడలుచుండు ఒక కణమును దూది మొదలగువానిలో నుంచి వెలి గించుటకు మొదట చిన్నచిన్నపుల్లలువేసి తరువాత పెద్దకట్టెలు వేసిన ఏలాగున కార్యరూపమగు ఈమిణుగురు కారణరూపుడగు అగ్నిహోత్రుని వలె ప్రకాశించునో, ఆలాగున సాక్షిచైతన్యమగు ఆత్మను బ్రహ్మచర్యము, తపశ్చర్య మొదలగువానిచే వృద్ధిపరచిన పూర్ణస్వరూపమగు ఈశ్వరసాక్షాత్కారావస్థను పొందగలము ఇందువలన జీవకోట్లన్నియు ఈశ్వరాంశములని సిద్ధమగు చున్నది ఓహో, ఇట్టి జ్ఞానము గలిగిన యెంతయో ధైర్యమున్ను, ఆత్మ వికాసమున్ను గలుగుచుండునుగదా! ఈ అర్థమునే శ్రీకృష్ణభగవానులు గీత యందు

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షే త్రేషు భారత ।
క్షేత్ర క్షేత్ర జ్ఞయోర్జ్ఞానం యత్తద్జ్ఞా నం మతం మమ ॥

అను శ్లోకమున తెలియబరచిరి, అనగా ఓ అర్జునా! సమస్త జీవకోట్ల యందు వెలుగుచుండు ఆత్మవస్తువు నా స్వరూపమని తెలిసికొనుము ఈ శరీరముయొక్కయు, సాక్షిచైతన్యమగు ఆత్మయొక్కయు, యధార్థ స్వరూ పము తెలిసికొనుటయే జ్ఞానమని భగవాను లుపదేశించిరి ఇకను ''మమె వాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'' అని భగవంతు డుద్ఘోషించెను, ఓ అర్జునా! ఈ జీవకోట్లన్నియు నాయొక్క అంశములు నేనేలాగున సనాతన స్వరూపము గల్గియున్నానో ఆలాగున ఈ జీవకోట్లన్నియు సనాతనములే కావున పురోవృద్ధిని గోరువారందరున్ను తమ ఆత్మను తెలిసికొన యత్నించ

వలయును తండ్రియగు రాజు చనిపోయిన బాలుడగు యువరాజు మైనరు కాలమున రాజ్యపరిపాలన చేయువారు సరిగా లేనందుచేతను, మంత్రులు మొదలగువారు చక్కగా చూడకపోవుటచేతను రాజ్యమేలాగున హీనస్థితికి వచ్చునో, ఈ సంగతులన్నియు తెలిసిన రాకొమరుడు, మైనరుకాలము పోయినవెంటనే రాజ్యమును స్వాధీనపరచుకొని చక్కగ పాలించునో, అందు వలన రాజ్యమేలాగున అభివృద్ధినొందునో, జీవుని యొక్కస్థితియున్ను అటువం టిదే కావున నిత్యమై శుద్ధమైయుండు ఆత్మస్వరూపమే మన అందరి స్వరూప మని తెలిసికొనవలెను

ఒక వేళ కర్మలచే మాలిన్యము నందినను, మురికిబట్టను ఏలాగున చాకలివారు శుద్ధముచేయు చుందురో ఆలాగున తపస్సు, దైవవి చారము, ధర్మప్రవృత్తి మొదలగు వానిచే ఆత్మను శుద్ధపరచుకొనవలెను ఇదే మీ అందరియొక్క పూర్వవృత్తాంతమును తెలిసికొనవలెనని చెప్పినదాని కర్థము అప్పుడు పైభాగమున త్రుప్పు గలిగియుండు రత్నమును సామాన్యమగు రాయిగా తలంచియుండునప్పుడు ఆప్త వాక్యముచే 'అది రాయికాదు మాణిక్య రత్నము పైభాగములోగల మాలిన్యము, శుద్ధపరచి చూడు'' అని చెప్పిన తరువాత ఆలాగున చూచునప్పుడెంత మార్పుగలుగునో, అట్లే ఆత్మ యొక్క యధార్థజ్ఞానము గల్గునప్పుడు అంతమాహాత్మ్యము, మహిమయు, ఆనందమును గల్గును, లేక మట్టిలో పడియుండిన బంగారు ముద్దనుజూచి అదియేమోయని తలంచి చూడక యుండునపుడు ఆప్తపురుషుడు అది మట్టిముద్ద గాదు, సువర్ణమని తెలిపిన తరువాత కడిగి శుద్ధపరచి చూచి నప్పుడు బంగారుగనే యుండును ఆలాగున ఈదేహమున్ను, కులమున్ను, గోత్రమున్ను చూచి ఆత్మయొక్క మహిమను తెలిసికొనజాలక జీవులు నిజస్వరూపము నెఱుంగకయున్నారు. కావున పూర్వవృత్తాంతమును తెలిసి కొనుట ఇటు వంటిదేయగును

ఇట్టిఆత్మమాహాత్మ్యమును తెలిసికొను అవస్థ యొకనికి గల్గిన, భిక్షకారుడైన వానినొక రాజ్యమునకు ప్రభువు గజేసిన యెంత మార్పు గల్గునో, కించిద్జ్ఞుడగు జీవునకున్ను అట్టి అవస్థ గల్గును ఇట్టి స్థితి గలుగుటకు

గురువున్ను, శాస్త్రమున్ను, ఈ శ్వరుడున్ను నిమిత్తమాత్ర కారణములే యగు దురు జీవుడు తనయొక్క పరిశుద్ధమైన నిరంతర ప్రయత్నముచేతనే అట్టిస్థితికి రాగల్గును ఈయాత్మ స్త్రీయున్ను, పురుషుడున్ను, నపుంసకుడున్ను గాడు స్త్రీ పురుషాదిభేదములన్నియు ఈస్థూలదేహమునకు మాత్రమే గలుగు చుండును సూక్ష్మ శరీరమగు లింగదేహమునకుగాని, కారణదేహమగు అవిద్యాదేహమునకుగాని ఇట్టిభేదము లేదు అప్పుడు ఈమూడింటికి విలక్షణమై యుండు స్వయం ప్రకాశాత్మను గూర్చి మరల చెప్పవలెనా? పురుష శబ్దము కూడ ఈ ఆత్మకు అష్టపురీక మందుండుటచేతనే వచ్చినది లేక, ఆత్మ పూర్వస్వరూపుడై యుండుటచే అట్టిపేరు వచ్చినదేగాని, స్త్రీ పురుషభేదము గలిగినందులచే గాదు

వాగాది పంచ శ్రవణాది పంచ ప్రాణాదిపంచాభ్రముఖాని పంచ ।
బుద్ధ్యాద్యవిద్యాపి చ కామకర్మణీ పుర్యష్టకం సూక్ష్మశరీరమాహుః ॥

అనగా వాగాది కర్మేంద్రియము లైదును, శ్రవణాది జ్ఞానేంద్రియములున్ను, పంచప్రాణములున్ను, పంచతన్మాత్రలున్ను, బుద్ధియు, అవిద్యయు, కామము, కర్మముఅను ఈయెనిమిదిన్ని కూడియుండు సూక్ష్మశరీరమును పుర్యష్టకమని చెప్పుదురు ఆత్మ దానియందుండుట వలన పురుషుడని పేరు వచ్చినది ఆత్మయొక్క బోధ గల్గునప్పుడు మానవ జీవితముయొక్క పరిణామము మారుచుండును అప్పుడే సోదర వాక్యము సార్థకమగును అపుడు ఆత్మ ఈశ్వరాంశమని చెప్పెడు శ్రుతివాక్యము సఫలత నొందగల్గును అప్పుడు మాత్రమే తాను శుద్ధుడనియు, స్వయంప్రకాశుడనియు చెప్పెడు వేదవాక్యము సాధువగును సువర్ణము నుండి యేర్పడిన అణువులు సువర్ణముగా నుండు నేగాని అన్యముగానట్లు ఈశ్వరాంశ సంభూతులగు జీవులుగూడ ఈశ్వర గుణముగలవారను జ్ఞానము, జ్ఞాపకములోనికి వచ్చును

గొప్పదగు వటవృక్షమునుండి యుద్భవించిన సన్నని బీజము లేలాగున మరల మహత్తరములగు వృక్షము లగుచుండునో, ఆలాగున సూక్ష్మ రూపముగా నుండు ఈయాత్మయు అనుష్ఠానముచే పూర్ణత్వము నొంద గల్గును అపుడే, 'పూర్ణత్వాత్ పురుషః' అను వేదమాతయొక్క వాక్యమును

సాఫల్యము నొందించిన సుపుత్రులము మనము గాగలము అపుడే తల్లి దండ్రుల యొక్క ఋణమును తీర్చిన సుపుత్రులవలె వేదమాతయొక్క ఋణమును నివర్తింపజేసిన సత్సంతానము కాగలము అపుడు దుఃఖములేని నిరతిశ యానందము గల్గును

బీజము వృక్షముగా పరిణమించుటకు పృథివ్యాది పంచభూతముల అనుకూల్యమేలాగున నుం డవలెనో, అలాగున ఈజీవుడు గూడ బంధము నుండి విముక్తిని పొంది తన పూర్వ సౌఖ్యమును పొందగల్గుటకై పంచశీలమను అనుష్ఠానపంచకము నభ్యసించుకొన వలయును అది 1 నిరంతర ఈశ్వర విచారము 2 ఆత్మయొక్క యాథార్థ్యము తెలిసికొనుట 3 హృదయము నెల్లప్పుడును నిర్మలముగానుంచుట 4 బ్రహ్మచర్య వ్రతమును చక్కగ ఆచరణ యందుంచుట (ఇది గృహస్థబ్రహ్మచర్యమైనను సరే) 5 ఆహారనియమము గలిగియుండవలె ననుటయే పృథివి, అప్పు తేజస్సు, వాయువు, ఆకాశమనెడు పంచభూతములలో దేనియందైన కొరతగలిగినచో తరువులేలాగున పెరుగజాలవో, ఆలాగున నీ పంచశీలములలో దేనియందైన లోపము గలిగిన, జీవుడు తన పూర్ణావస్థను బొందజాలడు

మరల ఎప్పుడు అనగా ఈజన్మలోగాని మరి యొక జన్మలోగాని ఈశీలపంచకము సమావస్థకు వచ్చునపుడు మాత్రమే జీవునకు ముక్తియు, పూర్ణత్వమున్ను గలుగును అంతవరకు సంసారమను కాలచక్రములో పుణ్యపాపకర్మల ననుసరించి ఉచ్చనీచజన్మల నంది ఇహపరలోకములకు ఘటీ యంత్రమువలె తిరుగుచుండవలెను ఎచ్చటను అంతవరకు నిలకడ అనునది గలుగదు దుఃఖములేని స్థితికూడ సిద్ధింపదు

ఇత్తరి దైవభక్తి యొకటి మాత్రమే జీవునకు రక్షకమై యుండును కావున ఇట్టి పరిశుద్ధమగు దైవభక్తిని సంపాదించుటకు చూడవలయును అట్టి భక్తియను తైలమే ఆనందమను బ్రహ్మజ్ఞాన ప్రకాశమును గలుగజేయును అట్టి భక్తియను సుగంధశోభాయమాన కుసుమమే బ్రహ్మజ్ఞానమను పరిపక్వ ఫలము నుద్భవింపజేయును అప్పుడు మీరు ఆనంద స్వరూపులనియు అమృత స్వరూపులనియు చెప్పెడు వేదవాక్యము యొక్క అర్థమును తెలిసికొన

గల్గుదురు

ఆనన్దో బ్రహ్మేతి వ్యజానాత్

ఆనన్దాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే ।

అనన్దేన జాతాని జీవన్తి

ఆనన్దం ప్రయన్త్యభిసంవిశ న్తీతి ॥

అనగా ఆనందము బ్రహ్మస్వరూపమని తెలిసికొనెను ఈ భూతములు ఆనందమునుండియే పుట్టుచున్నవిగదా! పుట్టిన భూతములు ఆనందముచేత బ్రతుకుచున్నవి ఆనందమునుగూర్చి పోవుచున్నవి అంతట ఆనంద స్వరూపమే యగుచున్నవి

సైషా భార్గవీ వారుణీ విద్యా పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా ।

య ఏవం వేద ప్రతితిష్ఠతి అన్నవానన్నాదో భవతి ।

మహాన్ భవతి ప్రజయా పశుభి ర్బ్రహ్మవర్చసేన మహాన్కీర్త్యా ॥

అనగా వరుణునిచేత జెప్పబడినదియు భృగువుచే దెలిసికొన బడినదియు ప్రసిద్ధమునగు ఈబ్రహ్మవిద్య శ్రేష్ఠమగు ఆకాశమందు (హృదయాకాశమందు) ఉంచబడియున్నది ఎవడు ఈ ప్రకారము తెలిసికొనుచున్నాడో, వాడు ఆ పరబ్రహ్మమందు ప్రతిష్ఠింపబడుచున్నాడు అన్నము గలవాడును, ప్రకాశమగు అగ్ని గలవాడును అగుచున్నాడు శిష్యుల చేతను గవాశ్వాది పశువులచేతను బ్రహ్మతేజస్సుచేతను గొప్పవాడును, ఖ్యాతిచేతను అధికుడును అగుచున్నాడు

ఈపై దెల్పిన తైత్తిరీయశ్రుతి వాక్యమువలన బ్రహ్మనిష్ఠులకు అదృష్ట మగు మోక్షఫలము మాత్రము గలుగునదియే గాక దృష్టమగు సర్వసౌఖ్యములు కూడ అప్రయత్నముగ గల్గునని నిరూపించడమైనది ప్రత్యక్ష ఫలము కనుపించనిచో ఆ ప్రత్యక్ష స్వర్గసౌఖ్యముగాని, దైవలోక ప్రాప్తిగాని, ముక్తిగాని కలుగగలదని నమ్మకము లేకపోవచ్చును అయితే స్వర్గఫలమువలె మోక్షసౌఖ్యము అదృష్టము గాదు అది జీవించి యున్నప్పుడే అనుభవించెడు ప్రత్యక్షఫలము అట్లు కానిచో పరోక్షజ్ఞానమని శ్రుతి చెప్పునుగాని అపరోక్ష జ్ఞానమని చెప్పజాలదు ఇట్టి శాశ్వతమగు దివ్యసుఖము భక్తిచేత గలుగవలసి

యుండును

నాఽయమాత్మా ప్రవచనేన లభ్యో
న మేధయా న బహునా శ్రుతేన ।
యమేవైషవృణుతే న లభ్య
స్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్ ॥

అనగా ఈ ఆత్మస్వరూపము వేదశాస్త్రాధ్యయ నాధ్యాపనముల చేతగాని, గ్రంధార్ధధారణాశక్తి రూపమగు మేధచేతగాని, అనేక శాస్త్ర శ్రవణము చేతనైననుగాని పొందశక్య మయినది కాదు ఈ విద్వాంసుడు ఏ పర మాత్మను పొందుటకు ఇచ్ఛగించుచున్నాడో, ఆ ఇచ్ఛచేతనే పొందదగినవాడు ఈ ఆత్మ స్వకీయమైన స్వరూపమును వానికి ప్రకాశింపజేయుచున్నది అనగా నిరంతరేశ్వరధ్యాన మొకదానిచే మాత్రమే జ్ఞానప్రాప్తి గల్గును ఈ విషయములో చదివినవారును, చదువు లేనివారున్ను సమానులే అని ముండ కోపనిషత్తు చెప్పుచున్నది ఇట్టి వాక్యమునే శ్రీకృష్ణభగవానులు గీతయందు తెలిపియున్నారు

నాహం వేదైర్నతపసా న దానేన న చేజ్యయా ।
శక్య ఏవం విధో ద్రష్టుం దృష్టవానసి మాం యధా ॥
భక్త్యాత్వనన్యయా శక్య అహమేవం విధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥

అనగా ' ఓ అర్జునా! నన్ను ఏ విధముగ నీవు చూచితివో, ఇట్టి స్వరూపము గలవాడనగు నేను ఇతరులచే వేదములచేతను (వేదాధ్యయనము చేసిన వారిచేతను), ఘోరతపస్సుచేతను, దానములచేతను, యజ్ఞాది కర్మముల చేతను సాధ్యుడను కాను ఇట్లు విశ్వరూపియైన నేను స్థిరమైన భక్తి చేతనే (భక్తి కలిగిననే) యధార్థముగ శాస్త్రములనుబట్టి తెలిసికొనుటకును, చూచుటకును, నాలో నైక్యము నొందుటకును, శక్యుడను అగుచున్నాను'' అని తాత్పర్యము ఈ శ్లోకమువలన, నిరంతర సర్వేశ్వరధ్యాన మొకటియే ఈశ్వరదర్శనమునకును, ఈశ్వరజ్ఞానమును పూర్తిగ తెలిసికొనుటకును, ఈశ్వరైక్యస్థితి గలుగుటకును కారణమైనదని తెలుపడమైనది అట్టి అనన్య

మగు దైవభక్తి యొక్క స్వభావము, భర్తృహరి యీలాగున వర్ణించి యున్నాడు

స్ఫురత్ స్ఫారజ్యోత్స్నా ధవళితతలే క్వాపి పులినే
సుఖాసీనా శ్శాంత ధ్వనిషు రజనీషు ద్యుసరితః ।
భవాభోగోద్విగ్నా శ్శివశ్శివశివేత్యుచ్చవచనః
కదా యాస్యామోఽన్తర్గత బహుళబాష్పాకులదశామ్ ॥

అనగా 'విరామమును పొందిన యొక ధ్వనులు కలిగినటువంటి రాత్రుల యందు ప్రకాశించుచున్నదియును, మిగుల నధికముగ వృద్ధి పొంది నదియును అయిన వెన్నెలచేత తెల్లగా జేయబడిన ఆకాశగంగ యొక్క యొకా నొక ఇసుకతిన్నెయందు సుఖముగా గూర్చున్నవారమై మేము శివశివశివయని ఉచ్చైస్స్వరముతో ఉచ్చరించుచున్నవారమై అంతః కరణమునందలి నియమవశ మున అణగిన కన్నీళ్ళచేత వ్యాకులమైన స్థితిని నెప్పుడు పొందుదుమో।'' మరియు,

కిం వేదైస్స్మృతిభిః పురాణపఠనై శ్శాస్త్రైర్మహావి స్తరై
స్స్వర్గగ్రామకుటీనివాసఫలదైః కర్మక్రియావిభ్రమైః ।
ముక్త్వైకంభవదుఃఖభారరచనా విధ్వంసకాలానలం
స్వాత్మానందపదప్రవేశకలనం శేషైర్వణిగ్వృత్తిభిః ॥

అని కూడ భర్తృహరి చెప్పియున్నాడు అనగా,'వేదములను చదువుట వలనగాని, స్మృతుల నాలోచించుటవలనగాని, పురాణములను పఠించుటవలన గాని, మిగులవిస్తారములగు తర్కవ్యాకరణాది శాస్త్రములను అభ్యసించుటచే గాని, స్వర్గవాసము, గ్రామనివాసము, పర్ణశాలలయందు నివసించుట మొదలగువానిచేతను, కర్మలచేతను, విలాసములచేతను, ప్రయోజనము లేదు అవి అన్నియు వర్తకవ్యాపారముల వంటివి సంసారదుఃఖమును నశింపచేయు నట్టిదియు, ఆత్మానుభవమును గలుగజేయు నట్టిదియును అయిన బ్రహ్మ నిష్ఠచే తనే సకల లాభములు నిరాటంకముగ గల్గునని తాత్పర్యము, అనగా నిట్టి బ్రహ్మనిష్ఠ యొక దాని చేతనే ముక్తి సిద్ధించును

ఇక మనము దీనియొక్క నాల్గవ అర్థములోనికి ప్రవేశించవలెను అప్పుడు మాత్రమే పురోవృద్ధిని గోరువారు పూర్వవృత్తాంతము మఱువ

కూడదను అర్థము లెస్సగ తెలిసికొనగలము అట్టిస్థితికి వెళ్ళునప్పుడు ఇంతవరకు చెప్పినవన్నియు సామాన్యములేగాని విశేషములని తోచవు అపుడే 'సదేవసోమ్య దమగ్ర ఆసీత్' 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' అను శ్రుతి వాక్యము బోధకమగును ఈ సృష్టికి ముందుగ నామరూపరహితమైన సద్వస్తువగు బ్రహ్మము మాత్రమే యుండెను అందరియొక్క ఆత్మయు, ఆసద్వస్తువగు బ్రహ్మమయముగానే యున్నది అనేకపాత్రలలో ప్రతిబింబించిన సూర్య చంద్రుల బింబమేలాగున ఒకే విధముగ నుండునో ఆలాగున అందరి హృద యాంతరాళములో వెలుగుచున్నది ఆసద్వస్తువగు బ్రహ్మమేగాని వేఱుకాదు ఇట్టి జ్ఞానము బోధము గల్గునపుడే మృత్యువుతో కూడిన మర్త్యులు అమృతులు గాగల్గుదురు

సముద్రమునుండి గల్గిన కెరటములు, బుడగలు, తుంపరలు మొదలగున వన్నియు సముద్రజలమున కన్యము గానట్లు ఈజీవకోట్లన్నియు ఈశ్వరస్వరూపమున కన్యములు కానేరవు ఇట్టి తత్త్వబోధము గల్గునపుడే మీరు ఈశ్వరజ్ఞానమును పొందుట కర్హులను ధీరత్వముగల వారగుదురు అట్టి బోధముగానిచో డ్రామా(కంపెనీ)లలో మానవుడు ఏయేవేషములు ధరించునో అప్పుడు మానవత్వము మఱచి, వేషముయొక్క ఆకృతి ననుసరించి వర్తించునట్లు దైవభావము మరుగుపడి దయ్యపుభావము మొదలగు వానిచే నావేశితుండై మాయకు లోబడుచున్నాడు అనగా ప్రకృతియొక్క వికృతికి వశుడై, తన ఆశ్రమమో, నామమో, రూపమో, కులమో గ్రహించి ఇట్టి అవస్థలకు అధీనుడగుచున్నాడు

సువర్ణమునుండి కల్గిన ఆభరణము లన్నియు సువర్ణరూపముగనే యున్నట్లు ఈశ్వరస్వరూపమునుండి గల్గిన ఈజీవులందరు ఈశ్వరమయులై యున్నారు ఇట్టి బోధము కలిగినమాత్రమే భవబంధమునుండి విముక్తి గల్గును అంతవరకు బోనులోపడిన సింహమువలె దుఃఖము నొంద వలసినదే వలలో చిక్కుకొనిన పక్షులవలె తాపము ననుభవింప వలసినదే ఇట్టి సంకటము నుండి విముక్తి కలుగజేయునదియే ఆత్మబోధము, లేక ఆత్మజ్ఞానము, లేక బ్రహ్మవిద్యయని మనము తెలిసికొనవలెను ఒక కొయ్యనుండి చేయబడిన

అనేక రకముల బొమ్మలు పక్షులు, మృగములు, దేవతలు మొదలైనవన్నియు ఆదారువునకు అన్యము గానట్లు సద్వస్తువగు పరబ్రహ్మము నుండి గలిగిన బ్రహ్మాది దేవతలు, ఇంద్రాది దేవగణములు, అసురులు, మానవులు మొదలగు వారందరును ఆసద్వస్తువగు దైవమునకు అన్యులు కారు ఒకలోహముచే అనేక చిత్రవిచిత్రములగు యంత్రములు, ఆయుధములు మొదలగునవి చేయ బడునపుడు, వేఱువేఱుగా కనుపించినను, విచారబుద్ధితో జూచిన ఏలాగున లోహమయముగా నుండునో ఆత్మదృష్టితో శుద్ధాంతఃకరణముతో, జ్ఞాన భావముతో చూచిన ఈజగత్తంతయు చిత్రవిచిత్రములుగా కనుపించినను ఏకైక వస్తువు దైవమయముగా నుండును అపుడు నాయందును, మీ యందును మనము పాపించు దైవమునందును ఒకే సద్వస్తువును గనుగొనగలము

లవణమున కాధారమగు సముద్రమునందు ఉప్పుకల్లు పరిశోధ నార్థము ప్రవేశించిన, ఏలాగున తనరూపమును వదలి జలమయమగునో, అలాగున ధ్యాతయగు జీవుడు ధ్యేయమగు దైవములోనికి ప్రవేశించిన, ధ్యాతృత్వము నశించి ధ్యేయమగు భగవన్మయముగా మారిపోవును అంత వరకు అగాధ ధ్యానములోనికి వెళ్ళకపోవుటే ఏకత్వము నందకపోవటకు కారణ మగుచున్నది అగ్నిలోనికి ప్రవేశపెట్టిన తైలముగాని, కర్పూరముగాని, మైనపువత్తిగాని ఏలాగున అగ్నిమయముగా కొంచెమైనను శేషింపక, జ్వాలా కారముగ రగులుచుండునో, ఆలాగున పరంజ్యోతియై వెలుగుచుండు పరశివ వస్తువులోనికి శుద్ధాత్ములగు జీవులు ధ్యానముచేత ప్రవేశించిన, జీవత్వము నశించి స్వయం ప్రకాశమగు శివత్వము నొందుదురు

అట్టి ఆప్తవాక్యమును గ్రహింపనందు చేతనే ఈశ్వరైక్యమగు ధ్యానములో ప్రవేశింపనందుచేతనే, దివ్యజ్యోతియగు యీశ్వరప్రకాశము నుండి జీవకోట్లు దూరులగుచున్నారు ఒకే దూదిచేత గలిగెడు అనేక రక ములగు వస్త్రములు, షరాయిలు, టోపీలు, చొక్కాలు వేఱువేఱుగా కనిపించి నను యథార్థముగ విచారించిన ఒకేదూదిగా ఏలాగున నుండునో, ఆలాగున తత్త్వదృష్టితో జూచిన మీ ఆత్మయు నా ఆత్మయు నొకే యీశ్వరమయముగ గనందగును ఇట్టి స్థితి గలుగుటకే సమ్యక్ జ్ఞానమనియు దివ్యదృష్టి

యనియు, దివ్యజ్ఞానమనియు పేరు గొప్పదగు నొకశిల యందు ఒక ప్రక్క రాజు, మంత్రులు, భృత్యులు మొదలైనవారున్ను, ఇంకొక ప్రక్క అనేక విధములగు జంతుసముదాయమున్ను, మఱియొక ప్రక్క అగణితములగు పక్షివర్గమున్ను, వేఱొకప్రక్క అనేక వృక్షసమూహములున్ను, ఇంకొక ప్రక్క దేవతలును, వేఱొకప్రక్క అసురులు మొదలైనవారును చెక్కబడినపుడు స్థూలదృష్టితో జూచునప్పుడు వేఱు వేఱు గుణములున్ను, రూపములున్ను, నామములున్ను కనుపించినను సూక్ష్మదృష్టితో జూచిన అవి అన్నియు ఒకటే శిలామయముగా నెట్లుండునో, కొంచెమైనను భేదమెట్లు గలిగియుండవో అలాగున నాత్మదృష్టితో చూచిన వన్ని యు ఆ సద్వస్తువగు దైవమయముగానే యుండును అట్టిదృష్టి నవలంబించుకొనవలెను ఇదే మిమ్మెలను దైవప్రాప్తి నొందించునది

ఇప్పుడు జెప్పినవానిలో విశేష వాక్యములున్ను సామాన్య పరిణామమును గూర్చి చెప్పబడినవే వివర్తవాదదృష్టితో జూచిన ఇట్టి పరిణామావస్థ కూడ గల్గక ఆసద్వస్తువగు బ్రహ్మమే చిద్ఘనమై, ఆనందమై, అమృతరసమై యెల్లకాలము ఏకరూపమై వెలుగుచున్నది ఇదే 'తత్త్వమసి'యను సామవేదసారమగు ఛాందోగ్యో పనిషత్తు తెలుపుచున్నది ఇట్టి మహావాక్యశ్రవణము ముముక్షువులందరును, జిజ్ఞాసువు లందరున్ను చేయవలసి యున్నది

దీనికి సాధన చతుష్టయు సంపత్తిగల ప్రతిమానవుడున్ను, ప్రతిస్త్రీయు, ప్రతి పురుషుడును అర్హులై యున్నారు పరమేశ్వరుడొసంగిన ప్రాణ వాయువును పీల్చుటకున్ను, సూర్యప్రకాశములో సంచరించుటకున్ను, ప్రశాంత చంద్రికలో విహరించుటకున్ను సర్వులును ఏలాగున అర్హత గల్గియున్నారో, ఆలాగున పరమ కారుణికుడగు ఈశ్వరుడు జీవకోట్ల జ్ఞాన సౌఖ్యము కొరకొసంగిన దైవవిచారము గలుగజేసికొనుటకు అందరున్ను అర్హులైయున్నారు అట్టి దైవజ్ఞాన మొక దేశములోగాని, ఒక స్థలములోగాని, ఒక లోకములోగాని, ఒకరి హద్దులో గాని ఉండక ఒకరిదిగాని గాక పరమాణువు నుండి పరమేశ్వరుని వరకు అన్నిటిలోను వ్యాపించి మీ

హృదయములో వెలుగుచు, మీ ఆత్మయైయుండి మీరేయె యున్నారు ఇదే యధార్థముగ పురోవృద్ధిని గోరువారు పూర్వవృత్తాంతమును మఱువ గూడదను వాక్యముయొక్క లక్ష్యార్థము ఈవిషయమై వేల కొలది శ్రుతిస్మృతులు ప్రమాణములు గలవు అనుకూలము గలవారు చూచు కొనవచ్చును ఇదే సనాతన మతము

అయినను కొన్ని ప్రమాణశ్లోకములు ఈ క్రింద చూపించడమైనది

అగ్నావాపద్ఘృతం సర్వ మగ్ని రేవ భవేద్యథా ।

విదితం విదితం వేద్యం సంవిదేవ భవేత్తథా ॥

అగ్నియందు హోమము చేయబడిన ఘృతమంతయు అగ్ని రూపము ఏలాగున నగుచున్నదో, అలాగున తెలిసికొనదగిన ఆత్మను తెలిసికొని రాగా రాగా ఆసంవిత్తు ఆత్మయే యగుచున్నది

కర్పూరో దీపసంసర్గా ద్దీప ఏవ భవేద్యథా ।

వేద్యవేదన సంసర్గాత్సంవిదేవ భవేత్తథా ॥

దీపపు సంసర్గముచే కర్పూర మేలాగున దీపరూపముగా మారు చుండునో, అలాగున తెలియదగిన ఆత్మను తెలియుటకు తగిన ధ్యానాదులు చేయుచు రాగా రాగా ఆసంవిత్స్వరూపమగు చైతన్యమే యగుచున్నది

సంవిదితం సంవిదితం సంవిన్మయమేవ భవతి సంవేద్యమ్!

అగ్నావాహిత మాహితమగ్నిమయం కిన్నజాయతే కాష్ఠమ్!!

లెస్సగ ఆత్మయందు పరమాత్మభావన చేయుచు రాగా రాగా అంతయున్ను పరమాత్మమయమే యగుచున్నది అగ్నియందు హోమము చేయబడిన వస్తువులన్నియు అగ్నిమయములై యుండును గాని ప్రత్యేక మేమియు మిగిలి యుండదుగదా!

నాహం బ్రహ్మేతి సంకల్పాత్ సుదృఢాద్బధ్యతే మనః ।

సర్వం బ్రహ్మేతి సంకల్పాత్ సుదృఢాన్ముచ్యతే మనః ॥

తనయొక్క ఆత్మస్వరూపమగు బ్రహ్మమును మఱచి దేహేంద్రియ ములతోకూడిన వాడగు తన్ను తలంచుటయే బంధము గల్గజేయుచున్నది తన ఆత్మస్వరూపమును బ్రహ్మముగా దలంచి ధ్యానించుటచే, సమస్త బంధముల

నుండి విముక్తి గల్గుచున్నది

సంకల్పః పరమో బంధ స్త్వసంకల్పో విముక్తతా ।

సంకల్పం సంవిజిత్యాంతర్యధేచ్ఛసి తధా కురు ॥

అనాత్మ వస్తువులో ఆత్మసంకల్ప మేది గలదో అదియే బంధమును గలుగ జేయుచున్నది అట్టి సంకల్పము లేమియే విముక్తి యగుచున్నది అందువలన అన్ని సంకల్పములను జయించినవాడవై ముక్తుడవు కమ్ము ఇదే శాస్త్రము లన్నింటియొక్క సారము పిమ్మట నీ యిష్టము వచ్చినలాగున చేయుము అని శ్రీ వసిష్ఠమునీంద్రులు శ్రీరాములకు యోగవాసిష్ఠమున నుపదేశించిరి ఇక అపరోక్షానుభూతి యందు శ్రీజగద్గురు శంకరభగవత్పా దాచార్యులు ఉపదేశించిన దానిని చూడుడు

సర్పత్వేన యధా రజ్జూ రజతత్వేన శుక్తికా ।

వినిర్ణీతా విమూఢేన దేహత్వేన తధాఽఽత్మతా ॥

రజ్జువు సర్పముగను, శుక్తి రజతముగను నిర్ణయింపబడినట్లు ఆత్మ దేహముగా మూఢునిచే నిశ్చయింపబడుచున్నది

ఘటత్వేన యధా పృధ్వీ పటత్వేనైవ తన్తవః ।

వినిర్ణీతా విమూఢేన దేహత్వేన తధాఽఽత్మతా ॥

పృధ్వి ఘటముగను, తంతువులు పటముగను నిశ్చయింపబడునట్లు ఆత్మ దేహముగా మూఢునిచే నిశ్చయింపబడుచున్నది

నరత్వేన యధా స్థాణుర్జలత్వేన మరీచికా ।

వినిర్ణీతా విమూఢేన దేహత్వేన తధాఽఽత్మతా ॥

స్థాణువు పురుషుడుగను, ఎండమావులు జలముగను నిశ్చయింప బడునట్లు ఆత్మ దేహముగా మూఢునిచే నిశ్చయింపబడుచున్నది

ఆత్మానం సతతం జానన్ కాలం నయ మహామతే ।

ప్రారబ్ధమఖిలం భుంజన్ నోద్వేగం కర్తుమర్హసి ॥

మహామతీ, నీవు ఆత్మను నిరంతరమును తెలిసికొనుచు, కాలము గడుపుచుందువుగాక! ప్రారబ్ధమంతయు అనుభవించువాడవై చిత్తక్షోభమును పొందకుండుము

కనకం కుండలత్వేన తరంగత్వేన వై జలమ్ ।
వినిర్ణీతా విమూఢేన దేహత్వేన తథాఽఽత్మతా ॥

కనకము కుండలముగను , జలము అలలవలెను నిశ్చయింపబడునట్లు ఆత్మ దేహముగా మూఢునిచే నిశ్చయింపబడుచున్నది

భావితం తీవ్రవేగేన యద్వస్తు నిశ్చయాత్మనా!
పుమాంస్తద్ధి భవేచ్ఛీఘ్రం జ్ఞేయం భ్రమరకీటవత్!!

నిశ్చయబుద్ధి గల ఎవనిచేత ఏ వస్తువు తీవ్రవేగముచే రేయింబవళ్ళు భావింపబడుచున్నదో, వాడు అజ్ఞేయవస్తువుగా(అపరోక్షముగా తెలియదగిన బ్రహ్మముగా) భ్రమరకీటమువలె అగుచున్నాడు

పురోవృద్ధియొక్క తాత్పర్యము నీలాగున గ్రహింతురుగాక!

ఓంతత్ సత్

బ్రహ్మజ్ఞానము మనుజులను సోమరులనుగా జేయుచున్నదా? లేక సోఽహంపరులనుగా జేయుచున్నదా?

ఓం నమో గురుభ్యో గురుపాదుకాభ్యో
నమః పరేభ్యః పరపాదుకాభ్యః ।
ఆచార్యసిద్ధేశ్వరపాదుకాభ్యో
నమోఽస్తు లక్ష్మీపతిపాదుకాభ్యః ॥

సామాన్యజనులు బ్రహ్మజ్ఞానము అనగా దైవభక్తి, యోగము,తపస్సు మొదలగు జీవన్ముక్తికి హేతువులైన పవిత్రమార్గము లన్నియు జనులను సోమరులనుగా జేయుచున్నవని చెప్పెడు ఒక దురలవాటు గలదు ఇది వేదశాస్త్ర విచారణయు, బ్రహ్మనిష్ఠుల సంసర్గమును లేకపోవుటవలనను, తన ఆత్మ పరిశుద్ధావస్థ పొందని హేతువువలనను గలిగిన అపోహయే గాని మఱియొకటి గాదు అయితే కొంత చదువుకొన్నవారును, మేధాసంపత్తి గలవారు సహితము ఈ యభిప్రాయము గలవారు లేకపోలేదు దానికి

కారణము ఇప్పుడు స్వప్రయత్నముచే జీవితము గడుపజూడక సోమరులై బిచ్చమెత్తుకొని తినుచు మత్తువస్తువులను పుచ్చుకొనుచు సత్య ధర్మదూరులై యుండు కొందరు ద్రిమ్మరులను జూచి చెప్పిరేగాని మరియొకటి గాదు ఈ విషయములో వారు చెప్పెడు వాక్యము సంపూర్ణముగా అర్థరహితమని తలంచరాదు అది సత్యము అయితే అట్టివారి దృష్టియందు ఈలాటి వారెక్కువగా కనబడియుందురు కాని నిజమైన బ్రహ్మనిష్ఠులను తాపసోత్త ములను, యోగసాధకులను, పరమభక్తులను వీరు చూచియుండరు అందువల్ల సాధువు లందరు నిట్టి వారలుగా నుండవచ్చునని వారు తలంచుట కవ కాశము గలిగినది

పట్టణ ప్రదేశములలో మురికినీటి కాలువలు గలవు వాటిని జూచి పరమపావనములగు గంగ, సింధు, యమున, గోదావరి మొదలగు పుణ్య నదులు గూడ నీలాగున నుండవచ్చునని తలంచు టెంత పొరబాటో ఈ కార్యములలో ఆలాగున గ్రహించుకొనవలసియుండును అయితే వారు తలంచేలాగున నుండువారు చాలా మంది గలరు అట్టివారు వృద్ధి యగుటకు ముఖ్యకారణము దారిద్ర్యము రెండవది జనులకు పనిపాటలు లేకపోవుట మూడవది యట్టివారిని సంస్కరించి సరియైన మార్గములో నడుపువారు లేకపోవుటచేతను నీలాగున గలుగుచున్నది ప్రజల నాలాటి కుమార్గము నుండి సంస్కరించుట సామాన్యజనులకుగాని, సామాన్యరాజులకుగాని వీలగు పని గాదు అది ప్రభుత్వమువలననే గావలసియుండును

దానికి తగిన శాసనములను నిర్మించి అట్టివారికి జీవనోపాయముల నేర్పరచిన మాత్రమే ఇట్టి దురవస్థ లోకమునుండి తొలగును కాని వీరు యోగ నిష్ఠగల వారనిగాని, బ్రహ్మవిచారము జేయువారనిగాని, పరమభక్తులనిగాని వివేకము గలవారు తలంచరు ఇట్టివారితో బ్రహ్మనిష్ఠులను బోల్చి చెప్పుట సరికాదు అది తమస్సుతో ప్రకాశమును, సమాధినిష్ఠలో నుండు మహాత్మునితో గాఢసుషుప్తిలో నుండు సామాన్య మనుజుని సమన్వయపరచి చెప్పినట్లే యుండును పుణ్యనదులగు గంగ, సింధు, గోదావరి మొదలగు ప్రవాహములు ఎన్నియో కోట్ల జనులకెట్లు జీవనాధారములై యున్నవో,

అలాగున నొక్కొక్క మహాత్ముడు జన్మించినప్పుడు ఎన్నికోట్ల జీవులు సంసార తాపాగ్ని జ్వాలనుండి విముక్తులై శాశ్వత ముక్తిపదవిని బొందిరో చెప్పనలవి యగునా? వీరిలో నవతారపురుషులు, ప్రవక్తలు, యోగులు, తాపసులు, పరమభక్తులు- వారివారి దివ్యతేజస్సు ననుసరించి జనులను పాపవంకము నుండి యుద్ధరించియున్నారు ఆవిషయము వెనుక తెలుపబడును అట్టి దివ్య పురుషు లవతరించని దేశము సూర్యోదయము లేని ప్రదేశమువంటిదే యగును అట్టి పావన మూర్తులుండని స్థలము వట్టి ఎడారి ప్రదేశముగాను, శ్మశానస్థలము గాను ఉండునేగాని యుత్కృష్టమగు మానవజాతి నివసించెడు భూప్రదేశము గాగలదా?

అయితే కొందరు ఆత్మప్రాప్తి గలుగజేసికొనుటకు సంసారములో నుండిన ప్రతిబంధముల నుండి తప్పించుకొనుటకు సాధ్యము కాదని తలంచి త్యాగులై, విరక్తులై బ్రహ్మనిష్ఠ జేయుచుందురు లేక వేదాంత విచారణగాని, తపస్సుగాని యోగనిష్ఠగాని యభ్యసింతురు వీరిని జూచి మలిన హృదయులును, విషయాసక్తులును, సంసారమోహముచే జ్ఞానాంధులునగు కొందరు ఈలాగున తలంచగలరు అదేమన వీరందరును ఈలాగున విరక్తులై పోయినచో సంసారకార్యములు జరుగవనియు, దానివలన ప్రపంచమునకు హానికరమనియు తలంతురు త్యాగము, వైరాగ్యమును లేనిచో ప్రపంచములో నేకార్యముగాని, యెవరుగాని, యే కాలములోగాని సాధింపజాలరు సాధించిన వారందరును పరమ త్యాగము, అత్యధిక వైరాగ్యము, తీక్ష్ణమైన వ్రత నిష్ఠ నవలంబించినవారు మాత్రమే అట్టివారే లోకోన్నత కార్యముల నాచరించి యున్నతోన్నత పదవిని పొందియున్నారు

ఇప్పుడు స్వరాజ్యవిషయములో పరమత్యాగము నవలంబించి జనులకు స్వరాజ్యాభిమానమును గలుగజేయు విషయములో సదా ప్రయత్న పరులై, తీక్ష్ణసహనశక్తి గలవారలై ప్రబోధమును గలుగజేయు పుణ్య పురుషులును, త్యాగమూర్తులును, మాతృదేశాభిమానులును, అన్న వస్త్రము లకైన లేని పరమదరిద్ర జనులను, దారిద్ర్యపీడచే తపించు జీవకోట్లను జూచి సహింపజాలక తమయొక్క సర్వస్వమును త్యజించి సౌఖ్యముల నన్నిటిని విడచి

బంధుపుత్ర మిత్రాదుల నందరిని ఉపేక్షించి లోకసేవ జేయుచుండగా దేశాభిమానము లేశమైన లేనివారును, తమ సౌఖ్యమును మాత్రము జూచుకొనువారును, జీవరాసులయందు కరుణ లేనివారును, త్యాగమెరుంగని వారును నగు కొందరు వారి పట్ల భిన్నాభిప్రాయము గలవారై యున్నారు స్వరాజ్యములో జేరిన సంసారము పాడైపోవును ఇది లోకమున కుపద్రవ కారణము అంతేగాక లోకవినాశమునకు గూడ హేతువగును అని చెప్పుటలో నెంత సత్య మిమిడియున్నదో, ఇది యెంత పరమార్థమో, ఎంత పరిశుద్ధ విచారమో తెలిసికొనిన పైజెప్పిన అనగా బ్రహ్మజ్ఞానము జనులను సోమరులనుగా చేయునను వాక్యముగూడ అంతే సత్యముతో గూడినదని విజ్ఞులు గ్రహించుకొనవచ్చును

స్వరాజ్యములో ప్రవేశించిన ఒకవేళ శాసనోల్లంఘనము జేయువారి సొత్తులను జప్తు చేయవచ్చును అలాటి కార్యము లేవియు నాత్మ రాజ్యములో అనగా స్వారాజ్యములో ప్రవేశించి విరక్తులై ధర్మబోధకు లగువారికి గలుగవు కొద్దికాలముండి జీవించుట కాధారమైన ఈ కొద్ది దేశముకొఱకింత త్యాగము, పరిశ్రమ, సహనము గలిగి స్వరాజ్య ప్రాప్తికొఱకు పనిచేయు ధీరపురుషులు యత్నించునప్పుడు శాశ్వతమై, అనంతమై, నిత్యానందమైన స్వాత్మరాజ్యప్రాప్తి కొరకెంత త్యాగము, ఎంత పరిశ్రమ, యెంత వ్రతనిష్ఠ గలిగియుండవలయునో మీరే యోచించుకొనవలయును ఎంత యున్నతోద్యోగమును బొంద దలంచిన నంత యున్నతవిద్యను నభ్యసించవలసి యుండునుగదా! బ్రహ్మ విద్యయును అట్టిది యని మఱువకుడు ఇది యనంతానందమును గలుగజే యునది అఖిలలోకముల కాధారభూత మైనది దేనియందు మహిమ గలదో అది మహాప్రయత్నము వలననే లభించును

ఈ బ్రహ్మవిద్య యందుగూడ నెనిమిది తరగతులు గలవు ఇది యోగ మార్గానుసారముగాను, జ్ఞానమార్గానుసారముగాను నుండును కొందరు యోగమార్గము నవలంబించియు, మఱికొందరు జ్ఞానమార్గము నవలం బించియు జీవన్ముక్తి పదవిని బొందగలరు యోగమందు నిష్కామ యోగమును, జ్ఞానమందు భక్తియోగమును అంతర్భూతములు హృదయశు

ద్ధిగల వారికిని, ఇంద్రియ నిగ్రహము సిద్ధించిన వారికిని, మనశ్శాంతి లభించిన వారికిని, వైరాగ్యము గలిగినవారికిని జ్ఞానమార్గము చాలును అనగా వేదాంత విచారణచేతనే దైవసాక్షాత్కారము గలుగును ఇది ధ్యానయోగముతో జేరినది ఆలాగున పైజెప్పిన దైవికగుణములుగల పరమభక్తులకు స్మరణ, కీర్తన, ధ్యానములుండిన చాలును అట్లుగాని వారికి తపస్సు, యోగసాధన, ఇంద్రియనిగ్రహ పరమగు అనుష్ఠానము లన్నియు నుండవలయును ఆలాగున నిష్కామకర్మ, యోగనిష్ఠ గలవారికి జీవన్ముక్తి పదవి గలుగును

యోగమార్గములో 1 యమము 2 నియమము 3 ఆసనము, 4 ప్రాణాయామము, 5 ప్రత్యాహారము, 6 ధారణ, 7 ధ్యానము, 8 సమాధి యను ఎనిమిది మెట్లు గలవు ఆలాగున జ్ఞానమార్గములోను 1 శుభేచ్ఛ, 2 విచారణ, 3 తనుమానస, 4 సత్త్వాపత్తి, 5 అసంసక్తి, 6 పదార్థాభావన, 7 తురీయము, 8 తుర్యాతీతము అను ఎనిమిదవస్థలు గలవు వీనిలో యోగమార్గమున యమము నుండి ప్రాణాయామము వఱకు గల నాలుగంగములు యోగముయొక్క బహిరంగము లనబడును ప్రత్యాహారము నుండి సమాధిపర్యంతము గల నాలుగంగములు అంతరంగము లనబడును ఆలాగున జ్ఞానమార్గములో గూడ శుభేచ్ఛనుండి సత్త్వాపత్తివరకు గల నాలుగు భూమికలు బాహ్యభూమిక లగును అసంసక్తినుండి తుర్యాతీతమువఱకు గలుగు భూమికలను ఆభ్యంతరములని చెప్పుదురు

కాని శుభేచ్ఛ, విచారణ, తనుమానస అనుమూడు భూమికలలో నుండువఱకు దృశ్యవృత్తులు గలుగుచుండును సత్త్వాపత్తి అను నాల్గవ భూమికలో ప్రవేశించిన నది మధ్యమముగా నుండును క్రింది మూడు భూమి కలవరకు వచ్చినవారైనను సరియైన యనుష్ఠానము లేకపోయిన క్రిందికి జారిపోవుదురు పదార్థాభావన, తుర్యము, తుర్యాతీతము ఈ భూమికలలోనికి ప్రవేశించిన వారికి విషయవాసనలు నశించియుండును వీరికి బాహ్యవృత్తులు గలుగవు అట్టి వారికి పతనము సంభవించదు వీరి హృద యము శరత్కాలాకాశమువలె శుద్ధముగా నుండును అట్టివారు మరల మరల పదార్థాభావన నుండి పైపై భూమికలలోనికి మెల్లమెల్లగా ప్రవేశించుచుందురు

వీరు స్వచ్ఛమగు నాకాశమువలె శుద్ధజ్ఞాన ప్రకాశవ్యాపకులై యుందురు వీరు జీవన్ముక్తులు, ముందుజెప్పిన ముగ్గురును అభ్యాసులు ఈ విషయములన్నియు నింతవరకు వ్రాయబడిన గ్రంథములలో శాస్త్ర సహితముగా దెలిపియుండుటచే మరల నిచట ప్రస్తావించబూనలేదు

మన కర్తవ్యము

ఇప్పుడు లోకములో గల్గియుండు దురభిప్రాయమును, అనగా బ్రహ్మజ్ఞానము(వేదాంతము) జనులను సోమరులనుగా జేయుచున్నదను వ్యపోహను (నిందను) తొలగించుటకు తగిన ప్రయత్నముచేయుట ప్రతి ముముక్షువు యొక్కయు కర్తవ్యమై యున్నది నివృత్తిమార్గములో నభిలాష గల ప్రతి స్త్రీయును, పురుషుడును, వారు గృహస్థులుగాని, తక్కిన మూడాశ్రమములలో నుండు వారు గాని తగిన పరిశ్రమజేసి బ్రహ్మజ్ఞాన మొకటి మాత్రమే జనుల కాత్మశాంతిని గలుగజేయునది, అది యొకటిమాత్రమే జనుల దుఃఖసాగరమునుండి తరింపజేయునది, అదియొకటి మాత్రమే తాపత్రయాన్ని చల్లార్చునది, అదియొకటిమాత్రమే యాత్మను పునీతముగా జేయునది, అది యొకటి మాత్రమే పండితులకైనను, భూమండలాధిపతులకైనను, బ్రాహ్మణులకైనను, బ్రాహ్మణేతరులకైనను, యతులకైనను, ఇతరాశ్రమస్థులకైనను, స్త్రీలకైనను, పురుషులకైనను, బాలురకైనను, వృద్ధులకైనను, దేవతలకైనను, బ్రహ్మలోక నివాసులకైనను వెయ్యేల బ్రహ్మదేవునికైనను దుఃఖము లేని యానందప్రాప్తిని గలుగజేయు దివ్యామృతమై వెలయుచున్నది అని లోకమున చాటవలెను

తక్కిన విద్యచేతగాని, ధనముచేగాని, అధికారముచేగాని, భూమండలాధిపత్యముచేగాని, యజ్ఞాదిక్రతువులచేగాని, స్వర్గలోకమును బొందినగాని, అచటనుండి తపోలోకము జనలోకము సత్యలోకమువరకు ప్రాకినను, చతుర్ముఖ బ్రహ్మయై వెలిగినను వేదసారమగు దైవజ్ఞానామృతపానము జేయనిచో శోకశాంతిగాని, ఆనందప్రాప్తిగాని యేకాలములో

గాని, యేలోకములోగాని, యెవరికిగాని లభింపజాలదని భేరి మ్రోగించి రాజ వీధులలో జెప్పుచుండవలయును దానికందరును పరిశ్రమచేయు స్వభావము గలిగియుండవలయును సోమరితనమునకు తిలోదకముల విడువవలయును ఇంద్రియ సౌఖ్యముల కన్నిటికి తర్పణ మొనర్పవలయును ఎంతవరకు విద్యనభ్యసింప సాధ్యమగునో అంతవఱకు విద్యనభ్యసించ వలయును అది సంస్కృతవిద్యగా నుండేలాగున జూడవలయును విద్యాభ్యాస ముతోగూడ బ్రహ్మవిద్యను, అనుష్ఠానమును గూడ గలిగియుండేలాగున నిశ్చయించు కొనవలయును లేనిచో విద్య యవిద్యయైపోవును మంచితపస్సు గలిగి యుండవలయును యోగసాధనల జేయతలంపు గలవారు దానిని గూడ శీలించవలయును అయితే తపస్సు, యోగము సిద్ధులకొఱ కుండగూడదు అట్లయిన తపస్సు తమస్సుగాను, యోగము వియోగముగాను పరిణ మించును సాధ్యమైనంతవఱకు పరులనాశ్రయించక జీవించవలయును పరుల నాశ్రయించి పుణ్యకర్మలగాని లోకోపకారములను గాని చేయు స్వభావము గల్గియుండరాదు అయితే ఆంతరంగిక భక్తులకు మాత్రము పుణ్యవిషయమై సలహాలు చెప్పవచ్చును అశ్వమేధాది యజ్ఞములుగాని, రాజసూయాది క్రతువులుగాని, ఇతరములగు ఆరాధనలుగాని బ్రహ్మనిష్ఠకు సరిపోజాలవు

వేదేషు యజ్ఞేషు తపస్సుచైవ
దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా।
యోగీ పరం స్థాన ముపైతి చాద్యమ్ ॥ (గీ. 8-28)

బ్రహ్మనిష్ఠయొక్క మాహాత్మ్యమును జెప్పెద వినుము అర్థజ్ఞాన సహి తముగా వేదము నధ్యయనము జేయుటవలనను, శ్రద్ధాభక్తులతో యాగముల జేయుట వలనను, లెస్సగా కృచ్ఛ్రచాంద్రాయణాది తపస్సులను జేయుట వలనను, యధాశక్తి సత్పాత్రదానములను జేయుట వలనను, ఏ పుణ్య ఫలము గలుగునని శాస్త్రములయందు జెప్పబడియున్నదో అట్టి ఫలముల నన్నిటిని తుచ్ఛములని తలంచి యోగి ఆద్యమైనదియు, సర్వోత్కృష్ట మైనదియునగు బ్రహ్మమును బొందును అని శ్రీకృష్ణభగవాను లుపదేశించిరి మనుస్మృతిలో

గూడ మనుమహర్షి యీలాగుననే చెప్పెను

వార్యన్న గోమహీవాసస్తిలకాంచనసర్పిషామ్ ।
సర్వేషా మేవ దానానాం జ్ఞానదానం విశిష్యతే ॥

జలదానము, అన్నదానము, గోదానము, భూదానము, వస్త్ర దానము, తిలదానము, సువర్ణదానము, ఘృతదానము – మొదలగునెన్ని విధములైన దానములు కలవో, వాటియన్నిటిలోను బ్రహ్మజ్ఞాన దానము అత్యుత్కృష్టమైనది ఏలన తక్కిన యేదానముచేతను అంతఃకరణములోగల యవిద్యా సంబంధమగు భవరోగతాపము శమించదు అజ్ఞాన మహారోగమునకు ఈశ్వరసాక్షాత్కార జ్ఞాన మొకటియే దివ్యరసాయనము

స్నాతం తేన సమస్త తీర్థనిచయే దత్తం మహీమండలం
విప్రేభ్యః పితృదేవతా స్సురగణా స్సర్వేఽపి సంతర్పితాః ।
జప్తా మంత్రసహస్ర కోటి రమునా తప్తం చ తీవ్రం తపో
యస్య బ్రహ్మవిచారణే క్షణమపి ప్రాప్నోతి స్థైర్యం మనః ॥

బ్రహ్మాండ కటాహములోగల సమస్త తీర్థములలో విధిప్రకారము స్నానదానములు చేసిన నేఫలము గలదో, పుణ్యకాలములో కాశ్యాది పుణ్య క్షేత్రములలో నుత్తమవేదబ్రాహ్మణులకు భూమండలమంతయు దానము జేసిన నేఫలము గలదో, సమస్త పితృదేవతల నుద్దేశించి గయలో తర్పణ మొనర్చిన నేఫలము గలదో, బ్రహ్మవిష్ణు మహేశ్వరాది దేవతల విధిప్రకార మారాధించిన నేఫలము గలదో, గాయత్ర్యాది మంత్రములను వెయ్యికోట్లు జపమొనర్చిన నేఫలము గలదో, కృచ్ఛ్రచాంద్రాయణాది తపస్సుల తీవ్రముగా నొనర్చిన నేఫలము గలదో – అవియన్నియు మొత్తముచేసిన కలుగుఫల మంతయు, ఒక క్షణకాలము నిర్విషయస్థితిలో నుండి పరమాత్మ ధ్యానములో నిలుకడ గలిగిన సిద్ధించును అని యోగవాసిష్ఠము

అట్టి సర్వోత్తమమగు సాధనము మన చేతిలో గలిగియుండగా ఏల ఇతరుల నాశ్రయించవలయును? యాచనస్వభావము గలిగియుండుట చేతనే గృహస్థులకు, ధనాభిమానము గలవారలకు, విద్యాగర్వము గలిగిన వారలకును సాధువులపై విశ్వాసము లేకపోవుచున్నది అందువలననే పరమ పవిత్రమగు

బ్రహ్మజ్ఞానము సోమరితనములో లోకమును ముంచుచున్నదని వారు చెప్పుచున్నారు అపరిగ్రహవ్రతమును శీలించవలయును జిహ్వేంద్రియమును, గుహ్యేంద్రియమును బాగుగా అరికట్టవలయును ప్రతిజ్ఞాపూర్వకముగా అనగా సంకల్పపూర్వకముగా నికమీద 'మీకు వశముగాన'ని నిశ్చయించు కొనవలయును పుణ్యతీర్థములయందుగాని, పుణ్యాత్ములగు గురువుల యందు గాని, యిష్టదేవతలందుగాని యిట్టి సంకల్పము జేసికొనిన మఱింత మంచిది, అనగా నొట్టు పెట్టు కొనవలయును, లేనిచో నొకప్పుడు మనస్సు తిరుగునేమో! పరిశుద్ధాత్ములకు తప్ప తక్కినవారికి దృఢవ్రతములో నిలుకడ గలుగుట దుస్సాధ్యము మీరందఱును పరమఋషుల సంతానములని దృఢ భావన జేసికొనవలయును అప్పుడు నిద్రనుండి లేచిన సింహమువలె మీరోంకారముతో గర్జింపగలరు సింహధ్వని వినిన మృగములన్నియు పారి పోవుటగాని, అణగిపోవుటగాని యేలాగున నడవిలో గలుగుచుండునో, అలాగున అపుడు మీ హృదయసీమలోగల ప్రాకృతగుణము లన్నియు నణగిపోగలవు

ప్రపంచములోగల సర్వజనులకును శమదమాది గుణములు గలిగిన బ్రహ్మ జ్ఞానమున కర్హత గలదని సూర్యుడు ప్రకాశించుచున్నప్పుడు భేరి మ్రోగించి రాజవీధుల యందు ఉద్ఘోషించు చుండవలయును బ్రహ్మజ్ఞానము సోమరితనమును గలుగజేయునని చెప్పెడు వాక్యమును సాధుసంఘముల నుండి యుచ్చాటన జేయవలయును సాధుసంఘములని చెప్పనేల? భారత దేశములోనే అట్టి పాపవాక్యము లేకుండజేయవలయును సాధువులను శబ్దము భక్తులైన వారందఱికిని జేరినదని గ్రహించుకొనవలయును బ్రహ్మజ్ఞానములేని స్థలము పైశాచికలోకమని జనులు గ్రహించవలయును ముఖ్యముగా అపరిగ్రహవ్రత మును, పరిశ్రమయు మాత్రముండిన దీనికి చాలును

ఈవిషయమై ధనముకాని, పాండిత్యముగాని, బ్రాహ్మణాది భేదము గాని, స్త్రీ పురుష తారతమ్యముగాని విచారించబనిలేదు అప్పుడు మాత్రమే యీలోక ముద్ధరింపబడగలుగును బ్రహ్మజ్ఞానామృతవృష్టి యెంతకాలము వఱకు నేదేశమున వర్షించలేదో అంతవఱ కాదేశమున గల జనుల హృదయము

వర్షము లేని దేశీయజనుల దురవస్థవంటిదే యగును ప్రశాంతమగు దైవజ్ఞానము ఏ స్థలములో చాలినంత గలిగియుండలేదో, అంతవరకు దేశము చంద్రోదయము లేని కారుచీకటివలె తమోమయమై యుండును

సాధువులు సోమరులైపోయిరని యితరులు చెప్పుటలో సారము లేదని సంపూర్ణముగా మనము చెప్పజాలము వారు చెప్పేలాగున కొందరు తామసగుణముతో గూడియుండి యేలాటి పరిశ్రమ చేయక పరాన్నముతో జీవితము గడుపువారు గలరు అయితే వారిని సాధువులతో పోల్చిచెప్పుట సరికాదు అట్టివారు ఏ యొకసంప్రదాయములో చేరినవారుగాని, స్వబుద్ధితో నీశ్వరవిచారణ చేయువారుగాని కారు సాధువుల పవిత్రమైన వేషము వేసిన వారిజీవితము కష్టమః లేక గడుపవచ్చునని తలంచి వారు నట్టివేషమును వేసికొనినవారేగాని మరియొకటి గాదు అట్టివారిని జూచి పావనచరితులగు సాధువులు గూడ నిట్టివారే యని తలంచుట పాతకము అయినను దానిని సాధువులలో కొందరి దోషముచే గృహస్థులు చెప్పుచున్నారని తలంచి యట్టి దోషమేమియు బ్రహ్మనిష్ఠులలో గలుగక యుండులాగున ప్రతివారును ప్రయత్నించవలయునని మరియొకసారి ప్రార్థించుచున్నాను

ఇంకొక సంగతిని గూడ మనము గ్రహించుకొనవలసియున్నది అదేమన సన్న్యాసులు లోకమున కేమి మేలు చేయుచున్నా రనుటయే అయితే ఈ విషయమును జెప్పువారు బాగుగా దూరాలోచన చేయుట లేదనియే మనము తలంచుకొనవలయును ప్రపంచములో గొప్ప యుద్యోగమును సంపాదించుకొనిన వారును, ఉన్నతములైన ఇంజనీరుల పదవిని పొందిన వారును వైద్యశాస్త్రములో నత్యున్నత స్థితి గలిగియుండు డాక్టరులును, విద్యయందు అపారపాండిత్యమును సంపాదించినవారును, వ్యాపారములో గొప్పధనమును సమకూర్చినవారును అట్టి స్థితికివచ్చుటకు ఎంతకాలము ప్రయత్నించిరో జ్ఞాపకము చేసికొనవలయును వారును చింతల నన్నిటిని విడిచి, ఇతరబంధన ముల తొలగించి వారివారి కార్యములలో నియుక్తులై కొన్ని సంవత్సరములు తదేకబుద్ధి గలిగి ప్రయత్నించినందుచే నట్టియున్నత పదవికి రాగలిగిరి

ఐ ఎ యస్ పరీక్ష ప్యాసు చేయుట కెంతకాలము చదువవలసి యుండునో యోచింపుడు రమారమి యిరువది సంవత్సరములు విద్య నభ్యసించవలయును అలాగున పెద్దడాక్టరుపనిలో పరీక్షనివ్వవలసి యుండినను అంతకాలము విద్యనభ్యసించవలయును అట్లే మహామహో పాధ్యాయపదవిని సంపాదించవలసియుండినను అంతకాలము శ్రమపడి విద్యాభ్యాసము జేయువలసియుండును పైజెప్పిన వారిని విద్యాభ్యాస కాలములో మీరు లోకమున కేమి యుపకారము చేయుచున్నారు? సంసార మును విడిచి యీ దూరదేశములోనుండి యేమి సంపాదించుచున్నారని యొకరడిగినచో నతనిని గూర్చి వారు ఏమియనుకొనెదరో దానినే మనమును గ్రహించుకొనవలయును ఇతనికి విద్యాగంధము లేదు విద్యయొక్క యోగ్యత తెలియదని గదా తలంతురు ఆలాగున బ్రహ్మవిద్య, తపస్సు, యోగాను ష్ఠానము, దైవభక్తి, మొదలగు వానిలో నున్నతపదవి గలుగుటకు కొంతకాల మేకాంతవాసము, తపస్సు మొదలైనవాని నభ్యసించి కొనవలసియుండును దీర్ఘవ్యాధి గలవారు ఆరోగ్యము కొరకేలాగున ననుకూల స్థలములోనుండి మంచి పథ్యముతో గూడి కొన్ని నెలలుగాని, సంవత్సరములుగాని, యౌషధ సేవ చేయవలసి యుందురో, ఆలాగున భవరోగము నశించుటకుగూడ కొంతకాలము వ్రతనిష్ఠ గలిగి పుణ్యప్రదేశములో నివసించి సాధన జేయవలసియుండును

ఈ దేహమునకు గలిగినవ్యాధి కొన్ని సంవత్సరముల నుండియో లేక పుట్టినప్పటి నుండియో యుండవచ్చును అజ్ఞానమను భవరోగమో అనాది నుండి వచ్చినది ఎన్నియో జన్మముల నుండి జీవునితో గలసియున్నది అప్పుడు దానియొక్క నివృత్తి కొఱకెంత కాలము బ్రహ్మనిష్ఠ చేయవలయునో యోచించుకొన వచ్చును సౌఖ్యమునుగూర్చి విచారించిన నాలాగుననే యుండును ఏలన నౌషధసేవచే ఆరోగ్యమును సంపాదించిన నీదేహముతో నది యంత మొందును భవరోగము నశించిన, అనంతకాలము అనంత సౌఖ్యమును బొందగలుగును కావున నీరెంటియొక్క తారతమ్యము విచారణ జేసికొనిన బ్రహ్మనిష్ఠయొక్క గౌరవమును తెలిసికొనగలరు

మఱియు నొకనికి జిల్లా కలెక్టరు పని వచ్చిన నాజిల్లాలో నాతండాధిక్యము బడయవచ్చును దానికంటె ఎక్కువ యధికారము లభించిన నొక రాష్ట్రముననో లేక మరియొక దేశముననో మాత్రమే ఆధిక్యము పడయగలుగును ఆత్మప్రాప్తియో, లోకమునం దన్నిటికంటె యధికమైన స్థానమును బొందించును మఱియు నెంత యున్నతోద్యోగము లభించినను, ఎంత యారోగ్యమును సంపాదించినను అంతఃకరణములోగల అజ్ఞానమను భవరోగము వారిలో నుండవఱకు, జీవించియున్నప్పుడుగాని, మరణా నంతరమున గాని అట్టివారి కాత్మశాంతియు నిత్యసౌఖ్యము గలుగదుగదా! ఈ బ్రహ్మనిష్ఠయో జీవించియున్నపుడును,దేహము పోయినతరువాతను పరమ శాంతియు, పరమానందప్రాప్తియు గలిగియుండును ఆలాగున యోచించు కొనిన బ్రహ్మవిద్యయొక్క మహిమనేమని వర్ణింపగలము! అట్టి మహిమాతి శయము లేనిచో పూర్వకాలము రాజులు తమయొక్క రాజ్యమును విడిచి వానప్రస్థాశ్రమమునకు వెళ్ళుదురా? పండితులు సర్వసంగ పరిత్యాగులై తపోవనమున కేగుదురా? అధికార గరిష్ఠులును సమస్తమును వదలి మౌన మవలంబింతురా? ఎప్పుడును అగ్ని యేలాగున నూర్ధ్వముగా జ్వలించునో అలాగున ప్రాణికోట్లన్నియు పురోభాగమునకు వెళ్ళుదలంచునే గాని అధోగతిని గుఱించి ప్రయత్నించవు

సామాన్యజనుల విచారమేమన, బాహ్యపదార్థములచే సుఖము గలుగుననియే ఇది యజ్ఞానముచే గలిగిన దోషమేగాని మరియొకటి గాదు సుఖమునకు స్థానము హృదయము అనగా మనస్సు దీనిని చిత్తమనిగాని, బుద్ధియనిగాని చెప్పవచ్చును హృదయ మెంతకెంతకు శుద్ధమగుచుండునో జీవునకు బాహ్యపదార్థావశ్యకత లేకనే ఆత్మలో నంతకంత సౌఖ్యము గలుగు చుండును హృదయము దోషయుక్తముగా నుండిన నెంత బాహ్యసుఖ ముండినను లేశమైన సుఖము గలుగదు

ఈ తత్త్వమును దెలిసికొనియే పూర్వరాజులు రాజ్యసౌఖ్యము లన్నిటిని తుచ్ఛములుగా దలంచి తాపసవేషమును బూని, తపోభూమిలో ప్రవేశించి తపస్సుచే నాత్మను శుద్ధిజేసికొని రాజర్షు లను పవిత్రనామమును

సంపాదించిరి, ఏమి? వారందరును బుద్ధిహీనులా? అయితే స్థితిగతు లిప్పుడు మారిపోయి నందుచేతను,అధ్యాత్మవిద్య నశించిపోవుటచేతను,తపోనిష్ఠులు, యోగిపుంగవులు, పరమదైవభక్తులు, బ్రహ్మజ్ఞానులు, శాంతహృదయులు, కరుణాస్వరూపులు, విషయవిరక్తులు, తగ్గిపోయినందుచేతను వీరివలన గలిగెడు సుఖమును జనులు తెలిసికొనలేకపోవుచున్నారు

మఱియు నొక బీజము నాటి దానియొక్క ఫలము గలుగువరకు దానిని పోషించకపోయిన ప్రయోజనము గనుపించదు విత్తనము నాటిన కొన్ని దినములకుగాని, కొన్నిమాసములకుగాని ఫలము నివ్వనిచో దానిని పోషించిన నేమి ఫలము? విడిచిపెట్టుడు, పోషింపవలదని చెప్పువారెట్టివారో ఆలాగుననే బ్రహ్మనిష్ఠచే, తపస్సుచే, దైవభక్తిచే ఏమి గలుగునని యడుగువారిని గుఱించి మనము గ్రహించు కొనవలసియుండును కొబ్బరి, మామిడి, పనస మొదలగు వృక్షములు ఫలించుట కైదారుసంవత్సరములు పట్టును అంతవరకు పోషించి చూడక వెంటనే ఫలము గనుపించ లేదని చెప్పుమాటలకేమి యర్థము? మఱియు నేవృక్షమునుండి యెక్కువ ఫలము గలుగునోఅది ఫలించుటకును ఎక్కువకాలము పట్టును స్వల్పఫలము నిచ్చు విత్తనము త్వరలోనే నశించి పోవును మనము పెట్టినది కల్పవృక్షము ఇది మోక్షఫలము నిచ్చునది దీని ఫలము గలిగిన నెన్నియుగముల కైనను నశించని యక్షయ జ్ఞానఫలమును, ఆనందామృత భక్తి రసమును, అనంతకాలమువర కిచ్చుచునే యుండును కావున నిది ఫలించుటకు ఎన్ని సంవత్సరములు పట్టునో మీరే యోచించు కొనవచ్చును దీని కాలపరిమితి యంతఃకరణశుద్ధి ననుసరించియున్నది ఆత్మశుద్ధి యెంత త్వరలో గలుగునో అంతశీఘ్రముగా జ్ఞానముగూడ గలుగును

సామాన్యముగా ద్వాదశ సంవత్సరములు అవధి యని చెప్పుదురు ఈ కాలములో వ్రతభంగము గలుగనీయక, దినచర్యలు తప్పక, దైవభావము మఱుగు పడనీయక ధ్యానాదికార్యముల జేయుచుండవలయును పూర్వజన్మ సుకృతవిశేషము గలవారికి త్వరలోనే ఫలితము గనుపించును వీరికి పంన్రెండు సంవత్సరము లుండవలసిన పనిలేదు, ఆత్మశుద్ధి గలుగనివారికిని, కోపాది

దోషములు గలవారికిని, చిత్తోపరతి సిద్ధింపనివారికిని, శాంతియు కరుణయు, విరక్తియు సిద్ధింపని వారికిని కాలనియమమే లేదు ఇవన్నియు ఎన్ని సంవత్సరములకుగాని, యెన్నిజన్మములకుగాని కల్గునో అప్పుడు మాత్రమే యాత్మలాభము లభించును అనగా జ్ఞానము సిద్ధించును

వృక్షము నాటి పోషించుటలోను, ఇతరవిద్యల నభ్యసించుటలోను, బ్రహ్మనిష్ఠ జేయుటలోను, చాల తారతమ్యము గలదు ఏలన వృక్షము ఫలించిన తరువాతనే సుఖము గలుగును విద్యనభ్యసించినవారికి ఉద్యోగము లభించిన పిమ్మటనే యానందము ప్రాప్తించును బ్రహ్మవిద్య, దైవధ్యానము అటువంటివి గావు ప్రారంభించిన దినమునుండియే దినమేల యాక్షణము నుండియే కొంత యాత్మశాంతియు, నిర్మల సుఖమును ఆరంభమగును వృక్షమునకు సరియైన పోషణ లేకపోయిన ఫలించుట కేలాగున నిర్ణీతకాలమున కంటే ఎక్కువకాలము పట్టునో, మఱియు సంరక్షణ యుండియు చిగిరించి పువ్వులు పూసియుండు కాలమున పశువులు మేసిన, మరల యథా ప్రకారము వృక్షము మంచిస్థితికి వచ్చుటకు ఎక్కువకాల మెట్లు పట్టునో ఆలాగున అనుష్ఠాన కాలమున విషయ వృత్తులచే చెరుపు గలిగిన మరల మనస్సునకు పరిశుద్ధతయు, ధ్యానములో నేకాగ్రతయు, సూక్ష్మగ్రహణశక్తియున్ను గలుగుటకు కొంతకా లము పట్టును కావున కల్పవృక్షము నేలాగున నతిప్రేమతోను, జాగ్రత్తతోను బోషింతురో, ఆలాగున ఆత్మజ్ఞానములో వికల్పము గలుగక సదా చూచుచుండవలయును మఱియు నుత్కృష్టవృక్షములకు లేప్రాయమున నెట్లు పురుగులు పట్టుట గలదో, ఆదుష్టక్రిములను గనిపెట్టి తీసివేయుటయు గలదో, ఆలాగున అభ్యాస కాలమున పతన హేతువులగు అనేకదృశ్యవృత్తులు గలుగవచ్చును వాటిని మొదలంట నశింపజేయుచుండవలయును దానికి నివాసనియమ మత్యవసరము కావుననే విఘ్నములు గలుగని పుణ్య ప్రదేశములో నుండి సాధన జేయవలయునని శాస్త్రజ్ఞులు నిర్ణయించిరి

ఇక నింతవరకుండిన బ్రహ్మనిష్ఠులు సోమరులై యుండిరా? లేక సోఽహంపరులై యుండిరా? అను విషయమును గుఱించి యోచింతము అయితే ఇప్పుడుండు కొందరు మఠాధిపతుల యొక్కయు పీఠాధిపతుల

యొక్కయు, వంశపరంపర గురువులయొక్కయు, గురుపరంపరలో గల వారియొక్కయు, గురుకట్నముకొరకు దిరుగుచుండు గురువులయొక్కయు స్థితిగతులజూచి పూర్వికులగు మూలపురుషులలోగల పవిత్రతను తెలియక దూషింపరాదు అదే దీనిలోగల రహస్యము ఇప్పుడుండు వారిలో కొందరు భోగపరులైనందుచే యోగమునకు దూరులైపోయిరే గాని బ్రహ్మ తత్త్వముయొక్క మహిమ యవర్ణనీయ మైనదే ఇప్పుడు కొందరి నడతను జూచుటే జనులకు సన్న్యాసులపై నతృప్తి గలుగుటకు కారణమైనది అది నిజము పూర్వా చార్యులు బ్రహ్మనిష్ఠను లోకములో బోధించుటకును సాధకు లనుష్ఠానము చేయుటకును, ముముక్షువులు బ్రహ్మవిద్య నభ్యసించుటకును మఠములు, క్షేత్రములు, ఆశ్రమములు ఏర్పరచియుండిరి, అది యెంతో పవిత్రభావముతో జేసిరే గాని ఇప్పుడుండు వారిలో కొందరట్టి పవిత్ర ధనమును తమ భోగపరత్వమునకు దుర్వినియోగపరచుటచే జనులకు విశ్వాసము లేక పోయినది

ప్రకాశమునకును, అంధకారమునకు నేలాగున సంబంధము లేదో ఆలాగున భోగమునకును, యోగమునకును సంబంధ ముండదు అవి దిన రాత్రులవలెను, శుక్లకృష్ణపక్షముల వలెను, ఉత్తరాయణ దక్షిణాయనముల వలెను దూరదూరభేదము గలిగియుండును దేవతలకును,రాక్షసులకును ఎంత తారతమ్య ముండునో భోగపరత్వమునకు, యోగపరత్వమునకు నంత వ్యత్యాసము గలదు గంభీరసింహము నివసించెడు గుహాప్రాంతములలో లేళ్ళు కుప్పిగంతులు వైచి తిరుగుచుండునా? అలాగున నెవరు హృదయాంతరాళము నందు యోగధారణ యనునిష్ఠ గలిగియుందురో వారి సమీపమున భోగ చిహ్నము కొంచెమైన నుండదు గరుడపక్షి గూడుగట్టి నివసించు చెట్టు కొమ్మలపై సర్పములు తిరుగుచుండునా? అలాగున తురీయాత్మయందు పరమవిశ్రాంతిని బొందియుండు యోగి నివసించు స్థలములో నెచ్చోటనైన ఆశాపాశ దోషాదులకు స్థలమే యుండదు వైరాగ్యనిధియగు బ్రహ్మనిష్ఠుడు, జ్ఞానభాస్కరుడెచ్చోట ప్రకాశించుచుండునో యాస్థలములో తమోగుణ స్వభావమగు చీకటి ప్రవేశించునా? గండుపిల్లి విహరించు ప్రదేశములో

నెచ్చటనైన మూషికములు తిరుగాడుచుండునా? అలాగున మౌనజ్ఞాననిష్ఠ గలవారి సమీపములోను దృశ్యవృత్తుల గుణము లుండజాలవు అమృత మునకును, విషమునకును నెంత భేదము గలదో, నిర్విషయమునకును సవిషయమునకును అంత తారతమ్యము గలదు

మనము ప్రస్తుతము భోగపరులై యుండు కొందరి యోగుల మాటలను విడిచి యాత్మజ్ఞానమునకును, యోగనిష్ఠకును, తపస్సంపదకును, దైవభక్తికిని ఆదికారణ పురుషులను గూర్చిమాత్రమే విచారింతము వారు సోమరులై యుండిరా లేక సోఽహంపరులై యుండిరా?అనునది గ్రహించ వలయును పూర్వీకులగు జనులును, రాజులును అమాయకులై అట్టి కాలములో నుండిన బ్రహ్మనిష్ఠులను, సాధువులను, బ్రాహ్మణులను ఆదరించిరని తలంచరాదు ఇప్పుడుండు వారికంటె పూర్వీకు లెక్కువ యోగ్యతయు, నిర్మల బుద్ధియు గల్గిన వారే అట్టి కాలములో నుండినట్లు సాధువులును, బ్రాహ్మణులును ఇప్పుడుండిరేని, వినయభక్తి గలిగి ఈ చెప్పేవారే వారికి నమస్కరించి వారి కృపకు పాత్రులయ్యే లాగున వర్తించగలరు

ఇప్పుడుండువారికి తపశ్శక్తి, జ్ఞాననిష్ఠ తగ్గిపోయినందుచే వారిపై జనులకు విశ్వాసము తగ్గిపోయినదేగాని మరియొకటి గాదు ఒక వేళ భౌతిక కార్యములలో నిప్పుడుండునంత సౌకర్య మట్టికాలములో గలవారికి లేకపోయినను ఆత్మవిషయములోను, విద్యావిషయములోను, జ్ఞానవిషయము లోను, ధర్మవిషయములోను, ఇప్పటివారికంటె వారెంతో యున్నతస్థితిలో నుండినవారలే ఏలన నిప్పుడు లోకములో నత్యద్భుత విషయములను, విచిత్రయంత్రములను, విజ్ఞానశాస్త్రము(సైన్సు) మొదలగు వానిని వృద్ధిపర చినవారు మన పూర్వీకులకంటే శ్రేష్ఠులమని తలంచువారు గలరు అయితే యానాటి భారతీయౌన్నత్యమును, విజ్ఞానమును, నాగరికతను జూచిన (విచారించిన) వీరికాలములో నెంత హీనస్థితిలో మృగవృత్తిలో నున్నారో చరిత్రమే సాక్ష్యమిచ్చును ఇది పక్షపాతముతో జెప్పిన వాక్యము గాదు సర్వజ నులకును విశదమైన విషయమే ఆ విషయముల నన్నిటిని పేర్కొని ప్రస్తావిం చుట మనయొక్క ప్రస్తుతవిషయము గాదు మారణయంత్రముల సహాయ

ముచే దుర్బలులగు జనులను, ధర్మముతో పరిపాలించెడి వారిదేశమును, ధ్వంసమొనర్చి యాక్రమించుకొనుట పౌరుషముగాని, బుద్ధివికాస స్వభావము గాని కాదు మృగస్వభావము బలమైనమృగము బలహీన జంతువును వధించి తినుట నాగరికత లక్షణమా? లేక పశుత్వమా? రక్షించుటయే నాగరకత లక్షణము అట్లు గానివారి పశుకృత్యము జూచి యది నాగరకత యని తలంచుట పొరబాటు

అయితే విదేశీయులవలె భారతీయు లేల విజ్ఞాన శాస్త్రమును, యంత్రనిర్మాణాదులను వృద్ధిపరచగూడదని యడిగిన వీరికి సహాయము లేక పోయినది స్వాతంత్ర్యలక్ష్మి యస్తమించినది అస్వాతంత్ర్యమను చీకటి గ్రమ్మి దేశము నావరించినది నిస్సహాయు లేమి చేయగలరు? జపాను మొదలగు దేశీయు లంత యున్నతస్థితికి రాగలిగినది స్వాతంత్ర్య లక్ష్మియొక్క ప్రసన్నత చేతనే గాని మరియొక దానిచే గాదు ఇదే దీనిలో గల రహస్యము

అయితే భారతీయుల అధోగతికి కొన్ని కారణములు వీరియందు లేక పోలేదు దానిలో ముఖ్యకారణము జనులయొక్క గుణమున కాధిక్య మివ్వకపోవుటయే ఈ పాపశాసనము, ఘోరతమ మూఢవిశ్వాసము జనుల నింత యజ్ఞాన తమస్సులోనికి దీసికొనివచ్చినది కులములకును ఆశ్రమ ములకును గుణముల జూడక యాధిక్య మిచ్చినందున సోమరితనము పెరిగి లోకమునకు భారమై జనులు హీనస్థితికి వచ్చిరి ఇందువలన శ్రేష్ఠకులములో బుట్టినవారు అంతమాత్రముచే శ్రేష్ఠులమనితలంచి శ్రేష్ఠగుణముల వృద్ధి నొందించకపోయిరి శ్రేష్ఠకులము గాదని తలంచువారిలో, శ్రేష్ఠగుణము గలిగినను శ్రేష్ఠత్వమున క్షర్హత లేదని జనులు తలంచుటచే శ్రేష్ఠగుణములు పెంపొందించుటకు ప్రయత్నించకపోయిరి ఇందువలన నుభయులును జీవచ్ఛవముల స్థితికి వచ్చిరి ఇదే దీనిలోగల మర్మము అంతేగాని భారతీయులు బుద్ధిహీనులనిగాని, ప్రజ్ఞారహితులనిగాని తలంపరాదు వీరు ప్రజ్ఞారహితుల సంతతిలో జన్మించినవారు గారు ఈశ్వరసృష్టిలో శ్రేష్ఠ మానవజాతియని ప్రసిద్ధికి వచ్చిన ఋషి వంశములో బుట్టినవారు పరిశుద్ధులని విఖ్యాతిగాంచిన యార్యవంశ సంతతివారు అట్టి పుణ్యవిశేషముచేతనే భారతీయు లిప్పటికిని

సజీవులై యున్నారు ఈ విషయ మాత్మస్తుతియని తలంచి విడచి పెట్టడ మయినది ఏ కుటుంబములోనో, యెప్పుడో యొకడు గొప్ప విజ్ఞానవంతుడై యుండెనని తలంచి యట్టిస్థితిని బొంద ప్రయత్నము జేయక యజ్ఞానస్థితిలో నుండి అట్టివాని సంతతిలో పుట్టినవారమని ప్రగల్భ వాక్యముల జెప్పిన నేమి ప్రయోజనము? సోమరులై అజ్ఞాననిద్రలోనుండి జనులను జాగ్రత్త స్థితిలోనికి దెచ్చినవా రెవ్వరైనను ఏ దేశవాసులైనను వారే గొప్పవారు

కొందరు పాపులకు సహాయపడిన నరకమందురు ఓహో! యెంత యంధవిశ్వాసము! తానాచరించలేని కార్యము నేల ఇతరులకు జెప్ప వలయును? అట్టి వాక్యమునం దేమైనా సారము గలదా? అజ్ఞానముయొక్క మహిమనేమని చెప్పవచ్చును? ఎందరో పుణ్యాత్ము లన్నసత్రములు, ధర్మపార శాలలు, ఉన్నతవైద్యాలయములు నిర్మించి జనులకు సేవజేయుచున్నారు వీరు చెప్పు సిద్ధాంతప్రకార మా పుణ్యజీవు లందరును నరక మనుభవించ వలసియుండునుగదా? ఆహా వీరి మేధాశక్తి నేమని చెప్పవచ్చును! మొదట జనులయాత్మలో సంస్కరణము గలిగిన మాత్రమే లోకసంస్కరణము గాని, లోకోన్నతిగాని గలుగ వలసియుండును

కనుక యాత్మశుద్ధి గలుగుటకు నుత్కృష్టగ్రంధముల ముఖ్యముగా జదువవలయును అట్టి గ్రంధములలో శ్రీ భగవద్గీత ముఖ్యమైనది స్వధర్మ కార్యముల నిర్వహించుటకు భయపడి బిచ్చమెత్తి యెచ్చటనైన నుండి కాలమును గడుపదలంచిన యర్జునుని యొక్క యాశయము సరి గాదని శ్రీభగవాను లుపదేశించి సోమరితనమను పెనుభూతమును గీతయను మంత్రోపదేశముచే బారద్రోలి సోఽహం పరత్వమును బోధించిన దివ్య గ్రంధమిది స్వకార్యమునందు సన్నద్ధునిగా జేసి కృతకృత్యత్వమును బొందించెడు వేదాంతశాస్త్రమా, మానవుల సోమరులనుగాజేయుట? 'ఉత్తిష్ఠత జాగ్రత, ప్రాప్య వరాన్నిబోధత' అని యుపదేశించెడు యుప నిషద్వాక్యమా జనులను సోమరులనుగా జేయునది? ఓ జనులారా! అజ్ఞాన మోహము నుండి లెండు తమోమయ మగు సుషుప్తి నుండి మేల్కొనుడు, ఆత్మజ్ఞానమును బొందిన శ్రేష్ఠపురుషుల నాశ్రయించి తెలిసికొనదగిన

విషయముల దెలిసికొనుడు, కృతార్థులు గండు అని యుద్ఘోషించు కఠోపనిషద్వాక్యమును వినుడు ముందుగా తరించుడు తరువాత లోకమును తరింపజేయుటకు ప్రయత్నింపుడు అపుడు మీరు కృతార్థులు కాగలరు అర్జునున కుపదేశించిన యమృతవాక్యమును వినుడు

విపత్తులలో నుండి, ధర్మసంకటములో నుండి, దుఃఖములో నుండి ఏమి చేయవలయునో తెలియని సందిగ్ధస్థితినుండి యర్జునుని ఏది రక్షించెనో యది ఈ వేదాంతవాక్యమే గదా!

దృష్ట్వేమం స్వజనం కృష్ణ! యుయుత్సుం సముపస్థితమ్ ।
సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ॥
వేపథు శ్చ శరీరే మే రోమహర్ష శ్చ జాయతే ।
గాండీవం స్రంసతే హస్తాత్త్వక్చైవ పరిదహ్యతే ॥
న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ (1.28,29,30)

ఓ కృష్ణా! యుద్ధముచేయు నిచ్ఛతో వచ్చియున్న ఈ బంధువులను జూచి నాయవయవములు నిస్సత్తువ లగుచున్నవి నోరెండుచున్నది, నా శరీరమున వణకు, గగుర్పాటును గలుగుచున్నవి గాండీవము చేతినుండి జారి పోవుచున్నది శరీరము మండుచున్నది రథమునం దుండజాలకున్నాను మనస్సు భ్రమబొందుచున్నట్లున్నది

ఇట్టి స్థితిలోనుండు అర్జునుని ఉద్ధరించిన తేజోవంతమగు, సజీవ మగు వేదాంత వాక్యమును వినుడు క్షీరసాగరమథనమున సముద్రములో మునిగిన మంథరపర్వతమును కూర్మావతారమెత్తి భగవంతు డుద్ధరించినట్లు, లోకము ధర్మపథమునుండి జారి దృశ్యసౌఖ్యమే శాశ్వతమను బుద్ధిగలిగి యజ్ఞానమను తమస్సులో మునుగునప్పుడు మహాత్ము లవతరించి లోకోద్ధర ణమును జేయుచుందురు శ్రీ బుద్ధ, శ్రీ శంకర, శ్రీ క్రీస్తు, శ్రీ మహమ్మదు మొదలగువారు భూలోకములో నవతరించినప్పుడు అట్టి కాలమున లోక మెంత యజ్ఞానాంధకార మయమైయుండెనో, జీవకోట్లు ఈశ్వరదృష్టినుండి యెంత దూరముగా జారిపోయినవో చరిత్రముల జదివిన వారందరికి విదితము ఈ గీతశాస్త్ర మర్జునున కొకని కుపదేశించినదని తలంపరాదు

జీవకోట్లన్నిటికి భగవంతు డనుగ్రహించిన యమృతసారమని గ్రహించ వలయును పైజెప్పిన స్థితిలో శవప్రాయుడై పడియుండు అర్జునుని యేది వ్యామృతము సజీవునిగా జేసెనో, ధీరునిగా జేసెనో , అమిత పరాక్రమ వంతునిగా జేసెనో ఆ వేదాంతమా మనుజాలను సోమరులనుగా జేయునది ?

ఏవ ముక్త్వాఽర్జున స్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥ (1-47)

అర్జునుడిట్లు శ్రీకృష్ణమూర్తితో జెప్పి దుఃఖముచేత మనస్సు చలించగా ధనుర్బాణములను విడిచిపెట్టి యుద్ధభూమిలో దిగులు నొంది రథముమీద చతికిలబడెను

పెనుభూత మావేశించి మూర్ఛజెందియుండువానికి గొప్ప మంత్రవేత్త భూతమును దొలగించి స్వబోధమును గలుగజేసినట్లు, కర్తవ్యాకర్తవ్యముల దెలిసి కొనుటకు జ్ఞాపకశక్తియైన లేనివాడై పడియుండు అర్జునుని శ్రీభగవానుడు ఏదివ్యమంత్రోపదేశముచే మోహమను దయ్యమును తొలగించి దివ్య తేజస్సంపన్నునిగా జేసెనో యట్టి వేదాంత వాక్యమును వినుడు

తం తథా కృపయాఽఽవిష్ట మశ్రుపూర్ణాకులేక్షణమ్ ।
విషీదన్త మిదం వాక్యమువాచ మధుసూదనః ॥

కనికరముతో కూడుకొనినవాడును, కన్నీళ్ళతో నిండినవై వ్యాకులము లైన నేత్రములు గలవాడును, దుఃఖపడుచున్నవాడును నగు అర్జునుని గూర్చి శ్రీ కృష్ణమూర్తి ముందు చెప్పబోవు వాక్యమును బలికెను

కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్టమస్వర్గ్య మకీర్తికర మర్జున ॥

ఓ అర్జునుడా! అజ్ఞానులచే నవలంబింపబడ దగినదియును, పరలోక సుఖము నడ్డుపఱచునట్టిదియును, అపకీర్తిని గలుగజేయు నట్టిదియును, హీనమునగు నీ దుఃఖము ఒడుదుడుకు సమయమున నీకెట్లు గలిగినది!

క్లైబ్యం మాస్మ గమః పార్థ! నైతత్త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥

ఓ అర్జునుడా! నపుంసకత్వమును బొందకుము నీ కీ మనోవ్యాకులత

తగదు శత్రువులను దపింపజేయువాడా! నీచమైన పిఱికితనమును వదలి స్వకార్యనిర్వహణమునకు లెమ్ము, స్వధర్మనిర్వహణ స్వభావము లేనివాడు స్త్రీయును, పురుషుడును గాని హీనుడని యర్థము

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః।

న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥

ఓ అర్జునా! ఆయుధము లీయాత్మను ఛేదింపజాలవు అగ్ని యీ యాత్మను దహింపజాలదు ఉదకము లీయాత్మను తడుపజాలవు వాయువు ఈయాత్మను శుష్కింప జేయజాలదు

అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ!

నిత్యస్సర్వగతస్థాణు రచలో ఽ యం సనాతనః!!

ఓ అర్జునా! ఈ యాత్మ ఛేదింపబడదగినవాడు కాడు ఈ యాత్మ దహింప బడదగినవాడు గాడు తడపబడదగినవాడు గాడు ఎండింప బడదగినవాడును గాడు ఈతడు నిత్యుడు, సర్వవ్యాపకుడు, చలనము లేని వాడు చలింపనివాడును, సదా యొకేరీతిగా నుండువాడును అగుచున్నాడు

పైజెప్పిన శ్లోకముయొక్క యర్థము దృఢపడుటకొఱకు మఱల దానిని గురించియే చెప్పుటయైనది అనగా శ్రవణ మొక దానిచే దృఢముగా గలుగదని దలంచి మనన నిదిధ్యాసములు చేయదగినవి ఇదే వేదాంతబోధచే గలిగిన ప్రయోజనము అర్జునుడు ఈదేహమే తానను బుద్ధి గలిగియుండెను లేక దేహములోనుండు జీవుడనను భావము గలిగియుండెను అంతేగాక జననమరణ ధర్మములు గలిగిన వాడనని తలంచియుండెను అప్పుడు భగవంతుడు నీవు దేహము గాదనియు, దేహివనియు, వ్యాపకుడవనియు, నిత్యుడవనియు, త్రికాలా బాధ్యుడవనియు బోధను గలుగజేసెను ఆహా! చచ్చిన వానిని బ్రతికించిన నెట్లుండును! రాజపదవి నుండి చ్యుతుడై భిక్షమెత్తి జీవించువానిని మరల రాజునుగా జేసిన నెట్లుండునో, గ్రహావిష్టుడైన విప్రోత్తముడు స్వబోధను మఱచి హీనవృత్తిలో నుండగా వానియొక్క గ్రహమును దొలగించి బ్రాహ్మణ త్వబోధను గలుగజేసిన నెట్లుండునో, ఆలాగున వేదాంతము అజ్ఞానములో నుండు జీవునికి ప్రబోధము గలుగజేసి

జ్ఞానవంతునిగా జేయును ఇదే వేదాంతము మనకు గలుగజేయు మహోప కారము

ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।
విమృశ్యైతదశేషేణయథేచ్ఛసి తథా కురు ॥ (18-63)

ఓ అర్జునా! ఈ విధముగా రహస్యమునకంటె నతిరహస్యమైన నీయాత్మతత్త్వోపదేశమును నీకొఱకు పదేశించడ మైనది దీనిని సంపూర్ణము సావధానచిత్తము గలవాడవై విచారణజేసి యెట్లు చేయదలంచుచున్నావో అట్లు చేయుము భగవంతుడుగూడ కర్తృత్వమును తనపై నుంచుకొనక జ్ఞానము (ధర్మము) నుపదేశించెను కర్తృత్వమునుంచిన అది సంపూర్ణ నిష్కామ యోగము గాజాలదు అట్టి తత్త్వమిచట తెలుపడమైనది

కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ! త్వయైకాగ్రేణ చేతసా ।
కచ్చిదజ్ఞాన సమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ ॥

ఓ యర్జునా! ఇదివరకు నాచే తెలుపబడిన యాత్మ తత్త్వోపదేశమును నీవు నిశ్చలమనస్సుతో వింటివా? ఓయర్జునా! నీకు అవివేకముచే గలిగిన మోహము పోయినది కదా? ఈ శ్లోకములో శిష్యవాత్సల్యమును సూచించెడు వాక్యము గలదు కారుణ్యాతిశయముచే శిష్యుడు కృతార్థుడు గావలయుననెడి బుద్ధి మహాత్ములు గలిగియుందురు

నష్టో మోహ స్స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాఽచ్యుత ।
స్థితోఽస్మి గత సందేహః కరిష్యే వచనం తవ ॥

ఓ కృష్ణస్వామీ! నీయనుగ్రహమువలననే ఆత్మసాక్షాత్కార స్థితిని బొందితిని అజ్ఞానము నష్టమైపోయినది నాకిపు డేలాటి సందేహము లేదు ఇక నీయాజ్ఞానుసారముగ వర్తించెదను

ఇదే శ్రీభగవద్గీతయొక్క సారము గీత యుపదేశించిన తత్త్వ మిదియే శిష్యుడు కృతార్థుడయ్యెనా లేదా యని గురువు పరిశోధించ వలసిన ధర్మము. మఱియు నీదేహముతో నున్నపుడే జీవన్ముక్తి పదవిని బొంది కృతార్థుడ నైతిని అజ్ఞానమునుండి నివృత్తి గలిగినది నిత్యానందమగు పదవి లభించినది అని శిష్యునికి గలుగవలసిన ధర్మము ఈ శ్లోకములో నిమిడి

యున్నది విషపానముచే మూర్ఛనొందియుండు మనుజుని అమృతపానము చేయించి మృత్యురహితునిగా జేయునట్లు వేదాంతము ప్రపంచమున కుపకారము చేయుచున్నది గాని సోమరిని చేయదు

ఇక మనము శ్రీరామచంద్రుని గఱించి తెలిసికొనవలసియున్నది ఈ మహానుభావుడు లోకసంగ్రహార్థముగా జేసిన లీలనుగఱించి ఈ క్రింది గ్రంథము మనకు దెలుపుచున్నది సంసారములో నుండు వారేలాగున వర్తించ వలయునో, ఎట్లుండిన బంధము గలుగదో, జీవన్ముక్తి గలుగునో యాలాటి విషయములన్నియు నీగ్రంథములో వివరింపబడెను ఇది ముఖ్యముగా రాజ్యపరిపాలనము జేయు రాజులును, శ్రీమంతులును ఉద్యోగస్థులును చూడదగిన గ్రంథరాజము వారు వీరని మాత్రమేల చెప్పవలయును ప్రతిముముక్షువును దీనిలో జెప్పేలాగున యాచరించవలసి యుండును మనోలయము, వాసనాక్షయము గలిగినమాత్రమే జ్ఞానము గలుగునని ఈ గ్రంథము నొక్కి వక్కాణించుచుండును దీనికే శ్రీయోగవా సిష్ఠమనియు, వాసిష్ఠరామాయణ మనియు పేర్లు గలవు

దీని నారు ప్రకరణములతోను, ముప్పదిరెండువేల శ్లోకములతోను శ్రీవాల్మీకి మహర్షి బ్రహ్మదేవుని యాజ్ఞానుసారము కూర్చెను దీనియందు జనకుడు మొదలగు అనేక రాజర్షులయొక్కయు, శుకుడు మొదలగు పెక్కంద్రు బ్రహ్మర్షులయొక్కయు, నారదుడు మొదలగు అనేక దేవర్షుల యొక్కయు జ్ఞానప్రదములగు కథలు గలవు అంతేగాక చూడాల మొదలగు అనేక నారీమణులు జీవన్ముక్తి పొందిన దివ్యగాథలు గలవు మనుష్యచరిత్రలేగాక, నందికేశ్వరుడు మున్నగు మృగ దేహమును ధరించిన బ్రహ్మనిష్ఠాగరిష్ఠులైన వారియొక్క చరిత్రలును, పక్షివర్గములో జేరిన కాకభుశుండుడు మొదలగువారియొక్క వృత్తాంతములును నిందులో జేరియున్నవి దీనియొక్క ముఖ్యసారమేమన, ముక్తియను శాశ్వతపదవిని సర్వ జనులును, సమస్త స్త్రీలును, పురుషులందరును బొందుటలో నేలాటి యాటంకము లేదనియు, శమదమాది గుణములు గలిగి, బ్రహ్మవిచార ముగాని, యోగనిష్ఠగాని, పరమైకాంతభక్తిగాని, నిష్కామకర్మయోగముగాని

యుండిన చాలుననియు నిర్ధారణ జేయబడినది శ్రీరాముని వైరాగ్య మిట్లుండెను

కుమారస్య విశాలాక్షం పాండుతాం ముఖ మాదదే ।

పాకపుల్లదళం శుక్లం సాలిమాల మివాంబుజమ్ ॥

శ్రీరాముని విశాలలోచన ముఖమండలము పాలిపోయి, భ్రమర చుంబితమును, వికసితమును నగు తెల్లతామరపువ్వువలె నాయెను వైరాగ్యము గలుగునపుడు ఇట్టిస్థితి యందరికిని గలుగును రజోగుణ తమోగుణ శరీరాణువులును, అంతఃకరణ భావములును, దేహమునుండి మనస్సునుండి పోవునపుడిట్టి చిహ్నము గలుగును

కృశాంగశ్చింతయా యుక్తః ఖేదీ పరమదుర్మనాః ।

నోవాచ కస్యచిత్ కించిల్లిపికర్మార్పితోపమః ॥

చింతవల్ల చిక్కి శ్రీరాముడు విమనస్కుడై, భిత్తియందు వ్రాసిన చిత్తరువు వలె నుండి యెవరితోడను, ఏమియు మాటాడకుండెడివాడు

కా తే పుత్ర ఘనా చింతేత్యేవం రామం పునః పునః ।

అపృచ్ఛత్ స్నిగ్ధయా వాచా నైవాకథయదస్యసః ॥

పుత్రా! నీకున్న చింత ఏమి? అని దశరథుడు అనేక పర్యాయములు స్నేహపూర్ణవాక్యములచే బ్రశ్నించినను, రామచంద్రు డేమియును బలకలేదు

తతో దశరథో రాజా రామః కిం ఖేదవానితి ।

అపృచ్ఛత్ సర్వకార్యజ్ఞం వసిష్ఠం వదతాం వరమ్ ॥

రాముడు విచారపూరిత మనస్కు డైనాడేల? అని అనంతరము దశరథుడు సర్వకార్యజ్ఞుడును, వాగ్మియును నగు వసిష్ఠుని బ్రశ్నించెను

ఇత్యుక్తశ్చింతయిత్వా స వసిష్ఠమునినా నృపః ।

అస్త్యత్ర కారణం శ్రీమన్ మారాజన్ దుఃఖమస్తు తే ॥

దీనికిం దగుకారణ మున్నది దుఃఖింపకుము అని దశరథునితో వసిష్ఠుడు ధ్యానమొనరించి పల్కెను

ఇక రాముని భృత్యులు రాముని గూర్చి తెల్పిన మాటలు వినుడు

దేహయష్టిమిమాం దేవ ధారయన్త ఇమే వయమ్ ।
ఖిన్నాః ఖేదే పరిమ్లానతనౌ రామే సుతే తవ ॥

రాముడు దుఃఖవశమున కృశ శరీరుడైనాడు మేమును కృశించి యెట్లో యీ శరీరమును దాల్చియున్నాము

వస్త్రపానాశనాదాన పరాఙ్ముఖతయా తయా ।
పరివ్రాడ్ ధర్మిణం భూప సోఽనుయాతి తపస్వినమ్ ॥

రాముడిప్పుడు అన్న పానాదులయెడంగల విరక్తింజేసి పరివ్రాజకుడగు యతిని బోలుచున్నాడు

ఏక ఏవ వసన్ దేశే జనశూన్యే జనేశ్వర।
న హసత్యేకయా బుద్ధ్వా న గాయతి న రోదితి ॥

అత డేకాగ్రచిత్తుడై, ఏకాంత ప్రదేశములగూర్చొని యుండును, హాసగాన రో దనాదుల నొనర్పడు

బద్ధపద్మాసనః శూన్యమనా వామకరస్థలే ।
కపోలతల మాధాయ కేవలం పరితిష్ఠతి ॥

శూన్యమనస్కుడై చెక్కిలిపై చేతినుంచి పద్మాసనమున నూరక కూర్చొని యుండును

ప్రత్యహం కృశతా మేతి ప్రత్యహం యాతి పాండుతామ్ ।
విరాగం ప్రత్యహం యాతి శరదంత ఇవ ద్రుమః ॥

రోజురోజున కాతడు కృశించుచున్నాడు రోజురోజున కతడు పాలి పోవుచున్నాడు వైరాగ్య మంతకంత కెక్కుడగుచున్నది అతనిస్థితి శిశిర ఋతువు నందలి వృక్షమువలె నున్నది

అనుయాతౌ తథైవైతౌ రాజన్ శత్రుఘ్నలక్ష్మణౌ ।
తాదృశావేవ తస్యైవ ప్రతిబింబావివ స్థితౌ ॥

అతని అనుచరులగు లక్ష్మణ శత్రుఘ్నుల స్థితియు నిట్లే యున్నది వారాతని ప్రతిబింబ మట్లున్నారు

ఆపాతమాత్రహృద్యేషు మా భోగేషు మనః కృథాః ।
ఇతి పార్శ్వగతం భవ్య మనుశాస్తి సుహృజ్జనమ్ ॥

విషయేంద్రియ సంయోగమువలన కలుగునవియు, దుఃఖాంతములు, క్షణికములును నగు భోగములయందు మనస్సుంచకుము అని రాముడు ప్రక్కనుండు మిత్రున కుపదేశించును

నీతమాయు రనాయాస పదప్రాప్తి వివర్జితైః!

చేష్టితైరితి కాకల్యా భూయో భూయః ప్రగాయతి!!

మోక్షపదమున కుపయోగింపని ప్రయత్నములలో నాయువు వ్యయింపబడుచున్నది అని మధురమును, స్ఫుటమును నగునట్లు మాటి మాటికి బాడుచుండును

ఇతి తోకే సమాయతాం శాఖాప్రసరశాలినీమ్!

ఆపత్తామలముద్ధర్తుం సముదేతు దయాపరః!!

మీ పుత్రుని కిట్టివిపత్తు ఘటిల్లినది అది శాఖాప్రశాఖలతో బెరుగ నున్నది దీనిని దూర మొనర్ప ప్రయత్నింపుడు అనియున్నది అట్టి వైరాగ్య నిధులగు వారే బ్రహ్మసాక్షాత్కారమును సులభముగ బడయగలరు.

★★★★★★

మనస్తత్త్వము

ప్రతి మానవుడు తెలిసికొనదగిన తత్త్వము లన్నింటిలోను మనస్తత్త్వమే అతి ప్రయాసమైనది ఏలన, అన్నింటిని మనస్సే తెలిసికొనగలదు మనస్సును ప్రకాశము చేయు బుద్ధిగాని లేక ఆత్మగాని మఱియొకటి గలదను భావ మీవిషయములో ఉపయోగపడునది కాదు ఎందుకనగా మనస్సును దాటిపోయినవారికి మాత్రమే అది ఉపయోగకర మగును ఇదే వేదాంత శాస్త్రము లోగల రహస్యము ఇది యెట్లుండుననిన ఒక రాజకీయ సభలో రెండుపార్టీల వారు గలరు కాని ఒక పార్టీకి సంబంధించినవారే మంత్రులు గాను, అధ్యక్షులుగాను, సభ్యులుగాను నున్నారు అట్లుండగా వారికి భిన్నమగు పార్టీవారి యభిప్రాయమును వారు బుజావుచేయుదురా? లేదు కదా! ఆలాగున సమస్త కార్యములను మనస్సే చేయుచుండగా తనకు విరుద్ధ మైన కార్యమేదైనను ఆ మనస్సు చేయగలదా? కనుకనే బ్రహ్మ విద్యయందు మనస్సు ఇంత నిగూఢ తత్త్వము గలిగియున్నది

ఈ విద్య మనోలోకమున కావల వెలుగుచున్నది మనస్సును దాటి పోవక అచ్చోటికి వేఱుమార్గము లేదు మనస్సును దాటిపోవలసియుండిన మనోరాహిత్యము కలుగవలయును, అనగా మనోజయము గలుగవలసి యుండును మనోజయము గలుగవలసి యుండిన ఇంత వరకు జన్మజన్మాంత రముల నుండి యంతఃకరణములో నిలిచియుండు దృశ్య సంస్కారము లన్నియు లయ మొందవలెను అట్టి సంస్కారములకే కర్మయనియు, వాసన యనియు, మాయ యనియు, అవిద్య యనియు, అజ్ఞానమనియు, గుణముల సముదాయమనియు పేర్లు ఇంతేగాక ఇంకను ఎన్ని పేర్లు కర్మను గుఱించియు, బంధమును గుఱించియు గలవో అవన్నియు ఈ మనస్సునకు సంబంధించినవని గ్రహించుకొనవలెను ఈ మనస్సును జయించనిచో బ్రహ్మ విద్యయందు ప్రవేశించుట యెట్టివారికిని సాధ్యమగు పనిగాదు ఈ మనస్సు

యొక్క ఆటంకము చాల గొప్పది ఇందుమాత్రమే ఆత్మవిద్య గోచ రించును ప్రపంచములోగల తక్కిన సమస్త విద్యలున్ను తెలిసికొనుటకుగాని , వాని యందు విజయము గాంచుటకుగాని ఈ మనోజయము, అనగా మనశ్శుద్ధి కావలయునను నిర్బంధము లేదు ఉండిన మంచిదే కాని ఉండి తీరవలయునను నిర్బంధములేదు ఈ బ్రహ్మ విద్యయందు నిశ్చయముగ మనో నైర్మల్యము గావలయునను నిర్బంధ నియమము గలదు ఇట్టిదానిలో నిది అలంఘనీయ శాసనము కనుకనే దీనియందు జనులకు ప్రవేశము గలుగకుం డుటయున్ను, ఒకేవేళ కొందఱకు సుకృతవశమున ప్రవేశము గలిగినను విజయము సంప్రాప్తింపక జారిపోవుటయు జరుగుచున్నది

ప్రపంచములో గల విద్యలలో ముఖ్యములగు నాల్గు వేదములున్ను, వేదాంగములున్ను చదువుటకును, చదివించుటకున్నూ నిర్విషయస్థితి చిత్తై కాగ్రతాపరమగు ఉపరతి గలుగవలయునను నిబంధన లేదుకదా! ఏలన వేదములు నాల్గింటిని చదివినవారును, చదివించెడివారును, ఆలాగున వేదాంగములను గ్రహించినవారును, గ్రహింపజేయువారును అనేకులు గలరుకదా! కాని నిర్విషయస్థితిగాని, బంధవిముక్తిగాని, మనోరాహిత్యముగాని యెందఱు కలిగియుందురు? వేదాంగములగు వ్యాకరణశాస్త్రముగాని, జ్యోతి శ్శాస్త్రముగాని, వైద్యశాస్త్రముగాని, విజ్ఞానశాస్త్రముగాని(సైన్సుగాని) శిల్పశా స్త్రముగాని (యింజనీరింగ్)గాని, వెయ్యేల, ప్రపంచమున నెన్ని శాస్త్ర ములు గలవో వాటి యన్నిటిలో ప్రవేశము గలవారనేకు లున్నారు వారు గూడ మనశ్శాంతి గలుగక, ప్రసన్నత నొందక, అజ్ఞానము తొలగక , శ్రమ పడుచుండుట మనము గాంచుచున్నాము ఇక యజ్ఞాది కర్మశాస్త్ర పారీణు లనేకులు కలరు వీరిలో, ఆత్మశుద్ధి గలిగి ఉపశమనమును పొందిన వారెందఱు కలరు? ఇదే రీతిగ భూగర్భశాస్త్రము, నక్షత్రశాస్త్రము మొదలైనవి తెలిసినవారికి గూడ ఆత్మశుద్ధి గల్గియుండవలెనను నియమము లేదు ఆత్మవిద్యలో ఇట్టి ప్రయాస ముండుటయే ఆత్మవిద్య సామాన్య జనులకు అటవాటులో లేకపోవుటకు కారణమైనది అందుచేతనే జీవకోట్లు తమస్సులో పడియుండవలసి వచ్చినవి ఈ విషయమై సీతారామాంజనేయము చూడదు

వేదశాస్త్రంబులు వివరించి బుధులచే
జదివింపవచ్చు దా జదువవచ్చు
యజ్ఞదానతపంబు లధికారి జనముచే
జేయింప వచ్చు దా జేయవచ్చు
నిలలోన గల తీర్థముల కేగ నన్యుల
బోధింప వచ్చు దా బోవవచ్చు
నష్టాంగయోగవిద్యల నార్యులకు నుప
దేశింపవచ్చు సాధింపవచ్చు
గాని యెవ్వారికైన విజ్ఞానయోగ
గతిని దేహేంద్రియము లరికట్టి మనము
నాగి యంతర్ముఖముజేసి యనవరతము
నిశ్చలసమాధినిష్ఠచే నిలువరాదు.

తక్కిన విద్యలయొక్కయు, ఆవిద్యల ఫలములయొక్కయు అంతర్ముఖము నుండి యీబ్రహ్మవిద్య ప్రారంభమగుచున్నది వేదాంతమనగా వేదముల యొక్క అంతిమభాగము దీనికి ఉపనిషద్విద్య యని పేరు అందు ప్రవేశించుటకు ముందుగనే అంతఃకరణశుద్ధి గలుగవలెనని యది కఠినముగ శాసించును ఈ ఆజ్ఞోల్లంఘనము ఎవరిచేతను చేయ సాధ్యము గాదు చేసినచో పునర్విచారణ లేకనే అతనినది దానినుండి తొలగించును దీనికే పతనమని పేరు మరల దానిలో చేరవలసియుండిన పుణ్యసంస్కారము కావలసి యుండును అట్లైన దాని యందు మరల ప్రవేశము కలుగచేసికొనవచ్చును అంతఃకరణశుద్ధి కలుగవలసియుండిన శమాదిషట్కసంపత్తి యవవరము, అనగా శమము, దమము, ఉపరతి, తితిక్ష, సమాధానము, శ్రద్ధ – ఇవన్ని యు చేరిన శమాదిషట్క సంపత్తి గలిగెనని నిశ్చయించుకొనవచ్చును.

దీనిలోగల మరియొక అంగమును సాధనచతుష్టయ సంపత్తియని చెప్పుదురు నిత్యానిత్య వస్తువివేకము, ఇహాముత్రఫలభోగ విరాగము, శమాది షట్కము, ముముక్షుత్వము – ఈ నాల్గును జేరి సాధనచతుష్టయ సంపత్తి యనబడును

ఇందు ముముక్షుత్వము మందమనియు, తీవ్రమనియు రెండు విధములు ఇవన్నియు ఏకకాలములో చేరునప్పుడు నిజమైన యంతః కరణ శుద్ధి కలుగును అనగా మనశ్శుద్ధి సిద్ధించును అధికపుణ్య ఫలముయొక్క యావిర్భావము కలుగునపుడే మానవుడు దైవత్వములోనికి ప్రవేశించిన వాడును, మోక్షద్వారముయొక్క తలుపు దగ్గరకు వెళ్ళినవాడు నగును ఈఘట్టముననే శ్రీకృష్ణభగవానులు గీతయం దిట్లుపదేశించిరి

యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।
తదా గన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥

ఎప్పుడు అనుష్ఠానముచే పరిపక్వావస్థ కలుగునపుడు నీ యొక్క బుద్ధి దేహమే యాత్మయనెడి అజ్ఞానరూపదోషమును, లేక అవిద్యను దాటునో, అప్పుడు ఇకపై వినదగిన వేదాంతార్థముయొక్కయు, ఇంత వరకు శాస్త్ర ములద్వారా వినబడిన వేదాంతార్థముయొక్కయు యథార్థ జ్ఞానము, అనగా వేదముయొక్క నిజమగు అర్థమును తెలిపెడి నిర్వచనమును పొందగలవు

ఈలాగున స్కందోపనిషత్తునందుగూడ ఉపదేశింపబడినది ఎట్లన,

న నిజం నిజవద్భాత్యంతః కరణ జృంభణాత్ ।
అంతః కరణనాశేన సంవిన్మాత్రస్థితో హరిః ॥

అనగా అంతఃకరణము దృశ్యవిషయములతో కూడి బహిర్ముఖ మైనపుడు నిజమైన ఆత్మస్వరూపము అనుభవమునకు రాకయుండును అంతఃకరణము శుద్ధమగునపుడు సత్యస్వరూపుడగు పరమేశ్వరుడు తన యాత్మగా వెలుగుచున్నట్లు గోచరమగును

అంతేకాదు ఇంద్రియములలో వాసన (దృశ్యవృత్తి) గలవారికి ఈశ్వరుని పరమార్థముగ నెఱుంగుటకు కూడ నవకాశము గలుగదు మైత్రేయ్యుపని షత్తున్ను ఈవిధముననే చెప్పుచున్నది

శబ్దస్పర్శమయా యేఽర్థా అనర్థా ఇవ తే స్థితాః ।
యేషు సక్తస్తు భూతాత్మా న స్మరేచ్ఛ పరం పదమ్ ॥

శబ్దస్పర్శరూపరసగంధాదులు అజ్ఞానదశలో సౌఖ్యములుగ నగుపడినను, యథార్థస్థితిని తెలిసికొనుటలోనవి యాటంకమును కలుగ

జేయును కావున నవి యనర్థములనియే గ్రహించవలెను ఏలన నవి దృశ్య సుఖములు శాశ్వతము లనియు, వాని ననుభవించుట జీవుని స్వభావ మనియు తలంచునట్టి బుద్ధిని గలుగజేయును అందువలన పరమపదప్రాప్తికి హేతువగు పరమేశ్వరుని (బ్రహ్మమును) నిశ్చయముగ స్మరించుట కవకాశము కలుగదు కావున మనుజు డేమి చేయవలసి యుండునో, ఆవిధిని శ్రుతి యిట్లు తెలుపుచున్నది

తపసా ప్రాప్యతే సత్త్వం సత్త్వాత్సంప్రాప్యతే మనః ।
మనసా ప్రాప్యతే హ్యాత్మా హ్యాత్మ ప్రాప్త్యా నివర్తతే ॥

(మైత్రేయ్యుపనిషత్)

అనగా, తపస్సువలన అంతఃకరణము శుద్ధమగును మనస్సు శుద్ధ మగునపుడు ఆత్మకది స్వాధీనముగా నుండును అట్టి శుద్ధమైన ఆత్మలో పరమాత్మ స్వరూపజ్ఞానము స్ఫురించును అట్టి స్వస్వరూప సాక్షాత్కార జ్ఞానము కలుగునపుడు సంసారదుఃఖము లన్నియు నశించును గంధకసౌవీర పాషాణాది ధాతువులను స్ఫుటముచేయుట వలన అందలి విషదోషములు నశింప, ఏలాగున నవి సిద్ధౌషధము లగునో, ఆలాగున తపస్సువలన విషయాది దోషములన్నియు నశించి ఆత్మ శుద్ధమగును నిరంతర మీశ్వరచింతనయు, ఆత్మోపలబ్ధిపరమగు యోగనిష్ఠయు, శమద మాదిగుణములతో కూడిన బ్రహ్మ విచారమును తపశ్శబ్దమునకు పర్యాయవాచకములు తపశ్శబ్దము యొక్క అర్థము, అంతఃకరణములోగల సమస్త దోషములను జ్ఞానాగ్నివలన దహింపజేయుటయే యగును ఇది యేప్రకారము కలిగినను దానిని తపస్సనియే చెప్పవచ్చును

మనస్సును పరిశోధించి చూచిన నది త్రిగుణములతో చేరినదే యని తెలియగలదు ఈగుణత్రయములో ఎవ రేగుణము గలిగియుందురో వారు తాము చేయు కార్యము లన్నియు నీతియుక్తము లనియు, అనుష్ఠేయము లనియు, ధర్మవంతము లనియు తలంచునట్లు చేయు ఒక మహిమ యద్దాని యందిమిడియున్నది దీనిని కనుగొనుటకు గుణత్రయాతీతునకు మాత్రమే సాధ్యమగును కనుకనే జీవకోట్లన్నియు వారివారి సంస్కారము (మనస్సు)

ననుసరించి ప్రవర్తింపగలరని శాస్త్రము చెప్పెడు రహస్యము ప్రాణికోట్లు కర్మపాశములచే బంధింపబడినవారలని చెప్పుటకు కారణమిదియే అనేక రంగులుగల యద్దము లమర్చబడియుండు మేడలో మీరు కూర్చుండినచో ఆ యద్దముల యొక్క రంగు నీలముగాని, పీతముగాని, రక్తముగాని అయి యుండిన, వాని ద్వారా వచ్చెడు సూర్యరశ్మిచే నాగృహమంతయును, దానిలో నుండు సామానులన్నియును ఆదర్పణవర్ణము ననుసరించి ప్రకాశించుచున్నట్లు గాంచ గలరు అప్పుడది సత్యముగానే గోచరించును ఇంటిలో నుండి బైటకు వచ్చి చూచిన మాత్రమే సూర్యుడు కేవలము ప్రకాశస్వరూపుడై యుండె ననియు, గృహాంతర్భాగమున గన్పించెడి వర్ణములన్నియు దర్పణముల భేద ములచే గల్గిన వనియు తెలిసికొనగలరు ఆలాగున జీవకోట్లు త్రిగుణములతో కూడి కర్మపంజరములోపల నుండువరకు సత్యస్వరూపుడగు ఈశ్వరుని (ఆత్మను) యథార్థముగ తెలిసికొనజాలరు ఇదే దీనిలో గల రహస్యము

కనుకనే బ్రహ్మవిద్యను ఆత్మజ్ఞానము పొందిన యాచార్యుని వలన గ్రహింవలెనని చెప్పెడు రహస్యము లేనిచో వారివారి మనస్సు ననుసరించి వారు వారు చేయునవన్నియు సరిగా నుండునని తోచెడు ప్రమాదములో పడిపోవుదురు ఆత్మజ్ఞుడైన గురువైనచో ఇతరులలోగల గుణములను కనుగొన శక్తిగలిగి యుండును అప్పుడు వారిని దిద్దుట కామహాత్ముని కర్తత యుండును కనుకనే గీతయందిట్లు చెప్పబడినది

సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।
శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః ॥

అనగా ఓ అర్జునుడా! సమస్త ప్రాణులకు వారి వారి పూర్వజన్మ సంస్కారముతో గూడిన యంతఃకరణము ననుసరించిన స్వభావము గలుగుచున్నది ఈజీవుడు శ్రద్ధయే(స్వభావమే) స్వరూపముగా గలవాడు, ఎవ్వడెట్టి శ్రద్ధ(స్వభావము) కలవాడో వాడట్టి శ్రద్ధకు తగినవాడే యగుచున్నాడని యర్థము

మీరెవ్వరైనను ఎఱుపు, పసుపు, నీలవర్ణములు గల సులోచనములు పెట్టి చూచిన యెడల, జగత్తంతయు మీరు ధరించియుండు దర్పణవర్ణముగానే

కన్పించును! శుద్ధమైన అద్దముద్వారా చూచువారు మాత్రమే అన్ని వర్ణములున్నూ, వేఱు వేఱుగ కనుగొనుటకు శక్తి కల్గియుందురు ప్రకృతి యొక్క రహస్యమున్నూ ఈలాగుననే యుండును కావున త్రిగుణములను దాటు పర్యంతము మనము సత్యమును తెలిసికొనజాలము పరమేశ్వరుని యొక్క సృష్టిమహిమ ఈలాగుననే యుండును కావున ఈశ్వరానుగ్రహముచే ప్రకృతిదోషము తొలగినమాత్రముననే సత్యము గోచరము కాగలదని చెప్పెడు రహస్యమిదే బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము కలవారిలో అగ్రగణ్యులును, త్రిమూర్త్యాత్మస్వరూపులును, పరమాద్వైత సత్యమును బోధించు గురువరేణ్యులునగు శ్రీదత్తాత్రేయులుగూడ అవధూతగీతయందు ప్రారంభముననే యీశ్లోకము నుపదేశించిరి

ఈశ్వరానుగ్రహాదేవ పుంసా మద్వైతవాసనా ।
మహాభయపరిత్రాణా ద్విప్రాణా ముపజాయతే ॥

జీవకోట్లకు ఈశ్వరానుగ్రహము వలన మాత్రమే అద్వైత జ్ఞానము కలుగును సాంసారిక గుణములచే బద్ధులగువారికి దీనికంటె వేఱుమార్గము లేదు కనుకనే యెట్టివారును మొదట భక్తి గలిగియుండవలె ననియు, అట్టి భక్తిలేని వారికి ఈశ్వరసాక్షాత్కారజ్ఞానము గలుగదనియు శాస్త్రములును, మహాత్ములును చెప్పుచున్నారు

కనుకనే 'సదా యింద్రియనిగ్రహము కలిగియుండుము మనస్సునెల్లప్పుడును స్వాధీనములో నుంచుకొనుము నిస్సంగత్వము కలిగే లాగున చూడుము ప్రకృతిగుణములు కలిగియుండకుము శాంతము, కరుణ విరక్తి, భక్తిగల్గి వర్తింపుము' – ఇట్టి పావనమగు నుపదేశమును గురువులు ముందుగ నుపదేశించుచో, మఱియు ఉపదేశమును పొందిన శిష్యులు అలాగున సదా ఆచరణలో నుంచుచో, లోకమెంతో బాగుపడియుండును అయితే అట్టి స్థితి గల్గుటకు వారి దృశ్యసంస్కారము నశించవలెను కర్మము క్షయించవలెను మనశ్శుద్ధి కలుగవలెను అత్తరి నింద్రియనిగ్రహము మనోనిరోధము గల్గియుండవలెనని జెప్పెడు వేదవాక్యము సార్థక మగును అట్లు గానిచో ఎంత గొప్ప యుపదేశము లైనను నిరర్థకములే యగును

విరేచనమునకు ఔషధము వేసికొని యుష్ణోదకము పానము చేసిన బహిర్భూమికి వెళ్ళక నిశ్చలముగ గూర్చుండుమని చెప్పినచో పాప మతడేమి చేయగల్గును? విరేచనమయి, మలశుద్ధి అయిన తరువాత నిర్విచారముగ నుండుమని చెప్పిన అత డాలాగుననే చేయగల్గును ఇప్పుడు గల వేదాంత బోధయు ఈలాగున పరిణమించినది అంతఃకరణశుద్ధి గలుగుటకున్ను పాపము క్షయించుటకున్ను తగిన సాధన లుపయోగించక, అమనస్కము, అచలము, నిర్వకల్పము, నిస్సంగత్వము, సమాధి, తురీయము, తురీయాతీతము, సర్వసాక్షిత్వము, దృక్‌స్థితి మొదలగు అతీతవాక్యము లుపదేశించి యేమి ప్రయోజనము? సామాన్యజనులు కూడ పైజెప్పిన వాక్యములను విని తామున్నూ సాక్షిభావములోనో, అమనస్కములోనో, అచలములోనో, సదా తురీయములోనో యున్నట్లు బల్కుచుందురు దీనియొక్క యధార్థస్థితి గలుగకపోవుటచేతనే ఉపదేశమును పొందినవారు దృశ్యవిషయములలోనికి దిగిపోవుచున్నారు ఉపదేశించువారున్నూ మనోనిగ్రహము కలుగక దృశ్య బాధలో పడి పరితపించుచున్నారు

కావున ఆత్మశుద్ధి కలుగుటకు హేతువులైన దివ్యమంత్రజపము, సాత్త్వికాహారము, తపస్సు, యోగము, వ్రతము, పరమభక్తి, పుణ్యకర్మానుష్ఠానములు, వేదాంతశ్రవణము ఈలాటి దివ్యగుణములు గల్గియుండిన ఆత్మశుద్ధి త్వరలో సిద్ధించును అపుడు నిర్వికల్పము మొదలగున వన్నియు ప్రయత్నము లేకనే సిద్ధించును, అపుడే ప్రవాహవేగమును, అనుకూలమైన గాలినిన్ని అనుసరించి పోయెడు పడవవలె ఆత్మోన్నతిలోనికి త్వరలోనే చేర వచ్చును అట్లు కాని బోధలన్నియు ప్రవాహవేగమునకున్నూ, వాయు వేగమునకున్నూ అడ్డముగ నడిపింపబడు పడవ చందమున శ్రమ పడవలసియుండును

మంచి బుద్ధిగల ఉపదేష్ట లందఱును పై జెప్పిన అతిపావనములగు గుణములున్నూ, అనుష్ఠానములున్నూ క్రింది మెట్టు లనియు, వారిబోధలు అన్నిటికన్న పైస్థితి అనియు వచింతురు వారు చెప్పినది మాత్రము పైస్థితిలో చేరునదేకాని వారుండు స్థితిని చూచిన భూమి మీదనే వారు సంచరించుచున్నా

రని తెలియవచ్చును గుణము, శుభేచ్ఛగల పుణ్యజీవులయొక్క పవిత్రప్రవర్తన కూడ వారియందు కనుపించుట లేదు కనుకనే పరమపవిత్రమై దివ్యమై బహ్మాది దేవతలచే కూడ పూజింపబడెడు బ్రహ్మవిద్య కింత పతనము కలిగినది.

ఇక బ్రహ్మవిద్య యున్నతస్థితికి రావలసియున్నచో కొందరు అంతః కరణశుద్ధి గలవారును, బ్రహ్మనిష్ఠులును, త్యాగశీలురును సోమరి తనమను పెనుభూతమును జయించినవారును, కొంతవరకైన శాస్త్ర పరిచయము గలవారును, తపస్సునుగాని, యోగమునుగాని బాగుగా ఆచరించిన వారును పరమ విరక్తులుగా బ్రహ్మచర్యవ్రతమును నిర్వహించువారును ఏర్పడవలెను ఒకవేళ విద్య లేనప్పటికిని మంచితపసుగాని, పరమభక్తిగాని గలిగియుండిన చాలును, విద్య చదివినను, తపస్సుచేత ఆత్మ స్పుటము వేసిన బంగారమువలె ప్రకాశింపవలెను అట్లు చేయని విద్య, అవిద్యయే యగును

పై జెప్పిన నిర్మలగుణముగల పురుషశ్రేష్ఠులవలె; ధీరత్వముగల నారీమణులు కొందరు ఏర్పడవలెను వీరు తమ జీవితమంతయు ఆత్మజ్ఞానో పార్జన మందును, బ్రహ్మనిష్ఠ చేయుటలోను, వాని నుపదేశించుటలోను వినియోగించవలెను తక్కిన ప్రపంచకార్యములు చేయుట కనేకులున్నారు వారాయా కార్యములను చేయుచుందురు ఈ బ్రహ్మనిష్ఠులలో కూడ పరిపక్వ మనస్సు కలుగనివారుండిన, వారు పుణ్యకర్మలను, లోకసేవను చేయు చుండుటయే మిక్కిలి శ్రేయస్కరమైనది వృత్తులు, సంస్కారములు విషయ వాసనలు, అంతఃకరణములో నుండువఱకు నిరంతర మీశ్వరుని విషయములో నిలకడ గల్గియుండుటకు సాధ్యము గాదు వీరున్నూ ధ్యానకాలములో ధ్యానా నుష్ఠానము నభ్యసించుకొనవలెను, ధ్యేయమగు భగవద్వృత్తి గల్గియుండు వరకున్నూ అట్టివృత్తియే చాలును దానినుండి బాహ్యావృత్తి గలిగినపుడు పై చెప్పిన సత్కర్మలను, బాహ్యాభ్యాసమును నందఱును చేయుచుండవలెను ఇదే యుత్తమమైన పద్ధతి యగును పూర్వఋషి సంప్రదాయమున్ను ఈలాగుననే యుండెను అట్టి పద్ధతియే మఱల మనకిపుడు కావలసినది అయినను దేశకాలానుసారము అనుకూలమగు మార్పులు వివేకజ్ఞులు చేయుదురు వాని ననుసరించి వర్తించేలాగున చూడవలెను అవన్నియు బాహ్యప్రపంచమును

గుఱించియేగాని, ఆత్మవిషయములో ఏలాటి మార్పులు గలుగవు ఏలన అది సనాతనము, మార్పులేనిది, నిత్యము

నివృత్తి మార్గము

ఇంతవఱకు చెప్పిన విషయములో మనము మఱింత లోతుకు దిగి చూడ వలసియుండును లేకపోయిన నివృత్తిమార్గము పూర్తిగా గన్పించదు అట్లు లోతున ప్రవేశించుటకును, అచ్చట జరుగుచుండు తత్త్వరహస్యములు కనుగొనుటకున్ను హృదయశుద్ధి పూర్తిగ కావలసియుండునని ముందుగనే చెప్పబడియున్నది అది లేనిచో కాఱుచీకటిలో నుండు వానికి త్రోవ తెలియనట్లు మనమేమియు తెలిసికొనజాలము జలము బురదచే నిండి యుండ, దాని లోపల జరుగు విషయములను, అచ్చట నుండు జంతువులను, వస్తువులను ఏలాగున తెలిసికొనజాలమో, ఆలాగున అంతః కరణము పాప పంకిలమై యుండునపుడు సృష్టియొక్క రహస్య మేమియు తెలియ సాధ్యము కాదు అంతఃకరణ శుద్ధికలిగి రాగా రాగా పరమేశ్వరుని యొక్క సృష్టిశక్తి కొంచెము కొంచెముగా మనకు గోచరము కాగల్గును అప్పుడే సత్యము తెలియవచ్చుటచే అనిత్యములగు విషయములలో విరక్తి గల్గి సత్యము నాశ్రయించే స్వభావము కలుగును

ఈ స్థితికి వచ్చునపుడు మనుజుడు తాను స్వయముగ జడస్వభావము గలవాడు కాదనియు, కేవలము చైతన్యాత్మ యనిగాని, చేతనాత్మయొక్క యంశమనిగాని స్వబోధ ముదయ మగును అప్పుడు ఇంతవరకున్న స్థితికిన్ని, ఇప్పుడు గల్గిన స్థితికిన్ని చాల మార్పు గల్గును ఇత్తఱి మానవుడు కేవలము మనస్సుయొక్క స్వభావము ననుసరించి ప్రవర్తింపవలసిన పని లేదనియు, ఆత్మయొక్క స్వభావము కేవలము చైతన్యమయ మనియు, జ్ఞానమయ మనియు గోచరము కాగల్గును ఈయంతఃకరణ స్వభావము లన్నియు ఎప్పుడో చేసిన కర్మలచే గల్గినవనియు, వీటిని నివర్తింప చేయవచ్చుననియు స్వయముగా బుద్ధి గల్గును వస్త్రము యొక్కరూపము స్వభావముగ తెలుప

నియు మురికి చేరుటచే నలుపు గల్గినదనియు తెలిసికొన్న పిమ్మట, క్షాళనాదిక్రియలచే నిర్మల స్థితి గలుగజేసికొనవచ్చునని దృఢసంకల్పము కలుగునట్లు ధ్యానాది సంస్కరణ ములచే ఆత్మశుద్ధి చేసికొనవచ్చునని నిశ్చయమగు బుద్ధి యుదయించును

ఒక చక్రములోనో, లేక అంగుల రాట్నములోనో యమర్చిన బొమ్మల వలె అనగా, చక్రముతిరిగిన బొమ్మలవలె తిరుగవలసి యుండునేగాని దాని నుండి తప్పించుకొనుటకు వేఱుమార్గము లేదని ఇంతవరకు కలుగుచు వచ్చిన బుద్ధి నశించును ఏలన, ఆకొయ్యబొమ్మలు నిర్జీవములు, అచేతనములు, మానవుడో నిర్జీవుడు కాడు సజీవుడు అచేతనుడు కాడు, చేతన స్వరూపుడు కావున దాని నుండి తప్పించుకొనవచ్చును-అను బోధ కలుగును

అదే ప్రకారము ప్రవాహమునకు లోబడి పోయెడు కట్టెలు మొదలైన జడవస్తువులన్నియు ప్రవాహవేగము ననుసరించి పోవలసి యుండినను చైతన్యము గల మనము ఆలాగున పోవలసిన పని లేదను తత్త్వ మాతనిని సదా ప్రబోధించుచుండును ఏలన ఈత తెలిసినవారు ప్రవాహమునకు ఎదురీది తీరమునకు చేరుచుందురు తెడ్లు, గడలు, చుక్కాని మొదలైనవాని సహాయముచే ప్రవాహవేగమునుండి తప్పించి మానవులు పడవను గమ్యస్థానమును చేర్చునట్లు అతని నమ్మకమును లక్ష్యప్రాప్తికి మఱింత బలమును గలుగజే యుచుండును

ఆలాగున సూర్యునికాంతి అద్దములద్వారా ప్రసరించు నప్పుడు పలు రంగుల ననుసరించి ప్రకాశించినను, ఇన్ని రంగులతో నిది ప్రకా శించుటకు కారణమేమి యని యోచించెడి యవస్థ కలుగునపుడు ఈప్రకాశ మెచ్చటనుండి వచ్చుచున్నది? దీనియొక్క మూలస్వరూప మెద్ది యని తెలిసికొనవలెనను కుతూహల మతనిని ప్రేరేపించుచుండును అపుడు గృహాంతర్భా గమునుండి బయటకు వచ్చి, ప్రకాశకారణ భూతుడగు సూర్యభగవానుని దర్శించునపుడు ఆభాస్కరమూర్తి తేజోరాశి యనియు, అద్దముల ద్వారా ప్రకాశము వచ్చుటచే దర్పణ వర్ణానుసారము ప్రకాశము కలుగుచున్నదనియు అతనికి

తెలియవచ్చును కదా! ఆలాగున అంతఃకరణ స్వభావము త్రిగుణముల భేదముచే ఏర్పడు చుండుననియు, సాక్షిచైతన్యాత్మ శుద్ధమై, జ్ఞానమయమై, తేజోరూపమై ప్రకాశించుచున్నదనియు, అదే మన యొక్క ఆత్మస్వరూప మనియు అపుడు బోధము కలుగును

అత్తఱి ఆ మానవునకు గలిగెడు నానందము ఇంత, అంతయని వర్ణింప నలవి కాదు సంతోష ప్రవాహములో పొంగిపొరలుచుండును ఉత్సాహమునకు హద్దు లేదు అప్పుడు తానింతవఱకుండిన దానికంటె ఎంతో యున్నతస్థితికి వచ్చితిననియు సాధారణముగ ఎవనికిని సిద్ధింపని మహద్దశ తనకు సిద్ధించెననియు, తాను కేవలము దివ్యమూర్తి స్వరూపుడననియు నిశ్చయమా తనికి కలుగును అత్తరుణమున అతని యంతరాత్మ సదా ఈలాగున ప్రేరణచేయుచుండును ఇట్లు తనయందొక యంతర్వాణి పలుకుచున్నట్లు కూడ తోచును లేక యొక దేవత తనలో ప్రవేశించి ఆత్మలో ఈలాగున పలుకుచున్నదా యని సందేహము గల్గును

కాని అవి యేవియును గావు అది ఆత్మ శుద్ధమగునపుడు గలిగెడు స్వభావమని యోగు లెఱింగియున్నారు సంకల్పముయొక్క బలమాలాగున చేయుచుండును దేనియందు సంకల్పము బలమగునో, అత్తఱి ఆత్మయు ఆలాటి స్వభావము గలదగును ఉప్పులో వేసియుండు వస్తువులు కొంతకాలమునకు లవణమయమైపోవునుగదా! కార్యరూపముగ కన్పించెడి ప్రతిపదార్థమున్నూ దానికి కారణరూపమగు మూలవస్తువుగా పరిణమించుట ప్రకృతి యొక్క అలంఘనీయమగు స్వభావము కార్యరూపముగ నుండెడు విత్తనము కారణరూపమగు వృక్షముగా పరిణమించుట ప్రకృతిమాతయొక్క స్వభావమైయున్నది అయితే కాల, దేశ, పదార్థ, క్రియల అనుకూలత కావలసి యుండును అప్పుడు కార్యవస్తు సముదాయ మంతయు కారణరూపముగ మారుచుండును బీజమునకు మెత్తని నేలయు, జలము, సూర్యప్రకాశము అన్నియు గలుగవలెను అప్పుడే బీజము వృక్షముగా మాఱుట కనుకూల ముండును. అలాగున కారణస్వరూపుడగు ఈశ్వరుని నుండి కార్యరూపమగు జీవుడుగా నుండెడు నాత్మయు తనకు వృద్ధినొందుటకు తగిన భక్తి వైరాగ్యాది

పరికరములన్నియు దొరకునపుడు జీవత్వమునుండి శివత్వమును పొందుచుండును

సాధనానుష్ఠానముల పరిపక్వకాలము వచ్చునపుడు కార్యరూపము కారణరూపముగా మాఱుచుండు ననుదానికొఱకు ఉదాహరణము చెప్పెద చేతన స్వరూపమగు పక్షియొక్క గ్రుడ్డు అచేతనమై (జడమై) యుండును అయితే ఆపక్షి తనయొక్క ఱెక్కలక్రింద గ్రుడ్డును పెట్టుచుండిన స్వయముగ నది భేదింప పిల్లలు ఏర్పడును కాని కొంగ మొదలగు కొన్ని పక్షుల గ్రుడ్లు పరిపక్వము గలిగి పగిలినను, రోమములు, ఈకలు ఏమియు కలుగక కేవలము నెత్తురుముద్దగనే యుండును చలనశక్తి కూడ లేకయుండును సృష్టికర్తయైన పరమేశ్వరుని శక్తివలన ప్రాణశక్తి కల్గి చలనమేర్పడును మఱికొన్ని దినముల కీకలు, రోమము లుద్భవించి కొంచెము కొంచెము తిరుగుట కవకాశము కలుగును వృద్ధి కాగా, కాగా గూటి నుండి యటునిటు బోవుచు తానుండు వృక్షముయొక్క శాఖలలో సంచరించు శక్తి గల్గియుండును మఱింతకాలము మార్పువచ్చు నప్పుడు తల్లిపక్షితోగూడ ఆకాశమున ఎగురుటకు తగిన అవయవము లన్నియు కలుగును ఇపుడేలాగున జడమయమై యుండిన అండము చైతన్యమగు పక్షియై, కార్యత్వము మాఱి కారణత్వమును పొందినదో అలా గున సంసారభావమునుండి జీవుడును నిజస్వభావమగు దైవత్వమును పొందెడు కాలమొకటి వచ్చును

అట్టి దైవత్వావిర్భావ కాలమున వృత్తులు, వాసనలు, సంకల్పములు, సంస్కారములు, గుణములు మొదలగున వన్నియు ఆత్మగుణములుగాని, ఆత్మస్వభావములుగాని కాదను బోధము గల్గును అప్పుడు వాటి నుండి విడుదల పొందుటకేయే ప్రయత్నములు కావలసియుండునో అవన్నియు సమకూర్చుకొని ముక్తుడగును కాని ద్రవరూపముగానుండు జీవపదార్థము పిండరూపమగు అండాకారము పొంది క్రమముగ కరచరణ శిరాది అవయవము లన్నియు ఏర్పడినవి అయితే అవన్నియు గర్భాంతరాళమున జరుగుచుండుటచే సామాన్యజనులు తెలిసికొనజాలకున్నారు ఇది కొంచెము తెలిసికొనిన, దేహాభిమానము చాలవఱకు తొలగిపోవును అది తెలియనీయక

మాయ కప్పిపుచ్చుచుండును మాయయొక్క మహిమ తొలగిపోయినవారికి దేహోత్పత్తిసంగతి తెలియును కనుక వారు నిరభిమానులై యుందురు

న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి ॥ (గీ.4-37)

అనగా ఈ లోకమందు జ్ఞానముతో తుల్యమై పాపములను బోగొట్టి శుద్ధిని గలుగజేయునది మఱి యేదియును లేదు కాలక్రమమున, తన యనుష్ఠానము పరిపక్వస్థితికి వచ్చునపుడు జీవుడు ఆత్మసాక్షాత్కారజ్ఞానము తనలోనే స్వయముగ పొందగల్గును సాధనలో ఈ క్రింద పేర్కొనిన వన్నియు చేరియుండును నిరంతర దైవచింతన, పరిశుద్ధమైన తపస్సు, దైవప్రాప్తిపరమగు యోగము, బ్రహ్మానుసంధాన పరమగు అధ్యాత్మవిచారణయు, భూతకోట్లకు హితము కొరకు నిరంతరము ప్రయత్నము చేయుట వీటిలో ఎవరెవరికి దేని యందాత్మ శాంతి గల్గునో, అవి ముఖ్యమని వారు చెప్పుదురు అట్టిమాటలను విని భ్రమపడ నక్కరలేదు తమ యంతరాత్మ సంస్కారము ననుసరించి దేని యందైనను తుదివరకు విశ్రాంతి నొందక ప్రయత్నించెనేని పరమశాంతి మయ మగు ఆత్మలోనికి సర్వులును చేరగలరు అనగా ఈశ్వరుని పొందగలరు పైజెప్పిన వారందరును తత్తత్కార్యములు జేయుచుండినను దైవధ్యానము అన గా బ్రహ్మధ్యానము లేనివారై యుండరు కావున అది (బ్రహ్మధ్యానము) ముఖ్యమైనది ఈవిషయమై శ్రీయోగవాసిష్ఠమున వసిష్ఠమునీంద్రుడు శ్రీ రామచంద్రున కిట్లుపదేశించెను

స్వసంవిద్యత్నసంరోధాద్యథా చేతః ప్రశామ్యతి ।
న తథాంగ తపస్తీర్థ విద్యాయజ్ఞక్రియాగణైః ॥

అనగా, బాహ్యవిషయములనుండి చిత్తమును నిరోధించి ఆత్మ యందు నెలకొల్పుట యను ధ్యానయోగ క్రమముచే చిత్తము పూర్ణముగ శమించును ఇట్టి చిత్తప్రశమనము తపస్సు, తీర్థ, విద్యా, యజ్ఞాది క్రియా సమూహములచే గూడ పూర్ణముగ సిద్ధింపనేరదు

ఇక ముముక్షువుల సందేహ నివృత్తికొఱకొక సంగతి చెప్పెద మంచి ఆచరణయు, అనుష్ఠానముగల యొక బ్రహ్మనిష్ఠున కేదైన నొక గొప్పవ్యాధి

సంభవించినపుడు ఆహారము భుజింపవలెననిగాని, స్నానాది నిత్యకృత్యములు చేయవలెననిగాని సంకల్ప ముండదు కేవలము దంతధావనముగాని, శౌచముగాని చేయుశక్తియున్నూ గలిగియుండడు అత్తఱి చేయవలెనను విచారము కూడ నుదయింపదు ఔషధసేవవలన వ్యాధి కొంచెము కొంచెము శమించుటకు కాలమాసన్న మైనపుడు స్వయముగ మలవిసర్జనాదిశుద్ధి చేయవలెనను బుద్ధి కలుగును ఇక కొంత ఆరోగ్యము కలిగిన ముఖప్రక్షాళనాదులు చేయవలెనని అతడు వాంఛించును మఱింత ఆరోగ్యము కలిగిన కొంచెము లేచి కూర్చుండిన బాగుగనుండునని వానికి తోచును ఇంకను ఆరోగ్య మావిర్భవించిన కొంచెము తిరుగుచుండిన బాగుండునను ఇచ్ఛ జనించును ఎకువ ఆరోగ్యము కలిగి రాగా రాగా స్నానసంధ్యాద్యనుష్ఠానములు జరుపవలెననియు, భోజనాదులుగూడ ఆరోగ్యదశలో నుండినట్లుండ వలెననియు అభిలాష కలుగును చూచితిరా!

ఇక భవరోగము కల్గియుండు జీవునియొక్క స్థితియు ఈలాగుననే యుండును భక్తివైరాగ్యములను దివ్యౌషధసేవనముచే అజ్ఞానవ్యాధి శమించునపుడు గల్గెడిస్థితియును ఈలాగున నుండును బ్రహ్మనిష్ఠయొక్కశక్తి ఇటువంటిది అనుష్ఠానము పూర్ణావస్థకు రాగా రాగా జీవుడు అజ్ఞాన సంబంధములగు సమస్త దుష్కృత్యములను మానును సమస్త విషయవాసనలను త్యజించును ప్రకృతి సంబంధములగు సకలగుణములను ఉపేక్షించును అట్టి యవస్థ గలుగనందుచేతనే సామాన్యులు వవిషయములను విడువ జాలకయు ఇంద్రియ నిగ్రహాశక్తి లేకయు నున్నవారై వాసనామయములగు విషయములలోనే పడియుండి వేదాంతము మాత్రము వాక్కుతో చెప్పుచుందురు బ్రహ్మధ్యానపరిపక్వత గల్గిన జీవుడు శుద్ధుడు గాను, చైతన్యాత్ముడుగాను, స్వయంప్రకాశ స్వరూపుడుగను నుండును ఆత్మబోధమను గ్రంథ మీలాగున చెప్పుచున్నది

ఏవం నిరంతరకృతా బ్రహ్మైవాస్మీతి వాసనా ।
హరత్యవిద్యావిక్షేపాన్ రోగానివ రసాయనమ్ ॥

అనగా సర్వోత్తమమైన యౌషధమును సేవించుటవలన రోగములు

నశించు నట్లు ఎల్లప్పుడును బ్రహ్మానుసంధానాభ్యాసము చేయుటచే గల్గిన సంస్కా రరూపమైన సద్వాసన, ఆవరణ విక్షేపశ క్త్యాత్మకమైన అవిద్యను పూర్ణముగ నశింపజేయును మఱియు

ఏవమాత్మారణౌ ధ్యానమథనే సతతం కృతే ।

ఉదితాఽ వగతిజ్వాలా సర్వాజ్ఞానేంధనం దహేత్ ॥

లోకమందు, కొయ్యమీద కొయ్యనుంచి చిలికిన మాత్రమున అగ్ని హోత్రము పుట్టి కొయ్యలను దహించివైచునట్లు, ధ్యానమను చిలుకడముచే, జ్ఞానముదయించి మూలాజ్ఞానమును పూర్ణముగ నశింపజేసి స్వస్వరూప సాక్షాత్కారము గలుగజేయును

మఱియు కారణమునుండి గలిగిన సర్వవస్తు సముదాయమును కార్యరూపముకంటె భిన్నముగ కన్పించినను, కారణముతో సంబంధించి నపుడు కార్యత్వము నశించి కారణాకారస్థితిని పొందును దృష్టాంతముగ, భూమి నుండి యేర్పడిన వృక్షాదులన్నియు మఱల భూమిలో పడినపుడు మట్టి అయిపోవును ఆలాగున పృథివినుండి ఉత్పన్నమైన యినుముతో చేయబడినట్టి మిక్కిలి వాడిమిగల ఖడ్గములు ఇతర ఆయుధములు, ఇంజనులు, మట్టిలో పడిపోయిన, కొంతకాలమునకు త్రుప్పుపట్టి మట్టి అయిపోవును అలాగున సమస్త వస్తువు లను గూర్చియు ఊహించుకొనవచ్చును అట్లే బ్రహ్మమునుండి ఏర్పడిన జీవకోట్లన్నియు మరల బ్రహ్మమయమై పోవును

అజ్ఞానముచే జ్ఞానము మఱుగుపడి పోయినను, నిజమగు జ్ఞాన ముదయించుటతోడనే అజ్ఞానము లయ మొందుచుండును ఇదంతయు ప్రకృతియొక్క నియతియై యున్నది కట్టెలో నిగూఢమైయుండు అగ్నిని కట్టె తనయొక్క గర్భములో దాచియుంచినను, అద్దానిని మథింపగా అగ్ని యేర్పడి దానిని దహింపజేయుచుండును ఆలాగున అజ్ఞానము పంచకోశములతో ఆత్మను భద్రముగ మూసివేసి యుండినను, ధ్యాన, నిదిధ్యాసాదులచే విజ్ఞాన ముదయమగు నపుడు దానిచే యజ్ఞాన మంతయును విలీన మొనర్చబడును ఏ కొయ్య కాలుచుండునో దానియందు వాసనగాని, దారుశేషముగాని కొంచె మైనను నిలువదు గదా! ఆలాగున ఏ హృదయములో జ్ఞానాగ్ని ప్రజ్వలించు

చుండునో ఆ హృదయ ములో అజ్ఞానముగాని, వాసనలుగాని యుండవు, గీతను చూడుడు

యథైధాంసి సమిద్ధోஉగ్ని ర్భస్మసాత్కురు తేஉర్జున
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥

అనగా లెస్సగామండుచున్న, అగ్నిహోత్రుడు సమిధలను హోమ ద్రవ్య ములను, అన్నింటిని ఏలాగున సంపూర్ణముగ భస్మమొనర్చునో ఆలాగున జ్ఞాన మనెడి యగ్ని సమస్తకర్మలను వాసనలను సంపూర్ణముగ నాశమొనర్చును అని గీతాచార్యు డుపదేశించెను ఈ విషయమై సీతారామాంజనేయమందు చెప్పిన వాక్యములను వినిన, వాసనలతోను, వృత్తులతోను మా కేసంబంధము లేదని చెప్పెడు వేదాంత బోధకుల హీనాశయ మందఱకును తెల్లముగ విశదము కాగలదు

వనితానందనచందనాది విషయ వ్రాతంబులం బొంది చ
య్యన నంతంతకు జొక్కు నెమ్మనము బ్రహ్మానంద వారాశి వా
సన యొక్కించుక సోకనేని బ్రవినాశంబొందు నానాద్రు పు
ష్పనటద్భృంగము చంపకప్రసవ సంస్పర్శాప్తి గూలుం గతిన్ .

చక్కెరయును లవణంబును
గ్రక్కున నుదకములయందు గరగిన రీతిన్
మిక్కిలి తనుగను ఘను మది
చొక్కుచు నానంద జలధి నుడిసి నశించున్.

ఇతర సంకల్పములు లేక యెపుడు దాను
సచ్చిదాత్ముడ నని సుప్రసన్నవృత్తి
దన్ను గనువాని చిత్తంబు దనకు దాన
పొలియు దనయంద నింధనానలము పగిది.

ఇను డస్తమించు తఱి నా
తని కిరణము లతనితోడ దగ జను రీతిం

జెనుమానసంబు పొలిసిన
మునుకొని తద్గతి వికారములు పొలియు గడున్.

నానాకర్మజ వాసనాన్విత మనోనాశంబు గాకున్న బ్ర
హ్మానందానుభవంబు గల్గునె యనాయాసంబుగా నిప్పు డి
య్యానందాంబుధి నోలలాడక యబాహ్యాభ్యంతరార్థాను సం
ధానోద్భూత నితాంత దుఃఖమయ సంతాపంబు చల్లారునే?
(శ్రీ సీతారామాంజనేయము, అమనస్కము.)

ఒక యింటిగదిలో మంచి దీపము వెలుగుచుండిన దానియందు చీకటెట్లుండును? ఉండజాలనట్లే, మంచిజ్ఞానప్రబోధము గలవారి యంతఃకరణములో అవిద్యాసంబంధము లేమియు నుండజాలవు ఇక నీ విషయమై విస్తారముగ వ్రాయబనిలేదని తలచెద

అయితే యిపు డొక సంశయము ముము క్షువులకు గలుగవచ్చును అదేమన, ఇపుడు కొందఱు బ్రహ్మనిష్ఠులై యున్నను, వారిలో కొందఱికి కొన్ని ప్రకృతికి సంబంధించిన గుణములు, విషయములు కాన్పించుచుండునే! ఆవిషయమై వారినడిగిన అంతఃకరణ వృత్తుల కాత్మ సాక్షిగా నుండునని చెప్పుదురు ప్రమాణము కూడా చూపుదురు సరి, రోగియైనవాకి ఆరోగ్యము కలిగిన పిమ్మటగూడ అప్పుడప్పుడు రోగ చిహ్నములు కలుగుచుండిన జనులేమి తలంతురు? ఇకను రోగముయొక్క లేశము నిలిచియున్నది కావుననే అప్పుడప్పుడు బాధలు కలుగజేయుచున్నది అని యెంచుదురు ఆలాగున వారు బ్రహ్మనిష్ఠ చేయుచుండవచ్చును కాని ధ్యాననిది ధ్యాసనాదులు చాలవు, శ్రవణమననములు పూర్తియై నిదిధ్యాసమున రూఢిగ ల్గినవారట్టిగుణము గల్గియుండరు కనుకనే శాస్త్రమీలాగున చెప్పినది

అహం బ్రహ్మేతి వాక్యార్థబోధో యావద్దృఢం భవేత్ ।
శమాది సహిత స్తావదభ్యసేచ్ఛ్రవణాదికమ్ ॥

దీనియర్థము పైన తెలిపినదే బాగుగ జ్వలించు అగ్నిలో కొంత భాగము కాలక నిలిచిపోవునా? పోదు అంతయును భస్మమగును సుగంధము

గల హోమద్రవ్యముగాని, దుర్గంధముగల యితర వస్తువులుగాని అన్నియును భస్మములైపోవును బాగుగ జ్వలింపని అగ్నియైనచో, కొంతభాగము కాలకయు, బొగ్గులతో కూడియు, హోమించిన వస్తువులను దహింపజాలక పొగ కలిగియుండును అప్పుడు శ్రోత్రియు డేమిచేయును? మఱల సమిధలు ఎక్కువగ వేసి విసనకఱ్ఱచే అగ్నిని ప్రజ్వలింపజేసి పూర్ణముగ భస్మమొనర్చును అట్టి హోమమునకు మాత్రమే ఫలము గలుగును ఆలాగున ఆత్మయజ్ఞము చేయు బ్రహ్మనిష్ఠులు తమయందు విషయవాసనలుగాని, ప్రాకృత వృత్తులుగాని యుండిన, మఱింత వైరాగ్యమును బలవఱచి, మంచి యేకాంతస్థలమున తీవ్రమగు బ్రహ్మనిష్ఠ నభ్యసించుకొనవలెను లేనిచో సామాన్యస్థితినే పొందుదురుగాని, అతీతబ్రహ్మనిష్ఠుల స్థానము లభింపజాలదు నిశ్శేషక్లేశ శమనమును కలుగదు సముద్రాంతర్గత బడబాగ్ని జ్వలింప ప్రారంభించిన, అయ్యది సముద్రజలమునంతయు ఏలాగున రహిత మొనర్చునో, ఆలాగున అంతఃకరణములోగల సంసార వాసనా మయమగు జలమంతటిని జ్ఞానాగ్ని ప్రజ్వలించిన నశింపజేయగల్గును

ఇప్పుడు జీవకోట్లు వాసనావశమై ప్రవర్తించునని చెప్పిన యెడల ఒక సందేహము ముముక్షువులకు కలుగును అదేమన, అట్లైన నీ వాసనకు అంతము గలదా? లేదా?యని కలదని చెప్పిన జీవకోట్లన్నియు కాలపరిపక్వము గల్గునపుడు ముక్తు లగుదురు లేదని చెప్పిన నెల్లప్పుడును బద్ధులై యుందురు అట్లయిన ప్రయత్నమే యక్కర లేదు ఏ జీవి యే కార్యమును చేసినను అది వాటియొక్క స్వభావమే గనుక దాని నుండి నివృత్తిగల్గెడు ప్రయత్నమే అవసరము లేకపోవును అట్లయిన నివృత్తిమార్గమును బోధించెడు శాస్త్రములే వ్యర్థములగును అంతేగాక జ్ఞానోపదేష్టలగు పరమగురువుల యొక్కయు అవసరముండదు ఈవిషయమై మనము చెప్పబూనిన అంతము లేదు శాస్త్రముయొక్క సిద్ధాంతమే సజ్జనులయొక్క అభిప్రాయమైయున్నది

ఎప్పుడైనను ఈ జీవులు పుణ్యకర్మ విశేషమువలననో, ఈశ్వరుని కరుణ వలననో, కాకతాళీయముగ మహాత్ముల కృపవలననో ఆత్మజ్ఞానములో ప్రవృత్తి గల్గి రాగా రాగా రెండువిషయములకు వశపడి యుండవలెననెడి

తత్త్వము బోధమగును 1 మనయొక్క గుణములను కనిపెట్టి సవరించుటకు మనకు స్వయముగ సాధ్యము కాదు 2 మనకంటె ఎక్కువస్థితిలో నుండు వారును, ఆత్మజ్ఞానము గలవారును, ఈశ్వరసాక్షాత్కారము గలవారునునగు జ్ఞానులను అనుసరించి వారు జెప్పేలాగున నడువవలెనని బుద్ధి యుదయ మగును ఇదే యెక్కువమందికి గలిగెడు పుణ్యస్వభావమై యుండును ఇట్టివారు గురూపదిష్ట మార్గానువర్తులై యుందురు దానివలన వారు త్వరలోనే బంధనమునుండి విముక్తు లగుదురు

ఇక రెండవ తరగతి వారు గలరు ఇట్టివారు చాలా యరుదుగనే యుందురు వారీశ్వరప్రాప్తి కొఱకు తీవ్రమైన తపోధ్యానాదులయందు సదా ప్రవృత్తి గల్గియుందురు సమస్తమును ఈశ్వరునియందు సమర్పించి అనన్యభక్తి గల్గి తదేకధ్యాననిష్ఠ గలవారై యుందురు ఉత్కృష్టమైన శాస్త్రములనుగూడ, ధ్యానము నుండి బహిర్దృష్టి గల్గినపుడు చూచుచుందురు అనేక బ్రహ్మనిష్ఠుల దర్శించి వారి యాచరణ లన్నియు తెలిసికొని ప్రవర్తింతురు వీరున్నూ ఈశ్వరానుగ్రహమువలన కొంతకాలమునకు ప్రకృతి దోషరహితులై జీవత్వోపాధినుండి విముక్తులగుదురు ఎవరు తమలో గల దృశ్యవిషయవాసన నశించు పర్యంతము బ్రహ్మనిష్ఠ చేయుదురో వారే పుణ్యజీవులు ఇదే ఋషుల యొక్క ఆశయము

నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహవిద్యతే ।
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి ॥

ఈ లోకమందు పాపములను బోగొట్టి అంతఃకరణశుద్ధిని గలుగ జేయునది జ్ఞానముతో తుల్యమైనది మరేదియు లేదు కదా! యోగధ్యాన నిష్ఠాపరాయణుడై కాలము పరిపక్వము కాగా తనయందే మనుజుడాత్మ సాక్షాత్కారరూపమగు జ్ఞానమును పొందుచున్నాడు

తేషా మేవానుకమ్పార్థ మహమజ్ఞానజం తమః ।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥

నేను అట్టి ధ్యాననిష్ఠాపరులగువారి యంతఃకరణమున నివసించుచున్న వాడనై అనుగ్రహించు తలంపుతో వారి యజ్ఞానమను తమస్సును

ప్రకాశించుచున్న వివేకమను దీపముచే నశింపజేయుచున్నాను అని గీతాచార్యులగు శ్రీ కృష్ణభగవాను లుపదేశించిరి

జ్ఞానయజ్ఞోడుపేనైవ బ్రాహ్మణోవాఽన్త్యజోఽపి వా ।
సంసారసాగరం తీర్త్వా ముక్తిపారం హి గచ్ఛతి ॥

జ్ఞానమనెడు ఓడచే బ్రాహ్మణుడైనను, అంత్యజుడైనను ఈ సంసార సాగరమున తరించి ముక్తియను తీరమును పొందగల్గును

సంసారార్ణవ మగ్నానాం జంతూనా మవివేకినామ్ ।
అగతీనాం గతిస్సాక్షాత్ జ్ఞానమేవ హి కేవలమ్ ॥

సంసారమనెడి దుఃఖసాగరములో మునిగినవారును, వివేక జ్ఞానము పూర్తిగ లేనివారును, సహాయ మేమియు లేనివారునగు మానవులకు ఈజ్ఞానమొకటియే సమస్త దుఃఖముల నుండి తరింపజేసి మోక్షము గలుగజే యునదై యున్నది అని పరమశివుడు సూతసంహితయం దుపదేశించెను

ఇప్పుడు శ్రీవిష్ణుమూర్తియొక్కయు, పరమశివునియొక్కయు నాశయము మనము తెలిసికొనడమైనది చెట్టు కాలపరిపక్వావస్థ వచ్చునపుడు పుష్పించి ఫలించినట్లు ధ్యాననిష్ఠ పరిపక్వస్థితికి వచ్చునపుడు వారి యంతరాత్మలో జ్ఞానము స్వయముగా నుదయించి ప్రకాశించును అరణిని మధించి రాగారాగా అగ్ని ప్రజ్వలించునట్లును, పెరుగును తరచుచు రాగా రాగా నవనీతము బయటపడునట్లును, బావి త్రవ్వుచు రాగారాగా జలము కన్పించునట్లును వీరిలో గూఢమైయుండు ఆత్మతత్త్వమున్ను తపోధ్యానాదులు చేయుచు రాగా కొంతకాలమునకు ప్రకాశమునకు వచ్చును. అట్టి తపోధ్యా నాదులు చేయని పక్షమున శుద్ధాంతఃకరుణులై యుండిరేని వేదాంతశ్రవణ మనన నిదిధ్యాసాదులు తప్పక చేయుచువచ్చిన వీరున్నూ స్వరూప సాక్షాత్కారము పొంది ముక్తులు కాగలరు

ఈ బ్రహ్మవిచారము చేయువారిలో అనుష్ఠాన పరిపక్వత ననుసరించి శుక్లపక్ష చంద్రుని గమనమువలె కొందరు ద్వితీయ, కొందరు పం చమి, కొందరు సప్తమి, కొందరు ఏకాదశి , కొందరు త్రయోదశి నాటి చంద్రక ళలవలె ఆత్మప్రకాశములోను, సత్త్వగుణ పరిణామములోను విభేదము

గల్గియుందురు పూర్ణిమదినమున పూర్ణచంద్రుడు సంపూర్ణకళలతో నెట్లు ప్రకాశించుచుండునో, ఆలాగున కేవలము దృశ్యము నశించి నిరంతరము దైవాకృతి కలవారు చాల అరుదుగానుందురు మఱియు, పూర్ణిమదివసమున అస్తమయము నుండి మఱునాడు సూర్యోదయమువరకు ఏలాగున కొంచె మైనను చీకటి లేక శరత్కాలమున షోడశకళా ప్రపూర్ణమై చంద్రబింబము కన్పించుచుండునో, ఆలాగున ఏకాలమునను తన పూర్ణాత్మస్వరూపము మఱపుకలుగకయు, సంపూర్ణాత్మ శాంతికి భంగము కలుగకయు, బ్రహ్మానందామృతము సంతతము వర్షించుచుండినచో అట్టిస్థితియే నిజమైన జీవన్ముక్తియని గ్రహించుకొనవలెను శరత్కాల పూర్ణచంద్రునివలె జ్ఞాని ప్రసన్నుడైయుండును

ఇట్టి షోడశకళా ప్రపూర్తి లేనివారందరును ఇంకను పూర్ణవస్థను పొందియుండలేదు వీరు పంచమియో, దశమియో త్రయోదశియో, ఏదో యొకతిధియందుండువారే యగుదురు షోడశకళా పూర్ణజ్ఞాన సిద్ధిగలవారు చాల యరుదుగనే యుందురు శ్రీబుద్ధదేవుడు, శ్రీ దత్తాత్రేయులు, శ్రీ శంకరాచార్యులు మొదలగు మహాత్ములు పూర్ణిమదశలోనికి వచ్చినవారే కనుకనే 'వాసుదేవ స్సర్వ మితి సమహాత్మా సుదుర్లభ అని శ్రీ గీతాచార్యులుపదేశించిరి

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥

వేలకొలది మనుజులలో ఒకడు మాత్రమే పరమార్థ తత్త్వము నెఱింగి తరింపవలెనను బుద్ధిగల్గియుండును ఆలాగున తరణోపాయబుద్ధిగల యనేకులలో ఒకడు మాత్రమే నిజమైన భక్తి, శ్రద్ధ, సత్య, ధర్మనిష్ఠలతో కూడి యనుష్ఠించును అట్టి యనుష్ఠానముగల వారిలో నొకానొకడు మాత్రమే సర్వబంధర హితుడై పరమాత్మ సాక్షాత్కారజ్ఞానమును పొందును అయితే తక్కినవారి యనుష్ఠానములన్నియు వ్యర్థము లైపోవునని తలంపరాదు వారు ఉత్కృష్టమైన పుణ్యలోకములను పొంది, మఱుజన్మలో శ్రేష్ఠవంశములో శ్రేష్ఠ గుణములుగల్గి, జీవన్ముక్తి పొందుటకు తగిన నిష్ఠగలవారై మోక్షమును

పొందుదురు అని గీతాచార్యుల యభిప్రాయము కఠోపనిషత్తునందు కూడా ఈలాగుననే కాన్పించుచున్నది

శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః
శృణ్వన్తోఽపి బహవో యం న విద్యుః ।
ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా
ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః ॥

అనగా ఏయాత్మ వినుటకును, వినినను తెలిసికొనుటకు అలవి గానిదో అట్టి యాత్మను గుఱించి చెప్పువాడును, పొందువాడును, తెలిసికొను వాడును అరుదై యున్నారు

అయితే తదితర బ్రహ్మనిష్ఠులు పూర్ణజ్ఞానమును పొందక నిత్యసుఖ మనుభవించక పోవుదురని తలంపనక్కరలేదు పంచమిలో నుండు వారు షష్ఠి కిని, దశమిలో నుండువా రేకాదశిస్థితిలోనికిని మార్పుదల పొందుచు అట్లీశ్వర జ్ఞానము పూర్తిగా పొందువఱకు మఱల మఱల ఉన్నతస్థితికి వచ్చుచు నుందురు ఈ జన్మలో పూర్ణస్థితి పొందనివారు వచ్చే జన్మలో పూర్వాధికమైన యుత్కృష్టస్థానమును పొందుదురు అయితే అనుష్ఠానము మాత్రము తప్పక చేయుచుండవలెను తానున్నూ జగత్తున్నూ, ఈశ్వరమయమను జ్ఞానము కలుగువఱకున్నూ అంతఃకరణోపాధి పూర్తిగ తొలగిపోజాలదు అదే దానికి గుఱుతు ఏలన నెంతవరకు పూర్ణిమదినము కాలేదో, అంతవరకు చంద్రుని రేఖలోనుండు భూమి తొలగిపోయి యుండలేదు ఎంతవఱకు గ్రహణకాల మున రాహుకేతువుల విమోచనము గలుగలేదో, అంతవఱకు చంద్రబింబము పూర్ణముగ కన్పించదు మఱియు సంపూర్ణ గ్రహణవిమోచనము గలుగనిచో శుద్ధి కాలేదనియు, గ్రహణదోష మింకను ఉండెననియు తలంచవలెను

అలాగున దృశ్యవృత్తి నిశ్శేషముగ నశించువఱకున్నూ ఈ జీవుడు ప్రకృతి నుండి విమోచనావస్థ పొందలేదు అమృతత్వ మనుభవించుట గూడ పూర్తి కాలేదు మాయామాలిన్యమున్నూ నశించలేదని ప్రతి బ్రహ్మనిష్ఠుడును గ్రహించవలెను అనుష్ఠానముకూడ చేయుచుండవలెను సృష్టియొక్క రహస్యము జీవన్ముక్తి గల్గినవారికి మాత్రమే లెస్సగ తెలియ గలదనియు,

తక్కిన వారందరును వారివారి ప్రకృతి(మనస్సు) యొక్క స్థితినిబట్టి యుందురనియు తెలియవలెను

ఇంతవరకు చెప్పినదానిలో ఇంకను గ్రహించవలసిన విషయములు చాలగలవు వాస్తవముగ ఇపుడు కన్పించెడు పంచేంద్రియ విషయము లేస్థితిలో నుండునని మనకు తెలియ సాధ్యము కాదు ఏలన మనస్సుయొక్క సృష్టిని గుఱించియు, మనయొక్క మనఃస్థితిని గూర్చియు మాత్రమే మనకు తెలిసికొనుట కవకాశము గల్గుచుండును ప్రకృతియొక్క మహిమవలన మనకు తెలిసినదే సరిగా నుండునని తోచెడు స్వభావము మనకు గలిగి యున్నది ఈరహస్యము తెలిసికొనుట చాల కష్టము దీనియొక్క తత్త్వము తెలిసికొనుటయే మనస్తత్త్వ మును ఎఱుంగుట యగును

సామాన్యయోగులు, తపస్వులు, జ్ఞాననిష్ఠులు, భక్తులు సహితము ఈ మానసిక తత్త్వమునకు లోబడియుందురను విషయ మిదివఱకే చెప్పబడి యుండెను గదా! కనుకనే కొందరు యోగ మెక్కువనియు, కాదు, తపస్సే గొప్ప దనియు, కాదు కాదు జ్ఞానమే యుత్కృష్టమైనదనియు, అట్లుకాదు భక్తి యొకటియే శ్రేష్ఠమైనదనియు, అది కాదు లోకసేవయే సర్వోత్కృష్టమ నియు, అట్లుకాదు ధర్మమార్గముతో గృహస్థాశ్రమ మందుండుటయే అన్నిటి కంటె నుత్తమమైనదనియు అనేకులు అనేకవిధములుగ చెప్పుచుందురు ఇవన్నియు వారి యొక్క పొరపాటు కాదు పరమేశ్వరుని యొక్క సృష్టిమహిమయని ఆత్మజ్ఞానులు తలంతురు

భోగ మనుభవించుట కొఱకే మానవజన్మము నీశ్వరుడిచ్చెననియు, దాని యందేలాటి దోషము లేదనియు కొందరు వచింతురు భోగములు రోగ కారణము లగుటచే మితముగానే అనుభవించవలెనుగాని, భోగపశులై పోగూడదనియు కొందరుపన్యసింతురు మఱింత అంతఃకరణశుద్ధి గలవారు భోగములన్నియు యోగమునకు ప్రతిబంధము లనియు, అవి అజ్ఞాల కొఱ కేర్పడినవనియు, వాటిని నిశ్శేషముగ రహిత మొనర్పవలెననియు వాదింతురు ఇక కొందరు గృహస్థాశ్రమమే అన్నింటికంటె శ్రేష్ఠమైనదనియు సంసారములోనే అన్నిటియొక్క సారము గలదనియు, శ్రుతు లట్లే చెప్పుచున్న

వనియు వచింతురు అట్లుకానిచో ఈశ్వరుడేల యీ సంసారమును సృష్టించ వలెననియు నుపదేశింతురు ప్రక్కనుండి మఱియొకడు సంసారములో సారము లేదనియు, దీనిలోనుండినచో ఏకాలమందును దరిజేరజాలమనియు, దీనిలో శాశ్వత వస్తువేదియు లేదనియు, కనుకనే సంసారము నిస్సారమని శాస్త్రములు చెప్పుచున్నవనియు వచించుచుండును వీరు చెప్పు వాదము లన్నిటికిన్ని ప్రమాణములు గలవు ఆత్మజ్ఞాని మాత్రమే పైవారిని గూర్చి వారి వారి యంతఃకరణవృత్తి ఆలాగున నుండుటచేతనే అట్లు చెప్పుచున్నారే కాని వారిని గుఱించి మన మేమియు చెప్పుట తగదని తలంచి యూరకుండును

ముందు మనము ప్రారంభించిన శబ్దాదివిషయములను గ్రహించునట్టి కర్ణ, చర్మ, నేత్ర, జిహ్వా, ఘ్రాణ ములను గుఱించి వివరించెద ఒక శబ్దము వినవచ్చుచున్నది అది యింత పెద్దదని గాని, చిన్నదనిగాని మనము నిశ్చయింప జాలము మనయొక్క కర్ణగోళసృష్టి ననుసరించి మనకాశబ్దము యొక్క లఘుత్వముగాని, గురుత్వముగాని గోచరమగును దృష్టాంతముగ, మనలో కొంచెము చెవుడున్న వానికి ఆశబ్దము చాల పెద్దదిగా నున్నను చిన్నదిగానే వినవచ్చును ఇది శబ్దము యొక్క దోషమా లేక చెవియొక్క దోషమా? కర్ణముయొక్క దోషమేకాని మఱియొకటి గాదు మఱియు కొన్ని జంతు వులకు శ్రవణశక్తి మానవులకంటే ఎంతో అధికముగ నుండును అనగా చిన్న శబ్దముగ మనకు తోచునది, వాటికి చాల దూరమున గూడ పెద్దదిగా వినవచ్చును మనలో ఎవరికైన కొంచెము చిత్తైకాగ్రతయు, ఇంద్రియములకు సూక్ష్మతయు గల్గినవారికి సామాన్యజనులకు చిన్నదిగ వినిపించెడు శబ్దము చాలా పెద్దదిగానే వినిపించును మీలో ఎవ్వరైనా చెవిపై చేతిని వంకరగా పెట్టిన చిన్నశబ్దము కూడా పెద్దదిగా వినవచ్చును కావున ఒక శబ్దము వినవచ్చిన అది యెంత పెద్దదో, యెంత చిన్నదో మనము నిర్ణయింపజాలము

ప్రకృతియొక్క మహిమ యిటువంటిది రెండవదగు స్పర్శమును గూర్చి చింతించెదము పైజెప్పిన రీతిగా మనయొక్క చర్మసృష్టి ననుసరించియే స్పర్శముగూడ తెలియనగును కఠినమైనను, మృదువైనను, ఉష్ణమైనను శీతలమైనను స్పర్శేంద్రియముయొక్క స్వభావము ననుసరించి అనుకూ

లముగాను ప్రతికూలముగాను నుండును మంచి వేసవి మధ్యాహ్న కాలమున గూడ కొందరు మండుచున్న యెండలో పని చేయుదురు కొందఱాతీక్ష్ణమగు ఎండను సహింపలేక యుందురు శీతకాలములో మంచులో కూడ కొం దఱు సుఖముగ పనిచేయుచుందురు కాని కొందఱకు చేతులు కాళ్ళు ముడుచు కొని పోగా కట్టెవలె నుందురు ఇట్లు అగుటకు కారణమేమి? స్పర్శేంద్రియ భేదమే ఆలాగున ఒంటెయు, ఒక రకము మేకలు మొదలగునవియు మండుటెండలో సంచరింపగలవు గేదె మొదలగు జంతువు లాయెండను సహింప జాలవు ఇదిన్ని సృష్టి విశేషము కదా! మఱియు తాబేలు, కప్ప మొ దలగునవి మంచుగడ్డలలో కూడా జీవించును కొన్ని ప్రాణులట్టి మంచులో జీవింపజాలవు మానవులలో కూడా కొందరికి తిమ్మిరి గల్గిన స్థలములలో నిప్పు తగిలినను వేడిమి తెలియదు ఇవన్నీ స్పర్శేంద్రియ భేదమేగాని యుష్ణత్వ భేదము కాదు

ఆలాగున నేత్రేంద్రియశక్తి(చూపు) మందగించిన వారికి దగ్గఱనున్న వస్తువు కూడ బాగుగ కన్పించదు సులోచనములు పెట్టి చూచిన వారికిని బాగుగ కన్పించగలదు ఈభేదము దేనివలన కలిగినది? నేత్ర భేదమేకాని వస్తు భేదము కాదు కొన్ని యద్దముల ద్వారా జూచిన చిన్న వస్తువులు కూడ చాల పెద్దవిగ గోచరించుట మనము గాంచుట లేదా? దూరదర్శినీ సహాయముచే బహుదూరమున నున్న పదార్థములను కూడ జనులు కనుగొనుచున్నారు ఈ రహస్యమును గూర్చి వివరించిన, ఏ వస్తువుయొక్కయు యథార్థస్థితిగతులు మనకు తెలియవనియు, మన మనస్సుయొక్క పరిమితి ననుసరించి తెలిసికొ నవలసి యుండునేకాని, మఱేమియు చెప్పజాలమనియు దృఢముగ బోధ గల్గును మఱియు రంగు అద్దముద్వారా చూచిన నతనికి ఆ యద్దమువర్ణము ననుసరించి అన్నియు అదేరంగున గోచరించును ఈ విషయమై యెవరేమి చేయుగలరు? సూక్ష్మమైన దుర్భిణీయంత్ర సహాయముచే గాలిలోను, నీటిలోను గల సూక్ష్మప్రాణులనుగూడ జనులు కొనుగొన సమర్థులగు చున్నారు కావున పరమేశ్వరుడు మానవుల కిచ్చియుండు నేత్రగోళసృష్టి ననుసరించియే అందఱికిని గోచరించుచుండును గాని వాస్తవస్థితి అందఱికిని

తెలియ సాధ్యము కాదు

మనకు చీకటిగా నుండునపుడు కొన్ని జంతువులకది ప్రకాశముగా నుండును మనకు ప్రకాశముగా నుండునది వాటికి చీకటిగా నుండును గుడ్లగూబలకు పగలు కన్ను కన్పించదు రాత్రి బాగుగ కన్పించును కాకి, కొంగ, కోడి మొదలగు జంతువులకు చీకటిలో ఏమియు కనుపించదు గబ్బిలములు కారుచీకటిలో నుండు చిన్న వస్తువులను కూడ కనుగొనును గబ్బిలములలో కొన్ని రకములు (ఇండ్లలో నుండునవి) కారుచీకటిలో అతిసూక్ష్మములగు దోమలు మొదలగువాటిని పట్టి తినుచుండును కొన్ని జంతువులకు పగలున్నూ, రాత్రియున్ను ఒకే విధముగ గన్పడును పిల్లి, కుక్క మొదలగు వానికి రాత్రి పగలున్నూ భేదము లేకయే ఒకే విధముగ కన్పించును మీనములు మొదలగు జంతువులకు జలములోపల కన్పించునేగాని బయట కన్పడదు తాబేలు, మొసలి మొదలగు జంతువులకు నీటిలోను, తీరమందును ఒకే విధముగ కన్పించును ఇదంతయు పరమేశ్వరుని సృష్టి మహిమ గదా!

ఇక రసనేంద్రియ విషయమై యోచించిన అదిన్నీ మఱింత చిత్రముగా నున్నదని తెలియగలదు ఒకరికి రుచికరమైనది మఱియొకరికి అరుచిగా నుండును ఒకరికి కొంచెముగా రసవంతముగ నుండునది మఱియొకరికి మిక్కిలి రసవంతముగ నుండును దృష్టాంతముగ కొందఱకు ఉప్పు, కారము పులుపు ఎక్కువగా నుండవలెను కొందఱు వాటిని భుజింపజాలరు కొందఱికి మధురముపై ప్రీతియుండును ఇంకొకరికి అది యిష్టమే యుండదు మనకు మధురముగానుండు పదార్థములు కొన్ని జంతువులకు చేదుగ నుండును మనకు చేదుగానుండు వేపాకు మొదలైనవి మేకలు మొదలైన వానికి రసయుక్తముగనే యుండును ఈలాగున విచారించిన దేనిని గుఱించి యెవరు ఏమి చెప్పగలరు? రాబందు మొదలగు పక్షులకు దృష్టి అతి దూరముగ కన్పించెడిశక్తి యుండును కొన్ని జంతువులకు ఘ్రాణేంద్రియము అతి దూరమున కూడా వాసన గనుగొను మహిమ గల్గియుండును.

ఇవన్నియు చూచిన వాటి వాటి సృష్టిననుసరించియే వస్తువుల భేదము గోచరించుచున్నట్లు తెలియును కొందఱు అతిప్రీతితో భుజించెడు గోమాం

సాది పదార్థములు మఱికొందఱు తాకిన స్నానము చేయుదురు కొందఱకు పక్వాహార మిష్టము మఱికొందఱకు అపక్వారమందు ప్రీతి కొందరికి షడ్రసములం దిష్టము గలదు కొందరకు తీపి వస్తువులం దభిరుచి జనించును కొందఱకు ప్రకృతిసిద్ధమైన రసము మాత్రము చాలును అట్టివారికి కృత్రిమ రసము లన్నియు నీరసములుగానే యుండును ఈలాగున అన్నిటిని గూర్చియు విచారించుకొనవచ్చును

కొందఱకు అతిదుర్గంధము కలిగిన స్థలములందును ఘ్రాణేంద్రియ మేమియు విరోధము కలుగజేయదు మఱికొందర కట్టి దుర్వాసన యెంతో బాధాకరముగా నుండును కొందరకు సుగంధమందు ప్రీతి మిక్కుటము ఇవన్నియును విచారించి చూచిన జనులందరును ఏదో యొక అలవాటునకు వశులై యుండుటచే దానివలన అట్టి స్వభావము గల్గియున్నారని బోధపడును కావున ప్రకృతిగుణము లుండువరకును సత్యము తెలిసికొనుట కెవరికిని సాధ్యము కాదు అతీంద్రియ జ్ఞానముగల యోగులకు అతిదూరముగా నుండు శబ్ద మును వినుశక్తియు, వస్తువులను కనుగొను శక్తియు నుండును గొప్పసిద్ధ పురుషులకు త్రికాల జ్ఞానముండును ఇట్టి మహిమయు తపోయోగాదులచే అంతఃకరణమందు కలిగిన మార్పేగాని వేరు గాదు గీతాచార్యు లీవిషయమై యిట్లు ఉపదేశించియున్నారు

ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేన భారత ।
సర్వభూతాని సమ్మోహం సర్గే యాన్తి పరంతప ॥

ఓయర్జునుడా! జన్మించుకాలమున ఇచ్ఛాద్వేషముల వల్ల బుట్టిన ద్వంద్వమోహముచే సమస్త ప్రాణులును మిక్కిలి మోహమును పొందుచున్నవి సృష్టికాలములో జన్మాంతరకర్మానురూపమగు సంస్కారము ననుసరించి సత్త్వగుణముకాని, రజోగుణముకాని, తమోగుణముగాని మిశ్రమ గుణముగాని, విశుద్ధగుణము గాని జీవకోట్లు గల్గియుండును వాటి నన్నిం టిని ఈ జన్మలో రహిత మొనర్చిననే జీవన్ముక్తి గల్గును ఈ సంసారము పుష్ప ములో గంధమేలాగున సంధింపబడియుండునో ఆలాగుననే యుండునని గీతాచార్యు లుదేశించిరి ఎట్లన

శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।
గృహీత్వైతాని సంయాతి వాయుర్గన్ధానివాశయాత్ ॥

అనగా, దేహేంద్రియాది సంఘాతమునకు స్వామియగు జీవుడు ఎప్పుడీ శరీరమునుండి బయలుదేఱి మరియొక శరీరమును పొందుచున్నాడో, అప్పుడు పరిమళమునకు స్థానమైన పుష్పము మొదలగువాని నుండి వాయువు వాసనగల సూక్ష్మాంశములను స్వీకరించి పోవునట్లే మనస్సుతో కూడిన యింద్రియములను స్వీకరించి పోవుచున్నాడు పరలోకమునుండి యిహలోక మునకును ఆలాగున వచ్చుచుండును ఇది మానవులకు గల్గియుండే లాగున దేవతలకు, అసురులకును, రాక్షసులకు గూడ వ్యాపించియుండునదే గీత చూడుడు

న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।
సత్త్వం ప్రకృతిజై ర్ముక్తం యదేభి స్స్యాత్త్రిభిర్గుణైః ॥

ప్రకృతివలన బుట్టిన సత్త్వాదులను మూడు గుణములచేత విడువ బడిన స్థావర జంగమాది రూపమైన వస్తువు మనుష్య లోకమున నైనను, స్వర్గాది లోకముననైనను, దేవతలలో నైనను, మఱియెక్కడనైనను లేదు దీనిని యోచించిన చతుర్దశ భువనములలోగల జీవకోట్లన్నియు ఏదో యొక విధమగు ప్రకృతి గుణముతో కూడియున్నట్లు గోచర మగుచుండును కావుననే గీతలో 14వ అధ్యాయమున నిట్లు చెప్పబడినది

గుణా నేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।
జన్మమృత్యుజరాదుఃఖైర్విముక్తోఽమృత మశ్నుతే ॥

అనగా జీవుడు దేహమువలన బుట్టిన సత్త్వాదులగు మూడు గుణములను దాటి పుట్టుక, చావు, ముదిమి, దుఃఖములు అనువానిచే ఈ శరీరమున నుండినను విడువబడినవాడై (జీవన్ముక్తుడై) మోక్షమును పొందు చున్నాడని యర్థము

కావున ముముక్షువులు ఈ త్రిగుణములలో ఏగుణమైనను తమలో నుండినచో దాని ప్రభావమే మనలను ఈలాగున ప్రవర్తింపజేయుచున్నదని తెలిసికొని అట్టి గుణములను రహిత మొనర్చుటకు చూడవలెను అట్లైన వారు

ధన్యాత్ము లగుదురు బంధవిముక్తి కలుగువఱకు అట్టి పరమసత్యము పైననే ఆధారపడియుండవలెను సత్యము ఒకే వస్తువుగను, ఒకే రూపముగాను ఉండునేగాని అనేక రూపములుగాను, అనేక విధములుగాను ఉండునది కాదు అట్లనేక విధముల నుండునది సత్యము కాదు సత్యమే సద్వస్తువు, అదే ఈశ్వర స్వరూపము, అదే బ్రహ్మము,అదే భగవత్స్థానము, అదే కైవల్యము జీవులకు అట్టి పరమ సత్యమును తెలియనీయక మాయ అంతఃకరణమున జేరి మోహమును కలుగజేయుచుండును ఇదే దీనిలోగల మర్మము సత్య మెల్లప్పుడును ఏకరీతిగనే యుండలెను ఏ కాలమందును దాని కేలాటి మార్పును కలుగ గూడదు

ఈ ధర్మము నాధారముగ జేసికొని చూచిన మనకు చిన్న కాలము నుండి యిప్పటివరకు ఎన్ని మార్పులు గలిగినవో తెలియందగును ప్రాకృత గుణమునకు మాత్రమే పరిణామము కల్గును. కావున శైశవావస్థనుండి కలుగుచు వచ్చిన మార్పులన్నియు అంతఃకరణములోగల ప్రకృతిగుణములే ఇంకను మార్పు గలుగుచుండిన అవియున్నూ, ప్రకృతియొక్క స్వభావములనియే గ్రహించవలెను అయితే యీ అవిద్య త్రిగుణాత్మక మనబడును సత్త్వగుణమనియు, రజోగుణ మనియు, తమోగుణమనియు త్రిగుణములకు పేర్లు అవి ఒక్కొక దానిలో నొక్కొకటి కలిసి యనేక భేదములుగ నుండును

బాల్యకాలమున ఆటలలో సౌఖ్యము గలదను తలంపు గల్గి యుండును దానికి మించిన సుఖమాతనికి కన్పించదు కొంతకాలము గడచిన పిదప విద్యాభ్యాసములోను, దానికి సంబంధించిన కార్యములలోను మనస్సు మగ్నమై పోవును. అప్పుడట్టి స్వభావమునకు మించిన జీవితము మానవ జీవితమే కాదను తలంపు గల్గును పిదప అటనుండి యౌవనదశకు వచ్చును ఆపత్తులన్నిటికిని, వ్యామోహము లన్నిటికి నదేతగిన కాలము ప్రకృతి అప్పటికి బాగుగ వికాసము పొందియుండును మాయయొక్క మహిమలన్నియు అతని యందు సంసారము ప్రదర్శింప జేయుచుండును అత్తఱి స్త్రీలకైనను, పురుషులకైనను వైవాహిక సుఖముకంటే మించిన సౌఖ్యము ప్రపంచములో లేదను తలంపు గలిగించును కొంతకాలము మలినమైన ఆవిషయములోనే

జీవులు కాలము గడుపుదురు అత్తరుణమున ఎట్టి హీనవిషయము గూడ మహాశ్రేష్ఠముగ తోచుచుండును మలమూత్ర మయమగు శరీరములో బంగారముకన్న అధిక మగు ప్రీతి గల్గియుండును అమృతముకూడ దీనిని మించదను తలంపు గలుగును శరీరములోగల నవద్వారములనుండి యుద్భవించెడు మలము లన్నియు పీయూషము కన్న ఎక్కువ మహిమగలవని మాయాప్రభావముచే జీవులు తలంతురు

అకటా! అవిద్యయొక్క ప్రభావ మేమని వర్ణింపవచ్చును! ఎంత మేధా సంపత్తి గలవానిని కూడ నేమియు తెలియని పరమ మూఢునిగ నొనర్చు ఈ అవిద్యయొక్క శక్తినేమని వర్ణించవచ్చును? జ్ఞానులనుకూడ మహామోహ చక్రమున పడవైచి త్రిప్పునట్టి యీఅజ్ఞానముయొక్క శక్తి నేమని తలంచవచ్చును? మలమును నిర్మలముగాను, దుఃఖమును సుఖముగాను, బంధమును మోక్షముగాను తలంపజేసెడి ప్రకృతియొక్క మాహాత్మ్యము నేమని వర్ణింపగలము?

దీనియందు కొంతకాలము గడిపిన పిమ్మట సుకృతవిశేష ముండిన, అంతఃకరణము కొంచెము కొంచెముగ శుద్ధమై పై వర్ణించిన వన్నియు మాయయొక్క మహిమవలన గల్గిన మోహమనియు, ఇంద్రజాలమువలె నవి నశ్వరములనియు, అంతే కాదు దుఃఖహేతువులనిగూడ తలంపు గల్గును ఇప్పటి కెన్ని మార్పులు గల్గినవో లెక్కపెట్టుకొనుడు సుకృతవిశేషము లేని జీవికైనచో ఆ మాయా మోహములోనే వార్ధక్యముకూడ గడచిపోవును

అట్లుగాక దైవకృప గల్గిన జీవియైనచో ఈ మార్పులన్నిటికిని మనస్సే కారణమనియు, ఈ ప్రపంచము కలలో కన్పించెడి లోకమనియు నిశ్చయించుకొనును అపుడే దీనినుండి నివృత్తిని బొందెడి మార్గము కలదా యను విచారణ గలుగును అత్తఱి ఈశ్వరప్రార్థన, పుణ్య కర్మలు, పవిత్రమైన వ్రతములు, దివ్యమంత్రముల జపములు, తీర్థయాత్రలు మొదలగు పవిత్రమార్గములలో ప్రవేశము గల్గును అందువలన అంతఃకరణశుద్ధి మఱింత యెక్కువగుటచే ప్రపంచమందు సంపూర్ణ విరక్తిగల్గును మాయయొక్క మహామహిమయే ఇదంతయునని తెలిసికొనును అప్పుడు పరమైకాంతమున ప్రవేశించి,

తపస్సు, యోగము మొదలగు ఆత్మప్రాప్తికి ముఖ్యమగు సాధనలను శ్రద్ధ తోను; తీవ్రవేగముతోను అనుష్ఠించుచుండును అత్తరుణమున దానికి మించి నది లేదనియు, ఇంతవఱకు ప్రారంభించిన జపతపః ప్రార్థనా వ్రతాదులు ఎక్కువ కాదనియు, ఇప్పుడు గల నిష్ఠయే అన్నిటి కెక్కుడనియు బోధము గల్గును. ఇప్పటి కెన్ని మార్పులు గల్గినవో యోచించుకొనవలెను ఎన్ని పరిణామములు మాఱి వచ్చినవో విచారణీయము

పైజెప్పేలాగున జ్ఞానతపస్సుచేతను, ఆత్మజ్ఞాన సంధానమగు యోగనిష్ఠచే తను,అంతఃకరణము మఱింత శుద్ధమగుచుండగా వీటివలన యధార్థ తత్త్వము బోధము కాజాలదనియు, ఉత్తమబ్రహ్మనిష్ఠులగు గురువుల సహాయముచే నిజమగు వస్తుతత్త్వము తెలిసికొనవలెననియు బోధ ముదయించును అంతఃకరణము చాల నిర్మలస్థితికి వచ్చుటచే మనస్సులో ఇంతవరకు గల్గివచ్చిన మార్పులన్నియు బోధమునకు వచ్చును కావున హృదయపరివర్త నము గలుగక నిశ్చలస్థితిలో నుండుటకును, తనలోగల లోపములను సవరణ చేయుటకును, ప్రకృతికావల ప్రకాశించు ప్రకాశములోనికి ప్రవేశించుటకును తగిన ఆచార్యు డావశ్యకమని తోచును ఏలన ఇంతవఱకు వచ్చిన దారులన్నియు, పరిణామములన్నియు అంతఃకరణము యొక్క పరిణామమేగాని, నిజమైన ఆత్మలో (ఈశ్వరునిలో) మన మింకను ప్రవేశించియుండ లేదనియు ఆతనికి నిశ్చయమగు నమ్మకము గలుగును ఏలన, ఆత్మపరిణామము లేనిది, స్వయంప్రకాశమైనది దుఃఖము యొక్క లేశమైనను స్పర్శింపనిది, నిత్యమైనది అని శ్రుతివాక్యములు దెల్పు చుండగా అట్టిస్థితి తనకు గల్గినదా, లేదా యని తనలో యోచించు కొనుచుండును. అపుడీయంతఃకరణము, మనస్సును, బుద్ధిని ప్రకాశింప జేయువస్తు వొకటి వీటన్నిటికంటె పైభాగమున ఏ వికారము కలుగక స్వయం ప్రకాశమై యుండుననియు, అది అమృతమనియు, అనం తమనియు, బ్రహ్మాది స్తంబపర్యంత మన్నిటిలో అంతర్యామియై ప్రకాశించు ననియు, తనలోను, తాను భజించు దైవములోను, తన కాత్మతత్త్వ ముపదే శించు గురువులోను వెలుగుచున్నదనియు బోధము కల్గును దానివలననే

యివన్నియు ప్రకాశించుచున్నవి, కావున ఈ బుద్ధియు, మనస్సు, అంతఃకరణమున్నూ జడములు, ఇంతవఱకు వీటిననుసరించియే మనము ప్రవర్తించితిమి, ఇపుడివన్నియు బంధముతో కూడినవే ఇవి సత్యములని నమ్మి మోసపోయితిమి అను దృఢబోధము గల్గును అతరి ముండకశ్రుతి జ్ఞాపకమునకు వచ్చును

న తత్ర సూర్యో భాతి న చంద్రతారకం
నేమా విద్యుతో భాంతి కుతోఽ_యమగ్నిః ।
తమేవ భాంత మనుభాతి సర్వం
తస్య భాసా సర్వమిదం విభాతి ॥

సర్వప్రకాశకుడగు సూర్యుడు ఆత్మభూతుడగు ఆ పరబ్రహ్మమును ప్రకాశింపజేయుజాలడు చంద్రుడు, నక్షత్రములున్నూ ప్రకాశింపజేయు జాలవు ఈ మెఱుపులును ప్రకాశింపజేయజాలవు మన కనుల కెదుట కనబడుచున్న ఈ అగ్ని హోత్రుడెట్లు ప్రకాశింపజేయును? అంతట ప్రకాశించుచున్న ఆ పరమేశ్వరుని అనుసరించే సర్వము ప్రకాశించుచున్నది ఈ ప్రపంచమంతయు ఆ పరమేశ్వరుని ప్రకాశము చేతనే ప్రకాశించుచున్నది

అత్తటి ఆసత్యస్వరూపమగు ఆత్మను ఈశ్వరునిగా తెలిసికొనును సమస్తమతములయొక్క సారమొకటియే యను నిజతత్త్వము గోచరమగును శ్రుతులన్నియు ఈ తత్త్వమునే యుపదేశించుచున్నవి అట్టి వాక్యము లన్నింటిని ఇచట వ్రాయదలంచిన విషయము పెరిగిపోవును శివమహిమ్నః స్తోత్రములో గల పరమతత్త్వ మిదియే ఇది మానవ ప్రణీతము గాదు పుష్పదంతుడను గంధర్వునిచే ప్రణీతము

త్రయీ సాంఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పర మిద మదః పథ్యమితి చ ।
రుచీనాం వైచిత్ర్యా దృజుకుటిలనానాపథజుషాం
నృణామేకో గమ్యస్త్వమసి పయసామర్ణవ ఇవ ॥

వేదమతము, సాంఖ్యమతము, యోగమతము, శైవమతము, వైష్ణవ మతము మొదలుగా గలవన్నియు పరమ సత్యమగు బ్రహ్మమునే

ఉపదేశించుచున్నవి మార్గములు వేర్వేరుగా నున్నను జలప్రవాహము లన్నియు మహాసముద్రమును చేరునట్లు, భక్తులయొక్క అభిరుచి ననుసరించి వేర్వేరు భావనలచే నుపాసన చేయుచున్నను, అందఱును ఆ పరమేశ్వరునే పొందు చుందురు అదియే పరమసత్యము, దానినే బ్రహ్మమనియు, ఈశ్వరుడనియు, మహాశక్తియనియు పరాశక్తియనియు పలు పేర్లతో పిలిచెదరు

యం శైవాస్సముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాన్తినః
బౌద్ధా బుద్ధ ఇతి ప్రమాణ పటవః కర్తేతి నైయాయికాః ।
అర్హన్నిత్యథ జైనశాసనరతాః కర్మేతి మీమాంసకాః
సోఽయం వో విదధాతు వాంఛితఫలం త్రైలోక్యనాధో విభుః ॥

శైవులు దేనిని శివుడని చెప్పుచున్నారో, వేదాన్తులు దేనిని బ్రహ్మ మనుచున్నారో, బౌద్ధులు దేనిని మహాబోధితత్త్వమనియు, నిర్వాణమనియు, బుద్ధదే వుడనియు వచింతురో, న్యాయశాస్త్ర నిపుణులు దేనిని కర్తయను చుందురో, జైన శాస్త్రరతులు దేనిని అర్హత్ అని తలంచుదురో, కర్మనిరతులగు మీమాంసకులు అన్నిటికి కర్మయే కారణమని యెద్దానిని గూర్చి చెప్పుచుందురో, వైష్ణవులు విష్ణువని దేనిని వచింతురో, ఆలాగున దేనిని క్రైస్తవులు దేవుడనియు, మహమ్మదీయులు అల్లాయనియు వచింతురో, అట్టి త్రైలోక్యనాధుడగు ప్రభువు మనందఱియొక్కవాంఛితమును సఫల మొనర్చునుగాక! అందఱియొక్క దుఃఖము నుశమింపజేయునుగాక! నిత్యముక్తిపదమును అందఱికిని గలుగ జేయునుగాక!

మహావాక్యము స్వానుభవమునగల గురువుల యొద్ద శ్రవణము చేయ వలయుననియు, అట్టి మహాపురుషుల సమీపమున వినయ విధేయతలు గల్గి వర్తింపవలెననియు, అట్లుకానిచో ఈ పరమసత్యము బోధము కాదనియు ఆత్మలో సంకల్పము గల్గను అట్టి మహావాక్య శ్రవణభాగ్యము గలుగునప్పుడు ఆత్మానుసంధానపరుడై, తాను శివజీవైక్యానుభవము గలిగినవాడనియు, తరించినవాడననియు, జన్మముయొక్క అంత్యము కనుగొనిన వాడననియు, జననమరణ రహితుడననియు బోదము కల్గను అదే పరమప్రాప్యము ఆవల పొందవలసినది మఱొకటి లేదు అంతర్యామిత్వావస్థయు నశించి దృగ్

దృశ్యములయొక్క ఏకత్వమున్నూ, ధ్యాతృధ్యేయముల యైక్యమున్నూ అప్పుడు గల్గును ఇక్కడమాత్రమే భ్రమలన్నియు నుడిగిపోవును ప్రకృతియొక్క పరిణామమంతయు నశించును మాయయొక్క మహిమ మటుమాయమై పోవును కర్మలన్నియు నశించును సంశయము లన్నియు తొలగును భవబంధము లన్నియు నశించును అప్పుడు శరత్కాల పూర్ణమదినమున షోడశ కళాపూర్ణ చంద్రునివలె అమ్మహాత్ముడు ప్రకాశించును అదే శివము, అమృతము, ఆనందము, దైవము, ఓం తత్ సత్

సత్యమార్గము

దీనిలో నడచుటకు ప్రారంభించినపుడే నిజముగ ఈశ్వరుని విషయములో అడుగుపెట్టినవార మగుదుము వేదాంతమార్గములో గల యనేకులున్నా, సత్యమార్గమునుండి దూరులుగా నున్నారనియే చెప్పవచ్చును దీనికి కారణమేమన, పరిశుద్ధమగు సత్యములో జీవితము గడపి సత్యస్వరూపుడగు సర్వేశ్వరుని సాక్షాత్కరించుకొన్న జీవన్ముక్తులు, బ్రహ్మనిష్ఠులు ప్రస్తుతము మననే త్రముల యెదుట కనబడక పోవుటయే అట్టివారుండిన వారినే ముముక్షువులు మార్గదర్శకులుగా జేసికొని బ్రహ్మనిష్ఠామార్గమున నడతురు అట్టి దివ్యపురుషుల దర్శనము లభించనిచో ఎన్ని శాస్త్రములు చదివినను నిజమగు మార్గమిదియని నిశ్చయము గలుగదు ఇప్పుడుండువారిలో కొందరు హీనకర్మలుచేసి (ఆత్మజ్ఞానిని) అతీంద్రియ జ్ఞానిని కర్మలు బాధింపవని చెప్పుచుండు పరమ పవిత్రములగు శ్రుతివాక్యముల నుదాహరింతురు ఆత్మజ్ఞానికి బంధనము లేకున్నను, తామట్టి ఆత్మజ్ఞానులైతిమాయని విచారణ చేయువారరుదైరి కర్మయొక్క ఫలము అతి నిగూఢమైనది, తాను ఏవిత్తనము పెట్టునో, అదే వృక్షమై ఫలించునట్లు, జ్ఞానికిగాని అజ్ఞానికిగాని కర్మఫలము వెంబడించు చుండును విత్తన మొకటి, దానివలన కలుగు ఫలము మఱియొకటి చేయ శక్తిగల యోగులుగాని, జ్ఞానులుగాని యుండిరేని, వారలను మాత్రము కర్మము బాధింపనేరదని నమ్మవచ్చును ఈవిషయమై వాసిష్ఠ రామాయణములో శ్రీరామచంద్రులకు వసిష్ఠ మునీంద్రుడు ఉపదేశించిన విషయములే యీ క్రింద నిరూపింపబడుచున్నవి

యో యాదృక్ క్లేశ మాధాతుం సమర్థ స్తాదృగేవ సః ।
అవశ్యం ఫల మాప్నోతి ప్రబుద్ధోఽ_స్త్వజ్ఞ ఏవ వా ॥

జ్ఞానియైనను, అజ్ఞానియైనను, వారివారి కర్మల కనురూపమగు ఫలమును తప్పక పొందుదురు కాన జ్ఞానిగాని, అజ్ఞానిగాని యిరువురును ఆకాశగమ నాది సిద్ధులనుగూర్చి తాము చేయు యత్నము ననుసరించియే వాటిని బొందు దురు

ఆమోద శ్ఛందనస్యైవ స్పందనస్య ఫలం హృది ।
సర్వస్యైవాస్తి తన్మానం తద్వతా సమవాప్యతే ॥

శ్రీగంధమందు సుగంధమువలె విహిత నిషిద్ధకర్మల ఫల మందటియందు నుండియే యుండును (కలుగునని భావము) కాల క్రమమున అట్టి క్రియాఫలమును వారవశ్యము పొందెదరు

సంవిదుద్బోధనే బంధ స్తదనుద్బోధనే శివమ్ ।
అసత్సద్వజ్జగద్భాతి సంవిదుద్బోధనోదరమ్ ॥

చిత్తవృత్తిని బహిర్ముఖ మొనర్చుటయే బంధము ధ్యానము (సమాధి)చే దాని నాత్మయందు లీన మొనర్చుటయే మోక్షము చిత్తవృత్తిని బహిర్ముఖ మొనర్చుట చేతనే అసత్తగు నీ జగత్తు సత్యముగ తోచుచున్నది

అజడం వేదనం సుప్తం మోక్ష ఇత్యభిధీయతే ।
ప్రబుద్ధం బంధ ఇత్యాహు ర్యదిచ్ఛసి తదాహర ॥

ఓ రామచంద్రా! జగత్తుయొక్క నామరూపరహితమగు చైతన్య స్థితియే మోక్షమనియు, నామరూపసహిత దృశ్యస్థితియే బంధమనియు చెప్పబడును ఈరెంటిలో నీకేయది యిష్టమో దానినే యభ్యసింపుము

నికటస్థః శివః స్పృష్టః సమనాగ్రభమంతికమ్ ।
వాడవోఽగ్నిః స్వనాశాయావహంత్యేవాంబులఖయా ॥

చిదాకాశమున నృత్యము చేయుచున్న శివసంకల్పస్వరూపిణియగు ప్రకృతి, సమీపమున నున్న శివుని స్పృశింపగనే క్రమముగ తనయావరణ శక్తిని గోల్పోయి, సముద్రజలము బడబాగ్నిని స్పృశించి తద్రూపమే యగునట్లు శివుని యందైక్యమగుచున్నది

చితిః శివేచ్ఛా సా దేవం తమేవాసాద్య శామ్యతి ।
జన్మస్థాన శిలాం ప్రాప్య తీక్ష్ణధారా యథాయసీ ॥

పదునైన యినుపకత్తిని తన యుత్పత్తిస్థానమగు భూమి యందుంచినచో క్రమముగనది తనరూపమును గోల్పోయి మట్టియై భూమి యందే లయ మగునట్లు, శివేచ్ఛా స్వరూపిణియగు చిత్‌శక్తి(ప్రకృతియు) శివుని పొంది అతనియందే లయించుచున్నది

జ్ఞాతజ్ఞేయస్య మనసో నూనమేతద్ధి లక్షణమ్।
న స్వదంతే సమగ్రాణి భోగవృందాని యత్నతః ॥

జ్ఞేయవస్తువగు ఆత్మ (బ్రహ్మము) నెఱింగిన వానికిక భోగములు రుచింపవు ఇదియే నిశ్చయముగ జ్ఞాతజ్ఞేయుని లక్షణము

స్వాత్మతత్త్వాభిగమనం భవతి ప్రాయశో నృణామ్ ।
మునే విషయవైరస్యం కదర్థానుపజాయతే ॥

ఆత్మజ్ఞానము శ్రవణాదుల మూలమున ప్రాయశః లభింపవచ్చును కాని విషయవైరాగ్యము చేకూరుట మాత్రము బహుదుస్తరము

తస్మాత్ పౌరుష మాశ్రిత్య సచ్ఛాస్త్రైః సత్సమాగమైః ।
ప్రజ్ఞా మమలతాం నీత్వా సంసారజలధిం తరేత్ ॥

కాన పురుష ప్రయత్నము నాశ్రయించి సచ్ఛాస్త్ర సత్సాంగత్యములచే బుద్ధిని శుద్ధ మొనర్చుకొని సంసారసాగరమును దాటవలెను

యస్తూదార చమత్కారః సదాచారవిహారవాన్ ।
స నిర్యాతి జగన్మోహాత్ మృగేంద్రః పంజరాదివ ॥

నిరంతరము యత్నశీలుడై, సజ్జనులును జ్ఞానులునునగు మహాత్ముల యుత్తమ ఆచారములను గల్గి వర్తించువాడు బోనునుండి సింహమువలె జగన్మాయనుండి బయల్వెడలును

సవివేకో హి శాస్త్రస్య జ్ఞానస్య తపసః శ్రుతేః ।
భాజనం భూషణాకారో భాస్కర స్తేజసా మివ ॥

వివేకవంతుడే శాస్త్ర, జ్ఞాన, తపః శ్రవణాదుల కర్హుడు ప్రకాశ వంతములగు పదార్థములలో సూర్యునివలె ఆత డందఱిలోను అగ్రగణ్యు డగును

శమేనాసాద్యతే శ్రేయః శమో హి పరమం పదమ్ ।
శమః శివః శమః శాంతిః శమో భ్రాంతినివారణమ్ ॥

శమముచేతనే మోక్షప్రాప్తి చేకూరును శమమే యుత్తమ పదము శమమే శుభప్రదమైనది శాంతికి మూలము శమమే శమము చేతనే భ్రమ తొలగును

విచారచారవో జీవా భాసయన్తో దిశో దశ ।

భాన్తి భాస్కరవన్మూనం భూయో భవభయాపహాః ॥

ఉత్తమ విచారణగల్గి శోభించు జీవన్ముక్తులు దశదిక్కులను ప్రకాశింపజేయుచు అనేక జీవుల సంసారభయమను అంధకారమును తొలగించుచు సూర్యునివలె నిక్కముగ వెలుగొందుచుందురు

వరం కర్దమభేకత్వం మలకీటకతా వరమ్ ।

వరమన్ధగుహాహిత్వం న నరస్యావిచారతా ॥

బురదయందు కప్పయై యుండుట మేలు, మలమందు క్రిమియై యుండుట మేలు, చీకటి గుహయందు సర్పమై యుండుట మేలు, కాని మనుజునకు విచారణజ్ఞానము లేకయుండుట ఉత్తమము కాదు

వరం శరావహస్తస్య చండాలాగారవీథిషు ।

భిక్షార్థ మటనం రామ న మౌర్ఖ్యహతజీవితమ్ ॥

ఓ రామా! చేతియందు పాత్రనుంచుకొని వీధులలో సంచరించుచు చండాలుని గృహమందు బిచ్చ మెత్తుట మేలు కాని అజ్ఞానముతో కూడి యుండు జీవిత ముత్తమము గాదు

యోఽస్మత్తాతస్య కూపోఽయమితి కౌపం పిబత్యపః ।

త్యక్త్వా గాంగం పురస్థం తం కోఽనుశాస్త్యతిరాగిణమ్ ॥

ఇది మాతండ్రి త్రవ్వించిన నూయి యని తలంచి ప్రక్కనున్న పవిత్ర గంగాజలమును వదలి, అందలి మురికినీటినే త్రావనెంచువానివలె రాగియైన మూర్ఖున కెవరు బోధింపగలరు?

యస్మై నేదం త్వరుచయే రోచతే దుష్కృతోదయాత్ ।

విచారయతు యత్కించిత్సచ్ఛాస్త్రం జ్ఞానవాఙ్మయమ్ ॥

శ్రేష్ఠమగు ఔషధముచే ఆరోగ్యము కలుగునట్లు, ఈయోగవాసిష్ఠ గ్రంథ శ్రవణముచే మనుజునకు జీవన్ముక్త్యనుభవము కలుగును

ఓ ముచ్చారణసంవిత్తి వేదనాచ్చ ప్రపశ్యతి ।

యత్కరోతి మనోరాజ్యం భవత్యాశు స తన్మయః ॥

ఓంకారము నుచ్చరించుచు దాని యర్థమును భావించుచు

బ్రహ్మదేవుడు మనస్సుచే ఎద్దానిని సంకల్పించునో, శీఘ్రముగ ఆరూపమునే పొందును అనగా, తన మనఃకల్పన ననుసరించియే పదార్థములు వ్యక్తమగు చుండుటను గాంచును

యదార్యగర్హితం యద్వా న్యాయేన న సమార్జితమ్ ।
తస్మాద్ గ్రాసాద్వరం మన్యే మరణం దేహినా మిదమ్ ॥

పూజ్యులగు మహాత్ములచే గర్హితము, అన్యాయోపార్జితమునునగు దానిని భుజించుటకంటె మరణించుటయే శ్రేష్ఠతరము

గచ్ఛ కర్కటి మూఢాం స్త్వం జ్ఞానేనాశ్వవబోధయ ।
మూఢోత్తారణమేవేహ స్వభావో మహతా మితి ॥

ఓ కర్కటీ! నీవజ్ఞుల చెంతకు బోయి వారల కాత్మబోధ గావింపుము ఏలయన, మూఢుల యజ్ఞానము తొలగించుటయే మహాత్ముల స్వభావ మగును(ఇట్లాకాశవాణి కర్కటియను రాక్షసిని గూర్చి పల్కెను)

వివదంతే హ్యసంబుద్ధాః స్వవికల్పవిజృంభితైః ।
ఉపదేశా దయం వాదో జ్ఞాతే ద్వైతం న విద్యతే ॥

అవివేకులు తమతమ కల్పనల గూర్చి వాదవివాదముల జేయు చుందురు ఈభేదదృష్టి యంతయుు వేదాంతోపదేశమునకు పూర్వమే యగును ఏలన తత్త్వ మెఱింగిన పిదప ఇక ద్వైతస్ఫురణయే యుండదు

అన్యేఽపి సావధానా యే ధీరాః సురమహర్షయః ।
చిత్తాత్త్వ మనుసంధానం న త్యజంతి మనాగపి ॥

సావధానచిత్తులును, ధీరులునునగు, ఇతర దేవ, మహర్షులు గూడ ఉపాసనా జ్ఞానములను తమచిత్తమునుండి తొలగింప నొల్లరు

మనసైవ మనస్తస్మా త్పౌరుషేణ పుమా నిహ।
స్వకమేవ స్వకేనైవ యోజయే త్పావనే పథి ॥

కాన సాధకుడు స్వతః పురుషప్రయత్నముచే మనస్సుచేతనే మనస్సును పవిత్రమార్గమందు నియోగించవలెను

ప్రతిభాసస్యానుపదం ప్రాక్తనీం స్థితిముజ్ఝతి ।
కులాలకర్మానుపదం ఘటో మృత్పిండతా మివ ॥

కుమ్మరివాని క్రియచే ఘటము తన పూర్వపు వృత్తికాదశను త్యజించునట్లు, దృఢవాసనా ప్రాబల్యముచేతను, దృఢభావనచేతను మనస్సు తన పూర్వస్థితిని, పూర్వసంస్కారములను త్యజించును

మహాసత్త్వగణోపేతా యే ధీరాః సమదృష్టయః ।
అనిర్దేశ్య కలోపేతాః సాధవ స్త ఉదాహృతాః ॥

విశుద్ధ సత్త్వగుణము కలవారును, ధీరులును, అనగా విషయములచే గాని, దుఃఖములచేగాని చలింపనివారును, సమదృష్టిగలవారును బ్రహ్మ సాక్షాత్కారము బడసి అవర్ణనీయమగు నానందము ననుభవించువారును సాధువులనబడుదురు

సాధు సంవ్యవహారార్థం శాస్త్రం యో నానువర్తతే ।
బహిః కుర్వంతి తం సర్వే స చ దుఃఖే నిమజ్జతి ॥

సాధువుల యాచార వ్యవహారములను దెల్పుశాస్త్రముల ననుసరించని వానిని సజ్జనులు బహిష్కరింతురు మఱియు నాతడు దుఃఖమునే పొందును

వహ్న్యౌష్ణ్యయోరివ సదా శ్లిష్టయో శ్చిత్తకర్మణోః ।
ద్వయో రేకతరాభావా ద్ద్వయ మేవ విలీయతే ॥

అగ్ని యుష్ణత్వములవలె నెల్లప్పుడు కలసియే యుండు చిత్తకర్మల రెంటిలో యొకటి లేనిచో రెండును లేకపోవును

జాగ్రచ్చాభిమతం వస్తు నయత్యమృత మృష్టతామ్ ।
అనీహితం చ విషతాం నయత్యమృతమవ్యలమ్ ॥

వివేకముదయించుచున్నను రాగాదుల ప్రభావముచే మనస్సు విషము (స్వాదరహిత వస్తువు) నమృతముగను, అమృతమును విషముగను నొనర్చుచునే యుండును

అమృష్ట సర్వభావానా మల మాత్మ చమత్కృతిమ్ ।
మనః స్వాభిమతాకారం రూపం సృజతి వస్తుషు ॥

పరిపూర్ణమగు ఆత్మసాక్షాత్కారము బడయనివాని చిత్తమే పదార్థముల నభిలషించుచు వాటి గూర్చిన కల్పనల జేయుచుండును గాని పూర్ణసాక్షాత్కార ముగల తత్త్వజ్ఞానుల చిత్తమట్లు గాదు

స్వాయత్త మేకాంత హితం స్వేప్సిత త్యాగవేదనమ్ ।
యస్య దుష్కరతాం యాతం ధిక్తం పురుషకీటకమ్ ॥

తన యధీనమున నున్నదియు, సర్వవిధముల హితమునే గలుగ జేయునదియునగు అభిలషిత విషయములయెడ వైరాగ్యవృత్తి యెవరికి దుష్కరమై యుండునో అట్టి మనుజకీటకమునకు ధిక్కారమగుగాత!

నాహం బ్రహ్మేతి సంకల్పా త్సుదృఢాద్బధ్యతే మనః ।
సర్వం బ్రహ్మేతి సంకల్పా త్సుదృఢాన్ముచ్యతే మనః ॥

నేను బ్రహ్మము గానను దృఢసంకల్పముచే మనస్సు బంధనమున తగుల్కొనును. అంతయు నాత్మస్వరూపమగు బ్రహ్మయే యను దృఢసంకల్పముచే నది బంధవిముక్తిని బడయును

సంకల్పః పరమో బంధ స్త్వసంకల్పో విముక్తతా ।
సంకల్పం సంవిజిత్యాంతర్యధేచ్ఛసి తథా కురు ॥

సంకల్పమే గొప్పబంధనము సంకల్పరాహిత్యమే ముక్తి, ఓ రామచంద్రా! నేను బ్రహ్మమును గానను సంకల్పమును, అంతయు నా స్వరూపమగు బ్రహ్మమేయను విరోధసంకల్పజనిత జ్ఞానముచే జయించి, పిమ్మట నీకోర్కె చొప్పున ఆచరింపుము

ఇంద్రియగ్రామసంగ్రామ సేతునా భవసాగరః ।
తీర్యతే నేతరేణేహ కేనచి న్నామ కర్మణా ॥

సర్వేంద్రియజయమును వారధిచే గొప్పదగు సంసారసాగరము దాటబడునుగాని, మఱి యేకర్మచేతను గాదు

చిత్రామృతం నామృతమేవ విద్ధి
చిత్రానలం నానలమేవ విద్ధి ।
చిత్రాంగనా నూన మనంగనేతి
వాచావివేక స్త్వవివేక ఏవ ॥

ఓ రామచంద్రా! చిత్రమందలి అమృతము అమృతము కాదు చిత్రమందలి అగ్ని అగ్నికాదు చిత్రమందలి స్త్రీ స్త్రీకాదు ఇట్లే వాచా వివేకము వివేకము కానేరదు అది అవివేకమే యగును

విచారః సఫలస్తస్య విజ్ఞేయో యస్య సన్మతేః ।
దినానుదిన మాయాతి తానవం భోగగృధ్నుతా ॥

ఏ సద్బుద్ధియొక్క భోగలాలసత దినదినము క్షీణించుచుండునో, అట్టివానిచే నొనర్పబడు విచారణయే సఫలమగును

ఆస్థామాత్ర మనంతానాం దుఃఖానా మాకరం విదుః ।
అనాస్థామాత్ర మభితః సుఖానా మాకరం విదుః ॥

అసద్వస్తువందు సత్యత్వబుద్ధి గల్గియుండుటయే సర్వదుఃఖములకును నిలయము అసద్వస్తువునందు సత్యత్వబుద్ధి లేక యుండుటయే సర్వ సుఖములకును నిలయము

సంశాంతాహంకృతేర్ఘంతోర్భోగా రోగా మహామతే ।
న స్వదంతే సుతృప్తస్య యథా ప్రతివిషా రసాః ॥

ఓమహాత్మా! అహంకారము లెస్సగ నశించిన నిత్యతృప్తునకు రోగ రూపములగు భోగములు విషమువలె రుచింపకుండును

భోగేష్వస్వదమానేషు పుంసః శ్రేయః పురోగతమ్ ।
క్షీణేంఽధకారే కిం నామ మనసోఽన్యత్ ప్రవర్తతే ॥

మనుజున కెపుడు భోగములయెడ ప్రీతి తొలగునో అపుడు మోక్ష శ్రేయము వానియెదుట నున్నట్లే ఏలయన, మనస్సునందలి యంధకార (దోష) మగు అహంకారము క్షయింప ఇక మఱియొక ప్రతిబంధమేమి గలదు?

క్రియావిశేషబహులా భోగైశ్వర్యహతాశయాః ।
నాపేక్షంతే యదా సత్యం న పశ్యంతి శరాస్తదా ॥

అనేక క్రియాకలాపముల దగుల్కొని, భోగైశ్వర్యములచే నశించిన బుద్ధిగల జీవులు పరమాత్మవైపునకు తమ చిత్తమును మరల్పనిచో ఆత్మ వంచకులై శ్రేయమును పొందక యుందురు

యే తు పారంగతా బుద్ధేరింద్రియై ర్న వశీకృతాః ।
త ఏనాం జాగతీం మాయాం పశ్యన్తి కరబిల్వవత్ ॥

బుద్ధినిగూడ నతిక్రమించినవారును, ఇంద్రియములకు వశులుకాని వారుననగు మహాత్ములు ఈజగన్మాయను అరచేతియందలి బిల్వఫలము వలె

స్పష్టముగ గాంతురు

సుఖోచ్ఛేద్యతయా జ్ఞస్య సంసారమల మాతతమ్ ।
తండులస్య యథా చర్మ యథా తామ్రస్య కాలిమా ॥
నశ్యతి క్రియయా పుత్ర పురుషస్య తథా మలమ్ ।
నశ్యత్యేవ సందేహ స్తస్మాదుద్యమవాన్భవ ॥

ఓ రామచంద్రా! ఈ సంసారమాలిన్య విస్తారమంతయు జ్ఞానిచే సులభముగ నశింపజేయబడును బియ్యపుగింజపై గల పొట్టు, రాగియందలి మాలిన్యము, దంచుట, స్ఫుటమొనర్చుట యను క్రియలచే తొలగునట్లు ఈ సంసార మాలిన్యమున్ను, జ్ఞానభూమికాభ్యాసమను పురుష ప్రయత్నముచే తప్పక నశించును కాన నీవు యత్నపరుడవు కమ్ము

వృథా భవతి బాలేషు యథా రాగమయీ కథా।
నిరర్థకాల్పబోధేషు తథోదారోదయా కథా ॥

శృంగారరసయుక్తమగు కథలు బాలురకు బోధించిన నిరర్థక మగునట్లు అల్పజ్ఞానము గలవారియెడ మోక్షప్రాప్తి గూర్చిన యతీత బోధయు వ్యర్థమగును

బద్ధోహి వాసనాబద్ధో మోక్షః స్యాద్వాసనాక్షయః ।
వాసనాస్త్వం పరిత్యజ్య మోక్షార్థిత్వమపి త్యజ ॥

ఓ రామచంద్రా! వాసనలు గలవాడే నిజముగ బద్ధుడు వాసనా క్షయమే మోక్షము కాన నీవు వాసన లన్నింటిని తొలగించి తుదకు మోక్షా పేక్షను కూడ త్యజింపుము (ఏలన, బంధమను అవస్థ యుండునపుడే ముక్తి బొంద తలంతురు మోక్షావస్థయందు బంధమే లేదు గాన నిట్లు చెప్పబడినది)

కిం కిల స్ఫారమనసాం పశూనాం చ విశేషణమ్ ।
కృష్యంతే పశవో రజ్జ్వా మనసా మూఢచేతసః ॥

దృశ్యవిషయములందు ప్రవర్తించు చిత్తముగల మనుజానకును, పశువులకును భేదమేమి? త్రాటిచే పశువు లీడ్వబడుచున్నవి, మనస్సుచే మూఢు లీడ్వబడుచున్నారు

అయం గుణసమాహారో బంధాయైవ సమాశ్రితః ।
సంత్యక్తో భవ మోక్షాయ యధేచ్ఛసి తథా కురు ॥

ఓ రామచంద్రా! త్రిగుణాత్మకమగు మాయారూపమైన యీ దృశ్యము నాశ్రయించుటచే బంధమున్ను, దీనిని పూర్ణముగ త్యజించుటచే ముక్తియు లభించునని యెఱింగి యిక నీయిచ్ఛ చొప్పున నొనర్పుము

చిత్తతాం శృంఖలామేతాం స్వరూపజ్ఞానయుక్తితః ।
బిలాచ్ఛిత్త్వాన్మహాబాహో స్వాత్మసింహం విమోచయ ॥

మహాబాహుడవగు నో రామా! చిత్తమను గొలుసును ఆత్మజ్ఞాన యుక్తిచే త్రెంపి ఆత్మయను సింహమును సంసారమను బోనునుండి విడిపింపుము

ఓంకారాదర్ధమాత్రార్థం భావయన్మౌనమాస్థితః ।
సంశాంతసర్వసంకల్పః ప్రశాంతకలనాగణః ॥

శాంతుడును, సంకల్పరహితుడును, కల్పనా వర్జితుడునునయి బలిచక్రవర్తి ఓంకారము యొక్క త్రిమాత్రలకు పరమగు అర్ధమాత్రచే సూచితమగు తురీయాత్మస్వరూపమగు బ్రహ్మమునే భావించుచు మౌనము వహించియుండెను

సర్వసంభ్రమసంశాన్త్యై పరమాయ ఫలాయ చ ।
బ్రహ్మ విశ్రాంతిపర్యంతో విచారోఽస్తు తవానఘ ॥

పాపరహితుడవగు నో ప్రహ్లాదా! భ్రమయంతయు పూర్ణముగ నశించుట కొఱకును, పరమానంద స్వరూపమగు ముక్తియను ఫలము ప్రాప్తి నొందుట కొఱకును, బ్రహ్మమందు విశ్రాంతి లభించునంతవఱకు ఆత్మ విచారణ చేయుచునే యుండుము (ఇట్లు శ్రీభగవానుడు ప్రహ్లాదున కుపదేశించెను)

చేత్యహీనం చిదాలంబం మనో యస్య గతజ్వరమ్ ।
తేనాంబుకతకేనేవ జనతా సంప్రసీదతి ॥

ఎవని మనస్సు విషయాసక్తి లేనిదై దుఃఖరహితమై యుండునో అట్టివానిచే జనులందరును కతకరేణువు (చిల్లగింజ)చే నీటివలె పరశుద్ధత్వము

జెందుదురు

అపి శీతరుచావర్కే సుతప్తేఽ పీందుమండలే ।

అప్యధః ప్రసరత్యగ్నౌ విస్మయోఽస్య న జాయతే ॥

సూర్యుడు చల్లబడినను, చంద్రు డుష్ణత్వము జెందినను, అగ్ని అధోముఖముగ జ్వలించినను ఆత్మజ్ఞాని కేమియు నాశ్చర్యము గలుగదు

సత్తా లయం యాతి యత్ర నిర్వికారం చ తిష్ఠతి ।

భూయో నావర్తతే దుఃఖే తత్ర లబ్ధపదః పుమాన్ ॥

ధర్మి, ధర్మముల విభాగ మేమియులేని నిర్వికార పదమునందు స్థితి జెందినవాడిక దుఃఖ భూయిష్ఠమగు సంసారమున తగుల్కొనడు, మోక్షమను పురుషార్థ సాధనమున సమర్థు డగుటచే అట్టివాడే పురుషు డనబడును

తద్ధేతు స్సర్వహేతూనాం తస్య హేతు ర్న విద్యతే ।

స సారః సర్వసారాణాం తస్మాత్సారం న విద్యతే ॥

నిర్వికారమగు బ్రహ్మయే సర్వకారణములకును కారణము దానికి మఱియొక కారణము లేదు అదియే సారవస్తువు లన్నింటిలోను సారమైనది కాన, అద్దానికి మించిన సారవస్తువు మఱొకటి లేదు

యస్యాజ్ఞానాత్మనో జ్ఞస్య దేహ ఏవాత్మభావనా ।

ఉదితాఽతి రుషైవాక్షరిపవోఽ భిభవంతి తమ్ ॥

దేహమం దాత్మాభిమానము గల్గి ఇంద్రియముల వశమొనర్పక యుండు అజ్ఞానిని ఇంద్రియములను శత్రువులు అతిక్రోధముతో నెదిర్చి బాధింతురు

యస్య జ్ఞానాత్మనో జ్ఞస్య సత్యేవాత్మని సంస్థితిః ।

సంతుష్ట్యైవాక్షసుహృదో న ఘ్నంతి తమనిందితమ్ ॥

పవిత్రాచరణ గల్గి సత్యస్వరూపమగు ఆత్మయందు నిలకడ బొంది నట్టి జ్ఞానిని ఇంద్రియములు మిత్రునివలె సంతోషముతో నాదరించును అయ్యవి వాని నేమియు బాధింపక అనుకూలాచరణచే వానికి జ్ఞానాభివృద్ధి గలుగజేయును.

అకర్తృత్వా దభోకత్తృ మభో క్తృత్వా త్సమైకతా ।

సమైకత్వాదనంతత్వం తతో బ్రహ్మత్వ మాతతమ్ ॥

అకర్తయగుటచే మనుజు డభోక్తయు నగును అభోక్త యగుటచే సమత్వము సిద్ధించును సమత్వముచే ఏకత్వమున్ను, ఏకత్వముచే అనంతత్వమున్ను సిద్ధించును ఆ పిదప వ్యాపకమగు పరబ్రహ్మరూపత్వము సంప్రాప్త మగును

మౌర్ఖ్యమోహసముత్థానా త్వనాత్మన్యాత్మభావనా ।

ఆత్మజ్ఞానాన్మహాబోధాద్విలయం యాతి వాసనా ॥

తత్త్వజ్ఞానాభావమను మౌర్ఖ్యముచే నుత్పన్నమైన దేహాదులం దాత్మాభిమాన మను వాసన ఆత్మజ్ఞానమను నుత్తమబోధచే నశించును

యో న నిర్వాసనో నూనం సర్వధర్మవరోఽపి సః ।

సర్వజ్ఞోఽప్యభితో బద్ధః పంజరస్థో యథా ఖగః ॥

సమస్త ధర్మముల నెఱింగినను, సర్వజ్ఞుడైనను, వాసనల ద్యజింపనిచో పంజరమందలి పక్షివలె అతడు బద్ధుడే యగును

సర్వత్ర విద్యమానాఽపి దేహేషు తరలాయతే ।

సర్వగోప్యాతపః సౌరో భిత్త్యాదౌ వై విజృంభతే ॥

సూర్యప్రకాశము దర్పణభిత్త్యాదు లందతిశయముగ భాసించునట్లు, సర్వత్రా వ్యాప్తమైయున్నను చైతన్యము శుద్ధబుద్ధియందే యధికముగ ప్రకాశించును

సాధూనాం సమదృష్టీనాం పరిప్రశ్నేన సేవయా ।

సంగమేన చ సా యుక్తిర్లభ్యతే ముచ్యతే యయా ॥

సమదృష్టిగల సాధువులను సేవించుటచేతను, వారి సంసర్గముచేతను భక్తియుతముగ వారలను బ్రశ్నించుటచేతను, జ్ఞానరూపమగు యుక్తి లభింప అద్దానిచే జీవుడు ముక్తి నొందును

బుద్ధిర్మహదహంకారః ప్రాణాశ్చేత్యాదిభిర్మనే ।

క్రియానురూపైరభిధా వ్యాపారైః శాంతముచ్యతే ॥

చిత్తమే క్రియాభేదము ననుసరించి అంతఃకరణము, బుద్ధి,

మహత్తత్త్వము, అహంకారము, ప్రాణము, జీవాత్మ మున్నగు నామంబులచే జెప్పబడుచున్నది

యథా స్వయంభూః సంకల్పః స్వయం నామ తథైవ హి ।
ఏతౌ స్వవేదనాయత్తౌ బంధమోక్షే వ్యవస్థితౌ ॥

సమష్ట్యహంకారరూపుడగు బ్రహ్మవలెనే వ్యష్ట్యహంకారరూపుడగు జీవుడును సంకల్పమాత్రుడే యగును సంకల్పముచే బంధమును, సంకల్పత్యాగముచే మోక్షమును నిశ్చయముగ సిద్ధించును

గమ్యదేశైకనిష్ఠస్య యథా పాంథస్య పాదయోః ।
స్పందో విగతసంకల్పస్తథా స్పందః స్వకర్మను ॥

స్వగృహాభిముఖుడై చను పథికుని పాదములు నిరంతరము చలించు చున్నను వాని కాచలనమును గూర్చిన సంకల్పముండనట్లు, సంకల్పరహితుడైయోగి శాస్త్రోచితములగు అనిషిద్ధకార్యమున బ్రవృత్తి గలిగియుండును

దర్శనాత్స్పర్శనాచ్ఛబ్దాత్కృపయా శిష్యదేహకే ।
జనయేద్యః సమావేశం శాంభవం స హి దేశికః ॥

దర్శన, స్పర్శనోపదేశాదులచే శిష్యునియందు శివస్వరూపుడగు పరమా త్మయొక్క సన్నివేశము గల్గించగల్గు నాతడే గురు వనదగును

స్వభావం సంవిజిత్యాదావింద్రియాణాం సచేతసామ్ ।
ప్రవర్తతే వివేకే యః సర్వం తస్యాశు సిద్ధ్యతి ॥

విషయముల వైపునకు పరుగిడు మనస్సుయొక్కయు, సర్వేంద్రియ ములయొక్కయు దుస్స్వభావమును జయించి ఆధ్యాత్మశాస్త్రములందు ప్రవృత్తి గల్గియుండువాని కంతయును సత్వరముగ సిద్ధించును

స్వభావమాత్రం యేనాంత ర్న జితం దగ్ధబుద్ధినా ।
తస్యోత్తమ పదప్రాప్తిః సికతాతైల దుర్లభా ॥

తన దుస్స్వభావమును మొమ్మొదట జయించని మూఢునకు, ఇసుక యందు తైలమువలె ఆత్మపదప్రాప్తి దుర్లభమైనది

శుద్ధేஉల్పోప్యుపదేశో హి నిర్మలే తైలబిందువత్ ।
లగత్యుత్తాన చి త్తేషు నాదర్శ ఇవ మౌక్తికమ్ ॥

స్వల్పోపదేశమైనను నిర్మలచిత్తునియందు, శుభ్ర వస్త్రముపై తైల బిందువువలె వెంటనే ప్రవేశించును అద్దముయొక్క వెనుకభాగమున ముత్యములైనను ప్రతిబింబించనట్లు సాధన చతుష్టయసంపత్తి లేనివారల శూన్యచిత్తములందట్టి యుపదేశము ప్రవేశింపదు

సుసాధ్యః కరటోద్భేదో మత్తైరావతదంతినః ।
నోత్పథప్రతిపన్నానాం స్వేంద్రియాణాం వినిగ్రహః ॥

మదించిన ఐరావతమను ఏనుగుయొక్క గండస్థలము చీల్చుటయు సులభమే గాని చెడు మార్గమందు ప్రవృత్తి గల్గియుండు ఇంద్రియముల నిగ్రహించుట సులభము కాదు

యథాక్షి సంవృతిః సర్వరూపాలోకశమోஉరిహన్ ।
సంవిత్సంవరణం నామ సర్వదృశ్యశమస్తథా ॥

కామాది శత్రువుల నశింపజేయు నోబ్రాహ్మణోత్తమా! కను మూసినతోడనే రూపజ్ఞాన మంతయును శమించునట్లు, బహిర్ముఖ చిత్తము నంతర్ముఖముగా త్రిప్పి ఆత్మాభిముఖ మొనర్చుటచే దృశ్యమంతయు శమించును (ఇది మంకియను బ్రాహ్మణునకు శ్రీవసిష్ఠ మునీంద్రు లుపదేశించినది)

అపేక్షైవ ఘనో బంధ ఉపేక్షైవ విముక్తతా ।
సర్వశబ్దాన్వితా తస్యాం విశ్రాంతేన కిమీక్ష్యతే ॥

దృశ్యవిషయముల నపేక్షించుటయే బంధము, ఉపేక్షించుటయే ముక్తి, పూర్ణకాముడును, ఆత్మయందు విశ్రాంతిని బడసినవాడును నగు జ్ఞాని యిక దేనిని వాంఛించును?

యావన్నాధిగతం బ్రహ్మ న విశ్రాంతం పదే పదే ।
తావత్తన్మననత్వేన న ధ్యాన మవగమ్యతే ॥

బ్రహ్మము నెఱుంగ నంతవఱకును, ఆత్మపదమందు విశ్రాంతిని బొందనంతవఱకును, విషయచింతన యున్నంతవఱకును జీవున

కాత్మధ్యానమందు నిలుకడ కలుగదు

తావద్విషయవైరస్యం భావయన్త్యుచితాశయాః ।
న పశ్యంత్యేవ తాన్యావద్భోగాంశ్చిత్రనరో యథా ॥

భోగము లెదుటనున్నను చిత్రమందలి మనుజునకు వాటియం దేయ పేక్షయు నుండదు అట్టి వికార రహితమగు స్థితి కలుగు వఱకు యోగులు విషయవైరాగ్య మభ్యసించుచునే యుందురు

క్వ కిల స్వాత్మ విశ్రాంతిః క్వైతద్విషయ సేవనమ్ ।
సుషుప్తజాగ్రతో రైక్యం భ్రాంతాభ్రాంతాత్మనో ర్భవేత్ ॥

ఆత్మసుఖమందలి విశ్రాంతి యెచట! విషయసుఖ మెచట! తత్త్వజ్ఞానికిని విషయములందు ప్రీతియుండుచో నిక జాగ్రత్సుషుప్తులును జ్ఞానియు నజ్ఞాని యు ఒకే విధమున నుండవలసివచ్చును (అనగా నట్లెన్నటికిని సంభవింప దనుట)

అజ్ఞోపి తద్జ్ఞతామేతి శనైః శైలోఽపి చూర్ణ్యతే।
బాణోఽప్యేతి మహాలక్ష్యం పశ్యాభ్యాసవిజృంభణమ్ ॥

ఓ రామచంద్రా! అభ్యాసప్రభావమెట్టిదో చూడము! దీనిచే నజ్ఞానియు క్రమముగ జ్ఞాని యగుచున్నాడు పర్వతములు చూర్ణమొనర్పబడుచున్నవి జడమగు బాణమున్ను అతి సూక్ష్మమగు లక్ష్యమును జేరుచున్నది

స్వసంవిద్యత్నసంరోధా ద్యథా చేతః ప్రశామ్యతి ।
న తథాంగ తపస్తీర్థ విద్యా యజ్ఞ క్రియాగణైః ॥

బాహ్యవిషయాకారచిత్తవృత్తి నిరోధముచే చిత్తము శమించునటుల తపస్తీర్థవిద్యాయజ్ఞాది క్రియలచే శమింపనేరదు

నిర్వాణాయ వితృష్ణాయ స్వచ్ఛశీతలసంవిదే ।
స్పృహయంతి సదా సత్తాం బ్రహ్మవిష్ణు హరా అపి ॥

తృష్ణారహితమును, నిర్మలమును, శాంతిస్వరూపమును, పరమ ప్రేమాస్పద మును, బోధరూపమునునగు ఆత్మసత్తను బ్రహ్మవిష్ణు మహేశ్వరాదులు కూడ నిరంతర మభివాంఛింతురు

సహస్రేభ్యః సహస్రేభ్యః కశ్చిదుత్థాయ వీర్యవాన్ ।
భినత్తి వాసనాజాలం పంజరం కేసరీ యథా ॥

ప్రయత్న మొనర్చునట్టి లక్షలమంది జనులలో ధీరుడగు ఒకానొకడు మాత్రమే పంజరమును సింహము భేదించునట్లు వాసనాజాలమును భేదించివైచును

జ్ఞాతజ్ఞేయ స్త్వసంకల్పః సంకల్పాతిశయాశయః ।
అవాసనో వ్యవహృతౌ వాతవత్స్పందతే న వా ॥

జ్ఞాతజ్ఞేయుడు (ఎఱుంగదగిన ఆత్మవస్తువు నెఱింగినవాడు)ను సంకల్ప రహితుడును వాసనా వివర్జితుడునునగు జీవన్ముక్తుడు ప్రపంచ వ్యవహార ములందు, వాయుస్పందమువలె వర్తింపకయు నుండును

ఆకల్పంసిద్ధ సంఘేషు మోక్షోపాయాః సహస్రశః ।
వ్యాఖ్యాతాశ్చ శ్రుతాశ్చాలమీదృశాస్తు న కేచన ॥

(శ్రీవసిష్ఠ మునీంద్రుల యుపదేశమును గూర్చి సిద్ధులు పల్కినది)

కల్పారంభమునుండి మోక్షోపాయమును గూర్చిన వేలకొలది గ్రంధముల వినియున్నాము మఱియు స్వయముగ వాటికి వ్యాఖ్య యొనర్చి యున్నాము కాని ఇట్టి దివ్యోపదేశము నెపుడును కని విని యుండలేదు

సత్యవిషయమును గూర్చి యెంతకెంతకు అంతరాత్మలో విమర్శన తీవ్రావస్థను పొందుచుండునో, అంతకంతకు జీవుడు ప్రకృతికి దూరుడై ఈశ్వర సమీపమునకు అనగా ఈశ్వరాత్మస్థితికి చేరుచుండుననియే తలంచవలెను దీనివలన తాను పరిశుద్ధు డగుచున్నాడా లేదా యను తత్త్వమును సాధకుడు తెలిసికొనవచ్చును నడచునప్పుడు తనయొక్క నీడను నిలబెట్టి నడవశక్తిగల వారుండినచో, వారిని మాత్రమే కర్మముగాని, సంకల్పముగాని బాధింపదు ఎవరు నడుచునప్పుడు వారి నీడ కూడ వారిని వెంబడించి వచ్చు చుండునో, అట్టివారు తమ సంకల్పములకు, కర్మలకు సంబంధించిన ఫలము ననుభవించియే తీరవలెను ఇదే పరిశుద్ధమగు వేదాంతవాక్యము మన కుపదేశించినది

అయితే యిప్పుడు ముముక్షువుల కొక సందేహము జనించవచ్చును

ప్రపంచములో గొప్ప బ్రహ్మనిష్ఠులు, ఆత్మసాక్షాత్కారజ్ఞాన సంపన్నులు ఉండిరి, ఉండియున్నారు వీరు సంచరించునపుడు ఛాయ లేకపోయినదా? నీడ వెంటనే అనుగమింపక పోయినదా? యని తలంప నక్కరలేదు బ్రహ్మ వేత్తలెవరు ఉండిరో, ఉండియున్నారో వారందఱును శ్రుతివాక్యము నను సరించి, పరిశుద్ధాచరణగలవారై, దృశ్యాది సంకల్పరహితులై, శుద్ధాత్మ బోధకులైయే యున్నారు ఇంతవఱ కాలాగుననే యుండిరి, దాని కనుగుణమగు ప్రశాంత నిర్మల జ్ఞాన సుఖమునే వా రనుభవించిరి అనుభవించుచునే యున్నారు హేయవిషయములు గల్గిన జ్ఞానికి విషయ ములతోను, సంకల్పములతోను, మనస్సుతోను సంబంధము లేదని చెప్పెడు వచనమునకే శుష్కవేదాంతమని పేరు అలాగున చేయుట పాతకము శ్రీ శంకరులు, శ్రీబుద్ధదేవుడు, శ్రీకృష్ణచైతన్యులు, శ్రీ గురునానక్ మొదలగు ఉదారచరితులందు ఇప్పుడుండే వారు చెప్పులాగున ఏదేని దోషము కనిపించునా? దోషములతో జ్ఞానికిగాని, యోగికిగాని, పరమభక్తునకు గాని సంబంధము లేదని ఆ మహాపురుషు లెచ్చటైనను చెప్పియున్నారా? విష యములు గల్గియుండువఱకును ప్రకృతిదోషము సంపూర్ణముగా నశింప లేదనియే ప్రతిసాధువును తలంచవలసి యున్నది

ఈవిషయమై యింతవఱ కనేకసార్లు చెప్పియుండుటచే, మరల మరల దానినే చెప్పుట బాగుగలేదని తలంచి అమృతబిందూపనిషద్వాక్యము నిచట నిరూపించి విషయమును ఉపసంహరింప తలంపు గల్గుచున్నది ఇపుడు సామాన్యముగ వేదాంతములో ప్రవేశించినవా రందఱును ఈ క్రింది వాక్యమును చెప్పుచుందురు ఇది శ్రుతివాక్య మనుట సత్యమే అయితే ఆ శ్లోకమును పూర్తిగా వారు చదివినచో నట్టి ప్రమాదమున కవకాశము గలుగదు పూర్వార్ధమును గ్రహించి, ఉత్తరార్ధమును విడిచిన కారణముచేతనే, మోహములో పడుచున్నారు ఇదెటువంటిదనగా, న్యాయాధిపతి వాది ప్రతివాదులను విచారింపక, వారియొక్క వాక్యములను మాత్రము నమ్మి కార్యమును తీర్మానముచేసి నట్లగును అదెంత విచారశూన్యమో, ధర్మ విరుద్ధమో న్యాయదూరమో యోచించుకొనదగును వారు చెప్పెడి

శ్రుతివాక్యమిది--

(ఈ పవిత్రవాక్యము ఉపనిషత్తులలోను, యోగవాసిష్ఠాది లోకోన్నత గ్రంథములలోను గన్పించుచున్నది)

మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః

దీని తాత్పర్యమేమన, మనుష్యులయొక్క బంధమునకును, మోక్షమున కును కారణము మనస్సే యగుచున్నది ఉత్తరార్ధము వినుడు

బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్

ఏది బంధమునకును మోక్షమునకును కారణమగుచున్నదో, దానిని ఈ రెండవపాదము నిరూపించుచున్నది విషయములం దాసక్తిగల మనస్సు బంధమును గలుగజేయుచున్నది విషయములందాసక్తి నశించిన మనస్సు మోక్షముకొఱకే యగుచున్నది ఈ పరమసత్యమును గ్రహింపకపోవుటయే అనర్థము లన్నిటికిని కారణమైనది ఈ ఒకశ్లోకమును ముముక్షువులు సదా జ్ఞాపకములో నుంచుకొని వర్తించిన నిజమైన సత్యమును ఎఱుంగగలరు

యతో నిర్విషయస్యాస్య మనసో ముక్తిరిష్యతే ।
అతో నిర్విషయం నిత్యం మనః కార్యం ముముక్షుణా ॥

ఏకారణముచేత విషయాసక్తముకాని మనస్సునకు మోక్షము చెప్పబడి యున్నదో, ఆకారణముచే ముముక్షువుచేత సదా మనస్సు విషయరహిత మైనదిగా జేయదగినది

నిరస్తవిషయాసఙ్గం సంనిరుద్ధం మనో హృది ।
యదా యాత్యాత్మనో భావం తదా తత్పరమం పదమ్ ॥

ఎపుడు విషయములందలి యాసక్తిని విసర్జించిన వెంటనే హృదయ మందు చక్కగా నిరోధింపబడిన మనస్సు సదా ఆత్మస్వరూపమును పొందిన దగుచున్నదో, అప్పుడదియే ఉత్తమపద మనబడును

తావదేవ నిరోద్ధవ్యం యావద్ధృది గతం క్షయమ్ ।
ఏతద్జ్ఞానం చ ధ్యానంచ శేషో న్యాయశ్చ విస్తరః ॥

హృదయమందున్న దృశ్యవాసనా సంబంధములగు సంకల్పములు క్షయమగు నంతవఱకును ధ్యానయోగాద్యనుష్ఠానములు చేయుచుండనలెను

ఇదే జ్ఞానము, ఇదే ధ్యానము అనగా యోగము ఇక విస్తారముగ గ్రంథములలో కన్పించెడు వాక్యము లన్నియు వీనిని గూర్చియేగాని, నూతనముగా గ్రహింపదగిన దేదియును అందు లేదు

ఏక ఏవ హి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః ।
ఏకధా బహుధా చైవ దృశ్యతే జలచన్ద్రవత్ ॥

సర్వభూతములకు ఆత్మయైన భగవంతు డొకడే అయినను అంతః కరణోపాధి ననుసరించి అనేకములుగ నున్నట్లు కన్పించుచుండును ఎట్లన, ఆకాశమందుండు చంద్రు డొకడైనను, జలోపాధులచే భిన్న భిన్నములుగ గోచరించుచుండును ఇదే భేదమునకు కారణము ఇట్టి ఆత్మస్వరూపము అనుభవమునకు వచ్చుటకు సాధకు డెట్లుండవలెనో ఆ విషయమును ముండకోపనిషత్తు విస్తారముగ ఉపదేశించుచున్నది

నాయమాత్మా ప్రవచనేన లభ్యో
న మేధయా న బహునా శ్రుతేన ।
యమేవైష వృణుతే తేన లభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్ ॥

ఈ ఆత్మస్వరూపము వేదశాస్త్రాదులను కడవరకు చదువుటచేతగాని, వేదార్థములను చక్కగ వివరించి చెప్పెడు శక్తి గలిగియుండుటచేతగాని, పఠించిన శాస్త్రములను మఱువక ధారణచేసెడి బుద్ధివివేకశక్తివలనగాని, అనేక శాస్త్రములను అనేకులయొద్ద శ్రవణముచేయుట చేతగాని లభించునది కాదు అనగా పైజెప్పిన సమర్థత గల్గియున్నను, అంతఃకరణశుద్ధి గల్గి తీవ్రవైరాగ్య మవలంబించి, నిరంతర ఈశ్వరచింతన చేయనివారలకు లభించునది గాదు

ఏ భక్తుడు నిరంతరము పరమేశ్వరుని పొందవలెనను ఆసక్తిగల్గి ధ్యానము చేయుచుండునో, సదా ధ్యానపరాయణుడై యుండునో వానికి మాత్రమే అట్టి జ్ఞానము గల్గును అట్టివానికి పరమాత్మ తననిజస్వరూపమును ప్రకాశింప జేయుచున్నాడు పరమతత్త్వ మెఱింగినచో అంతఃకరణశుద్ధి గల్గి బ్రహ్మవిచారము ధ్యానపూర్వకముగ చేయనిచో ఆత్మప్రాప్తి కలుగదను తత్త్వము బాగుగ గోచరము కాగలదు ఏలన, శాస్త్రము చదువుటకును, చెప్పుటకును,

ధారణ యొనర్చుటకును, నిర్విషయస్థితి కలుగవలెనని లేదు ఈశ్వర స్వరూపమో, ''తమసః పరస్తాత్' ప్రకృతి కావల నుండుటచేత అంతః కరణములో గల అవిద్యను సంపూర్ణముగ దాటిపోవలసి యుండును ఇట్టి మోహమును గలుగజేసెడు మాయను రహితముచేయ బ్రయత్నించువారలకు పైజెప్పిన పరనధారణలు లేనప్పటికిని ముక్తి గల్గును ఈ సత్యమునే శ్రీ భగవానులు గీతయందు ఉపదేశించిరి

తేషామేవానుకమ్పార్థ మహ మజ్ఞానజం తమః ।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥

నేను నిరంతరము ధ్యానముచేయు భక్తుల యంతఃకరణమున నివసించువాడనై, అనుగ్రహించు తలంపుతో వారలయొక్క అజ్ఞానమువలన బుట్టిన మాయారూపమగు నంధకారమును మిక్కిలి ప్రకాశించుచున్న జ్ఞానదీపము చేత తొలగించి, నిజరూపమగు ఆత్మస్వరూప ప్రకాశమును గలుగజేయు చున్నాను

పరమకారుణికుడగు భగవంతునకు భక్తులపైగల ప్రేమ యేమని చెప్పవచ్చును! కొందరు 'మేము శాస్త్రము చదువలేదు కాన ముక్తికి దూరులమగుదుము' అని తలంచి వ్యాకులపడుదురేమో యని యెంచి కరుణగల్గి అది అవసరము లేదనియు, శుద్ధాంతఃకరణులై, నిరంతరము ధ్యానము చేసిన చాలుననియు ఈ శ్రుతి స్మృతివాక్యములు తెలుపుచున్నవి

సత్యేన లభ్యస్తపసా హ్యేష ఆత్మా
సమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యమ్ ।
అంతశ్శరీరే జ్యోతిర్మయో హి శుభ్రో
యం పశ్యంతి యతయః క్షీణదోషాః ॥

నశించినపాపములు గలవారలును, పరిశుద్ధమైన జ్ఞానమును పొంద తలంపుగల్గి పరమాత్మ స్వరూపానుసంధానమునకు ప్రయత్నించు వారలును నగువారు, ఏ ఆత్మను తమలో దర్శించుచున్నారో అట్టి ప్రకాశస్వరూపమును పరిశుద్ధముననగు ఆత్మస్వరూపమును సాధకులు నిరంతర సత్యపాలనము చేతను, శుద్ధాత్మజ్ఞానపరమగు తపస్సుచేతను, శుద్ధ బ్రహ్మసాక్షాత్కారరూప

జ్ఞానముచేతను, బ్రహ్మచర్య నియమపరిపాలనముచేతను హృదయపుండరీకమునందు పొందగలరని యర్థము

మనస్తత్త్వ రహస్యమును గురించి యింతవఱకు వివరించడమైనది దీనియొక్క రహస్యమును తెలిసికొనకపోవుటయే మనస్సే ప్రధానమని మనవేదాంతులలో కొందఱు చెప్పుటకు కారణమైనది ఇందలి మొదటి అర్థము మనస్సే అన్నిటికిని కారణ మగుచుండు ననుట దీనియొక్క పరమార్థము, మనస్సు మంచి దైన మంచికార్యములు చేయుటకును, మనస్సు చెడ్డదైన చెడు కార్యములు చేయుటకును కారణ మగుచుండున ననుటయే కాని వీరు చెప్పే లాగున పాపకృత్యము లొనర్చుచు మనస్సే ప్రధాన మనునట్టి విపరీతార్థము కాదు ఏలన కారణమున కన్యముగ కార్య ముండరాదుగదా! ఏ విత్తనము పెట్టిన దాని కనుగుణమగు వృక్షమున్ను, పుష్పమున్ను, ఫలమున్ను మాత్రమే గలుగును ఆలాగున ఎవరి మనస్సులోగల సంకల్పములు, సంస్కారములు, వృత్తులు, వాసనలు ఏయే ప్రకారముగానుండునో వానికి తగిన కార్యమునే వారు చేయుచుందురు ఇదియే మనస్సు ప్రధానమని చెప్పెడు వాక్యముయొక్క మొదటి యర్థము

2 ఇక ఇంద్రియము లన్నిటికిని మనస్సే యధిపతి కనుక మనస్సు ననుసరించి ఇంద్రియములు విషయములందు ప్రవర్తించును మనస్సు ఇంద్రియములను నిరోధించినచో నవి యాగిపోవును సేనాధిపతి యాజ్ఞ ననుసరించి సైనికులు ప్రవర్తించునట్లే ఇంద్రియములును మనస్సుయొక్క ఆజ్ఞ ననుసరించి వర్తించును

కావున మనస్సు శుద్ధముగా నుండిన, ఇంద్రియములు అశుద్ధవిషయములలో పోవ నిశ్చయించినను వానినట్లు పోనీయక అయ్యది నిరోధించునవి భావము సైన్యములో ఒకడు దుర్మార్గు డుండినను సేనాధిపతి యాజ్ఞకు బద్ధుడైపోవునుగదా!

3 దృశ్యవిషయములు ఎట్లుండినను మనోభావము ననుసరించియే అవి మంచివిగను, చెడ్డవిగను నున్నట్లు భావము కలుగును ఇది భావనావిశేషము యొక్క రహస్యము పామరులకు విషయములు మహా

శ్రేష్ఠములుగ తోచును పరిశుద్ధాత్ములకు విషయము లతి నీచములుగా తోచును ఇదిన్ని మనస్సుయొక్క మార్పు అనియే విజ్ఞులు తెలిసికొని యున్నారు దీనివల్లను మనస్సే ప్రధానమని చెప్పిరి

సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।
శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః ॥

అని శ్రీ గీతాచార్యు లుపదేశించిరి, అనగా, ఓ అర్జునుడా! సమస్త ప్రాణులకును వానివాని పూర్వజన్మ సంస్కారములతో గూడిన యంతః కరణము ననుసరించిన స్వభావము కలుగుచున్నది జీవుడు స్వభావమే స్వరూపముగ గలవాడు ఎవ్వడు ఎట్టి స్వభావముగలవాడో వాడు అట్టి స్వభావమున కనుకూలముగానే ప్రవర్తించును ఈ పరమతత్త్వమును తెలిసికొనిన మనస్సే ప్రధానమని చెప్పెడు వాక్యములోగల భ్రమ నివృత్తి కాగలదు

మనో నిరోధము గలిగిన, ఇతరదేహేంద్రియము లన్నింటియొక్క నిరోధము గలుగును కనుక మనోనిగ్రహ మొనర్చుకొనుటయే అన్నింటి యొక్క సారమని తెలిసికొనవలెను దీనిచే ముముక్షువు గ్రహింపదగిన దేమన, మనస్సు శుద్ధముగా నున్నచో మనుజుడు శుద్ధము లైనవియు, సత్యము లైనవియునగు కార్యములను జేయుచుండును అశుద్ధముగా నున్నచో అశుద్ధములును, అసత్యములును నగు కార్యములందు ప్రవర్తించుచుండును దృశ్య వాసనలుగాని, విషయవాసనలుగాని కలిగిన అట్టి దోషములు తన యందింకను నిశ్శేషముగా రహితము కాలేదని యెంచి వాసనాక్షయమునకు గడంగవలెను మీరేలాగున నొక పాత్రలో పవిత్రమైన వస్తువు పెట్టతలంచిన పాత్రను ఒకరిచే శుద్ధపఱిపించునపుడు దానియందేదైన దుర్వాసన యుండినచో, మఱి యొక్కసారి కడిగి తెచ్చులాగున చెప్పుదురో, అట్లే మరల వాసన నిశ్శేషముగ పోనిచో మఱియొక్క సారిగాని రెండుసార్లుగాని, మూడు సార్లు గాని, ఇట్లు శుద్ధపడువఱకు క్షారవస్తువులచే ఎట్లు శుద్ధమొనర్తురో, ఆలాగున హృద యములో దృశ్యవిషయవాసన యేదైననుండుచో నిర్వాసనస్థితి గలుగువఱకు ధ్యాన, ధారణ, మనన, నిదిధ్యాసనలు చేయుచుండవలెను

ఉత్కృష్టమగు వేదాంతశాస్త్ర మీలాగుననే చెప్పుచున్నది

తావదేవ నిరోధస్స్యాత్ యావత్తత్త్వం న విందతి ।
విదితే తు పరే తత్త్వే ఏకమేవానుపశ్యతి ॥

ఎంత వఱకు మనోనిరోధము గలిగ్గి జ్ఞేయమగు బ్రహ్మాకారస్థితి కలుగలేదో అంతవఱకు శమదమాదులతో గూడినవాడై పవిత్రస్థానమందు పవిత్ర భావన గల్గి నిష్ఠచేయుచుండవలెను

అవ్యుత్పన్నమనా యావత్ భవానజ్ఞాతతత్పదః ।
గురుశాస్త్ర ప్రమాణైస్తు నిర్ణీతం తావదాచరేత్ ॥

అని శ్రీవసిష్ఠులు యోగవాసిష్ఠమం దుపదేశించిరి ఎంతవఱకు మనస్సులో గల వృత్తులు,వాసనలు, విషయములు నశింపలేదో, ఎంతవరకు ఆత్మసాక్షాత్కార జ్ఞానమందు నిలకడ కలుగలేదో, అంతవరకు గురువుల బోధలచేతను, ఉత్కృష్ట వేదాంతశాస్త్ర విచారముచేతను బ్రహ్మవిచారము చేయుచుండవలెనని దీని భావము

5 ఇక మనస్సే ప్రధానమని చెప్పెడు విషయమై విశేషార్థమును చెప్పెద ఇంతవరకు చెప్పిన నాల్గు అర్థములును సామాన్యములు ఇప్పుడు చెప్ప బోవునది విశేషార్థము, ఇది అనుష్ఠానపరులకు మాత్రమే గలుగును వారలకే గోచరమగును

యధా సంకల్పయే ద్యోగీ యోగయుక్తో జితేంద్రియః ।
తధా తత్తదవాప్నోతి భావ ఏవాత్రకారణమ్ ॥

యోగసాధనచేత ధ్యానమందు నిలకడగలవాడును, అందువల్ల ఇంద్రియ నిగ్రహము గలవాడును, జ్ఞేయమగు బ్రహ్మమున స్థిరత గలవాడునగు యోగి ఏమేమి సంకల్పించునో అది ఆలాగుననే ఫలించును, అట్టి యోగులకు తమ యొక్క భావనయే చాలును ఇట్టి ఉన్నతస్థితిలోనుండు వారిస్థితిని పొందకపో వుటయే సంకల్పములు ఫలింపకపోవుటకు కారణ మగుచున్నది

ఇది సంకల్పశుద్ధి, మనోనైర్మల్యము, యోగసిద్ధి, తపస్సిద్ధిగల యోగుల విషయమైనదేగాని సామాన్యముగా కొన్ని వేదాంతవాక్యములను మాత్రము నేర్చుకొని శుద్ధాచరణ లేనివారి విషయమై ప్రవర్తించినది కాదు

ప్రాకృతగుణములు హృదయమున నశించునపుడు జీవుడు శుద్ధుడై ఈశ్వరావస్థను పొందును ఈశ్వరుని సంకల్పమాత్రముచేతనే సమస్త జగత్ సృష్ట్యాదులు జరుగుచుండును వ్యష్టిభావము నశించిన జీవునియొక్క సంకల్పము లన్నియు సఫలీకృతము లగునని శ్రీ యోగవాసిష్ఠమున గలదు

సోஉయం పశ్యత్యశేషేణ యావత్సంకల్పమాత్రకమ్ ।
స్వమాత్మవచనం శాంత మనన్యత్పరమార్థతః ॥

నిరావరణ జ్ఞానయుక్తుడేది సంకల్పించునో, తన సత్య సంకల్పముచే నద్దానిని తన పరమార్థస్వరూపమునకు భిన్నముగ గాంచడు గాన తప్పక దాని ప్రాప్తినొందును

అనిరావరణజ్ఞప్తేర్యతః శాంతా న భేదధీః ।
తతః సంకల్పనాద్ద్వైతాద్వరాద్యస్య న సిద్ధ్యతి ॥

ఆవరణసహితమగు జ్ఞానముగలవానికి భేదబుద్ధి శమింపదు ఆతడు ద్వైతసంకల్పముతోనే కూడియుండునుగాన వరశాపాదులు వానికి సిద్ధింపజాలవు

ఒకడు హైకోర్టుజడ్జి, జిల్లా కలెక్టరు మొదలగు పనులలో నుండునపుడు తాను విధించిన వాక్యములన్నియు వెంటనే యితరులు అమలు జరుపుదురు తనకట్టి ఉద్యోగము లేనపుడు తనవాక్య మేలాగున నిష్ఫలమగునో, ఆలాగున బ్రహ్మవిద్యలోగల అనుష్ఠానములతోగూడి సరియైన నిష్ఠయుండినచో అతని వాక్యములేగాక, సంకల్పములుగూడ తప్పక ఫలించును అట్టి ఆచరణ లేనందుచేతనే సంకల్పము లన్నియు నిష్ప్రయోజనము లగుచున్నవి ఇదిన్ని మనస్సుయొక్క ప్రధానతత్త్వమునే తెలుపుచున్నది

కావున నెవరైనను తాము సంకల్పించినట్లు జరుగక పోవుచుండిన వారి మనస్సునందు మాలిన్యము నశించియుండ లేదని బాగుగా తెలిసికొనవలయునే గాని జనులపై కోపగించిన ప్రయోజనము లేదు అట్లు కోపగించుటచే లోకములో మఱింత యనర్థము గలుగజేసిన వారగుదురు కనుకనే బ్రహ్మనిష్ఠులకు ఏ సంకల్పము ఉండరాదనియు, ఏ వస్తువుపై ఆశ గలిగియుండరాదనియు, వైరాగ్యనిష్ఠ గలిగియుండవలెననియు శాస్త్రము చెప్పుచుండగా తాను గలిగి

యుండవలసిన నిస్సంకల్పత్వమును, నిరాశత్వమును, నిర్దోషత్వమును మఱచి యితరులపై ద్వేషమును గలుగజేసికొనుట మంచిది కాదు అనగా తానడిగినది యివ్వకపోయినచో వీరు లోభులు, కఠినులు , ధర్మబుద్ధిలేనివారలు అని పరులను నిందించుట చాల పొరబాటు

ఈశ్వరుడిచ్చినదానితో తృప్తిపడి ఆత్మశాంతికి భంగకరముకాని పనిని మాత్రము చేసిన చాలును బ్రహ్మనిష్ఠకు మించిన కార్యము మఱియొకటి ముల్లోకములందును లేదు అయ్యది మన స్వాధీనములో నుండ, అట్టి నిష్ఠను వదలి ధర్మ కార్యములకైనను పుణ్యకార్య ములకైనను లేక యితర కార్యములకైనను ఏల యితరులను యాచన చేయవ లెను? పరోపకారము కొఱకును, ఈశ్వరకార్యములకొరకును, ఇతరుల యాచించవచ్చునని శాస్త్రములందు చెప్పబడియున్నను అది తీవ్ర బ్రహ్మనిష్ఠుల విషయమై చెప్పబడినది కాదనియు, సామాన్యుల విషయమై చెప్పబడినదనియు బ్రహ్మనిష్ఠు లెఱుంగవలెను

ఈ విషయమై యొక కథ చెప్పెద- ఒక బిచ్చగాడు దారిలోగల యొక చెట్టు నీడలో కూర్చొనియుండెను ఆమాని క్రింద ఎవరో బాటసారులు చెరకు నమలి ఉమ్మివేసిన పిప్పియుండెను దానిని తీసుకొని ఆయాచకుడు నమలి నప్పుడు అందు మాధుర్యముగాని, చెరకురసముగాని యుండలేదట! అప్పుడు, ఇది యే మూఢుడు నమలివైచెనో కొంచెమైనను రసముంచక పోయెను గదా అని తలంచును అతనిని కఠినుడు, ధర్మహీనుడు అని తిట్టుచుండెనట! పైన దెల్పిన జనులయొక్క ప్రవృత్తియు ఈలాగుననే యుండునని తలం చవలెను. కాన మానవుడు దొరకినదానితో తృప్తి బొందేలాగున చూడవలెను ఎవరున్ను ఆత్మవంచనలేక సర్వేశ్వరు డిచ్చిన దానిలో శక్తి కొలది యే కార్యము నైన చేసిన చాలును ఇక నాఱవ యర్థమును చెప్పెద.

6 తపస్సిద్ధిగాని, యోగసిద్ధిగాని, గలిగినయోగికి 1. అణిమ, 2 మహిమ, 3 గరిమ, 4 లఘిమ, 5 ప్రాప్తి, 6 ప్రాకామ్యము, 7 ఈశత్వము, 8 వశిత్వము అను సిద్ధులు కలుగును అట్టి సిద్ధపురుషులు సంకల్పము

మాత్రముచేత తలంచినట్లు చేయగలరు కాన అట్టివారికి మనస్సు ప్రధానమని చెప్పబడెను మనస్సే ప్రధానమని చెప్పువారు తాము సంకల్పించినలాగున జరుగుచున్నదా లేదా యని పరీక్షించి చూచిన దీనియొక్క రహస్యము గోచరము కాగలదు

7 మఱియొక అర్థముకూడ తెలిపెద అదేమన, తనకు ప్రపంచములోగల యే వస్తువునైనను తనయొక్క యిష్టానుసారముగ మార్పుచేయు శక్తి సంకల్పమాత్రముచే గలుగుచుండునా యను విషయము సిద్ధపురుషులైనచో సంకల్పించినట్లు చేయగలరు వీరికి మనస్సే ప్రధానము వీరి కందఱివలె ప్రయ త్నమేమియు చేయబనిలేదు ఇట్టి యున్నతస్థితి తనకు గలిగినదా యని యోచింపక యిప్పుడుండువారిలో కొందరు తినుటలోను, త్రాగుటలోను, హీనకృత్యము లొనర్చుటలోను, వస్త్రధారణలోను ప్రవర్తించి అమాయకులతో 'మనస్సే ప్రధాన' మని వేదాంత వాక్యములను బలుకు చుందురు ఇందువలననే అతిపవిత్రమగు వేదాంతశాస్త్రమునకు పతనము గల్గినది మరియు వేదాంతులపై జనులకు విశ్వాసము లేకుండుట జరిగినది

మనస్సు చెడువిషయములలో పోవునపుడు, అయ్యో, మన మనస్సెంత మలినమైనది దుష్ట కార్యములలోనికి బోవుచున్నదేయని తలంచి జ్ఞానము తెచ్చు కొని అట్టి చెడుకార్యములనుండి మనస్సును మరలించు కొనుటయే మనస్సు ప్రధానమని చెప్పెడుదాని కర్థము ముఖ్యముగా నివాస దోషము చేతను ఆహార దోషముచేతను, మనస్సు వశపడకపోవును ఈ రెండింటిలో ఆహారదోషముకంటె నివాసదోషమే కడు చెఱుపు చేయును ఆహారదోషముండిన అది కాలక్రమ మున మనస్సును మాలిన్యపఱచును ఇక నివాస దోషమో, తత్క్షణమే విపత్తులో బడద్రోయును కానపైజెప్పిన రెండు లోపములు లేక జిజ్ఞాసువులుండవలెను

పైజెప్పేలాగున అందఱును మనస్సే ప్రధానమని తలంచి నీతి బాహ్యులై యున్నారని తలంపరాదు అట్టివారెందరో పుణ్యపురుషులు గలరు ఎందరో బ్రహ్మ నిష్ఠులును గలరు ఎందరో పవిత్రాత్ములు గలరు అట్టివారు లేనిచో నిక సంసారసాగరమున బడియున్నవారిని తరింపజేయువారుండరు

అంతేగాక ఎవరికైనను ఆత్మశాంతి గలుగవలసియుండిన, మనోనిగ్రహము లభించవలసి యుండిన, శాశ్వతదైవసుఖము సిద్ధింపవలసియుండిన, జీవించినప్పుడే దివ్య ప్రకాశము గలుగవలసియుండిన, జననమరణములగు భవరోగము నుండి తరింపవలసియున్న, వేదాంతశాస్త్రాభ్యాసము తప్ప వానిని రక్షించునది మఱి యొకటి మూడు లోకములందును లేదు అట్టి పుణ్యాజీవులకు గోరంత యిచ్చి నను కొండంత పెరుగును బిందువంత జలమిచ్చినను అయ్యది సముద్రము వలె వృద్ధి నొందును అట్టి పుణ్యపురుషుల హృదయములో పడిన వస్తువులన్నియు సాక్షాత్ భగవంతున కర్పించినట్లే యుండును మనస్సే ప్రధానమను విషయమై ముండకోపనిషత్తు చెప్పినది చూడుడు

యం యం లోకం మనసా సంవిభాతి
విశుద్ధసత్త్వః కామయతే యాంశ్చ కామాన్ ।
తం తం లోకం జయతే తాంశ్చ కామాన్
తస్మా దాత్మజ్ఞం హ్యర్చయే ద్భూతికామః ॥

పరిశుద్ధాంతః కరణముగల జ్ఞాని మనస్సుచేత ఏయే లోకమును సంకల్పిం చునో, ఏ యే కోరికలను కోరునో, ఆయా లోకమును, ఆయా కోరికలను పొందును కాన ఈశ్వరానుగ్రహము నభిలషించువాడు బ్రహ్మవేత్తను సేవిం చవలెను

సర్వసంగవిముక్తస్య యోగారూఢస్య ధీమతః ।
యాదృశం మానసం యత్ర తాదృశం విన్దతే ఫలమ్ ॥

ప్రాకృతములగు సమస్త బంధములనుండి విముక్తినొందిన చిత్తము గలవాడు, ఈశ్వరధ్యానమందు ఐక్యానుసంధానము సిద్ధించినవాడు, శుద్ధమైన బుద్ధిగలవాడు నగు యోగి తన మనస్సునందు ఏమేమి సంకల్పములు చేయునో ఆయా సంకల్పముల ననుసరించిన ఫలమును తప్పక పొందగల్గును అని యుపనిషద్వాక్యము

అయినను ఇటనొక విషయము జ్ఞప్తియందుంచుకొనవలెను లోకోద్ధార మొనర్చుట, గొప్పగొప్ప సంస్థల నిర్మించుట, మహత్కార్యము

లొనర్చుట మున్నగునవి మేమేల యొనర్పజాల కున్నామని చిత్తశుద్ధిగల భక్తులు కొందరు తలంచవచ్చును అట్టి సంస్కారము కొందఱకు మాత్రమే యుండునని గ్రహింపవలెను లేక ఈశ్వరుడు వారి కిట్టి సంస్కారమును కలుగజేసెనని కాని తలంచి లక్ష్యమగు జీవన్ముక్తి కొఱకే ప్రయత్నమును కొన సాగించు చుండవలెను ఇందలి నిగూఢ తత్త్వమేమన ప్రపంచస్సృష్టి యంతకును ప్రకృతియే కారణము అట్టి ప్రకృతి యెవనికి వశపడియుండునో అనగా ఎవడు ప్రకృతిరహితత్వ మొందునో లేక ప్రకృతిని జయించునో అతడు ప్రకృతికి పరమగు పరమాత్మా నుభవము గల్గియుండును

ఇట్టి యున్నతస్థితిని సర్వులు పొందనర్హులే బ్రాహ్మణులుగాని, బ్రాహ్మణేతరులుగాని, స్త్రీలుగాని, పురుషులుగాని యెవరైనను అంతః కరణశుద్ధిగల్గి ప్రయత్నించిన అట్టి దివ్యపదవిని పొందగలరు అపుడా స్థానమునకు సంబంధించిన సర్వశక్తులును వారికి లభింపగలవు ఒక గొప్ప ఉద్యోగమునందు ప్రవేశించువారెవరైనను, ఏజాతి వారైనను, ఏ కులము వారైనను, ఏదేశీయులైనను అద్దానికి సంబంధించిన సర్వాధికారములు వారికి గల్గునుగదా! అట్లనే ఇట్టి మహోన్నతమగు దైవస్థితిని బొందిన ప్రతివారికి ఆయాదైవికశక్తులన్నియు గలుగును అట్టి వాని కార్యములన్నియు ప్రకృతియే నిర్వహించుచుండును దీనికే జగన్మాతయనియు, పరాశక్తియనియు మహా శక్తియనియు, శివశక్తియనియు, విష్ణుమాయయనియు, భగవత్కృప యనియు గూడ పేర్లు గలవు ఇట్లు ప్రకృతియే గోడవలె జీవుని అడ్డుపరచుచుండును గోడ యేలాగున అనేక రాళ్ళతో కట్టబడినదో ఆలాగున జీవునియొక్క జన్మాంతర సంసారములన్నియు కర్మరూపముగ అడ్డుపడియుండును దీనిని తొలగించుటయే బ్రహ్మనిష్ఠుని కర్తవ్యమైయున్నది

8 మనస్సే ప్రధానమను విషయమై యింకొక అర్థముకూడ తెలిపెద ఈ జీవజగత్తులన్నియు కేవలము పరమేశ్వరస్వరూపములై యున్నను మనస్సు ఒక భావనావిశేషముచే ప్రపంచముగాను, జీవులుగాను, సత్త్వరజస్తమో గుణ ములుగాను, జననమరణములను అవస్థలుగాను, వెయ్యేల సమస్తసంస్కార సంకటముల రూపముగాను నగుచుండును ఈవిషయము ప్రమాణపూ

ర్వకముగ చెప్పబడిన విస్తారమగును కాన సంగ్రహముగ నిట చెప్పబడినది ధ్యాన, జ్ఞాన, యోగాదులచే మనస్సు శుద్ధపడుటవలనను, బ్రహ్మవిచారమందు ప్రవేశించుటవలనను, శ్రవణమనననిదిధ్యాసనము లొనర్చుటవలనను దోషము లన్నియు నివారింప అపుడు జీవునకు తాను శుద్ధశివస్వరూపుడనియు మాయచే గల్గిన భ్రమవలననే యీ సత్యము నింతవఱకు తెలిసికొనలేదనియు జ్ఞానము గలుగును అపుడు అవిద్యయొక్కయు, అజ్ఞానము యొక్కయు శక్తిచే ఈ ప్రపంచమీలాగున కనుపించుచున్నదను బోధము గలుగును ఇట్టి అవిద్యా దోషము నశించిన మాత్రమే నిజమైన యవస్థ జీవకోట్లకు గలుగును అవిద్య నశింపవలసియుండిన ఈశ్వరభక్తి అవశ్యము గలిగియుండవలెను ఇదియే దీని లోగల సారము, శాస్త్రము లన్నియు ఈవిషయమునే యుద్ఘోషించుచున్నవి

యావదాత్మా న లబ్ధోఽయం శుద్ధో జ్ఞానం చ నోదితమ్ ।
మలినే విషయే రాగ స్తావదజ్ఞానినో భవేత్ ॥

ఎంత వఱకు ఈ ఆత్మ లభించుట లేదో, శుద్ధమైన ఆత్మజ్ఞాన ముదయము కాలేదో, ఎంతవఱకు విషయవాసన లీనము కాలేదో అంతవరకు తా నజ్ఞానద శలో నున్నట్లే తలంచుకొనవలెను.

యధా భర్జితబీజస్య ప్రరోహిత్వం వినశ్యతి ।
తధాఽఽత్మజ్ఞానినో నిత్యం జగద్బుద్ధి ర్విలీయతే ॥

ఏలాగున అగ్నిలో వేయించిన బీజముయొక్క అంకురత్వము నశించియుం డునో, ఆలాగున ఆత్మజ్ఞానాగ్నిలో దహించిన చిత్తముగల వానికి దృశ్య విషయ ములు నశించియుండును విషయాంకురములు హృదయములో పుట్టుచుం డిన ఇంకను జ్ఞానాగ్నియందు చిత్తము దగ్ధము కాలేదని సాధకుడు గ్రహించుకొనవలెను

ఇంద్రియేష్వింద్రియార్థేషు ప్రవృత్తేషు యదృచ్ఛయా ।
అనుధావతి తాన్యేవ మనోవా యు మివానలః ॥

ఇంద్రియములు, ఇంద్రియార్థము(విషయము)లలో స్వేచ్ఛగా ప్రవర్తించుచుండిన, విషయముల ననుభవించుచుండిన, అగ్నిదేవునకు వాయుదేవుడు సహాయపడునట్లు విషయానలము మఱింత ప్రజ్వలించునేగాని

శమించదు ఇది సమస్తశాస్త్ర సిద్ధాంతము

నాశ్రమం కారణం ముక్తేః దర్శనాని న కారణమ్ ।
తథైవ సర్వకర్మాణి జ్ఞానమేవ హి కారణమ్ ॥

ఆత్మజ్ఞానప్రాప్తికి సన్న్యాసాది ఆశ్రమములు కారణము కాదు ఆలాగున శాస్త్రముల పఠించుటయు కారణము కాదు అదే ప్రకారము కర్మకాండలో ప్రవృత్తి గలిగియుండుటయు కారణము కాదు ఈశ్వర సాక్షాత్కారజ్ఞానము కలుగుట ఒకటి మాత్రమే కారణమగును

అంత స్తిమిరనాశాయ శాబ్దబోధో నిరర్థకమ్ ।
న నశ్యతి తమో నామ కృతయా దీపవార్తయా ॥

గృహాంతర్భాగ తిమిరము(చీకటి) దీపముయొక్క వార్తవలన ఏలాగున నశించదో, ఆలాగున హృదయగుహయందు గల అజ్ఞాన తమస్సు శాస్త్రములను పఠించుటచేకాని, చెప్పుటచేగాని విలయము నొందదు

యస్య నాస్తి వివేకస్తు కేవలం యో బహుశ్రుతః ।
స న జానాతి శాస్త్రార్థాన్ దర్వీ పాకరసానివ ॥

బహుశాస్త్రములను పఠించినవాడైనను, ఎవనికి అంతఃకరణ శుద్ధి గలిగి వివేకజ్ఞాన ముదయము కాలేదో అట్టివాడు చదివిన శాస్త్రములన్నియు అనేక రసయుక్త పదార్థములలో త్రిప్పబడు గరిటెవలె నుండును అనగా గరిటె ఆయా పదార్థముల రసమును తెలిసికొనజాలనట్లు ఆచరణలేని కేవల శాస్త్ర పఠన మొనర్చువాడును ఆయథార్థతత్త్వమును, శాస్త్రార్థమును ఎఱుంగజాలక అనుభవజ్ఞానరహితుడై యుండును

స్వతంత్రాభ్యాసశీలానాం కథం యోగ మవాప్నుయాత్ ।
నాస్తి తేషామపి జ్ఞానం నాస్తి తేషాం గతిః పరా ॥

అనుభవముగల మహనీయుల అనుగ్రహము పొందక స్వతంత్రముగ ఎవడు యోగాదిసాధనలు చేయునో, అట్టివారికి యోగసిద్ధి కలుగుటగాని, ఆత్మజ్ఞాన ముదయించుటకాని, ఉత్తమగతి లభించుటగాని సంభవించదు

శ్రద్ధావినయ సంయుక్తః శాన్తిదాన్త్యాది సంయుతః ।
యావత్ జ్ఞానోదయస్తావ ద్వేదాంతార్థం నిరూపయేత్ ॥

ఎంత వఱకు ఆత్మజ్ఞానోదయము కాలేదో అంతవరకు శ్రద్ధా వినయములతో గూడినవాడై శమదమాది గుణములు కలుగజేసికొని వేదాంత విచారము, బ్రహ్మచింతన, ధ్యానయోగాభ్యాసము గావించుకొనవలెను వేదాంత శాస్త్రము యొక్క సారమంతయు, మహనీయుల యభిప్రాయ మంతయు నీశ్లోకములో ఇమిడియున్నది

ఇక శ్రీ యోగవాసిష్ఠమున ఉపదేశించినది చూడుడు

అనర్థేనావిచారేణ వయః కుర్యాన్న భస్మసాత్ ।

బోధేన జ్ఞానసారేణ దృశ్యం కర్తవ్యమాత్మసాత్ ॥

ఓ రామా! అనర్థప్రదమగు అవిచారణచే ఆయువును నశింప జేయవలదు శ్రవణమననాదులచే ప్రాప్తమగు తత్త్వజ్ఞానముచే ఈ దృశ్యము నాత్మతో ఐక్యమొనర్చుము

ఆయుషః క్షణ ఏకోఽపి సర్వరత్నైర్న లభ్యతే ।

నీయతే తద్వృథా యేన ప్రమాదః సుమహానహో ॥

ఆయువునందలి యొక క్షణమైనను వ్యర్థముగ గడపినచో, మఱల నయ్యది అనేక రత్నములచేగూడ లభింపనేరదు కాన ఆత్మవిచారము లేక సమయ మును గడుపుట మిక్కిలి ప్రమాద మగును

శాస్త్రస్యాస్య తు యన్నామ వాదనం తద్వినాఽపరః ।

అభ్యాసో దృశ్యసంశాంత్యై న భూతో న భవిష్యతి ॥

మోక్షోపాయమనబడు ఈ వేదాంత శాస్త్రమును గురుముఖతః శ్రవణమొనర్చి, ఆ పిదప మననినిదిధ్యాసనాదులచే బాగుగ నభ్యసింపవలెను దృశ్యము శమించుట కింతకు మించిన యుపాయమేద్దియు నేటి వఱకు మఱియొకటి యుండియుండలేదు ఇకను ఉండబోదు

క్షపయంతి విపాకం తం పూర్వోపాత్తస్య కర్మణః ।

స కాలే ప్రభవత్యేవ పూర్వోపాత్తం శుభాశుభమ్ ॥

స్వచ్ఛాయామివ దుర్వార ం దేవానామపి పార్థివ ॥

పూర్వజన్మమునందు వారు వారు చేసిన పుణ్యపాపములయొక్క ఫలము అనుభవకాలము వచ్చినపుడు అనుభవించియే తీరవలెను శుభాశుభ

ఫలములు తమ నీడవలెనే మనుజుని విడువక వెంబడించి వచ్చుచుండును అవిదేవతలనైనను విడువవు

శాస్త్ర మీలాగున చెప్పుచుండగా సామాన్యజనులు కూడ తమకు కర్మలు, ధర్మములు లేవని చెప్పుట యెంత విచారకరమగు ప్రవృత్తియో తెలియ దగినది

యో యాదృక్ క్లేశమాధాతుం సమర్థస్తాదృగేవ సః ।
అవశ్యం ఫలమాప్నోతి ప్రబుద్ధోఽ ప్యజ్ఞ ఏవ వా ॥

జ్ఞాని యైనను, అజ్ఞాని యైనను క్లేశకరములగు వారివారి కర్మల కను రూపమగు ఫలములను తప్పక బొందుదురు

అమోదశ్చందనస్యేవ స్పందనస్య ఫలం హృది ।
సర్వస్యైవాస్తి తన్మానం తద్వతా సమవాప్యతే ॥

శ్రీగంధమందు సుగంధమువలె విహితనిషిద్ధకర్మల ఫలము అందఱి యందును ఉండియేయుండును కాలక్రమమున అట్టి క్రియలయొక్క ఫలము లను వారవశ్యము పొందెదరు

ఇక ఈవిషయమై విస్తారముగ వ్రాసి గ్రంథమును పెంచదలంచుట లేదు ఉత్కృష్టమగు శాస్త్రము లీలాగున నుద్ఘోషించుచుండ సామాన్యస్థితిలో నుండు వేదాంతుల వాక్యములను గుఱించిన సత్యమును శుద్ధబుద్ధిగల ముముక్షువులే తెలిసికొనగలరు దైవప్రాప్తి అనగా ఈశ్వర సాక్షాత్కారజ్ఞానము కలుగుటకు దైవభక్తి గల్గియుండవలెనని అనేక శాస్త్రములును, పలువురు మహాత్ములును తెలుపుచున్నారు శ్రీభగవద్గీతయొక్క సారమున్ను ఇదియే ఏలన, గీతలోగల 14వ అధ్యాయమున గుణత్రయవిభాగమును గూర్చి చెప్పబడినది మూడు గుణములు, వాటి పరిణామములు, వాటివలన గలిగెడు ఫలములు అన్నియు నీయధ్యాయమున నుపదేశించినదేగాక గుణత్రయాతీతుని అనగా జీవన్ముక్తుని స్థితిగూడ ఇందు తెలిపిరి మఱియు నట్టి దుష్కరమగు గుణత్రయాతీతస్థితి నిర్మలమగు భగవద్భక్తి యొకదానిచే గలుగునని అందు శ్రీభగవానులుపదే శించిరి ఏలన, ఇది సర్వజనులకు అనుష్ఠించుటకు సులభకారణ మగుటచేత ను, కారుణ్యనిధియగు శ్రీభగవానులు అందఱును

తరించవలెనను అభిప్రా యము గల వారగుటచేతను ఇట్లుపదేశించడమైనది

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।

స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥ (14-26)

ఎవడు అచంచలమైన భక్తి యోగముచేత నన్ను ధ్యానించుచున్నాడో అతడు త్రిగుణములను అతిక్రమించి జీవన్ముక్తిదశను బొందుటకొఱకు సమర్థుడగుచున్నాడు ఈలాగుననే ఆఱవ అధ్యాయములో ఆత్మసంయమ పర మగు ధ్యానయోగమున్ను, జ్ఞానప్రాప్తియు, జ్ఞానప్రాప్తికై యుపాయమున్ను భగవాను లుపదేశించిన తరువాత ఆఖరున అనన్యభక్తి యొక్కదాని చేతనే అట్టి పదవి లభించుననియు, సాధన లన్నింటిలో పావనమైన భక్తియే శ్రేష్ఠమనియు నుపదేశించిరి

తపస్విభ్యో ధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।

కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥ (6-46)

యోగినా మపి సర్వేషాం మద్గతేనా న్తరాత్మనా॥

శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః॥ (6-47)

తపస్సు చేయువానికంటెను, అనుష్ఠానములేని వేదాంతశాస్త్రములు పఠించువానికంటెను, నిత్యనైమిత్తికాదికర్మల చేయువానికంటెను యోగనిష్ఠ గలవాడు శ్రేష్ఠుడు అట్టి యోగి అందరిలోను అధికుడని భగవంతుడు ఉపదేశించిన తరువాత అట్టి ధ్యానయోగు లందఱిలోను భక్తిగలిగి పరమాత్మ యందు నిలుపబడిన చిత్తముగలవాడై, అత్యధిక శ్రద్ధతో కూడినవాడై సర్వేశ్వరుని ఎవడు భజించునో, అనగా ధ్యానించునో అతడు అందఱికంటె అధికుడనియు, అదియే తన సమ్మతమనియు వచించెను

భక్త్యా మా మభిజానాతి యావాన్ యశ్చాస్మి తత్త్వతః ।

తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్ ॥ (18- 55)

వేదాంతశాస్త్ర మంతయు సంగ్రహముగ ఉపదేశించిన అంతిమాధ్యాయమగు పదునెనిమిదవ అధ్యాయములో శ్రీభగవాను లుపదేశించినది చూడుడు- భక్తులారా! బ్రహ్మనిష్ఠులారా! ఎన్ని రకములగు

రసయుక్తములైన బీజములుండినను అన్నిటికిని ఒకే ఆధార భూతమగు జలము అనగా వర్షము లేనిచో ఎట్లన్నియు వ్యర్థములగునో, అలాగున మీరు యోగముగాని, తపస్సుగాని, జపముగాని, వ్రతముగాని మఱి యెన్నెన్ని మార్గములు కలవో అవన్నియు అనుష్ఠించువారలైనను, అనన్యమైన భక్తియొకటి లేనిచో అవేవియు పూర్ణఫలము నొసంగజాలవు మఱియు బీజము లన్నియు అంకురించుటకు జలమొకటియే ఆధారమెట్లగునో, అట్లనే అన్ని మార్గము లకును భక్తియొక్కటియే ఆధారమగును అంతేగాక భక్తియొకదాని యందుమాత్రమే, అహంకార ము, అసూయ, ద్వేషము మున్నగు దోషములు నశించును అయితే ఇప్పుడు గల భక్తులలో కొందరియం దిట్టి ద్వేషాదులు కన్పించుచున్నవే యని తలంచ వచ్చును దానికి భక్తియొక్కపరమ లక్ష్యము పొందక పోవుటయే కారణము, భక్తియొక్క పరమకాష్ఠ సర్వచరాచర ప్రాణికోట్ల యందును, తనయందును భగవంతుని చూచుటయే యగును అట్టి భక్తి కలుగనందుచేతనే ద్వేషాదులు కలుగుచున్నవి

ఇక పైశ్లోక తాత్పర్యము వినుడు - పరిశుద్ధమైన భక్తిచే నాయొక్క స్వరూపమును అనగా భగవత్స్వరూపమును లెస్సగ తెలిసికొనును అట్టి తెలివియే అనగా జ్ఞానమే నిజమైన తత్త్వము బోధపడుటకున్ను, ఆత్మయొక్క ఆవరణములు,బంధములు నశించుటకును కారణమగుచున్నది అట్టి సాక్షాత్కారజ్ఞానము వలన జీవుడు పరమశాంతిని నిత్యమగు మోక్షమును పొందుచున్నాడు

ఈభక్తి విషయమై వ్రాయవలసియుండిన ఎంతయో గలదు ఇంత వఱకు వ్రాసియుండిన గ్రంధములలో విశేషముగ తెలుపబడియుండెను ఇప్పుడు ధ్యానము అన్నిటికంటె ఎక్కువ ఫలమును కలుగజేయునను విషయమై సూతసంహితలో చెప్పబడినవిషయము కొంచెము మాత్రమిట తెలుపబడుచున్నది

1. **ధ్యానయజ్ఞం వినా ముక్తౌ యతన్తే మోహితా జనాః ।**
   పాయసాన్నం పరిత్యజ్య భక్షయన్తి మహావిషమ్ ॥

2. ధ్యానయజ్ఞం వినా కించిత్ కుర్వాణో ముక్తిసిద్ధయే ।
అక్ష్ణాపి శబ్దం గృహ్ణాతి వినా శ్రోత్రేణ కేవలమ్ ॥
3. అశ్వమేధాదయో యజ్ఞా అశేషా వేదదర్శితాః ।
మునీంద్రా ధ్యానయజ్ఞస్య కలాం నార్హన్తి షోడశీమ్ ॥
4. ధ్యానయజ్ఞపరో మర్త్యశ్శివ ఏక న చాపరః ।
ధ్యానయజ్ఞైకనిష్ఠస్య న కించిదపి దుర్లభమ్ ॥
5. ధ్యానయజ్ఞపరాణాం తు ప్రసాదం కురుతే శివః ।
శివోఽపి సాక్షాత్ సర్వజ్ఞః సంసార వినివర్తకః ॥
6. బహునోక్తేన కిం సర్వం సమాసేన మయోదితమ్ ।
కురుధ్వం వేదవిన్ముఖ్యాః ధ్యానయజ్ఞ మశంకితాః ॥

1 మాయా మోహితులగు ఏ జనులు ధ్యానమనెడు ఆత్మయజ్ఞమును విడిచి ముక్తివిషయమై యితర ప్రయత్నములు చేయుదురో వారు శుద్ధమగు క్షీరాన్నమును త్యజించి మహావిషమును భుజించిన వారగుదురు

2 ధ్యానయజ్ఞము నుపేక్షించి మోక్షవిషయమై యితర క్రియలు చేయువారు శ్రోత్రముచేత వినవలసిన శబ్దమును నేత్రముచేత వినదలంచిన వారిచందమున నుందురు

3 ఓ మునీంద్రులారా! వేదమందు కర్మభాగములో నుపదేశించిన అశ్వమేధాదులగు సమస్తయజ్ఞములున్నూ ధ్యానయజ్ఞముచే గలిగెడు ఫలముయొక్క పదునాఱు భాగములలో నొక భాగమైనను కలుగజేయజాలవు

4 ధ్యానయజ్ఞపరుడగు మానవుడు సాక్షాత్ శివస్వరూపుడే యగును ధ్యాన యజ్ఞైక నిష్ఠునకు దుర్లభమైన దేదియు ఏ లోకమందును లేదు

5 ఆత్మధ్యానమనెడు యజ్ఞమందు నిష్ఠగలవానికి ఈశ్వరా నుగ్రహము త్వరలోనే సిద్ధించును సర్వజ్ఞుడున్నూ, సర్వసాక్షియు, సంసార దుఃఖమును నివర్తింపజేయువాడును సాక్షాత్ శివుడే యగును

6 వెయ్యేల, సంక్షిప్తముగ నుపదేశించెదను వేదవేత్తలలో శ్రేష్ఠులగు నో బ్రహ్మనిష్ఠులారా! మీరు సంశయము లేనివారై ఆత్మధ్యానమను జ్ఞాన యజ్ఞము నాచరింపుడు దీని యొక్క దానిచేతనే సంసారమును తరించి

మోక్షపదవి చేరగల్గుదురు

ఇట్టి ఆత్మజ్ఞానమునకు అనగా బ్రహ్మనిష్ఠయను ధ్యానయజ్ఞమునకు విఘ్నములను గలుగజేయునట్టి పాపగుణములను ప్రతి ముముక్షువున్ను విడువవలయును ఇట్టి పాపగుణములే మోక్షమునకు విఘ్నములై యున్నవి అవి యేవనగా

భయం క్రోధమథాలస్య మతిస్వప్నాతి జాగరమ్ ।
అత్యాహార మనాహారం నిత్యం యోగీ వివర్జయేత్ ॥

భయము, క్రోధము, ఆలస్యము(సోమరితనము), అతినిద్ర, నిద్రలేకుండుట, అతిభోజనము,భోజనము లేకుండుట – ఈయేడింటిని యోగ నిష్ఠాభిలాషి విడువవలెను

ఆలస్యమనృతం శార్యం జాడ్యం నిందాఽ ప్యనుద్యమః!
షడేతే మంత్రిణ స్తస్య జ్ఞానద్వారనిరోధినః!!

సోమరితనము, అసత్యము, మూర్ఖత్వము, రోగము, పరనింద, స్వప్రయత్న రాహిత్యము – అను నీయాఱున్ను సాధకునకు మోక్షద్వార నిరోధకము తెలియదగినది

ఇప్పు డీమనస్తత్వమును ఉపసంహరించెద యథార్థముగ విచారించిన మనస్సను వస్తువే లేదు విషయములు, గుణములు,వాసనలు, సంస్కారములు, సంకల్పములు, మాయ, అవిద్య, అజ్ఞానము మొదలైన వన్నియు జేరి మనస్సగుచున్నవి ఇవన్నియు ఆత్మనుండి వదలిపోవునపుడు మనస్సుకూడ లేకపోవును ఇవన్నియు నున్నచో ఆత్మప్రకాశమును మఱుగు జేసి జీవుని అంధకారమున బడద్రోయము ఎట్లన, యథార్థము విచారించిన మేఘమను వస్తువే లేదు సూర్యరశ్మిచే గలిగెడు జలరేణువులు, వాయువు, విద్యుత్తు మొదలైనవి చేరినపుడు మేఘమనునది యేర్పడుచున్నది ఇయ్యది చల్లనిగాలిచేకరగి వర్షమై కురిసిన మరల మేఘముండదు ఈమేఘము దట్టమైయుండినపుడు ఎంతయో ప్రకాశంతమైన సూర్యునికూడ కనుపడకుండచేయును విధమున్ననే మనస్సుయొక్క స్థితి కూడ ముముక్షువులును, విజ్ఞాన స్వరూపుల్లును తెలిసికొనదగినది బృహదారణ్యకోపనిషత్తునందు మనస్సును గార్గికి చెప్పబడిన

అతిపవిత్రమగు ఉపనిషద్వాక్యము నిట నుదాహరించి యిక దీనిని ముగించెద

కామః సంకల్పో విచికిత్సా శ్రద్ధాఽశ్రద్ధా ధృతి ।
రధృతిర్హ్రీర్ధీర్భీ రిత్యేతత్సర్వం మన ఏవ ॥

కామము, సంకల్పము, సంశయము, శ్రద్ధ, అశ్రద్ధ, ధైర్యము, అధైర్యము, లజ్జ, జ్ఞానము, భయము మొదలగు వృత్తులన్నియు జేరియే మనస్సగునని చెప్పబడియున్నది

మనస్తత్త్వము సమాప్తము.

★★★★

నియతి

అబ్ధివద్భుత మర్యాదా భవన్తి విగతాశయాః!
నియతిం న విముంచంతి మహాన్తో భాస్కరా ఇవ!!

నియతి శబ్దమునకు నీతి యనియు, నియమ మనియు, ఆచరణ యనియు, అనుష్ఠాన మనియు, సన్మార్గమనియు, సత్ప్రవర్తన మనియు, సదాచార మనియు మొదలుగాగల పేరులు గలవు ఇప్పుడు ప్రపంచములో కావలసినది యీ నీతియే జనులు నీతిదూరు లగుచుండిన, దైవదూరులుగాను, జ్ఞానదూరులుగాను, సత్యదూరులుగాను అగుచుందురు ప్రకాశమునుండి దూరముగ పోగా పోగా ఏలాగున జనులు కారు చీకటిలోనికి దిగిపోవుచుందురో, ఆలాగున నీతిదూరులు గాఢతమస్సులోనికి పోవుచుందురు చీకటిలోనికి పోగాపోగా నేత్రములు కనుపడకపోవునట్లు నియతిదూరులకు జ్ఞానముకూడ గోచరము గాకపోవును

ఇప్పుడిట్టి యవస్థ చాలమందికి గలుగుటయే బ్రహ్మవిద్య పతనమగుటకు కారణ మగుచున్నది అందువలన తాము నిజసుఖము నెఱుంగకపోవుటయే గాక దుఃఖసంకలిత హృదయులై శోకబాధితు లగుచున్నారు అనగా క్లేశ సాగ రములో పడియుండి దుఃఖించుచున్నారు దృఢముగా కట్టని వంతెన అయిన చో ఏలాగున జలప్రవాహవేగమున పడిపోవునో, ఆలాగున దృఢమైన నియతి లేని బ్రహ్మనిష్ఠులుగూడ తప్పక ఒకానొకపుడు విషయములలో పడిపోవుదురు నదిని దాటుటకు వంతెన ఎటువంటిదో, దుఃఖప్రవాహమును దాటుటకును నియతి అటువంటిదే నీతి బాహ్యులగు వారు గమ్యస్థానమును పొందజాలరు ఇంజను సహాయముతో నడచునవగు రైలు, మోటారు, విమానము మున్నగువానిపై ప్రయాణము చేయుచుండిన, వాటి యింజను చెడిపోయిన, ఏలాగున ప్రయాణము ఆగిపోవునో, లేక ప్రమాదము గల్గునో, ఆలాగున నియతికి లోపము గల్గిన ముక్తిమార్గమున కాటంకము గల్గును లేక

పతనము గూడ సిద్ధించును మఱియు సూర్యాది గ్రహములన్నియు నియతియందే యుండుటవలన ఈ భూలోకాదులన్నియు సురక్షితములై యున్నవి, ఏగ్రహ మైనను నియతినుండి తప్పిపోయిన లోకము లన్నియు ధ్వంసములై నశించును ఆలాగున నియతిలో నుండువాడు ఎంత గొప్ప కార్యమైనను చేయశక్తి కలిగి యుండును అది పోవుటచే అన్ని కార్యములును స్తంభితములగును ఇరుసు విరిగిపోయిన రథమేలాగున భూమిలో కూలి పోవునో ఆలాగున నియతినుండి తప్పిన జనులుకూడ అజ్ఞానములో పతితు లగుదురు జనులయొక్క శక్తి తగ్గిపోవుటకున్ను, ప్రత్యేకించి బ్రహ్మనిష్ఠుల యొక్క ఊర్ధ్వగతి కడ్డు గలుగుటకును నియతి నుండి తప్పుటయే కారణము

ఒక యంత్రముయొక్క చక్రములు మొదలైనవన్నియు ఏలాగున మరచీలలచే బంధింపబడి యుండువరకు ఆ యంత్రము శుద్ధముగా పని చేయునో, మేకులు వదలిపోయినచో ఆ యంత్ర మేలాగున ఛిన్నాభిన్నమై పోవునో, ఆలాగున మనుజు డెంతవఱకు తన నియతిని దిట్టముగా ఆచరణలో నుంచునో అంతవరకా తని కెప్పుడును పతనము గలుగదు అంతేగాక వాని యూర్ధ్వగతికి ఆటంకము లేవియు నుండవు ఇప్పుడుండు యోగులకుగాని, తపస్వులకుగాని, భక్తులకుగాని కలిగెడు ఆటంకము లన్నిటికి కారణము నియతి యొక్కదానిని పాలింపకుండుటయే యగును అందువలన పూర్వ ఋషులయొక్క స్థానమును వీరు పొందజాలకున్నారు వీరియొక్క అవిద్యా రోగమున్ను శమింపకయున్నది

ఒక ఔషధము తయారు చేయునపుడు దానికి కావలసిన పదార్థము లన్నియు తగు భాగములతోగూడ పక్వము చేయబడిననే ఆ యౌషధము సరియైన ఫలమును గలుగజేయును అట్లు కానిచో రోగమును శమింప చేయుశక్తి ఆయౌష ధమునకు లేకపోవును అట్లే బ్రహ్మవిచారము చేయువారి ఏ యే నీతుల శాస్త్రములు విధించుచున్నవో అవి సరిగానుండిన మాత్రమే భవరోగము శమించును పూర్వకాలపు ఋషులు, యోగులు, భక్తోత్తములు కలిగియుండు ఆత్మశక్తి, దైవశక్తి వీరికి లేకపోవటకున్నూ ఇదే కారణము కట్టె లెంత అధికముగ నుండునో నిప్పున్ను అంత అధికముగ జ్వలించునట్లు

నియతికి సంబంధించి సుగుణములన్నియు గలిగిన మాత్రమే ఆత్మశక్తియు పూర్ణముగా గల్గును అగ్ని జలములయొక్క బలముచేగదా యింజనులన్నియు చైతన్యము నొందుచున్నవి, రైళ్ళు మున్నగునవి అతివేగముగా పరుగెత్తి అనేక జనులను గమ్యస్థానము జేర్చుచున్నవి ఆలాగున పూర్వకాలములో నుండిన సంయము లందఱును నియతితో నిలుకడ గలవారగుటచేతనే అతీంద్రియ జ్ఞానులై సంసారములో నుండు అనేక జనులను మోక్షమునకు జేర్చగల్గిరి ఇప్పుడుండువారికి నియతిలో కొఱత గలిగినందులకే వారు దివ్యమగు ముక్తిపదవిని చేరకయున్నారు అయితే అందఱును ఆలాగున నున్నారని తలంచవలదు ఎందఱో పుణ్యజీవులుండవచ్చును అట్లు లేనివారినిగూర్చి మాత్రమే యిది చెప్పడమైనది నియతి బద్ధులైనవారు ఇప్పుడు కూడ దుఃఖ రహితులయ్యే యున్నారు

అవిద్య నిశ్శేషముగ నశించిననే మోక్షము గలుగునని చెప్పినది నిజము అవిద్యకు దృశ్యసంబంధ గుణములే స్వభావ మనియు, ఆ యవిద్య గుణములకు భిన్నముగా లేదనియు శాస్త్రము చెప్పుచుండగా, అట్టి గుణములను రహితమొనర్పజూడనిచో ఆయవిద్య యెట్లు నశించును? ఈయవిద్యకే అజ్ఞానమనిగూడ పేరుగలదు మూల ప్రకృతి యని కూడ దీనినే పిలుతురు మాయయని కూడ దీనికే పేరు ఆత్మజ్ఞాన స్వరూపమున కన్యమైన సమస్త గుణములున్ను అంతఃకరణములోనుండి తొలగిన, మిగిలియున్న దేదియో అదే జ్ఞానము ఆ యవిద్యాగుణము లన్నియు తొలగునపుడు జీవున కాత్మజ్ఞానము స్వయముగ తనలోనే ఉదయమగును అట్టి దివ్యజ్ఞానము మరియొక స్థల మునుండి రావలసినది గాదు మేఘము వదలునపుడు సూర్యుడు స్వయముగానే వెలుగునట్లు ఆత్మశక్తిగూర్చియు అట్లనే యెఱుంగవలెను అరణిని మథించుచు రాగా రాగా అగ్ని ప్రజ్వలించినట్లు ఆత్మచింతనయందు ఏకాగ్రత గలిగి ధ్యానము చేయుచున్నవారికి దైవత్వ ప్రాప్తియు తప్పక గలుగుచుండును

రెండు ప్రాణశక్తులు చేరునప్పుడు విద్యుచ్ఛక్తి యేర్పడి ప్రకాశించునట్లు ఆత్మ పరమాత్మల ఐక్యము, లేక మనస్సు ఆత్మల ఐక్యము,

లేక జీవేశ్వరుల ఐక్యము కలుగునపుడు దివ్యజ్ఞానము ఏర్పడును అనగా అనాత్మభావము నశించి ఆత్మభావము(జ్ఞేయము)లో నిలకడ గలుగునపుడు దైవస్థితి జీవులకు గలుగు చుండును ఇట్టి స్థితి జ్ఞానమును దాటిన తర్వాత జ్ఞేయములోనికి ప్రవేశించిన మాత్రమే సిద్ధించును జ్ఞానమును దాటుట యనిన జ్ఞానికుండవలసిన సుగు ణములన్నియు పూర్తియైనపిదప మాత్రమే జ్ఞేయమందు ప్రవేశము సిద్ధించునని అర్థము జ్ఞానశబ్దమునకు ఆత్మజ్ఞానమని కూడ అర్థము గలదు జ్ఞానికుండవలసిన గుణములకున్ను అదే అర్థము ఏర్పడియున్నది ఇచట జ్ఞానియొక్క గుణములనే జ్ఞానమని చెప్పినదని గ్రహించుకొనవలెను

జ్ఞానికుండవలసినది సామాన్యముగ పుణ్యకర్మలకు సంబంధించిన గుణములని గ్రహించిన చాలదు సంయములకు, ధ్యానపరాయణులకు ఉండవలసినది ధారణాధ్యానపరాయణుల కుండవలసిన అమానిత్వాది సుగుణసమూహమనియే గ్రహించుకొనవలెను సరోవరము, చెరువులు మొద లగునవి దృఢమైన కట్టలచే ఎట్లు బాగుగ సంరక్షింపబడుచున్నవో ఆలాగున బ్రహ్మనిష్ఠులయొక్క అధ్యాత్మజ్ఞానముకూడ నియతి యను దృఢబంధనముచే రక్షించుకొనవలెను తుపాకిమందు మొదలగువానికి గంధకము, బొగ్గు, పదును మొదలగునవన్నియు సరిగా నుండునపుడు మాత్రమే ఆ మందు మనము తలంచినప్పుడు పనిచేయును వానిలో నేదైన సరిగా లేనిచో అది పని చేయజాలదు ఆలాగున ఆత్మ నిష్ఠనకు విధింపబడిన నియమము లన్నియు సరిగా నుండిననే ఆతడు ధ్యానమునకు గల్గెడు ప్రతిబంధములను, హృదయ గ్రంథులను(ఆవరణములను) నశింపజేయును

మఱియు ఒకరికుండవలసిన అవయవములన్నియు సరిగా నుండిన మాత్రమే లోకవిషయ జ్ఞానములన్నియు వానికి చక్కగ గలుగుచుండును నేత్ర మొకటిలేక తక్కిన అవయవము లన్నియు ఉండినను ఏలాగున దృశ్యజ్ఞానము గలుగదో, ఏలాగున కర్ణేంద్రియము లేనిచో శబ్దజ్ఞానము తెలియదో, అదేరీతిగ ఏ యింద్రియము లేకపోయినను దానివలన కలిగెడు ప్రపంచజ్ఞానమెట్లు గోచరము కాదో, ఆలాగున బ్రహ్మనిష్ఠ కుండవలసిన నియమములన్నియు

గలిగియుండనిచో ఆత్మలోకములోగలుగవలసిన జ్ఞానమున్ను పూర్ణముగ గలుగనేరదు అంగహీను డేలాగున పుణ్యజన్మము గల వాడు కాడని జనులు చెప్పుచుందురో, ఆలాగున జ్ఞానాంగములన్నియు పూర్ణముగా లేనివాడు అధ్యాత్మలోకములో, పుణ్యమందు కొఱత గలిగినవాడని తలంచవలసి యుండును మహనీయులు ఎంత మహిమ గలవారైనను తమ యొక్క నియతిని విడచియుండజాలరని అనేక శాస్త్రము లుద్ఘోషించుచున్నవి

అబ్ధివద్ధృత మర్యాదా భవన్తి విగతాశయాః।
నియతిం చ న ముంచంతి మహాన్తో భాస్కరా ఇవ॥

సముద్రమెంత గంభీరమై, గొప్పదై, విశాలమై యున్నప్పటికిని కట్ట దాటి లోక ములోని కెట్లు రాదో, సూర్యాది మహాగ్రహములు సృష్ట్యారంభము నుండి నేటివఱకు మహాశక్తి, గొప్పతేజస్సు గలిగియున్నను తమ జ్యోతశ్చక్ర రేఖనుండి యెట్లు తప్పక యున్నవో, నిజమైన బ్రహ్మవేత్తలును ఆలాగున వర్తించుదురేగాని నియతి నతిక్రమించి యొకక్షణమైన నుండజాలరు సూర్యాదిగ్రహములు స్వస్థానము నుండి చలించిన ప్రపంచ మేలాగున ధ్వంస మైపోవునో, ఆలాగున ప్రపంచమును జ్ఞానబోధచే నడుపువారున్ను, ధర్మ మార్గముపదేశించుచు జనులను అధర్మమునుండి మఱలించు వారునగు బ్రహ్మ నిష్ఠులున్ను నియతినుండి దూరులైన ప్రపంచము దుఃఖమయమై, హింసా పరమై, దయాశూన్యమై, జ్ఞాన రహితమై, అజ్ఞానమయమగు గాఢ తమస్సులో బడిపోవలసియుండును

ఇప్పుడు లోకములో ఏదైన లోపమున్నచో, సరియైన బోధకులగు బ్రహ్మనిష్ఠులు లేకపోవుటయే దానికి కారణముగాని మఱియొకటి గాదు రైలును నడుపు డ్రైవరున్ను, గార్డున్ను సరిగా లేనిచో ప్రయాణికుల కెట్లు అపాయము గలుగునో ఆలాగున ప్రపంచమును ధర్మమార్గములో నడపెడు సాధువులు, సన్న్యాసులు, బ్రహ్మనిష్ఠులు మొదలగువారందఱను నియతితో నిష్ఠ గలిగి యుండనిచో వారున్ను, ప్రపంచమున్ను అంధకారములోనికి దిగిపోవును

అంత స్తిమిరనాశాయ శాబ్దబోధో నిరర్థకమ్ ।
న నశ్యతి తమో నామ కృతయా దీపవార్తయా ॥

గృహాంతరాళములో నిబిడమైయుండు చీకటిని దీపపు వార్తవలన నెట్లు నశింపజేయ సాధ్యము కాదో, అలాగున బుద్ధిగుహయందు నిబిడమై యుండు అజ్ఞాన తమస్సు నశించుటకు శాస్త్రశ్రవణము, పఠనము, పారనము మాత్రము చాలదు దానియందు చెప్పినలాగున ఆచరించిన మాత్రమే తమోరాహిత్యము గలుగును దీపము వెలిగించిననే గదా చీకటి యింటినుండి తొలగును

ఆచారహీనం న పునంతి వేదాః
యద్యప్యధీతా స్సహ షడ్భిరంగైః ।
ఛన్దాం స్యేనం మృత్యుకాలే త్యజన్తి
నీడం శకున్తా ఇవ జాతపక్షాః ॥

వేదములు కడవఱకు చదివినను నీతిబద్ధుడు కానిచో అవి ఆత్మను శుద్ధము చేయజాలవు వేదముగాక వేదాంగములుగూడ అధ్యయనము చేసినను, వేదాంగములగు షట్ఛాస్త్రములను అర్థముతో బఠించినను ఆచరణ లేనివాని నవి పవిత్రము చేయజాలవు అంతేగాక అట్టి అధ్యయనములు పరలోకములో వానికెట్టి సహాయమును చేయజాలవు ఎంత సౌందర్య వంతమగు దేహము గల్గియున్నను అంతకాలమున నెట్లది వీడిపోవునో, అలాగున ఆతడు చదివిన వేదవేదాంగము లన్నియు మరణకాలమున ఆత్మను విడిచిపోవును పక్షియొక్క పిల్లలు ఱెక్కలు వచ్చినపుడెటుల గూటిని విడిచిపెటి ్టపోవునో శాస్త్రపఠన పారన ములుగూడ అలాగుననే యుండును

1 ఆత్మోన్నతి మార్గములో(మోక్షద్వారములో) ప్రవేశింప దలంపు గల వారలకు నుపాయ మొకటి కలదు ఇది ముక్తి సౌధమునకు శిలాస్థాపనము వంటిది మోక్షభవనము దీనిపైననే ప్రతిష్ఠింపబడియున్నది ముక్తికిదియే ప్రాణాధారము పుణ్యజీవులకు దీనిని సాధించుటకు, ఆచరణలో నుంచుటకు అంత ప్రయాసమైన పని కాదు అదేమన, మీ వాక్కులోను, సంకల్పములోను, కరచరణాదుల క్రియలలోను, ఏలాటి ప్రకృతిదోషములుగాని, చెడు

సంకల్పముగాని, విషయవాసనలుగాని, ఎవరిపైనను ద్వేషముగాని, ఏవిధమైన కోరికలుగాని మీ యందు లేవను నిర్మల బుద్ధి కలుగవలెను మీ చిత్తము లోగాని, బుద్ధియందు గాని, సంకల్పమందుగాని తుదకు రోమములందు గాని, ఏ విధమైన మాయా మాలిన్యములు, విషయవాసనలు గాని లేవని అంతరాత్మసాక్షిగ అనుభవము గలుగవలెను అప్పుడు మీ జీవితమంతయు మారిపోయినట్లు మీకు గోచరము కాగలదు ఉత్కృష్ట మానవత్వముగాక దేవత్వమునకు మించిన స్థితి మీకు గలిగినట్లు బోధము కలుగును అప్పుడు అగ్ని ద్రావకములో శుద్ధిచేసిన మలిన బంగారమువలె మీరు శుద్ధులైనట్లు ఆత్మలో గోచరము కాగలదు అపుడు మీ యొక్క ప్రసన్నభావమునకు ప్రశాంతస్థితికి, హద్దు ఉండదు 'బ్రహ్మనిష్ఠ యొక్క మహిమ యేమని చెప్ప వచ్చును' అని మీలో మీకు ఆశ్చర్యము గలుగుచుండును

ఇట్టి త్రికరణశుద్ధి గలుగనిచో మానవుని అధ్యాత్మ ప్రయత్నము లన్నియు బూడి దయందు హోమించిన హవిస్సువలె వినష్టమై పోవును ఈ విషయములో చదివి నవారు, చదువనివారును, స్త్రీలున్ను, పురుషులున్ను సమానావస్థ గల్గియుందురు ఇది కేవలము ఆత్మయొక్క అనుష్ఠానము మాత్రముచేతనే కలుగును కాని మతియొక్క మార్గముచే కలుగునది గాదు అపుడు మీ హృదయములోను, మీ దేహములోను, ఇంతేకాదు ప్రతిరోమ కూపములోను, రోమాగ్రభా గములోను మీరు పరిశుద్ధులనియు, పుణ్య జీవులనియు బోధము గల్గును ఈ యధ్యాత్మ జ్ఞానమార్గములో ప్రవృత్తి గలుగుటకు, ఎన్నియో జన్మములనుండి చేసిన పుణ్యమిప్పటికి ఫలమునకు వచ్చినదను భావము గలుగుచుండును

ఈత్రికరణశుద్ధిలో దేనియందైనను మాలిన్యము గలిగియున్నదని తోచిన వెంటనే ప్రాయశ్చిత్తము చేసికొనవలెను అప్పుడు మలినము త్రొక్కిన వాడు కాళ్ళు కడుగుకొనిన ఎట్లు శుద్ధుడగునో ఆలాగున పాపము లన్నియు నశించును అట్టి ప్రాయశ్చిత్తమునకే పంచప్రాయశ్చిత్తమని పేరు గలదు ఉత్కృష్టధర్మములో, నిర్మల గురుభక్తిలో, శ్రేష్ఠమైన దైవభక్తిలో విశ్వాసము గలవారు ఆలాగున ప్రాయశ్చిత్త మాచరింతురు ఆ ప్రాయశ్చిత్తపంచక

మేదనిన -1 ఉపవాస వ్రతము, 2 మౌనము, 3 మంత్రజపము, 4 పశ్చాత్తాపము(ఈశ్వరప్రార్థన), 5 అన్నశాంతి ఈలాగున శక్తికొలది చేయుచు వచ్చిన కొంతకాలమునకు మీ త్రికరణములలోగల దోషములన్నియు నశించును ఈ మూడు కరణములు శుద్ధములు గానిచో దుర్బలమగు పునాదిపై గట్టిన మేడవలె లేక గోపురమువలె కొంతకాలమునకు పతనము గలుగును ఇందు సందేహము లేదు కనుకనే ఏ కార్యమైనను త్రికరణశుద్ధిగ చేయవలెనని చెప్పు రహస్యము ఈస్థితి మీకు గలు గనిచో మీ యత్నము లన్నియు ఊషరక్షేత్రమందు చేసిన కృషివలె ఫలమును గలుగ చేయకుండును, లేక కళాయిలేని పాత్రలో వండిన పప్పు పులుసువలె వ్యర్థమగును ఆత్మ ప్రాప్తిలో ఉన్నతి కలుగదు అట్టివారి సంసర్గముచే తదితర జీవులును పవిత్రులగుట దుస్తరము

2 ఇకను ఆత్మశుద్ధిగల్గి మనః ప్రసన్నతయుం దేకొఱతలేక యుండదలంచిన ఒక చిన్న సాధన కలదు దీనికిన్ని ఏకోపాయము అనియే పేరు అదేదన ముఖములో ఏలాటి వికారము గలుగనీయక మాట్లాడునట్లు అభ్యసించుటయే ముఖారవిందము వికసించియుండు తెల్లదామరపుష్పము వలె నుండేలాగున, అతిజాగ్రత్తతో అభ్యసించుచు వచ్చిన ప్రకృతి వికృతులేవియు ఆత్మను మాలిన్య పఱుపజాలవు మఱియు సాత్త్వికగుణ మెల్లప్పుడున్ను తన్ను విడిచియుండజాలదు అందువలన రాజస తామస గుణములు దగ్గఱకు చేరనొల్లవు అయితే ముఖారవిందము ప్రసన్నముగా నుండిన చాలదనియు, హృదయారవిందముకూడ స్వచ్ఛముగా నుండేలాగున సాధకులు అభ్యాస మొనర్చు కొనవలెననియు జ్ఞప్తియందుంచుకొనవలెను

ముఖములో విసుగు చిహ్నము గాని, అప్రీతియొక్క గుఱుతుగాని, విషాదము యొక్క లాంఛనముగాని కలుగ కూడదు ఇట్లు చెప్పుటచే నిక కోపము మొదలగునవి కూడనే కూడదని వేఱుగ వచింపవలయునా? దీనిచే మీ హృదయము సదా సంతోషభరితమై యుండున దేగాక, ప్రేమయు, శాంతియు మిమ్ముల విడిచిపెట్టి ఒక నిమిషమైన నుండ జాలవు అప్పుడు మీకు ప్రపంచములో విరోధు లెవ్వరును ఉండరు అందరును మిత్రులే, మీ

హృదయము క్షీరసాగరమువలె గంభీరమై స్వచ్ఛమై యుండును ప్రపంచ కార్యము లనేకము మిమ్ములను బాధించుటకు వచ్చినను, అనగా మీ మనస్సును మాలిన్యపఱుపచూచినను సాగరము గాకుండును సింహము నివాసము చేసెడు స్థలమునకు మత్తగజములు గాని ఏ అడవిమృగములును రానట్లు ఆత్మను మలిన పఱచు కర్మలెవ్వియు అపుడు దగ్గఱకు రాజాలవు ఒక వేళ ప్రాపంచిక కర్మలందెపుడైన విశ్రాంతి గలుగక పోయినను ఉత్తరక్షణముననే పరమశాంతి ప్రవాహము ప్రవహింప జొచ్చును

మఱియొక మనోజయోపదేశము- ఇదిన్ని పై జెప్పినదానివలె నుండును ఇట్టి అభ్యాసముగలవారికి కూడ మనశ్శాంతియు, ప్రసన్న సౌఖ్యమును కలుగుటలో సందేహము లేదు అదేమన, మాటలను అణచి మౌనముగానుండి సంజ్ఞలచే సమస్తకార్యములను నిర్వహించే లాగున అభ్యసించుకొనుటయే కాని యిది మౌనవ్రతమని తలంచ నక్కఱలేదు అత్యవసరమునకు మాత్రము అర్థవంతము గాను, సూక్ష్మముగను మాట్లాడవచ్చును కాని సంజ్ఞవలన నిర్వహింప సాధ్య ముగానప్పుడు మాత్రమే చిన్నగను, సారవంతముగను మాట్లాడవలయును దీనివల్లగూడ వెలుతురు దగ్గఱకు చీకటి చేరనట్లు తమోగుణముగాని, ప్రకృతివల్ల గలిగెడు వికారము గాని మనుజుని యొద్దకు చేరవు అంతేగాక ఇట్టి అనుష్ఠానమువల్ల బుద్ధిబల మధికమగును విజ్ఞానమున్ను విపులముగా వృద్ధినొందును సన్నసన్న దారములను చేర్చి గొప్ప మోకు చేసిన, అది యెంతయో బలముగ నుండునట్లు నానాప్రకారములుగ పోవుచుండెడి మనస్సు నిశ్చలత్వ మొందునపుడు, ఏకాగ్రమగునపుడు గలిగెడి శక్తియు మహత్తరమైనదగును పెద్దమోకుచే ఎంత గొప్ప జంతువునైనను ఏలాగున కట్టివేయవచ్చునో, ఆలాగున ఎట్టి మనశ్చాంచల్యమునైనను దానిచే నణచవచ్చును వృత్తులను నిగ్రహించవచ్చును ఇది యొక గొప్ప అభ్యాసమే యగును కొంతకాలము సేవించిన మీరే దాని వలన గలిగెడు మహిమను తెలిసికొనవచ్చును

ఇంద్రియగ్రామసంగ్రామ సేతునా భవసాగరః ।
తీర్యతే నేతరేణేహ కేనచి న్నామ కర్మణా ॥

ఇంద్రియజయమనెడు సేతువుచే సంసారమును దాటవచ్చును ఇంతకంటే సులభమైన మార్గము ప్రపంచమున మఱియొకటి లేదు ఇట్టి భవసాగరోత్తర ణము మఱి యేకర్మచేతను గలుగునది కాదు

3. ఉపదేశద్వయము – దీనివలన గూడ మనోజయము చేకూరును ఇదిపై జెప్పిన రెంటికన్నను చాలగొప్పది ఆత్మతత్త్వ మెఱింగిన వారికిని, బుద్ధి శుద్ధమైన వారికిని మాత్రమే యిది సిద్ధించును దీనిసాధన యెట్లనిన, దృశ్య వృత్తులు ఆత్మలోనికి రానీయక చూచుటయు, ఆత్మభావము మఱువు గలుకనీయక చేయుటయు నగును అనగా ప్రకృతి ఉదయము గాకయు, ఆత్మభావము అస్త మింపకయు చేయుట యగును అయితే ఆత్మ యెటువంటిది అనువిషయము అనుభవము గలిగిన మాత్రమే యిది సాధ్య మగును. దేహాది బుద్ధ్యంతము వఱకుగల విషయములన్నియు నిగ్రహింప బడవలెను వీటన్నిటికంటె విలక్షణమై వెలుగుచుండెడి ఆత్మయే తన స్వరూపమను బోధము గలుగవలెను పైభావనచే మనోజయము త్వరలో సిద్ధించుటను ఇది చాలా గొప్ప అనుష్ఠానమేగాని సామాన్యమని ఎన్నడు తలంప రాదు కాని ఈ అభ్యాసము జ్ఞానగుణముగల్గి జ్ఞేయములో నిలుకడ గలిగిన మాత్రమే సిద్ధించునని నమ్మవలెను దీనివలన ప్రకృతి యొక్క అస్తమయమున్ను, ఆత్మయొక్క ఉదయమున్ను అతిత్వరలో గలుగు చుండును అన్నిటికిన్ని త్రికరణశుద్ధి ఆధారభూతమని మఱువకూడదు

ఆచారాల్లభతే హ్యాయురాచారాదీప్సితాః ప్రజాః ।
ఆచారాద్ధనమక్షయ్య మాచారోహ్యంత్యలక్షణమ్ ॥

ఆచార మనినను నియతి యనినను ఒకటే యర్థము నియతివల్ల అక్షయమగు అయుస్సు గలుగును నియతివల్ల జనులకు వాంఛితార్థము లన్నియు గలుగును మఱియు నియతివల్ల అక్షయమగు ధనముకూడా చేకూరును గుణము లన్నిటిలోను ఆచారము అంత్యలక్షణము, అనగా దానికి మించినది మఱి యొక్కటి లేదని భావము

ఎవని యింద్రియములన్నియు శుద్ధములై, స్వాధీనములై యుండునో అతనికి ఆ యింద్రియములే పరమబంధువులై సదా సుఖము గలుగజేయుచుం

డును ఎవని యింద్రియములు అస్వాధీనములై విషయవాంఛలచే మాలిన్యము గలిగియుండునో, అతనికి నింద్రియములే శత్రువులై సదా క్లేశము గలుగ చేయుచుండును మణిరత్నమాలయందు శ్రీశంకరభగవత్పాదాచార్యుల వారు ఇట్లుపదేశించి యున్నారు

కే శత్రవః సన్తి నిజేంద్రియాణి
తాన్యేవ మిత్రాణి జితాని యాని ।

దీని యర్థము పైన దెల్పినదే గీతలో శ్రీకృష్ణభగవానులున్ను ఈలాగుననే ఉపదేశించియున్నారు

బన్ధురాత్మాஉஉత్మన స్తస్య యేనాత్మైవాత్మవా జితః ।
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాஉஉత్మైవ శత్రువత్ ॥

ఎవడు తన యింద్రియము లన్నింటిని నిగ్రహించుకొనునో, అతనికి ఆయింద్రియములే పరమబంధువులవలె సదా సౌఖ్యమును గలుగ జేయు చుండును, ఎవడు విషయములనుండి యింద్రియములను మఱలింప శక్తి లేనివాడై యుండునో వానికి ఆయింద్రియములే పరమశత్రువులవలె బాధను కలుగజేయుచుండును ఇంద్రియములు స్వాధీనము కావలసియుండిన, రజస్త మోగుణములు నశించవలెను రజస్తమోగుణములు నశింపవలెనన్న నిష్కామ కర్మయోగము, నిరంతర భగవచ్చింతన గలిగియుండవలెనని శ్రీకృష్ణభగవాను లుపదేశించిరి శ్రీ యోగవాసిష్ఠములోను ఈవిషయమై యిట్లు తెలుపబడు చున్నది

యస్యాజ్ఞానాత్మనోஉజ్ఞస్య దేహ ఏవాత్మభావనా ।
ఉదితాతి రుషైవాక్షరిపవోஉభిభవంతి తమ్ ॥

దేహాత్మభావనగల వాడును, ఇంద్రియములు వశమున లేనివాడును నగు అజ్ఞానిని వాని యింద్రియములను శత్రువులు అతిక్రోధముతో కొట్టి తరిమి, బాధించుచుందురు మఱియు

యస్య జ్ఞానాత్మనో జ్ఞస్య సత్యేవాత్మని సంస్థితిః ।
సంతుష్యైవాక్ష సుహృదో న ఘ్నంతి తమనిందితమ్ ॥

ఉత్తమ ఆచరణగలవాడును, సత్యస్వరూపమగు ఆత్మయందు స్థితి

బొందినవాడును నగు జ్ఞానిని వాని యింద్రియము లేమియు బాధింపక, పైగా అనుకూలాచరణముచే వాని జ్ఞానమును వృద్ధి పఱచుచు వానిని సదా సంరక్షించుచుండును

4 ఇక పంచశీల మనునది యొకటి కలదు ఎట్టి నియమము లేని వారైనను ఈ పంచశీలాచరణవలన తప్పక నియమసంయుక్తులు కాగలరు ఆపంచశీల మెద్దియనిన 1 ఆహారనియమము 2 నివాసనియమము, 3 అనుష్ఠాననియమము, 4 సహవాస(సంసర్గ)నియమము, 5 క్రియా నియమము

1 ఆహారనియమమనగా నియమితకాలములో నియమితాహారమును నియమము ననుసరించి భుజించవలయు ననుట తదితరకాలములో ఏ వస్తువులున్ను భుజింపరాదని నియమము గలిగియుండవలెను అదిన్ని దినమున కొకసారిగాని, రెండుసార్లుగాని యుండవలసినదేకాని అంతకధికముగ నుండ రాదు ఒకసారి భుజించిన చాలునని తలంచువారు ధన్యులు లేనిచో రాత్రులం దేదైన స్వల్పాహారముండిన బాధాకరము కాదు అదిన్ని ద్రవపదార్థమై యుండుట మఱింత మంచిది దానివలన ఆరోగ్యమున్ను, చురుకుతనమున్ను, మిగుల జాగ్రత్త తప్పక కలుగును ఈ ఆహారముకూడ ఎక్కువ పదార్థములతో కూడినదిగ నుండరాదు కాని నిండా నీరసముగాగాని, హీనముగగాని యుండుటయు మంచిదికాదు శుద్ధమైన వస్తువులైనను అధర్మమార్గము నుండి వచ్చినచో పాపాహారమువలె అది జీవుని మలిన పఱచును ఈ విషయములో సాధకు లెంత జాగ్రత్తవహించిన అంతక్షేమమే వారికి కలుగును ఆహారవిషయములో వస్తుశుద్ధియు, ఉపయోగించు పాత్రల శుద్ధియు, పాకము చేయువారి శుద్ధియు నుండవలెను

2 ఇక నివాసనియమమును గుఱించి చెప్పెద ఏస్థలము నిష్ఠకు అనుకూలపడునో అట్టిస్థలమే యుండవలెను విషయముల నంకురింపచేసెడు ప్రకృతి యేమియు అచ్చోట నుండరాదు జిహ్వేంద్రియ గుహ్యేంద్రియముల నిగ్రహము బాగుగా గలిగియుండవలెను ఈద్వారములను మూసినవారికి మోక్షద్వారము తెఱువబడును

3 అనుష్ఠానముకూడా నియతసమయమున తప్పక చేసికొనవలెను అనుష్ఠానము పూర్తి అయిననే భోజనము చేయవలెనను వ్రత మవలంబింప వలెను, ఒకరోజైనను అనుష్ఠానము వదలియుండరాదు మనస్సు రాగిపాత్ర వంటిది నిత్యము తోమినమాత్రమే అది శుద్ధముగా నుండును మనస్సు యొక్క స్వభావ మటువంటిది ఆలాగున చేయువారి జ్ఞానమెల్లప్పుడును నిరావరణముగ ప్రకాశించుచుండును కొలిమిలోనుండు ఇనుము అగ్ని మయమై జ్వలిం చుచుండునట్లు అట్టివారిచిత్తము(మనస్సు మొదలగు నింద్రియములన్నియు) జ్ఞానమయమై తేజోమయమై వెలుగుచుండును

4 సహవాసము – యోగ్యులు కానివారు, విరక్తులు కానివారు కరుణ లేనివారు, పరోపకారబుద్ధి లేనివారు మున్నగు జనుల సంసర్గ మెప్పుడును చేయరాదు సహవాసము రంగువంటిది వస్త్రము తెల్లనిదైనను రంగులు నీలముగానో, ఎరుపుగానో, పసుపుగానో యుండిన ఆవస్త్రమున్ను అట్టి వర్ణము కలదే యగును విషయములతో సహవాసముగల నిర్విషయి యైనను, భోగులతో సంసర్గముకల యోగియైనను, నియమము లేనివారి సంసర్గము చేయు సంయమి యైనను సరే, అట్టివారి సహవాసమున్ను చేయరాదు నూనెచే తడిసిన కాగితము ప్రక్క నుండు కాగితములను చెఱచు నట్లు ప్రపంచవిషయములందున్న వారి సంసర్గముచే తనకున్ను అట్టిదోషము గలుగుచుండును

5 క్రియానియమము – ఏ సమయములో ఏపని ఏలాగున చేయ వలెనో, ఆ సమయములో ఆ పనిని ఆలాగున చేయునట్లు ఇంద్రియములను నియమించవలెను ఈవిషయమున గాలి, వాన, చలి, యెండ మొదలగు వాని వల్ల భయమును పొందక,వాని నెదిరించి కార్యమును నిర్వహించే మనశ్శక్తి కలిగి యుండవలెను తనకు నియమింపబడిన పని యెంత తక్కువైనను మహా శ్రేష్ఠ మయినదిగ తలంచి అద్దాని నుత్సాహముతో నెఱవేర్చు స్వభావము గల్గి యుండ వలెను నియమము నాచరింపని సన్న్యాసికంటెను, బ్రాహ్మణుని కంటెను నియమమును పాలించెడు తక్కువజాతివాడే శ్రేష్ఠుడు

ఈపై నియమము లన్నియు ఆత్మను మలినము చేయక సదా కాపాడు

మండును శూరులైన యంగరక్షకులు ప్రభువును సదా సంరక్షించునట్లు ఈ నియమము లన్నియు ఆత్మను ఏ విపత్తులోనికి బడనీయక చూచుచు సదా సంరక్షించు చుండును అదే దీనిలోగల రహస్యము ఇట్టివారికి ఏకాలమునను పతనము కలుగదు వ్రతభ్రష్టత్వమును కలుగనేరదు ఇవ్విధమున నియమముచే బాగుగ సంరక్షింపబడిన జీవితము, బాగుగ కాపాడబడుచుండు పుష్పోద్యానమువలెను, లెస్సగ సంరక్షింపబడు ఫలవృక్షములవలెను, శోభాయమానమై పుణ్యమయమై, బహుజన ప్రీతికరమై యుండును ఈ విషయము లన్నియు సాధువులు చక్కగా తెలిసికొని యాచరింపదగినవి

పూర్వఋషులిట్టి సుగుణములు గలిగియున్నందుచే వారు ఇప్పటికి కూడ సర్వజనుల చేతను వంద్యులగుచున్నారు ఇప్పుడుండు వారిలో చాల మందికి ఇట్టి పవిత్రనియమము లేనికారణముచే వారు లోకముచే నిందితులైరి పుష్పోద్యానపాలకులు వృక్షములకు ఏర్పడెడు క్రిమికీటకాదుల నేలాగున తీసివైచి వాటిని శుద్ధమొనర్చుదురో, ఆలాగున, బ్రహ్మనిష్ఠులు తమలో ప్రకృతి గుణము లేవైన ప్రవేశించుచుండునా యని అతి జాగరూకతతో కనిపెట్టి దోషములను చేరనీయక చూచుచుండవలెను అట్టివారే బ్రహ్మనిష్ఠయొక్క పూర్ణఫలమును బొందగలుగుదురు

యో న నిర్వాసనో నూనం సర్వధర్మవరోఽపి సః ।
సర్వజ్ఞో ఽప్యభితో బద్ధః పంజరస్థో యథా ఖగః ॥

సమస్త ధర్మముల నెఱింగినను, సర్వజ్ఞుడైనను, వాసనలను దృజింపనిచో పంజర మందలి పక్షివలె నాతడు బద్ధుడే యగును

స్వభావం సంవిజిత్యాదావింద్రియాణాం సచేతసామ్ ।
ప్రవర్తతే వివేకే యః సర్వం తస్యాశు సిద్ధ్యతి ॥

విషయముల వైపునకు పరుగిడెడు మనస్సుయొక్కయు, సర్వేంద్రియములయొక్కయు దుస్స్వభావమును జయించి అధ్యాత్మశాస్త్రము లందు ప్రవృత్తి గల్గియుండువానికి అంతయు సత్వరము సిద్ధించును

స్వభావమాత్రం యేనాంత ర్న జితం దగ్ధబుద్ధినా।
తస్యోత్తమ పదప్రాప్తిః సికతా తైలదుర్లభా ॥

తన దుస్స్వభావమును మొట్టమొదట జయించని మూఢునకు, ఇసుక నుండి తైలము తీయుట యెంత దుర్లభమో, ఆత్మపదప్రాప్తియు అంత దుర్లభమైనది

యావన్నాధిగతం బ్రహ్మ న విశ్రాంతం పరే పదే ।
తావత్తన్మనసత్వే న ధ్యానముపగమ్యతే ॥

బ్రహ్మము నెఱుంగనంతవఱకును, ఆత్మపదమందు విశ్రాంతిని బొందనంతవఱకును, విషయచింతన యున్నంతవఱకును జీవున కాత్మ ధ్యానమందు నిలుకడ కలుగదు

సహస్రేభ్యః సహస్రేభ్యః కశ్చిదుత్థాయ వీర్యవాన్ ।
భినత్తి వాసనాజాలం పంజరం కేసరీ యథా ॥

ప్రయత్న మొనర్చునట్టి లక్షలమంది జనులలో ధీరుడగు నొకానొకడు మాత్రమే పంజరమును సింహము భేదించునట్లు వాసనాజాలమును భేదించివైచును

శాస్త్రస్యాస్యతు యన్నామ వాదనం తద్వినా పరః ।
అభ్యాసో దృశ్యసంశాంత్యై న భూతో న భవిష్యతి ॥

మోక్షోపాయ మనబడు వేదాంతశాస్త్రమును గురుముఖతః శ్రవణ మొనర్చి, ఆపిదప మననినిదిధ్యాసాదులచే దానిని బాగుగ నభ్యసింపవలెను దృశ్యము శమించుట కింతకు మించిన యుపాయ మెద్దియు నేటివఱకు మఱియొకటి యుండియుండలేదు ఇక నుండబోదు

యథా భర్జితబీజస్య ప్రరోహిత్వం వినశ్యతి ।
తథాత్మజ్ఞానినో నిత్యం జగద్బుద్ధి ర్విలీయతే ॥

ఏలాగున అగ్నిలో వేయించిన బీజముయొక్క అంకురత్వము నశించియుండునో, ఆలాగున ఆత్మజ్ఞానాగ్నిలో దహించిన చిత్తముగల వానికి దృశ్య విషయములు నశించియుండును (విషయాంకురములు హృదయములో పుట్టు చుండిన, ఇంకను జ్ఞానాగ్నియందు చిత్తము దగ్ధము కాలేదని సాధకుడు గ్రహించుకొనవలెను)

ఓంకారాదర్థమాత్రార్థం భావయన్మౌనమాస్థితః ।
సంశాంత సర్వసంకల్పః ప్రశాంతకలనాగణః ॥

శాంతుడును, సంకల్పరహితుడును, కల్పనావర్జితుడునై ఓంకారము యొక్క త్రిమాత్రలకు పరమగు అర్ధమాత్రచే సూచితమగు బ్రహ్మమునే భావించుచు మౌనము వహించి యుండుటయే తురీయస్థితి యనదగును

కాలము

కాలమును గుఱించియు చాలమంది అజాగ్రత్తను పొందియున్నారు సామాన్యముగ కొంత పుణ్యస్వభావమున్ను, కొంతవరకు ఆత్మశుద్ధియు గలిగినవారు కూడా కాలమును చాలమట్టుకు వ్యర్థపఱచుచున్నారు వ్యర్థము లైన మాటలవేతను, వ్యర్థములైన పత్రికలను పుస్తకములను చదువుట చేతను, వ్యర్థముగ స్నేహితులవద్దకు తిరుగుటచేతను సమయమును వ్యయపఱచుచుం దురు ఈ విషయములోను జాగ్రత్త వహింపనిచో జీవుడు కృతార్థుడు కాజాలడు బంధవిముక్తి కలిగి మోక్షసౌఖ్య ప్రాప్తినొందుట సామాన్య కార్యమని తలంప రాదు ఒక నిమిషమైనను నిరుపయోగముగా పోవుచుండిన నెవడు పరితాపమొందునో, అట్టివాడే కాలముయొక్క మహిమను గుర్తెఱింగిన వాడగును, పరితాపమే కాదు నేత్రమునుండి యెవనికి ధారధారగా నీరు ప్రవహించు చుండునో, అతడే నిజమైన జీవిత రహస్యము నెఱింగిన వాడగును ఏలన ఒక్కొక క్షణమందు జీవితము నశించిపోవుచుండును అది రంధ్రము గలిగిన పాత్రలోగల జలము వలె క్షయము నొందుచుండును పోయినదానిని మఱల సంపాదించుట సాధ్యమైన పని కాదు పూర్వజన్మములో ఎంతో సుకృతము చేసినందుచే ఈ జన్మమున అది లభించి యింత ఉత్కృష్టత చేకూరినది

వ్యాపారము చేయువారు బాగుగా వ్యాపారము జరుగుచున్నపుడు, అది మాని వ్యర్థముగ మాట్లాడుచు కూర్చుందురా? ఏ వ్యాపారమున్ను లేనపుడు మాత్రము ఇతరులతో సంభాషణ చేయుచుండవచ్చును అదేరీతిగ జీవితముచే సంపాదింపవలసిన విజ్ఞానమున్ను, పుణ్యమున్ను సంపాదింప

జూడక వ్యర్థభాషణములచే కాలము గడుపుచుండువాడు జీవితముయొక్క మాహాత్మ్యము నెఱింగినవాడు కానేరడు కాలము అమూల్యమైన దనియే విజ్ఞుల మతము మితభాషణ మవలంబించిన ఎవ్వడున్ను ఇతరులను తనదగ్గర కూర్చుండబెట్టి కబుర్లు చెప్పి కాలము నష్టపరచకుండును అందువలన వాని దగ్గఱకు ఎవరున్ను చేరరు కార్యదీక్ష కలవాడు 'మేల్' తపాలు రన్నరువలె నుండును అతడు తపాలు తీసికొని వెళ్ళునపుడు ఎవరితోను మాట్లాడుట కవకాశము గలదా? ద్రిమ్మరులగు మానవులైనచో త్రోవలో పోవుచుండెడి వారితో నిష్ప్రయోజనమగు మాటల జెప్పుచు వెళ్ళుచుందురు రక్తుడైనచో స్వభావముగ వైరాగ్యము గలిగియుండునేగాని కాలమును వ్యర్థపుచ్చనొల్లడు

ఈవిషయమై హిందీలో శ్రీకబీరుదాసుగారు ఒక కీర్తన పాడి యున్నారు కబీరుదాసుగారు కాశిలో నివసించియుండిరి కాశిలో సంధ్యా కాలము వ్యాపారము ఎక్కువ జరుగుచుండును ఏలన, యాత్రికులందఱును పగలు తీర్థదర్శనములకు దేవాలయములకు బోవుచుందురు ఆకీర్తన యొక్క సార మేమన – జనులారా! ఒకడు అడవిలో ప్రయాణము చేయుచున్నాడు సహాయ ముగ రెండవవారు లేరు ఊరు చేరుటకు ఇంక రెండు క్రోసుల దూరము గలదు సూర్యుడస్తమింపనున్నాడు అది కృష్ణపక్షము వర్షము కురియు చున్నది అడవిలో మంచి త్రోవ లేదు పైగా మనుష్యుల భక్షించు క్రూరమృగము లచట చాల గలవు అంతేగాదు భూతప్రేతపిశాచము లచట సంచరించు చుండును అట్టి తరుణములో తొందరగ నడచిపోయి ఆ యడవిని దాట జూడక అందలి చెట్లను లెక్క పెట్టుచు, పూవులనుగోయుచు కాలము గడపువాడు మతిలేనివాడే యగునుగదా!

ఆలాగున జీవితమను సూర్యడస్తమింప నున్నా డు తాను సంసార మధ్యమున నున్నాడు మోహమను కారుచీకటితో కూడి కృష్ణపక్ష రాత్రి గూడ ఉన్నది కామక్రోధాదులను పెద్దపులులు సంచరించుచున్నవి అంతే కాదు అవిద్య అజ్ఞానమను భయంకర భూతప్రేత పిశాచములు గలవు ఇట్టి తరుణమున దృశ్యవిషయములోను, ప్రాకృత వ్యామోహముల లోను, ప్రపంచ వాసనలలోను చిక్కుకొను జీవునిగతి యేలాగున నుండునో యోచించు

కొనుడు అట్టి వానికి వెనుక గలిగెడు సంకటము లపారములు ఇట్లుండగా దుష్కార్యముల లోను, పాపకృత్యములలోను కాలము వ్యర్థపఱచువారి విషయమై వేఱుగ చెప్పవలెనా? వ్యర్థ విషయములందు కాలము గడుపుట మున్నగునవి లేక, దైవవిచారణ యందుగాని, పవిత్రమంత్ర జపమునగాని, ఉత్కృష్టగ్రంథ విచారణయందుగాని, సత్కర్మల చేయుటయందుగాని కాలమును వినియోగించిన, ఎంతో యుత్తమఫలమును బొందవచ్చును గదా! మీరు ఊరకయుండిన, సమయము ఊరకయుండునా? అది నిలుకడలేక పోవుచునే యుండును

కనుక, పుణ్యాశ్రమములలో చేరుటకు ముందుగాను, బ్రహ్మ విచారమును ప్రారంభించుటకు పూర్వమును సోమరితనమునకు తర్పణము విడువవలెను ఇదే విజ్ఞులు దెల్పిన రహస్యము లన్నింటిలోను పరమ రహస్యము జీవిత పరమలక్ష్యము పొందువరకు నిలుకడలేక యత్నించువారు మాత్రమే ఈజన్మమున నిర్వాణమును పొందగల్గుదురు అనగా, ఈశ్వర సాక్షాత్కారమును పొందుదురు శ్రద్ధగలవానికి సముద్రము అడుగు జలమంతే గాన్పించును సోమరిదేవత నుపాసించువానికి అడుగునీరున్న సముద్రమువలె గన్పట్టును పరిశ్రమశీలునకు మేరుపర్వతముకూడ చిన్నరాతి గుట్టవలెనే గోచరించును రాతిగుట్టేల చిన్న రాయివలెనే తోచును ఎత్తి దూరముగ విసరి వేయుటయు ప్రయాసమని తలంపడు అలస పురుషునకు ఒక చిన్న మట్టి పెళ్ళగూడ మహాపర్వతమువలె పెద్దదిగ తోచుచుండును అనగా సోమరులకు ఏ చిన్నపనిగూడ భారముగాను, దుస్సాధ్యముగాను గోచరించును ధీరుడును, శ్రద్ధావంతుడును నగువానికి ఎట్టిపనియైనను అతిసులభమే యను బోధ గలిగియుండును కాలమును ఎట్లు వినియోగపఱచవలెనో, ఆవిషయమై శివానందలహరిలో శ్రీశంకరు లిట్లు నిరూపించిరి

కంచిత్కాల ముమామహేశ భవతః పాదారవిందార్చనైః
కంచిద్ధ్యాన సమాధిభిశ్చ నతిభిః కంచిత్కథాకర్ణనైః ।
కంచిత్కంచి దవేక్షణైశ్చ నుతిభిః కంచిద్దశామీదృశీం
యః ప్రాప్నోతి ముదా త్వదర్పితమనా జీవన్ స ముక్తః ఖలు ॥

అనగా, ఉమామహేశ్వరా! మీ యందు మనస్సు నిలిపి యెడతెఱపిలేక యొకప్పుడు మీ పూజలును, వేఱొకప్పుడు నియతమైన మీ నిరంతర ధ్యానంబులును, మఱియొకప్పుడు మీ పాదవందనములును, ఇంకొకప్పుడు మీ (దైవ) సంబంధకథలు వినుటయు, కొన్నివేళల మీ దర్శనములును జేయుచు, మఱికొన్ని వేళల ఈశ్వరార్పణబద్ధితో కథలను జెప్పుచు, సంతోషము నొందువాడు జీవన్ముక్తుడగును ఈశ్లోకమువలన ముముక్షువులు, అభ్యాసులు, ఉపాసకులు ఉండవలసిన స్థితి చక్కగ తెలుపడమైనది అనగా ధ్యానమందు ఎంతసేపు మనస్సు నిలచునో అంతసేపు ధ్యానములోను, దానిలో నుండి తగ్గినపుడు కొంతసేపు స్మరణ, కీర్తనాదులలోను, మఱికొంతసేపు వేదాంతశాస్త్ర విచారణలోను, ఇక కొంతసేపు ఈశ్వరార్పణబుద్ధితో సత్కర్మల నాచరించుట యందును కాలము గడుపవలసినదేకాని ఒక నిమిషమైనను వ్యర్థము చేయగూడదు గీతయందు శ్రీకృష్ణభగవానులున్ను ఇట్లు ఉపదేశించిరి

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయన్తః పరస్పరమ్ ।
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ ॥

దైవధ్యానమందే మనస్సునుంచి దైవ విషయములే చెప్పుకొనుచు దైవమందే ప్రాణమును సమర్పించి, దైవసంబంధకార్యములే చేయుచు, దైవమందే ఆనందించుచు, దైవమందే(ఆత్మయందే) క్రీడించుచు నుండవలసినదే కాని వ్యర్థములైన యితర కార్యములందు కాలమును గడుపరాదు పంచదశియందు కూడ ఈవిషయమునే ఉపదేశించియున్నారు

తచ్చింతనం తత్కథనమన్యోన్యం తత్ప్రబోధనమ్ ।
ఏతదేక పరత్వం చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః ॥

బ్రహ్మస్వరూపమును గూర్చియే చింతించుటయు, బ్రహ్మ స్వరూపమును గూర్చియే సంభాషించుటయు, గురుశిష్యాది సంవాదముల ద్వారా బ్రహ్మ స్వరూపమునే తెలిసికొనుటయు, ప్రత్యగాత్మయందు చిత్తైకాగ్రతా నిదిధ్యాసంబును బ్రహ్మాభ్యాసమని విజ్ఞులు నుడివిరి

నిద్రాయా లోకవార్తాయాశ్శబ్దాదేరాత్మవిస్మృతేః ।

క్వచిన్నావసరం దత్వా చింతయాత్మానమాత్మని ॥

అనగా అధికనిద్రచేతను, వ్యర్థమైన ప్రపంచమాటలచేతను, ఆత్మ విస్మృతి గల్గచేసెడు ఇతర వాక్యములచేతను, ఉపయోగములేని కృత్యములను చేయుటచేతను బ్రహ్మనిష్ఠులు కాలమును వ్యర్థపఱచక ఆత్మనే తమలో చింతింపవలెను

కాలమును జయించినవారు కాలుని(మృత్యువును) జయించినవారే యగుదురు ఇంతవఱకు చెప్పినదంతయు ఆత్మనిష్ఠ గలవారికి నుండవలసిన సుగుణములు ఆత్మవస్తువు అనగా బ్రహ్మము ఈగుణములకు గూడ విలక్షణమై యుండును అది సుగుణ దుర్గుణములకు రెంటికిని సాక్షిగాన కేవలమీ పుణ్యస్వభావముతోనే తృప్తినొందక శాశ్వతమగు ఆచైతన్య ధామము లోనికి, స్వయంప్రకాశములోనికి ప్రవేశించేలాగున చూడవలెను అట్లు కానిచో, సుగుణములు పుణ్యలోకప్రాప్తి కలుగజేయునేగాని జన్మరాహిత్య మగు మోక్షమును కలుగచేయవు ప్రస్తుతము లోకము అధ్యాత్మోన్నతి నుండి చాల క్రిందకు జారిపోయినందుచే ఈ సుగుణములగుఱించి, అనగా నియతిని గూర్చి యింత చెప్పవలసివచ్చినది యథార్థముగ ఆత్మయొక్క నియతి కేవలము జ్ఞానమయమై నిలుచుటయే యగును అట్టి సునీతత్వము పొందనిచో ఈ నియతి కూడ ప్రేరణచేయు పరమప్రాణమని నమ్మవలెను వట్టి స్థితిలో నిలకడ గలిగినవానికి అట్టి స్వభావమే గలిగియుండునేగాని ప్రాకృతమైన స్వభావము లేవియు గలిగియుండవు

కుశలా బ్రహ్మవార్తాయాం వృత్తిహీనా స్సురాగిణః ।
తేఽప్యజ్ఞానతయా నూనం పునరాయాంతి యాంతి చ ॥

బ్రహ్మము విషయమై వచించుటయందు కుశలురును, రాగులై బ్రహ్మా కారవృత్తిరహితులును అగువారలు నిక్కముగ అజ్ఞానులే యగుదురు అట్టి వారు జనన మరణచక్రమున తగుల్కొనియే యుందురు!

జ్ఞేయములో ప్రవేశింపనిచో పుణ్యముయొక్క అగ్రభాగమును మను జులు చేరజాలరు ఒకడు శ్రేష్ఠమైన పాలరాతితో ఉత్కృష్టమైన పనితనముతో గొప్పదగు ఒక దేవళము కట్టించెను. కాని దానిలో మూలవిగ్రహప్రతిష్ఠయు,

సంప్రోక్షణయు జరిగియుండలేదు అట్లైన ఆదేవాలయ ప్రయత్నము యొక్క పూర్ణఫల మెట్లాతడు పొందజాలడో, ఆలాగున అనేక సత్కర్మలుగాని, తపస్సులుగాని, యోగములుగాని చేసినవారైనను శరీరమున జటా కాషాయాదులు గలిగియుండినను, జ్ఞేయమగు ఆత్మలో ప్రవేశము కలుగనిచో పూర్ణమగు బ్రహ్మసుఖమును, ప్రకృతి రహితమగు స్థితియున్న ఆత్మకు లభించదు

జ్ఞేయస్థితియందు మూడు గుణములున్న లయించును అచ్చోట విశుద్ధగుణమొకటి మాత్రమే నిలుచును మూడు గుణములు దాటిన వారికిని మూడుగుణములు లయమొందిన వారికిని మాత్రమే ఆ పావన పదములోనికి ప్రవేశముగల్గును తురీయమనియు, విశుద్ధసత్త్వమనియు, గుణాతీత మనియు, గుణరహితమనియు, నిర్గుణమనియు సాక్షి యనియు చెప్పినను ఒకటే అర్థము, శమాదిగుణములు సంపూర్ణముగ గలుగువఱకును ఆ తురీయాత్మలో ప్రవేశము గలుగదు ఒకడు పాచకక్రియలో ఎంతనిపుణుడైనను పదార్థములన్నియు పాత్రలు, కట్టెలు మొదలైన వన్నియు లేనిచో వాని పచన క్రియ యెట్లు జరుగును? తనకున్న ఇతరులకున్న క్షుద్బాధ యెట్లు శమించును? ఆలాగుననే శాస్త్రా దుల పాండిత్యము గలిగియున్నను, శమద మాది గుణములు లేనిచో ప్రకృతిచే గలిగెడు బాధ శమింపదు శాశ్వత సౌఖ్యమును లభింపదు ఇదే శమాదిగు ణములు లేనిచో గలిగెడు దోషము

విశుద్ధ సత్త్వస్య గుణాః ప్రసాద
స్స్వాత్మానుభూతిః పరమా ప్రశాంతిః ।
తృప్తిః ప్రహర్షః పరమాత్మనిష్ఠా
యయా సదానందరసం సమృచ్ఛతి ॥

తురీయస్థితియందున్న వాని లక్షణ మీలాగున నుండును నిరంతరము ప్రసన్నత, ఆత్మానుభవము, మిక్కిలి శాంతి, తృప్తి, అతి హర్షము, నిరతిశయానందము అతడు గలిగియుండును ప్రపంచములో ఏ పని చేయవలసి యుండినను దానికి తగిన సామగ్రి యుండిననే మనుజు డద్దానిని సరిగ చేయగల్గును వ్రాయవలసియుండిన, కలము, సిరా, కాగితము లేనిచో

ఎట్లు వ్రాయగల్గును? అట్లనే కమ్మరపనిగాని, బంగారుపనిగాని చక్కగ చేయవలసి యుండిన వాటికి కావలసిన యుపకరణములు తప్పక యుండియే తీరవలెను లేనిచో ఎట్టిపని వాడైనను ఏమియు చేయజాలడు ఆలాగున వైరాగ్య, సత్త్వ, శాంత్యాది దైవగుణములు ఉండిన మాత్రమే జ్ఞేయములోనికి ప్రవేశింప నర్హత గలుగును అచ్చట ప్రకృతి గుణము లేవియు నుండవు అవన్నియు బుద్ధివరకే పోగల్గును అట్టి బుద్ధి శుద్ధమైన మాత్రమే అచ్చోటి నుండి పైకి వెళ్ళగలము లేనిచో గుణములు అడ్డుపడును అవి యేమాత్రమున్ను పైకి వెళ్ళనీయవు బుద్ధికి ఆవల వెళ్ళునప్పు డీతురీయపదము చేరగలము ఇచ్చటికి వచ్చిన సాధకుడు ప్రకాశ ములోనికి వచ్చినవాడే యగును అది శివము దానికే కైవల్యమనియు, పరమప దమనియు పేర్లు అప్పుడు జీవత్వము వదలిపోయినందుచే శివపదము గల్గును మూసి పెట్టి యుండిన దీపము యొక్క మూత తీసివైచిన ఎట్లుండునో, అట్టి అవస్థయే సాధకునకు లభించును

ఇచ్చట తత్త్వమసి వాక్యముచే జీవేశ్వరైక్య మును సంపాదించు కొనవలెను శివవిశిష్టాద్వైతశైవులున్ను విష్ణువిశిష్టాద్వైత వైష్ణవులున్ను, వారు భయులలో అంతర్భూతులగు ద్వైతులున్ను, శ్రీపతంజలి మున్నగు యోగ మార్గావలంబకులున్ను అచ్చోటనే నిలచిపోవుదురు అచ్చట ఈశ్వరునియందు గల దివ్యగుణములన్నియు జీవునకుకూడ గల్గును కాని యైక్యము గల్గదు బంధవిముక్తి మాత్రము గల్గును అప్పుడు జీవుడు శుద్ధాత్ము డగును అచట కేవలము జ్ఞానము మాత్ర ముండును ప్రకృతి యేమియు ఉండదు కావుననే అట్టి స్థితి గలవారికే శుద్ధమగు జ్ఞానగుణములు తప్ప ప్రకృతి గుణమేమియు ఉండుట లేదని శాస్త్రము చెప్పెడు రహస్యము అగ్ని నుండి ఉష్ణత్వము, సూర్యుని నుండి ప్రకాశము,చంద్రుని నుండి శీతలత్వము, తేనెనుండి మాధుర్యము తప్ప మఱియొక వస్తువేలాగున కలగదో, ఆలాగున ఆ స్థితిగల వారినుండి జ్ఞానము, ఆనందము మాత్రమే కలుగునుగాని అజ్ఞాన సంబంధ గుణములేవియు కలుగవు అదే దీనికి గుఱుతు అచ్చోట 'శివోఽ హం' 'బ్రహ్మాస్మి' అను మహావాక్యముల యనుభవము బాగుగ కలుగును; కలుగ

చేసికొనవలెను రూఢి కలుగువఱకున్ను మనననిదిధ్యాసములను నిలువరాదు ఆనందములోనికి వెళ్ళినవా రందఱున్ను ముక్తులే, ధన్యాత్ములే ఈ అనుష్ఠాన విషయమై గరుడపురాణము చెప్పినది చూడుడు

ఇహైవ నరకవ్యాధే శ్చికిత్సాం న కరోతి యః ।
గత్వా నిరౌషధం దేశం వ్యాధిస్థః కిం కరిష్యతి ॥

ఈ జన్మమందే, నరకవ్యాధికి చికిత్స యెవడొనర్పడో, అనగా సంసార తరణోపాయమునకై యత్నింపడో, ఆతడు పరలోకమును జెంది ఏమి చేయగల్గును? ఔషధమున్ను, వైద్యుడున్ను లేని దేశములో వ్యాధిగలవాడు వెళ్ళి యేమి బాగుచేసికొన గల్గును? అనగా సత్కర్మలచే స్వర్గాది లోకములను జెందినను, అచట ముక్తి సాధనకార్యము లేవియు జీవులు చేయజాలరు దానికి మనుష్యలోకమే తగియున్నది కామ్యకర్మల ఫలమును అనుభవించుటకు మాత్రము స్వర్గలోక మేర్పడినది అనగా మనుష్యజన్మలో మాత్రమే బ్రహ్మ ధ్యానము చేయుటకు తగిన యంతఃకరణసృష్టి యేర్పడి యున్నది అట్టి సామర్థ్యము దేవతలకు గాని, మఱియెవరికినిగాని లేదు కావుననే జన్మము లన్నింటిలోను మానవజన్మము జ్ఞానముతో కూడినదనియు, ఉత్కృష్ట మైనదనియు చెప్పబడినది ఈ విషయమై కఠోపనిషత్తున గనదగును మఱియు నైష్కర్మ్యసిద్ధియందు ఇట్లు తెలుపబడినది

యదా సర్వే ప్రముచ్యంతే ఇతి 'న్వి' తిచ వాజినః ।
కామ బంధనమేవేదం వ్యాసోఽప్యాహ పదే పదే ॥ (నైష్కర్మ్యసిద్ధి)

'యదా సర్వే ప్రముచ్యంతే' అనిన్ని ' ఇతి ను కామయమానః' (కామమే సంసారమునకు కారణము) అనిన్ని మహర్షులు చెప్పుచున్నారు 'కామబంధనమేవేదం' అని వ్యాసమహాముని మాటి మాటికి చెప్పెను

కామబంధనమేవేదం నాన్యదస్తీహ బంధనమ్ ।
కామ బంధనముక్తోహి నేహ భూయోఽభిజాయతే ॥ (భాగవతము)

అనగా కామబంధమే సంసారకారణము ఆ కామముయొక్క నివృత్తియే మోక్షము

తస్యైవం దుఃఖతప్తస్య కథం చిత్పుణ్యశీలనాత్ ।

నిత్యేహాక్షాలితధియో వైరాగ్యం జాయతే హృది ॥

దుఃఖములచే పరితాపము నొందువాడును, బహుప్రయాసముల చేత పుణ్యకర్మల ననుష్ఠించుటవలన సంభవించిన నిత్యకర్మానుష్ఠానముచేతను పరిశుద్ధముగా చేయబడిన బుద్ధికలవాడునైన మనుజునకు మనస్సునందు వైరాగ్యము పుట్టును

శుద్ధ్యమానం తు తచ్చిత్త మీశ్వరార్పితకర్మభిః ।
వైరాగ్యం బ్రహ్మలోకాదౌ వ్యనక్త్యథ సునిర్మలమ్ ॥

పరమేశ్వరుని యందు సమర్పింపబడిన కర్మలచేత మనుజుని చిత్తము పరిశుద్ధిని పొందింపబడినదై అనంతరము బ్రహ్మలోకాదుల సుఖమందును మిగుల వైరాగ్యమును ప్రకటించును

ఇట్లు నైష్కర్మ్యసిద్ధియందు శ్రీ సురేశ్వరాచార్యులవా రుపదేశించిరి మఱియు

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాఽపి విచాల్యతే ॥ (6–22)

ఏ జ్ఞానమును పొందిన మఱల దానికంటె నుత్తమలాభము మఱి యొకటి యున్నదని తలంపడో, దేనియందుండినవాడు మహత్తరమగు దుఃఖముచేతను చలింపడో, అదే యుత్తమమైన జ్ఞానావస్థయని శ్రీకృష్ణభగ వాను లుపదేశించిరి శ్రీశంకరులు కూడా ఆత్మబోధలో ఇట్లే తెలిపిరి

యల్లాభాన్నాపరో లాభో యత్సుఖాన్నాపరం సుఖమ్ ।
యద్జ్ఞానా న్నాపరం జ్ఞానం తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥

ఏ ఆత్మలాభముకంటె అధికమగు లాభము మఱొకటి లేదో, ఏ ఆత్మ సుఖముకంటె అధికమగు మఱొక సుఖము లేదో, ఏ జ్ఞానముకంటె అధికమగు వేఱే జ్ఞానము లేదోఅదియే బ్రహ్మమని నిశ్చయించి తెలియనగును

ఈ నియతి ధర్మము గీతలో 13వ అధ్యాయమున 'అమానిత్వాది గుణములందును, మఱియు 16–వ అధ్యాయమున 'అభయం సత్త్వసంశుద్ధిః' మున్నగు దైవికగుణములందును తెలుపబడియున్నదని ముముక్షువులు తెలిసికొన దగినది ఇక ఇతరశాస్త్రములలో తెలుపబడిన యమనియమములు

మొదలగు సాధకున కుండవలసిన ఉత్కృష్టజ్ఞానగుణము లన్నియు ఈ నియతిలో చేరినవే అవన్నియు వ్రాసి గ్రంథమును విస్తరింప తలంపులేదు ఇది వరకు వ్రాసిన ఓంకారాది గ్రంథములలో అవన్నియు చాలవఱకు పేర్కొన బడియున్నవి తేజోబిందూపనిషత్తునందు చెప్పిన ధ్యానపద్ధతి అవలంబింప దగినది ఇది ఒకటి మాత్రమే సంసారదావాగ్నిని చల్లబఱచెడు జ్ఞానమేఘ కుంభవర్షమని సాధకులు తెలిసికొనగలరు

అహం బ్రహ్మాస్మి మంత్రోఽయం బుద్ధివ్యాధిం వినాశయేత్ ।
అహం బ్రహ్మాస్మి మంత్రోయం చిత్తబంధం వినాశయేత్ ॥

'అహం బ్రహ్మాస్మి' యను ఈ మంత్రము బుద్ధికి కలిగియుండు అజ్ఞానమను వ్యాధిని నశింపజేయునది అహంబ్రహ్మాస్మి యను మంత్రము చిత్తమునకు కలిగియుండు అన్ని బంధములను నివారించున దగును

అహం బ్రహాస్మిమంత్రోఽయం చిత్తవృత్తిం వినాశయేత్ ।
అహం బ్రహాస్మి మంత్రోఽయం సంకల్పాదీన్వినాశయేత్ ॥

అహం బ్రహ్మాస్మి యను ఈమహావాక్యము చిత్తవృత్తుల రహిత మొనర్చునది అహంబ్రహ్మాస్మి యను ఈవేదాంత మహావాక్యము సంకల్పముల నన్నిటిని పారద్రోలును

అహం బ్రహ్మాస్మి మంత్రోఽయం కోటి దోషం వినాశయేత్ ।
అహం బ్రహ్మాస్మి మంత్రోఽయం కామాదీన్నాశయేత్ క్షణాత్ ॥

అహం బ్రహ్మాస్మి యను ఈ దివ్యమంత్రము కోటిదోషముల నైనను భస్మము చేయును అహం బ్రహ్మాస్మి యను ఈ పవిత్రమంత్రము జీవుడు కలిగియుండు అనాత్మదోషము లన్నింటిని క్షణములో లయ మొనర్చును

చిదాత్మాఽహం పరాత్మాఽహం నిర్గుణోఽహం పరాత్పరః ।
ఆత్మమాత్రేణ యస్తిష్ఠే త్స జీవన్ముక్త ఉచ్యతే ॥

నేను చిదాత్మస్వరూపుడను, పరమాత్మస్వరూపుడను, ప్రకృతి గుణములు లేనివాడను, పరాత్పర పరబ్రహ్మ స్వరూపుడను అను నిట్టి ఆత్మభావములో ఎవడు నిలువగలడో, ఆతడు జీవన్ముక్తు డనియే చెప్పదగును

దేహత్రయాతిరిక్తోఽహం శుద్ధచైతన్యమస్మ్యహమ్ ।

బ్రహ్మాహమితి యస్యాన్తః స జీవన్ముక్త ఉచ్యతే ॥

నేను దేహత్రయమునకు విలక్షణుడను, శుద్ధచైతన్య స్వరూపుడను, శుద్ధబ్రహ్మస్వరూపుడను అని ఎవడు అంతఃకరణములో అచంచలమగు జ్ఞానము గలిగి యుండునో, ఆతడు జీవన్ముక్తుడే యగును

కేవలం తుర్యరూపోఽస్మి తుర్యాతీతోఽస్మి కేవలః ।
సదా చైతన్య రూపోఽస్మి చిదానందమయోఽస్మ్యహమ్ ॥

నేను కేవలము తురీయస్వరూపుడను, కేవలము తుర్యాతీత స్థితిలో నుండు వాడను, ఎల్లప్పుడు చేతనాస్వరూపుడను, సచ్చిదానందమయుడుగా నుండు వాడను

నిర్వికల్పస్వరూపోఽస్మి నిరీహోఽస్మి నిరామయః ।
సదాఽసంగ స్వరూపోఽస్మి నిర్వికారోఽహ మవ్యయః ॥

నేను నిర్వికల్పస్వరూపుడను, ఏలాటి సంకల్పములు లేనివాడను ఎప్పుడును లయము లేనివాడను, సర్వదా అసంగస్వరూపుడను, నిర్వికార స్వరూపు డనై యుండువాడను

సదైకరస రూపోఽస్మి సదా చిన్మాత్ర విగ్రహః ।
అపరిచ్ఛిన్న రూపోఽస్మి హ్యఖండానంద రూపవాన్ ॥

నే నెల్లప్పుడున్ను బ్రహ్మానందరసముచే భరితుడను, ఎల్లప్పుడును చిన్మాత్ర స్వరూపుడను, పరిచ్ఛిన్నముగాని రూపముగలవాడను అఖండానం దస్వరూపుడను అని ధ్యానించ వలెను

ధర్మసూక్ష్మము

ప్రతిమతమునకున్నూ, ప్రతిశాస్త్రమునకున్నూ, ప్రతిధర్మము నకున్నూ ఒక సమాప్తి గలదు అనగా– దీనితో ఈ మతము పూర్తి యగును దీనితో ఈ శాస్త్రము సమాప్త మగును దీనితో ఈధర్మము సంపూర్ణ మగును అని యొక నియమము గలదు అట్లుగానిచో అనవస్థాదోషము తటస్థించును ఇది శాస్త్రముయొక్క సిద్ధాంతము మనము ఇంగ్లీషుగాని, సంస్కృతముగాని, ఆచార్యపరీక్షగాని చదువుచున్నప్పుడు ' ఈ పాఠముతో నిది సమాప్తము' అని యొక నియమము గలదు అట్లుగాక, దీనితో నీశాస్త్రము ఈ భాష యెట్లు పూర్తి యగును? ఈ భాషలో నికను నెన్నియో గ్రంథములు గలవు ఈ శాస్త్రములో నింతేగాక మఱియు నెన్నియో పుస్తకములు గలవు అవి యన్నియు జదువనిచో నెట్లు ఈభాష పూర్తియగును! ఏలాగున ఈ శాస్త్రము సమాప్తమగును? అని యొకరడిగినచో దానికంతమే లేకపోవును అట్లు పూర్తిచేయుట మనుష్యజన్మములో సాధ్యము గాదు

ఆ ప్రశ్న యెటువంటి దనగా, ఒకడు మీతండ్రిపేరేమి? యనును, దానికి తనతండ్రిపేరు ఫలానిదని చెప్పవచ్చును మరల మీ తాతపేరేమి? యనిన దానికి తాతపేరు చెప్పవచ్చును తరువాత మీ ముత్తాత నామ మేమి? యనును దానినిగూడ కొంచె మూహించి జ్ఞాపకము చేసికొని తెలుపవచ్చును కాని మీ మునిముత్తాత నామమేమి అడిగిన అందఱికిన్ని తెలియుట ప్రయాసము మఱల మునిముత్తాత తండ్రి పేరేమి? వారితాత, వారి మునిముత్తాత పేర్లు ఏమని యడిగిన ఎవరున్నూ చెప్పజాలరు అట్లు చెప్పనందుచే వారికి వంశము, కులము లేదని చెప్పదగునా?

ఆలాగున, మీ గ్రామమునకు ఉత్తరముగ నూఱుమైళ్ళ దూరమున నేగ్రామము గలదు? అనిన ఫలాని గ్రామము గలదని యోచించుకొని చెప్పవచ్చును అచటనుండి వెయ్యిమైళ్ళు ఉత్తరమున ఏ పట్టణము గలదో,

అదియు కొంచెము చింతించి తెలుపవచ్చును కాని అచ్చోట నుండి పదివేలమైళ్లు ఉత్తరమున నేదేశము గలదో, అదియు నొకవేళ కొంత జ్ఞాపకము చేసికొని చెప్పినను చెప్పవచ్చును మఱల నచ్చోటనుండి పదివేల మైళ్ళు ఉత్తరమున నేదేశము గలదని యడిగినచో నుత్తరధ్రువము గలదని చెప్ప సాధ్యమగును అచ్చోటనుండి మఱి పదివేలమైళ్ళు దూరమున ఏమి గలదని యడిగిన చెప్పసాధ్యము గాదు ఆకాశము గలదని చెప్పిన చెప్పవచ్చును అచ్చటనుండి యింకను పదివేలమైళ్ళ కుత్తరమున నేమిగలదని ప్రశ్నించినచో ఆకాశము నంతమని సమాధానము చెప్పసాధ్యమగును ఆలాగున ధర్మము లన్నిటికిని ఒకపరిమితి గలదు దానితో నది సమాప్తి యగును

కావుననే రాజకీయ విషయముల రికార్డులో తనయొక్కయు, తన తండ్రియొక్కయుపేర్లతో ఆ వ్యవహారము పూర్తి చేయడమైనది వైదిక విషయములగు శ్రాద్ధాదులలో పుత్రుడు తనయొక్క తండ్రి శ్రాద్ధముతో పూర్తి చేయును కానిశ్రాద్ధాదులలో గూడ విశేషకార్యమున, పితృ, పితామహ, ప్రపితామహ యని చెప్పుటతోనే యా కార్యమంత మగును ధర్మము యొక్క సూక్ష్మమున్ను అటువంటిది అట్లుగాక యుండిన దానికంతమే యుండదు

అది యెటువంటిదనగా, ఒక పరమలుబ్ధుడగు శ్రీమంతుని దగ్గరకు కడు దీనుడైన ఒక యాచకుడు వెళ్ళి యేదైన కొంచెము సహాయమగు దానము నడిగినప్పుడు ఆ ధనవంతుడు యాచకునితో ''మీరడిగినది మంచి కార్యమే ఏదైన నివ్వవలయునని నాకున్నూ ఇచ్చగలదు కాని నా నియమమేమన, ప్రపంచములోగల సర్వయాచకులకున్ను ఇచ్చినమాత్రమే యది సరిగా నుండును అదియే సమత్వమగును అట్లు చేయుటయే ధర్మమగును'' అని చెప్పి ఆ పరమదీనుడగు నాయాచకుని పంపినాడట! అట్లు శాస్త్రమున విధి లేదు అది సాధ్యమున్నూ కాదు

కావున తనయొక్క శక్తికితగిన దానధర్మములు చేయవలయుననియే శాస్త్రము విధించుచున్నది అదియే సాధ్యమగును తక్కినది యసాధ్యము ధర్మాచరణ చేయనొల్లనివారు మాత్రమే అలుబ్ధుడగు ధనికునివలె చెప్పుదురు కావున బ్రహ్మచర్యము ఇంతవఱకు పూర్తియగును ఆలాగున నహింసయు దీని

చేత సమాప్తి యగును అదేరీతిగా వైరాగ్యమున్నూ, ఉపరతియున్నూ బోధయు న్నూ దీనితో పూర్తియగునని శాస్త్రము తీర్మానించుచున్నది అంతటితో నది సమాప్తియగును ఆలాగున మనోవాక్కాయ కర్మలతోదృష్టికి గోచరించెడు ప్రాణులను పీడింపకయు, భక్షింపకయు నుండుట అనుష్ఠించిన నహింసా ధర్మము పూర్తియగునని సామాన్యముగ చెప్పనగును అట్లుగాక ఫలములలో జీవులు లేవా? వాయువులోను, జలములోను ప్రాణులు లేవా?యని ప్రశ్న వేయుట అనవస్థాదోష మగును

మఱియు సకల ప్రాణికోట్లయందును దయగలిగి యుండ వలయును అంతటితో పూర్తి చేయక తనయొక్క ఆత్మను అజ్ఞాన కార్యములలో ప్రవేశింప జేయక చూచుచుండవలెను లేనిచో దుఃఖము నొందును ఆత్మలో క్లేశము నొందనీయక నిరతిశయానందసుఖమగు జీవన్ముక్తిని గలుగజేయుటయు గొప్పదగు అహింస యగును కాని అది గొప్పదని గౌణమగు పైజెప్పిన అహింసా వ్రతమును పాలింపకపోయినచో వృక్షమును సంరక్షింపక ఫలమును భుజించుటకు నిరీక్షించుచుండునట్లే యుండును అంతేగాక దేహమును సంరక్షింపక దేహికి జ్ఞానము గలుగజేయదలంచి నట్లుండును కావున, బాహ్యా మగు స్థూలధర్మానుష్ఠానము చేయనిచో సూక్ష్మమగు జ్ఞానము ఏకాలమందును గలుగదని దృఢమగు నమ్మకము గలిగియుండవలయును ఆలాగున మన స్సుతోను, వాక్కుతోను, క్రియతోను, బ్రహ్మచర్య మనుష్ఠించిన చాలును ఏదైన ఆహారదోషముచే గాని, శీతోష్ణముల భేదముచేగాని, స్వప్నములోనేవైన బ్రహ్మచర్య విరుద్ధ సంకల్పముగాని, క్రియలుగాని తోచిన వానివలన దోషము లేదు కాని సంపూర్ణాత్మశుద్ధి గలిగిన ఆలోపముగూడ గలుగదు

ఇది స్త్రీ పురుష లందటికిని సమానధర్మము ఆలాగున గృహస్థ బ్రహ్మచర్యమున్ను శాస్త్రములో చేప్పేలాగున ఋతుకాలధర్మము ననుసరించి యుండును అట్లైన వారున్ను గృహస్థబ్రహ్మచారులనియే గ్రహించు కొనవలయును కాని దీనితో పూర్తియైనదని తలంచక బ్రహ్మభావములో చరించుటచే అనగా బ్రహ్మభావము గలిగియుండుటచేతనే బ్రహ్మచర్యము

పూర్తియైనదని తలంచ వలయును రాగా రాగా ఈగృహస్థ దంపతులున్నూ నైష్ఠికబ్రహ్మచారివలె అను ష్ఠించేలాగున చూడవలయును ఆత్మశుద్ధి గలుగు నప్పుడు ప్రకృతిదోషము నశించునప్పుడు విషయములలో నీచబుద్ధి గలుగును పైజెప్పేలాగున వైరాగ్యముయొక్కయు, ఉపరతియొక్కయు, ఆత్మబోధము యొక్కయు అర్థమును శాస్త్రము చెప్పినట్లు గ్రహించుకొనవలయును ఇహలోక స్వర్గలోక భోగముల యందు తుచ్ఛబుద్ధి గలిగిన వైరాగ్యము పూర్తి యగును దేహసంరక్షణ కొఱకుగల అన్నవస్త్రాదు లుండవచ్చును దానివలన వైరాగ్యమునకు హానిలేదు ఆలాగున దృశ్యములో రమింపక ఆత్మలో నిరంతరము రమించెడు స్థితిగలిగిన, ఉపరతియున్నూ సిద్ధించినదని నిశ్చయించుకొనవచ్చును ఆలాగున ఆత్మ భావము అనగా దైవభావము ఎల్లప్పుడున్నూ స్థిరముగా గలిగి దృశ్యభావము గలుగని యవస్థ సిద్ధించినచో, బోధముయొక్క అనగా జ్ఞానముయొక్కయు పూర్ణావస్థ గలిగినదని నిశ్చయించుకొనవచ్చును

★★★★

ధర్మరహస్యము

ఏ స్థలములోగల డాక్టర్లు మంచివారై రోగులను చక్కగ చూచి బాగు పరచుచుందురో, అట్టివారు నాటు వైద్యులుగాని, యూనాని వైద్యులుగాని, ఇంగ్లీషు వైద్యులుగాని, మఱి యేవైద్యులుగాని యుండినను ఆ గ్రామస్థులున్ను, చుట్టుప్రదేశము లందుండువారున్ను ఆవైద్యులపై ఆ సంఘములపై దానికి సంబంధించినవారిపై, అచటకు వచ్చెడు ఆ సమాజమువారిపై శ్రద్ధావిశ్వాస ములు గలిగియుందురు అట్లు కానిచో, అచటనుండు వైద్యమువారిపైగాని, ఆ సంఘముపైగాని జనులు విశ్వాసము కలిగియుండరు అంతేగాక యచటకు వచ్చెడు ఆ సంఘములో నుండు మంచివారి యెడనైనను జనులకు విశ్వాస ముండదు

ఆలాగున ఏ స్థలములోనుండు సాధువులుగాని, భక్తులు మొదలైన వారు గాని, యోగ్యులైనచో వారిపైన, వారి సమాజముపైన, అచటకు వచ్చెడు ఆ సంఘమునకు సంబంధించిన వారిపైన జనులందరును భక్తిశ్రద్ధలు కలిగి యుందురు కావున గురువులపై, సమాజముపై, దైవముపై విశ్వాసముగల వారందఱున్ను ఎచటనుండినను శ్రేష్ఠమైన గుణము గలిగియుండేలాగున చూడవలయును లేనిచో గురువులవారికిన్నీ, బ్రహ్మనిష్ఠులగు వారికిన్నీ, దైవమునకును, దైవవిషయ వేదాంతశాస్త్రమునకున్ను ద్రోహము చేసినవారే యగుదురు ఇయ్యది లోకమున ఇపుడు స్పష్టముగ కనబడుచున్నది యథార్థమైన గురుసేవయొక్క రహస్యము దీనియందు నిగూఢమై యున్నది కావున గురుభక్తి గలవారలు, దైవవిశ్వాసము కలవారలు మంచి యనుష్ఠానము కలిగియుండే లాగున సదా చూడవలయును దానికి మించిన గురుసేవ మఱి యొకటి లేదు ఇట్టివారు గురుసన్నిధినుండి యెంతదూరముగ నుం డినను దగ్గఱగా నుండినవారే యగుదురు గురుధర్మమును, దైవధర్మమును లోకములో ప్రచారము చేయుటయే గురుభక్తుల యొక్కయు, దైవభక్తుల యొక్కయు ధర్మమని మఱువకూడదు

★★★★

జన్మసాఫల్యము

జనులారా? కర్షకుల వ్యవసాయసమయ మెటువంటిదో మీ యొక్క అభ్యాసకాలమున్ను అటువంటిదే లేక మీయొక్క యౌవనారంభమున్నూ అట్టి దనియే గ్రహించుకొనవలయును సంవత్సర జీవితసుఖమంతయు కృషిచేసెడు కాలమున నెట్లుండునో, ఆలాగున మీ జీవితసౌఖ్య మంతయు జీవన్ముక్తియు అట్టికాలముననే యుండునని మఱువకుడు విత్తనమువేయుట, నారునా టుట మొదలగు పనులు చేయు సమయమున ఏలాగున వ్యవసాయదారులు నిద్రయు, భోజనముగూడ లక్ష్యముచేయక సేద్యపు పనిలోనే కాలము గడుపు చుందురో, అపుడొక నిమిషమైనను సమయమును ఎట్లు వ్యర్థపుచ్చరో, ఇతర కార్యము లన్నిటిని ఎట్లు నిలిపివేయుదురో ఆలాగున మీరును అభ్యాస కాలమున నిద్రాహారాదులనుగూడ లక్ష్యపెట్టక, ధ్యానములోను, విద్యాభ్యాసమునందును, గురుసేవయందును, వ్రతనిష్ఠలోను, పుణ్యకర్మా నుష్ఠానములోను కాలము పూర్తిగ వినియోగపఱచవలయును వ్యవసాయ కాలమున వానకున్నూ, చలికిన్ని, ఎండలకున్నూ భయపడి, భోజన మునకును, నిద్రకున్నూ లోబడి అప్పటికాలమున పరిశ్రమ చేయక గడపినచో ఆసంవత్సరము జీవితమంతయు ఏలాగున దుఃఖముతోను, భోజనాదులు లేకయు గడుపవలసి యుండునో, ఆలాగున యౌవనారంభమునగాని విద్యా భ్యాస సమయమునగాని, అనుష్ఠాన కాలమునగాని మీరు శీతోష్ణముల సహింపనిచో, నిద్రాహారాదులను జయింపనిచో మీ జీవితమంతయు దుఃఖ భూయిష్ఠముగాను, క్లేశపూరితముగాను గడుపవలసియుండును, జీవితమంతయు మాత్రమేకాదు పరలోకమున కూడ వ్యథల ననుభవింప వలసియుండును పరలోకము మాత్రమే గాదు, భావిజన్మము సహా దుఃఖ రూపముగానే యుండునను తత్త్వము మఱువకుడు

వర్తమానకాలమున్ను, పరలోక జీవితమున్ను, భావిజన్మమున్నూ

మన అఱమేతిలో నుంటున్నవి ఈ మూడింటిని మనము ఇపుడే పావన మొనర్చ వలయును లేక మానవజన్మము గలుగనిస్థితి, మోక్షస్థితిని గూడ కలుగ చేసికొనవచ్చును ఇదే ముముక్షువులయొక్కయు, జిజ్ఞాసువుల యొక్కయు, ముఖ్య కర్తవ్యమని మఱువకూడదు ఇందులకే ఉత్తమ గురుకుల వాసము కావలయునని గ్రహించవలయును శ్రేష్ఠులైన గురువులు దొరకిన మాత్రమే గురుకుల వాసము చేసిన చాలును లేనిచో స్వప్రయత్నపరులై యుండుటయే బాగు పరిశ్రమపరులు కానిచో ఎవరున్ను పవిత్రులు గాజాలరను తత్త్వ మెల్లప్పుడును మనస్సులోనుంచి జీవించవలయును లోకములో పావనులైనవారి చరిత్రమే దీనికి సాక్ష్యము సోమరితనమునకన్న మించిన పెను భూతము జగతిలో మఱి యొకటి లేదని మఱువకుడు ఈ సోమరి అను పెనుభూతముయొక్క సోదరుడే అభిమానము వీరుభయులు చేరినచో, దయ్యముపట్టిన వారికిన్ని, మతి చెడినవారికిన్ని ఎట్టిగతి కలుగునో వారల యొక్క జన్మమున్ను ఆలాగుననే యుండును

★★★★

షోడశకళా ప్రపూర్ణము

1 ప్రథమ కళాచతుష్టయము –వ్రతము, సంకీర్తన, ప్రత్యాహారము, శ్రవణాదులు

2 ద్వితీయ కళాచతుష్టయము – జప, చింతా, ధారణ, మననాదులు

3 తృతీయ కళాచతుష్టయుము – ధ్యాన, సవికల్ప సమాధి, అనుసంధాన, నిదిధ్యాసములు

4 చతుర్థ కళాచతుష్టయుము –సాక్షాత్కార, నిర్వికల్పసమాధి, నిర్వృతి, నిర్వాణములు

వీనికే షోడశకళా ప్రపూర్ణనిర్వాణమని పేరు ఈ కళలు మొదటిదాని కన్న – రెండవది వెయ్యిరెట్లధికముగా నుండును రెండవ దానికన్న మూడవది వేయిరెట్లధిక ఫలము నిచ్చునదిగా నుండును మూడవదానికన్న నాలుగవది వెయ్యిరెట్లధికమయినది

కాన ముముక్షువులు, సాధువులు, భక్తులు ఈనాలుగింటిని వరుసగా నభ్యసించవలసినదేగాక, నాలుగింటిని కూడ ఆచరణలో నిత్యము నుంచ వలెను. అపుడు మాత్రమే సర్వజనులున్నూ, తరించుటకు కారణమగును కొందరు వారి సంస్కారము ననుసరించి ఈ కళాచతుష్టయములో నొక్కొక దానియందే యుండి యాచరించుచూ దానిలోనే ప్రీతిగలిగి యుందురు

సాధారణముగా మహాత్ములందరున్నూ, ఈ నాలుగింటిలోను ప్రవృత్తి గలిగియుందురు ఒకొకప్పుడు ఒకదానిలోనే చాలకాలమువఱకు నుండెదరు కాని వైరాగ్య, శమదమాదులు అందఱి కొకే విధముగానే యుండును అది శరత్కాల నిర్మలాకాశ మందుండు పూర్ణిమచం ద్రునివలె ప్రశాంతముగాను, ప్రసన్నముగాను, ప్రకాశముగా నుండును అట్టిస్థితి కలిగినదా! లేదా! యని సాధకులు నిరంతరము చూచుచుండ వలయును

అభ్యాసకులందరున్నూ నాలుగవ స్థానమగు సాక్షాత్కార నిర్వికల్ప

సమాధి, నిర్వృతి, నిర్వాణములు గలుగువఱకున్నూ అనుష్ఠానము నిలుపరాదు ఇది కల్లోల మడగిన ప్రశాంత మహాసముద్రమువలె నగాధమై, గంభీరమై యుండును అట్టి దివ్యపురుషుని సర్వేంద్రియముల ద్వారా అమృత సమానమగు ఆనందము ప్రవహించుచుండును అదే దీనిలో ముఖ్యముగా గమనింపదగినది తేనెతో నిండిన ఘటమునకు ఏప్రక్క రంధ్రము చేసినను మధురమగు తేనె వచ్చుచుండునేగాని మరియేవిధమగు రసమున్నూ కలుగదు ఘటములో వెలుగు దీపము బాగుగా ప్రకాశించుచుండిన, రాత్రి కాలములో ఆఘటమునకెన్ని రంధ్రములుండునో యన్నిటిద్వారా యాదివ్యజ్యోతియే బహిర్ముఖముగ ప్రకాశించునట్లు, పూర్ణాత్మస్థితిగలవారి సర్వేంద్రియము లేల! సర్వరోమ కూపముల నుండియు, ఆ ప్రశాంతమగు, ప్రసన్నమగు, అమృతమగు, ఆనందమగు భావమే కలుగుచుండును అదే యా పూర్ణత్వమును పొందినదానికి గుఱుతు ఓమ్

★★★★

భావశుద్ధియే జ్ఞాన సిద్ధి★

ధ్యానాయ ధ్యానగమ్యాయ ధ్యాతృపాపహరాయ చ ।
ధ్యానేశ్వరాయ సుధియే ధ్యేయ ధ్యాతృ స్వరూపిణే ॥

భావశుద్ధియే జ్ఞానసిద్ధియని ఆశ్రమములో వ్రాసియుండు వాక్యము చూచి అనేకులు దానియొక్కయర్థము అందఱికిన్ని వ్యక్తమయ్యేలాగున తెలుపవల యునని యడుగుచుందురు కావున ఇది ఇప్పుడు వ్రాయడమైనది సంక్షిప్త ముగా చెప్పినచో భావము శుద్ధమగుటయే జ్ఞానముయొక్క సిద్ధి యనంబ డును భావము శుద్ధమగుటయే జ్ఞానప్రాప్తి యని తాత్పర్యము

ఈభావము బాహ్యాభ్యంతర భేదములచే రెండు భాగములుగా తెలియదగి నది అవి రెండును మఱల నొక్కొకటి స్థూలసూక్ష్మము లనియెడు భాగములచే ద్వివిధములుగా నుండును

దానిలో బాహ్యముయొక్క స్థూలార్థ మేమన, ఇంద్రియముల కేలాటి చెడు విషయవృత్తులు లేకుండుటయే యగును అనగా 1 కర్ణేంద్రియము ఏలాటి దుష్ట వాక్యములను వినకయుండుటయు,2 స్పర్శేంద్రియము దుష్టస్పర్శనముల చేయక యుండుటయు, 3 నేత్రేంద్రియము దుష్టపు చూపులు లేకుండుటయు 4 రసనేంద్రియము దుష్టపదార్థములను రుచింపక యుండుటయు, 5 ఆలాగున ఘ్రాణేంద్రియము దుష్టగంధముల నాఘ్రాణింపక యుండుటయునగును ఇవి జ్ఞానేంద్రియముల వృత్తులు

ఆలాగుననే 1 వాక్కుతో నొక శబ్దమైనను దుష్టవాక్యము లుచ్చరింప కుండుటయు, 2 పాణీంద్రియము ఏ విధమైన దుష్టకార్యములను చేయకుండుటయు, 3 పాదేంద్రియము దుష్టస్థలములో సంచరించ కుండుటయు, 4 ఉపస్థేంద్రియ మేదుష్టవిషయములు లేకయుండుటయు,

---

★ఈ శీర్షిక పేరుతో ప్రత్యేకముగా ఒక గ్రంథమును శ్రీవారు రచించియున్నారు శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళి ఐదవ సంపుటము చూడుడు

5 పాయ్విం(ద్రియము శుద్ధమైన స్థలములను మలినపఱచక యుండుటయు నేది గలదో అది కర్మేం (ద్రియముల శుద్ధి యనంబడును

పతి(వ్రతయగు నారీమణి తనయొక్క (వ్రతభంగము కలుగనివ్వక యెట్లు జాగరూకత గలిగి వర్తించునో, మఱియు (బ్రహ్మచర్య(వ్రతము సల్పు వారు ఏలాగున తమ (వ్రతమునకు హాని కలుగనివ్వక చూచుచుందురో, ఆలాగున నీఇం(ద్రియ నియమనశక్తి గలవారుగూడ చూచుచుండవలయును పైజెప్పినవారు (వ్రత భంగము కలవారైనచో దానివలన బొందగలుగు ఫలమే లాగున పొందజాలరో, ఆలాగున ఈ నియమము కలవారు గూడ తమ (వ్రతమునకు భంగము గలిగిన పతనము కలుగునని నిశ్చయించుకొన వలయును పతనము కలిగినచో అట్టి నిర్మలమగు (వ్రతముచే గలిగెడు అతి పవి(త్రమగు ఫలితమున్ను తమకు కలుగజాలదని నిరంతరము జ్ఞాపకముంచు కొనవలయును ఎట్లన, ఒక యుద్యోగమునకై యొకడు చదువుచున్నాడు దానియందుత్తీర్ణుడైన ఆ యుద్యోగము లభించును లేనిచో నాపదవి లభించనట్లు, (ప్రతియొక (వ్రతమును గూర్చియు గూడ సాధువులు నిశ్చయించు కొనవలయును కావుననే యనేకులు అనేకానుష్ఠానములను జేసియు భంగము గలుగనీయక చూడకపోవుటచే దానియొక్క ఫలితమును బొందజాలకున్నారు ఈచెప్పినది ఇం(ద్రియములయొక్క స్థూలార్థమే యగును

వీనియొక్క సూక్ష్మార్థము వినదగినది ఇది పైజెప్పినదానికన్న మిక్కిలి సారమైనది దీనిని మఱింత లోతుకు దిగి విచారణ చేయవలసియుండును అపుడే నిజమైన సత్యము గోచరము కాగలదు 1 కర్ణముతో ఏవాక్యమును వినుచున్నామో, ఆవాక్యముయొక్క పరమార్థము (ప్రపంచమునకు సత్యమైనను దానిలో మనస్సు నుంచక సత్యమగు (బ్రహ్మమందే మనస్సు నుంచవలయును 2 ఆలాగున, స్పర్శించెడి వస్తువులు ధర్మయుక్త మైనను అవి దృశ్యవస్తువులుగా తలంపక (బ్రహ్మవస్తువులుగా నిశ్చయించుకొనవలయును 3 చూచెడు వస్తువులు సత్యములైనను వానిని దృశ్యవస్తువులుగా చూడక దైవరూపముగనే చూడవలయమును 4 భుజించెడు వస్తువులు ధర్మముతో కూడినవైనను అవిన్ని దృశ్యవస్తువులని తలంపక పరమాత్మవస్తువులుగానే చింతన చేయవల

యును 5 ఆఘ్రాణించెడి వస్తువులు ధర్మయుక్తములైనను దృశ్య వస్తువులుగా తలంపక వానినిగూడ ఈశ్వరస్వరూపముగానే తలంపవలయును ఇట్లుండ వలయుననియే కఠోపనిషత్తున నచికేతుడను ఋషికుమారుడు యమధర్మ రాజుతో సత్యాసత్యములకున్ను, ధర్మాధర్మములకున్ను విలక్షణముగా నుండెడు ఏయొక్క బ్రహ్మవస్తువు గలదో దానిని తెలుపవలయునని యడిగిన రహస్యము

అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాదన్యత్రాస్మాత్కృతాకృతాత్ ।
అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ యత్తత్పశ్యసి తద్వద ॥

శాస్త్రవిహితమైన ధర్మముకంటె వేరైనది, అధర్మముకంటె వేరైనది, కార్యకారణ భూతమైన దానికంటె వేరైనది, జరిగినదానికంటెను, జరుగబోవు దానికంటెను, వర్తమానమైన దానికంటెను వేరైనది యగు ఎద్దానిని నీవు ఎఱుంగుచున్నాడవో దాని నుపదేశింపుము

ఇది జ్ఞానేంద్రియములకు చెప్పినట్లు కర్మేంద్రియములకు కూడ గ్రహించుకొనవలయును 1 వాక్కుతో చెప్పెడు వచనముగూడ ప్రపంచ మునకు సత్యమైనను ఆకార్యములు దృశ్యములగుటచే జ్ఞానదృష్టిలో అసత్యమనియే గ్రహించవలయును అనగా సత్యస్వరూపుడు సర్వేశ్వరు డొకడే యని నిశ్చయించవలయును అతడే 'సత్యస్య సత్యం' అని చెప్పబడు చున్నాడు అనగా బాహ్యమైన సత్యమునకన్న అతీతమైనది అదియే నిజమైన తత్త్వము దానినే బ్రహ్మమనియు, ఈశ్వరుడనియు, పరమాత్మయనియు చెప్పుచుందురు 2 చేతితో ఏపదార్థములు ఇచ్చి పుచ్చుకొనియెదరో అవి సత్యములైనను ఈశ్వ రమయము తప్ప రెండవది అణుమాత్రమైనను లేనందుచే ఆ వస్తువును గూడ బ్రహ్మమయముగా చూడవలయును 3 పాదముతో నడచెడి స్థలములు ధర్మయుక్తములైనను దైవమునకన్న అన్యమైనది లేనందుచే ఆ స్థలములను గూడ దైవముగానే భావన చేయవలయును 4 ఉపస్థేంద్రియముతో చేయుకార్యములు గూడ ధర్మయుక్తములుగా నుండినను శుద్ధబ్రహ్మమున కన్యమైనది యొకపరమాణువైనను లేనందుచే నాకార్యములను గూడ బ్రహ్మ మయములుగానే భావన చేయవలయును

వికారము ప్రకృతియందు కలదు గాన ప్రకృతి యనునది లేదను భావన ఇచట చేయుచుండుటచే ఈభావన దృఢ పడి రాగారాగా ఆ ప్రకృతి చేష్టలుగూడ అణగిపోవును ఇదియే దీనిలో గల రహస్యము

పుటమువేసిన, విషయుక్త ములగు పాషాణాది వస్తువులు ఏలాగున విషరహితములై దివ్యౌషధములగునో, ఆలాగున భావనాశక్తియను అగ్ని యందుదహించిన ఇంద్రియములు గూడ నిర్విషయస్థితిని పొందగలుగును భావనయొక్క మహిమ అటువంటిది 5 అదే ప్రకారము పాయ్వింద్రియము యొక్క వృత్తియందును పరిశుద్ధమైన జ్ఞానమయమగు బ్రహ్మభావనయే చేయవలయును అట్టిభావనవల్లనే ప్రకృతి విశేషముగా నశించును అప్పుడే సంపూర్ణముగా నింద్రియములకు భావశుద్ధి గలిగినదని నిశ్చయించుకొన వచ్చును అప్పుడెచ్చోటను అనిష్టభావము గలుగదు సర్వకాలములలోను సర్వత్ర నిర్మల భావమే కలుగుచుండును

బాహ్యాభ్యంతరభేదేన శౌచం తు ద్వివిధం స్మృతమ్ ।
మృజ్జలాభ్యాం బహిశ్శుద్ధి ర్భావశుద్ధి స్తథాఽఽన్తరమ్ ॥

బాహ్యాభ్యంతర భేదములచే శౌచము ద్వివిధముగా నుండునని గ్రహించదగినది మృత్తికచేతను, జలముచేతను గలిగెడు శుద్ధి బాహ్యశుద్ధి యనియు, నిర్మల భావము కలిగియుండుట (భావశుద్ధి) ఆభ్యంతర శుద్ధియని ఎఱుంగవలెను

అంతశ్శుద్ధి విహీనైస్తు యేఽధ్వరా వివిధాః కృతాః ।
న ఫలన్తి మునిశ్రేష్ఠ భస్మని న్యస్త హవ్యవత్ ॥

ఆత్మశుద్ధి లేనివారు అనేక విధములగు యజ్ఞములుగాని, వ్రతములు గాని దానములుగాని, తీర్థయాత్రలుగాని, పూజలుగాని చేసినను అవి ఫలమును కలుగచేయజాలవు అవి యన్నియు బూడిదయందు హోమించిన హవిస్సువలె నిష్ఫలమగును

భావశుద్ధివిహీనానాం సమస్తం కర్మ నిష్ఫలమ్ ।
తస్మాద్రాగాదికం సర్వం పరిత్యజ్య సుఖీ భవేత్ ॥

భావశుద్ధి సంపూర్ణముగా కలుగనివారి సమస్తకర్మలున్ను

నిష్ఫలములు, అందువల్ల రాగాదులను మనోమాలిన్యమంతయు పరిత్యజించి సుఖముగా నుండులాగున చూడుము

మృదా భారసహస్రైస్తు కుంభకోటి జలైస్తథా ।
కృతశౌచోఽపి దుష్టాత్మా చండాల సదృశస్స్మృతః ॥

వేలకొలది టన్నుల మట్టిచేతను, కోట్లకొలది కుంభముల జలము చేతను దేహశుద్ధి చేసికొనిన వాడైనను ఆత్మశుద్ధి లేనివాడు పాపజీవులతో సమానుడుగా తలంచబడుచున్నాడు

అంతఃశుద్ధి విహీనశ్చ బహిశ్శుద్ధిం కరోతి యః ।
అలంకృతః సురాభాండ ఇవ శాంతిం న గచ్ఛతి ॥

ఆత్మశుద్ధి లేనివాడై బాహ్యశుద్ధి గలవాడైనను వాడెప్పుడున్ను శుద్ధుడు కాజాలడు ఎట్లన, సురాభాండముయొక్క బాహ్యమును శుభ్రముగా నలంక రించినను దానిలోగల మద్యముయొక్క వాసన ఎట్లు నశింపజాలదో, శుద్ధి కాదో ఆలాగుననే భావశుద్ధి లేనివారి స్థితి యనియు గ్రహించుకొనవలయును

అనిర్జితేంద్రియగ్రామో యస్తు ధ్యానపరో భవేత్ ।
మూఢాత్మానం చ తం విద్యాద్ధ్యానం చాస్య న సిద్ధ్యతి ॥

ఇంద్రియ సమూహములను ఎవ్వడు స్వాధీనములో నుంచుటకు శక్తి లేని వాడు అగునో, అతడెంత ధ్యానపరుడైనను శుద్ధుడు కాజాలడు అతనిని మూఢాత్ముడనియే గ్రహించుకొనవలయును ధ్యానముచే గలిగెడు ఫలమును అత డనుభవింపజాలడు

ఇక అంతరింద్రియములయొక్క వృత్తిని గుఱించి యోచించుకొన వలయును 1 దీనిలో మనస్సు ముఖ్యమైనది. మనస్సు ఏలాటి దృశ్యవిషయ ములలో మాలిన్యములు తలంచకయుండిన శుద్ధము అయినదని గ్రహించ దగినది సత్యమునకున్ను, ధర్మమునకున్ను భిన్నమైన తలంపు కలు గక సత్యముతోను ధర్మముతోను గూడిన తలంపు మాత్రమే కల్గియుండ వలయును 2 చిత్తము ఇదిన్ని దృశ్యములగు చెడువిషయములను గూర్చి చింతచేయక సదా మంచివిషయములను మాత్రమే చింతన చేయుచుం డవలయును 3 బుద్ధియొక్క నిర్మలత ఎట్లగుననిన, బుద్ధి దృశ్య

విషయములగు దుష్టకార్యములను గుఱించి ఈలాగున చేయవలయునని నిశ్చయము చేయక యుండవలయును 4 అనాత్మవస్తువులగు వేనియందును నేననికాని, నాదనికాని భావము గలుగనీయక చూడవలయును అపుడు అహంకారము శుద్ధమగును ధర్మమునకున్ను సత్యమునకున్ను విరుద్ధమగు ఏ విషయములోను అంతరింద్రియములు నాల్గున్ను ప్రవర్తింపగూడనిస్థితి గలుగ వలయును అపుడే అంతఃకరణము శుద్ధమగును అట్లు తనకు స్వయముగా తోచవలయును అపుడు భావశుద్ధియొక్క బాహ్యార్థము శుద్ధమైనట్లు తెలిసికొనవలయును

ఇక అంతరింద్రియముయొక్క అంతరార్థశుద్ధిని గురించి చెప్పెద 1 సత్య ధర్మములతో గూడిన వస్తువుల ననుభవించుటయున్ను, వాటిని మననము చేయుటయున్ను గలిగియుండిన మనస్సుయొక్క బాహ్యశుద్ధి మాత్రమే గలిగెను ఏలన నిజముగా విచారణ సలిపినచో వస్తువులలో గూడ ఏ వస్తువున్ను ఈశ్వరుని కన్యముగా లేదుగదా! బ్రహ్మముగా కన్యముగా ఏదియైనను ప్రతీతియైనచో అది మాయవల్లనే ఏర్పడెనని గ్రహించు కొనవలయును దైవమున కన్యముగా ఒక వస్తువుండిన మాత్రముననే మనస్సు దానిగూర్చి సంకల్పము చేయును అంతయు నొకేవస్తువగు దైవమందే యైనచో మఱల మనస్సు దేనిని మననము చేయును? అపుడు మనస్సు అనునది ఒకటి లేకపోవును అత్తఱి మనస్సు గూడ సద్వస్తువే యగును ఆసద్వస్తువు తన యాత్మ కన్యముగా మఱి ఏవస్తువున్ను లేదనియు నిశ్చయించుకొని, తన యాత్మయగు బ్రహ్మను గుఱించి మాత్రమే మననము చేయవలయును అపుడు మనస్సు బావశుద్ధిలోనికి మఱలుచుండును పుణ్యాపాపములకున్ను, బంధమోక్షములకున్ను ఈ మనస్సే కారణము ఈ మనస్సు దృశ్యాభావము గలదైన మఱల బంధము కలుగదు 2 బుద్ధి అదే ప్రకారము బుద్ధియున్ను దృశ్య విషయమును గుఱించి నిశ్చయము చేయక ఈశ్వరస్వరూపమును మాత్రమే తనయొక్క స్వరూపమని నిశ్చయించు కొనవలయును, ఏలన దైవమున కన్యమైనది ఎంత కాలమువఱకు ప్రతీతి యగుచుండునో అంతవఱకు ప్రకృతి యుండును

3 చిత్తము చిత్తము గూడ ధర్మయుక్తమగు వస్తువును మాత్రమే చింతించెడు స్థితి కలిగియుండినను అదిన్ని బాహ్యశుద్ధిమాత్రమే యగును ఏలన బ్రహ్మమున కన్యమై రెండవ వస్తువు లేదుగదా! కలదని తోచిన అది మాయయొక్క మహిమయేగదా? కావున వస్తువును గుఱించి చింతించెడు చిత్తముయొక్క వృత్తి నశించి తనయొక్క నిజస్వరూపమగు ఆత్మను గుఱించి మాత్రము సదా చింతన చేయుచుండవలయును, అపుడే చిత్తము శుద్ధమగును 4. అహంకారమున్ను ఆలాగున తనయొక్క పూర్ణభావమునుమాత్రమే భావన చేయవలయును దృశ్య వస్తువు దేనియందైన నభిమాన ముంచిన అదిన్ని బంధమునే కలుగజేయును ఆత్మకన్యముగా మఱి యేవస్తువున్ను లేదుగదా! కలదని తలంపు కలిగినచో అది మిధ్య యను భావము వెంటనే చేసికొన వలయును అపుడు భావము లన్నియు శుద్ధములైనవి అత్తఱి మిగిలినది బ్రహ్మవస్తు వొకటిమాత్రమే అది శివము, అద్వైతము, అమృతము, ఆనందము ఈవిషయమును గీతాచార్యులు ఉపదేశించినది చూడుడు

మనః ప్రసాదస్సౌమ్యత్వం మౌన మాత్మవినిగ్రహః ।
భావసంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే ॥

చిత్తనైర్మల్యమున్ను, సంతోషభావమున్ను, చిత్తమును పరమాత్మ ధ్యానమందుంచుటయు, చిత్తము నితరవిషయములపై పోనివ్వక చేయుటయు, భావము లన్నియు సంపూర్ణముగ శుద్ధములై యుండుటయు–ఇది మానసిక తపస్స నంబడును

మఱియు అది ఎట్లు సిద్ధించునో దానికొక రహస్యము తెలిపెద 1 మనస్సు దేనిని మననము చేయుచున్నదో, అనగా మనస్సు దేనిని తలంచునో, లేక సంకల్పించునో, అపుడు మనస్సు ఈలాగున సంకల్పము చేయుచున్నదని దేనివల్ల తెలిసికొనుచుండునో అదే ఆత్మ, మనస్సు శుద్ధమైన అట్టి యాత్మయందు నిలుకడ కలుగును (2) ఆలాగున బుద్ధి దేనినిగురించి నిశ్చయించుచున్నదో ఆబుద్ధియొక్క నిశ్చయము దేనివల్ల ఎఱుంగ బడుచున్నదో–అదే ఆత్మ, బుద్ధిశుద్ధమైన, అట్టి ఆత్మభావము సులభముగా గోచరము కాగలుగును

(3) అదే ప్రకారము చిత్తము దేనినిగురించి చింతించుచున్నదో చిత్తము యొక్క చింతనను ఏది తెలిసికొనుచున్నదో అదే ఆత్మస్వరూపము చిత్తము నిర్మలమైనచో అట్టియాత్మను ప్రయాసము లేకనే తెలిసికొనవచ్చును ఏలన, ఈ మనస్సు, బుద్ధి, చిత్తము దేనిని తలంచునో, నిశ్చయించునో, చింతించునో, ఆవస్తువులకన్న చిత్తము బుద్ధి, మనస్సు వేఱుగదా? అపుడు చింతింపబడిన వస్తువులు చిత్తాదుల కన్యముగాను, అవి దృశ్యముగాను ఈ మనస్సు మొదల గునవి దృక్కులుగాను, స్పష్టముగా గోచరము లగుచున్నవి గదా! అట్లుండగా మనస్సు మొదలగు వానిని తెలిసికొనియెడు ఆత్మ వాటికి విలక్షణముగాను, దృక్స్వరూపముగాను ఉంటున్నదని ఏల తెలిసి కొనగూడదు? అదే ప్రకారము 4అహంకారము దేనిని గుఱించి అహంకరించి యున్నదో ఆ వస్తువుకన్న అహంకారము విలక్షణముగదా! వస్తువు దృశ్యము గాను అహంకారము దృక్కుగాను నుండును అపుడు అహంకార మీలాగున అహంకరించుచున్నదని ఏ జ్ఞానమువల్ల గోచరమగుచున్నదో అదే ఆత్మ స్వరూపము అది జ్ఞానస్వరూప మగుట చేతనే అంతఃకరణములగు మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనెడి నాల్గింటియొక్క స్వభావమును తెలిసికొనుచున్నది అదే ఆత్మస్వరూపము అది అంతఃకరణ శుద్ధివల్లనే తెలియందగినది

ఆకాశము శుద్ధమగునపు డేలాగున సూర్యుడు కనుపించునో, ఆలాగున హృదయములోగల సకల అనాత్మవాసనలు నశించునపుడు ఆత్మ స్వరూపము గోచరము కాగలుగును ఇదే భావశుద్ధియొక్క రహస్యము శుద్ధమైన దర్పణమందు తనయొక్క శరీరము స్పష్టముగ గనుపించునట్లు హృదయశుద్ధి గలుగునప్పుడు ఆత్మయు నిర్మలముగ ప్రకాశించును

భావశుద్ధిః పరం శౌచం ప్రమాణం సర్వకర్మసు ।
చిత్తం విశోధయే త్తస్మా త్కిమన్యైర్బాహ్యశోధనైః ॥

భావశుద్ధికన్న పరమగు శుద్ధి మఱియొకటి లేదు సమస్తకర్మలలో ఇదే ముఖ్యమగు ప్రమాణము అందువల్ల చిత్తశుద్ధిని ముఖ్యముగా చేసి కొనవలెను అట్లు చేయక బాహ్యముమాత్రము శుద్ధిచేసికొనిన నేమి

ప్రయోజనము?

భావతః సంవిశుద్ధాత్మా స్వర్గం మోక్షం చ విందతి ।

భావసంశుద్ధిగల ఆత్మ స్వర్గమును, మోక్షమును పొందుచున్నది

జ్ఞానామలాంభసా పుంసః సద్వైరాగ్యమృదా పునః ।
అవిద్యారాగవిణ్మూత్రలేపగంధ విశోధనమ్ ॥

జ్ఞానమనెడు నిర్మలమగు జలముచేతను, శుద్ధవైరాగ్యమను మృత్తిక చేతను ముముక్షువైన పురుషుడు మరల మరల అవిద్యారాగద్వేషము లనియెడు మలమూత్రములను శుద్ధముగా కడుగుచుండవలెను

తైలక్షయే యథా దీపో నిర్వాణ మధిగచ్ఛతి ।
కర్మక్షయే తథా జంతు ర్నిర్వాణ మధిగచ్ఛతి ॥

తైలము క్షయింప దీపమారిపోవునట్లు, కర్మవాసన లన్నియు నశించు నపుడు జీవుడు నిర్వాణమగు పదవిని పొందుచున్నాడు

త్రివిధం భావనారూపం విశ్వమేతత్త్రిధోచ్యతే।
బ్రహ్మాఖ్యా కర్మసంజ్ఞా చ తథా చైవోభయాత్మికా ॥

కర్మభావాత్మికా హ్యేకా బ్రహ్మభావాత్మికా పరా ।
ఉభయాత్మికా తథైవాన్యా త్రివిధా భావభావనా ॥

సనకాద్యాస్సదా జ్ఞానిన్ బహ్మభావనయా యుతాః ।
కర్మభావనయా చాన్యే దేవాద్యా స్థావరాశ్చరాః ॥
హిరణ్యగర్భాదిషు చ బ్రహ్మకర్మాత్మికా ద్విధా ॥

త్రివిధములగు భావనారూపములచే ఈవిశ్వమున్ను మూడు విధములుగా చెప్పడమైనది బ్రహ్మభావనయనియు, కర్మభావనయనియు, బ్రహ్మకర్మోభ యాత్మికయనియు వాటిపేర్లు వానిలో మొదటిది కర్మ భావాత్మిక యనియు, రెండవది బ్రహ్మభావాత్మిక యనియు, మూడవది ఉభయాత్మిక యనియు త్రివిధముగా భావనాభేదము గ్రహించవలయును జ్ఞానులగు సనకాది ఋషులు సదా బ్రహ్మభావముతో కూడినవారలు, దేవతలు కర్మభావనతో కూడినవారలు, చరాచరాత్మకమగు ఈ జగత్తును కర్మ

రూపముగ భావనచేయువారు, ఇంద్రాది దేవతలు, హిరణ్యగర్భుడు అదిగా గల వారు బ్రహ్మకర్మాత్మకమగు ఉభయములతో కూడినవారలు, అనగా సనకాదిఋషులు ఈ జగమంతయు బ్రహ్మభావముతో చూచువారు ఇంద్రాది దేవతలు ఈ ప్రపంచమును కర్మభావముతో చూచెడివారు, చతుర్ముఖబ్రహ్మ మొదలైనవారు బ్రహ్మ కర్మా త్మికమగు ఉభయభావముతో గూడినవారు ఈ మూడును భావానాభేదముచే కలుగుచున్నవి కావున జీవన్ముక్తి పదవిని పొంద గోరువారు సనకాదుల వలె బ్రహ్మభావన గలిగియుండవలయును

బ్రహ్మైవాహం న సంసారీ నిత్యముక్తో న శోకభాక్ ।
సచ్చిదానంద రూపోఽహ మాత్మానమితి భావయేత్ ॥

ఆత్మభావన ఎట్లుచేయవలయునో యా రహస్యము ఈలాగున చెప్పడ మైనది ఇది మహావాక్య ప్రబోధకభావ మగును 'నాయాత్మ కేవలము ప్రకృతికి పరమగు ఆ బ్రహ్మస్వరూపమేగాన అట్టి యాత్మయగు నేను సంసారి కాను, నిత్యముక్తుడను కావున ఏ శోకమున్ను నాకు కలుగకూడదు' ఇట్లు సచ్చిదానంద స్వరూపముగ ఆత్మను నిరంతరము భావన చేయవలయును –

ఇపుడు గురువుయొక్క లక్షణము చెప్పబడుచున్నది–

పారంపర్యక్రమప్రాప్తో నిత్యానుష్ఠానతత్పరః ।
గుర్వనుజ్ఞారతః శ్రీమా నభిషేకసమన్వితః ॥

సుందరః సుముఖః శాంతః కులీనః సులభో వశీ ।
మంత్రతంత్రార్థతత్త్వజ్ఞో నిగ్రహానుగ్రహక్షమః ॥

నిరపేక్షో మునిర్దాంతో హితవాదీ విచక్షణః ।
తత్త్వనిష్ఠానసే దక్షో వినయీ చ సువేషవాన్ ॥

ఆశ్రమీ ధ్యాననిరతః సంశయచ్ఛిత్సుబుద్ధిమాన్ ।
నిత్యానుష్ఠాన సంయుక్తస్త్వాచార్యః పరికీర్తితః ॥

గురుపరంపరాక్రమముతో కూడినవాడును, నిత్యానుష్ఠాన తత్పరుడును, తనయొక్క గురునాజ్ఞయందు ప్రవర్తించువాడును, జ్ఞాన సంపన్నుడును, గురువుచే అభిషిక్తుడున్ను, కురూపుడు కానివాడును, ప్రసన్న

వదవనము కలవాడును, శాంతుడున్ను, మంచికుటుంబములో పుట్టిన వాడున్ను, అందఱికిన్ని సులభుడును, సదా ఇంద్రియనిగ్రహము కలవాడున్ను, మంత్రముయొక్కయు వేదార్థముయొక్కయు తత్త్వము నెఱిగిన వాడును, నిగ్రహానుగ్రహశక్తి గలవాడును, అపేక్షారహితుడున్ను, మౌనము కల వాడును(వేదాంత తత్త్వమును మననము చేయువాడును), దాంతుడును, పరులకు హితమును చెప్పువాడున్ను, ప్రకృతికన్న పరుడున్ను, వేదాంత తత్త్వమును వెల్లడిచేయుటలో సమర్థుడున్ను, వినయము కలవాడున్ను, వికారవేషము లేనివాడున్ను, తనయొక్క ఆశ్రమమునకు తగిన ఆచరణ కల వాడున్ను, నిరంతరము ధ్యానమందు ప్రీతి గలవాడున్ను, సంశయములను ఛేదించువాడున్ను, స్వచ్ఛమైనబుద్ధి గలవాడున్ను, నిత్యానుష్ఠానములతో కూడినవాడున్ను ఎవడు కలడో, అట్టివాడే ఆచార్యుడని చెప్పబడును ఇది గురులక్షణము

ఇక శిష్యునియొక్క లక్షణము చెప్పబడుచున్నది

శాంతో వినీత శ్శుద్ధాత్మా సర్వలక్షణ సంయుతః॥
శమాదిసాధనోపేతః శ్రద్ధావాన్ సుస్థిరాశయః ॥

శుద్ధదేహోఽన్న పానాద్యై ర్ధార్మికః శుద్ధమానసః।
దృఢవ్రత సమాచారః కృతజ్ఞః పాపభీరుకః ॥

గురుధ్యానస్తుతికథా సేవనాసక్తమానసః ।
ఏవంవిధో భవేచ్ఛిష్య స్త్వన్యథా గురుదుఃఖదః ॥

శాంతుడును, వినీతుడును, శుద్ధాత్ముడును, సర్వలక్షణములతో గూడినవాడును, శమాదిసాధనములు కలవాడును, శ్రద్ధావంతుడును, సుస్థిరమైన మనస్సు కలవాడున్ను, అన్నపానాదులచేత శుద్ధమైన దేహము కల వాడును, ధర్మబుద్ధి కలవాడున్ను, శుద్ధమైన మనస్సు కలవాడున్ను, దృఢ వ్రతమను సమాచారము కలవాడున్ను, చేసినమేలు మఱువనివాడున్ను, పాపభీతి కలవాడున్ను, గురువుయొక్క ధ్యాన కీర్తన కథా సేవనాదులయందు ఆసక్తమైన చిత్తము గలవాడున్ను - ఇట్టి స్వభావము కలవాడు శిష్యుడ

నంబడును అట్లు కానివాడు గురువునకు క్లేశము గలుగజేయువా డగును అట్లు క్లేశము కలిగించు స్వభావము లేనివాడై ప్రీతి కలుగజేయు స్వభావము కలిగియుండవలయును

యధా దీపో నివాతస్థో నిశ్చలో వాయువర్జితః ।
ప్రజ్వలన్నాశయే త్సర్వ మంధకారం మహామతే ॥

తద్వ ద్దోషవిహీనాత్మా భవత్యేవ నిరామయః ।
శ్రూయతాం భూప కైవల్యం కేవలం మలవర్జితమ్ ॥

గాలిలేని స్థలములో నుండెడు దీపమేలాగున చలింపక యుండునో, ఆలాగున హృదయాంతరాళములో సంకల్పములేని జ్ఞానదీపము ప్రజ్వలించినదై అంధకార సమూహమును నశింపచేయును ఓ మహామతే! ఆలాగున భావములన్నియు శుద్ధములైనవాని ఆత్మ ఏవిధమైన మాయామోహమును లేనిదై యుండును కైవల్య మనునది కేవలము మలరహితమగు (అజ్ఞాన రహితమగు) స్థితి యని గ్రహించదగినది

దుష్కృతం హి మనుష్యస్య సర్వ మన్నే వ్యవస్థితమ్ ।
యో యస్యాన్నం సమశ్నాతి స తస్యాశ్నాతి కిల్బిషమ్ ॥

ఎవడు ఎవనియొక్క అన్నము భుజించుచుండునో, ఆయన్నదాత యొక్క పాపముకూడ ఆయన్నముతో కలిసివచ్చుచుండును కావున అట్టి అన్నమును భుజించువాడు అన్నము ఇచ్చువానియొక్క పాపమును కూడా భుజించుచున్నట్లు తలంచవలయును అందుచే విరక్తులై బ్రహ్మనిష్ఠ చేయువారు శుద్ధాత్ము లిచ్చెడు అన్నము నీరసముగా నుండినను అమృతముగా తలంచవలయును అట్టి పుణ్యము లేనివారి అన్నము సుఖకరముగా నుండినను విషమువలె తలంచు కొనవలయును

యస్యాన్నపానపుష్టాంగః కురుతే పుణ్యసంచయమ్ ।
అన్నప్రదాతు స్తస్యార్ధం కర్తుశ్చార్ధం న సంశయః ॥

ఎవడు ఇచ్చిన అన్నపానాదులచేత శరీరము సుఖము కలిగి యుండునో, అట్టి శరీరముతో చేయబడిన తపోధ్యాన వ్రతానుష్ఠానములచే

గలిగెడు పుణ్యముయొక్క సగము ఆయన్నదాతకు చెందుచుండును అను ష్ఠానము చేసెడు తనకు సగము మాత్రమే లభించును దీనియందు సందేహము లేదు కావున జిహ్వా చాపల్యము కలిగి సుఖము నిచ్ఛించి ఎప్పుడున్ను ఇతరుల అన్నము భుజించు స్వభావము విరక్తులకు తగదు

ప్రతిగ్రహసమర్థోఽపి న ప్రసజ్యేత్ప్రతిగ్రహే ।
ప్రతిగ్రహేణ విప్రాణాం బ్రాహ్మం తేజః ప్రశామ్యతి ॥

దానమును స్వీకరించి, దానివల్ల కలిగెడు దోషమును రహిత మొనర్ప శక్తి గలవాడైనను ప్రతిగ్రహమందు ప్రసక్తి యుండగూడదు ప్రతిగ్రహమువల్ల బ్రహ్మనిష్ఠుల బ్రహ్మతేజస్సు క్షయించును

భావశుద్ధి గలుగుటకు ఉపాయమును ఈక్రింది శ్లోకము తెలుపు చున్నది

జ్ఞానలభ్యం పరం మోక్షం ప్రాహుస్తత్త్వార్థచింతకాః ।
తద్జ్ఞానం భక్తిమూలం చ భక్తిః కర్మవతాం తథా ॥

తత్త్వజ్ఞులగు మహాత్ములు సర్వోత్కృష్టమైన మోక్షము జ్ఞానముచే పొందబడుచున్నదనియు, అట్టి జ్ఞానము అనన్యమైన దైవభక్తివలన కలుగుచున్న దనియు, ఆభక్తి నిష్కామకర్మయోగానుష్ఠానమువల్ల కలుగుననియు చెప్పు చున్నారు ఈ యొక్క శ్లోకములోనే కర్మ, భక్తి, యోగ, జ్ఞానములు కలిగెడు విధము నుపదేశించడమైనది

సర్వపాపేషు నష్టేషు బుద్ధిర్భవతి నిర్మలా ।
సైవ బుద్ధిః సమాఖ్యాతా జ్ఞానశబ్దేన సూరిభిః ॥

సమస్తపాపములు నశించిన పిమ్మటనే బుద్ధి నిర్మలమగుచున్నది బ్రహ్మవేత్త లాపరిశుద్ధమగు బుద్ధితోకూడిన స్థితిని జ్ఞానమని చెప్పుచున్నారే గాని వేరు గాదు

అనుభూతేరభావేఽపి బ్రహ్మాస్మీత్యేవ చింత్యతామ్ ।
అప్యసత్ప్రాప్యతే ధ్యానాన్నిత్యాప్తం బ్రహ్మ కిం పునః ॥

మఱియు బ్రహ్మానుభవము (అనగా అపరోక్షజ్ఞానము) లేక పోయినను 'అహం బ్రహ్మాస్మి' అని ధ్యానించవలయును బ్రహ్మవిష్ణురుద్రాదుల

యుపాసన లవల్ల(ఆదేవతలరూపముతో) ఉపాసకుడు పూర్వము లేని ఆయా లోకములను పొందుచుండగా, స్వస్వరూపముచేత సర్వదా పొందబడి యుండెడి సర్వాత్మక బ్రహ్మమును ధ్యానమువలన ఉపాసకుడు పొందు చున్నాడని వేఱుగా చెప్పవలసిన పనిలేదని ఈ వాక్యము చెప్పుచున్నది

భావనయొక్క విశేషమును ఈక్రింది శ్లోకము తెలుపుచున్నది

భావితం తీవ్రవేగేన యద్వస్తు నిశ్చయాత్మనా ।
పుమాంస్తద్ధి భవేచ్ఛీఘ్రం జ్ఞేయం భ్రమరకీటవత్ ॥

నిశ్చయబుద్ధి గలవానిచేత ఏ వస్తువు తీవ్రవేగముచేత (రేయింబవళ్ళు) భావింపబడుచున్నదో, ఆజ్ఞేయవస్తువుగా (అపరోక్షముగా) తెలియదగిన బ్రహ్మముగా నాతడు భ్రమరకీట న్యాయమున బ్రహ్మ మగుచున్నాడు

జీవన్ముక్తిస్తు తద్విద్యాత్పూర్వోపాధిగుణాం స్త్యజేత్ ।
స సచ్చిదాది ధర్మత్వా ద్భజే భ్రమరకీటవత్ ॥

లోకమందు పురుగును తుమ్మెద తీసికొనివచ్చి చేయవలసిన ప్రకారముగా చేసిన మాత్రముచేతనే ఆ పురుగు భ్రమరముయొక్క ఓంకారధ్వనిని విని దానియందు లగ్నమైన మనస్సు కలదగుటచే తనయందు పూర్వముండిన కీటక ధర్మమును వదలి భ్రమరత్వమును పొందినట్లు, బ్రహ్మముయొక్క తీవ్ర భావనచే (ధ్యాన, శ్రవణ, మనన నిదిధ్యాసములచే) జీవధర్మమును వదలి పర బ్రహ్మ సాక్షాత్కారస్థితిని సాధకులు పొందుచున్నారు

యథాఽగాధనిధేర్లబ్ధౌ నోపాయః ఖననం వినా ।
మల్లాభేఽపి తథా స్వాత్మచింతాం ముక్త్వా న చాపరః ॥

మిక్కిలి లోతునందు స్థాపించబడిన సువర్ణనిధిని బొందుటయందు త్రవ్వుట తప్ప మఱియొక యుపాయము లేనట్లు పరబ్రహ్మమగు నన్ను బొందుట యందును తన (ఆత్మ) స్వరూపమును ధ్యానించుట తప్ప మఱి యొక యుపాయ మెద్దియును లేదను భగవద్వచనము కలదని తెలియందగినది

వివిక్తదేశ ఆసీనో విరాగో విజితేంద్రియః ।
భావయే దేకమాత్మానం తమనంత మనన్యధీః ॥

నిర్జనప్రదేశ మందుండువాడై, సమస్త ఆశలను వర్జించి ఇంద్రియములను వాటి వ్యాపారమందు ప్రవేశింపకుండ అణచి, మనస్సును చలింపకుండ ఆత్మయందుంచి, ఆత్మయందు పరబ్రహ్మభావన చేసికొని ధ్యానించువాడు బ్రహ్మప్రాప్తి నొందగలుగును

ఏవం నిరంతరకృతా బ్రహ్మైవాస్మీతి వాసనా ।
హరత్యవిద్యావిక్షేపాన్ రోగానివ రసాయనమ్ ॥

సర్వోత్తమమైన దివ్యరసాయనమును సేవించుటవల్ల రోగములు నశించునట్లు, ఎల్లప్పుడు బ్రహ్మాత్మైక్యానుసంధానభావన చేయుటవల్ల కలిగిన ఆత్మసంస్కార రూపమైన సద్వాసన ఆవరణ విక్షేప శక్త్యాత్మకమైన అవిద్యను బొత్తిగా పోగొట్టి జీవన్ముక్తిని కలుగజేయును

యల్లాభాన్నాపరో లాభో యత్సుఖాన్నాపరం సుఖమ్ ।
యద్జ్ఞానాన్నాపరం జ్ఞానం తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥

ఏ జ్ఞానలాభమునకన్న వేఱు లాభము అధికముగా లేదో, ఏ ఆత్మసుఖమునకన్న వేఱుసుఖము గొప్పది లేదో, ఏ ఆత్మజ్ఞానమునకన్న మించిన మఱియొక తెలిసికొనదగిన జ్ఞానము లేదో అదియే బ్రహ్మమని నిశ్చయించి తెలిసికొనవలయును

★★★★

భావాతీతము

జ్ఞానాయ జ్ఞానగమ్యాయ సర్వజ్ఞానైకహేతవే!
జ్ఞానేశ్వరాయ యజ్ఞాయ జ్ఞాత్రే విజ్ఞానసంపదే!!

భావాతీతమనియు, ద్వంద్వాతీత మనియు దీనికి పేరు గలదు కావుననే గురుధ్యానమున 'భావాతీత' మనియు, పారాంతరమున 'ద్వంద్వాతీతం, విశ్వాతీత' మనియు నున్నది 'భావాతీతం త్రిగుణ రహితం' అనియు ఒకే యర్థమునే తెలుపుచున్నది దీనిని గుఱించియే యత్తరగీతయం దిట్లు చెప్పబడినది

అదృశ్యే భావనా నాస్తి దృశ్య మేతద్వినశ్యతి ।
అవర్ణమస్వరం బ్రహ్మ కథం ధ్యాయన్తి యోగినః ॥

కనబడని పదార్థమందు ధ్యానము కలుగదు కనబడెడు వస్తువు నశించును గదా! అట్లైన వర్ణరూపరహితంబై శబ్దాదుల కగోచరంబై వెలయు బ్రహ్మమును యోగు లెవ్విధమున ధ్యానింపగలరు?

దీని తాత్పర్యమేమన అభావమునందు భావనచేయుటకు సాధ్యము కాదు భావమునే భావన చేయవలసియుండును, భావమునకు లోనైనది నశించును ఇట్టి ద్వంద్వవిధ దోషములలో ధ్యానయోగులు ఎట్లు భగవానుని లేక ఆత్మను లేక ఈశ్వరుని ధ్యానింపగలరని ప్రశ్నయొకటి యున్నది ఈవిషయమై తరువాత మనము తెలిసికొనవచ్చును ఇపుడు భావాతీతమును గఱించి తెలిసికొనదగిన విషయములలోనికి ప్రవేశించెదము

ఈభావాతీత పదమునకు నాలుగు విధములగు అర్థములు కలువు 1 ముముక్షువైనను, భక్తుడైనను తాను దేనిని ధ్యానమున చేయుచు వచ్చెనో అది సాకారముగాని, నిరాకారముగాని దానికన్న అన్యము ఇక ధ్యానము చేయదగినది లేనేలేదని నిశ్చయము కలిగియుండుట ఇది భక్తియోగమునకున్ను, ధ్యానయోగమునకున్ను, జ్ఞానయోగమునకున్ను సంబంధించియుండును

అది వారివారి హితము ననుసరించి యుండునదే

2 తాను దేనిని చిరకాలమునుండి ధ్యానించి ఏది ధ్యేయమని నిశ్చయించు కొనియుండునో దానియొక్క అంత్యమువరకు చేరుట అనగా దానిని సాక్షాత్కరించుకొనుట ఇది పైజెప్పిన దానికన్న అధికమైనది ఇక ధ్యానము చేయవలసిన పనిలేదు మన యనుష్ఠానము పూర్తియైనది మనకు శోకశాంతియు, ఆనందప్రాప్తియు గలిగినది ధన్యుడనైతిని, అని తృప్తి కలిగియుండు టయు భావాతీత మనబడును

3 భావములు మనస్సుయొక్కయు లేక బుద్ధియొక్కయు వృత్తులు మనోవాక్కాయములకు బ్రహ్మము, ఈశ్వరుడు, ఆత్మయు అందునవి కావు మఱియు మనోబుద్ధ్యాదులు జడములు ఇవి చైతన్యాత్మను భావన చేయ జాలవు అంతేగాక మనోబుద్ధ్యాదుల భావనల ఎఱుగుచుండెడు ఆత్మ మనోబుద్ధ్యాదులకు సాక్షిగా నుండి మనోబుద్ధ్యాదుల భావనలను తెలిసికొను చుండునది అట్టి యారూఢజ్ఞానము కలుగుటయే భావాతీత మనబడును ఇదిపై జెప్పిన రెండింటికన్న గొప్పది

4 దీనికన్నను గొప్పపదవి మఱియొకటి కలదు అది సర్వోత్కృష్టము అది పరమకాష్ఠయని చెప్పవచ్చును భావించుటకు తనకన్న అన్యమగు వస్తువు మఱియొకటి యుండవలయును అట్టి రెండవ వస్తువు మఱియొకటి కన్పించుట లేదు అంతయునొకే యాత్మమయముగానే కన్పించు చున్నది అంతయు నొకే ఈశ్వరమయముగాను, బ్రహ్మమయముగాను నుండగా ఏది దేనిని భావించును? భావించునపుడు భావించువాడు, భావింపదగినది, భావము అను మూడున్ను కలిగియుండును ఇది త్రిపుటితో గూడినది అట్టి త్రిపుటిసహితమైనది ఏకైకమగు బ్రహ్మము లేక దైవమెట్లు కాగలుగును?

ఈత్రిపుటినే ధ్యాతయనియు, ధ్యేయమనియు, ధ్యానమనియు జెప్పుదురు ఆలాగున ద్రష్టయనియు, దృశ్యమనియు, దర్శనమనియు పేర్లుగలవు అట్లే జ్ఞాతయనియు, జ్ఞేయమనియు, జ్ఞానమనియు చెప్పుటగలదు ఇవన్నియు త్రిపుటికి లోబడినవే భావాతీతమగు పదవి సామాన్యమైనది కాదు

కేవలము జీవన్ముక్తులు, విదేహముక్తులు విహరించెడు అతి దివ్యలోకములో గల అతి దివ్యపదవియని గ్రహించుకొనవలయును శ్రీబుద్ధదేవుడు దుఃఖము ఏ మాత్రమైన లేనిదనియు, నిరతిశయసుఖ ఘనీభూతమనియు బోధించిన నిర్వాణ పదమిదియే ఆలాగున శ్రీశంకరు లుపదేశించిన 'ఏకమేవాద్వితీయం' అను బ్రహ్మపదమున్ను ఇదేయని గ్రహించదగినది చిరకాలము ధ్యానము చేతను, మననినిదిధ్యాసములచేతను మాత్రమే ఈ స్థానములోనికి జీవులు చేరగల్గుదురు ఇదే జగజ్జీవరహితమగు ఈశ్వరనిలయము ఇచట జీవజగదీశ్వరులు ఏకమగు కేవలేశ్వర తత్త్వముమాత్రమే మిగిలియుండును ఇది నదులు కాలువలు అన్నియు సముద్రమున జేరునపుడు నదులు కాలువలును నామరూపములు లేనివై యొకే మహాసముద్రముగా కన్పించునట్లుండును బుద్బుదములు, కల్లోలములు శాంతినొందిన ప్రశాంతమహాసముద్రమువలె ఆస్థితి గలిగియుండును

యథా నద్యః స్యందమానాః సముద్రేఽ
స్తం గచ్ఛన్తి నామరూపే విహాయ ।
తథా విద్వాన్నామరూపా ద్విముక్తః
పరాత్పరం పురుష ముపైతి దివ్యమ్ ॥

ఈయుపనిషద్వాక్యము పైజెప్పిన దానిని బోధించుచున్నది ఏలాగున నదులన్నియు సముద్రమునకు ప్రాపించునపుడు తమ నామరూపములను విడిచి ఒకే మహాజల మగుచుండునో ఆలాగున బ్రహ్మవేత్త తనయొక్క నామ రూపోపాధులను త్యజించి దివ్యమైన పరాత్పరుడగు పరబ్రహ్మముయొక్క అవస్థను పొందుచున్నాడు శిల్పి ఏర్పఱచిన పలురకములగు విగ్రహము లనన్నిటిని మఱల గఱగించిన ఒకే లోహమయ మగునట్లు కేవలమగు ఆస్థితిలో జగజ్జీవులు ప్రత్యేకముగా స్ఫురింపవు అనేక రంగులతో గూడిన వస్త్రముల యొక్క రంగులను తీసివేసి దారములన్నిటిని దూదిగా చేసిన ఏలాగున నొకే విధముగా నుండునో, ఆలాగున ప్రకృతియను చిత్రకారుని కృత్రిమము లన్నియు నశించిన ఒకే ఈశ్వరమయముగానే యుండును గీత మూడవ అధ్యాయాంతమున ద్వంద్వాతీతమగు జ్ఞేయమును పొందెడు విధానము తెలుపబడి

యున్నది

ఇంద్రియాణి పరాణ్యాహు రిన్ద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరా బుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః ॥

లోకముకన్న దేహము పరమనియు, దేహమునకన్న శ్రోత్రాదీంద్రియములు పరములనియు, ఇంద్రియములకంటె మనస్సు పరమైనదనియు, సంకల్ప వికల్పాత్మకమగు మనసుకంటె నిశ్చయాత్మకమైన బుద్ధి పరమనియు జ్ఞానులు చెప్పుచున్నారు ఎవడు బుద్ధికంటె పరుడుగా సాక్షిగా నున్నాడో, వాడే ఆత్మయని తెలిసికొనవలసినది వానికన్న పరమైనది మఱియొకటి లేదు సర్వమునకును సాక్షియు, ఆధారభూతుడు నగు ఆత్మయు అదే యని తెలిసికొనుము

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా।
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥

ఓ అర్జునా! వెనుకటి శ్లోకమందు చెప్పబడిన ప్రకారముగా బుద్ధికంటె వ్యతిరిక్తుడైన వానినిగా అనగా పరుడైనవానినిగా ఆత్మను (అనగా తన్ను) తెలిసికొని నిశ్చయాత్మకమగు బుద్ధిచేత మనస్సును నిశ్చలముచేసి, జయింపనసాధ్యమైనదియు, కామమే స్వరూపముగా గలదియునగు అజ్ఞానమను శత్రువును నశింపజేయుము ఈయర్థమే కఠోపనిషత్తునందు నచికేతుడను ఋషి కుమారునకు యమధర్మరాజు బోధించిన యాత్మతత్త్వజ్ఞానమున గూడ గలదు

ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః ।
మనసస్తు పరా బుద్ధి ర్బుద్ధేరాత్మా మహాన్పరః ॥

లోకమునకన్న సూక్ష్మమైనది దేహము (పరము), దేహమున కన్న కర్మేంద్రియములు సూక్ష్మములు (పరములు), కర్మేంద్రియముల కన్న జ్ఞానేంద్రియములు సూక్ష్మములు (పరములు), జ్ఞానేంద్రియముల కన్న శబ్దాది విషయములు సూక్ష్మములు (పరములు), శబ్దాదివిషయముల కన్న మనస్సు సూక్ష్మమైనది(పరమైనది), మనస్సుకంటె నిశ్చయాత్మకమగు బుద్ధి సూక్ష్మమైనది(పరమైనది), బుద్ధికంటె సర్వమహత్త్వమగు హిరణ్యగర్భాఖ్య తత్త్వము

సూక్ష్మమైనది (పరమైనది)

మహతః పరమవ్యక్త మవ్యక్తా త్పురుషః పరః ।

పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సా పరా గతిః ॥

మహత్తత్త్వముకంటె అవ్యక్తము మహత్తరమైనది ఆయవ్యక్తము కంటె పురుషుడు మహత్తరుడు పురుషునికంటె మహత్తరమైనది కొంచెమైనను లేదు అదియే అంత్యమైనది అదియే సర్వోత్కృష్టమైనది ఈవాక్యములో బుద్ధ్యుపహితతత్త్వమే మహత్తత్త్వమనియు, అవ్యక్తమనియు చెప్పినదిగా గ్రహించవలయును బుద్ధితత్త్వమునే ప్రధానమనియు, ప్రకృతి యనియు కొందఱు చెప్పుదురు అంతేగాని మహత్తత్త్వము, అవ్యక్తము ఒక దానికొకటి భిన్నమని తలంచ నక్కఱ లేదు ఈతత్త్వమును పురస్కరించినవే శ్రీగీతాచార్యులగు శ్రీకృష్ణభగవాను లుపదేశించిన పైజెప్పిన రెండు శ్లోకములు అని గ్రహించుకొనవలయును మఱియు ఈయర్థమే ఈయుపనిషత్తునందు విశదముగా తెలుపబడియున్నది

అవ్యక్తాత్తు పరః పురుషో వ్యాపకోఽలిఙ్గ ఏవ చ ।

యద్జ్ఞాత్వా ముచ్యతే జన్తురమృతత్వం చ గచ్ఛతి ॥

మానవుడు ఏయాత్మపురుషుని తెలిసికొని అవిద్యా విలసితమగు సంసారబంధము నుండి వదలబడుచున్నాడో, అమృతత్వమునున్ను పొందుచున్నాడో, అట్టి పురుషుడు అవ్యక్తముకంటె శ్రేష్ఠుడు, సర్వవ్యాపకుడు, లింగరహితుడును అగుచున్నాడు

ఇంద్రియాణాం పృథగ్భావముదయాస్తమయౌ చ యత్ ।

పృథగుత్పద్యమానానాం మత్వా ధీరో న శోచతి ॥

జ్ఞాని యగువాడు వేఱువేరుగా పుట్టియున్న ఇంద్రియములయొక్క భిన్నభావమును ఉత్పత్తి వినాశనములను తెలిసికొని దుఃఖింపడు ఇదే భావాతీతమనియు, ద్వంద్వాతీతమనియు, ఇంద్రియాతీతమనియు చెప్పెడు స్థితియని గ్రహించవలయును ఇంద్రియములయొక్కయు, విషయముల యొక్కయు ఉత్పత్తిస్థితి లయములను తెలిసికొనెడి యాత్మ ఈమూడింటికి విలక్షణముగా నుండి సాక్షిరూపముగా చూచుచుండును. అందువల్ల తాను

నిత్యశుద్ధ స్వయంప్రకాశ స్వరూపుడుగా నున్నవాడని తలంచి హర్ష శోకములను ద్వంద్వములను పొందకయుండును

ద్వంద్వాతీతస్థితిని గుఱించి తెలియందగిన భాగము నిప్పుడు తెలిపె దను ఈద్వంద్వమునే సంసారచక్రమనియు, సంసారమనియు, సంసార భ్రాంతి యనియు, సంసారబంధమనియు చెప్పుదురు దీనికే కాలచక్ర మనియు, కర్మబంధమనియు, భవబంధమనియు పేర్లు గలవు దీనియందు బంధము గలిగియుండువఱకు ఘటీయంత్రమేలా గున క్రిందికిన్ని పైకిన్ని పోవు చుండునో, అలాగున ఈజీవుడు ఇహలోకము నుండి పరలోకమునకున్ను, పరలోకమునుండి ఇహలోకమునకున్ను జననమరణ రూపముగా నిలుకడ గలుగక వచ్చిపోవుచుండును యంత్రపు టుయ్యేలలో గూర్చుండు వారేలాగున క్రిందనుండి పైకిని పైభాగమునుండి క్రిందిభాగమునకు వేగముగా తిరుగు చుందురో, అలాగుననే కాలచక్రముయొక్క గతియు గలిగియున్నదని గ్రహించ దగినది చక్రముయొక్క గమనము నిలిచిన మాత్రముననే దానినుండి దిగుటకు సాధ్యమగును అద్దానినుండి దిగినవాడు ఏలాగున హాయిగ గూర్చుండునో, సంసారచక్రమునుండి విముక్తి బొందిన జీవుడున్ను ఆ లాగుననే నిత్యశాంతియగు దైవసుఖమును పొందుచుండును ఆ ద్వంద్వ ములు దినరాత్రులవలెను, శుక్లపక్ష కృష్ణపక్షములవలెను, ఎండకాల వాన కాలముల వలెను సదా సుఖదుఃఖ రూపముగా తిరుగుచుండును

ఇట్టి ద్వంద్వములో నిఱికికొనుటయే సంసారబంధముగాని అట్లు గాక గృహముగాని, గృహసంబంధముగాని , ఇతరములగు ధర్మప్రవర్తనలు గాని సంసార బంధములు గావు ఈద్వంద్వములయందు చిక్కుకొననివారు సంసారములో నుండినను, లేక ధర్మకార్యప్రవర్తకులై యుండినను వారు సన్న్యాసులే, అలాగున బాహ్యసన్న్యాసులైనను ఈద్వంద్వములో తగుల్కొనిన వారు సంసారులే

దీనినుండి విమోచనము కలుగుట సామాన్యము కాదు చింతకాయ పండిన మాత్రమే తోలునుండి విడుదల నొందగలుగును కొబ్బరికాయలో గల జలము నశించిన మాత్రమే చిప్పనుండి విడుదలపొంది 'కురిడీ'యగును

ఆలాగున అంతఃకరణములోగల వాసనాజలము నశించినమాత్రమే జీవుడు ప్రకృతినుండి విముక్తి నొందగలుగును

అపుడు గృహములో నివసించువాడు గృహమునకున్ను, దానిలోగల సమస్త సామానులకున్ను తాను ఏలాగున విలక్షణుడుగా నుంటున్నాడో ఆలాగున శరీరత్రయమునకున్ను, శరీరత్రయ గుణములకున్ను తాను విలక్షణుడుగా నుంటున్నానను జ్ఞానము గలుగును అపుడు భవబంధమునుండి విముక్తి గలిగినదని తెలిసికొనందగును అపుడు బోనునుండి బైటపడిన సింహము చందంబున ఈ యాత్మ స్వేచ్ఛను, గంభీరావస్థను పొందు చుండును అత్తఱి ఘటస్థమగు దీపము ఘటావరణచే కన్పడకపోయినను ఘటము యొక్క భేదనముచే ఎట్లు స్వయంప్రకాశమైయుండునో, ఆలాగున ఆవరణము నశించిన జీవుడుగూడ స్వప్రకాశుడై యున్నట్లు స్వయముగా గోచరించును మఱియు అది ఎటువంటిదనగా, గ్రహణకాలములో సూర్య చంద్రులు రాహుకేతువులచే గ్రసింపబడియుండగా ఎట్లు ప్రకాశశూన్యులై యుందురో, గ్రహణవిమోచన కాలమున అతులమగు దివ్యప్రకాశకులై శోభింతురో అట్లు అజ్ఞానగ్రహణ మనెడు ద్వంద్వముల నుండి విముక్తిబొందిన జీవులున్ను నిరావరణ సూర్యచంద్రులవలె ప్రకాశవంతులై శోభింతురు గీత-

యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।
తే ద్వంద్వమోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతాః ॥

చిత్తశుద్ధికి కారణములగు సత్కర్మముల ఈశ్వరార్పణబుద్ధితో నాచరించిన ఏజనులయొక్క అజ్ఞానమైతే(పాపమైతే) నాశమును పొందినదో, ఆజనులు సుఖదుఃఖాదులైన ద్వంద్వహేతువగు కర్మమునుండి పిడుపబడిన వారై, దృఢమైన నియమము గలవారలై, పరమాత్మ ధ్యానమందు నిశ్చలురై యుందురు

దీనివల్ల దైవార్పిత భావముతో సత్కర్మపరులై యుండుటయే ద్వంద్వ విము క్తికి కారణమని శ్రీభగవంతు డుపదేశించిన వాక్యమును ముముక్షువులు బాగుగ జ్ఞాపకము చేసికొనవలయును ఏలన ఈ కాలమున పుణ్యకర్మలు, భగవద్భక్తి గొప్పవి కావనియు, తత్త్వవిచారమే గొప్పదనియు చెప్పుచూ

ద్వంద్వములో తగుల్కొని తిరుగుచుండువా రనేకులు గలరు అట్టివారివలలో చిక్కికొనక యుండవలయునని భగవంతుడనుగ్రహించిన యుపదేశము మఱువకుందురుగాక!

ఆలాగుననే 'సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ' సుఖ దుఃఖములను, లాభాలాభములను, జయాజయములను సమానముగా చూడవలయునని యుపదేశించుచున్నారు ఇదే ద్వంద్వాతీతమునకు లక్షణ మగును ఇట్టిస్థితి తమకు గలిగినదా యని ప్రతివారు తమయాత్మలో చూచు కొనవలయును సుఖము వచ్చినపుడు సంతోషమున్ను, దుఃఖము వచ్చినపుడు క్లేశమున్ను, లాభము వచ్చినపు డానందమున్ను, నష్టము వచ్చినపుడు దుఃఖమున్ను, జయము గలిగినపుడు హర్షమున్ను, అపజయము గల్గినపుడు శోకమున్ను, బహుమానము వచ్చినపుడు ప్రీతియును, అవమానము వచ్చిన పుడు అప్రీతియును గలిగియుండుట ద్వంద్వముతో గూడినట్లే తలచవల యును ఈలాగున స్తుతినిందలలోను రుచి అరుచులలోను జ్ఞాపకము చేసికొనవలయును దీనిని తెలిసికొనుటకే ఆత్మవిచారణ చేయవలయునని చెప్పు రహస్యమేగాని; ఇట్టి ద్వంద్వములో నుండి యాత్మవిచారణ చేయుట కన్న శ్రీకృష్ణభగవాను డుపదేశించినట్లు సత్కర్మలను జేసికొని భగవద్భక్తి గలిగి యుండుటయే మంచిది మఱియు పూజ్యాపూజ్యతలను, శీతోష్ణములను, జననమరణములను, శుద్ధాశుద్ధములను, శత్రుమిత్రులను, స్త్రీపురుషులను ఈ మొదలగు సకల ద్వంద్వములను సమానముగా చూచుకొను స్థితి తనకు గలిగినదా యని ఆత్మలో విచారణ సలుపవలయును అది అంత సులభమని తలంచరాదు

నిజమైన ద్వంద్వాతీతస్థితి ఈ క్రింద వ్రాసినలాగున నుండునని ఉత్కృష్ట శాస్త్ర ముద్బోధించుచున్నది సముద్రముయొక్క ఉపరిభాగములోగల పడవలు, అలలు చలనముతో గూడియుండినను సముద్రాగాధ భాగములో గల గొప్పరాతి గుండు ఎట్లు నిశ్చలముగా నుండునో, ఆలాగున ద్వంద్వా తీతుడు దృశ్యాదులగు వస్తువులచే చలింపకయుండును మఱియు సముద్ర ములో నుండు పడవ అలలచే కదలుచుండినను, ఒడ్డు చేర్చియుండు పడవ

ఏలాగున నిశ్చలముగాను, గంభీరముగాను, నుండునో ఆలాగున ద్వంద్వ ములను దాటిన ప్రకృతికి పరమైన స్థితిని బొందిన పురుషుడు ఇంద్రియములు, మనస్సు మొదలగువాని యొక్క చపలతకు లోబడకయుండును ఈద్వంద్వములగు మనస్సుయొక్క చంచలత్వమునే సంసారమని గ్రహించ నగును అది లేనివాడే సంసారము యొక్క తీరమును చేరినవాడగును. మనస్సు యొక్కద్వంద్వమగు వికృతిచే వికారము పొందేవాడు బాహ్య సంసారమును విడిచిన వాడయ్యు అంతరంగమగు సంసారమును తరించిన వాడు గాడు ఇదియే దీనియొక్క గుఱుతు మంచుచేగాని, వానచేగాని, గాలిచే గాని, ఎండచేగాని ఏలాగున పర్వతము చలింపకయుండునో అదేరీతిగా దృశ్యములగు ద్వంద్వములచే చలనము గలుగనపుడే ద్వంద్వాతీతమగు ఆరూఢస్థితి సిద్ధించినట్లు నిశ్చయించుకొనవలయును గీతాచార్యుండు ఈ తత్త్వమునే యుపదేశించియున్నాడు–

యదా హి చేన్ద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।
సర్వ సంకల్ప సన్న్యాసీ యోగారూఢ స్తదోచ్యతే ॥

ఎప్పుడు శబ్దాది విషయములయందును కామ్యకర్మములయందును ఆసక్తి గలుగదో, అపుడు సర్వసంకల్పములను విడిచిన యోగారూఢస్థితి బొందిన వాడని చెప్పబడుచున్నాడు మంచి చేవగల వృక్షమేలాగున ఎంత గాలికైనను పతనము నొందక యుండునో, దుర్బల వృక్షములు తుపాను వచ్చినపుడు ఎట్లు పడిపోవునో, ఆలాగున ఇంద్రియాది వృత్తులగు ద్వంద్వములచే చలింపక సుస్థిరత గలిగియుండుటయే స్థితప్రజ్ఞుని లక్షణమని గీతాచార్యులు ద్వితీయాధ్యాయమున ఉపదేశించిరి మలినములేని సువర్ణమైన ఏలాగున ఆమ్లనింబరసాదులచే వికారము నొందకయుండునో, మలినమైన బంగారమైనచో ఎట్లు చిలుముపట్టునో ఆలాగున ప్రకృతి నశించిన శుద్ధాత్ముడైనచో మహితాత్ముడు దృశ్యవిషయాదులగు ద్వంద్వములవల్ల మార్పు బొందక యుండును ఇట్టి స్థితి తమకు గలిగియున్నదా? లేదా యని పదేపదే ఆత్మలో విచారణ సల్పుచుండవలెను ఇదే ఆత్మవిచారముయొక్క ప్రయోజనమగును అట్లు కానిది ఆత్మవిచారము గాదు

అంతస్సంగం బహిస్సంగ మాత్మసంగం పరిత్యజేత్ ।
సర్వసంగనివృత్తాత్మా పశ్యేదాత్మాన మాత్మని ॥

ఈ శ్లోకమువల్ల మూడువిధములగు బంధములున్ను విడువ వలయునని తెలుపడమైనది 1 బాహ్యప్రపంచసంగము 2 దేహేంద్రియాదుల సంబంధమున్ను 3 అనాత్మబుద్ధ్యాదులలో ఆత్మభావముగల సంబంధము వీనినే లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన యని చెప్పుదురు ఇప్పటి వారిలో చాలమందిన్ని బాహ్యప్రపంచమే సంసారబంధ మని తలంచి విడుచుచున్నారు దేహేంద్రియములతో గూడిన అభిమానమునుగాని, అనాత్మ యగు అవిద్యా సంబంధముగాని విడుచుటకు యత్నించుట లేదు అందువల్లనే పూర్వీక ఋషుల యొక్క పూజ్యమగు పదవిని పొందజాలకున్నారు

బాహ్యప్రపంచ బంధము నొకదానిని విడుచుటవల్ల స్థూల ప్రతి బంధము నశించినదని తలంచవలయును ఇక సూక్ష్మప్రతిబంధమున్ను మూలా విద్య యగు కారణప్రతిబంధమున్ను మిగలియున్నవి అరటి, కంద పెండలము, చేమ, పసుపు మొదలుగు చెట్లను భూమికి సమముగా గోసివేసినను, వానియొక్క మూలమగు దుంపలు భూమిలోపల నుండుటచే మరల అవి చిగిర్చి మామూలు చెట్లగునట్లు మూలావిద్యయగు అజ్ఞానమును హృదయగుహనుండి తీసివేయనిచో జనన మరణములకు హేతవగు స్థితి కలుగుట నిక్కము బాహ్యత్యాగముచే ప్రస్తుతము కొంత శాంతి గలిగినను, అది శాశ్వతమగు పరమశాంతి యని తలంచ వలదు

జ్ఞానేన దీపితే దేహే బుద్ధిః బ్రహ్మసమన్వితా ।
బ్రహ్మజ్ఞానాగ్నినా విద్వాన్నిర్దహేత్కర్మబంధనమ్ ॥

ఆత్మజ్ఞానముగలవాడు ఆత్మజ్ఞానముచేత దేహము ప్రకాశింప బడుచుండగా, నిశ్చయాత్మకమైన బుద్ధి బ్రహ్మముతోగూడిన దగుచుండగను, బ్రహ్మజ్ఞాన మనెడి నిప్పుచేత అజ్ఞాన మనెడి కర్మపాశమును దహింపజేయు చున్నాడు ఇదే ధ్యానముయొక్క మహిమయని గ్రహించవలయును జ్వలించు చుండెడి అగ్నిలో వేసిన వస్తువులన్నిటిని అగ్ని తనయొక్క స్వరూపముగా జేయుచున్నట్లు ధ్యానబలముగలవానికి బుద్ధ్యంతదేహాదీంద్రియము లీశ్వర

మయముగానే గన్పించును

ప్రాప్తే జ్ఞానేన విజ్ఞానే జ్ఞేయే చ హృది సంస్థితే ।
లబ్ధశాన్తి పదే జీవే న యోగో నైవ ధారణా ॥

జ్ఞానముచేత పరమాత్మజ్ఞానము పొందబడిన దగుచుండగను, జ్ఞేయము(పర బ్రహ్మము) హృదయమునందు ప్రకాశించుచుండగను, జీవుడు శాంతి పదమును బొందుచుండగను యోగము లేదు, ధారణయున్ను లేదు వియోగము గలిగియుండువఱకు మాత్రమే యోగముండును ధ్యేయా కారము గలు గువఱకే ధారణ యుండును ఇది ధ్యేయైకస్థితిని తెలుపుచున్నది ఇదియే భావాతీతము

యథా జలం జలే క్షిప్తం క్షీరే క్షీరం ఘృతే ఘృతమ్ ।
అవిశేషో భవేత్తద్వజ్జీవాత్మ పరమాత్మనోః ॥

జలమందు జలమును, పాలునందు పాలను, నేయియందు నేయియు గలుపగా నెటుల భేదము కనుపడక ఏకీభవించునో ఆ విధంబుననే అవిద్యో పాధి యుక్తుండగు జీవాత్మకును పరమాత్మకును భేదంబు గానంబడినను, ఆజీవునకు ఆయవిద్య సత్సంస్కార విశేషంబుచే నివర్తియైనపుడు పరమాత్మ తోడ ఏకత్వము సిద్ధించుచున్నది అనగా తానే పరమాత్మ యగుచున్నాడు

తిలమధ్యే యథా తైలం క్షీరమధ్యే యథా ఘృతమ్ ।
పుష్పమధ్యే యథా గంధః ఫలమధ్యే యథా రసః ॥
కాష్ఠాగ్నివత్ప్రకాశేత ఆకాశే వాయువచ్చరేత్ ॥

నువ్వులయందు నూనెవలెను, పాలయందు నేయివలెను, పుష్పము నందు వాసనవలెను, ఫలమునందు రసమువలెను, కట్టెయందు నిప్పువలెను, ఆకసంబునందు గాలివలెను అన్నమయాది పంచకోశదేహమునందు ఆత్మ వ్యాపకమై యుండియు చలించుచున్నాడు తిలమును, క్షీరమును, పుష్పమును, చేయవలసిన క్రియలు చేయునపుడు అదివఱలో గన్పడని తైలము, ఘృతము, సుగంధము, రసము అగ్ని మొదలైనవి ఎట్లు కన్పడుచున్నవో ఆలాగున ఆత్మా నాత్మ విచారణములచేతను, చిత్తైకాగ్రత గల ధ్యానముచేతను కన్పడని ఆత్మను అనగా దైవమును గనుగొనగలరు

ఈ వాక్యము లన్నియు ఉత్తరగీతయందు భగవాను లుపదేశించి యున్నారు భగవద్గీతయందు అంతఃకరణశుద్ధికి తగిన నిష్కామకర్మ యోగము నుపదేశించి అంతఃకరణశుద్ధి గలిగిన పిమ్మట ఆత్మచింతనయు ధ్యాన యోగమున్ను చేయవలసియుండుటచే ఆపరమతత్త్వమును, భగవద్గీత యగు పూర్వగీతను బోధించిన తరువాత ఉపదేశించిన దగుటచే దీనికి ఉత్తర గీతయని పేరు వచ్చినది

దృశ్యములనుండి భావములనుండి ఆత్మకు ఎట్లు విముక్తి గలుగునో ఆసంగతి తెలిపెద కన్పించున వన్నియు దృశ్యములు కావా? వానిని చూచు చుండెడి యాత్మ దృక్కుగ నుంటున్నాడు గదా! అట్టి యాత్మ నిత్యసుఖస్వరూపుడు గదా? కావున దృశ్యముతో దృక్కునకు గల సంబంధమే బంధమగును

ఒక 'ఫ్యాక్టరీ' లోవెళ్ళి చూచిన ఒక చక్రము తిరుగుచుండును దానితో మఱియొక చక్రమునకు ఒకపట్ట తగిలించియుండిన రెండుచక్రములును తిరుగుచుండునట్లు గోచరించును అన్ని యంత్రములును ఈలాగుననే యుండును ఆపట్టను తొలగించిన ఆయంత్రములు నిశ్చలముగా నుండునట్లు గోచరించును ఇదే సంసారచక్రముయొక్క రహస్యము ప్రకృతి ఎల్లప్పుడును వికృతి స్వభావము గలిగి తిరుగుచుండును దానితో మనస్సునకు గల సంబంధమే బంధమగును అది లేకుండునట్లు చేయుటయే విముక్తి యనం బడును ఒక యంత్రాలయమునకు వెళ్ళిచూచిన ఈ సంగతులన్నియు స్పష్టముగా గనదగును ఇట్టి ద్వంద్వములోనికి దిగివచ్చుటయే సంసార చక్రములోనికి దిగుట యగును ఈలాటి ద్వంద్వములనుండి మనస్సును మరలించు కొనుటయే సంసారసాగరము నుండి సంసార యంత్రమునుండి పైకి ఎక్కుట యగును ఇదియే దీనిలోనుండు కీలకము అది ఎట్లు సాధింప వచ్చునని శంకింప బనిలేదు శ్రీకృష్ణపరమాత్మ ఉపాయమును వచించి యున్నారు

మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽ నిత్యాస్తాం స్తితిక్షస్వ భారత ॥

ఓ అర్జునా! పంచతన్మాత్రలవలన బుట్టిన (ప్రపంచీకరణముచే

బుట్టిన) శ్రోత్రాదీంద్రియములయొక్క శబ్దాదివిషయ సంయోగములయితే చలి వేడి మొదలగు సుఖదుఃఖములను గలుగజేయునవిగాను, సంయోగ వియోగములు కలిగినవిగాను, ఒకప్పుడుండి మఱియొకప్పుడు లేకుండునవి గాను, అస్థిరము లైనవిగా నున్నవి కాబట్టి అర్జునా! అట్టి శీతోష్ణాది సుఖదుఃఖ ద్వంద్వములను సహించుకొనవలయును

ఇట్టి ద్వంద్వములను సహించుకొనెడి శక్తిగలిగినప్పుడు వారి సాధన దృఢపడినదని తెలిసికొనవచ్చును పాదరసము అతిచలనము గలిగినది అయినను మూలికల రసముచే కట్టినచో అది సీసముగుండువలె నుండును, మరలదానికి చలన ముండదు అధ్యాత్మ ధ్యానబల మిటువంటిది దుర్బల స్తంభమునకు గట్టిన పశువులు ఆకట్టను లాగుకొనిపోవును లోతుగనాటిన బలమైన స్తంభమైనచో దానిని ఊడబెరుకుటకు పశువులే గాదు, ఏనుగులకైన సాధ్యముండదు ఇదే దృఢప్రజ్ఞనియొక్కయు, అదృఢప్రజ్ఞనియొక్కయు స్థితియని తెలిసికొనదగును

దేహబలము కలవాడైనను మనోనిగ్రహబలము లేనివాడైనచో 'సుడి గాలి' శుష్కపత్రములను ఎగురగొట్టునట్లు దృశ్యవాస నారూపవాయు వతనిని చీకాకుపఱచును దినరాత్రులవలె సుఖదుఃఖములు, స్తుతినిందలు, మానావ మానములు, లాభనష్టములు వచ్చిపోవుచుండును ఇవన్నియు, పూర్వజన్మ కర్మసంస్కారము ననుసరించి జరుగుచుండును కావున ఆత్మ అనగా జీవుడు ఈద్వంద్వములకు సాక్షిగా నుంటున్నాడు ఈద్వంద్వములయొక్క రహస్య తత్త్వమును గ్రహింపక పోయిన యోగముచే గాని, తపస్సువల్లగాని, శాస్త్ర పఠనముచేగాని శాంతి గలుగదు

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।
ఆద్యన్తవన్తః కౌన్తేయ! న తేషు రమతే బుధః ॥

ఓ అర్జునా! విషయములందు ఇంద్రియములు ప్రవర్తించుటవలన గలుగు సుఖములు ఏవి కలవో అవి దుఃఖహేతువులే యగుచున్నవి ఏలయనగా అవి యారంభమును, సమాప్తియును గలవి, స్వల్పకాల ముండునవి కాబట్టి వానియందు వాస్తవము నెఱింగిన వివేకి ప్రీతి జేయడు అనగా నాసక్తుడు

గాడు 'న తేషు రమతే బుధః ' అని భగవంతుడు చెప్పుటచే ఆత్మతత్త్వ బోధము గలవాడు అనగా ద్వంద్వాతీతుడు దృశ్యములతో గలిసియుండడు ఇట్టిబోధము లేనివాడే ద్వంద్వములకు వశుడైయుండును

ఆహా! గీతోపదేశ మెంతగొప్పది ఇట్టి విచారణవల్లనే జీవుడు ద్వంద్వముల కతీతపదవులను పొందవలయును అట్టి పదవిలోనికి వెళ్లుటకు గొప్ప మనోబలము కలుగవలయును గొప్ప సంయమన శక్తియు ఉండ వలయును ఈసంయమనము కలుగుటకు మనశ్శుద్ధి బాగుగా నుండ వలయును లేనిచో అది సాధ్యము గాదు అది గొప్ప కొండ నెక్కులాగున నుండును ఎటువంటి కొండ యనగా ఏటవాలుగాను, బహునైసుగాను, వర్షకాలమగుటచే పాచిప ట్టినదిగాను నుండుకొండ దానిపై నడచి పర్వతోపరి భాగము చేరుటలో ఎందరో జారిపడి పోవుదురు దేహేంద్రియములను బాగుగా మనస్సుచే లాగుకొనుటకు శక్తిగల వాడు మాత్రమే పర్వతో పరిజేర గలుగును తురీయపదవియు నటువంటిదే

కావుననే దానికి మేరు శిఖరమనియు, త్రికూట పర్వతాగ్రమనియు పేర్లు కలిగినవి. రోగపీడితుడై యుండువాడు ఏ కార్యము చేయుటకున్ను ఎట్లు శక్తిగలిగియుండడో, ఆలాగున అజ్ఞానమను రోగము జీవుడు గల్గి యుండిన ద్వంద్వమునుండి విడుదల చేసికొనజాలడు మనస్సునకు నిర్మలత కలుగుటయే దానికి సుఖమార్గము దేహబలము మాత్రము గలగియుండినను మనోనిర్మలతయను బలము లేనిచో ఏ పనులున్ను జనులు చేయజాలరు

మనస్సు సత్త్వగుణము కలిగియుండునపుడు చాలవఱకున్ను స్వాధీనములో నుండును రజోగుణము కలిగియుండిన నిగ్రహము గడుం గడు ప్రయాసము తమోగుణముతో గూడియుండినపుడు జ్ఞానహీనమై యుండును విశుద్ధసత్త్వముతో గూడినపుడే తలంచినట్లు నిగ్రహించు కొన వచ్చును మనస్సునకు సత్త్వగుణము కలుగుటకు సాత్త్వికాహారము, సత్య ప్రవర్తన, సత్యమును గుఱించి చింతించుట సత్య స్వరూపుడగు సర్వేశుని నిరంతరము ధ్యానించుట చేయవలెను నిరంతరము ధ్యానము చేయుటకు సాధ్యముగాని వారు సమయము దొరికనపుడెల్ల ధ్యానము చేయవలయునేగాని

సర్వేశ్వరు డిచ్చియుండు అమూల్యమగు సమయమును వ్యర్థపఱచగూడదు

కాలమును వ్యర్థపఱచనివాడు కాలుని జయించును అనగా మృత్యు రహితమగు అమృతత్వమును పొందగలుగును తుపానుగాలిచేతను ప్రవాహ వేగముచేతను, పడవమార్గము తప్పిపోవుచుండిన, చుక్కానివాడు ఏలాగున యావద్బలముతో చుక్కానిచే దానిని త్రిప్పుచుండునో, ఆలాగున మనస్సు దృశ్యము లోనికి జారిపోవుచుండిన వివేకబలముచే ద్వంద్వములోనికి జార నీయక ద్వంద్వాతీతమగు పరమశాంతి నిలయములోనికి తీసికొనిపోవల యును లేక మదపుటేనుగు స్వాధీనములో నిలువక లోకమువైపు పోవు చుండిన మావటివాడు అంకుశముచే ఎట్లు నరముల కూటములో పట్టి లాగి దానిని నిలబెట్టుచుండునో, ఆలాగున దృశ్యవిషయములలోనికి జారిపోవు చుండు మనస్సును, విజ్ఞానబలముచే స్వరూపస్థితియగు తురీయములోనికి తీసికొని పోవలయును

ఎత్తుప్రదేశమునకు నడుపుచుండు బస్సు మొదలగు బండ్లు క్రిందికి జారుచుండిన బ్రేకువేసి నిలువబెట్టి స్టీము నధికముచేసి, యెట్లు పైభాగమునకు నడుపుదురో, ఆలాగున, ద్వంద్వాతీత పదవిలోనికి ప్రవేశింప దగిన సమర్థత లేని మనస్సును, మంచివైరాగ్యధ్యానములచే పరమశాంతిలోనికి నెమ్మదిగ తీసికొనిపోవలయును స్వాధీనములుగాని రాశసగుఱ్ఱములు పెడదారికి లాగుచున్నప్పుడు సారధి ఏలాగున కళ్ళెముపట్టి లాగి మంచి మార్గములో నడుపుచుండునో ఆలాగున మనస్సునుగూడ నడుపవలయును

ఇట్టి ద్వంద్వములనుండి విడుదల పొందిన మనస్సు మాత్రమే నిరతిశ యమగు సౌఖ్యము పొందగలుగును లేనిచో ఎంత పండితుడైనను సార్వ, భౌముడైనను నిత్యశాంతిని సుఖమును పొందజాలరు అంతేకాదు తన కర్తవ్యమును నిర్వహించుటకున్ను శక్తియుండదు ద్వంద్వములకు భయపడి కర్తవ్యము నాచరింపనివాడు కృతకృత్యుడు గాడు కృతకృత్యు డెపుడు గాడో అపుడు కృతార్థుడున్ను కాజాలడు కావుననే కృతార్థుడు కావలసియుండిన కృతకృత్యుడు ముందుగా గావలయునని శాస్త్రము చెప్పెడు రహస్యము మంచి ఆత్మానుభవము గలవారి దగ్గఱనుండి శీలించిన మాత్రముననే ఈ

తత్త్వము గోచరము గాగలుగును

అట్లు చేయని కారణముచేతనే సాధువులలో అనేకులు వ్యర్థులై పోవుచున్నారు అందువల్లనే సాధువులపై జనులకు విశ్వాసము కలుగక పోవుచున్నది కాని అందఱున్ను ఆలాగుననే యున్నారని తలంచరాదు 'సాధనాత్సాధవః' అని శాస్త్రము చెప్పుచున్నది సాధనవల్లనే సాధువులగు దురు సాధనలేని వారెవరున్ను ఏ కార్యమున్ను సాధించియుండలేదు 'కాకతాళీయ న్యాయము'గా సాధనము లేకనే ఒకరికి జ్ఞానము కలిగినచో అది జన్మాంతర సంస్కారమనియే శాస్త్రము తెలుపుచున్నది ఏలన, కారణములేక కార్యమేకాలమందున్నూ కలుగదు వారున్ను ఒకవేళ యోగాది సాధనలు, నిష్కామ కర్మలు చేయకపోయినను బాల్యకాలమునుండియే తీవ్రమైన వైరాగ్యముగలిగి తురీయధ్యాననిష్ఠతో చిరకాల ముండినట్లు గన్పించుచున్నది ఇట్టి స్థితి గలుగుట సామాన్యమా! అది గ్రహించిన చాలును

ఇపుడు ద్వంద్వముల గూర్చియు, ద్వంద్వాతీతములో నిలుకడ గలుగుట కొఱకుగల యుపాయములను గూర్చియు తెలుపడమైనది, మఱియు ద్వంద్వములోనికి దిగివచ్చుట యనునది ఎట్టిదనగా అది సాగరములోగల సుడిలోనికి ప్రవేశించుట వంటిదే యగును దీనికే సంసార సాగరసుడి యని పేరు సుడిలో పడిన పడవయు దానిలోగల జనులున్ను అనేక కష్టముల ననుభవించి మృత్యువుపాలగుదురు సుడి గిరగిర తిరుగుచుండును అది అగాధమగు ఉప్పుజలముతో గూడినది మకర తిమింగిల సర్పాదులగు గొప్ప జలచరములలో గూడినది జలమో ఉప్పుమయము

ఆలాగున ద్వంద్వమే సంసారము దానికి అంతమే లేదు విషయమే ఉప్పుజలము రాగద్వేష కామక్రోధాది దుష్టజంతువులు గలది. భ్రమయే దాని యొక్క స్వరూపము సముద్రపు సుడులెటువంటివో, ద్వంద్వములగు సంసార సాగరమున్ను ఇటువంటిదే సుడియెంత భయంకరమో, ద్వంద్వమున్ను అటువంటిదని జ్ఞాపకము జేసికొనదగినది

దీనినే అజ్ఞాన కాననమని కవులు వర్ణించిరి రాత్రికాలములో దండకారణ్యమున ప్రవేశించిన, ఎంత సంకట మనుభవించవలసి యుండునో

ఈద్వంద్వమున్ను అటువంటిదే మహారణ్యములో దిక్కు తెలియదు అంతే గాదు, రాత్రికాలము సింహశార్దూలాది జంతువులచే నిండినది దానిలో ప్రవేశించుట ఎంత భయావహకార్యమో, ద్వంద్వములోనికి జారుటయు అటువంటిదే యగును ద్వంద్వములో దిగినవారికి ' ఇదమిత్థ'మని ఏమియు తెలియదు చీకటివంటి మోహమాయ ఆవరించును, అది భ్రమ, ప్రమాదముల కాలవాలము కావుననే ద్వంద్వాతీతమగు పదవిలో శుకాదియోగులు సదా యుండియున్న వారలని శాస్త్రము చెప్పెడి రహస్యము ఈద్వంద్వమునే త్రిగుణమని పిలుతురు త్రిగుణములతో గూడియుండుటయే బంధమనియు, త్రిగుణా తీతమైనది ముక్తియనియే వేదములు విధించియున్నవి. గుణాతీతుడు ద్వంద్వాతీతుడు ఒకడే తురీయుడనియు, సాక్షియనియు ఇతనికి పర్యాయ నామధేయములు,

ఇక భావాతీతమును గుఱించియు, భావమును గుఱించియు తెలియదగును 'యోగేన గతకామానాం భావనా బ్రహ్మ చక్షతే' యోగధ్యానముచే సంకల్పములు నశించిన చిత్తమందు గల భావము బ్రహ్మభావ మనబడును ఇది తనయొక్క ఆత్మ మహిమలో నిలుచుటయే యగును అట్లుగాక, బుద్ధి చేతగాని, మనస్సుచేతగాని, దేనిని భావించినను ఆభావమున్ను, వస్తువున్ను ఏజ్ఞానమువల్ల తెలియబడుచున్నదో అదే యాత్మ అట్టియాత్మ యందు పరమాత్మ భావము గలిగియుండుటయే ముక్తియు, కైవల్యమున్ను అగును బుద్ధిగాని, మనస్సుగాని దేనిని భావించినను, దానిని దృశ్యముగా నెఱింగి యాత్మవల్ల త్రోసివేయు చుండవలయును అట్టి భావములకు లోబడిన, యదిపై జెప్పినలాగున మఱల సంసారబంధములను గలుగజేయును కావున పాపకర్మ మొకటి మాత్రము కాదు పుణ్యకర్మయున్ను భావముతో గూడినదే

అయితే మలినకర్మయగు పాపముమాత్రము ఆత్మను మలిన పఱచును శుద్ధకర్మయగు పుణ్యము ఆత్మను అంత మలినపఱచక పోయినను స్వరూప జ్ఞానస్థితినుండి బహిర్ముఖ మొనర్చును అయితే పుణ్యకర్మలచే పాప కర్మలు సంపూర్ణముగ నశింపక, ఎవరున్ను పుణ్యాపుణ్యములకు విలక్షణమగు ఆత్మస్వరూపజ్ఞానమందు నిలుకడగలిగి యుండజాలరని నిశ్చయించుకొన

వలయును మలినవస్త్రమును 'సబ్బు' 'చౌడు' మొదలగు వాని వల్ల ఉతుకు నపుడేలాగున వస్త్రములోగల మాలిన్యమున్ను, సబ్బు మొదలైనవియున్ను రెండును వదలిపోయి వస్త్రముమాత్రము శుభ్రముగా నిలుచునో, ఆలాగున నిష్కామబుద్ధితో అనుష్ఠించెడి పుణ్యకర్మము పాపకర్మమును రహితపఱచి జ్ఞానదశయందు అదిన్ని వదలిపోవును

అజ్ఞాన కలుషం జీవం జ్ఞానాభ్యాసాద్వినిర్మలమ్ ।
కృత్వా జ్ఞానం స్వయం నశ్యేజ్జలం కతకరేణువత్ ॥

మట్టినీటిలో చిల్లగింజ అఱుగదీసినపుడు నీటిలోగల బురదయు, చిల్లగింజ చూర్ణమున్ను కలసి జలమును శుద్ధపఱచి రెండున్ను జలమున కడుగునకు పోవునట్లు, ఈశ్వరార్పణబుద్ధితో జేయు పుణ్యము పాపమును నశింపజేసి తానున్ను వదలిపోవును కావుననే శ్రుతి ఇట్లు చెప్పుచున్నది

త్యజ ధర్మ మధర్మం చ ఉభే సత్యా నృతే త్యజ ।
ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి తత్త్యజ ॥

ఏబుద్ధిచేత ధర్మమును, అధర్మమును తెలిసికొనుచుండునో ఈ రెండింటి యొక్క ఫలముతో బద్ధుడు గాక ఆ బుద్ధినిగూడ త్యజించి, బుద్ధికి సాక్షియగు ఆత్మయందు నిలుకడ గలిగియుండుము ఇదే కేవలము బ్రహ్మ భావములో నుండువానిని గుఱించి చెప్పినది ఇవి రెండున్ను కర్మలతో గూడిన వగుటచే బహిర్దృష్టి కలుగజేయును. అధర్మమును ధర్మముచే రహితమొనర్చి, ధర్మభావమున్ను ధర్మాధర్మములకు సాక్షియగు ఆత్మలో నిలిచి విడిచి పెట్టుము ఈ శ్రుతివాక్యము అందఱికిన్ని చెప్పినది కాదు కేవలము ఆత్మనిష్ఠ కలుగుటకు తీవ్రప్రయత్నము చేయు మననశీలునకు చెప్పినదని మఱువ గూడదు లేనిచో విపరీతార్థమును తెచ్చి పెట్టును అట్టి భావాతీత మగు నున్నత పదవిలోనుండు మహనీయుడు గూడ లోకమునకు పుణ్యకర్మయు, ధర్మ మార్గమునున్ను ఉపదేశించి యుండును భావమునుండి మఱల భావా తీతస్థితిలోనికి పోవుటకిదే మార్గము

మనస్సు దేనిని మననము చేసినను, లేక సంకల్పించినను అది బంధహేతువని తెలిసికొని, దానినుండి మనస్సును మఱలించి, నిజ

స్వరూపమగు ఆత్మలో దైవభావము గలిగియుండుటయే కర్తవ్యము ఆలాగున బుద్ధి దేనినిగుఱించి నిశ్చయించునో అది దృశ్యమగునే కాని దృక్కు కానేరదనియు, ఆభావమే బంధమనియు, వెంటనే తెలిసి కొని ఆత్మయొక్క మహిమాతిశయములో నిలుకడగలిగి యుండవలయును అట్టి యుపాయము తప్ప మఱియొక్క మార్గము లేదు ఆలాగున చిత్తము దేనిని గుఱించి చింతించుటకు ఉపక్రమించునో, అపుడు ఈ చిత్తము బహిర్ముఖమునకు ప్రయాణము చేయుచుండునని తలంచి, చిత్తమును చింతలను చేయనీయక నిశ్చింతాత్మయగు తన మహిమాతిశయములోనికి తీసికొనిపోవలయును

అదే ప్రకారము అహంకారము ఏవిషయమును గుఱించి యహంకరింప ప్రారంభించునో, అపుడు దీనికిన్ని బాహ్యావృత్తి కలిగినదని వెంటనే తెలిసికొని, దానినుండి నివృత్తిజేసి ప్రత్యగాత్మయగు శుద్ధచైతన్యములో ఈశ్వరభావము గలిగియుండేలాగున యత్నించవలయును బుద్ధికి సాక్షియై ఏయాత్మ అహమని చెప్పుచుండునో అదియే నిజమైన అహంకారమగును అట్లుగాక దృశ్య వస్తువులను గుఱించిగాని, దేహేంద్రియములను గుఱించిగాని, అంతఃకరణ ధర్మములను గుఱించిగాని అహంకరించినచో అది దురహంకార మగును దానివల్ల దుఃఖమే గలుగును బుద్ధికి సాక్షియగు ఆత్మాహంకారము గూడ వ్యష్టికి సాక్షిగా నుండెడి యుపాధి సహితుడగు జీవాహంకారము గలిగి యుండరాదు సమష్టిరూపమగు, నుపాధి రహితమగు, వ్యాపకమగు, విశుద్ధమగు దైవాహంకారము మాత్రమే గలిగి యుండవలయును అది అహంకా రము గాదు, సోఽహంకారమే యగును

ఇపుడు చెప్పిన విషయము సామాన్యమని తలంచరాదు బ్రహ్మనిష్ఠ చేయువారికి గూడ నది గలుగుట దుస్తరము. దేహేంద్రియాది దృశ్యములో అహంభావ మేర్పడిన, కర్మముగా పరిణామము బొంది బంధమును గలుగ జేయును అనాత్మభావము బలపడి రాగా రాగా అది యాత్మను మఱుగుపఱచి దృశ్యాకారముగా పరిణమించును ఎట్లన, అతి సూక్ష్మమగు త్రసరేణువులు వాయుమయమై యుండి నేత్రములకు కన్పడని స్థితిలో నుండినను అవి వాయు, విద్యుత్తులతోగలసి మేఘముగా పరిణామము నంది ఇంతప్రకాశమైన

సూర్యుని గూడ గన్పడకుండునట్లు చేయును ఆలాగున, ఆనాత్మభావము నిబిడమై నిజమగు ఆత్మను తెలియనీయక చేయును ఆమేఘము శీతల వాయువుచే జలమయమై కుంభవృష్టి చేయునట్లు, విషయవృష్టి ఆత్మను ముంచి వేయును మఱియు భావనయొక్క శక్తి అపారమహిమ గలది ఏలాగున ఏమియు గన్పింపని యాకాశము బలపడి వాయురూపమై, ఆ వాయువు తేజస్సై, ఆ తేజస్సు జలమై, జలము పృధివియై, ఆ పృధివియే మహత్తైన పర్వతములు గాను, వృక్షములుగాను ఎట్లు పరిణామమై వచ్చినదో, ఆలాగున దృశ్యభావము బలపడి ఈస్థూలమగు దేహేంద్రియాదులకు ఆధిక్యమిచ్చును ఈ జగత్తే సత్యమని తోపజేయును ఆత్మను మరుగుపరచును కావున అట్టి దృశ్యభావము గలుగనీయక చూడవలయును

సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ।
క్రోధాద్భవతి సమ్మోహస్సమ్మోహా త్స్మృతి విభ్రమః ॥
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥

విషయవృత్తివలన కామము జనించుచున్నది కామమువలన అడ్డు వచ్చిన వానిపై కోపము గలుగుచున్నది కోపమువలన వివేక జ్ఞానము నశించు చున్నది వివేకశూన్యత్వమువల్ల గురుశాస్త్రోక్త ధర్మమునకు మఱపు గలుగు చున్నది మఱపువలన (కార్యాకార్య వివేకమునకు యోగ్యమైన) తెలివి కాధారమైన అంతఃకరణమునకు నాశము కలుగుచున్నది తెలివి పోవుటవలన తానున్ను నాశమును పొందుచున్నాడు అని గీతాచార్యులు ఉపదేశించిరి

సూక్ష్మమగు వటబీజము అంకురించునపుడే తీసివేయుట ఎంత సులభమో, అది పెద్దమ్రానైన ఎంత స్థలము నాక్రమించునో, నివృత్తిచేయుట కెంత ప్రయాసమో భావము యొక్క రహస్యమున్ను ఈలాగుననే యుండును ప్రారంభదశ యందు దానిని సులభముగా నివృత్తి జేయవచ్చును ప్రబలమైన, మఱల నివృత్తి బొందింప సాధ్యముగాదు ఇంద్రియములకు గోచరముకాని యాకాశము వాయురూప పరిణామము నొంది బలపడునపుడు తుపాను రూపమై మారినచో జనులకెంత బాధగలుగజేయునో, ఆ వాయువే అగ్నిపరిణామము బొందినచో ఆ నిప్పు గ్రామాదులను, అడవులను ఎట్లు కాల్చి

భస్మమొనర్చునో, ఆలాగున అగ్నియే జలరూపము బొందిన, వెల్లువలై ప్రవహించి గ్రామాదుల నెట్లు ధ్వంస మొనర్చునో, ఆ జలము పృధివీరూప పర్వతరూపములుగా పెఱిగిన, కొండలు జనుల కేలాగున దుర్గమమగునో, అట్లే ఈభావనయు దృశ్యముగా పరిణమించి జీవునకు ఎన్నియో దుఃఖములు గలుగునట్లు చేయును

అంతేగాదు జీవునియొక్క దైవస్థానమగు గమ్యమును హిమాలయాది పర్వతమువలె నడ్డుపఱచును కావున ఈ మనస్సును దృశ్యాకారముగా పరిణామమును బొందనీయక అతిజాగ్రత్తతో చూచుచుండ వలయును, అట్లుండువాని హృదయము సదా నిర్మలాకాశమువలె స్వచ్ఛమై యుండును వాయ్వాదులచే గలిగెడు క్లేశము లేవియు ఈ జీవునికి పొంద వలసిన పనియుండదు కావున ఏ విధమగు దృశ్యభావములను బొందనీయక, సదా మనస్సును, బుద్ధిని చూచుచుండవలయును

ఇపుడు అవధూతస్థితిలో నుండిన శ్రీదత్తాత్రేయమహర్షి యుపదేశించిన భావాతీతము కొంత తెలిపెద ఇది చెప్పినవారు త్రిమూర్త్యాత్మ స్వరూపుడగు శ్రీదత్తాత్రేయ మునివరుడని ముముక్షువులు జ్ఞాపక ముంచుకొనిన మాత్రముననే దీనికింత మహిమ గలదుగదా! యని తెలిసికొనగలరు

ఆత్మైవ కేవలం సర్వం భేదాభేదో న విద్యతే ।
అస్తి నాస్తి కథం బ్రూయాం విస్మయః ప్రతిభాతి మే ॥

సమస్త చరాచర ప్రపంచమంతయు నద్వితీయంబగు పరబ్రహ్మమే. పరమాత్మకన్న భిన్నంబైన వేరుపదార్థ మొకటియున్ను లేదు కావున అతని యందు భేదము, అభేదమున్ను లేదు కాబట్టి అట్టి పరమాత్మయందు భేదాబేదములు కలవనిగాని, లేవనిగాని నేనెట్లు నిర్దేశించెదనో అది నాకు వింతగా నున్నది

ఆత్మానం సతతం విద్ధి సర్వమేకం నిరంతరమ్ ।
అహం ధ్యాతా పరం ధ్యేయ మఖండం ఖండ్యతే కథమ్ ॥

శాశ్వతుండును, సమస్తమైన ప్రపంచరూపుడును, ఒకడును, అనగ నద్వితీయుడును నగు పరమాత్మను ఎల్లప్పుడును ఎఱుగుము ధ్యానించువా

డును, మిక్కిలియు ధ్యానింపబడదగినవాడును, భిన్నముగాని వాడును నగు నేను ఎట్లు ఖండింపబడుదును?

అహో చిత్రం కథం భ్రాంతః ప్రధావసి పిశాచవత్ ।
అభిన్నం పశ్య చాత్మానం రాగత్యాగాత్సుఖీభవ ॥

ఆశ్చర్యము! ఎట్లు భ్రాంతినొందిన వాడవై పిశాచమువలె పఱుగెత్తుచున్నావు! భేదము లేని పరమాత్మను చూడుము ఆసక్తి వదలుటవలన సుఖము గలవాడ వగుము

సాకార మనృతం విద్ధి నిరాకారం తు నిశ్చలమ్ ।
ఏతత్తత్త్వోపదేశేన న పునర్భవసంభవః ॥

రూపముతోగూడినది (అనగా కనులకు కనుపడునవి) అబద్ధమని యెఱుగుము రూపములేని (నేత్రములకు గోచరముగాని) పరమాత్మయో చలనము లేనిది (అనగా స్థిరమైనది) ఈ జ్ఞానోపదేశముచేత మరల పుట్టుక లేదు

సాకారం చ నిరాకారం నేతి నేతి చ సర్వదా ।
భేదాభేద వినిర్ముక్తో వర్తతే కేవలశ్శివః ॥

పరమాత్మ స్వరూపము కలది, స్వరూపము లేనిదియు కాదు కాదని ఎవ్వడు భేదాభేదములనుండి విముక్తుడైన వాడగుచున్నాడో, అతడు అద్వితీయుడైన మంగళస్వరూపుడైన పరమాత్మ

భావగమ్యం నిరాకారం సాకారం దృష్టిగోచరమ్ ।
భావాభావ వినిర్ముక్త మంతరాలం తదుచ్యతే ॥

సాకారముతో గూడినది, చూపునకు దెలియునది చూపునకు తెలియని, నిరాకారము భావముొక్క దానిచే బొందతగినది భావాభావముల నుండి విడుపబడినదియై మాయకు స్వాధీనము గాక ఆ పరమాత్మ యుంటున్నది

రాగద్వేషవినిర్ముక్తః సర్వభూతహితే రతః ।
దృఢబోధశ్చ ధీరశ్చ స గచ్ఛేత్పరమం పదమ్ ॥

ఎవడు అనురాగవిరోధములచే విడువబడినవాడై, సమస్త ప్రాణులకు మేలుచేయుటయందు ఆసక్తిగలవాడై, నిశ్చయ జ్ఞానము గలవాడై స్థిరబుద్ధి గలవాడై యున్నాడో యతడు ఉత్కృష్టమైన స్థానమును పొందును

ధ్యాతా న తే హి హృదయే న చ తే సమాధిః
ధ్యానం న తే హి హృదయే న బహిఃప్రదేశః ।
ధ్యేయం న తే హి హృదయే న చ వస్తుభేదః
జ్ఞానామృతం సమరసం గగనోపమోఽహమ్ ॥

నీకు మనస్సుందు ధ్యానించువాడు లేడు నీకు సమాధియును లేదు నీకు మనస్సునందు ధ్యానము లేదు నీకు బయటిప్రదేశము లేదు నీకు మనస్సునందు ధ్యానింపదగినది లేదు నీకు వస్తుభేదమును లేదు 'నేను తత్త్వ స్వరూపుడను, నాశములేనివాడను భేదము లేనివాడను, ఆకాశముతో సమానమైన యాకారముగలవాడను'– అని యవధూతగీత

ఇపుడు భావాతీతస్థితిని సంక్షేపముగా చెప్పడమైనది దీనియొక్క సారమేమనగా ఏ భావన కలిగినను దానిని తెలిసికొనుటచే ఆత్మ సాక్షిగా నుంటున్నందున, ఆ భావనకు లొంగిపోవకయు, దైవభావమునకు మఱుపు గలుగనీయకయు అట్టి దైవభావము ఆత్మభావములో స్థిరపఱచుటయే యగును మోటారు నడపెడు డ్రైవరేలాగున ఏదైన లోయలోనికిగాని, అపాయస్థితిలోనికిగాని బస్సు జారిపోవుచున్నప్పుడు గట్టిగా బ్రేకు వేసి నిలిపి వేయునో, ఆలాగున మనస్సు ఏదైన దృశ్యభావమునకు దిగినపుడు ఆత్మలో దృఢమగు దైవభావమును చేయుచుండవలయును అట్టి బ్రేకు వేసి బండి నిలుపనిచో, అది ఎంత అపాయమో, అదేరీతిగా మనస్సు దృశ్యాకారమై పరిణమించిన గలుగు అపాయమున్ను అటువంటిదని బాగుగా ఆత్మలో ఆలోచనము చేసికొనవలయును

అయితే దృశ్యభావన లేకపోయినను ఆత్మభావన చేయుటగూడ ఒక విధమగు భావనగదా యని సందేహింప నక్కఱకలేదు భావలనన్నియు బంధమగునపుడు ఇదిన్ని యెట్లు బంధము కాదు? ముక్తి ఏవిధమగును? అని తలపనక్కఱలేదు ఇచట భావించెడువాడు, భావము, భావింపదగిన వస్తువు

అను త్రిపుటి గలదని సంశయింపగూడదు వ్యవహారదశలో అట్లు భావన చేయుమని చెప్పవలసినదేగాని, వాస్తవముగా నచట త్రిపుటి లేదు తాను తానై మాత్రమే నిలుకడ గలిగియుండును భావనావాక్య మెటువంటిదనగా, కోరిక లన్నియు బంధము లగునపుడు మోక్షమును కోరుటగూడ బంధమని చెప్పిన ట్లుండును మోక్షముయొక్క కోరిక ఎటువంటిదన, అన్ని బంధములనుండియు యాత్మవిమోచనము కలుగజేయున దగుటచే దానిఫలితము బంధ విముక్తియే ఆలాగున శాస్త్రవాసనగూడ బంధమని గలదు అయితే నిర్వాసనను గుఱించి బోధించెడు అధ్యాత్మశాస్త్రమును బంధమని చెప్పి యుండలేదు ఏలన, అది నిర్వాసననే బోధించుచున్నది ఇతర శాస్త్రములు బహిర్దృష్టి గలుగజేయున వగుటచే బంధమని చెప్పిరి

మఱియు ఇది ఎటువంటి ప్రశ్నయనగా ఒకసభలో ముఖ్యుడు లేచి 'అందఱున్ను నిశ్శబ్దముగా నుండగోరుచున్నాను అని వినయముతో జెప్పిన వెంటనే మఱియొకడు లేచి మీరు నిశ్శబ్దముగా నుండుడని చెప్పినపుడు మీకు నిశ్శబ్దమెట్లు గలిగెను? అదిన్ని శబ్దము గదా! అని యడిగేలాగున నుంటున్నది ఆలాగున, శ్రోతలకు గ్రహించుట కొఱకు 'ఆత్మభావన గలిగియుండుము' అని చెప్పబడినదేగాని అచట రెండవ వస్తువు లేనందుచే తనయాత్మయొక్క స్వమహిమలో నిలుచుటయే యగును కావున అది భావాతీతమే అట్లు లేనిచో గురుశిష్య సంప్రదాయమున్ను, శాస్త్రప్రవచనమున్ను గలుగదు అట్టి వాక్యము బోధనార్థము లనియే విజ్ఞులున్ను, శ్రుతులున్ను తెలుపుచున్నవి

ఇక కేవలాత్మలోగల నిలుకడయొక్క తత్త్వమునే భావాతీతమనియు, ద్వంద్వాతీత మనియు, పతంజలి మహర్షి తన యోగదర్శనమందుపదేశించిన దాని దెలిపెదను

సూత్రము!! తదా ద్రష్టుః స్వరూపావస్థానమ్ ।

చిత్తవృత్తులు నిగ్రహమైయుండు యోగావస్థయందుండు కాలము నందు, చిన్మాత్రుడైన పురుషుడు నిజస్వరూపము నందుండుట సంభవించుచున్నది

విరామప్రత్యయాభ్యాసపూర్వస్సంస్కార శేషోఽన్యః ।

సంప్రజ్ఞాత సమాధులు లేకపోవుటయు చిత్తమునందు ఏ వృత్తులు తలసూపినను వానిని రానివ్వక నిరాకరించుటయు, నిర్మలమైన చిత్ప్రకాశ మార్గము వలన చిన్మాత్రుడైన పురుషుని స్వరూపమై యుండుటయు అసంప్రజ్ఞాత సమాధి యనబడును

స్మృతిపరిశుద్ధౌ స్వరూపశూన్యే వార్థమాత్రనిర్భాసా నిర్వితర్కా ।

తాను ధ్యానించుచుండు శబ్దార్థజ్ఞానముల వికల్పము పోయి మఱియు ఆ వస్తువుయొక్క శబ్దార్థజ్ఞానముల జ్ఞాపకమే లేక, ఆధ్యాత్మ వస్తువుమాత్రము అభిముఖమై యుండుట నిర్వితర్కసమాధి యనబడును

నిర్విచార వై శారద్యేఽధ్యాత్మప్రసాదః ।

నిర్విచారసమాధియొక్క అభ్యాసబలమువలన అధ్యాత్మ ప్రసాదము, (బుద్ధికి నిర్మలత్వము) కలుగుచున్నది

తస్యాపి నిరోధే సర్వనిరోధాన్నిర్బీజ స్సమాధిః ।

సంప్రజ్ఞాత సమాధికిని నిరోధము కలుగగా, చిత్తవృత్తులు నశింమను అందువలన నిర్బీజసమాధి కలుగును

పురుషార్థగుణానాం ప్రతిప్రసవే ।
కైవల్యం స్వరూప ప్రతిష్ఠావా చితిశక్తిరితి ॥

భోగమోక్షరూపములైన పురుషార్థములుగల సత్త్వాది త్రిగుణముల యొక్క పునరావర్తిలేని విలోమపరిణామముయొక్క పరిసమాప్తిగాని లేక, పురుషునియందుండు చిత్ప్రకాశము స్వస్వరూపమైన సచ్చిదానంద మయాఖండ పరిపూర్ణమైన పరబ్రహ్మమందు నెలకొనుటగాని కైవల్య మనబడుచున్నది

ఈభావాతీత విషయమును వ్రాయుటలో ముఖ్యముగా మూడు గ్రంధముల నాధారము చేసికొనడమైనది 1 శ్రీకృష్ణభగవాను లుపదేశించిన భగవద్గీత, ఉత్తరగీతలు, 2 అవధూతగీత– ఇది శ్రీదత్తాత్రేయమునివర ప్రణీతము, 3 శ్రీపతంజలియోగివర్య విరచిత పాతంజలి యోగదర్శనము

అవతారపురుషులలో శ్రీకృష్ణులకు సమానముగాను, బ్రహ్మ

జ్ఞానములో శ్రీదత్తాత్రేయులకు సదృశముగాను యోగీశ్వరులలో శ్రీ పతంజలికి సదృశముగాను, మఱియొకరు భూలోకములో నేటివరకు అవతరించినటువంటి వారు లేరు అయితే, ఈ ముప్వురున్ను సాక్షాద్దైవ ప్రాప్తి, నిజమైన ఆత్మజ్ఞానప్రాప్తి, సత్యమగు నిర్వికల్పసమాధిపరమగు జీవన్ముక్తియను కైవల్యమును బోధించినవారే ఆస్థితులు గలుగుటకు ముప్వురున్ను ఏకాభిప్రాయముగల వారలై, పరిశుద్ధమైన ఈశ్వరభక్తి యొక్కటియే సాధన మని యుపదేశించుట వల్ల దానిని తెలుపుటకొఱకు ముప్వురియొక్క యాశ యము అతిసంగ్రహముగా క్రింద తెలుపబడుచున్నది దీని వల్ల దైవభక్తియొక్క ప్రాశస్త్యము విజ్ఞులెఱుంగగలరు

ఈ భక్తిమార్గములో సామాన్యజను లందరికిని ప్రవేశించుటకు మార్గము గలదు అట్లు చేయక మొట్టమొదటనే బ్రహ్మసాక్షాత్కారము, నిర్వి కల్పమాధిని గుఱించి చెప్పినచో దానిలో ప్రవేశించుట సామాన్యులకు తరము గాదు. చిన్నతరగతి నుండి చదువుకొనుచు వెళ్ళుచుండిన అది ఏలాగున ప్రయాసము లేక పై తరగతిలోనికి తీసికొనిపోవునో,ఈ జ్ఞానయోగముల యొక్క స్థితియు నటువంటిదే అట్లుచేయక బాలురతోను బాలికలతోను చిన్న తరగతిలో ఎందుకు చదువవలయును? ఉన్నతక్లాసులో ప్రవేశించి చదువుడు అని చెప్పి ఆ సర్వోన్నత గ్రంథములను వారిచేతి కిచ్చిన ఎంత ప్రయోజనమో, ఇదియున్ను ఆలాగున నుండునని వివేకవంతులు తెలిసికొనగలరు

గీత ఆఱవఅధ్యాయము ధ్యానయోగమును గుఱించి చెప్పిన విషయము చూడుడు దీనియందు ముముక్షుత్వమునుండి మోక్షస్థితి పర్యంతము కేవల ఆత్మానుభవమును గుఱించి చెప్పియున్నారు అచ్చటంతయు ఈశ్వరభక్తి నుపదేశించక కేవల మాత్మోపాసనను గుఱించియే తెలుపడమైనది సాంగముగా అట్టి యున్నతాశయము నుపదేశించుచు వచ్చి అధ్యాయాంతమున 46,47, శ్లోకములయందు భక్తి నుపదేశించినది చూడుడు

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥

ధ్యానయోగి తపస్సు చేయువారలకంటె అధికుడు, ఆత్మానాత్మ

విచారణ చేయువానికన్నను యోగి అధికుడు, కర్మనిరతులకన్నను యోగి అధికుడు, ఆ హేతువువలన ఓ అర్జునా ధ్యానయోగపరుడవు గమ్ము

యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా ।
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥

యోగులందఱిలోను ఎవడు నాయందు నిలుపబడిన మనస్సుచేత, నన్ను భజించుచున్నాడో అట్టియోగి అతిశ్రేష్ఠుడని నాయభిప్రాయము

ఇక గీతలో పదునాల్గవ అధ్యాయము అతిగహనమైనది అగాధమగు తత్త్వము నది బోధించుచుండును బుద్ధిమంతులు ఈయధ్యాయము ముఖ్యముగా చూడదగినది దీనియందు మూడుగుణముల యొక్కయు, గుణపరిణామముల యొక్కయు, ఏగుణము కలవాడెట్టి స్వభావముతో నుండును, ఏ గుణములో నుండునపుడు దేహమువదలి పోయిన ఏ స్థానము నొందును, మఱల జన్మము వచ్చిన ఎట్టి జన్మము గలవాడగును- ఇవన్నియు విస్తారముగా బోధించి మరల గుణత్రయాతీతుడగు జీవన్ముక్తునియొక్క తత్త్వము నుపదేశించిరి ఈ మధ్యలో ఎచ్చటను ఈశ్వరునిగుఱించిగాని, ఈశ్వరభక్తిని గుఱించిగాని ఒక పదమైనను చెప్పలేదు కేవలము ఆత్మను (అనగా బ్రహ్మను) గుఱించిమాత్రమే యుపదేశించుచూ వచ్చిరి అధ్యాయాంతమున 26వ శ్లోకమున గుణత్రయాతీతస్థితి ఎట్లు గలుగును? అను తత్త్వము నుపదేశించునపుడు అనన్యమగు దైవభక్తి యొకటియే యుపాయమని తెలిపిరి

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥

ఎవడు నన్నే (అనగా భగవంతుని) చలింపని భక్తియోగము చేత సేవించుచున్నాడో, అతడు ఈత్రిగుణముల నతిక్రమించి జీవన్ముక్తి దశను బొందుటవఱకు సమర్థుడగుచున్నాడు

ఇక శ్రీదత్తాత్రేయులు కేవలాత్మను గుఱించి యుపదేశించివారైనను మొట్ట మొదట తాము ప్రారంభించిన పరబ్రహ్మప్రాప్తి యెట్లు కలుగునో ఆ విషయమై మొదటనే యుపదేశించినది చూడుడు (అవధూతగీత)

ఈశ్వరానుగ్రహాదేవ పుంసా మద్వైతవాసనా ।
మహాభయపరిత్రాణా ద్విత్రాణా ముపజాయతే ॥

ఉత్పత్తిస్థితినాశములుగల ప్రపంచముయొక్క గొప్ప భయమునుండి రక్షకము లేనట్టి జీవులను రక్షించునట్టి (అనగా భయమునున్ను తొలగించు నట్టి) అభేదజ్ఞానముయొక్క తలంపు ఈశ్వరానుగ్రహము వలననే కలుగు చున్నది

ఇదే ప్రకారము యోగీశ్వరులగు పంతజలి మహామునియొక్క యాశయమున్ను చూడుడు- అష్టాంగయోగముల నుపదేశించి నిర్వికల్ప సమాధియగు అమృతస్థితిలోనికి తీసికొనిపోయిన యా మహనీయునియొక్క యాశయము ముముక్షులు తెలిసికొనదగినది సాధనపాదమున

సమాధిసిద్ధి రీశ్వరప్రణిధానాత్ ।

పరమేశ్వరునియందు అతిశయమైన భక్తిచేయుటవల్లనే సమాధి లాభము కలుగును యోగపాదమున

తీవ్రసంవేగానా మాసన్నః ।

తీక్ష్ణమైన సంవేగము, జాగరూకమైన దృఢతర సంస్కారముగల వారలకు, ఈశ్వరచింతనయున్ను కలవారలకు సంప్రజ్ఞాన సమాధి మిగుల సమీపము

మఱియు ఈ భావాతీతవిషయమై ఇదివఱలో జెప్పిన నాలుగు విధములైన యర్థములేగాక మఱియొక విధము గూడ గలదు అదేమన శుద్ధ భావము కలవారికి గోచరము కాగలదనియు, అశుద్ధభావము గలవారికి మాత్రము గోచరించునది కాదనియు గ్రహించదగినది కావుననే ఉపనిషత్తులో 'అచింత్యం చింత్యమేవతత్' అని కలదు భావాతీతమగు ఆ బ్రహ్మవస్తు వచింత్య మనియు వెంటనే మఱల చింత్యమనియు, జెప్పునపుడు ఈ రెండుపదముల నెట్లు సమన్వయము చేయదగును? అచ్చోట శుద్ధాంతఃకరణము గలవారికి గ్రాహ్యమనియు, అశుద్ధాంతఃకరణము గలవారి కగ్రాహ్య మనియును, గ్రహించుకొనవలయును ఈలాటి వాక్యములు వేదాంత శాస్త్రములో నెన్నియో కలవు గీతలోను 'బుద్ధిగ్రాహ్య మతీంద్రియం' అని

గలదు ఆ యాత్మవస్తువు ఇంద్రియముల కగ్రాహ్యమనియు, బుద్ధిచే గ్రహింపదగిన దనియు నర్థము గలిగియున్నది బుద్ధిగూడ నింద్రియములలో గూడినదగుటచే నచ్ఛోట శుద్ధమైన బుద్ధివల్ల గ్రహింపదగిన దనియు, మలి నేంద్రియము గలవారికి గ్రహింప నలవికాదనియు నర్థము చేసికొనవలయును అదే రీతిగా గీత 15వ అధ్యాయములో నొక శ్లోకము గలదు

యతన్తో యోగినశ్చైనం పశ్యన్త్యాత్మన్యవస్థితమ్ ।
యతన్తోఽ ప్యకృతాత్మానో నైనం పశ్యన్త్యచేతసః ॥

సద్గురూపదేశమును పొంది తద్వారా ధ్యానాదులను జేయుచు స్వ స్వరూప మును(తన్నుతాను) తెలిసికొనవలయునను ప్రయత్నము జేయుచున్నవారును, చిత్తశుద్ధిగలవారును అనగా నింద్రియముల జయించి చిత్తమును దోషరహితముగా జేసికొన్నవారును అగు యోగులు స్వబుద్ధి యందు(లేక) శరీరమునందున్న పరమాత్మను చూచుచున్నారు కాని శాస్త్ర ప్రమాణములచే పరమాత్మ ఇట్టివాడని తెలిసికొనియున్నను, తపస్సుచేతను, ఇంద్రియ నిగ్రహముచేతను దుర్వ్యాపారముల నుండి తొలగని చిత్తముగలవారు అనగా ధ్యానాదులును ఇంద్రియ నిగ్రహమున్ను లేక దుర్వ్యాపారములను చేయువారునగు అవివేకులు(మూఢులు) పరమాత్మయగు జీవు నెఱుంగలేరని తాత్పర్యము

ఈలాగున కఠోపనిషత్తునందు గూడ గలదు.

ఏష సర్వేషు భూతేషు గూఢోఽఽత్మాన ప్రకాశతే ।
దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః ॥

ఈ యాత్మవస్తువు సమస్త భూతములలో నుండినదైనను అతినిగూఢమై యున్నందుచే మందబుద్ధులకు గోచరించునది కాదు అతి సూక్ష్మమగు నిర్మలమైన బుద్ధిగలవారివల్ల తీక్ష్ణమగు సూక్ష్మబుద్ధివల్ల గ్రహించుటకు సాధ్యమైనది ఇచ్చటను, మలినాంతఃకరణము గలవారికి గోచరము కాదనియు, శుద్ధాంతఃకరణులకు గోచరించుననియు అర్థము చెప్పి యున్నారు కనుకనే ధ్యానముయొక్క కాష్ఠావస్థను గీతాచార్యు లుపదేశించి నపుడు 'బుద్ధ్యా విశుద్ధయా యుక్తః' అని యుపదేశించిరి అనగా మలవిశే

పావరణాదులు లేని విశుద్ధమైన ఏకాగ్రమైన బుద్ధితో గూడిన వారికి మాత్రమే గ్రాహ్యమని యుపదేశించిరి 'శుద్ధ సంయమిగోచరం' అని శంకరులు పాదుకాస్తవమున తెలిపిరి

జలములోను, వాయువులోను గల అతి సూక్ష్మక్రిము లేలాగున దృష్టికి గోచరములు కానివైనను, భూతద్ధమువల్ల నెట్లు గోచరములగు చుండునో, ఆలాగున శుద్ధహృదయముగలవారికి బ్రహ్మము గోచరమనియు, అశుద్ధ హృదయము గలవారి కగోచరమనియు నర్థము ఈలాటి ద్వంద్వా ర్థములు గల ప్రయోగములు వేదాంతశాస్త్రములలో అనేక స్థలములలో గలవు అచ్ఛోటనంతయు పైజెప్పిన విధముగానే యర్థము వ్రాయబడియున్నది మేఘములు నిశ్శేషముగ నశించిన ఆకాశము మాత్రము ఏలాగున శేషించి నిలుచునో, ఆలాగున అంతఃకరణమున గల భావము లన్నియు నశించిన భావా తీతమగు జ్ఞేయబ్రహ్మ మొకటిమాత్రమే మిగిలియుండును ఈ విషయమై ఇతర ప్రమాణవాక్యముల గొన్నిటిని ఇచట నిరూపించెద

యథా కాష్ఠగతో వహ్నిః సంసిద్ధోఽపి న లభ్యతే ।
మూఢైః సర్వత్ర సంస్థోఽపి తథా త్వం నైవ లక్ష్యసే ॥

ఏలాగున కట్టెయందు నిప్పు స్థితమైయుండినను, మధించనిచో గోచరముగాదో, యాలాగున పరమాత్మవగు నీవు సర్వత్ర స్థితుడవై యుండినను అజ్ఞానులచే చూడబడవు

యథా తిలగతం తైలం గూఢం తిష్ఠతి సర్వదా ।
తథా త్వం సర్వలోకేషు గూఢ స్తిష్ఠసి శంకర॥

ఏలాగున తిలలయందు తైలము ఎల్లప్పుడును గూఢముగా నిలిచి యున్నదో, యాలాగున సర్వేశ్వరా! నీవును సకలచరాచర ప్రాణికోట్ల హృదయములందు గూఢముగా నివసించువాడవై యున్నను, ఆత్మజ్ఞానము లేనివారు నిన్ను తెలిసికొనజాలరు

యథా దధిగతం సర్పిః నిగూఢత్వేన సంస్థితమ్ ।
చరాచరేషు భూతేషు తథా త్వం దేవ సంస్థితః ॥

ఏలాగున దధియందు ఘృతము నిగూఢమైయుండి తఱచిన

మాత్రమే గోచర మగుచుండునో, యాలాగున భూతకోట్లన్నిటిలోను దేవా! నీవు గూఢమైన స్థితి గలిగియున్నావు హృదయమును మధించువారే నిన్ను దర్శింపగలరు

యధా జలం ధరాపృష్టాత్ఖనన్నాప్నోతి మానవః ।
తథా త్వాం పూజయ న్నిత్యం మోక్షమాప్నోత్యసంశయమ్ ॥

ఏలాగున మానవుడు భూమిని త్రవ్వుటవల్ల జలమును పొందుచున్నాడో, అలాగున సర్వేశ్వరునియందు గల నిర్మలమగు ఆత్మయొక్క పూజవల్ల ఈశ్వరసాక్షాత్కారమగు మోక్షమును బొందుచున్నాడు దీనియందు సందేహము లేదు

బ్రహ్మచారీ గృహస్థో వా వానప్రస్థోఽథవా యతిః ।
యది స్యాత్సంయతాత్మా చ స నూనం ముక్తిమాప్నుయాత్ ॥

బ్రహ్మచారియైనను, గృహస్థుడైనను, వానప్రస్థుడైనను, సన్న్యాసియైనను ఆత్మసంయమనశక్తి గలిగెనేని తప్పక యతడు ముక్తిని బొందగలుగును

త్రివిధో దర్శనోపాయ స్తస్య దేవస్య సర్వదా ।
శ్రద్ధా జ్ఞానేన తపసా యోగేనైవ నిగద్యతే ॥

దేవదేవుడగు ఆమహాదేవునియొక్క దర్శనార్థము మూడు విధములగు నుపాయములు గలవు శ్రద్ధతోగూడిన యాత్మానాత్మ విచారణచేతను, జ్ఞాన తపస్సుచేతను, యోగధ్యానముచేతను ఏకాలమందైనను సాధ్యమగును

అల్పాహారో రహస్స్థాయీ త్వింద్రియార్థేష్వలోలుపః ।
రాగద్వేషవినిర్ముక్తో భిక్షుర్మోక్షాయ కల్పతే ॥

బహుళముగా భుజింపని స్వభావము గలవాడును, ఏకాంత స్థలమందుండు వాడును, సర్వేంద్రియ విషయములలో చపలము లేనివాడును, రాగము నుండియు, ద్వేషమునుండియు విముక్తి బొందిన వాడునునగు యతి మోక్షమున కర్హుడగుచుండును

దమ దాన దయా క్షాంతి శౌచేంద్రియ వినిగ్రహాః ।
అస్తేయ సత్యాహింసాశ్చ సర్వేషాం ధర్మహేతవః ॥

దమము, దానము, భూతదయ, ఓరిమి, బాహ్యాభ్యంతరశుద్ధి, ఇంద్రియ నిగ్రహము, పరులవస్తువును వారికి దెలియకయు, ప్రీతిలేకయు గ్రహించే స్వభావము లేకుండటయు, సత్యమున్ను, అహింసయున్ను, మోక్షాపేక్షగల సర్వజనులకు ధర్మకారణములైనవి కావున ఏసంప్రదాయములో నుండువారికైనను ఇట్టి గుణములు సమానముగా నుండ వలసినవి

తపసో న పరం కించి త్తపో హి మహతాం ధనమ్ ।

తపసా ప్రాప్యతే సర్వం తపోయోగ్యోఽసి పుత్రక ॥

తపస్సుకన్న శ్రేష్ఠమైనది మఱియొకటి లేదు మహాత్ములకిహలోకమున తపస్సు గొప్పధనము తపస్సువల్ల పొందబడదగని వస్తువే లేదు అనగా తపస్సువల్ల సర్వమును సాధ్యము అందువల్ల నోకుమారా! నీవు తపస్సు చేయుట కర్హుడవై యున్నాడవని ఈశ్వరుడుపదేశించెను

తపసో హి వినా నాస్తి సిద్ధిః కుత్రాపి శోభతే ।

సర్వాసాం కర్మసిద్ధీనాం మూలం హి తప ఉచ్యతే ॥

తపస్సుకన్న మించినది మఱియొకటి లేదు తపస్సు వినా ఎచ్చటను ఏ సిద్ధియున్ను లేదు సర్వవిధములగు సిద్ధులకున్ను తపస్సే మూలమని ఋషులచే చెప్పబడెను

అగాధే సలిలే శుద్ధే సత్యతీర్థే క్షమాహ్రదే ।

స్నాత్వా పాపవినిర్ముక్తః ప్రయాతి పరమాం గతిమ్ ॥

సత్యమనెడు శుద్ధమైన జ్ఞానతీర్థముగల క్షమయనెడు మడుగున స్నానము జేయువారు సర్వపాపములనుండి విముక్తులై పరమోత్కృష్టమగు మోక్షము నొందుచున్నారు అనగా సత్యతీర్థములో స్నానము జేయువాడు సర్వమలిన విముక్తుడై ముక్తి నొందుచున్నాడు

క్రోధో హి నాశయే చ్ఛ్రేయస్తప ఏవ న సంశయః ।

సర్వనాశకర స్తస్మాత్క్రోధం తత్ర వివర్జయేత్ ॥

కోపము శ్రేయస్సును నశింపజేయును ఆలాగున తపస్సును గూడ నశింపజేయును దీనియందు సందేహము లేదు అంతేకాదు కోపము పుణ్యములన్నిటిని నశింపజేయును అందువల్ల ముముక్షువు లందఱున్ను

తమలోగల కోపమును ప్రయత్న పూర్వకముగా నశింపజేయుచుండ వలయును కోప మొకటి నశించిన తక్కిన దోషము లన్నియు లయించి పోవును పాపము లన్నిటికిన్ని కోపమే ప్రభువు

నాస్తి శ్రద్ధాసమం పుణ్యం నాస్తి శ్రద్ధాసమం సుఖమ్ ।
నాస్తి శ్రద్ధాసమం తీర్థం సంసారే ప్రాణినాం నృప ॥

ఓ రాజా! ఈ సంసారములో జీవులకు శ్రద్ధతో సమమైన పుణ్యమున్ను లేదు శ్రద్ధకు సమమైన సుఖమున్ను లేదు శ్రద్ధకు సమమైన తీర్థమున్ను లేదు కావున దైవకార్యములో సదా శ్రద్ధ గలిగియుండుము

శశాంకశ్మిరసంయోగా చ్చంద్రకాంతమణిః పయః ।
సముత్సృజతి నాయుక్తః సోపమా యోగిన స్స్మృతా ॥

చంద్రునియొక్క చంద్రిక చంద్రకాంతమణియందు పడునపుడు, అమృతము స్రవించునట్లు, యోగ ధ్యానముచే విశుద్ధాంతఃకరణమున ఆత్మావలోకనము వల్ల నమృతత్వము గలుగుచుండును

యథార్కరశ్మిసంయోగా దర్కకాంతో హుతాశనమ్ ।
ఆవిష్కరోతి వైకస్సన్నుపమా సాఽపి యోగినః ॥

ఏలాగున సూర్యరశ్మి సూర్యకాంతమణిపై పడునపుడు ఆమణి అగ్నివలె ప్రజ్వలించునో, ఆలాగున, యోగధ్యానముచే విశుద్ధమైన అంతః కరణములో పరమేశ్వర ధ్యానమువల్ల జ్ఞానాగ్ని ప్రజ్వలించును ఇదే దాని కుపమానము బ్రహ్మనిష్ఠులు, సాధువులు, భక్తులు అందఱున్ను ఈ పరమ తత్త్వమునే గ్రహించవలసి యుండును

అంతఃకరణము మూడువిధములుగా నుండును,1మలినము, 2 నిర్మలము, 3 వినిర్మలము, వీనినే అశుద్ధము, శుద్ధము, విశుద్ధమని తెలియ దగినది చంద్రుని చంద్రిక యంతట నొకేవిధముగా నుండినను సామాన్య శిలలో ప్రతిఫలింపదు స్పటికశిలలో ప్రతిబింబించును చంద్రకాం తమణిలో బడిన యమృతధార ప్రవహించును ఆలాగునను, సూర్యరశ్మి సర్వత్ర ఏక విధముగ నుండినను, గోడలో ప్రతిబింబించదు అద్దములో ప్రతిబింబించును సూర్యకాంతమణిపై బడునప్పు డగ్ని జ్వలించును ఆలాగున, పరమాత్మ

సర్వములోను సమానముగా నుండినను మలిన, శుద్ధ, విశుద్ధహృదయముల భేదమునుబట్టి ఒకరికిజ్ఞానము లేకపోవుటయు, నింకొకరికి పరోక్షజ్ఞానము కలుగుటయు, మఱియొకరికి అపరోక్షసాక్షాత్కార జ్ఞానము ప్రజ్వ లించుటయు జరుగుచున్నది

మనస్సులోగల యనాత్మభావము లన్నియు దొలగిపోయిన, మరల మిగిలియుండునది ఆత్మయే, దైవమే, పరబ్రహ్మయే యగుచున్నది 'శ్రేష్ఠం బ్రహ్మేతి కథ్యతే' అంతఃకరణము శుద్ధమైన తరువాత మిగిలియుండునది బ్రహ్మమే, 'స్వయంప్రకాశతే హ్యాత్మా మేఘాపాయేఽంశుమానివ' యని ఆత్మ బోధలో శ్రీశంకరు లుపదేశించిరి జ్ఞానముకొఱకు నీవు చేయవలసిన దేమియు లేదు హృదయములోగల యనాత్మభావమును దొలగించిన జాలును, ఎట్లన, సూర్యుడు స్వయంప్రకాశుడు, సూర్యుని ప్రకాశింప జేయుటలో ప్రయత్నింపబనిలేదు మబ్బు తొలంగిన సూర్యుడు స్వయముగానే ప్రకాశించును

మఱియు, హిమాలయశిఖరములు మంచు కాలములో మూయబడి యుండినను, ఎండకాలము వచ్చినపు డామంచు కఱిగిపోగా నా పర్వత శిఖరము లెట్లు గోచరించునో, ఆలాగున అంతఃకరణములో గల విషయ వాసనలున్ను, అనాత్మభావమున్ను ఎప్పుడు సంపూర్ణముగా జ్ఞానానుష్ఠా నమను సూర్యరశ్మివల్ల క్రమముగా గఱిగిపోవుచుండునో, యపు డాత్మజ్ఞాన మందఱికిని స్వయముగా భాసించును గెలవేసిన యరటిచెట్టుయొక్క పట్టల నొక్కొక దానిని తీసివేయుచు వచ్చిన 'బొందె' ఎట్లు మిగులునో, యాలాగుననే 'ముంజ' యొక్క పట్టల నొకొకదానిని తీసివేయుచు రాగా దాని పట్టలలోనున్న 'ఈను' ఏలాగున మిగులునో, యాలాగున ఆత్మానాత్మ విచారణచే పంచ కోశముల, దేహత్రయముల, అవస్థాత్రయముల, 25తత్త్వములను సంపూ ర్ణముగా త్రోసివేయగా సాక్షియగు ఆత్మ యొకటియే మిగిలి యుండును

భావములన్నిటిని నెఱుంగునది యగుటచే దానికి భావాతీత మనియు, తనకన్న అన్యముగా మఱియొక దానిని భావించుటకు లేనందుచే భావాతీతమనియు, ద్వంద్వములను సహించుటచేతను, ద్వంద్వములను తెలిసి

కొనున దగుటవల్లను ద్వంద్వాతీతమనియు నాదివ్యపదమున కట్టి పేర్లు గలిగెను తత్త్వములు 24 అని కొందఱిమతము ముంజయనగా మౌంజీ బంధము కొఱకుపయోగించెడు దర్భవంటి ఒక తృణవిశేషము ఇక విస్తారముగా వ్రాసి గ్రంథమును పెంచ దలంచలేదు

దీపమునకు తైలమెటువంటిదో ద్వంద్వాతీతమగు ఈ జ్ఞానజ్యోతికి బ్రహ్మచర్యము అటువంటిది దానిని సంక్షిప్తముగా నిచట తెలిపెద సృష్టి యందు బ్రహ్మచర్య సంరక్షణకు సమానమైన ప్రయాసము మఱియొకటి లేదు సంరక్షణచే గలిగెడు ప్రభావమునకు సమానమగు మఱియొక ప్రభావ మున్ను లేదు ప్రభావము దేనికి గలదోయది ప్రయాసముగానే లభించునని విజ్ఞులు తెలిసికొనుచున్నారు

ఆకలిబాధ అన్ని బాధలలో గొప్పదైనను, సమయము తప్పక భుజించువారి కాబాధ తెలియదు ఆలాగున దంపతులుగా నుండు వారు సంకల్పము కలుగునపుడు దాంపత్యధర్మము నిర్వహించుచుండుటచే ఆ ప్రయాసము వారికి తెలియదు దాంపత్యము లేని స్త్రీ పురుషులై బ్రహ్మ చర్య వ్రతమును శీలించెడువారికి విషయ సంకల్పము నుండి మనస్సును మఱలించు టెంత ప్రయాసమో తెలియును మఱియు పుణ్యవిశేషముచేతను, భగవద్భక్తి చేతను, వ్రతానుష్ఠాన నిష్ఠలచేతను, రజోగుణము నశించి ఆత్మశుద్ధిగల వారికి అంత ప్రయాస ముండదు కాని, తక్కినవారికి కడుం గడు ప్రయాసము ఏలన సృష్టికర్త సృష్టికి హేతువగు కారణమును బ్రహ్మచర్యమందుంచుటచే అది సులభసాధ్యమైనచో సృష్టిక్రమమే ధ్వంసమైపోవునని తలంచి దానియొక్క నిగ్రహము నంతప్రయాసముగా నుంచియుండవచ్చును అయితే జన్మ హేతువగు సంస్కారములు చిరకాల తపోయోగాదులచే నశించి పోయినవారికి మాత్రము బ్రహ్మచర్యమంత ప్రయాసముగా నుండదు మూడు లోక ములలోను ఇంత ప్రభావము గల వ్రతము మఱియొకటి లేదు

శృణు వ్రతస్య మాహాత్మ్యం వక్ష్యామి ప్రథమం తవ ।
బ్రహ్మచర్యవ్రతం సారం వ్రతానా ముత్తమం వ్రతమ్ ॥

బ్రహ్మచర్యం తపస్సారం బ్రహ్మచర్యం మహాఫలమ్ ।
క్రియాసు సకలాస్వేవ బ్రహ్మచర్యం వివర్ధయేత్ ॥

ఓ మహర్షిసత్తమా! ప్రథమమున మీకు వ్రతములన్నిటిలోను ముఖ్యమైన వ్రతమగు బ్రహ్మచర్యవ్రతముయొక్క మాహాత్మ్యమును చెప్పెద బ్రహ్మచర్య వ్రతము మిక్కిలి సారమైనది వ్రతము లన్నిటిలోను ఇది యుత్తమ వ్రతము, బ్రహ్మచర్యము తపస్సుయొక్క సారము బ్రహ్మచర్యము మహత్తైన ఫలము కలుగజేయునది కావున ప్రతివ్రతములోను, క్రియలలోను, బ్రహ్మ చర్యమును సంరక్షించుకొనుచుండవలయును

బ్రహ్మచర్య ప్రభావేన తప ఉగ్రం ప్రవర్తతే ।
బ్రహ్మచర్యాత్పరం నాస్తి ధర్మసాధన ముత్తమమ్ ॥

బ్రహ్మచర్యప్రభావము వల్లనే ఉగ్రమైన తపస్సు చేయగలుగును బ్రహ్మ చర్యమునకు మించిన శ్రేష్ఠమగునది మఱియొకటి లేదు ధర్మసాధన లన్నిటిలోను ఇది యుత్తమమగు ధర్మము

మహావ్రతమిదం లోకే తన్నిబోధ సదా ద్విజ ।

ఓ మునివర్యా! ఈ బ్రహ్మచర్యము లోకములో మహావ్రతము, దానిని లెస్సగా దెలిపికొనుము అని ఈశ్వరు డుపదేశించెను ఇది పురుషులకు మాత్రమే కాదు స్త్రీలకుగూడ పురుషులవలె సమాన ఫలము గలుగ జేయునది

సర్వేషాం వ్రతానాం మూలం, బ్రహ్మచర్య ముదాహృతమ్ ।
విశేషాచ్ఛివభక్తానామేవం భూయో విధాస్యసి ॥

వ్రతనిష్ఠగల వారందఱికిన్ని బ్రహ్మచర్యమే మేలుగలుగ జేయుటలో మూలకారణమైనది భగవద్భక్తు లందఱికిన్ని విశేషించి ఈ బ్రహ్మచర్య ముండ వలయును ఇది మఱల మఱల మనస్సులో ధరించుకొన దగియున్నది

సంసారబంధమోక్షార్థం బ్రహ్మగుప్తమిదం వ్రతమ్ ।
మయా ప్రణీతం విప్రాణా మపునర్భవకారణమ్ ॥

సంసారబంధము నుండి విముక్తికలుగుటకొఱకు, ఈ బ్రహ్మ చర్యమను మహావ్రతము అతిరహస్యముగా నుంచబడెను బ్రహ్మనిష్ఠులకు

పునర్జన్మము కలుగకుండుట కొఱకు ఈశ్వరునిచే నీబ్రహ్మచర్యవ్రతము నిర్మింపబడెను దీనికి బ్రహ్మవ్రతమనిగూడ పేరుగలదు బ్రహ్మచారి, వానప్రస్థ సన్న్యాసులు మనోవాక్కాయకర్మలచే దోషము కలుగని బ్రహ్మచర్యవ్రతము కలిగియుండవలెను గృహస్థాశ్రమమందుండెడి స్త్రీ పురుషులు ఋతుకాలము తప్ప ఇతర కాలములలో పైజెప్పిన వారివలె బ్రహ్మచర్యవ్రతమును గలిగియుండినచో అట్టి స్త్రీ పురుషులు గూడ పైచెప్పిన మువ్వురు బ్రహ్మ చారులవలె బ్రహ్మచారులే యగుదురు వారి కేఫలము చెప్పబడెనో యాఫలితము ఈ గృహస్థ బ్రహ్మచర్య మాచరించువారికి గూడకలుగును

మైధునస్యాప్రవృత్తిర్హి మనోవాక్కాయకర్మణా ।
బ్రహ్మచర్యమితి ప్రోక్తం యతీనాం బ్రహ్మచారిణామ్ ॥

యతులకున్ను, వానప్రస్థులకున్ను, బ్రహ్మచారులకున్ను మనోవాక్కా యకర్మలచే మిధునక్రియలయొక్క ప్రవృత్తిలేక యుండుట ఏది గలదో అది బ్రహ్మచర్యమని చెప్పబడెను

స్వదారే విధివత్కృత్వా నివృత్తిశ్చాన్యత స్సదా ।
మనసా కర్మణా వాచా బ్రహ్మచర్య మితి స్మృతా ॥

స్వభార్యయందు ఋతుకాలవిధి ననుసరించి ప్రవర్తించువాడై, మనస్సు చేతను, కర్మచేతను, వాక్కుచేతను, ఇతరకాలములలో విషయ నివృత్తి కలిగి యుండుట ఏది కలదో అది బ్రహ్మచర్య మనంబడును

ఋతుకాలాభిగామీ యః స్వదార నిరతశ్చ యః ।
స సదా బ్రహ్మచారీ చ విజ్ఞేయ స్స గృహాశ్రమీ ॥

స్వపత్నియందు ఋతుకాలమునమాత్రము ప్రవర్తించువాడై, ఇతర కాలములో విషయరహితుడై ఎవడు కలడో, అట్టి గృహస్థాశ్రమమున నుండు వాడు సదా బ్రహ్మచారియని తెలియదగినది అట్టి గృహస్థాశ్రమ స్త్రీయును బ్రహ్మచారిణియే యని తెలియదగినది

పరదారపరిత్యాగీ స్వదారపరితుష్టితః ।
ఋతుకాలాభిగామిత్వాద్బ్రహ్మచారీ గృహీరితః ॥

పరస్త్రీలను తల్లులవలె తలచువాడును, స్వపత్నియందు గృహస్థ

ధర్మమును నిర్వహించువాడును, ఋతుకాలములో మాత్రము సంసారరీతిగా నుండువాడును నగు గృహస్థాశ్రమిగూడ బ్రహ్మచారి యనంబడును

విషయే లుబ్ధచిత్తానాం, వనేఽపి జాయతే రతిః ।
సర్వత్ర సమదృష్టీనాం గేహే ముక్తిర్హి శాశ్వతీ ॥

విషయాసక్తిగలవాడు వనములోనుండినను, విషయబుద్ధి గలుగుచుండును అనగా విషయ సంకల్పము నశించదని భావము సమదృష్టి గలవారికి సర్వత్ర గృహమందుండినను, శాశ్వతమైన మోక్షము గలుగును గృహస్థబ్రహ్మచర్య ముగల స్త్రీ పురుషులకు పరమునకు సంబంధించిన మోక్షము గలుగుటయే గాక ఇహములో మేధాసంపత్తియు, ధర్మబుద్ధియు, ఆరోగ్యవంతమగు సంతానమును గలుగును అట్టి స్త్రీపురుషులు ఇహ లోకమున నిర్మలహృదయము గలవారై బ్రహ్మవిచారమున క్షక్షత గలవారగుటయేగాక మంచి యారోగ్యవంతులై గూడ నుండగలరు

ఈ బ్రహ్మచర్యము శరీరసంబంధమగు బ్రహ్మచర్యముతో పూర్తి యని తలంచరాదు

బ్రహ్మభావే విచరతో బ్రహ్మచర్యం తదుచ్యతే ।

బ్రహ్మవిచారమందు చరించుటయే, అనగా బ్రహ్మములో చరించుటయే బ్రహ్మచర్యమనబడు ననియు నెఱుంగవలెను అదే ముఖ్యమైనను, అముఖ్యమైన దేహసంబంధ బ్రహ్మచర్యము లేనిచో అగాధమగు బ్రహ్మచింతన చేయుటకున్ను, మనస్సు నిర్మలముగా నుండుటకున్ను, ఇంద్రియములను స్వాధీనములో నుంచుటకున్ను తగిన నిగ్రహశక్తి కలుగదని తప్పక గ్రహించుకొనవలయును

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్వైరాగః కర్తవ్యో మనసా కర్మణా గిరా ।

విషయభోగములను అనుభవించిన తృప్తి కలుగదు అందువల్ల మనస్సు చేతను, వాక్కుచేతను, కాయముచేతను, కర్మచేతను లెస్సగ విచారణ చేసి వైరాగ్యము కలుగజేసికొనవలయును

న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి ।

హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥ (మనుస్మృతి)

విషయాదిభోగముల నెంత యనుభవించినను శాంతి కలుగదు ఘృతముచేతను, సమిధలచేతను, అగ్ని అంతకంతకు వృద్ధియగునట్లు భోగము చేత కామము వృద్ధియగును

సర్పిషా కాష్ఠభారేణ వర్ధతేఽగ్నిశిఖా యథా ।

ఉపభోగేన కామేన హ్యాశా చోపరి వర్ధతే ॥

నేతిచేతను, కట్టెలచేతను, అగ్నియొక్కజ్వాల అంతకంతకు వృద్ధి యగునట్లు, భోగముచేత కామాగ్నియగు ఆశ అంతకంతకు వృద్ధి నొందునే గాని శమింపదు (శివపురాణము)

ఇంధనేన యథా వహ్నిః వర్ధతే ఉత్తరోత్తరమ్ ।

భోగేన కామరూపాగ్నిః ఉత్తరోత్తరవర్ధతే ॥

కట్టెలువేయగా వేయగా నిప్పు అంతకంతకు వర్ధిల్లునట్లు భోగముచేత కామరూపమగు అగ్ని అంతకంతకు పెరుగునేకాని శమింపదు అని భారతము

న జాతు కామీ కామానాం సహస్రైరపి తుష్యతి ।

హవిషా కృష్ణవర్త్మేవ వాంఛా తస్య వివర్ధతే ॥

విషయాసక్తిగల పురుషుడు వేలకొలది భోగముల ననుభవించినను ఒకప్పుడును దానికి శాంతి కాదు ఘృతముచే అగ్ని హోత్రుడు అంతకంతకు పెరుగునట్లు విషయమున్ను సహస్రావర్తు లనుభవించినను, వృద్ధినొందునే గాని శాంతి నొందనేరదు వైరాగ్యము ఒకదానివల్ల మాత్రమే విషయవాంఛ నశించునుగాని వేఱుమార్గము లేదు.

యథా నిరింధనో వహ్నిః స్వయోనావుపశామ్యతి ।

తథా వృత్తిక్షయాచ్చిత్తం స్వయోనావుపశామ్యతి ॥

కట్టెలు వేయకపోయిన ఏలాగున అగ్ని స్వయముగా శాంతినొందునో, ఆలాగున విషయములనుండి ఉపరతి బొందిన చిత్తము అప్రయత్నముగానే శాంతినొందును ఇపుడు బ్రహ్మవిద్య యెంత ప్రభావము గలదో యను విషయమై దేవర్షిసత్తముడగు శ్రీనారదమహర్షియొక్క చరిత్రమును చెప్పెద.

శ్రీనారదుడు ఉపనిషచ్చింతన జేయుకాలమున దానియం దీపదము కన్పించినది- 'తరతి శోకమాత్మవిత్' -ఆత్మవేత్తయైనచో శోకమోహము లుండవు అనగా శోకసాగరమును ఆత్మవేత్త దాటును అట్లు శ్రుతిపదము వినిన వెంటనే శ్రీనారదుడు తనకు శోకమోహములు కలుగుచున్నవా? యని ఆత్మలో దీర్ఘముగా విచారించగా, తనయందు శోకములు నశింపలేదనియు, స్తుతినిందలలోను, హర్షామర్షములలోను, లాభనష్టములలోను తనయాత్మకు సంబంధము తొలగిపోలేదనియు గ్రహించెను ఎవరైన స్తుతించినచో వారిపై ప్రీతియు, ఎవరైన నిందించినచో వారిపై అప్రీతియు కలుగుచున్నది గదా! ఆలాగున లాభము వచ్చిన సంతోషమున్ను, నష్టము గలిగిన దుఃఖమున్ను కలుగుచున్నదే ఇట్లైన ద్వంద్వములను నేను దాటలేదు గదా! ద్వంద్వమే గదా సంసారము, బంధము, మోహము ఈద్వంద్వము సంసారులలో నుండు వారికి కన్పించుచున్నది అదే విధముగా జ్ఞానులైన వారు కూడ ఉండినచో నిక బద్ధులకున్ను ముక్తులకున్ను ఏమి భేదమని యాత్మలో చింతన చేసిరి

ఈలాగున నిశ్చయించుకొని ద్వంద్వాతీతస్థితి నుపదేశించెడు పరమాచార్యుడు ఎచట కలడని యాలోచించి చూడగ బ్రహ్మమానస పుత్రుడును, ఆజన్మ బ్రహ్మచారియును, ఊర్ధ్వరేతస్సు గలవాడును పుట్టుకలోనే మాయావరణాది ప్రకృతిదోషములు లేనివాడునగు సనత్కుమారు డొకడే గలడని మనంబున నిశ్చయించినవాడై యామహనీయుడే తగిన పరమగురుడని తలంచి సనత్కుమారుడుండు స్థలమునకు వెళ్ళెను

దేవర్షివరుడగు సనత్కుమారునకున్ను శ్రీనారదమహర్షికిన్ని జరిగిన సంభాషణను సంక్షిప్తముగా నిచట తెలిపెద ఈ విషయము ఛాందోగ్యోపనిషత్తున విస్తారముగా గనందగును ఆలాగుననే శ్రీశంకరానంద మునివరుడు వ్రాసిన యాత్మ పురాణములోను చూడదగును వేదాంతపంచదశిలోన ఇది గాన్పించు చున్నది

ఇచట నిది వ్రాయుటకు కారణమిది శ్రీనారదుడున్ను ద్వంద్వాతీత స్థితిని మొదటనే పొందలేదు ఈక్రింద తెలిపెడు విద్యలున్ను, సిద్ధులున్ను మహిమలున్ను కలిగియు, భావాతీతమును పొందకపోవుటచే శోకమోహము

లనెడి దుఃఖసాగరములను తరింపలేక పోయెను కావునను ద్వంద్వాతీతమనెడి భావాతీతము సామాన్యమని తలంపరాదు నారద మహర్షియే దీనికి తార్కాణము

ఎంతవఱ కట్టిజ్ఞేయగు ద్వంద్వాతీతస్థితి కలుగులేదో అంతవరకు ప్రతిష్ఠలేని దేవాలయమువలెను, దీపము లేని గృహమువలెను జీవితము గలదని జిజ్ఞాసువులు నిశ్చయించుకొనవలయును ఇపుడుండు వేదాంతులమని చెప్పుకొనువారలలో అనేకు లనేకవిధములగు ద్వంద్వములతో గూడిన కష్టములనుభవించుచున్నను, వాక్యములతోమాత్రము ఏలాటి సంబంధము లేదనియు పరిపూర్ణస్థితిలో సదా ఉంటున్నారనియు, సమాధిలో నిలచి యున్నారనియు, ఎల్లప్పుడు జీవబ్రహ్మైకస్థితి గలిగినవారనియు చెప్పెడు వీరిని గుఱించి లోకమే సత్యము నెఱుంగగల్గును

మఱియు, శ్రీనారదులవలె సత్య నిష్ఠయు, శుద్ధాత్మయొక్క అనుభవ విచారణయు గలవారును ఆత్మవంచనము లేనివారలు మాత్రమే ధ్యేయములో, భావాతీతములో ద్వంద్వా తీతములో నిలుకడ గలిగిన వారలగుదురను పరమ సత్యమును మఱువ కుందురుగాక! ఆజ్ఞేయైకస్థితినే పరిపూర్ణమనియు, బయలనియు ఉపనిషత్తు ఉపదేశించుచున్నది

అంతఃపూర్ణో బహిఃపూర్ణః పూర్ణకుంభ ఇవార్ణవే ।
అంతఃశూన్యో బహిఃశూన్యః శూన్యకుంభ ఇవాంబరే ॥

ఇచట రెండువిధములగు దృష్టులను తెలుపడమైనది ఒక దృష్టిలో నేమియును లేని శూన్యస్థితిని వర్ణించెను మఱియొక దృష్టిలో సర్వము నిండిన పరిపూర్ణదృష్టిని తెలిపెను ఒకే వాక్యములోనే శూన్యత్వమును, పూర్ణత్వ మున్ను చెప్పునపుడు అది విరుద్ధమే యగును సమన్వయము గలుగదు పూర్ణాత్మబోధైక జ్ఞానదృష్టిలో, నిండుఘటము సముద్రములోనుంచిన, లోపలను, బయటను, జలమేలాగున నిండియుండునో అట్లుండును ఇదియే పరిపూర్ణదృష్టి మఱియొక దృష్టిలో శూన్యఘట మాకాశములోనుంచిన బాహ్యా భ్యంతరముల నేమియులేక శూన్యమై యుండునట్లు దృశ్యము,దృశ్యవృత్తులు లేని శూన్యభావమే ఇచట బయలు శబ్దముచే గ్రహించుకొనవలయును

అట్లుగాక, అనేక విషయములు, వృత్తులు, వాసనలతోగూడిన హృదయము గలవారై, వట్టిది ఏమియు లేదు బట్టబయలని చెప్పిన ఏమైన ప్రయోజనము కలుగునా? రజ్జువును జూచి సర్పమని భయము గలవానికి రజ్జువుయొక్క యధార్థజ్ఞానము తెలియునపుడు సర్పమేలాగున లేకపోవునో, ఆలాగున పూర్ణాత్మస్వరూపముగల తనలోఅవిద్య యొక్క మహిమచే గలిగిన భ్రాన్తి నశించుట యేదికలదో, అదియే దృశ్యము శూన్యమగు పూర్ణాత్మా నుభవమని విజ్ఞులు తెలిసికొనగలరు

ఇపుడు, శ్రీనారదసనత్కుమారసంభాషణ ఈ కింద వ్రాయబడు చున్నది.

సపురాణాన్ పంచ వేదాన్ శాస్త్రాణి వివిధాని చ ।

జ్ఞాత్వాఽప్యనాత్మవిత్త్వేన నారదోఽతిశుశోచ హ ॥

నారదుడు సర్వపురాణములను, పంచవేదములను, తర్క వ్యాకరణాది నానావిధశాస్త్రములను దెలిసికొనియు, ఆత్మజ్ఞానములేని కారణముచేత అధిక దుఃఖమును బొందినవాడాయెను

సోఽహం విద్వన్ ప్రశోచామి శోకపారం నయాద్య మామ్ ।

ఇత్యుక్తః సుఖమేవాస్య పారమిత్యభ్యధాదృషిః ॥

శ్రీనారదుడు– ఓ మహాత్ముడవగు సనత్కుమారా? సకల వేద శాస్త్రములను జదివినట్టి యీ నేను ఆత్మజ్ఞానమందు నిలుకడ గలుగమి మిక్కిలి పరితపించుచున్నాను, ఈ నన్ను సంసారదుఃఖసముద్రము యొక్క గట్టును, ఆత్మజ్ఞానమనెడి తెప్పచేత పొందింపజేసి కృతార్థబుద్ధిని గలిగింపుము

అని ఇట్లు నారదుడు దుఃఖనివృత్త్యుపాయము నడుగగా అపుడు సనత్కుమారుడు భూమాశబ్దముచే చెప్పదగిన సుఖరూపబ్రహ్మమే యెఱుగ బడుచున్న దగుచు దుఃఖనివృత్త్యుపాయ మగునని 'సుఖం త్వేవ విజ్ఞాసితవ్యం' అనెడి వాక్యము మొదలుకొని ఉత్తరగ్రంధ సందర్భముచేత చెప్పినట్లు ఛాందోగ్య శ్రుతియందు గల సప్తమాధ్యాయమందు వినబడు చున్నదని తెలియ వలయును

సుఖం వైషయికం శోకసహస్రేణావృతత్వతః ।
దుఃఖమే వేతి మత్వాహ నాల్పేఽస్తి సుఖమిత్యసౌ ॥

విషయములవల్ల గలిగెడు సుఃఖము దుఃఖములయొక్క సహస్రముచే కూడి యుండుటచేత, విషముతో గూడియుండెడు క్షీరాన్నము బహుదుఃఖ రూపత్వమును గలిగియున్నట్లు ఆ విషయసుఖమును బహుదుఃఖ రూపమునుగా నిశ్చయించుచు, ద్వైతమందు సుఖము లేదని సనత్కుమారుడు చెప్పెను

ఇపుడు శ్రీసనత్కుమారమహర్షులకును శ్రీనారదమహర్షికిన్ని జరిగిన సంభాషణ ప్రశ్నోత్తరరూపముగా క్రింద వ్రాయబడుచున్నది

పూర్వమొక కాలమందు ద్వంద్వరూపమగు సంసారతాపముచే తప్తుడైన నారదముని ఏకాంతదేశమందు స్థితుడైన సనత్కుమారుని సమీపమునకు బోయి దీనవచనములచే నిట్లనియె–

"ఓ భగవంతుడా! ఏ బ్రహ్మము సకలజగదధిష్ఠానమో, ఏ బ్రహ్మము సర్వమునకన్న నుత్కృష్టమో, ఏ బ్రహ్మముయొక్క జ్ఞానముచే విద్వత్పురుషులు కర్తృత్వభోక్తృత్వాది అధ్యాసరూపశోకములను తరించుచున్నారో ఆ బ్రహ్మ స్వరూపమును తాము బాగుగా నెఱుగుచున్నారు ఓ భగవంతుడా! ఆ బ్రహ్మముయొక్క జ్ఞానమును శిష్యుడనైన నాకు దయచేసి యుపదేశము చేయుడు "

నారదమునియొక్క యాప్రార్థనమును విని మందహాసము చేయుచు వాని అజ్ఞాననివృత్తికొఱకు సనత్కుమారు డిట్లనియె–

"హే నారద! నీవు సర్వలోకములయందు ప్రజ్ఞలచే సమర్థుడవు నీవేయే విద్యలు నేర్చుకొనియున్నావో యా సంపూర్ణవిద్యలు మొదట నాకు చెప్పుము ఆ వెనుక నీకు నేను బ్రహ్మోపదేశము చేసెదను "

అపుడు నారదుడు దీర్ఘదండప్రణామముచేసి తన విద్యలను నివేదింప మొదలిడెను

హే భగవన్! మంత్రము, బ్రాహ్మణము అను రెండు రూపములుగా గల ఋగాది నాలుగువేదములను జనకుడైన బ్రహ్మదేవుని ప్రసాదమున నెఱిం

గీతిని, అట్లే బ్రాహ్మణమందు కథారూపేతిహాసములును, జగదుత్పత్త్యాది పురాణరూపములును, సాధు అసాధు శబ్ద నిరూపకమగు వ్యాకరణమున్ను, శ్రాద్ధాదికర్మప్రతిపాదకమైన పితృశాస్త్రమున్ను, రాశినామముగల గణిత శాస్త్రమున్ను, జీవోత్పత్త్యాదుల ప్రతిపాదకమైన దైవశాస్త్రమును, భూమి యందు నిక్షిప్తమైన నిధిసంబంధశాస్త్రమున్ను అక్షపాదప్రణీత న్యాయశాస్త్ర మున్ను, వేదప్రతిపాదిత వాక్యజ్ఞానముగల ప్రశ్నోత్తరశాస్త్రమున్ను, ఏకాయన నామకమైన నీతిశాస్త్రమున్ను, వేదాంగరూప విద్యానామకమైన నిరుక్త శిక్షా కల్పశాస్త్రమున్ను, భూతవిద్యానామకమైన ఆయుర్వేదమున్ను, సుశ్రుతాది వైద్యశాస్త్రమున్ను, శాంతిపుష్టి కారకములైన నానావిధ యంత్రములున్ను, అస్త్రవిద్యాసహిత ధనుర్విద్యానామకమైన క్షాత్రవిద్యయున్ను, నవగ్రహస్థితి కారకమైన జ్యోతిశ్శాస్త్రమున్ను, నక్షత్ర విద్యయున్ను, గారుడ విద్యా నామకమైన సర్పవిద్యయు, లోకమనోహర రంజకమైన గాంధర్వ విద్యయు నేను బాగుగా నెఱుగుదును హే భగవన్! ఋగ్వేదము మొదలు గాంధర్వ విద్య వఱకు నేను బాగుగా నెఱింగియున్నాను

అయినను, ఆ వేదముల తాత్పర్యరూపమగు మోక్షసాధనమును నేనె ఱుంగను. ద్వంద్వాతీతస్థితి నేను పొందియుండలేదు భావాతీత నిత్య నిరతి శయసుఖములో నాకు నిలుకడ కలుగలేదు ఓభగవంతుడా! వేదార్థమును నేను సామాన్యముగా నెఱిగియున్నాను అయినను, వేదముల తాత్పర్య విషయ గతమగు ఏ యద్వితీయాత్మ గలదో దానిని నేనెఱుగను కనుక నేను కేవలము వేదమంత్రపాఠకుడుగా నున్నాను ఓ భగవంతుడా! పూర్వము మీ వంటి మహాత్ములచే నేనిట్లు శ్రవణము చేసితిని, ఆత్మనెఱింగిన పురుషుడు మూల కారణసహిత సకలశోకమును తరించుచున్నాడు భగవంతుడా! త్రికోణా కృతిగల అగ్నిగుండమందు బడిన కుంటిమనుజుడెట్లు మహాశోకమును పొందు చున్నాడో, అట్లు అధ్యాత్మికాది త్రివిధతాపములు నాకు సర్వదా శోక విహ్వలతను కలుగజేయుచున్నవి

హే దీనదయాళో సనత్కుమారా! బాల్యమున ఒక పతివ్రతస్త్రీ, ధన రహితురాలుగాను, బాంధవులు లేనిదిగా నుండి యౌవనావస్థలో పతి మృతి

నొందిన వాడుగాగ హా! దైవమా! నాగతి ఏమగునని ఎట్లు శోకము చేయునో, అట్లు నారదుడనగు నేను హాదైవమా! నాగతి యేమగునని నిరంతరము శోకించుచున్నాను త్రివిధతాప ములకు వశుడనగుచున్నాను అనాధుడనైన దీనుడనైన నాపై కృపగల్గి నీవు నన్ను ఈశోక సముద్రమును తరించువానిగా జేయుము ''

ఈ ప్రకారము నారదుని దీనవాక్యములను విని భగవంతుడగు సనత్కుమారుడు స్థూలారుంధతీ న్యాయముగా ఆత్మస్వరూపబోధ జేయ నారంభించెను ప్రధమమున చతుర్వింశతి తత్త్వములను, పంచకోశములను, దేహత్రయమును, అవస్థాత్రయమును విధిప్రకారము బోధించి,వీటికి సాక్షి యగు ఆత్మను, భూమాశబ్దమను నొక నూతనవాక్యమును గల్పించి దానినే పరబ్రహ్మముగా, పరమాత్మగా నుపదేశించి నారద మహర్షిని ద్వంద్వా తీతమగు ఆభావాతీత నిత్యశాంతిలోనికి, నిరతిశయ సౌఖ్యములోనికి జేర్చెను శ్రీనారదుడును సనత్కుమారుడను పరమమహర్షియొక్క కరుణవల్ల ద్వంద్వాతీతమగు నిత్యపరమశాంతిని బొందెను ఈ కధవల్లనే భావాతీతమెంత పవిత్రాత్ములకు బొందదగినదో యని గ్రహించుకొనవచ్చును ఈ కథ అతి సంగ్రహముగా నిచట తెలుపడమైనది.

యోగవృక్షస్య ఛాయా యా తాపత్రయవినాశినీ ।
ధర్మజ్ఞానే చ పుష్పాణి స్వర్గమోక్షౌ ఫలాని చ ॥

దుఃఖత్రయాభితప్తస్య ఛాయా యోగతరోః స్మృతా ।
న బాధ్యతే పునర్దుఃఖై ప్రాప్య నిర్వాణ ముత్తమమ్ ॥

యోగవృక్షము (జ్ఞానవృక్షము) యొక్క వర్ణన ఈ రెండు శ్లోక ములలో చేయబడినది నిండువేసవి మధ్యాహ్నకాలమున, ఎడారిలో సంచ రించువాడు దప్పికచేతను, ఆకలిచేతను, తపించుచున్నప్పుడు మంచి నీడగల దిన్ని సుగంధపుష్పములతోను మధురమైన ఫలములతోను, శీతల జలా శయము తోను గూడినదియగు, గొప్ప చెట్టుయొక్క నీడ నాశ్రయించిన నెట్లుండునో , యాలాగున యోగవృక్షముయొక్క ఛాయ యేది గలదో యది

ఆధ్యాత్మిక ఆధిదైవిక, ఆదిభౌతికమను తాపత్రయమును నశింపజేయునది ధర్మము, జ్ఞానము అనుపుష్పములతో గూడినది కామ్యకర్ములకు స్వర్గ మున్ను, నిష్కాములగువారికి మోక్షము అను ఫలములచే నిండి శోభాయమాన మైనదియు నగుచున్నది తాపత్రయముచే మిక్కిలి తపించెడు జీవి ఈ యోగత రుచ్ఛాయను పొందిన మఱల తాపత్రయములచే దుఃఖము నొందరు అంతే కాదు దానిని పొందువాడు ఉత్తమమగు నిర్వాణమును పొందగలడు

ఇక భక్తులకుగాని, నిష్కామకర్మయోగులకుగాని, ధ్యానయోగులకు గాని, జ్ఞానయోగులకుగాని యుండవలసిన అద్వేష్ట్రుత్వాది గుణముల గుఱించి శ్రీభగవంతుడు గీతాద్వాదశాధ్యాయమున నుపదేశించిన, పరమభక్తుల కుండ వలసిన గుణముల నిరూపణజేసి ఈ వ్యాసము సమాప్తి జేయదలంచెద ఇపుడు కూడ భక్తియోగ, కర్మయోగ, ధ్యానయోగ, జ్ఞానయోగములయందు కొద్ది గనో, గొప్పగనో యాచరించువారు లేకపోలేదు అయితే భగవంతుడు ఉపదేశించిన ఈగుణముల యాచరణలు, అనుష్ఠానములు ధ్యాననిష్ఠలు తగ్గి నందుచే పూర్ణఫలమును పొందలేకపోవుచున్నారు కృతత్రేతాది యుగములలో కట్టెలచే అగ్ని యెట్లు వృద్ధినొందెనో యాలాగున ఇపుడు కూడ గలదు కట్టెలు లేక కృతాది యుగములలోను అగ్ని జ్వలించియుండ లేదు నిప్పులో కట్టెలు వేయువారు స్త్రీలుగాని, పురుషులుగాని, బ్రాహ్మణులుగాని, అబ్రాహ్మణులు గాని, సన్న్యాసులుగాని, సంసారులుగాని యైనను, అగ్ని ఏలాగున జ్వలించునో ఆలాగున' శ్రీకృష్ణభగవాను లుపదేశించిన అనుష్ఠానము గలవారు పూర్విక ఋషులవలె జ్ఞానప్రకాశకు లగుదురు

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖస్సుఖః క్షమీ ॥

సకలభూతములకు ద్వేషి కానివాడును, మిత్రధర్మము కలవాడును, దయగలవాడును, మమత్వము లేనివాడును, అహంకారము లేనివాడును, సుఖదుఃఖములయందు సమబుద్ధి గలవాడును, ఓర్పు గలవాడున్ను నాకు ప్రియుడని భావము

సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పితమనో బుద్ధిర్యో మద్భక్త స్స మే ప్రియః ।

ఎవడు సర్వకాలములయందును, లాభమునందును, అలాభమునందును సంతోషము కలవాడును, సమాహితచిత్తుడును, నియమింపబడిన మనస్సు కలవాడును, దృఢమైన ఆత్మనిశ్చయము కలవాడును నాయందర్పింపబడిన సంకల్పాత్మకమైన మనస్సును్ను నిశ్చయాత్మకమైన బుద్ధియు గలవాడును, నన్ను సేవించుటయం దాసక్తి కలవాడును నగుచున్నాడో వాడే నాకు ప్రియుడు

యస్మాన్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః ।
హర్షామర్షభయోద్వేగై ర్ముక్తో యస్స చ మే ప్రియః ॥

ఎవనివలన లోకము క్లేశము నొందదో, ఎవడు లోకమువలన చిత్తక్షోభము నొందడో, ఎవడు ప్రీతిచేతను, అప్రీతిచేతను, ఉద్వేగము చేతను విడువబడెనో, వాడు నాకిష్టుడగుచున్నాడు.

అనపేక్షశ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యధః ।
సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ॥

దేనియందును అపేక్షలేనివాడును, బాహ్యాభ్యంతర శుద్ధిగలవాడును, కార్యదీ క్షగలవాడును, పక్షపాతము లేనివాడును, నిర్భయుడును, కామ్యములగు సమస్తకర్మలను పరిత్యజించు స్వభావము కలవాడునునై ఎవడు నాకు భక్తుడగుచున్నాడో వాడు నాకిష్టుడు

యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్య స్స మే ప్రియః ॥

ఎవడు ఇష్టవస్తులాభమునందు సంతోషింపడో, అనిష్టప్రాప్తియందు ద్వేషింపడో, ప్రియవియోగమునందు వ్యసనము పొందడో, దేనిని కోరడో, పుణ్యాపాపకర్మలవల్ల గలిగెడు ఫలము నపేక్షింపడో, భక్తిగలవాడో, వాడే నాకు ఇష్టుడు

సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।
శీతోష్ణసుఖదుఃఖేషు సమ స్సంగవివర్జితః ॥

శత్రునియందును మిత్రునియందును సమానుడును, అటులనే మానము నందును, అవమానమునందును సమానుడును, శీతము ఉష్ణము సుఖము, దుఃఖము అనువానియందును సమానుడును, సర్వసంగ విముక్తుడును అగువాడు నాకిష్టుడు

తుల్యనిందా స్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।
అనికేతస్థిరమతి ర్భక్తిమాన్ మే ప్రియో నరః ॥

నిందయందును స్తుతియందును సముడును, మౌనము కలవాడును (మననశీలుడును) శరీరము నిలుచుట కేయాహారమైనను, ఏ వస్త్రమైనను, ఏ స్థలమైనను సంతోషించువాడును, సంసారమునుండి విముక్తుడును, జ్ఞాన మందు నిశ్చలమైన మనస్సుగలవాడును నైన నరుడు నాకు ప్రియుడు

యే తు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేతీవ మే ప్రియాః ॥

మనుష్యజన్మమెత్తిన యెవరైనను, ధర్మములకు మూలమైనదిన్ని అమృతమున్నైన ఈఅద్వేష్టృత్వము మొదలుగాగల ధర్మసముదాయమున శ్రద్ధగలవారును, అక్షరాత్ముడైన నేనే నిరతిశయమైన గతిగా గలవారును (జ్ఞేయమునే పరమగతిగా తలంచువారును), ఉత్తమభక్తులును అగుచు ఎవరు నన్ను ధ్యానించుచున్నారో వారు నాకత్యంత ప్రియులు

ద్వంద్వములయొక్క లక్షణమున్ను, ద్వంద్వాతీతునియొక్క లక్షణమున్ను, ద్వంద్వాతీత స్వరూపమునున్నూ శ్రీభగవానులు దీనియందు పదేశించినారు

ఓం తత్ సత్ ఓమ్

★★★★

జ్ఞేయము

బ్రహ్మైవేద మమృతం పురస్తాద్బ్రహ్మ పశ్చాద్బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ।
అధశ్చోర్ధ్వం చ ప్రసృతం బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్॥

ఇదం= ఈ సమస్తము, అమృతం=నాశరహితమగు, బ్రహ్మైవ= పరబ్రహ్మమే పురస్తాత్=ముందరను, బ్రహ్మ=పరబ్రహ్మము, పశ్చాత్= వెనుకను, బ్రహ్మ=పరబ్రహ్మమును, దక్షిణతశ్చ= దక్షిణభాగమునందును, ఉత్తరేణ= ఉత్తరభాగమునందును, అధశ్చ=క్రిందిభాగమునను, ఊర్ధ్వంచ= మీది భాగమునందు, (సర్వతః= అంతటా) ప్రసృతం=వాపించియున్నది బ్రహ్మైవ=పరబ్రహ్మమే, ఇతరమగు కార్యరూపముతో వ్యాపించియున్న, ఇదం= ఈ, విశ్వం= సమస్తజగత్తును, వరిష్ఠం=శ్రేష్ఠమగు, ఇదం= ఈ, బ్రహ్మైవ= పరబ్రహ్మమే

ఈ జ్ఞేయమునకే ధ్యేయమనియు జ్ఞానమనియు, విజ్ఞానమనియు ఈశ్వరసాక్షాత్కారమనియు, సాక్షిజ్ఞానమనియు, తురీయమనియు, నిర్వికల్ప సమాధి యనునవి మొదలుగాగల పలువిధములగు పేర్లు గలవు వీటి యన్నిటి యొక్క సారమేమన, సత్పదార్థమగు ఆత్మనుండి అసత్పదార్థమగు బుద్ధి పర్యంతముగల యనాత్మ భావము లన్నిటిని రహిత మొనర్చుటయే యగును ఇందువల్లనే యీ యున్నతస్థితికి భావాతీతమని గూడ పేరు గలిగినది కావుననే ద్వంద్వాతీతమని చెప్పబడినది

యోగదృష్టితో చూచిన ఆత్మలోగల అజ్ఞానము అనగా కర్మ, సంసారము, సంకల్పము, వాసన మొదలగు ప్రకృతి గుణములను, ధ్యాన ధారణా సమాధులవల్ల రహిత మొనర్చుట అనగా బంధనమునుండి విముక్తి నొందుటయే యనంబడును ఇది పాషాణము, గంధకము మొదలగు విషధాతువులను స్ఫుటకము వేసి శుద్ధముచేయు నట్లుండును లేక మలిన బంగారమును శుద్ధిచేసి దోషము లేకుండునట్లు చే[illegible]ను, లేక

మలినవస్త్రమును క్షారాదులచే శుద్ధపఱచునట్లును, చిల్లగింజ లేక గంధముచే మట్టినీటిని నిర్మలపఱచునట్లును ఉండును ఇవి యన్నియు అష్టాంగాది యోగసాధనలవల్ల అవిద్యనుండి విముక్తి పొందెడు మార్గములు

ప్రపంచములోగల ప్రతిసత్పదార్థమున్ను అసద్వస్తువుతో కూడియే యుండును అసత్తును పరిత్యజించి సత్తును గ్రహించుటయే ముముక్షువుల కర్తవ్యము మామిడిపండ్లు మొదలుగాగల సకలఫలములును తోలు, పీచు, మొదలగు అసద్వస్తువులతో కూడియుండును ఆ తోలు మొదలగువాటిని తొలగించిన సత్పదార్థము మాత్రమే మిగిలియుండును ఆ సద్వస్తువు కేవలము మధురమయము మాధుర్యము తప్ప అందు మరి యేమిగిలియుండును? ఆలాగున క్షీరమును(పెరుగు) మథించి నవనీతము తీసిన అదిన్ని జలభాగము పోవునపుడు సారమగు ఘృతము మాత్రమే మిగిలినదైయుండును అట్లే నూవులు మొదలగు గింజలనుండి తైలము దీసిన వానియందుగల అసత్పదార్థమగు పిండి లేనిదై సారమగు తైలముమాత్రము మిగులుచున్నట్లు సారరూపమగు ఆత్మలోగల నిస్సారరూపమైన అజ్ఞానమును తీసివేసిన సత్తగు ఆత్మమొకటియే శేషించును ఇది యోగమార్గముతో కూడినది

ఇక జ్ఞానము మరియొకటి కలదు కేవలము వేదాంత విచారణ దృష్టితో కూడినది కాని, అట్టి సువిమల విచారణదృష్టి మొట్టమొదట ఎవరికిన్ని కలుగదు. నిష్కామకర్మలచే పాపనివృత్తియు, దైవోపాసనవల్ల విక్షేపనివృత్తియు, యోగధారణవల్ల ఆవరణమును పోయి ఏకాగ్రత గలుగవలసియుండును ఉప నిషద్భాగమగు బ్రహ్మవిచారణయందు ప్రవృత్తి కలుగుటకు శమదమాది సాధన చతుష్టయసంపత్తి తప్పక కలిగియుండవలయును అట్టి సాధన సంపత్తి గలవారెవరైనను బ్రహ్మచారమున కర్హులే అట్లు కానివారు శాస్త్రములను చదివిన వారైనను, అగ్రజాతిలో జన్మించినవారైనను, యత్యాశ్రమము స్వీకరించిన వారైనను, అనేక దానధర్మములు చేసినవారైనను, అనేక తీర యాత్రాదులను సేవించినవారైనను, యజ్ఞయాగాది క్రతువులను చేసిన వారైనను సాధన చతుష్టయ సంపత్తి లేనిచో బ్రహ్మవిచారమున కర్హులు కారు కావుననే దీనిని వేదాంతమని చెప్పిరి

వేదాంతమనగా వేదముయొక్క అంతిమభాగమని యర్థము శాస్త్రములో విధించియుండు పైజెప్పిన పుణ్యకర్మ లన్నియు నిష్కామబుద్ధితో శ్రద్ధాభక్తులుగలిగి ఆచరించిన బ్రహ్మవిచారమునకు తగిన బుద్ధియొక్క శుద్ధియు, ఏకాగ్రతయు కలుగును అపుడు బాగుగా సానపట్టిన గొడ్డలిచే చెట్లనెట్లు నరుకవచ్చునో, ఆలాగున బుద్ధికి ఏకాగ్రతయు, విశుద్ధతయు కలుగునపుడు అజ్ఞానారణ్యమగు వృత్తులను(సంకల్పములను) ఛేదించుటకు శక్తి కలుగును కనుకనే గీతలో 'బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ' అని యుపదేశించిరి

వేదము 'ఏకం సత్' అని యుపదేశించుచున్నది 'ఏకామేవా ద్వితీయం' అనగా సద్వస్తువు ఒకటి మాత్రమే రెండవది యగు మరియొక వస్తువు లేదు అని తెలుపుచున్నది అట్లయిన అనేకములుగా కాన్పించెడు ఈజగత్తు అంతయు నేమి? యని ప్రశ్నరాగా నాత్మవిచారణచే దానికి సమాధానము వచ్చు చున్నది అది స్థిరము చేయు నిమిత్తము అనేక పద్ధతులను శాస్త్రమవలంబించ వలసివచ్చినది దానిని ఇంద్రజాలమనియు, స్వప్నమనియు, దిగ్భ్రమ యనియు, భ్రాంతిజ్ఞానమనియు బహువిధములుగా నుపదేశింపవలసి వచ్చినది ఈ విషయమై ఆరంభమనియు, పరిణామమనియు, వివర్తమనియు మూడు విధములుగా శాస్త్రము జనుల బోధనార్థ ముపదేశించుచున్నది

అనేక ద్రవ్యములు (పదార్థములు) పరస్పరము మిళితమై యొక నూతన వస్తువును ఉత్పన్న మొనర్చెనేని వానిని ఆరంభకము లనియెదరు ఎట్లన, న్యాయమ తమున (తర్కశాస్త్రమున) అనేక పరమాణు రూప ద్రవ్యములు పరస్పరము మిళితములై తమకంటె విలక్షణమైన నూతనజగత్తును సృజించుచున్నవి కాన పరస్పరము మిళితమైన అనేక పరమాణువులు ఈజగత్తుయొక్క ఆరంభ కారణములని వచింపబడుచున్నవి

పరిణామవాదము

ఏ సావయవ వస్తువు తన గుణసత్తులతో సహా తనకార్యమున పరిణతమగుచు, కార్యముయొక్క ఉత్పాదకము అగునో దానిని పరిణామి యందురు

ఎట్లన, సావయవమగు దుగ్ధము శ్వేతరూపాది గుణములతోడను తన వ్యావహారిక సత్తతో గూడ దధిరూప కార్యమందు పరిణత మగుచు, దధియొక్క ఉత్పాదక మగుచున్నది కాన దధియొక్క పరిణామ కారణము క్షీరమగుచున్నది

వివర్తాధిష్ఠానము

ఏ వస్తువు తనకంటె విషమమైన సత్తగల వస్తువును కలిగించుచు, ఆ వస్తువుతోటి స్వయముగ నిర్లేపముగ నుండునో దానిని వివర్తాధిష్ఠాన మందురు. ఎట్లన రజ్జువునందు ప్రతీతమగు సర్పమునకు ప్రాతిభాసిక సత్త గలదు దాని యధిష్ఠానమగు రజ్జువునకు వ్యావహారికసత్తగలదు ఈ విధముగ తనకంటె విషమస త్త గల సర్పమును రజ్జువు కలిగించు చున్నది. ఏలన దాని యందే కల్పిత సర్పముయొక్క ఉత్పత్తి యగుచున్నది మరియు ఆ రజ్జువు త్రికాలములందును ఆసర్పముతోటి నిర్లేపముగ నున్నది కాన రజ్జువునందు కల్పింపబడిన సర్పమునకు రజ్జువు వివర్తాధిష్ఠాన కారణమై యున్నది

వివర్తవాదము వేదాంతశాస్త్రమున ప్రసిద్ధమై యున్నది ఈ విషయమై అనేక వేదాంతదర్శనగ్రంథము లేర్పడియున్నవి దీనియందు ఆలక్ష్యము లన్నియు విస్తరించి చెప్ప బూనలేదు అది విచారసాగరము,వృత్తి ప్రభాకరము, అద్వైతసిద్ధి మొదలగు ఉన్నత గ్రంథములలో గనదగును ఆలాటి గ్రంథములలోగల సారమును గ్రహించుట మిక్కిలి కష్టసాధ్యము అవి తర్కజటిలములై యుండుటయేగాక కొన్ని సంస్కృతవిరచితములై యుండుట వల్లను, అందరికిన్ని తెలిసికొనుటకు సాధ్యము కాదు తనయొక్క ఆత్మకు ప్రకృతినుండి విముక్తి గలుగుటకు అవి యన్నియు చదువ వలసిన అవసరము లేదు సాధన చతుష్టయసంపత్తి గలిగి ధ్యానపరులై వేదాంత బ్రహ్మవిచారము చేసిన చాలును కనుకనే 'యోగం జ్ఞానం చ యస్యాస్తి తీర్ణస్తేన భవార్ణవః' యని శాస్త్రము నిశ్చయించినది దీనివల్ల యోగమొకటి మాత్రము చాలదనియు, జ్ఞానము నిలుచుటకు యోగము సహాయమనియు నుపదేశించుటైనది కావుననే యోగమున్ను, జ్ఞానమున్ను ఏ సాధువునకు గలదో అతడు మాత్రము భవ

సాగరమును తరించగలడని చెప్పబడినది

ఇట్లు శాస్త్రము చెప్పుటవల్ల యోగమే ముఖ్యమనియు, లేక విచారణయే ముఖ్యమైనదనియు చెప్పువారి వాక్యములు దుర్బలములని రూఢి యైనది రెంటిని సమన్వయపఱచి చెప్పినది ఎంతోబాగున్నది దీనివల్ల సాధన చతుష్టయ సంపత్తి గలిగి ఆచరణలేని వేదాంతము ప్రయోజనకారి కాదనియు, సాధనపరుడై యోగాది అనుష్ఠానము కలిగిన వాడయ్యును, ఆత్మవిచారణ లేనిచో అదిన్ని ముఖ్యప్రయోజనము కలుగజేయదనియు రూఢియైనది ప్రపంచములోగల సర్వశక్తులు రెండు పదార్థములు చేరునపు డేర్పడుచుం డును యథార్థము విచారించిన, సృష్టియంతయు ద్వంద్వము ఐక్యమువల్లనే కలుగుచున్నది ఒకడు ప్రకృతియే(ప్రధానమే) సృష్టికి కారణమని చెప్పును, ఇంకొకడు పురుషుడే (ఈశ్వరుడే) సృష్టికి హేతువని వచించును ఈరెండు వాక్యములు కొన్నిటికి సంబంధించి యుండినను యథార్థముగా విచారించిన ప్రకృతి పురుషుల సంబంధమువల్లనే సృష్టి జరుగుచుండును ప్రతిప్రాణి సంతతియొక్క స్థితిని తెలిసికొనిన నిది స్పష్టమగును

యావత్సంజాయతే కించిత్సత్త్వం స్థావర జంగమమ్ ।
క్షేత్రక్షేత్రజ్ఞసంయోగా త్తద్విద్ధి భరతర్షభ ॥

అని గీతావాక్యము ఒక రైలు ఇంజను చలించుటకు జలమే కారణమని యొకడున్ను, కాదు నిప్పే కారణమని మరియొకడును వాదించినను, కొంత వఱకు సంబంధము చెప్పినను, నిప్పు నీళ్ళు రెండున్ను లేనిచో ఇంజను నడుచుటకు శక్తి కలుగదు కదా!

ఆలాగున విద్యుచ్ఛక్తి రెండు విధములగు ప్రాణశక్తులు గలిగినపుడే ఉద్భవించును ఇవి రెండున్ను కలియక విద్యుచ్ఛక్తి ఏర్పడుటగాని, దీపము ప్రకాశించుటగాని, యంత్రము నడచుటగాని కలుగదు ఆలాగున పాటాషియ మున్ను, మణిశిలయున్ను కలియునపుడే నిప్పు ఏర్పడును వీనిలో నొక దానివల్ల అగ్ని యుద్భవింపజాలదు అట్లే ప్రతిప్రాణికోటియు ప్రాణా పానములనియెడు రెండువిధములగు ప్రాణశక్తులవల్లనే జీవించుచున్నవి లేనిచో ఒకజీవి గూడ జీవింపజాలదు ఇదే యోగము యొక్కయు జ్ఞానము

యొక్కయు ఐక్యముచే గలిగెడు ఫలితమని గ్రహించుకొనవలయును

పై జెప్పిన వేదాంత గ్రంథములన్నియు ముక్తిని పొందుటకు అభిలాషగల ముముక్షువున కక్కర లేదు ఎట్లన, పెద్ద యుద్ధములకుమాత్రమే అనేక ట్యాంకులు, పిరంగులు, విమానములు, మఱఫిఱంగులు, బాంబులు మొదలైనవి కావలసియుండునుగాని, తమయొక్కరి ఆత్మనాశనమునకు ఇవి ఏమియు నక్కరలేదు చిన్నదైన యొక్క ఆయుధముగాని స్వల్ప విష పదార్థముగా గాని చాలును శాస్త్రార్థవాదములు చేయువారికిగాని, మతములు స్థాపించువారికిగాని పైనజెప్పిన గ్రంథములు కావలసియుండును జీవన్ముక్తి నొంది నిత్యశాంతిలో నిరతిశయ సుఖములో నుండగోరువారికి అవి ఏవియు నక్కరలేదు వారికి శ్రీభగవద్గీత, కఠోపనిషత్తు మొదలగు కొన్ని గ్రంథముల విచారణ చాలును దీనికి గూడ శక్తిలేనివారు పవిత్ర ఆచరణగల బ్రహ్మనిష్ఠుల వల్ల ధ్యానక్రమములు తెలిసికొని యాచరించిన తప్పక విముక్తు లగుదురు రోగము కలవాడు డాక్టరు పరీక్షప్యాసయిన తరువాత గూడ ఔషధసేవ చేయువలయునని విధి గలదుకదా! గొప్ప డాక్టరైనను తనకు రోగము వచ్చినపుడు ఔషధసేవయు, పథ్యమున్ను లేక ఆరోగ్యము కలుగునా? కావున శాస్త్రము చదివినను, చదువకపోయినను శుద్ధమైన అనుష్ఠాన మొకటి యుండిన చాలును

కాని అనుకూలము కలవారు శాస్త్రములను చదువుటకై యత్నించ వలయును విద్యాశూన్యమైన దేశముగాని, సంఘము గాని క్షయించును కావున మహాపురుషులందరు విద్యాభివృద్ధికి తోడ్పడుదురు కాని యథార్థముగ విచారించిన అంతఃకరణములో గల అవిద్య నశించుటయే విద్య యొక్క ప్రయోజనమగును అది కేవలము ఈశ్వరభక్తి చేతను, మహనీ యులగు గురువుల కరుణచేతను, ముముక్షువులకు గలుగును అట్టి అంతఃకరణము శుద్ధముగాని పామరునియొక్కయు, పండితునియొక్కయు హృదయము ఏకరీతిగానే యుండును.

రాగద్వేషాదులు, దృశ్యవిషయములు, ఉభయమున్ను ఇరువురికి ఒకే విధముగా కన్పించుటవల్ల ఆత్మసంస్కారము లేని విద్య జ్ఞానప్రాప్తికిగాని,

ఈశ్వరకరుణకుగాని, తనయాత్మశాంతికిగాని, జీవన్ముక్తి సుఖమునకుగాని ఉపయోగపడదని స్పష్టముగా తెలిసికొనవచ్చును వివర్తభావము రజ్జువును చూచి సర్పమనియు, రాత్రులలో స్తంభమును జూచి దయ్యమనియో దొంగ యనియో, శుక్తిని చూచి వెండియనియు, ఎండమావులను చూచి జల మనియు, ఆకాశమును జూచి నీలవర్ణమనియు గలిగెడు భ్రాంతి ఏదికలదో దీనినే వివర్తమనియెదరు యథార్థము తెలియకపోవుటచేతనే ఒకవస్తువును మరి యొక వస్తువుగా చూడడమైనది అలాగున ఆత్మయొక్క నిజమగు జ్ఞానమును పరిశీలింపక పోవుటవల్లనే భ్రాంతిజ్ఞానము కలుగుచున్నది ఈభ్రాంతి మాయ వల్లనే ఏర్పడుచుండును అని వేదాంతముయొక్క సారము సంగ్రహముగా చెప్పడమైనది ఇది గొప్పదియగు సూర్యబింబము చిన్న అద్దములోగాని, జలపాత్రలోగాని ప్రతిబింబించి నట్లుండును ఈవిషయమై గీతయందు శ్రీకృష్ణభగవానుడు సప్తమాధ్యాయమున ఇట్లుపదేశించెను–

జ్ఞానం తేఽహం సవిజ్ఞాన మిదం వక్ష్యామ్యశేషతః ।
యద్జ్ఞాత్వానేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్య మవశిష్యతే ॥

దేనిని తెలిసికొనిన పిమ్మట ఈ మోక్షమార్గమున తిరిగి మరియొక యుపాయము తెలియవలసినదిగా మిగిలియుండదో, అట్టి అనుభవముతో గూడిన జ్ఞానమును నేనే నీకొఱకు చెప్పబోవుచున్నాను అని భావము అదే విధముగా ఆఱవ అధ్యాయమున,

జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాఞ్చనః ॥

ఆత్మానాత్మ విచారణ పరమగు శాస్త్రజ్ఞానముచేతను, అదే విధముగా అనేక పెద్దలవల్ల శ్రవణముచేసిన జ్ఞానముచేతను, అట్లే తనయొక్క విద్యచేత విమర్శచేసిన వివేక జ్ఞానముచేతను తృప్తి పొందిన వాడును, నిశ్చలమైన మనస్సు గలవాడును, ఇంద్రియ నిగ్రహము కలవాడును యోగి యనం బడును అనగా జ్ఞాని యని యర్థము ఈ ప్రకారముగా నుపదేశించుటచే జ్ఞానము వేఱుగాను, విజ్ఞానము వేఱుగాను బోధపడుచున్నది ఇట విజ్ఞాన మనగా జ్ఞేయమని గ్రహించవలయును జ్ఞేయమనగా తెలిసికొనదగిన వాని

యన్నిటి లోను ముఖ్యవిషయమని తాత్పర్యము ధ్యేయమనగా ధ్యానముచేత పొందదగిన దైవప్రాప్తి యనియర్థము, ఈజ్ఞానవిజ్ఞాన విషయమై– గీత 13వ అధ్యాయమున అర్జునుడు ప్రశ్న వేసియున్నాడు–

'ఏతద్వేదితు మిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ'– ఇచట జ్ఞాని కుండ వలసిన గుణములు జ్ఞానమనియు, ఈ జ్ఞానమే అమానిత్వాదు లనియు ఈ యధ్యాయమున 8వశ్లోకము మొదలు 12వ శ్లోకము వఱకు ఇఱువది గుణములను శ్రీభగవంతు డుపదేశించెను ఈ ఇరువది గుణములు కలిగి యుండినమాత్రమే జ్ఞేయమును పొందుట క్హర్హత గలదని గ్రహింపదగినది మరియు ఈ జ్ఞానము కలిగిన మాత్రముచే తృప్తి బొందకూడదు, తనయొక్క పనిపూర్తి అయిన దనియు గమ్యస్థానము పొందబడినదనియు, కృతార్థుడ నైతిననియు తలంచరాదు జ్ఞేయమును పొందునపుడే తనపని పూర్తి అయిన దనియు, అపుడు మాత్రమే అమృతత్వము అనగా మోక్షము కలిగెననియు తలంచవలయునని శ్రీభగవంతుడే యుపదేశించినాడు

జ్ఞానమనగా నొక ఉన్నతోద్యోగమునకు తగిన పరీక్షలో ఉత్తీర్ణుడైనటు వంటిదని గ్రహింపదగును పరీక్షలో నుత్తీర్ణుడైనంత మాత్రమున ఉద్యోగము లభింపనిచో నా విద్యవల్ల గలిగెడు సౌఖ్యమును పొందజాలడు గదా? కాని పరీక్షయందు విజయము గాంచని యెడల యుద్యోగము లభించదు ఇదియే దీనిలో గల సారము కనుకనే శ్రీకృష్ణభగవానులు అమానిత్వాది జ్ఞానము నుపదేశించిన తరువాత పదమూడవ శ్లోకము నుండి–

జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వాஉమృత మశ్నుతే ।

యని తెలిపెను అమృతత్వము కలిగిన మాత్రముననే జీవుడు జనన మరణదుఃఖముల నుండి విడివడును అప్పుడే నిత్యశాంతియు, నిరతిశయ సౌఖ్యమున్ను, సర్వబంధ విముక్తియున్ను కలుగును వేరులన్నియు తెగిపోయిన వృక్షమేలాగున ఎండిపోవునో, యాలాగున సంస్కారము లన్నియు నశించిన జీవుడు ప్రకృతి నశించిన వాడగును కావున జ్ఞేయము ఆఖరుస్థితి యని తెలియ దగినది. దీనినే ధ్యేయమని గూడ గ్రహించదగినదని ఇదివఱలో తెలుప బడియుండెను

ఈజ్ఞేయమునే ఉపాసనామత ప్రకారము సాకారదైవ సాక్షాత్కార మనియు, సాంఖ్యమత ప్రకారము సాక్షిత్వమనియు, యోగమత ప్రకారము స్వస్వరూప సాక్షాత్కారమనియు చెప్పుదురు వేదాంత సిద్ధాంత ప్రకారము బ్రహ్మసాక్షాత్కార మనియు గ్రహించదగినది బౌద్ధ మతమున జెప్పిన పరమ నిర్వాణపదవియు నిదియే యగును

ఇక ప్రపంచములో గల సర్వమతస్థుల గమ్యస్థానము లేవి గలవో అవి యన్నియు, ఈజ్ఞేయధ్యేయములని మనము తెలిసికొన్నచాలును, జైన మతస్థులు చెప్పెడు'అర్హత్' పదమున్ను ఇదియే, దీనినే జీవన్ముక్తి పదవియని అందరున్ను అంగీకరించియున్నారు అట్టి యవస్థ కలిగిన పిమ్మట జనన మరణాది క్లేశములు, జరా నరాదివ్యాధులు అనుభవించవలసిన పనిలేదనియు చెప్పుదురు ఆ స్థితి కేవలము అనంతానంద మనియు శాస్త్రములు తెలుపు చున్నవి ఆత్మవేత్తలగు మహనీయులున్ను దానినే నిశ్శేషశోకశాంతి, అతి హర్ష మనియు తెలిపిరి ఈ జ్ఞేయమునే కొన్ని భాషలలో కొందరు స్వర్గమనియు, మరికొందరు ఈశ్వరస్థాన ప్రాప్తియనియు, ఇంక కొందరు వైకుంఠ నివాసమనియు, వేరేకొందరు కైలాసములో నివసించుట యనియు, మరి కొందరు సర్వావరణ రహితమగు స్వయంప్రకాశ మనియు, కొందరాత్మ విముక్తి యనియు, మరికొందరు ముక్తి యనియు, ఇంకకొందరు జీవన్ముక్తి యనియు, వేఱే కొందరు విదేహముక్తియనియు, కొందరు నిర్వికల్ప సమాధి యనియు పేర్లు మాత్రము వేఱువేఱుగా చెప్పుదురేకాని మరి ఏలాటి భేదమున్ను దీనియందు లేదు

గీతాచార్యులగు శ్రీకృష్ణభగవానుని మతప్రకారము జ్ఞానమున్ను, జ్ఞేయమున్ను వేఱువేఱుగా భావించుచున్నట్లు మనమిప్పుడు తెలిసికొన్నాము కాని కొన్ని స్థలములలో జ్ఞానమునకే జ్ఞేయమని అర్థము గలదనియు తెలిపి యున్నారు కనుకనే ఈ 13వ అధ్యాయమున, జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్యవిష్ఠితమ్ అని చెప్పబడినది ' జ్ఞానగమ్యం' ఇచట జ్ఞానమునకే జ్ఞేయమని యు, జ్ఞేయమునకు జ్ఞానమనియు అర్థము గలదనియు తెలిసి అట్టి జ్ఞేయ బ్రహ్మము సర్వప్రాణికోట్ల హృదయమందు వెలుగుచుండెడి ఆత్మయని

యుపదేశించిరి ఇట్లు చెప్పుటచే అమానిత్వాది జ్ఞానముగలవారు మాత్రమే జ్ఞేయమగు బ్రహ్మమును పొందగలరని స్పష్టముగా చెప్పినారు ఇది అమృతము, శివమును, ఆనందము, అద్వైతము

ఇట్టి జ్ఞేయబ్రహ్మమును, అనగా ముక్తిని జీవించియుండునప్పుడే పొందవలయును కావుననే జీవన్ముక్తియని చెప్పుచున్నారు దేహాంతమున జీవుడు ఏయవస్థను పొందియుండునోదాని కనువగు స్థానముమాత్రమే దేహ వియోగానంతరము సిద్ధించును అంత్యకాలస్థితి ననుసరించియే పరలోక మందును, పునర్జన్మ గలుగునపుడున్ను కలుగును దేహముండునపు డు మాత్రమే మార్పు చేసికొనుటకు మనకు శక్తికలిగి యుండును పరలోక ప్రయాణమందుకాని, పరలోకమందుగాని మరలజన్మమును మార్చుట యందు జీవులు శక్తి గలిగియుండరు ఆ పరలోక వాసమున్ను, మఱల వచ్చెడి జన్మమున్ను కర్మా ధీనము కావున అచట స్వప్రయత్నము కలుగదు

పాశముచే బంధింపబడిన పశువు ఏలాగున బంధమునకు లోబడి యుండవలయునో కర్మపాశమున్ను అటువంటిది పాశము పట్టుకొని వెళ్ళెడు మనుజు ననుసరించి పశువులు ఎట్లు పోవలసియుండునో, కర్మబద్ధులగు జీవుల యొక్క స్థితియున్ను అటువంటిది లేక విత్తనముపెట్టునపుడు దాని ఫలమును తెలిసికొని పెట్టుశక్తి ఏలాగున మానవుడు కలిగియుండునో అట్లుగాక పైరుపెట్టిన తరువాత ఏలాగున మార్పుచేసి కొనుటకు తరముగాదో, రాబోవు సంవత్సరమున ఆ ధాన్యమునే భోజనము చేయవలసియుండునో కర్మయొక్క రీతియు నిటువంటిది

పరలోకనివాసమున్ను, మఱలవచ్చెడు జన్మమున్ను మనయొక్క హస్త గతముగా నుండును దానిని మనము ఇపుడిష్టము వచ్చినట్లు మార్చుకొన వచ్చును ఇదే మానవుని యొక్క స్వబుద్ధివిశేషము; సంచితకర్మ విడిచిపెట్టిన బాణము వంటిది అది ప్రారబ్ధ రూపముగా ఇపుడు వచ్చినది ఆగామికర్మ అను సంధించిన బాణము వంటిది మన ఇష్టము ననుసరించి దానిని ఉపసంహ రించుకొనవచ్చును, లేక లక్ష్యమును మార్చుకొనవచ్చును ఇదే ముముక్షువులు వివేకమువల్ల కర్మను మార్చుకొనెడు ఉపాయమని తెలియదగినది కనుక

స్వపంతం వాపి భుంజానం గచ్ఛంత మపి వర్త్మని ।
యువాన మపి బాలం వా స్వవశే కురుతే విధిః ॥

నిద్రించువాడైనను, భుజించువాడైనను, మార్గములో సంచరించు వాడైనను, యువకుడైనను, బాలుడైనను విధి అనగా కర్మమునకు అధీనుడు కావలసియుండును జీవించియున్నపుడే జీవన్ముక్తిని పొందవలయునని శ్రుతి స్మృతు లేకకంఠముగా చెప్పుచున్నవి

ఇహైవ తైర్జిత స్సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః ॥

ఎవరియొక్క మనస్సు బ్రహ్మము మొదలు స్తంబము వఱకుగల చరాచర ప్రాణికోట్లలో సమానమగు దైవభావ విషయమందు స్థిరముగా నుండునో, వారిచేత ఈశరీరముతో నుండునపుడే (జీవించియుండునపుడే) జననమరణ రూపసంసారము జయింపబడినది దీనివల్ల జీవించియున్నపుడే జన్మ రాహిత్యము కలుగవలయునని సిద్ధమగుచున్నది

శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్ఛరీరవిమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం స యుక్త స్స సుఖీ నరః ॥

కామము వలనను, కోపము వలనను పుట్టిన క్షోభమును ఇచటనే అనగా ఈ దేహమునం దున్నప్పుడే సహించుటకు (అణచుటకు) ఏ మనుష్యుడు సమర్థు డగుచున్నాడో వాడు యోగియు, ఆత్మానుభవముగల జ్ఞానియు అగుచు న్నాడు అట్టివాడు మాత్రము నిరతిశయ బ్రహ్మసుఖమును పొందగలుగును గీతాచార్యులు ఉపదేశించిన ఈ వాక్యము జిజ్ఞాసువులు చాలా జాగ్రత్త గలిగి చింతన చేయవలసియుండును ఇక ఈ విషయమై కఠోపనిషత్తు ఏమి చెప్పుచున్నదో చూడుడు

ఇహ చేదశకద్బోద్ధుం ప్రాక్ఛరీరస్య విస్రసః ।
తతస్సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే ॥

ఈ దేహము పడిపోవుటకంటె ముందు, ఈలోకమునందే బ్రహ్మాత్మ జ్ఞాన బోధమును తెలిసికొనుటకు అసమర్థుడైనయెడల భూర్భువాది ఊర్ధ్వ లోకములలోగాని, అతల వితల పాతాళ లోకములలోగాని శరీర భావమునకు

(జన్మమెత్తుటకు) సమర్థుడగుచున్నాడు కావున పాంచ భౌతికమగు శరీరము పడిపోవుటకు ముందే ఆత్మావబోధ ప్రయత్నము చేయ దగినదని భావము ఈ శ్రుతి మానవజన్మయొక్క శ్రేష్ఠత్వమును తెలుపుచున్నది జ్ఞానమువల్ల మనుజుడు శ్రేష్ఠుడని చెప్పుచున్నప్పటికిన్ని మనుష్యజన్మ మొకటి మాత్రమే బ్రహ్మమును తెలిసికొనుటకు అర్హమగు సృష్టి గలిగియు న్నదను రహస్యమును ఉపదేశించియున్నది ఇట్టి యోగ్యత దేవతలకుకూడ లేదు కావుననే దేవతలతో సహా అందరును మానవ జన్మమెత్తి తపోయోగాదుల ననుష్ఠించి జ్ఞానము పొంది, ముక్తి నొందవలయునని శాస్త్రము చెప్పెడు రహస్యము

యథాఽఽదర్శే తథాఽఽత్మని
యథా స్వప్నే తథా పితృలోకే ।
యథాప్సు పరీవదదృశే తథా గన్ధర్వలోకే
ఛాయాతపయోరివ బ్రహ్మలోకే ॥

ఏ విధముగా అద్దమునందు తన ప్రతిబింబము స్పష్టముగా కనబడు చున్నదో అదేవిధమున మనుజ జన్మబుద్ధియందు ఆత్మదర్శనమున్ను స్పష్టముగా అగుచున్నది ఏవిధముగా స్వప్నమునందు తన స్వరూపము వికార ముగ కనపడుచుండునో, ఆలాగున పితృలోకమునందు ఆత్మ దర్శనము అస్పష్టముగా కన్పించును జలములందేవిధముగా తన ప్రతి బింబము స్పష్టము గాక, సంకీర్ణమైన అవయవములు గలదిగా అంతట చూడబడుచున్నదో, అదేవిధముగా (గంధర్వలోకము) స్వర్గలోకమునందు అస్పష్టముగా చూడబడుచున్నది

బ్రహ్మలోకే-బ్రహ్మలోకమునందు నీడ ఎండలయందువలె అస్పష్ట ముగా కన్పించును దీనివల్ల మనుష్యజన్మ బుద్ధియొక్క విశేషము గొప్పతనము గ్రహించుకొనదగినది ఇక ఈ విషయమై మానవలోకముయొక్క ప్రాశస్త్య మును గురించి గరుడపురాణమున విష్ణుభగవాను లుపదేశించినది చూడుడు

ఇహైవ నరకవ్యాధేశ్చికిత్సాం న కరోతి యః ।
గత్వా నిరౌషధం దేశం వ్యాధిస్థః కిం కరిష్యతి ॥

ఎవడు నరకమనెడి వ్యాధికి ఈలోకమున ఈదేహముతో కూడి

యున్నప్పుడే జ్ఞానమనెడు చికిత్స చేయడో, వైద్యుడున్ను, ఔషధమున్ను లేని పరలోకములకువెళ్ళి ఆరోగి ఏమి చేయగలడు? కనుక ఈ మానవజన్మము నందే భవరోగ శమనమునకు తగిన భవరోగవైద్యులును, జ్ఞానోపదేష్టయగు ఆచార్యుడును, బ్రహ్మవిచారమనెడు ఔషధమున్ను గలదు కాని స్వర్గాది లోకములలో ఈ రెండున్ను లేవు అవి ఎటువంటివనగా, ఔషధమున్ను, వైద్యుడున్ను, వైద్యాలయమున్ను, అనుకూలపథ్యమున్ను గల స్థలములో రోగి ఔషధసేవ చేయక పైన చెప్పిన ఔషధ వైద్యులు లేని ప్రదేశములలో వెళ్ళి రోగమును బాగుచేయించుటకు చూచే లాగున నుండును

చతురశీతి లక్షేషు శరీరేషు శరీరిణామ్ ।
న మానుష్యం వినాఽన్యత్ర తత్త్వజ్ఞానం తు లభ్యతే ॥

ఎనుబదినాలుగు లక్షల శరీరములయందును జీవులకు మనుష్య జన్మమున తప్ప ఇతర జన్మలలో తత్త్వజ్ఞానము లభింపదని భావము

సోపానభూతం మోక్షస్య మానుష్యం ప్రాప్య దుర్లభమ్ ।
యస్తారయతి నాత్మానం తస్మాత్పాపతరోఽత్ర కః ॥

మోక్షమునకు సోపానభూతమును, దుర్లభమునగు మనుష్య జన్మమును పొందియు ఎవడు ఆత్మకు తరణోపాయము చూచుకొనడో, వాని కంటె పాపి ఎవడు? మఱియు ఇట్టి మనుజ జన్మములో వార్ధక్యదశ వచ్చుటకు ముందుగానే జ్ఞానప్రాప్తికి తగిన కార్యము చేసికొనవలయునని యుపదేశించు చున్నది -

యావన్నాశ్రయతే దుఃఖం యావన్నాయాంతి చాపదః ।
యావన్నేంద్రియవైకల్యం తావచ్ఛ్రేయస్స మభ్యసేత్ ॥

యావత్తిష్ఠతి దేహోఽయం తావత్తత్త్వం సమభ్యసేత్ ।
సందీప్తే కోణభవనే కూపం ఖనతి దుర్మతిః ॥

ఎంతవఱకు దుఃఖములు సంప్రాప్తములు కావో, ఎంతవఱకు ఆపదలు రావో, ఎంతవఱకు ఇంద్రియవికలత్వము కలుగదో, ఎంతవఱకు జరానరాదులు బాధింపవో, అంతకుముందే ఆత్మశ్రేయస్సును (జ్ఞాన

మార్గము) చూచుకొనవల యును అట్లుచేయక, యౌవనకాల మంతయు వ్యర్థపఱచి అంత్యకాలమున మోక్షమును సంపాదించుకొనవచ్చునని తలంచెడిది ఎటువంటిదనగా, ఇంటి ముంగిట నిప్పంటుకొన్న తరువాత ఆనిప్పును చల్లార్చుటకు నీటి కొఱకు నూయి త్రవ్వుటకు ప్రారంభించుట వాడెంత మూఢుడో అటువంటిదని జ్ఞాపక ముంచుకొనవలయును ఇక మాయయొక్క మహిమ ఎటువంటిదో తెలుపు చున్నాడు

పశ్యన్నపి ప్రస్ఖలతి శృణ్వన్నపి న బుధ్యతి ।
పఠన్నపి న జానాతి దేవమాయా విమోహితః ॥

దేవమాయా విమోహితుడు చూచుచున్ననుగూడ జారిపడు చున్నాడు విను చున్ననుగూడ బోధపఱచుకొనలేకున్నాడు చదువుచు సైతము తెలిసికొనలేక పోవుచున్నాడు అనగా మాయామోహముచే చూచియు అంధు డగుచున్నాడు వినియు బధిరు డగుచున్నాడు చదివియు గ్రహింపజాల కున్నాడు హఠయోగప్రదీపిక ప్రారంభములోనే కేవలము జ్ఞేయమగు బ్రహ్మ ప్రాప్తికొఱకే యమని యమాది అష్టాంగ యోగము ఉపదేశింపబడుచున్నదని తెలుపబడినది

శ్రీ ఆదినాథాయ నమోస్తు తస్మై యేనోపదిష్టా హఠయోగవిద్యా ।
విభ్రాజతే ప్రోన్నతరాజయోగ మారోఢుమిచ్ఛోరధిరోహిణీవ ॥

మిగుల శ్రేష్ఠమైన రాజయోగము నధిరోహించుటకు(ఎక్కుటకు) కోరికగల వారికి నిచ్చెనవలె ప్రకాశించు హఠయోగవిద్య నుపదేశించిన శ్రీ ఆది నాథులకు నమస్కారము అనగా జ్ఞేయమగు బ్రహ్మపదము నెక్కుటకు అష్టాంగ యోగమునిచ్చెన వంటిదని తెలుపడమైనది.

ప్రణమ్య శ్రీగురుం నాథం స్వాత్మారామేణ యోగినా ।
కేవలం రాజయోగాయ హఠవిద్యోపదిశ్యతే ॥

తన గురువైన గోరక్షనాథులను భక్తిపూర్వకముగా నమస్కరించి స్వాత్మారామయోగిచేత కేవలము రాజయోగము సిద్ధించుకొఱకు హఠవిద్య యుపదేశింపబడుచున్నది కేవలము 'రాజయోగాయ' అని ప్రయోగించుటవల్ల ఆత్మసాక్షాత్కార జ్ఞానముకొఱకు హఠవిద్య యుపదేశింపబడెనని తెలిసికొనవల

గును ఇట్లు ఈ గ్రంథముయొక్క ఆదియందు ఉపదేశింపబడినదేగాక అంత్యమందు గూడ ఈతత్త్వ ముపదేశింపబడినది కావున సాధనలోనే కాలము గడుపక జ్ఞేయబ్రహ్మమును పొందుటకై యత్నించవలయును

సర్వే హఠలయోపాయా రాజయోగస్య సిద్ధయే ।

రాజయోగసమారూఢః పురుషః కాలవంచకః ॥

హఠోపాయములును, లయోపాయములును అగునవి యన్నియు రాజయోగ నిమిత్తము చెప్పబడెను

ఇక ఈ జ్ఞేయస్థితిని గుఱించి ఉత్తరగీతయందు శ్రీకృష్ణపరమాత్మ ఉపదేశించినది చూడదగినది ఉత్తరగీతయని చెప్పుటలోనే శ్రీభగవద్గీత పూర్వగీత యని ఏర్పడుచున్నది ఉత్తరగీత కేవలము బ్రహ్మనిర్వాణమును గూర్చి ఉపదేశింపబడినది కావుననే ప్రథమమున ఈక్రింది శ్లోకమునిట్లు అడుగడమైనది జీవితములో నాలుగుభాగములు కలవు బ్రహ్మచర్యము, గృహస్థము, పూర్వాశ్రమ మనియు వానప్రస్థము, సన్న్యాసము ఉత్తరాశ్రమమనియు శాస్త్రసమ్మతము పూర్వాశ్రమము అంతఃకరణ శుద్ధి కొఱకు ధర్మోపాసనలను బోధించుచుండును ఇది కొంత ప్రపంచముతో సంబంధించి యుండును ఉత్తరాశ్రమము నిర్విషయ నిర్వాణమును మాత్రముపదేశించును ఇదియే జీవునియొక్క పరమార్థ దశ యగును

హృదయాంబుజ మధ్యస్థం జ్ఞానజ్ఞేయస్వరూపకమ్ ।

తత్క్షణాదేవ ముచ్యేత యద్జ్ఞానాద్బ్రూహి కేశవ ॥

ఓ కేశవా! ఏది హృదయకమల మధ్యమందుండునదై, జ్ఞానజ్ఞేయ స్వరూపము కలదియై యుండునో, దేనిని తెలిసికొనుటవలన తత్క్షణమునందే ముక్తినొందనగునో అట్టి జ్ఞానమును నాకు ఉపదేశింపవలయును దీనియందు 'జ్ఞాన జ్ఞేయ స్వరూపకం' అని చెప్పుటచే కేవలదైవజ్ఞానమునే జ్ఞేయమని తెలిసి కొనవలయును గీతయందు జ్ఞానమును వేరుగాను, జ్ఞేయమును వేరుగాను తెలుపుచు జ్ఞానమునకే జ్ఞేయమనియు అర్థము గలదనియు తెలుపడమైనది.

ప్రాప్తే జ్ఞానేన విజ్ఞానే జ్ఞేయే చ హృది సంస్థితే ।
లబ్ధశాన్తి పదే దేహే న యోగో నైవ ధారణా ॥

జ్ఞానముచేత పరమాత్మజ్ఞానము పొందబడినదగుచుండగను, జ్ఞేయము (పరబ్రహ్మము) హృదయమునందు ప్రకాశించుచుండగను జీవుడు లబ్ధశాంతి గలవాడగుచుండగను యోగము లేదు ధారణయు లేదు గమ్య స్థానము చేరువరకు మాత్రముగదా గమనము కలుగును ఆలాగున యోగ మున్ను, ధారణయున్ను జ్ఞేయైకస్థితి పొందువఱకే యుండును తరువాత సాధన, అనుష్ఠానము అవసరము లేదని యర్థము కాదు నదియొక్క గమనము సముద్రమును చేఱువరకే యుండును మఱల ఏమగుచున్నది? గమనమాగి అనంతమైన సాగరమగుచున్నది దీనియందు చెప్పిన జ్ఞానమున్ను విజ్ఞానమున్ను జ్ఞేయైకస్థితి పొందుట కొఱకని రూఢిపడినది గదా!

ముహూర్తమపి యోగచ్ఛేన్నాసాగ్రే మనసా సహ ।
సర్వం తరతి పాప్మానం తస్య జన్మ శతార్జితమ్ ॥

నాసికాగ్ర భాగమునందు అనగా జ్ఞేయబ్రహ్మమునందు, మనస్సుతో గూడ క్షణము సేపైనను, తత్త్వజ్ఞానార్థము నిశ్చలస్థితిని ఎవడు పొందునో అట్టి వాడు వందలకొలది జన్మములలో ఆర్జించిన పాపము సర్వమును దహింప జేయుచున్నాడు

అహం బ్రహ్మేతి మాంధ్యాయేదేకాగ్రమనసా సకృత్ ।
సర్వం తరతి పాప్మానం కల్పకోటిశతైరపి ॥

ఎవడు నిశ్చల మానసముచే తానే బ్రహ్మమని నన్ను పలుమారు ధ్యానము చేయునో, అనగా ఆ బ్రహ్మమే భగవత్స్వరూపమనియు, ఆ భగవత్స్వరూపమే తనయొక్క స్వరూపమని ఎవడు ధ్యానము చేయునో, వాడనేక శతకోట్ల కల్పములందు చేయబడిన సమస్తమైన పాపములనుండి తరించుచున్నాడు

ఘటసంవృతమాకాశం లీయమానే యథా ఘటే ।
ఘటో నశ్యతి నాకాశం తద్వజ్జీవః పరాత్మని ॥

ఘటము నశింపగా ఏ విధముగా ఘటమే నశించునుగాని ఘటా

వృతమైన ఆకాశము నశింపదో, ఆలాగున దేహము నశింపగా జీవుడు సత్సంస్కారబలము చేత పరమాత్ముని యందైక్యము నొందువాడగును అనగా సర్వపరిపూర్ణుడగు పరమాత్మయే తానగునని భావము

తపేద్వర్షసహస్రాణి ఏకపాదస్థితో నరః ।
ఏకస్య ధ్యానయోగస్య కళాం న్నార్హతి షోడశీమ్ ॥

మానవుడు ఒంటికాలి యందున్నవాడై అనేకములైన వేల సంవత్స రములు తపస్సు చేసినను, బ్రహ్మాత్మైక్యమగు నొక ధ్యానయోగము యొక్క పదునా అవదైన కళతో (ఫలముతో) సరిపోడు

పరత్రావస్థితం శాన్తం న ప్రపశ్యేజ్జనార్దనమ్ ।
జ్ఞాన చక్షుర్విహీనత్వాదంధ స్సూర్యమివోదితమ్ ॥

అంతటను ఉన్నట్టివాడును, నిర్వకారుడును అయిన పరమాత్మను, ఉదయించిన సూర్యుని గ్రుడ్డివాడు చూడజాలని చందమున జ్ఞాననేత్రము లేని వాడు చూడజాలడు

అంతస్సంగం బహిస్సంగమాత్మసంగం పరిత్యజేత్ ।
సర్వసంగ నివృత్తాత్మా పశ్యేదాత్మాన మాత్మని ॥

లోపలి సంబంధమును, బాహ్యసంబంధమును, మనస్సంబంధమును వదలివేయవలయును తన ఆత్మయందు పరమాత్మ నెఱుంగవలయును దీని యందు మూడు సంగములు చెప్పడమైనది మొదట ప్రపంచముతో గల సంబంధము లన్నిటిని విడువవలయును రెండవది దేహముతో సంబంధముగల భావములను త్యజించవలయును మూడవది ఆత్మకు అనాత్మస్వరూపమగు మనోబుద్ధ్యాదులతో గల సంబంధమును త్రుంచవలయును ఈలాగున సర్వ సంగములను త్యజించినవాడు మాత్రమే ఆత్మయందు పరమాత్మను దర్శింప గల్గును ఈ శ్లోకమును అర్థము చేసికొనిన తనయొక్క సంగత్యాగము ఎంతవఱకు కలిగినదని తెలిసికొనవచ్చును లోకమునకు, దేహమునకున్ను గల సంబంధమొకటి దేహమునకు, మనస్సునకు గలసంబంధము రెండవది మనస్సునకు, ఆత్మకు గల సంబంధము మూడవది ఇవన్నియు తొలగినపుడు మాత్రమే మేఘము వదలిన నిర్మలాకాశమునందుండు సూర్యునివలె

హృదయాకాశమందు స్వప్రకాశ స్వరూపుడగు తన ఆత్మను దైవమయముగా చూడగలుగును అంతవఱకు బాగుగా వెలుగుచుండు దీపమును పాత్రచేత మూసిపెట్టి నట్లుండును

నిర్మథ్య చతురో వేదాన్మునినా భారతం కృతమ్ ।
భారతోదధి మంథస్య గీతా నిర్మథనస్య చ ।
సారముద్ధృత్య తం కృష్ణో అర్జునస్య ముఖే హుతమ్ ॥

నాలుగు వేదములను గోవులయొక్క సారమను క్షీరమును, శ్రీవ్యాస భగవానుడు పితికి తన తపస్సనెడు ఘటములోగాచి పెఱుగు అనెడి భారత గ్రంథమును రచించెను శ్రీకృష్ణమూర్తి అట్టి భారతమను పెరుగుకడవను గీత యను కవ్వముచేత చక్కగా చిలికి సారభూతమగు నవనీతమును గైకొని అర్జునుని నోటిలో నుంచిరి మాండూక్యోపనిషత్తునందు ఈ జ్ఞేయమునే బ్రహ్మమనియు, తెలిసికొనదగిన విషయము లన్నిటిలోను ఈజ్ఞేయబ్రహ్మయే తెలిసికొనదగినదనియు నుపదేశించడమైనది

ప్రపంచోపశమం శాన్తం శివమద్వైతమ్ ।
చతుర్థం మన్యన్తే స ఆత్మా స విజ్ఞేయః ॥

ప్రపంచము శాంతి నొందినదిన్ని, రాగద్వేష దోషములు లేనిదిన్ని, పరిశుద్ధము నైనదియునైన భేదములేని అద్వైతమునే తురీయమునుగా తలంచుచున్నారు. అది పరమాత్మ స్వరూపము, ఆపరమాత్మ స్వరూపము తెలిసికొనదగి నది

త్రిషు ధామసు యస్తుల్యం సామాన్యం వేత్తి నిశ్చితః ।
స పూజ్యస్సర్వభూతానాం వన్ద్యశ్చైష మహామునిః ॥

మూడైన స్థానములయందు సమానత్వము ఏదియో, ఆసమానత్వమును నిశ్చయమును పొందినవాడై ఎవడు తెలిసికొనుచున్నాడో, వాడు సమస్తభూతములకును పూజింపదగినవాడును, నమస్కరింప దగినవాడును, గొప్పముని యును అగుచున్నాడు

అకల్పకమజం జ్ఞానం జ్ఞేయాభిన్నం ప్రచక్షతే ॥
బ్రహ్మజ్ఞేయ మజం నిత్యమజేనాజం విబుధ్యతే ॥

వృతమైన ఆకాశము నశింపదో, ఆలాగున దేహము నశింపగా జీవుడు సత్సంస్కారబలము చేత పరమాత్మని యందైక్యము నొందువాడగును అనగా సర్వపరిపూర్ణుడగు పరమాత్మయే తానగునని భావము

తపేద్వర్షసహస్రాణి ఏకపాదస్థితో నరః ।
ఏకస్య ధ్యానయోగస్య కళాం నార్హతి షోడశీమ్ ॥

మానవుడు ఒంటికాలి యందున్నవాడై అనేకములైన వేల సంవత్స రములు తపస్సు చేసినను, బ్రహ్మాత్మైక్యమగు నొక ధ్యానయోగము యొక్క పదునా అవదైన కళతో (ఫలముతో) సరిపోడు

పరత్రావస్థితం శాన్తం న ప్రపశ్యేజ్జనార్దనమ్ ।
జ్ఞాన చక్షుర్విహీనత్వాదంధ స్సూర్యమివోదితమ్ ॥

అంతటను ఉన్నట్టివాడును, నిర్వకారుడును అయిన పరమాత్మను, ఉదయించిన సూర్యుని గ్రుడ్డివాడు చూడజాలని చందమున జ్ఞాననేత్రము లేని వాడు చూడజాలడు

అంతస్సంగం బహిస్సంగమాత్మసంగం పరిత్యజేత్ ।
సర్వసంగ నివృత్తాత్మా పశ్యేదాత్మాన మాత్మని ॥

లోపలి సంబంధమును, బాహ్యసంబంధమును, మనస్సంబంధమును వదలివేయవలయును తన ఆత్మయందు పరమాత్మ నెఱుంగవలయును దీని యందు మూడు సంగములు చెప్పడమైనది మొదట ప్రపంచముతో గల సంబంధము లన్నిటిని విడువవలయును రెండవది దేహముతో సంబంధముగల భావములను త్యజించవలయును మూడవది ఆత్మకు అనాత్మస్వరూపమగు మనోబుద్ధ్యాదులతో గల సంబంధమును ద్రుంచవలయును ఈలాగున సర్వ సంగములను త్యజించినవాడు మాత్రమే ఆత్మయందు పరమాత్మను దర్శింప గల్గును ఈ శ్లోకమును అర్థము చేసికొనిన తనయొక్క సంగత్యాగము ఎంతవఱకు కలిగినదని తెలిసికొనవచ్చును లోకమునకు, దేహమునకున్ను గల సంబంధమొకటి దేహమునకు, మనస్సునకు గలసంబంధము రెండవది మనస్సునకు, ఆత్మకు గల సంబంధము మూడవది ఇవన్నియు తొలగినపుడు మాత్రమే మేఘము వదలిన నిర్మలాకాశమునందుండు సూర్యునివలె

సహజ సమాధియగు ఆత్మైకబోధమని అర్థము గ్రహించు కొనవలయును

మనోదృశ్యమిదం ద్వైతం యత్కించి త్సచరాచరమ్ ।
మనసో హ్యమనీభావే ద్వైతం నైవోపలభ్యతే ॥

ఈ చరాచరాత్మకమగు ఈద్వైతము మనస్సే, మనస్సుయొక్క అమనీ భావమునందు ద్వైతము పొందుట లేదుకదా? ద్వైతాద్వైతముల రహస్యము ఆత్మసాక్షాత్కారము కలుగునపుడే గోచరించునని ఈశ్రుతి యుపదేశించు చున్నది చరాచరాత్మకమగు జగత్తంతము మనస్సుచేత కల్పితము, అట్టి మనస్సు శుద్ధమగునపుడు అద్వయమగు బ్రహ్మ మొకటియే మిగిలియుం డును అది చక్కని దృష్టాంతముచే క్రిందివాక్య ముపదేశించుచున్నది

అద్వయం చ ద్వయాభాసం మనస్స్వప్నే న సంశయః ।
అద్వయం చ ద్వయాభాసం తథా జాగ్ర న్న సంశయః ॥

అద్వయమగు మనస్సు స్వప్నమునందు ద్వయాభాస మగుచున్నది సంశయము లేదు అదే విధముగా అద్వయమగు మనస్సు జాగ్రద్దశయందు ద్వయా భాసమగుచున్నది, సందేహము లేదు

యధా స్వప్నే ద్వయాభాసం స్పందతే మాయయా మనః ।
తథాజాగ్రద్ద్వయాభాసం స్పందతే మాయయా మనః ॥

ఏవిధముగ స్వప్నమునందు మనస్సు, మాయచేత ఆభాసద్వైతమును కలిగించు చున్నదో అదేవిధముగా జాగ్రద్దశయందు మనస్సు ద్వైతాభాసమును మాయచేత కలుగజేయుచున్నది

స్వప్నమునందు లేని జగద్విలాసము ఎట్లు కలుగుచుండునో, జాగ్రద్దశకు వచ్చిన పిమ్మట అవి ఏలాగున మిథ్యారూపమై పోవుచుండునో ఆలాగుననే అజ్ఞానమగు సుషుప్తిలో నుండువఱకు ఈజగత్తు కలిగి యుండును ఇదియే దీనిలోగల సత్యము

అనాది మాయయా సుప్తో యదా జీవః ప్రబుధ్యతే ।
అజ మనిద్ర మస్వప్న మద్వైతం బుధ్యతే తదా ॥

ఆది లేని మాయచేత నిద్రించువాడగు జీవుడు ఎప్పుడు మేలుకొను చున్నాడో అపుడు పుట్టుక లేనిదియము, నిద్ర లేనిదియు, స్వప్నము లేనిది

యును అగు, అద్వయస్వరూపమగు(తుర్యమును) జ్ఞేయమును తెలిసికొను చున్నాడు నిద్రనుండి లేచినవాడు, తానెవడు? ఎచట నున్నాడు? ఏకార్యము చేయుట కొఱకు వచ్చినాడో? వీటిని ఎట్లు తెలిసికొనుచున్నాడో, మాయా మోహ నిద్రనుండి మేల్కొనిన వాడున్ను తనయొక్క స్వరూపమును తెలిసి కొనుచున్నాడు

స ఏష నేతి నేతీతి వ్యాఖ్యాతం నిహ్నుతే యతః ।
సర్వమగ్రాహ్య భావేన హేతునాఽజం ప్రకాశతే ॥

వ్యాఖ్యాతమైన సకలమును ఏ హేతువువలన ఈయాత్మ కాదు కాదని, గ్రాహ్యము కాదనెడి హేతువుచేత తీసివేయుచున్నదో, అందుచే బ్రహ్మము ప్రకాశించుచున్నది దృశ్యనిషేధరూపముగ జ్ఞేయమును ఈవాక్య ముపదేశించు చున్నది లోకము మొదలు బుద్ధిపర్యంతముగల సమస్తమున్ను పరిశోధించిన ఆత్మకాదని తెలియదగును ఏలన బుద్ధిపర్యంతముగల అవి అన్నియు దృశ్యములు అపుడు దృక్కగు జ్ఞేయబ్రహ్మ మొకటియే మిగులును అదే మన ఆత్మస్వరూపము ఇదే తెలిసికొనదగినది ఇది జ్ఞేయమును బోధించునదగుట చేతను ఉపనిషత్సార మగుటచేతను మిక్కిలి విస్తరించి వ్రాయబూనలేదు అరటి చెట్టుయొక్క పట్టలను ఒక్కొక దానిని తీసివేసినచో మోము ఎట్లు మిగులు చుండునో, ముంజగడ్డి యొక్క పొరలను ఒక్కొక దానిని తీసివేసి లోపల నుండెడి ఈనెను ఏలాగున గ్రహించి,మౌంజీ బంధమున కుపయోగప ఱచెదరో, ఆలా గున 'నేతినేతి' వాక్యములచే బుద్ధిపర్యంతముగల సమస్తము త్రోయబడగా స త్యస్వరూపమగు జ్ఞేయమగు ఆత్మ యొకటియే మిగులును అది ఓం తత్ సత్

స ఆత్మా స చ విజ్ఞేయః సర్వైరపి ముముక్షుభిః ।
తుర్యాత్మజ్ఞాన హీనానాం న ముక్తిః స్యాత్కదాచన ॥

ముముక్షువులందరికి తురీయమగు ఆ ఆత్మ తెలిసికొనదగినది అట్టి తురీయమగు ఆత్మయొక్క జ్ఞానమును పొందని వారికి ఏకాలమందున్ను మోక్షము లభించదు

శ్రీపతంజలి మహర్షి యోగదర్శనమందు తురీయజ్ఞానమే జ్ఞేయ

మనియు, అట్టిదానినే ముముక్షువులు సాక్షాత్కరించ వలయుననియు ఉపదేశించిరి

పాతంజలి యోగశాస్త్రము

తదా ద్రష్టుస్స్వరూపావస్థానమ్ ।

చిత్తవృత్తులు నిగ్రహమైయుండు (యోగపరిపక్వ మైన) కాలము నందు చిన్మాత్రుడైన పురుషుడు నిజస్వరూపము నందుండుట సంభవించు చున్నది దీనికే జ్ఞేయముయొక్క జ్ఞానమని తాత్పర్యము

వీతరాగవిషయం వా చిత్తమ్ ।

లోకవిషయముల యందాశయున్ను, ఆ వ్యాపారముల భావనయును లేని చిత్తము స్థైర్యమును పొందును నిర్విషయమగు చిత్తము ఆత్మోపలబ్ధికి కారణమగుచున్నది

సమాధి సిద్ధిరీశ్వర ప్రణిధానాత్ ।

పరమేశ్వరునియందు అతిశయమైన భక్తి గలుగుటవలన ఈశ్వర సాక్షాత్కార సమాధి జ్ఞానము కలుగును అట్టి శుద్ధమగు భక్తిగూడ జ్ఞేయమును కలుగ జేయును

తత్రప్రత్యయైకతానతా ధ్యానమ్ ।

ధారణాస్థలమునందు జ్ఞానముయొక్క ధ్యానేతర వస్తువులను చిత్తము నందు రానీయక చేయుటయే శుద్ధమైన ధ్యానమనబడుచున్నది

తదేవాత్మ మాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః ।

ముందు చెప్పిన ధ్యానము, ధ్యానించు వస్తువులయొక్క స్వరూపమై ఆధ్యానము కూడా లేక జ్ఞేయైకస్థితిని కలిగియుండుట సమాధి యనబడును

ఇక అహింసాదులలో నొక్కొక్క ధర్మానుష్ఠానముయొక్క ఫలమును నిరూపించుచున్నారు వీటియొక్క అనుష్ఠానముచే శుద్ధి కలుగునపుడు దాని యొక్క ప్రయోజనము కలుగును ఏ బీజముపెట్టి పోషించినను కాలము పరిపక్వస్థితికి వచ్చినపుడు దానియొక్క సిద్ధియు నాలాగున నుండును

అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః । 1

అహింసాభ్యాసము సిద్ధిగల యోగి నివసించు స్థలమున పరస్పరము వైరము గల జంతువులు కూడ వైరభావమును విడిచి ప్రేమగలిగియుండును, అనగా శత్రుత్వము లేనివై మిత్రత్వముతో మెలగుచుండును

సత్య ప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వమ్ । 2

సత్యము నందభ్యాసము కలవాడు అగ్నిష్టోమాది కర్మములు చేయకున్నను వాని ఫలము లభించును సత్యమును చెప్పెడు సిద్ధిగలవానికి తన వాక్కుతో ఏవాక్యము చెప్పునో అది తప్పక ఫలించును ఋషులకు గల నిగ్రహానుగ్రహ శక్తికిన్ని ఇదే కారణము

అస్తేయ ప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానమ్ । 3

పరుల వస్తువులలో ఆశలేనివాడై ఇతరుల ఏవస్తువునున్ను అపహరించని వానికి అప్రయత్నముగనే సకలస్థలములయందు గల సమస్త రత్నములు తనంతట లభించును అనగా సమస్తధనములున్ను వానిదగ్గర చేరును. భూమిలోగల నిధులుకూడ అతని నేత్రములకు గోచరించును

బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః । 4

బ్రహ్మచర్యము నభ్యసించుటవలన బ్రహ్మవర్చస్సు గలుగును బ్రహ్మమును ధారణచేయుటకు తగిన శుద్ధమైన మేధ ఉదయించును దీనివల్ల ఆత్మజ్ఞానము చేకూరును కాన ఇంద్రియమును నష్టపరచక కాపాడుచుండవల యును తైలము జ్యోతిగా మాఱి చీకటి గృహములోగల అన్ని వస్తువులను ప్రకాశింపజేయునట్లు బ్రహ్మచర్యము దివ్యజ్యోతియగు ఓజస్సుగా మారు చుండును. అట్టివానికి ప్రకృతియందుగల సమస్త సూక్ష్మతత్త్వములును మనో దృష్టికి గోచరమగును

అపరిగ్రహస్థైర్యే జన్మకథంతా సంబోధః । 5

పరవస్తు పరిగ్రహము చేయనివానికి జన్మాంతర జ్ఞానము కలుగును పరిగ్రహము రెండువిధములు, పరులనుండి బాహ్యవస్తువులను గ్రహించుట యొకటి దృశ్యవిషయ సంకల్పము హృదయములో కలుగుట మరియొకటి ఈ రెండు విషయములు లేనివానికి తాను పూర్వజన్మములో ఎట్టివాడై యుండెను? ఏమి చేసెను? ఈలాటి జ్ఞానము కలుగును

శౌచాత్స్వాఙ్గ జుగుప్సా పరై రసంసర్గః । 6

శుచిత్వమును అభ్యసించువానికి తన దేహోత్పత్తికి కారణములైన మాతా పితృదేహజన్య శుక్లశోణితరూపమైన పర్యాలోచన జ్ఞానమువలన తన దేహమునందు అసహ్యమున్ను-స్త్రీలు మొదలగువారి శరీరమందు, హేయ బుద్ధియు కలుగును ఇట్టి పరిశుద్ధి స్త్రీ కూడా అభ్యసించినచో పురుషుల శరీరము కూడ శుక్లశోణిత సముద్భవమనెడి జ్ఞానముకలిగి అట్టి స్పర్శము నికృష్టమని జ్ఞానము కలుగును ఇట్టి అనుష్ఠాము లేని కారణము చేతనే పరస్పర ముభయులకు భ్రాంతి కలుగుచున్నది ఈశౌచము వృత్తికాజలముచే దేహశుద్ధియు, జ్ఞానవైరాగ్యములచే ఆత్మశుద్ధియు కలిగియుండవలయును

'సత్త్వశుద్ధి సౌమనస్యైకాగ్రతేంద్రియ జయాత్మదర్శన
యోగ్యత్వాని చ' 7

పరిశుద్ధుడైనవానికి సత్త్వశుద్ధియు, దీనివలన సౌమనస్యమును, దీని వలన చిత్తైకాగ్రతయును, దీనివలన ఇంద్రియజయమును, దీనివలన ఆత్మ దర్శన జ్ఞానమున్ను కలుగును అనగా శుచిత్వము కలవానికి రజస్తమో గుణముల క్షయత్వమున్ను,మనస్సునందు కొంచెమేని దుఃఖము లేని ప్రీతియు, చిత్తస్థైర్యమును, విషయములందు విముఖతయును, బ్రహ్మ జ్ఞానమునందు సమర్థతయు కలుగును

శ్రీపతంజలివారు అయిదు గుణములు దీనిలో చెప్పిరి. ఇవి కొంచెము విస్తరించి చెప్పినచో 1 ఆత్మశుద్ధియు,2 దేహేంద్రియములను శుభ్రముగ నుంచుటయు 3 శుద్ధమైన వస్తువును మితముగా భుజించుటయు, దీని యందు వస్తుశుద్ధి యుండిన మాత్రము చాలదు అదివచ్చిన మార్గముగూడ శుద్ధముగా నుండవలయును 4 నివసించు స్థలమున్ను, ఉపయోగపడుచు చుండెడు వస్తువులున్ను శుభ్రముగా నుంచవలయును 5 చెప్పే వాక్యమున్ను చేయుపనియు శుద్ధములై యుండవలయును వీనికే పంచశీలములనిపేరు

వీనిని హృదయ మందుంచిన మంచి అద్దములో ప్రకాశించెడి సూర్యబింబము వలె ఆత్మజ్ఞానము ఉదయించును అట్లుకాని వారి హృదయమున మట్టిగోడ యందు లేక బండరాతియందు సూర్యబింబము

ప్రతిఫలింపని చందమున ఆత్మజ్ఞానము శూన్యముగా నుండును

సంతోషాదనుత్తమ స్సుఖలాభః । 8

లభించుదానితో సంతుష్టి గలవానికి నిరతిశయమైన ఆనంద మెల్లప్పుడు కలు గును ఆశలచే ప్రేరితమైన హృదయ మెప్పుడున్ను దుఃఖమునే కలుగజేయును నిరాశచే కలిగెడు సౌఖ్యము అనంతానందమని విధించు చున్నది

కాయేన్ద్రి సిద్ధి రశుద్ధిక్షయాత్తపసః । 9

తపస్సు చేయుటవలన చిత్తమునందలి మలినము తొలగుచున్నది అందువలన జ్ఞానేంద్రియ కర్మేంద్రియములకు అద్భుతశక్తి కలుగుచున్నది

స్వాధ్యాయా దిష్టదేవతా సంప్రయోగః । 10

తన ఇష్టదైవమంత్రమును జపించుటవలన తాను కోరిన ఇష్టదైవము ప్రత్యక్షమగును, వేదమంత్రములయందు తనకభిమతంబైన దేవతా మంత్రమును ఓంకారపూర్వకముగా జపించుటవలన ఆదేవత సాక్షాత్కారమై తన కిష్టార్థముల నొసంగును. మఱియు ప్రణవపూర్వకమైన ఈశ్వరోపాసన వలన చిత్తము నిర్మలత్వము నొందును

సమాధి సిద్ధిరీశ్వర ప్రణిధానాత్ । 11

పరమేశ్వరునియందు అతిశయమైన భక్తిచేయుటవలన చిత్తము ఈశ్వరాకార స్థితిని పొంది శివజీవైక్యస్వరూపము సమాధి సాక్షాత్కారము కలుగును ఇది యోగదర్శన సాధన పాదమునందు కనందగును, ఇపుడు మనకు కావలసిది ఆచరణము- పరిశుద్ధమైన బ్రహ్మనిష్ఠ లేనందుచే పూర్వీక ఋషుల స్థానము ముముక్షువులు పొందక పోవుటయేగాక లోకులకు సాధువులపై భక్తులపై అవిశ్వాసము కూడ కలుగుచున్నది మఱియు బ్రహ్మ తేజస్సు దివ్యశక్తికూడ సాధువులకు గలుగకపోవుటకు దీనిలో చెప్పిన విధిని అనుష్ఠింపకపోవుటయే కారణము దీనిలో శ్రీపతంజలిమహర్షి 11విధులను నిరూపించిరి దీనికి ఇతరశాస్త్రములలో వివరింపబడిన వాక్యములను కొన్నిటిని ఈక్రింద చేర్చుడమైనది ఇట్టి అనుష్ఠానమువలన సన్నని మఱ్ఱి విత్తన మును పోషించుట వలన గొప్పవృక్ష మగునట్లు సూక్ష్మమగు జీవశక్తి గొప్ప

దైవశక్తి కలదిగా మారును సన్నదగు అగ్నికణము వృద్ధిపఱచుట వలన అనంతమగు మహాగ్నిగా ఎట్లు మారుచుండునో అణురూపముగా చెప్పెడు జీవుడు కూడ విభుస్వరూపుడగు ఈశ్వరచైతన్య రూపముగా మారు చుండును

1. అహింస

ఈ అహింస బాహ్య అహింసతో పూర్తికాదు ఆత్మహింస కూడ లేకయుండ వలయును

అభయం సర్వభూతేభ్యో దత్వా యశ్చరతే మునిః ।
న తస్య సర్వభూతేభ్యో భయముత్పద్యతే క్వచిత్ ॥

ఏ మననశీలుడు సర్వభూతములకు భయము కలుగనీయక సంచ రించుచుండునో అట్టివానికి ఎచ్చోటను ఏ ప్రాణివల్లను పీడ కలుగదు ఇదే ధర్మము యొక్క రహస్యము పరప్రాణులకు పీడ చేయువానికి సర్వప్రాణుల వల్లను ఎల్లప్పుడున్ను దుఃఖము కలుగుచుండును

అహింసా ప్రథమం పుష్పం ద్వితీయం కరణగ్రహః ।
తృతీయకం భూతదయా చతుర్థం క్షాంతిరేవ చ ॥

శమస్తు పంచమం పుష్పం దమష్షష్ఠం చ సప్తమమ్ ।
ధ్యానం సత్యం చాష్టమం చ హ్యేతైస్తుష్యతి కేశవః ॥

పరమేశ్వరుని ఆత్మలో పూజించెడు అహింసాది పుష్పములను దీనిలో వర్ణించడమైనది ఆ పుష్పము లెవ్వియనగా?

1 అహింస, 2 ఇంద్రియనిగ్రహము, 3 సర్వభూతదయ, 4 క్షమ, 5 శమము (అంతరింద్రియ నిగ్రహము) 6 దమము,(బాహ్యేంద్రియ నిగ్రహము) 7 ధ్యానము,8 సత్యము – ఈ సుగుణములు గలిగి ఆత్మార్చనము చేయుటవల్ల సాక్షాత్ శ్రీమన్నారాయణుడు మిక్కిలి ప్రీతిగల వాడగును

అహింసా పరమో ధర్మః సర్వవేదే ప్రకీర్తితః ।
చరాచరాణాం భూతానామభయం యః ప్రయచ్ఛతి ।

సర్వదా సర్వసౌఖ్యాఢ్యో జాయతే దివి చేహ చ ॥

ధర్మములన్నిటికిన్ని అహింసయే పరమధర్మము వేదములన్నియు ఈలాగుననే చెప్పుచున్నవి చరాచరములగు భూతకోట్లకు ఎవడు అభయము నిచ్చుచున్నాడో వాడు ఎల్లప్పుడును ఎల్లచోట్లను పరలోకమందును ఇహలోక మందును దుఃఖము నొందజాలడు పూర్ణసుఖము నొందగలుగును

నాస్తిభర్గ సమో దేవో నాస్తి గంగా సమా నదీ ।
నాస్తి హింసాసమం పాపం నాస్తి ధర్మో దయాసమః॥

సర్వేశ్వరునకు సమానమైన మరియొక దేవుడు లేడు గంగకు సమానమైననది లేదు హింసకు సమానమైన పాపము లేదు అహింసకు సమానమైన శ్రేష్ఠధర్మము లేదు

అహింసా పరమో ధర్మో అహింసా చ పరం తపః ।
అహింసా పరమం జ్ఞాన మహింసా పరమం ఫలమ్ ।

అహింసయే పరమధర్మము, అహింసయే శ్రేష్ఠమైన తపస్సు, అహింసయే పరమమైన జ్ఞానము, అహింసయే పరమమయిన ఫలమును కలుగ జేయును ఆత్మహింసయు హింసలో చేరినదే పాపకార్యములచే తాము దుఃఖించుటయు హింస యగును ఆత్మజ్ఞానము లేక అజ్ఞానములో పడి తపించుటయు హింస యగును ఆత్మయొక్క స్వరూపము, జ్ఞానమూ, ఆనందము, స్వప్రకాశము అని తెలిసికొని ఆత్మకు కలుగుచుండు క్లేశములను ఆత్మలో చేరనీయక చూచుటయే గొప్ప అహింసా వ్రతమగును

2. సత్యము

ఈ బాహ్యసత్యముతో సత్యము పూర్తి కాజాలదు 'బ్రహ్మ సత్యం జగన్మిథ్యా' అను జ్ఞానము కలుగునపుడే సత్యవ్రతము పూర్తియగును మఱియు అట్టి సత్యస్వరూపమగు ఆత్మవ్యవహారము మాత్రము గల్గి అసత్యమగు జగద్వ్యవహారము గలిగియుండ కుండుటయే సత్యవ్రతనిష్ఠ యగును

సత్యమేవ జయతే నానృతం
సత్యేన పంథా వితతో దేవయానః।

యేనాక్రమన్త్యృషయో హ్యాప్తకామా
యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్॥

సత్యమే జయించును అసత్యమునకు జయము కలుగదు సత్యము చేతనే దైవమార్గము తెలియబడియుండును ఋషులందరున్ను, సత్యము వల్లనే సమస్తమైన కోరికలు పొందినవారై మోక్షమును కూడ పొందిరి, సత్యమన్నిటికన్న ఉత్కృష్టమయిన స్థానము

సత్యేన లభ్యస్తపసా హ్యేష ఆత్మా
సమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యమ్।
అంతశ్శరీరే జ్యోతిర్మయో హి శుభ్రో
యం పశ్యంతి యతయః క్షీణదోషాః॥

యత్నశీలురైనందువలన సమస్తదోషములు నశించినవారలై ఋషులు సత్యముచేతను, తపస్సుచేతను, సమ్యక్ జ్ఞానముచేతను, బ్రహ్మచర్యముచేతను నిత్యము కూడినవారలై హృదయాంతర వర్తియై జ్ఞానజ్యోతిర్మయుడై యుండు ఆత్మను దర్శించుచున్నారు యతులు సన్న్యాసులనికూడ పేరు కలిగి యున్నారు 'యతయః క్షీణదోషాః' సర్వదోషములును నశించినవారు యతులగుదురు దోషములను నశింపజేయుటలో యత్నపరులగుటే యతి శబ్దమునకు అర్థము

సత్యేనార్కః ప్రతపతి సత్యే తిష్ఠతి మేదినీ।
సత్యం చోక్తం పరో ధర్మః స్వర్గస్సత్యే ప్రతిష్ఠితః॥

సత్యమున్ను నిత్యుడగు ఈశ్వరుడున్ను అవినాభావ సంబంధము గలిగియుందురు అనగా సత్యమును విడిచి ఈశ్వరుడు లేడు ఈశ్వరుని విడిచి సత్యమున్ను లేదు సత్యముచేతనే సూర్యుడు ప్రకాశించుచున్నాడు సత్యము వల్లనే ఈభూమి నిలిచియున్నది సత్యవచనము ధర్మము లన్నిటికన్న ఎక్కువైనది స్వర్గలోకమున్ను సత్యమందే నిలుచుచున్నది

అశ్వమేధ సహస్రం చ సత్యం చ తులయా ధృతమ్।
అశ్వమేధ సహస్రాద్ధి సత్యమేవ విశిష్యతే॥

సహస్రాశ్వమేధ యాగములయొక్క ఫలమున్ను, సత్యముయొక్క

ఫలమున్ను త్రాసులో పెట్టి ఋషులు తూచిరట అశ్వమేధ సహస్ర ఫలితముల కన్న సత్యముయొక్క ఫలితమే ఎక్కువగా తూగెనట!

నానృతాత్పాతకం కించి న్న సత్యాత్సుకృతం పరమ్ ।
వివేకాన్నపరో బంధు రితి వేదవిదో విదుః ॥

అసత్యమునకు మించిన పాపము లేదు సత్యమునకు మించిన సుకృతమున్ను లేదు వివేకమునకు మించిన బంధువున్ను లేదు వేదవేత్తలు ఇట్లు తలంతురు

౩. అస్తేయము

పరవస్తువుల దొంగలింపకయుండుట మాత్రముచే అస్తేయము పూర్తి కాదు ఆత్మవంచనములేక ప్రవర్తించినపుడే అస్తేయవ్రతము శుద్ధియగును ఆలాగున ప్రకృతి విషయములను ఆత్మలోనికి రానిచ్చుటయు అస్తేయ వ్రతమునకు భంగమే యగును

ఇది తనయొక్క పవిత్రజీవితమును నిరూపించుచున్నది దీనిచే కలిగెడు ఫలితము శ్రీపతంజలి మహర్షియే నిరూపించియున్నారు

నాస్తి శ్రద్ధా సమం పుణ్యం నాస్తి శ్రద్ధా సమం సుఖమ్ ।
నాస్తి శ్రద్ధా సమం తీర్థం సంసారే ప్రాణినాం నృప ॥

జీవితము పరుల వస్తువులవల్ల చేయనీయక స్వప్రయత్నముతో చేయు ప్రయత్నముకన్న సమమయిన పుణ్యము మఱియొకటి లేదు అట్టి శ్రద్ధకు సమానమయిన సుఖమున్ను లేదు అట్టి శ్రద్ధకు మించిన తీర్థమున్ను లేదు ప్రపంచములో గల జీవుల కిదే శ్రేష్ఠమయిన ధర్మము

ఆచారేణ నరో దేవి సుఖత్వ ముపజాయతే ।
అనాచారేణ పాపేన నాశం యాతి తథా ధ్రువమ్ ॥

పవిత్రాచరణముచేతనే నరుడు సుఖమును పొందగలుగును దుష్టా చరణమగు పాపమువల్ల నిశ్చయముగా అతడు నశించును

కృషికారో యథా దేవి ఛన్నం బీజం సుసంస్థితమ్ ।
యాదృశం తు భవత్యేవ తాదృశం ఫలమశ్నుతే ॥

వ్యవసాయము చేయువాడు తనయొక్క క్షేత్రమునందు ఏ బీజము విత్తునో దాని కనుగుణమయిన ఫలము కలుగునేగాని మరియొక ఫలమెట్లు కలుగదో జీవులయొక్క అనుష్ఠానమున్ను ఆలాగుననే యుండును

4. బ్రహ్మచర్యము

బ్రహ్మవిచారమందు నిరంతర ముండునపుడే బ్రహ్మచర్యవ్రతము శుద్ధముగా నుండును బ్రహ్మవిచారములేని బ్రహ్మచర్యము దేహేంద్రియ మనస్సులను శుద్ధమొనర్చునేగాని ఆత్మను శుద్ధమొనర్పజాలదు కావున బ్రహ్మవిచార ములో నిరంతరము సంచరించుట యేది కలదో ఇదే బ్రహ్మచర్య వ్రతమునకు ప్రాణమువంటిది ఈ బ్రహ్మచర్య వ్రతము చెప్పునపుడు స్త్రీలను నిందించినట్లు తోచును కాని అందరి స్త్రీలను గాని పుణ్యవతులను గాని కాదు దీనియందు చెప్పబడెడి దుష్టగుణము గల స్త్రీలకు మాత్రమే అది వర్తించును

ఋతుకాలభిగామీ యస్స్వదారనిరతశ్చ యః ।
స సదా బ్రహ్మచారీ చ విజ్ఞేయ స్స గృహాశ్రమీ ॥

గృహస్థాశ్రమమందుండువాడును, శాస్త్రములలో విధించియుండు ఋతు కాలము ననుసరించి స్వపత్నితో నుండెనేని అతడు గూడ గృహస్థబ్రహ్మ చారి యనియే గ్రహించదగినది ఆలాగున నుండు స్త్రీగూడ బ్రహ్మచారిణి యనియే శాస్త్రముయొక్క నిశ్చయమని గ్రహింపదగినది కాని నైష్ఠిక బ్రహ్మ చారులవలె సంకల్పశక్తియు, సంకల్పసిద్ధియు మాత్రము వీరికి కలుగదు ముక్తికి మాత్రము భంగముండదు బ్రహ్మచర్యవ్రతకాలమందే జీవితమం తయు శుద్ధముగా నుండవలసి యుండును వీరికి అనుష్ఠానములు మెండు జీవితముయొక్క ప్రాథమిక దశయగు ఇది నాలుగంతస్తులతో గట్టెడు భవనము యొక్క పునాదియని గ్రహించవలయును

దేవద్రోహం న కుర్వీత గురుద్రోహం తథైవ చ ।
దేవద్రోహాద్గురుద్రోహః కోటికోటి గుణాధికః ॥

బ్రహ్మచారి దైవద్రోహముగాని గురుద్రోహముగాని ఎప్పటికిన్ని

చేయరాదు దైవద్రోహముకన్న గురుద్రోహము కోటానుకోట్లధికమయిన పాపమును కలుగచేయును

గురోర్యత్ర పరీవాదో నిందా వాఽపి ప్రవర్తతే ।
కర్ణౌ తత్ర పిధాతవ్యౌ గంతవ్యం వా తతోఽన్యతః ॥

గురుభక్తిగల బ్రహ్మచారి తన గురుదేవుని అవమానమునుగాని, నిందనుగాని ఎచ్చట ఎవరైన చేయుచుండిన ఆపాపవాక్యమును విననీయక కర్ణమును మూసి కొనవలయును అట్లు గానిచో ఆ స్థలము నైన విడిచి పెట్టవలయును తనకు శక్తిగలిగెనేని అచట సత్యమును బోధించి నిలువ బెట్టవలయును

న చాత్మానం ప్రశంసేద్వా పరనిందాం చ వర్జయేత్ ।
వేదనిందాం దేవనిందాం ప్రయత్నేన వివర్జయేత్ ॥

బ్రహ్మచారి ఆత్మస్తుతిని, పరనిందను తప్పక మానవలయును ఆత్మ ప్రశంసవలన భావిభాగ్యము నశించును పరదూషణవల్ల దోషమాపాదించును ఆలాగున వేదనిందను, దేవనిందను, ప్రయత్నపూర్వకముగ నిశ్శేషముగా వర్జించవలయును

దుష్కృతం హి మనుష్యస్య సర్వమన్నే వ్యవస్థితమ్ ।
యో యస్యాన్నం సమశ్నాతి స తస్యాశ్నాతి కిల్బిషమ్ ॥

యతికిన్ని, బ్రహ్మచారికిన్ని భిక్షాన్నమే విధి గలదు కాని భోజన ప్రియులై ఆత్మశుద్ధిలేని వారి భోజనమును భుజించిన కలిగెడు దోషము దీని యందు నిరూపింపబడుచున్నది అన్నముమాత్రము శుద్ధిగా నుండిన చాలదు. అది వచ్చే మార్గముకూడ శుద్ధముగా నుండవలయును పాపమార్గముతో వచ్చెడు వస్తువులు శుద్ధములైనను అవి అశుద్ధములే మానవునియొక్క పాపము వాడిచ్చెడు దానములద్వారా వచ్చుచుండును కావున అట్టి పాపాన్నము భుజించుటవలన వానియొక్క పాపము వాని అన్నము భుజించు వానికికూడ చేరుచుండును శుద్ధాన్నముగా నుండవలసినచో 1 వస్తుశుద్ధియు, 2. అది వచ్చే మార్గశుద్ధియు, 3 పాత్రశుద్ధియు, 4 పాచక శుద్ధియు కలిగియుండవల యును దీనికే భావశుద్ధియని పేరు అట్లు శుద్ధమైన అన్నము నీరసముగా

నుండినను ఆత్మజ్ఞానజ్యోతి మఱుగుపడక వెలుగుచుండును అట్లుగాని రస యుక్తమైన ఆహారమైనను ఆత్మజ్ఞానమును మఱుగు పఱచి దుర్గుణములను కలుగజేసి తనయొక్క సత్యవ్రతమును పతన మొనర్చును

తపసో న వరం కించి త్తపో హి మహతాం ధనమ్ ।

తపసా ప్రాప్యతే సర్వం తపో యోగ్యోఽసి పుత్రక ॥

తపస్సుకన్న శ్రేష్ఠమైనది మరియొకటి లేదు మహాత్ములకు తపస్సే గొప్పధనము. తపస్సువల్ల సమస్తమున్ను పొందగలుగును కావున నో కుమారుడా! నీవు తపస్సు చేయుటకు అర్హుడవై యున్నావు అని శ్రీ వ్యాస భగవానులు శుకమహర్షి నుద్దేశించి పలికెను

తపసో హి వినా నాస్తి సిద్ధిః కుత్రాపి శోభతే!

సర్వాసాం కర్మసిద్ధీనాం మూలం హి తప ఉచ్యతే!!

తపస్సు వినా ఎచ్చటను ఏ సిద్ధియున్ను ప్రకాశింపజాలదు కావున సమస్తసిద్ధులకున్ను తపస్సే మూలమైనది యోగసిద్ధికిన్ని, మోక్షసిద్ధికిన్ని, జ్ఞానసిద్ధికిన్ని తపస్సే కారణము

ధర్మ్యం యశస్య మాయుష్యం లోకద్వయరసాయనమ్ ।

అనుమోదామహే బ్రహ్మచర్య మేకాంతనిర్మలమ్ ॥

పరిశుద్ధమైన బ్రహ్మచర్యము ధర్మము లన్నిటికి మూలమైనది యశస్సును, పూర్ణాయుస్సును కలుగజేయునది ఇహలోక సౌఖ్యమునకున్ను, పరలోక సుఖమగు ముక్తికిన్ని ఇది దివ్యరసాయనము వంటిది దీనికి మించిన నిర్మల మైన ధర్మము లేదని ఋషుల ఆశయము

సర్వేషాం వ్రతానాం మూలం బ్రహ్మచర్య ముదాహృతమ్ ।

విశేషాచ్ఛివభక్తానా మేవం భూయో విధాస్యసి॥

వ్రతము లన్నిటికిన్ని బ్రహ్మచర్యమే మూలమని ఋషులచే చెప్ప బడినది. భగవద్భక్తులకు గూడ విశేషించి ఈ బ్రహ్మచర్యవ్రతము ఏర్పడియున్నది కావున ఇట్టి విధిని ప్రతిముముక్షువున్ను అనుసరింపదగినది

మైథునస్యాప్రవృత్తిర్హి మనోవాక్కాయకర్మణా ।

బ్రహ్మచర్య మితి ప్రోక్తం యతీనాం బ్రహ్మచారిణామ్ ॥

మనోవాక్కాయ కర్మలచే మిధున క్రియలగు అష్టవిధ దోషములు లేకుండుటయే పరిశుద్ధమైన బ్రహ్మచర్యమని చెప్పబడెను యతులున్ను, బ్రహ్మచారులున్ను ఈత్రికరణ శుద్ధితో బ్రహ్మచర్యమును సంరక్షింప వలయును గృహస్థులకు ఋతుకాలము తప్ప తక్కినకాలములలో వారున్ను బ్రహ్మచర్య వ్రతమును పాలింపవలయును

పరదార పరిత్యాగా త్స్వదార పరితుష్టితః ।
ఋతుకాలాభిగామిత్వాద్బ్రహ్మచారీ గృహీరితః ॥

మనోవాక్కాయ కర్మలచే పరస్త్రీలను వర్జించి స్వపత్నియందు సంతుష్టిగలవాడును, శాస్త్రవిధి ననుసరించి ఋతుకాలమున మాత్రము స్వపత్నితో ప్రవర్తించు గృహస్థుడుగూడ బ్రహ్మచారి యనదగును అట్టి స్త్రీయును బ్రహ్మచారిణియే

విషయే లుబ్ధచిత్తానాం వనేఽపి జాయతే రతిః ।
సర్వత్ర సమదృష్టీనాం గేహే ముక్తిర్హి శాశ్వతీ ॥

విషయసంకల్పము కలవారు వనమందుండినను విషయచింత నశించుట లేదు సమదృష్టిగల జ్ఞానులకు గృహమందుండినను శాశ్వతమైన మోక్షము కలుగును

అంగార సదృశా నారీ ఘృతకుంభసమః పుమాన్ ।
అస్పర్శాద్దృఢతామేతి తత్సంపర్కాద్విలీయతే ॥

అగ్నిగుండము వంటిది నారి ఘృతకుంభము వంటివాడు పురుషుడు స్పర్శించువఱకు మాత్రము దృఢత్వము కలిగియుందురు స్పర్శనమే అవసరము లేదు దర్శనము మాత్రము చేతనే విలీనమగుదురు

దర్శనమనియే చెప్పనేల? శ్రవణముగూడ మనస్సును పరవశ మొనర్చును కావుననే అష్టవిధ బ్రహ్మచర్యములలో

శ్రవణం కీర్తనం కేళిః ప్రేక్షణం గుహ్యభాషణమ్ ।
సంకల్పోఽధ్యవసాయశ్చ క్రియా నిర్వృతి రేవ చ ॥
ఏతన్మైధున మష్టాంగం ప్రవదంతి మనీషిణః ।
విపరీతం బ్రహ్మచర్య మనుష్ఠేయం ముముక్షుభిః ॥

వినుట, వచించుట, విహరించుట, చూచుట, రహస్యభాషణము, మనస్సులో సంకల్పించుట, బుద్ధితో నిశ్చయించుట, క్రియలో ప్రవేశించుట అనెడి ఎనిమిది దోషములు ఇవి ఉండకూడదు

విద్వాంస మప్యవిద్వాంసం యతస్తా ధర్షయంత్యలమ్ ।
స్వవశం వాపి కుర్వన్తి సూత్రబద్ధశకుంతవత్ ॥

విద్వాంసుడైనను, అవిద్వాంసుడైనను, స్త్రీలయొక్క సాన్నిధ్యము వలన ఆకర్షింపబడుదురు దారముకట్టి పక్షిని ఏలాగున లాగుకొని పోవుదురో ఆలాగున విషయబుద్ధిగల స్త్రీలు విషయ స్వభావము గల పురుషులను స్వాధీనము చేసికొందురు

అయస్కాంతమునకున్ను, ఇనుమునకున్ను ఏలాగున పరస్పర మాకర్షణము కలదో, సృష్టియందుగూడ ఇట్టి పరస్పరాకర్షణ స్వభావము సంకల్పశుద్ధి లేని స్త్రీ పురుషులకు కలుగుచుండును

మాత్రా వాఽథ దుహిత్రా వా న స్వస్త్రైకాంత శీలతా ।
బలవన్తీంద్రియాణ్యత్ర మోహయంత్యపి కోవిదాన్ ॥

తల్లితోడను, కూతురుతోడనైనను, తోడపుట్టువుతోనైనను, బ్రహ్మచర్య వ్రతము కలవారు ఒకే స్థలములో నుండరాదు ఏలన ఇంద్రియముల యొక్క బలము అతిబలమైనది మహాబలవంతులను కూడ అది లోబఱచును బలవంతులను మాత్రమే కాదు గొప్పవిద్వాంసులను కూడ అది మోహింపజేయును. ఆలాగున బ్రహ్మచర్యవ్రతముగల స్త్రీలున్ను తండ్రి, సోదరుడు, కుమారుడు, ఉండే ఏకాంతప్రదేశమున నివసింపరాదు

తావద్విద్యా ప్రభవతి తావద్జ్ఞానం ప్రవర్తతే ।
తావత్సునిర్మలా మేధా సర్వశాస్త్రవిధారిణీ ॥

తావజ్జపస్తపస్తావ త్తావత్ తీర్థనిషేవణమ్ ।
తావచ్ఛ్రుగురుశుశ్రూషా తావద్ధి తరణే మతిః ॥

తావత్ప్రబుద్ధో భవతి వివేకస్తావదేవ హి ।
తావత్సతాం సంగరుచి స్తావత్పౌరాణలాలసా ।

యావత్సీమంతినీ లోలనయనాందోళనం న చ॥

ఎంతవఱకు స్త్రీలయొక్క చంచలమైన నేత్రములయొక్కదృష్టి పడ లేదో అంతవఱకే విద్య ప్రకాశించును అంతవఱకే జ్ఞానమున్ను ప్రవర్తించును అంతవఱకే సర్వశాస్త్రములను ధరించెడి లేక గ్రహించెడు నిర్మలమైన మేధాశక్తి కలిగియుండును మఱియు ఎంతవఱకు స్త్రీలయొక్క విషయవీక్షణకటాక్ష భ్రూవిక్షేపాదులు కలుగవో అంతవఱకే జపమున్ను, తపస్సున్ను, తీర్థయాత్ర యున్ను, గురుశుశ్రూషయున్ను, ముక్తిని పొందవలయునన్న మనస్సున్న అనగా తరణోపాయ బుద్ధియున్ను కలుగుచుండును విషయ బుద్ధిగల స్త్రీల యొక్క విషయదృష్టియను పిడుగు ఎంతవఱకు పురుషుని యందు పడలేదో అంత వఱకే పురుషునియొక్క ప్రబోధమున్ను, వివేకజ్ఞానమున్ను, మహ నీయుల సంసర్గమునందు ప్రీతియున్ను, శాస్త్రపరనమందు ఉత్సాహమున్ను కలుగుచుండును

నారీణాం నయనాదేశః సురాణామపి దుర్జయః ।
స యేన విజితో లోకే హరిభక్త స్స ఉచ్యతే ॥

మాంద్యంతి మునయోఽప్యత్ర నారీచరితలోలుపాః ।
హరిభక్తిః కుతః పుంసాం నారీ భక్తిజుషాం ద్విజాః ॥

విషయదృష్టి భావముగల స్త్రీలయొక్క నయన చేష్టల జయించుటకు దేవతలకు కూడ అసాధ్యమైనది అట్టిదానిని జయించిన వాడెవడో వాడే లోకమున భగవద్భక్తుడనబడును స్త్రీలయొక్క చంచలమైన దృష్టికి లోబడిన మునులు గూడ మంద బుద్ధిగల వారలగుదురు నారీభక్తియందు లోబడిన చిత్తముగల పురుషులకు మఱల హరిభక్తి ఎచ్చట కలుగును, అనగా కలుగదని భావము

పుత్ర్యా అపి ప్రసంగేన రహస్స్థానే తు ముహ్యతి ।
అతో మాత్రా భగిన్యా వా దుహిత్రాపి రహస్స్థలే ।
సహ నాసీత మతిమాన్యువత్యా కిముతాన్యయా ॥

మతిమంతుడగు పురుషుడు ప్రసంగవశాత్తైనను ఏకాంతస్థలమున

పుత్రి, తల్లి, సోదరీలతోనైనను కూడియుండరాదు అట్లైనను మోహమును కలుగజేయునని శాస్త్రము విధించియుండగా యువతులగు ఇతర స్త్రీలతో ఏకాంతప్రదేశమున నుండుట యెంత అపాయకరమో యోచించుకొనవలయును ఆలాగున పావన ధర్మమును పాలించెడు నారీమణులు గూడ వయస్సులోనుండు తండ్రి, సోదరుడు, పుత్రుడు ఉండే ఏకాంతస్థలమున నివసింపరాదు

తావత్తపోఽభివృద్ధిస్తు తావద్దానం దయా దమః ।
తావత్స్వాధ్యాయ వృత్తిం చ తావచ్ఛౌచం ధృతం వ్రతమ్ ॥

యావత్త్రస్తముఖీం దృష్టిచపలాం న విలోకయేత్ ।
తావన్మాతా పితా తావద్భ్రాతా తావ త్సుహృజ్జనః ॥

తావల్లజ్జా భయం తావత్స్వాచారస్తావదేవ హి ।
జ్ఞానమౌదార్య మైశ్వర్యం తావదేవహి భాసతే ।
యావన్మత్తాంగనాపాశైః పాతితో నైవ బంధనైః ॥

ఎంతవఱకు లేడికన్నుల వంటి చంచలమగు చూపుగల స్త్రీలయొక్క దృష్టిని చూడలేదో అంతవఱకే తపోవృద్ధియున్ను, దాన బుద్ధియున్ను, భూత దయయున్ను, ఇంద్రియనియమమున్ను కలిగియుండును అట్టి విషయదృష్టిని ఎంతవఱకు చూడలేదో అంతవఱకే అధ్యయన ప్రవృత్తియున్ను, శౌచమున్ను, ధారణాశక్తియున్ను, వ్రతమున్ను నిలుచును

ఎంత వఱకు విషయముచే మదించిన స్త్రీయొక్క దృష్టియగు పాశములచే పురుషుండు బంధింపబడడో అంతవఱకే మాతృభక్తి, పితృభక్తి, భ్రాతృవాత్సల్యము, సుహృజ్జన ప్రీతి కలిగియుండును ఎంతవఱకు స్త్రీల యొక్క చేష్టలగు బంధనములచే పతితుడు కాడో అంతవఱకే లజ్జయున్ను, భయమున్ను, ఆచారమున్ను నిలుచును అట్టి పతనమెంతవఱకు కలుగదో అంతవఱకే జ్ఞానమున్ను, ఔదార్యమున్ను, ఐశ్వర్యమున్ను ప్రకాశించును అట్టి వీక్షణపాశముచే ఎప్పుడు బద్ధుడగునో అపుడు పైజెప్పిన సుగుణములన్నియు మంచుపడిన తామర కొలనులో గల తామర పూవులును పత్రములున్ను ఎట్లు

జీర్ణించిపోవునో ఆలాగున క్షీణించి పోవును కావున ఈ విషయమున్నియు ముముక్షువులు, జిజ్ఞాసులు, భక్తులు, పవిత్రజీవితము గడుప తలంపుగల సర్వజీవులున్ను మఱువక జ్ఞాపక ముంచుకొనవలయును

5. అపరిగ్రహము

పరవస్తువును గ్రహింపకపోవుటచే అపరిగ్రహ వ్రతము పూర్తికాదు శబ్దాది విషయములను ఆత్మలో చేరనీయక చేయునప్పుడే అపరిగ్రహవ్రతము పూర్తి యగును అపుడే పరిగ్రహవర్జిత ఫల సిద్ధి గలుగును

పరిగ్రహ సమర్థోఽపి న ప్రసజ్యేత్ప్రతిగ్రహే ।
పరిగ్రహేణ విప్రాణాం బ్రాహ్మం తేజః ప్రశామ్యతి ॥

అపరిగ్రహమనగా పరవస్తువులను గ్రహింపక పోవుట పరవస్తువును గ్రహించుటచే వీరి పుణ్యము వారికిపోయి వారిపాపము వీరియందు చేరుచున్నది ప్రతిగ్రహము అనగా దానము స్వీకరించి జపధ్యానాది హోమాతిథి సత్కారాదులచే ఆ దోషమును నివర్తించుటకు శక్తిమంతుడైనను పర వస్తువును గ్రహించుటలో మనస్సును ప్రవేశపెట్టకుము పరవస్తు పరిగ్రహము వల్ల వీని యొక్క బ్రహ్మతేజస్సు అతిత్వరలోనే నశించును. పరవస్తువును భుజించునపుడు పాపమునే భుజించునట్లు తలంచువారే పవిత్రు లగుదురు ధ్యానయోగము నుపదేశించెడు గీత ఆఱవ అధ్యాయమున శ్రీ భగవంతుడున్ను దీనినే ఉపదేశించినారు

యోగీ యుంజీత సతతమాత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః ॥

ధ్యానయోగము కలవాడును లేక జ్ఞాననిష్ఠుడును ఒంటరిగా నుండ దలంచువాడును, నియమించబడిన అంతఃకరణమును దేహమును కల వాడును, ఆశలు లేనివాడును, పరిగ్రహ వర్జితుడును, ఏకాంతము నందున్న వాడును, సర్వకాలములయందు అంతఃకరణమును పరమాత్మయందు చక్కగా నుంచ వలయును ఈభగవద్వాక్యమును బాగుగా జ్ఞాపకముంచవలయును ఇదే విధముగా 18అధ్యాయములలోను ఉపదేశించడమైనది

అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।
విముచ్య నిర్మమ శ్శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే ॥

అహంకారము, జాతి, విద్య, అధికారములతో కూడిన బలమున్ను దర్పమున్ను, కామమును, కోపమును, పరవస్తువును గ్రహించెడు పరిగ్రహమున్ను నిశ్శేషముగా విడిచిపెట్టి మమకారము లేనివాడై పరమశాంతుడు నగువాడు బ్రహ్మజ్ఞానప్రాప్తికి అర్హుడగుచున్నాడు ఈ శ్లోకములో కామ క్రోధాదులగు దుష్టగుణములతో చేర్చి పరిగ్రహమునుగూడ చెప్పినందుచే పరవస్తు పరిగ్రహమెంత నీచమైనదో యోచించుకొనవలయును

పూజితం హ్యశనం నిత్యం బలమూర్జం చ యచ్ఛతి ।
అపూజితం తు తద్భుక్త ముభయం నాశయేదిదమ్ ॥

సత్యార్జితముతో శుద్ధమైన అన్నము భుజించుటవల్ల మనోవాక్కాయములకు బలమున్ను, మంచి ఓజస్సున్ను కలుగును, అట్లు చేయక అపూజ్యమగు పరాన్నమును ఎల్లప్పుడు భుజించుచుండిన అది ఇహపరముల రెంటినిన్ని నశింపజేయును

దుష్కృతం హి మనుష్యస్య సర్వమన్నే వ్యవస్థితమ్ ।
యో యస్యాన్నం సమశ్నాతి స తస్యాశ్నాతి కిల్బిషమ్ ॥

ఎవడు ఎవని అన్నమును భుజించునో, వానియొక్క పాపమును గూడ అతడు భుజించుచున్నాడు వానియొక్క పాపశాంతికొఱకే దానమిచ్చుచున్నందున పరిగ్రహమువల్ల ఆ వస్తువుతో పాటు పాపముగూడ వచ్చుచుండును

తప్త్వా తపస్వీ విపినే క్షుధార్తో
గృహం సమాయాతి సదాన్నదాతుః ।
భక్త్యా సదాన్నం ప్రదదాతి తస్మై
తపోవిభాగం భజతే హి తస్య ॥

వనమునందుండు గొప్పతపస్వియైనను క్షుద్బాధ కలుగునపుడు అన్నదాతయగు గృహస్థుని ఆశ్రయించుచున్నాడు. భక్తితో అట్టి తాపసునకు అన్నము నిచ్చెనేని ఆతపస్వియొక్క తపోమహిమలో సగము భాగము అట్టి అన్న

దాతకు వచ్చుచుండును తపస్సు లేనివాడైనచో గృహస్థుని యొక్క పాపమును భుజించు వాడగుటచే తన తపస్సంతయు త్వరలోనే నశించును

రాహుగ్రస్తస్య సోమస్య యథా జ్యోత్స్నా న భాసతే ।
తథా తమోఽభిభూతానాం భూతానాం నశ్యతే సుఖమ్ ॥

రాహుకేతువులచే గ్రస్తమైన గ్రహణకాల సూర్యచంద్రుల ప్రకాశమే లాగున ఆవరింపబడునో, ఆలాగున పాపాన్నములచే ముముక్షువుయొక్క ఆత్మజ్ఞాన ప్రకాశముగూడ మఱుగుపడిపోవును

పరాన్నేన తు భుక్తేన మైథునం యోఽధిగచ్ఛతి ।
యస్యాన్నం తస్య తే పుత్రా అన్నాచ్ఛుక్రం ప్రవర్తతే ॥

ఈ పరిగ్రహవర్జనము సాధువులు బ్రహ్మచారులకు మాత్రమే గాదు గృహస్థులు గూడ పరిగ్రహవర్జితులై యుండవలయును పరాన్నముచేత జీవనము గడుపు స్త్రీ పురుషులకు ఏర్పడెడు శుక్ల శోణితములు ఎవరి అన్నము వల్ల ఉద్భవించినవో ఆశుక్లశోణితములవల్ల ఏర్పడు సంతానములు గూడ అట్ట స్వభావము కలవారగుదురు కాన వంశోద్ధారకులగు సంతానము కలుగవలసి యుండిన భుజించే అన్నము ధర్మయుక్తముగా నుండవలయును బ్రహ్మనిష్ఠ ధ్యానయోగాదులు చేయువారు గూడ ధర్మయుక్తమగు అన్నమును భుజింపనిచో పాపాన్నముచే మనస్సు మాలిన్యము నొందినదై విషయములలో పతితు లగుదురు

౬.శౌచము

బాహ్యశౌచముచే గొప్ప శుచిమంతుడనని తలంపరాదు విషయ కల్మషము నశించినపుడే శౌచసిద్ధి లభించును శుద్ధాత్మభావమును మఱువక యుండునపుడే శౌచము సిద్ధించెనని గ్రహించవలయును

ఆచారహీనం న పునంతి వేదాః యద్యప్యధీతాస్స హ షడ్భిరంగైః ।
ఛందాంస్యేనం మృత్యుకాలే త్యజన్తి నీడం శకున్తా ఇవ జాతపక్షాః ॥

ఆచారహీనుని నాల్గువేదములున్ను, షడంగములగు ఆరు శాస్త్రము లున్ను నిర్మలుని చేయజాలవు అనగా నాలుగు వేదములున్ను, ఆరు

శాస్త్రములున్ను కంఠస్థము చేసినవాడైనను తాను చెప్పినట్లు ఆచరణము లేకపోయిన అవి ఏవియు ఫలవంతములు కావు ఇవి అన్నియు అంత్య కాలమున దేహముతో గూడ వదలిపోవును ఎట్లన పక్షులు ఱెక్కలు వచ్చినపుడు ఏలాగున గూటిని విడిచి పెట్టునో వీనిని శాస్త్రము లన్నియు ఆలాగున నుపేక్షించును

నిమిషం నిమిషార్ధం వా యత్ర తిష్ఠన్తి యోగినః ।
తత్రైవ సర్వశ్రేయాంసి తత్తీర్థం తత్తపోవనమ్ ॥

బాహ్యాభ్యంతర శుద్ధిగలవాడైన బ్రహ్మధ్యాన పరాయణుడు ఒక నిముషముగాని, అర్ధనిముషముగాని ఎచ్చోటనుండి ధ్యానము చేయునో అచ్చట సర్వశ్రేయస్సులున్ను కలుగును అది పుణ్యతీర్థ స్థలమగును అది తపోవనముగా పరిణమించును బాహ్యాభ్యంతరశుద్ధి గలిగి బ్రహ్మనిష్ఠ చేయు స్థలముయొక్క మహిమ దీనివల్ల గ్రహించుకొనవచ్చును

7. సత్త్వశుద్ధి

సత్త్వశుద్ధిని మనశ్శుద్ధి యని గూడ చెప్పుదురు దీనివల్ల తృప్తినొందక సమస్త మున కాధారమగు ఆత్మ శుద్ధమైనది అని తలంపు కలిగి ఆశుద్ధాత్మయే తానుగా నుంటున్నానని బోధము కలుగునపుడే సత్త్వశుద్ధి పూర్తియగును

ప్రసన్నే విమలా ముక్తిర్వైరాగ్యేణ పరేణ వై ।
అభ్యాసేనైవ విజ్ఞానం విశుద్ధం చ స్థిరం భవేత్ ॥

హృదయము నిర్మల మగునపుడు మోక్షము కలుగును అట్టి హృదయనిర్మలత శ్రేష్ఠమైన వైరాగ్యముచేతను, బ్రహ్మనిష్ఠాభ్యానముచేతను కలుగును, అపుడు విజ్ఞానము అనగా అనుభవజ్ఞానము విశుద్ధముగా సుస్థిరముగాను నుండును

ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥

చక్కగా చిత్తశుద్ధి గలుగుచుండగా జిజ్ఞాసువులకు సకల దుఃఖముల నాశము కలుగుచున్నది నిర్మలమైన చిత్తము కలవానికి శీఘ్రముగా బ్రహ్మను

భవసిద్ధి గలుగుచున్నది

8.సంతోషము

ఈ సంతోషము బాహ్యేంద్రియ విషయములవల్ల కలిగెడు సంతోషమని తలంపరాదు నిరతిశయానంద సంతోషము ఆత్మప్రాప్తియందే కలుగును కావుననే ' ఆనందో బ్రహ్మ' అని శ్రుతిమాత ఉపదేశించినది

శశాంకరశ్మి సంయోగాచ్చంద్రకాంతమణిః పయః ।
సముత్సృజతి నాయుక్తః సోపమా యోగిన స్స్మృతా ॥

చంద్రబింబరశ్మి చంద్రకాంతమణియందు పడునపుడు ఏలాగున అమృతము స్రవించుచుండునో, ఇదే ప్రకారము హృదయము అత్యంత ప్రసన్నము, విమలము అగునపుడు ఆనందామృతము ఎల్లప్పుడును ప్రవాహ రూపముగా నుండునని గ్రహించవలయును ఆచంద్రిక చంద్రకాంతమణిలో పడునపుడు అమృతము ఆవిర్భవించునుగాని ఇతరశిలలో కలుగదు ఆలాగున చంద్రుని వలె చల్లదనము, నిర్మలత్వముగల హృదయములు గలవారు మాత్రమే పరమా త్మయొక్క ఆనంద మనుభవింతురు

యథాఽర్కరశ్మి సంయోగా దర్కకాంతో హుతాశనమ్ ।
ఆవిష్కరోతి నైకస్సన్నుపమా సాఽపి యోగినః ॥

సూర్యరశ్మి సూర్యకాంతమణియందు పడునపుడు అగ్ని ఏలాగున ప్రజ్వలించునో, ఆలాగున వైరాగ్యముచే విశుద్ధాంతః కరణముగల మనస్సులో పరమాత్మయగు సూర్యునియొక్క రశ్మి పడునపుడు జ్ఞానాగ్ని ప్రజ్వలించును అపుడు కర్మకట్టె లన్నియు దహించును సూర్యకాంత మణియందు ఇట్టి శక్తి గలదు ఇతరమణులపై ఏలాగున సూర్యరశ్మి పడినను ప్రజ్వలింప జాలవో ఆలాగున అట్టి విశుద్ధాంతఃకరణము లేనివారి హృదయములలో సర్వేశ్వరుని జ్ఞానరశ్మి పడుచుండినను ప్రజ్వలింపజాలదు

9. కాయేంద్రియశుద్ధి

కాయేంద్రియశుద్ధి కలుగునపుడు శుద్ధమగు చిమ్నీలయందు గల దీపము ప్రకాశించునట్లు ఆత్మస్వరూప ప్రకాశము కలుగుచుండును మూలా

విద్య యగు కారణదేహము కూడ శుద్ధమగునపుడే కాయేంద్రియ శుద్ధి పూర్తియగును

బాహ్యాభ్యంతర భేదేన శౌచం తు ద్వివిధం స్మృతమ్ ।
మృజ్జలాభ్యాం బహిశ్శుద్ధిర్భావశుద్ధి స్తథాఽఽన్తరమ్ ॥

బాహ్యాభ్యంతర భేదములచే శుద్ధి రెండువిధములుగా చెప్పబడినది మృజ్జలములచే దేహశుద్ధియు, బ్రహ్మచింతనచే ఆత్మశుద్ధియు కలుగ వలయును

అనిష్కల్మష చిత్తస్య సర్వతీర్థేషు మజ్జనమ్ ।
నరస్యాంగారక స్యేవ సదా క్షీరాభిషేచనమ్ ॥

కల్మషహృదయము కలవాడు అనగా కపట హృదయుడు సదా గంగాది తీర్థములందు స్నానము చేయుచుండినను కొంచెమైనను శుద్ధత కలుగదు అది ఎటువంటిదనగా బొగ్గును తెల్లని శుద్ధమగు గోక్షీరముతో ఎంత కడిగినను ఎట్లు నలుపు పోయి తెలుపు కానేరదో ఆలాగున మలినాత్ములు తీర్థ స్నానాది క్రియలు ఎంత చేసినను శుద్ధిని పొందజాలరు

జ్ఞాన యజ్ఞాత్పరో యజ్ఞో నాస్తి నాస్తి శ్రుతౌ స్మృతౌ ।
జ్ఞానయజ్ఞైక నిష్ఠస్య న కించిదపి దుర్లభమ్ ॥

శ్రుతియందును, స్మృతియందును ఆత్మజ్ఞాన పరమగు యజ్ఞమున కన్న శ్రేష్ఠమగు యజ్ఞయాగాది క్రతువు దానధర్మాది పంచయజ్ఞములు లేనే లేవు జ్ఞానయజ్ఞైకనిష్ఠ కలవానికి ఇహపరములలో దుర్లభము మఱి యొకటి లేదు

వాగ్దండః కర్మదండశ్చ మనోదండశ్చ తే త్రయః ।
యస్యైతే నియతాః దండాః స త్రిదణ్డీ మహాయతిః ॥

వాఙ్నియమము, కర్మనియమము, మనోనియమము–ఏవికలవో అవి నియతముగా ఎవనియందు నుండునో అతడే త్రిదండియగు మహాయతి యగును దండన చేయుటవల్ల దండిశబ్ద మేర్పడినది తప్పుమార్గములో వాక్కుగాని, దేహేంద్రియములుగాని, మనస్సుగాని ప్రవర్తించిన వివేకముచేత వాటిని దండించి ఋజుమార్గములో నడుపుటయే దాని కర్థమగును

''ఏకమేవాద్వితీయం'' అను బ్రహ్మభావమునుండి చలింపక యుండువాడే ఏక దండియగు సన్న్యాసి యనంబడును అట్లు గాక కర్మదండమును ధరించు వాడు భారమునే వహించుచుండును

ఇంద్రియ గ్రామసంగ్రామ సేతునా భవసాగరః ।
తీర్యతే నేతరేణేహ కేనచిపిన్నామకర్మణా ॥

ఇంద్రియములయొక్క సమూహ సంయమ మనెడు వంతెనచేత సంసార సాగరము తరించవలసి యుండునేగాని ఈ ప్రపంచములో ఇతర ములగు బాహ్యకర్మలచే భవసాగరము దాటజాలరు

వేదాస్త్యాగశ్చ యజ్ఞాశ్చ నియమాంశ్చ తపాంసి చ ।
నైవాజితేంద్రియస్యేహ సిద్ధిం గచ్ఛన్తి కర్హిచిత్ ॥

వేదములు సాంగముగ పఠించుటచేతగాని, కేవలము సన్న్యాస మాత్రము చేతగాని, యజ్ఞములు చేయుటచేతగాని, బాహ్యనియమము లాచరించుటచేత గాని, శరీరమును మాత్రము శుష్కింపజేసెడు తపస్సు చేతగాని ఇంద్రియ నిగ్రహము చక్కగా లేనివానికి ఒకప్పుడున్ను ఏ సిద్ధి యున్ను కలుగదు కావున మంచి ఆత్మ నియమనము, ఇంద్రియ నిగ్రహము కలిగియుండే లాగున చూడవలయును

10. స్వాధ్యాయము

దీనికి అధ్యయన మని అర్థము కేవలము వేదములను మాత్రము అధ్యయనము చేసిన చాలదు వేదార్థమగు ఆత్మావలోకనము బాగుగా చేయు చుండవలయును ప్రణవము మొదలగు ఏమంత్రములనుగాని, గీతోప నిషత్తులను గాని, భగవత్స్మరణలుగాని చేయుట కూడ అధ్యయన మగును

జపంతః ప్రణవం నిత్యం ముచ్యన్తే సర్వపాతకైః ।
సదాభ్యాసేన సంయుక్తాః పరం మోక్షం లభన్తి చ ॥

ప్రణవమును పరబ్రహ్మానుసంధానముగా జపమాచరించువారు సర్వపాపములనుండి విముక్తు లగుదురు అట్టి ప్రణవాభ్యాసముతో కూడిన వారు శ్రేష్ఠమగు మోక్షమును పొందగలరు

జపేచ్చ ప్రణవం నిత్యం జితాత్మా విజితేంద్రియః ।
పఠేదుపనిషద్వాక్యం వేదాంతార్థాంశ్చ చింతయేత్ ॥

ఎవడు నియమము గలవాడై అర్థముతో సహితము మనోజయము, ఇంద్రియజయము గలిగి ప్రణవము జపించునో, మరియు ఉపనిషత్పారాయణము, వేదాంతార్థ విచారము చేయునో అట్టివాడు ఇచటనే ఈ దేహముతో నుండునపుడే మోక్షమును పొందగలుగును

ఓంకారాది జపోఽప్యేవం భావగర్భో హ్యుదాహృతః ।
ధ్యేయవస్తుస్వరూపస్య దార్ఢ్యాయ హి జపో మతః ॥

ప్రణవము మొదలగు మంత్రజపములు తత్తద్దైవభావ గర్భితములుగా నుండ వలయును ధ్యేయవస్తువగు బ్రహ్మముయొక్క దృఢజ్ఞానముకొఱకు జప మేర్పడినది

ప్రణవ స్సర్వవేదాదిః ప్రణవ శ్శివవాచకః ।
మంత్రాధిరాజరాజశ్చ మహాబీజం న తత్పరమ్ ॥

ప్రణవము సర్వ వేదములకును ఆది యైనది ప్రణవము ఈశ్వర వాచకము ప్రణవము మంత్రము లన్నిటికి రాజాధిరాజైనది ఇది మహాబీజ మంత్రము దీనికి మించినది లేదు

ఓమితీదం సర్వమితి శ్రుతి రాహ సనాతనీ ।
భవంతోఽపి విదిత్వైవం ప్రణవార్థం మహేశ్వరమ్ ।
వేదగుహ్యం చ సర్వస్వం తారక బ్రహ్మముక్తిదమ్ ॥

ఈసర్వమున్ను ప్రణవస్వరూపమని సనాతనమగు వేదము పలుకు చున్నది అందువల్ల మీరందరున్ను ఈ ప్రణవస్వరూపమును ఈశ్వర స్వరూపముగా ఎఱుంగవలయును ఇది వేదములో నిగూఢమైనది సమస్త మున్ను దీనియందు గలదు ఇదే ముక్తినిచ్చెడు తారక బ్రహ్మస్వరూపము

11. సమాధి

యోగశాస్త్ర ప్రకారము మనోలయమే సమాధి యనబడును సాంఖ్య శాస్త్రప్రకారము సాక్షియందు నిలుకడగలిగి యుండుటయే సమాధి

యందురు జీవేశ్వరుల ఐక్యము సమాధి యని ధ్యానయోగు లందరు జీవేశ్వరుల సమత్వము తెలిసికొనుటయే సమాధి యని వేదాంతులు వచింతురు, కావున యోగ సమాధిచే తృప్తినొందక జీవేశ్వరుల ఏకత్వము అనుభవమునకు తెచ్చుకొన్నప్పుడే పూర్ణ సమాధి యనదగును

యథా దీపో నివాతస్థో నిశ్చలో వాయువర్జితః ।
ప్రజ్వలన్నాశయేత్సర్వమంధకారం మహామతే ॥

గాలిలేని స్థలములో నిశ్చలముగా వెలుగుచుండు దీపమేలాగున ప్రజ్వలించినదై అంధకార సమూహమును గృహాంతరాళములో నశింపజేయునో, అలాగున హృదయాంతరాళములో సంకల్పమనెడు గాలిలేని స్థలములో ఆత్మజ్ఞాన సాక్షాత్కారమను జ్ఞానజ్యోతి వెలుగునపుడు అజ్ఞానమను అంధకారము నశించును

తద్వద్ద్వేష విహీనాత్మా భవత్యేవ నిరామయః ।
శ్రూయతాం భూప కైవల్యం కేవలం మలవర్జితమ్ ॥

పైచెప్పిన ప్రకారము దీపపుకాంతిచే చీకటి నశించినట్లు ఆత్మలో గల తమస్సు నశించునపుడు ఆత్మక్లేశ రహితమగు పరమశాంతి నొందును కేవలము మలవర్జితమే కైవల్య మనబడును ఈసత్యమును తెలిసికొన్నప్పుడే జీవుడు ముక్తి నొందగలుగును

యోగాత్పరతరం పుణ్యం యోగాత్పరతరం శివమ్ ।
యోగాత్పరతరం సూక్ష్మం యోగాత్పరతరం న హి ॥

ధ్యానయోగమునకన్న శ్రేష్ఠమగు పుణ్యముగాని, ధ్యానయోగమునకన్న శ్రేష్ఠమగు శివత్వముగాని(మంగళకరము), యోగమునకన్న శ్రేష్ఠమగు సూక్ష్మజ్ఞానముగాని ఇహలోకమున మరియొకటి లేదు

యథైకం చ సువర్ణాది మిళితం రజతాదినా ।
అల్పమూల్యం ప్రజాయేత తథా జీవోఽప్యహంయుతః ॥

యథైవ హి సువర్ణాది క్షారాదేః శోధితం శుభమ్ ।
పూర్వవన్మూల్యతాం యాతి తథా జీవోఽపి సంస్కృతేః ॥

ఏలాగున సువర్ణము తామ్రాది లోహములతో కలిసినదై తక్కువ వెల గలది యగుచున్నదో ఆలాగున జీవుడే శివస్వరూపుడై యుండినను అహంకారాది ప్రకృతిగుణములచే జీవత్వమునొంది దీనదశకు వచ్చుచుండును ఆ హీనమగు బంగారు స్ఫుటము చేసినపుడు దానిలోగల మాలిన్యము పోగా శుద్ధమగు సువర్ణ మేలాగున అగుచున్నదో, అపుడు పూర్వము ఉండిన మంచి బంగారు శోభను విలువను ఎట్లు పొందుచుండునో, ఆలాగున జీవుడు సమాధ్యనుష్ఠానమువల్ల, ప్రకృతిదోషము నశించుటవల్ల, శుద్ధశివస్వరూపు డగుచున్నాడు అపుడీశ్వరుని వలె ప్రకాశవంతుడును, మంగళస్వరూపుడును అగుచున్నాడు ఈస్థితిలో జీవుడు మోక్షమును పొందుచున్నాడు

ఇపుడు మనుస్మృతి ద్వాదశాధ్యాయమున నుపదేశించిన జ్ఞాన సారమును సంగ్రహముగా తెలిపెద ఏలన! శాస్త్రము లన్నిటిలోను మను స్మృతి వేదసార మనియు, ఆది శాస్త్రమనియు విజ్ఞులందరు ఎఱింగియే యున్నారు పదునొకొండవ అధ్యాయమువఱకు కర్మకాండము లన్నిటిని బోధించిన తరువాత ఈజ్ఞానము నుపదేశించడమైనది దీనియందు గల త్రిగుణ స్వరూపము ప్రతిముముక్షువున్ను పరనము చేయవలయును అట్లయిన తాను ఏగుణముతో కూడియుండునని తెలిసికొనవచ్చును

వేదాభ్యాస స్తపో జ్ఞానం శౌచమింద్రియ నిగ్రహః!
ధర్మ క్రియాత్మచింతా చ సాత్త్వికం గుణలక్షణమ్!!

వేదాభ్యాసము, తపస్సు, ఆధ్యాత్మజ్ఞానము, శౌచము, ఇంద్రియ నిగ్రహము; దానాది సత్కార్యము లొనర్చుట, బ్రహ్మధ్యానమం దాసక్తి గలిగి యుండుట ఇవి సాత్త్వికమగు గుణము గలవాని లక్షణములు

రాజసగుణ లక్షణములు

ఆరంభ రుచితాఽ ధైర్యమసత్కార్య పరిగ్రహః ।
విషయోపసేవాజస్రం రాజసం గుణలక్షణమ్ ॥

ఫలము గోరి కార్యములుచేయుట, స్వల్పకార్యమునందయినను అధైర్యపడుట, కానిపని చేయబూనుట; ఎల్లప్పుడు శబ్దాది విషయముల

ననుభవింప బూనుట - ఇవి రజోగుణవంతుని కార్యములు

తామసగుణ లక్షణములు

లోభః స్వప్నోఽధృతిః క్రౌర్యం నాస్తిక్యం భిన్నవృత్తితా ।
యాచిష్ణుతా ప్రమాదశ్చ తామసం గుణలక్షణమ్ ॥

పేరాశ(ఈశ్వరు డిచ్చినంతలో దానధర్మాదులు చేయకపోవుట), ఎక్కువ నిద్ర, అధైర్యము, క్రూరస్వభావము, ఈశ్వరునియందు, గురువు నందు, శాస్త్రమందు, మాతాపితరులందు విశ్వాసములేక వర్తించుట, దురాచారవృత్తి కలిగియుండుట, పరులను యాచించి జీవించుట, తప్పు కార్యములు చేయుచుండుట ఇవి తామసగుణము గలవాని కార్యములు

ఇక ముఖ్యముగా ముముక్షువులు గ్రహించవలసిన విషయములు ఈద్వాదశాధ్యాయాంతమున తెలిపియున్నారు ఇది గ్రహించిన మనుధర్మ శాస్త్రము యొక్క సారము తెలియందగును

వేదాభ్యాసస్తపో జ్ఞానమింద్రియాణాం చ సంయమః ।
అహింసా గురుసేవా చ నిశ్శ్రేయసకరం పరమ్ ॥

ఉపనిషదాదులను పఠించుట, వాని యర్థమును చక్కగా చింతన చేయుట, ఇంద్రియ నిగ్రహపరమగు తపము నొనర్చుట, బ్రహ్మజ్ఞాన మభ్య సించుట, ఇంద్రియములను స్వాధీనములో నుంచుట, అహింసా వ్రతము కలిగి యుండుట, గురుశుశ్రూషయందు ప్రవృత్తి కలిగియుండుట ఇవి యెల్లను ముఖ్యమగు మోక్షసాధనములు

సర్వేషామపి చైతేషామాత్మజ్ఞానం పరం స్మృతమ్ ।
తద్ధ్యగ్రం సర్వవిద్యానాం ప్రాప్యతే హ్యమృతం తతః ॥

ఈ వేదాభ్యాసాదులలో అన్నింటను ఉపనిషత్ప్రతిపాద్యమగు బ్రహ్మను కూర్చిన జ్ఞానమే శ్రేష్ఠము ఆజ్ఞానమువలననే మోక్షము కలుగును కావున అది అన్ని విద్యలలో ప్రధానమును, సంపాద్యము నైయున్నది

యథోక్తాన్యపి కర్మాణి పరిహాయ ద్విజోత్తమః ।
ఆత్మజ్ఞానే శమే చ స్యాద్వేదాభ్యాసే చ యత్నవాన్ ॥

బ్రహ్మ విచారతత్పరుడు శాస్త్రవిహితమగు అగ్ని హోత్రాది కర్మలను పరిత్యజించియైనను పరమాత్మ చింతనము, ఇంద్రియజయము, ప్రణవ జపము, ఉపనిషదాది వేదపారాయణము – అనువానియందు ప్రయత్నపరుడై యుండవలయును ఇతర విధికృతకర్మలు చేయకపోయినను బ్రహ్మవిచార మొకటియైన నుండిన చాలుననియు, అదే వేదసారమనియు ఈ శ్లోకమున తెలుపడమైనది బ్రహ్మవిచారము యొక్క మహిమను తెలుపుటకు పై విధముగా చెప్పడమైనది

అజ్ఞేభ్యో గ్రంథినః శ్రేష్ఠా గ్రంథిభ్యో ధారిణో వరాః ।
ధారిభ్యో జ్ఞానినః శ్రేష్ఠా జ్ఞానిభ్యో వ్యవసాయినః ॥

బొత్తిగా అధ్యయనము చేయనివానికన్నను ఇంచుకంత వేదా ధ్యయనము చేసినవారు శ్రేష్ఠులు ఇంచుకంత వేదాధ్యయనము చేసిన వారి కన్నను పూర్తిగా గ్రంథము నభ్యసించినవారు శ్రేష్ఠులు కేవల గ్రంథ పారములను పఠించువారికంటె చింతనచేయువారు శ్రేష్ఠులు వేదములను వేదార్థములను వల్లించినవారికంటె తద్ధర్మజ్ఞానము కలవారు శ్రేష్ఠులు. వారి కంటె అనుష్ఠానము కలవారు మీదుమిక్కిలి శ్రేష్ఠులు ఈ శ్లోకములో అను ష్ఠానము యొక్క మహిమను తెలుపడమైనది

సర్వమాత్మని సంపశ్యేత్సచ్చాసచ్చ సమాహితః ।
సర్వం హ్యాత్మని సంపశ్యన్నాధర్మే కురుతే మనః ॥

సమాహిత చిత్తము కలవాడై తనయందు సత్పదార్థము, అసత్పదార్థము చక్కగా ఎఱుగ వలయును ఎఱింగి (అసదసత్తు నెఱింగిన వాడై) అసద్వస్తు వును విడిచి సద్వస్తువులో ప్రవృత్తి కలిగియుండవలయును అందువల్ల (అట్లు బాగుగా ఎఱుంగటవల్ల) అన్నిటిలోను తనయొక్క స్వరూపము చూచినవాడ గుటచేత అట్టివాని మనస్సు అధర్మమునందు ప్రవర్తింపదు తనవలె సర్వప్రాణు లను చూచునని భావము

తపో విద్యా చ విప్రస్య నిశ్శ్రేయసకరం పరమ్ ।
తపసా కిల్బిషం హన్తి విద్యయాఽమృత మశ్నుతే ॥

తపస్సున్ను, బ్రహ్మవిద్యయును విప్రునకు మిక్కిలి శ్రేయస్సును

కలుగజేయును తపస్సుచేత పాపము నశించును బ్రహ్మజ్ఞానముచే మోక్షమును పొందును

ఏవం యస్సర్వభూతేషు పశ్యత్యాత్మానమాత్మనా ।
స సర్వ సమతామేత్య బ్రహ్మాభ్యేతి పరం పదమ్ ॥

ఎవడు సర్వభూతములందున్న యాత్మను, తనయాత్మను, బ్రహ్మరూపముగా చూచునో అతడు బ్రహ్మసాక్షాత్కారము వలన ఉత్తమ స్థానమగు బ్రహ్మమును పొందుచున్నాడు

ఆద్యం యత్త్ర్యక్షరం బ్రహ్మ త్రయీ యస్మిన్ ప్రతిష్ఠితా।
స గుహ్యోన్యస్త్రివృ ద్వేదో యస్తం వేద స వేదవిత్॥

సర్వవేదములలో మొదటిదియై, అకారోకార మకార స్వరూపమయి నందున త్ర్యక్షరస్వరూపమైన ఏ వేదసారము కలదో, ఏ మూడక్షరముల యందే మూడు వేదములున్నవో, అది మరియొక త్రివృద్వేదము అది ప్రణవ మనునది వేదమంత్రముల కంటే శ్రేష్ఠమైనది కనుకను పరమార్థ స్వరూపమగు బ్రహ్మమును వివరించునది గనుకను, పరమార్థక మైనందున జప తపంబులు చేయువారికి మోక్షప్రద మైనందునను మిక్కిలి రహస్యమును గోప్యమును నైనది ఎవడు ప్రణవమును స్వరూపముతోను అర్థముతోను ఎఱుంగునో వాడు వేదవేత్త యనబడును

ఆత్మబోధమునందు సంగ్రహముగా స్వరూపసాక్షాత్కార జ్ఞానమును పొందువిషయమై శ్రీశంకరులు బోధించిన విషయ మిచట తెలిపెద

వపుస్తుషాదిభిః కోశైర్యుక్తం యుక్త్యవఘాతతః ।
ఆత్మాన మాంతరం శుద్ధం వివిచ్యాత్తండులం యధా ॥

లోకములో జనులు దంచడముచే పొట్టు, తవుడు మొదలైనవానిని వేఱుపఱచి బియ్యమును తెలిసికొనెడి ప్రకారముగానే, పంచకోశముల వలెనే తోచు ఆత్మను శ్రవణమనన నిదిధ్యాసములచేత శోధించి, వీనికంటె విలక్షణుడుగా నయి సత్యజ్ఞానానంద స్వరూపుడైయుండు ఆత్మను తన స్వరూపముగా తెలిసికొనవలయును

నిషిధ్య నిఖిలోపాధీన్ నేతి నేతీతి వాక్యతః ।
విద్యాదైక్యం మహావాక్యైర్జీవాత్మ పరమాత్మనోః ॥

దేహేంద్రియాది సకలోపాధులను ఇదికాదు ఇదికాదని త్రోసివేయుట వలన జీవాత్మ పరమాత్మల ఐక్యమును, భేదనివృత్తి పూర్వకమైన అఖండానంద స్వరూపార్థమును తెలియజేసెడు మహావాక్యములచే తెలిసికొనదగినది

వివిక్తదేశ ఆసీనో విరాగో విజితేంద్రియః ।
భావయేదేక మాత్మానం తమనంత మనన్యధీః ॥

ఏకాంత ప్రదేశమందు కూర్చున్నవాడై, వైరాగ్యము నవలంబించిన వాడై, ఇంద్రియములను జయించినవాడై మనస్సును చలింపకుండ ఆత్మయందుంచి సత్యజ్ఞానానంద స్వరూపుడగు ఆయాత్మను తన స్వరూపముగా ధ్యానించవలయును

ఏవం నిరంతర కృతా బ్రహ్మైవాస్మీతి వాసనా ।
హరత్యవిద్యావిక్షేపాన్ రోగానివ రసాయనమ్ ॥

సర్వోత్తమమైన యౌషధము సేవించుటవలన రోగములు నశించునట్లు ఎల్లప్పుడు బ్రహ్మానుసంధానపరుడై అశుద్ధ బ్రహ్మమగు ఆత్మనే తన స్వరూప ముగా, ధ్యానాభ్యాసము చేయుటవలన గలిగెడు సంస్కార రూపమగు సద్వాసన ఆవరణ విక్షేపశక్త్యాత్మకమైన అవిద్యను బొత్తిగా పోగొట్టునని దృఢ ముగా నమ్మవలయును

శ్రీభగవంతుడు గరుడపురాణమున పరమభక్తుడగు గరుడునకు ఆత్మసాక్షాత్కార స్వరూపమును సంక్షిప్తముగా నుపదేశించిన భాగము నిచట తెలుపడమైనది

తస్మాద్ జ్ఞానేనాత్మతత్త్వం విజ్ఞేయం శ్రీగురోర్ముఖాత్ ।
సుఖేన ముచ్యతే జంతుర్ఘోర సంసార బంధనాత్ ॥

గురుముఖతః పొందిన జ్ఞానమువలన ఆత్మతత్త్వము నెఱుంగ వలయును దానివలన మానవుడు అనాయాసముగా మోక్షమును బడయును

గృహాత్ప్రవ్రజితో ధీరః పుణ్యతీర్థజలాప్లుతః ।
శుచౌ వివిక్త ఆసీనో విధివత్కల్పితాసనే ॥

అభ్యసేన్మనసా శుద్ధం త్రివృద్బ్రహ్మాక్షరం పరమ్!
మనో యచ్ఛేజ్జితశ్వాసో బ్రహ్మబీజ మవిస్మరన్!!

ధైర్యము గలవాడై గృహమునుండిపోయి పుణ్యజలములలో స్నానము చేసి దర్భాసన కృష్ణాజిన వస్త్రాసనాదులతో కూడిన ఆసనమున శుద్ధమగు ఏకాంత ప్రదేశమున కూర్చుండి మనస్సున ఓంకారమును జపించుచూ, ప్రణవార్ధమగు బ్రహ్మమును భావించు అభ్యాసము కలవాడై ఎవడు దేహమును విడుచునో, వాడు బ్రహ్మనిర్వాణమను పేరుగల మోక్షమును పొందుచుండును ఈ భావమును శ్రీకృష్ణభగవానుడు గీత అష్టమాధ్యాయమున అర్జునుని కొఱకు ఉపదేశించియున్నాడు అదే భావమునే కఠోపనిషత్తునందు యమధర్మరాజు నచికేతునికొఱకు తెలిపియున్నాడు కావున ఇపుడు చెప్పిన నిర్వాణపరమగు ప్రణవాభ్యాసము శ్రుతిస్మృతుల సారమని గ్రహించుకొనవలయును గీతలోను, కఠవల్లి శ్రుతిలోను గల విషయము ఇదివఱలో వ్రాసియుండు ఓంకారాది గ్రంథములలో తెలిపియుండుటచేతను మఱల ఇచట తెలిపిన గ్రంథబాహుళ్య మగునని తలంచియు చేర్చలేదు

జ్ఞానహ్రదే సత్యజలే రాగద్వేషమలాపహే ।
య స్స్నాతి మానసే తీర్థే స వై మోక్ష మవాప్నుయాత్ ॥

రాగద్వేషములను మలము లేనిదియు, సత్యమను జలము కలదియు అగు మనస్సునందలి జ్ఞానహ్రదమునందలి తీర్థమున ఎవడు స్నానము చేయునో వాడు మోక్షమును పొందును

శ్రద్ధావినయసంయుక్తః శాంతి దాంత్యాది సంయుతః ।
యావద్ జ్ఞానోదయస్తావద్వేదాంతార్థం నిరూపయేత్ ।

ఎంత వఱకు ఆత్మజ్ఞానోదయము కలుగలేదో అంతవఱకు గురు, శాస్త్ర, దైవములందు విశ్వాసము కలవాడై, శమమను అంతరింద్రియ నిగ్రహమును దమమను బాహ్యేంద్రియ నిగ్రహముతోను గూడినవాడై వేదాంతార్థమును చింతనచేయుచూ బ్రహ్మాభ్యాసము చేయవలయును

యావదాత్మా న లబ్ధోయం శుద్ధో జ్ఞానం చ నోదితమ్ ।
మలీనవిషయే రాగః తావదజ్ఞానినో భవేత్ ॥

ఎంతవఱకు జ్ఞేయమగు ఈ ఆత్మజ్ఞానము లభించలేదో, ఎంతవఱకు శుద్ధ జ్ఞానస్వరూపమగు ఆత్మ ఉదయము కాలేదో, ఎంతవఱకు మలినమగు విషయములలో రాగము నశించలేదో అంతవఱకు తన్ను అజ్ఞానిగానే తలంచవలయును

సర్వగం సచ్చిదాత్మానం జ్ఞానచక్షుర్నిరీక్షతే ।
అజ్ఞాన చక్షుర్నేక్షేత భాస్వంతం భాను మంధవత్ ॥

ఆత్మజ్ఞాన మనెడి నేత్రము కలవాడు సమస్తమున వ్యాపించియుండు సచ్చిదానంద స్వరూపాత్మను తన ఆత్మగా చూచుచున్నాడు అజ్ఞాన దృష్టి యను గ్రుడ్డితనము కలవాడు ప్రకాశించుచుండు సూర్యుని చూడజాలని చందమున తన స్వరూపమగు ఆత్మను చూడజాలక యున్నాడు

యల్లాభాన్నాపరో లాభో యత్సుఖాన్నాపరం సుఖమ్ ।
యద్జ్ఞానాన్నాపరం జ్ఞానం తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥

దేని లాభముకంటె వేఱు లాభము లేదో, ఏ సుఖముకంటె వేఱు సుఖము లేదో, దేనియొక్క తెలియుటకంటె వేఱే తెలియదగినది లేదో (ఆత్మ జ్ఞానముకన్న తనకు తెలియదగిన జ్ఞానములేదో) అదియే బ్రహ్మమని నిశ్చయించి తెలిసికొనవలయును అదే తన స్వరూపమగు జ్ఞేయ బ్రహ్మమని తెలియదగినది

సత్యం బ్రవీమి పరలోక హితం బ్రవీమి
సారం బ్రవీమ్యుపనిషద్ధృదయం బ్రవీమి ।
సంసార ముల్బణ మసారమవాప్య జంతోః
సారోఽయ మీశ్వర పదాంబురుహస్య సేవా ॥

నేను సత్యమును చెప్పుచున్నాను పరలోక హితమును చెప్పు చున్నాను సారమును చెప్పుచున్నాను వేదశిరస్సు అగు ఉపనిషత్తుయొక్క హృదయమును చెప్పుచున్నాను (వేదాంతసారమును చెప్పుచున్నాను) దుఃఖముతో గూడిన పాపరూపమగు ఈసంసారమును పొందియుండు జీవునకు కరుణాసముద్రుడగు సర్వేశ్వరుని యొక్క పాదారవింద సేవ యొకటియే సారమైనది అనగా నిస్సారమగు సంసారమున ఈశ్వరసేవ

యొకటియే సారమైనది ఈ సంసారములో సంపాదింప దగిన సారమది యొకటియే తక్కిన సంపాదించువస్తువు లన్నియు నిస్సారములే అని దీని యొక్క తాత్పర్యము అట్టి ఈశ్వరసేవయగు పడవవల్లనే సంసార సాగరము దాటి జ్ఞేయబ్రహ్మమగు ఆత్మసాక్షాత్కారమను తీరమును జీవుడు పొందవలసి యుండును జ్ఞేయబ్రహ్మ విషయమై చెప్పవలసిన విషయములున్ను జ్ఞేయ బ్రహ్మమును పొందవలసిన ఉపాయములున్ను దీనిలో సంక్షిప్తముగా చెప్పడమైనది

శ్రవణం తు గురోః పూర్వం మననం తదనంతరమ్।
నిదిధ్యాసన మిత్యేతత్పూర్ణ బోధన్య కారణమ్॥

ప్రథమమున శమాది షట్కముతోకూడిన వాడై గురుముఖతః శ్రవణము చేయవలయును తరువాత మననము, అనంతరము నిది ధ్యాసమున్ను చేయవలసి యుండును ఇట్లయిన మాత్రమే పూర్ణప్రబోధము కలుగును శ్రవణము చేయించుట మాత్రమే గురువుయొక్క కార్యమగును దానిని మననము చేయుటయు తరువాత నిదిధ్యాసన మొనర్చుటయు ముముక్షువుల యొక్క(శిష్యుల యొక్క) కర్తవ్యమై యుండవలయును

చతుర్ణామపి వేదానాం యథోపనిషదశ్శిరః ।
ఇయం రహస్యోపనిషత్తథోపనిషదాం శిరః ॥

ఈ వాక్యము సాక్షాత్పరమ శివుడు శుకరహస్యోపనిషత్తునందు నుపదేశించెను దీనివల్ల మహావాక్యార్థము ఎటువంటిదో యోచించుకొనవల యును నాలుగు వేదములయొక్క శిరస్సే యుపనిషత్తులు అనగా వేదముల యొక్క సారమే ఉపనిషత్తులని భావము ఈ శుక్లరహస్యోపనిషత్తులో బోధించిన మహావాక్యము అష్టోత్తర శతోపనిషత్తుల శిరస్సు అగును అనగా అన్ని యుపనిషత్తుల సారమని భావము వేదమే మిక్కిలి సారమైనది వేదముల సారమే యుపనిషత్తులు ఉపనిషత్సారమే జ్ఞేయబ్రహ్మమును బోధించెడు శివ జీవైక్యపరమగు మహావాక్యము ఇక మహావాక్యముల ప్రభావమును గుఱించి తేజోబిందూపనిషత్తు చెప్పిన ఆరు వాక్యములను నిరూపించుటకు తలంచ డమైనది